మూసీ ప్రత్యేక సంచిక

(సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక)

సంపుటి : 28 సంచిక : 03 (2) ISSN - 2457- 0796

UGC CARE List
Approved Journal

మహాభారతం - శాస్త్ర విజ్ఞానం

ISSN 2457-0796 UGC CARE List Approved Journal

మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-03(2) హైదరాబాద్ జనవరి - 2025



వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి



మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 03 (2) జనవరి - 2025

సంపుటి : 28 సంచిక : 03 (2)
జనవరి - 2025

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

UGC APPROVED JOURNAL
ज्ञान-विज्ञान विमुक्तये

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B.MANOHARI

Type Setting at :
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 250/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

Printed, Published and Owned by : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
Office : 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Editor : **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

మహాభారతం - శాస్త్ర విజ్ఞానం

8 & 9 జనవరి, 2025

మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక

ప్రథమ ముద్రణ : జనవరి 2025

ప్రతులు : 500

కాపీలకు : డాక్టర్ కె. ఈశ్వరబాబు, తెలుగు శాఖ,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పాకాల, తిరుపతి జిల్లా.

గమనిక : ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు

ఎడిటోరియల్ చిరునామా
మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి - 10, బతుకుమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్-500 013
ఫోన్ : 93479 71177

మహాభారతం - శాస్త్ర విజ్ఞానం

సంపాదకులు

డాక్టర్ కె. ఈశ్వరబాబు

సహ సంపాదకులు

డాక్టర్ కె. శ్రీనివాసులు రెడ్డి

డాక్టర్ ఇ. వాసు

డాక్టర్ కె. లక్ష్మణ



తెలుగు విభాగం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల

పాకాల, తిరుపతి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

Govt.Degree College, Pakala

Tirupati (Dist), Andhra Pradesh-517 112.



Dr.A.Mohiddeen Basha

Principal

E.C.Member, S.V.University, Tirupati

MESSAGE

As Patron of this Seminar, I am very much delighted to present this message on the occasion of Two day National seminar organized by the Dept of Telugu, Govt. Degree College, Pakala, Tirupati District in Collaboration with Centre of Excellence for studies in Classical Telugu, Nellore; Oriental Research Institute, S.V.University, Tirupathi and Madabhushi Sahitya Kalaparishath, Chennai on 8th & 9th January, 2025.

I hope this national Seminar is an excellent platform to bring out different perspectives on the topic "Mahabharatham -Sastra Vignanam." I believe this seminar is a great opportunity for the research scholars to look deep into the epic 'Mahabharatham' and come out with different innovative findings. This is a rare opportunity for the young scholars of the present generation to go back into the traditional and historical work and find out the scientific things in it.

I look forward for quality paper presentations and thoughtful discussions by the delegates. I believe the discussions and deliberations of this seminar will motivate and inspire the younger generations to take up research on our cultural and religious works.

I take this opportunity to congratulate Dr.K.Eswar Babu, Lecturer in Telugu of this College and Director of this Seminar for his commitment and sincere efforts in making this event a grand success. I thank Centre of Excellence for studies in Classical Telugu, Nellore; Oriental Research Institute, S.V.University, Tirupathi and Madabhushi Sahitya Kalaparishath, Chennai for their association and collaboration in this remarkable event.

Dr.A.MohiddeenBasha

Sri Venkateswara University, Tirupathi



Prof.Ch.Appa Rao
i/c Vice-Chancellor

NAAC "A" Grade

E-mail :vcsvutpt@gmail.com
vice-chancellor@svuniversity.edu.in
website : www.svuniversity.edu.in
Phone : (O) 0877-2249727
Cell :+91 9441468789

మహాభారతం ఇతిహాసం కాదు జీవనసారం

భారతీయ సాహిత్య చరిత్రలో మహాభారతం ఇతిహాసంగా చెప్పబడినప్పటకీ, అది భారతీయుల జీవనాడి. అందులోని కథల్లో కల్పితాలు వుండవచ్చు కానీ, పాత్రలు మాత్రం ఇప్పటికీ తాజాగానే కనిపిస్తాయి. పక్కనే వుంటూ మనకు అలా చేయకూడదు! ఇలా చెయ్యాలి! అని దిశానిర్దేశం చేస్తుంటాయి. అందుకే ఎన్ని వందల సంవత్సరాలైన మహాభారతానికి అంతటి ప్రాముఖ్యత. ఇందులో విస్మరించబడ్డ అంశం లేదంటే అతిశయోక్తి కాదు. వృక్షసంపద సంరక్షణ ఆవశ్యకత, పశుపక్ష్యాదులపై ప్రేమ, పర్యావరణ బాధ్యత, తల్లిదండ్రులపై భక్తి భావం, కుటుంబంలో ఐకమత్య అవసరం వంటివి అడుగడుగునా ఉపాఖ్యానాల రూపంలో దర్శనమిస్తాయి.

మహాభారతంలోని పలు విషయాలపై ఎన్నో గ్రంథాలు వచ్చాయి. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. సదస్సులు, సమావేశాలు నిర్వహించబడ్డాయి. పరిశోధకులు పలు ప్రతిపాదనలు చేశారు. ప్రతిఫలనాలు చూపించారు. ఇప్పుడు మన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల వారు **'మహాభారతం - శాస్త్రవిజ్ఞానం'** అనే మంచి అంశంపై 2025, జనవరి 8,9 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఇది అభినందనీయం. అందులో మన విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థ కూడా భాగస్వామ్యం కావడం సంతోషంగా వుంది. నేటి సమాజానికి ఏది అవసరమో దానిని సదస్సులో పాల్గొన్న పత్రసమర్పకులు వివరిస్తారని భావిస్తున్నాను. కళాశాల ప్రిన్సిపాల్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులైన డా॥ మొహిద్దీన్ బాషా గారిని, సదస్సు సంచాలకులు డా॥ ఈశ్వరబాబు గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ధన్యవాదాలతో....

ఆచార్య చిప్పాడ అప్పారావు



ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
సంచాలకులు
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

సకలశాస్త్ర సమ్మిళితం

సూతుడు మహాభారతాన్ని గురించి ఒక మాట అంటాడు - "యది హాస్తి తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్", మహాభారతంలో ఏముందో అదే అన్ని చోట్లా ఉంది, అందులో లేనిది ఎక్కడా లేదు. దీన్ని బట్టే మహాభారతం ఎంత విశిష్టమయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలోని సమస్త విషయాలను భారతం స్పృశించింది. అందుకే సర్వజనులు అన్ని ప్రాపంచిక విషయాలకు ఇందులోనుంచి ఉదాహరణలు చూపించి మార్గదర్శనం చేస్తూ ఉంటారు. భారతం అనేది కురు పాండవ సమరం మాత్రమే కాదు. ఇది ఆనాటి సమాజానికి దర్పణం. ఈనాటి సమాజానికి మార్గదర్శనం. అన్నదమ్ముల పిల్లలు ఆస్తికోసం కొట్టుకొనే కథలాపైకి కనిపించినా ఈ కథను రాయడంలోని ఆంతర్యం అది కాదు. ఒక మహాకావ్యం ద్వారా ఒక మహాసమాజాన్ని ఆవిష్కరించడం, తద్వారా భవిష్యత్తరాలకు మార్గ నిర్దేశకత్వం వహించడమే వ్యాసుడి ఉద్దేశం. అందుకే ఒకటికి రెండు సార్లు దీన్ని పరిష్కరించాడు, పెంచాడు. వ్యాసుడి అభిప్రాయాన్ని అనుసరించే నన్నయ కూడా దీన్ని ఒక బృహత్ కార్యక్రమంగా భావించి మొదలు పెట్టాడు. ఇది కేవలం అనువాదం కాదు. మహాభారతం గొప్పతనాన్ని గ్రహించిన నన్నయ ఎంత అద్భుతంగా రాయాలో అంత అద్భుతంగా రాశాడు. తిక్కన, ఎర్రనలు ఆయనను అనుసరించి విజయవంతంగా పూర్తిచేశారు.

ఇది సమస్త విషయాల సమాహారం. కురుపాండవ కథతో పాటు అనేక ఉపకథలు, అనేక శాస్త్ర విషయాలు ఇందులో మనకు కనిపిస్తాయి. అందుకనే నన్నయ కాలానికే దీన్ని అనేక శాస్త్ర విషయ సమ్మేళనంగా భావించారు. కాబట్టే నన్నయ - ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని/యధ్యాత్మ విదులు వేదాంత మనియు/నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని/కవివృషభులు మహాకావ్యమనియు/లాక్షణికలు సర్వ లక్ష్య సంగ్రహ మని/యైతిహాసికులితిహాసమనియు/బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ/యం బనిమహిగొనియాడుచుండ/వివిధ వేద తత్త్వవేది వేద వ్యాసు/డాది ముని పరాశరాత్మజుండు/విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై/పరగుచుండ జేసె భారతంబు" అన్నాడు. నన్నయ గమనించినవే-ధర్మశాస్త్రం, వేదాంతం, నీతిశాస్త్రం, కావ్యశాస్త్రం, లక్షణశాస్త్రం, ఇతిహాసం, పురాణం అనే ఏడు ఉన్నాయి. వీటిల్లో మళ్ళీ కొన్ని శాస్త్రాలు దాగిఉన్నాయి. ఇవికాక ఆధునిక శాస్త్రాలకు సంబంధించిన అనేక అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. ఆయా కథలద్వారా కూడా అనేక శాస్త్రాలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవచ్చు. అందుకే ప్రపంచంలోని అనేక విషయాలు మహాభారతంలో కనిపిస్తాయంటారు. మనకు ఎన్ని శాస్త్రాలు తెలుసో అన్ని శాస్త్రాలకు సంబంధించిన విషయాలను ఇందులో గమనించవచ్చు. భవిష్యత్తులో మరిన్ని శాస్త్రాలను మనం

కనిపెట్టగలిగితే వాటికి కూడా ఆనవాళ్ళు మహాభారతంలో దొరుకుతాయి. అలాగే సామాజిక అంశాలు లెక్కకు మిక్కుటంగా ఉన్నాయి. ఒక్కొక్క అంశం మీద ఒక్కో సదస్సు పెట్టడానికి కావలసినంత విషయం భారతంలో ఉంది. ఈ సదస్సు ద్వారా అనేక విషయాలను వెలికి తీసే అవకాశం కలుగుతోంది. సుమారు 32 మంది పరిశోధకులు వివిధ అంశాలపై రాసిన పత్రాలు ఇందులో ఉన్నాయి. ఇవికాక ఇంకా ఎన్నో అంశాలు కూడా భారతంలో ఉన్నాయి. ఎంతమంది పరిశోధన చేసినా, ఎంతమంది ప్రసంగాలు చేసినా, ఎన్ని సదస్సులు చేసినా మహాభారతం గురించి రాయవలసిన విషయాలు ఎన్నో ఉండనే ఉంటాయి. అందువల్ల ఇది ఒక తరగని గని, ఇది ఒక మహాసముద్రం. తవ్వినకొద్దీ , వెతికినకొద్దీ అనేక అంశాలు బయటపడుతూనే ఉంటాయి. కొత్త తరం మరింతగా భారతాన్ని పరిశీలించి మరిన్ని కొత్త అంశాలను వెలికి తీయడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఎవరి అవగాహన స్థాయిని బట్టి వాళ్ళు భారతాన్ని చదివి అర్థం చేసుకోవచ్చు. వెయ్యి సంవత్సరాలు గడుస్తున్నా నిత్యనూతనంగా ఉన్న ఈ గ్రంథం భారతీయులకు ముఖ్యంగా తెలుగువారికి అపురూపమైన గ్రంథం. సంస్కృత భారతానికే వన్నెలద్దిన భారతం తెలుగు భారతం. కవిత్రయం సంస్కృత భారతాన్ని అనువదించడానికి మాత్రమే పూనుకోలేదు, పరిష్కరించి, సంస్కరించి, సరళీకరించి మనకందించారు. ఇలాంటి పని ఇతర భాషల్లో జరగలేదు. అందుకే తెలుగు భారతం భారతావనిలోనే విశిష్టమైన భారతం. అది తెలుగువారి సొమ్ము కావడం అదృష్టం. అలాంటి గ్రంథంపై పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో కలిసి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా ముదావహం. సదస్సు జరుగుతున్నప్పుడే పత్రాలన్నిటినీ సేకరించి మూసీ పత్రిక ద్వారా ప్రత్యేక సంచిక తీసుకొనిరావడం మరింత సంతోషకరమైన విషయం. ఈ దిశగా కృషి చేసి విజయం సాధించినందుకు ఈ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఏ. మొహిద్దీన్‌బాషా గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. అలాగే ఈ బృహత్ కార్యక్రమాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని విజయవంతంగా పూర్తిచేసిన డాక్టర్ కె.ఈశ్వరబాబు గారికి అభినందనలు. ఆయనతో పాటు సహ సంపాదకులుగా ఉన్న డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి గారికి, డాక్టర్ ఇ.వాసు గారికి, డాక్టర్ కె.లక్ష్మణ గారికి అభినందనలు.

ఈ సదస్సులో పాల్గొన్న మిత్రులందరూ మహాభారతాన్ని మరింత నిశితంగా పరిశీలించి, పరిశోధించి తమ పరిశోధన పరిధిని మరింత విస్తృతపరచుకొని భవిష్యత్తులో మరింతగా కృషిచేస్తారని ఆశిస్తున్నాను.

మాడభూషి సంపత్ కుమార్



డాక్టర్ కె.ఈశ్వరబాబు
తెలుగు శాఖాధ్యక్షులు
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల

అభిలాష

మహాభారతం ఒక విజ్ఞాన సర్వస్వం. మనం భారతాన్ని ఏ కోణంలో చూస్తే ఆ కోణంలో మనకు దర్శనమిస్తుంది. మానవ జీవితానికి సంబంధించిన సమస్త విషయాలకు ఆలవాలం మహాభారతం. ఆధునిక సమాజానికి, ఆధునిక శాస్త్రాలకు అనుప్రయుక్తమయ్యే మహాభారతంలోని అనేక అంశాలపై లోతైన పరిశోధన, విస్తృతమైన చర్చ జరగాలి. ఆ పరిశోధనాంశాలు, చర్చ ద్వారా వెలికివచ్చిన నిర్ధారణలు నేటి తరానికి తెలియజెప్పాలి. ఈ లక్ష్యంతోనే 'మహాభారతం-శాస్త్ర విజ్ఞానం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాము.

ఈ జాతీయ సదస్సు నిర్వహణకు అంగీకరించిన కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.మొహిద్దీన్ బాషా గారికి కృతజ్ఞతాభివందనాలు. సదస్సు నిర్వహణలో భాగస్వామ్యం వహిస్తున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సంచాలకులు ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు గారికి, మాడభూషి సాహిత్య కళాపరిషత్ వారికి నమఃపూర్వక ధన్యవాదాలు. సదస్సు నిర్వహణలో తన అమూల్యమైన సలహాలు, సూచనలు అందించిన డాక్టర్ కరణం శ్రీనివాసులు రెడ్డి గారికి ధన్యవాదాలు. సదస్సుకు పత్రాలు పంపిన సాహితీ మిత్రులకు నా కృతజ్ఞతలు. పత్రాలు ప్రచురిస్తున్న 'మూసీ' పత్రిక యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఈ పరిశోధనా వ్యాసాలను చక్కగా కంపోజ్ చేసిచ్చిన మిత్రులు డాక్టర్ కోదండ లక్ష్మణ గారికి ధన్యవాదాలు.

కె. ఈశ్వరబాబు
కె.ఈశ్వరబాబు

మహాభారతం - శాస్త్ర విజ్ఞానం

Contents (విషయసూచిక)

1. ఆంధ్రమహాభారతం-శాస్త్రవిజ్ఞాన శాఖోపశాఖలు	-	ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు	1
2. మహాభారతంలో పాలనా ధర్మాలు - పునర్మూల్యాంకనం	-	ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి	13
3. ఆంధ్ర మహాభారతం - శాంతిపర్వం - ధార్మిక అంశాలు	-	ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ	19
4. నన్నయ భారతంలో మానవీకరణలు, జంతుత్వారోపణలు - ఒక విశ్లేషణ	-	డాక్టర్ డి.శ్రీనివాసులు	24
5. నారద రాజనీతి - ఆధునిక పాలనా సూత్రాలు	-	డాక్టర్ కరణం శ్రీనివాసులు రెడ్డి	31
6. మహాభారతం - వివాహ వ్యవస్థ	-	డాక్టర్ యు.రమ్యజ్యోతి	37
7. మహాభారతం - మనోవిశ్లేషణ	-	డాక్టర్ వై.సుభాషిణి	47
8. శ్రీమదాంధ్ర మహాభారతము - రాయబారాలు	-	డాక్టర్ డి.యువశ్రీ	58
9. మహాభారతం - వ్యక్తిత్వ వికాసం	-	డాక్టర్ సి.చెన్నకేశవులు	68
10. మహాభారతంలో సామాజిక, నైతిక విలువల చిత్రణ	-	డాక్టర్ ఇ. వాసు	73
11.ఉదంకోపాఖ్యానం-నన్నయ,తిక్కనల తులనాత్మకపరిశీలన	-	డాక్టర్ కలవకుంట ఈశ్వరబాబు	81
12. మహాభారతం - గురుశిష్య సంబంధాలు	-	డాక్టర్ మన్యం నరసింహులు	87
13. ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్రలు	-	డాక్టర్ పి.కుమారి నీరజ	98
14. ఆంధ్రమహాభారతం - శాస్త్రవిజ్ఞానం	-	డాక్టర్ పి.జయచంద్రుడు	106
15. శారీరక పటుత్వము మరియు సంక్షేమము (శ్రేయస్సు): భగవద్గీత అంతర్దృష్టి	-	డాక్టర్ ఏ.సి.భరణినాథ్ రెడ్డి	112
16. మహాభారతంలో కుటుంబ వ్యవస్థ	-	డాక్టర్ వై.దివ్య	120
17. మహాభారతంలో గిరిజన పాత్రలు - వ్యక్తిత్వం	-	డాక్టర్ సి.చిన్నపాపమ్మ	127
18. భారతంలో ప్రేమకథలు	-	డాక్టర్ మానమ మునిరత్నం	137
19. మహాభారతం - పాలన	-	ఎ.ఆదిశేఖర్ రెడ్డి	150
20. ఆంధ్ర మహాభారతం - పాత్రల విశ్లేషణ	-	డాక్టర్ కోరాడ దుర్గారావు	158
21. మహాభారతం - స్త్రీల హక్కులు	-	డాక్టర్ డి.ధాత్రికుమారి	168
22. మహాభారతం - విద్యావిధానం	-	డాక్టర్ వి.గోపాల్	182
23. వ్యక్తిత్వదర్శిని - మహాభారతం	-	జి.మాధవీలత	188
24. ఆంధ్రమహాభారతం- రాజనీతి	-	డాక్టర్ కోదండ లక్ష్మణ	191

25. Life Lessons from Mahabharatam - Dr.S.V.Ramesh Kumar 197

26. Plants described in Sanskrit Mahabharata and their Ayurvedic Medicinal Importance

- Dr. Mohano Behara
Saivenkatesh Korlam 200

27. Mathematics and the Mahabharata: A Timeless Nexus of Knowledge

- Dr. C. Narasimha Reddy
Dr. P. Gayathri 205

28.Science, Ethics, and the Power of Knowledge in the Mahabharata: A special focus on Divyastras

- Dr G. Suresh Babu 216

29. A Comprehensive Review of Test Tube Baby and Surrogacy Practices in the Mahabharata

- Smt.K.Savithri 219

30. War Strategies and Techniques in the Mahabharata - Dr.K.ChittiKalavathi 222

31. The Economic Philosophy of the Mahabharata: A Holistic Perspective

- Dr. M. Raghava Reddy 229

32. Numerical Symbolism in Mahabharata : Mathematical and Philosophical Insights

- Dr K.Madhavi 235

❖❖❖

ఆంధ్రమహాభారతం-శాస్త్రవిజ్ఞాన శాఖోపశాఖలు

ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఉపోద్ఘాతం:

వ్యాసుని మస్తిష్కంలో అంకురించిన కథ మూడు అంచెల్లో మహాభారతమైంది. మూడేళ్ల కృషి ఫలితంగా పుట్టిన 'జయ' వైశంపాయనుని నేర్పు ద్వారా భారతం, నైమిషారణ్యంలో సూతుడు 12 సంవత్సరాల కాలం చెప్పడంతో రూపుదిద్దుకున్న మహాభారతం పలు శాస్త్రాలను ఇముడ్చుకున్న మహాగ్రంథం. ఇది 100 సర్గలు, లక్షశ్లోక సమన్వితం. తెలుగు భారతం 18 పర్వాలు, 63 ఆశ్వాసాలు, 21,507 గద్య పద్యాలతో కూడింది. శాస్త్రవిజ్ఞానం నేడు పలురకాలుగా విస్తరిల్లింది. ధ్వన్యాలోకంలో ఆనందవర్ధనుడు 'శాస్త్రరూప కావ్యఛాయాన్వయీ' అంటాడు. రాజశేఖరుని కావ్యమీమాంసలో 'శాస్త్రేతిహాసం' అన్నాడు. ఇది సంస్కృత భారతానికి చెందినదైనా, నన్నయ కవిత్రయ భారతానికి కూడా అన్వయమే. "ధర్మతత్వజ్ఞులు ...." పద్యంలో ధర్మ, తత్వ, నీతి, లక్ష్య సంగ్రహం వంటి నాలుగు శాస్త్రాలు గురించి నన్నయ చెప్పాడు. ఆనాటికి విడివడిన శాస్త్రాలను మాత్రం చెప్పి, అవి మహాభారతంలో వున్నాయని అనేకమంది కొనియాడుతున్నారని, అందుకే వ్యాసమహర్షి సంస్కృతంలో రాసిన భారతాన్ని తాను తెలుగులో రాయబోతున్నానని చెప్పుకున్నాడు. ఆంధ్ర మహాభారతంలో కనిపించే శాస్త్ర విజ్ఞానం అనేకరకాలుగా వుంది. దానిని ఒక గంటలో పరిపూర్ణంగా చెప్పలేం. ఆంధ్ర మహాభారతంలో 18 రకాల శాస్త్రాలు కనిపిస్తాయి. 1. నృశాస్త్రం 2. భూగోళశాస్త్రం 3. ఖగోళశాస్త్రం 4. అర్థశాస్త్రం 5. రాజ్యశాస్త్రం 6. పరిపాలన శాస్త్రం 7. న్యాయశాస్త్రం 8. మనోవిజ్ఞానశాస్త్రం 9. సమాజ శాస్త్రం 10. ధర్మశాస్త్రం 11. తత్వశాస్త్రం 12. నీతిశాస్త్రం 13. వైద్యశాస్త్రం 14. నిర్మాణ శాస్త్రం 15. విద్యాబోధన శాస్త్రం 16. లక్ష్య సమన్వయ శాస్త్రం 17. సాంకేతిక శాస్త్రం 18. వ్యక్తిత్వ వికాస శాస్త్రం.

1. నృశాస్త్రం :

దీనినే ఈరోజు ఆంథ్రోపాలజీ అనే పేరుతో పిలుస్తున్నాం. అంటే మానవరూప పరిణామశాస్త్రం. నాటి మానవుడి సమస్త విషయాలను వివరిస్తుంది. మనిషి ఏ ఏ దశల్లో ఏ విధంగా ఎదిగాడు, ఎలాంటి సమాజంలో వృద్ధిని సాధించాడు, అనాగరిక - అరణ్యవాస దశలను ఎలా అధిగమిస్తూ వచ్చాడు వంటివి తెలియజేస్తుంది. మహాభారతంలో అనేకమంది పుట్టుకకు సంబంధించి మనకు కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు కనిపిస్తాయి. మందపాలుడికి పక్షి ద్వారా నలుగురు పిల్లలు పుట్టడం. అలాగే, అనూరుడు అర్థశరీరంతో వినతికి జన్మించడం, అంబ తర్వాత జన్మలో శిఖండిగా పుట్టడం, వంటి వాటిని నేడు నృశాస్త్రం వేత్తలు అధ్యయనం చేస్తున్నారు. వ్యాసుడు ఏ రూపంతో పుట్టాడు. అంత గొప్ప మేధావి అలాంటి రూపాన్ని కలిగి ఉండడానికి కారణం ఏమిటి? ప్రశ్నలకు ఈ శాస్త్రం సమాధానం చెబుతుంది.

2. భూగోళ శాస్త్రం :

నదులు, పర్వతాలు, తీర్థయాత్ర సందర్భంగా వర్ణించే ప్రదేశాలు భౌగోళిక అధ్యయనంగా మనం అర్థం చేసుకోవాలి. మహాభారతంలో వీటి ప్రస్తావన అనేక చోట్ల అక్కడక్కడ చేయబడింది. వ్యాస భారతంలో చెప్పబడిన అరణ్యవాస ప్రదేశాలు, పర్వత నామాలు, నదుల పేర్లు వంటి వాటిని కవిత్రయం వారు కూడా యథాతథంగా

ఉపయోగించారు. ఆంధ్ర మహాభారతంలో అర్జునుడు తీర్థయాత్రలకు వెళ్లేటప్పుడు అతను దర్శించిన అనేక తీర్థాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భౌగోళిక అధ్యయనం కింద అర్థం చేసుకోవాలి. అలాగే నలమహారాజు అరణ్యంలో దమయంతి నుండి విడిపించుకుని, తిరిగిన రాజ్యాలు, ప్రదేశాలు ఇవన్నీ నాటి భారతదేశంలో ఉన్న రాజ్యాలుగా గుర్తించుకోవాలి.

3. ఖగోళ శాస్త్రం :

ఆంధ్ర మహాభారతంలో ఖగోళ సంబంధమైన విషయాలు కూడా అనేక చోట్ల అప్రయత్నంగా నిక్షిప్తం చేయబడ్డాయి. అంటే ఆనాటికి ఖగోళశాస్త్రం అనేది ఒక ప్రత్యేక శాస్త్రంగా వృద్ధి కాకపోయినప్పటికీ, దూరవిషయాలను దూర దృష్టితో చూడడం అనేటువంటి దానికి కంటిని సాధనంగా మహర్షులు ఎంచుకున్నట్లు అర్థమవుతుంది. ఇది వారి అనుభవ జ్ఞానంతో, సూర్యచంద్రుల గమనంతో, అమావాస్య పౌర్ణమి వంటి ఖగోళ విషయాలను కేంద్ర బిందువుగా చేసుకుని, వారు లెక్కలు వేసి చెప్పినట్లుగా మనం అర్థం చేసుకోవాలి. అరణ్యవాసం ప్రారంభమయ్యే తిథి, అజ్ఞాతవాసం పూర్తయ్యే కాలం మొదలైన వాటిని ఆనాటికి వారికున్నటువంటి ఖగోళవిజ్ఞానం ద్వారా, సూర్యచంద్రాదుల గమనం ద్వారా నిర్ణయించినట్లుగా మనం అర్థం చేసుకోవాలి . ఆనాటికి వారికున్న రాశి, చక్రాలు, రకరకాల నక్షత్రాల గతులు, మొదలైన వాటిని బట్టి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుధాలను తీయడం, ప్రత్యేక పూజలు నిర్వహించడం, యుద్ధానికి సన్నద్ధులు కావడానికి ఘడియలు లెక్కింపు వంటి వాటిని క్రమం తప్పకుండా నిర్వహించేవారు.

4. అర్థశాస్త్రం :

రాజులు నిర్వహించే రకరకాల యాగాలు, రాజుల ఖజానాను పరిపుష్టి చేసుకోవడానికి అని మహాభారతంలోని ఆధారాల వల్ల తెలుస్తుంది. ధర్మరాజు నిర్వహించిన రాజసూయయాగంలో వివిధ దేశాధిపతులు సమర్పించిన ధన, కనక, వస్తు వాహనాల గురించి వర్ణించబడింది. ఇవన్నీ ధర్మరాజు రాజ్య ఖజానాకు పుష్టి చేకూర్చే ఆర్థిక అంశాలు. రాజ్యం తన వేళ్ళను కోశం ద్వారా విస్తరింప చేస్తుందని ఆంధ్ర మహాభారతం చెప్తుంది. రాజ్యం అభివృద్ధికి కోశాగారం మూలం. కాబట్టి రాజు కోశాగారాన్ని జాగ్రత్తగా రక్షించడమే కాకుండా, దాన్ని అభివృద్ధి చేయాలని చెబుతుంది. కోశాగారాన్ని రాజు స్వయంగా పరీక్షించుకోవాలి; ధనాగారంలో ఎంత మిగిలి ఉంది? ఎంత లోటు ఉంది? వంటి విషయాలు స్వయంగా రాజే తెలుసుకోవాలని మహాభారతం చెప్తుంది. అయితే ఈ మిగులు, లోటు వంటి వాటిని రకరకాలైన పన్నుల ద్వారా భర్తీ చేసుకోవాలని మహాభారతం వివరిస్తుంది. సాధారణ పరిస్థితుల్లో రాజు ఆరవ భాగం పన్నుగా గ్రహించాలని, అసాధారణ పరిస్థితులు ఎదురైనప్పుడు పన్ను పెంచవచ్చు, రద్దు చేయవచ్చని భారతంలో వుంది. కరువు కాటకాల్లో మాత్రం పన్ను రద్దుచేసి, ప్రజలకు రక్షణ కల్పించాలని శాంతిపర్వం ద్వితీయాశాసంలో (283 ప) వివరించబడింది. ప్రజల్ని మోసగించి డబ్బు సంపాదించే వ్యక్తులపైన అధికంగా పనులు విధించి, కోశాగారాన్ని వృద్ధి చేసుకోవాలని మహాభారతం స్పష్టంగా చెప్పింది. పన్నులు వేసేటప్పుడు ప్రజలకు ఆ విషయాన్ని ముందుగా చెప్పి, వారి అనుమతి తీసుకొని వసూలు చేయాలని, ప్రతి వస్తువు పైన పన్ను విధింపరాదని, పన్నును వసూలు చేసే స్థలాలు నిర్ణయించాలని శాంతిపర్వం (ద్వి. ఆ. – 391 ప) లో చెప్పబడింది. 'కోరి తోటవాడు కుసుమఫలంబులు గోయునట్లు రాజు గునగ వలయు నవనముల నరికి యంగారములు సేయు భంగి యైన భూమి పాడుగాదే'

(శాంతి - ద్వి. ఆ.-300 ప) అనడంలో ఎంతో వాస్తవికత వుంది. రాజు కోశాగారాన్ని వృద్ధి చేయడానికి రకరకాల మార్గాలను మహాభారతం చెప్పింది. ఇతరుల రాజుల నుండి కప్పాన్ని గ్రహించడం (యుయుత్సుడు రాజుల నుంచి కట్టించుకున్నాడు), బహుమతులు కానుకలను సేకరించి ఆదాయాన్ని పెంచుకోవడం (పాండురాజు స్వీకరించాడు), శత్రువుల నుండి కొల్లగొట్టిన సంపదతో (విరాటరాజు గో సంపదను, ఆభరణాలను కొల్లగొట్టడానికి కౌరవులు, సుశర్మ ప్రయత్నించారు), దాచిపెట్టిన ధనాన్ని ఉపయోగించుకోవడం (దుర్యోధనుడు దాచిన ధనాన్ని అతని మరణానంతరం పాండవులు వశపరచుకున్నారు) వంటివి ఆర్థికశాస్త్ర అంశాలుగా మనం అర్థం చేసుకోవాలి.

5. రాజ్య శాస్త్రం :

తెలుగు మహాభారతంలో నన్నయ, తిక్కన, ఎర్రన కాలాల నాటి రాజకీయ వ్యవస్థ అనేక చోట్ల ప్రస్ఫుటమవుతుంది. రాజ్యంలోని సప్తంగాలైన రాజు, మంత్రి, రాష్ట్రం, కోశం, సైన్యం, మిత్రులు వంటి అనేక అంశాలు చర్చించబడ్డాయి. రాజు ధర్మాలు ఏమిటి? రాజు స్వరూప స్వభావాలు ఏమిటి? అనే విషయాలతోపాటు, అంతర రాజ్య సంబంధ అంశాలు చర్చించారు. నన్నయ కాలానికి యువరాజును చేయడానికి ప్రజాభిప్రాయం అవసరం లేదు. రాకుమారుడైతే యువరాజు అవుతాడనే అభిప్రాయం ఆ రోజుకి దృఢమైంది. అందుకే ధృతరాష్ట్రుడు ధర్మరాజును రాజ్యభారాన్ని నిర్వహించగల సమర్థుడుగా గుర్తించి, భీష్ముడు విదురుడు వంటి వారితో ఆలోచించి యువరాజుగా చేశాడు. సంస్కృత భారతంలో ప్రజలకు రాజును చేయడానికి, వారిని సింహాసనం నుంచి దించడానికి అధికారం ఉన్నట్లు తెలుస్తుంది. కానీ, నన్నయభారతంలో ప్రజలు రాజులను సింహాసనం ఎక్కించడానికి, వారిని దించడానికి హక్కులు లేని వారని అర్థమవుతుంది. తిక్కన మహామంత్రిగా తన రాజనీతిజ్ఞతను మహాభారతంలో అనేక చోట్ల ప్రదర్శించాడు. మూలభారతంలో లేని రాజ లాంఛనాలను తిక్కన వర్ణించాడు. విరటుని కాలం నాటి రాజ లాంఛనాలను 'ఏనుంగు నెక్కి పెక్కే నుంగు లిరుగడ రా పురవీధుల గ్రాలగలదే, మణిమయంబైన భూషణ జాలముల నొప్పి' (విరాటపర్వం) అని వర్ణించాడు. తిక్కన తాను రాయబారిగా గణపతిదేవుని ఆస్థానానికి వెళ్లి సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకొని , భారతంలో రాయబార ఘట్టాలను చిత్రించేటప్పుడు ఉపయోగించుకున్నాడు. సంజయ, శ్రీకృష్ణ రాయబారాలను (ఉద్యోగపర్వం) వర్ణించేటప్పుడు వారి మాటల వెనక రాజనీతిజ్ఞతకు కారణం తిక్కన అనుభవమే. తిక్కన చిత్రించిన ధర్మరాజు లౌక్యాన్ని జీర్ణించుకున్న మెత్తని పులి. రాజ్యానికి మూడు రకాలైన పొరుగు వారుంటారని మహాభారతం చెప్తుంది. వారు స్నేహితులు, శత్రువులు, తటస్థులు. రాజు తన స్నేహితుని సంతృప్తి పరచాలని, తన సంపదను, ఆహారాన్ని వారితో పంచుకోవాలని, వారి ఎదుట ప్రగల్భాలు పలకకూడదని, నిష్కపటంగా వ్యవహరించాలని శాంతిపర్వం - ద్వితీయాశ్వాసంలో చెప్పబడింది. అలాగే గౌరవానికి పొంగిపోకుండా, అవమానానికి కృంగిపోకుండా, ఒకే విధంగా పనులు చేసే మిత్రుడికి సిరిసంపద, అధికారం ఇచ్చి గొప్ప వారిని చేయాలి అని మహాభారతంలో శాంతిపర్వంలో చెప్పబడింది. ఈ విధానం ప్రకారమే కర్ణుని ధర్మరాజు అంగరాజ్యానికి రాజుగా ప్రకటించి ఉండవచ్చు. ఆనాటికి భారతదేశంలో ఉన్న రాజులందరూ కౌరవుల పక్షాన గాని, పాండవుల పక్షాన గాని చేరి యుద్ధంలో పాల్గొన్నారు. యుద్ధ సన్నాహక సమయంలోనే కౌరవులు , పాండవులు రాజులందరి సహాయాన్ని అర్థించడం కోసం ఎంతో ఆత్రుతతో దూతల ద్వారా తమకు సహకరించమని కోరారు. మహాభారతంలో రాజ్యానికి సంబంధించిన విషయాలే గ్రంథం నిండా పరచుకొని వున్నాయి.

6. పరిపాలనా శాస్త్రం :

రాజ్యపాలనలో సప్తాంగాల లాగానే, సద్గుణాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని మహాభారతంలో చెప్పబడింది. సద్గుణాలు అంటే ఆరు విధాలైన గుణాలు. సంధి, విగ్రహం, యానం, ఆసనం, ద్వైదీభావం, సమాశ్రయం అనేవి ఆరు గుణాలు. శత్రువుకు ఉన్నంత బలం తనకు లేనప్పుడు శత్రువుతో స్నేహం చేయడాన్ని సంధి అంటారు. శత్రువు కన్నా తనకు ఎక్కువ బలం ఉన్నప్పుడు యుద్ధ ప్రకటన చేయడాన్ని విగ్రహం అంటారు. బలం అత్యధికంగా ఉన్నప్పుడు దండయాత్ర చేయడాన్ని యానం అంటారు. సమాన బలం ఉన్నప్పుడు సమయ నిరీక్షణ చేయడాన్ని ఆసనం అంటారు. ఇతర రాజుల సహాయం లభించినప్పుడు ద్వివిధ నీతి ప్రవర్తనాన్ని ద్వైదీభావం అంటారు. బలం కోల్పోయినప్పుడు శత్రు ధనాన్ని పీడించడాన్ని సమాశ్రయం అంటారు. రాజు పరిపాలనలో దూతలను నియమించుకోవాలని ఆంధ్ర మహాభారతంలో శాంతిపర్వం వివరిస్తుంది. ఈ దూతలు కూడా గుణశీలాలు కలిగి, మంచి వాక్యాలతో కార్యాన్ని సాధించగలిగిన దక్షులై ఉండాలని చెబుతుంది. రాజు చెప్పిన సందేశాన్ని యథాతథంగా శత్రుమిత్రులకు వినిపించేవాడే దూత. స్వకపోలకల్పనలు చేసి, పరిపాలనకు ఆటంకం కలిగించే వ్యక్తి దూతగా పనికిరాడు. దూతలుగా మహాభారత కాలం నాటికి పురోహితుల్ని ఎక్కువగా వినియోగించినట్లు తెలుస్తోంది. ఉద్యోగపర్వంలో ద్రుపద పురోహితుడు చేసిన ప్రసంగం సంధి విఘ్నం అయ్యే విధంగా రూపు దాల్చింది. కాబట్టి పరిపాలనలో దూత ప్రాధాన్యం రాజ్యం మీదకి ఆపదలను తీసుకురాకూడదని ఈ ఉదాహరణ నిరూపిస్తుంది. రాజు ఒక రాజ్యాన్ని జయించిన తర్వాత, ఆ భూభాగాన్ని పరిపాలించేందుకు సమర్థుడైన వ్యక్తిని నియమించాలి. భీముడు జరాసంధుని చంపిన తర్వాత జరాసంధుని కుమారుడైన సహదేవుని మగధదేశానికి రాజుగా పట్టాభిశక్తుని చేశాడు. కృష్ణుడు శిశుపాలుని చంపిన తర్వాత, ఆ శిశుపాలుని కుమారుడైన శంభుని చేది దేశానికి రాజుగా నియమించాడు. అంటే తండ్రి పై కోపం వస్తే, కుమారుని కూడా చంపకుండా, మందలించి గెలిచిన రాజు, ఓడింపబడ్డ శత్రువులను లోబరుచుకోవడానికి చేసే పరిపాలన ప్రణాళికగా దీనిని అర్థం చేసుకోవాలి. (శాంతిపర్వం).

7. న్యాయం శాస్త్రం :

రాజ్యం న్యాయ పరిపాలనపై ఆధారపడి ఉంటుంది. రాజు న్యాయ సాధనాల్ని రక్షించాలని మహాభారతం చెప్తుంది. రాజు ప్రధాన కర్తవ్యం న్యాయంగా పరిపాలించడం, నిష్పక్షపాతంగా ఉండడం, వివాదరహితుడుగా ఉండడం, న్యాయం కోసం వచ్చిన వారి పట్ల నిస్వార్థంగా ఉండడం పద్ధతి అని మహాభారతంలో చెప్పబడింది. న్యాయం కోసం వచ్చిన వారికి స్వార్థంతో సరైన న్యాయం చేయకపోవడం వల్ల నృగుడు యముని చేత తొండగా శపించబడ్డాడని (అను- ద్వి.ఆ.-435 ప)మహాభారతం వివరిస్తుంది. దేశంలో రాజే న్యాయ పరిపాలనకు ప్రధాన న్యాయమూర్తి. దోషులను శిక్షించే అధికారం, క్షమించే అధికారం రాజుకే ఉంటుంది. రాజ్యంలో పునర్వి విచారణ చేసే హక్కు కూడా రాజుకు ఉంటుంది. రాజు విజ్ఞులతో సంప్రదించి న్యాయ విచారణ చేస్తాడని మహాభారతం (ఆది - చ.ఆ. -268 ప) చెప్తుంది. మాండవ్య మహర్షి రాజును శిక్షించడం, సుద్యుమ్న రాజు లిఖిత మహర్షిని శిక్షించడం (శాంతి. - ప్ర. ఆ. - 163 ప) మహాభారతంలో మనకు కనిపిస్తాయి. జూదంలో ఓడిన పాండవుల ధర్మపత్ని ద్రౌపదిని సభలోకి తీసుకువచ్చే సందర్భంలో ఇది న్యాయ సమ్మతమేనా? అని అక్కడ సభ్యులను ప్రశ్నించడంలో న్యాయశాస్త్రం దాగి ఉంది. న్యాయాధికారి వినయం, ఆత్మనిగ్రహం, ధైర్యం, చిత్తశుద్ధి, సత్యసంధత, వివేకం, లోకజ్ఞత, పాండిత్యం మొదలైన అర్హతలు కలిగి ఉండాలని మహాభారతంలో

అక్కడక్కడ చెప్పబడింది. శిక్ష విషయంలో తన మన అనే భేదం చూపించకూడదని రాజుకు ఆప్తుడని, బంధువని తల నుంచి మినహాయింపు ఇవ్వకూడదని మహాభారతంలో చెప్పబడింది. దొంగతనం చేసిన కారణంగా మాండవ్య ఋషిని పురం వెలుపల శిక్ష వేయాలని న్యాయం చెప్పారు (ఆది- చ. ఆ. 264). లిఖితునికి చేతులు నరికి వేశారు (శాంతి - ప్ర. ఆ. 165). ద్యుమత్సేన మహారాజుకు అతని కొడుకైన సత్యవంతునికి మధ్య మరణ దండనకు సంబంధించి సంభాషణ జరిగింది. నేరస్తుడు మారి సంఘం లో ధార్మికమైన జీవనం గడిపే అవకాశం ఇవ్వాలని , నేరస్తులకు మరణశిక్ష విధించరాదని సత్యవంతుడు అభిప్రాయపడ్డాడు (శాంతి - పం . ఆ.). నేరానికి తగిన శిక్షను మాత్రమే విధించాలని, నేరానికి మించిన శిక్ష విధించడం వల్ల పర్యవసానం తప్పదని, యమధర్మరాజు అలాంటి శిక్షను విధించడం వల్ల మాండవ్య మహర్షి శాపం చేత విదురుడుగా పుట్టాల్సి వచ్చిందని మహాభారతం (ఆది. ష. ఆ. 102 ప) చెప్తుంది.

8. మనోవిజ్ఞాన శాస్త్రం :

మహాభారతంలో ప్రధానమైన పాత్రలన్నీ మనోవిజ్ఞాన శాస్త్రాన్ని ఆపోసన పట్టినట్లు దర్శనమిస్తాయి. శ్రీకృష్ణుడు గొప్ప మనోవిజ్ఞాన శాస్త్రవేత్తగా మనం అర్థం చేసుకోవాలి. ఈరోజు కౌన్సిలింగ్ సైకాలజీ పేరుతో పిలవబడుతున్న విధానానికి శ్రీకృష్ణుని భారతదేశంలో ఆర్థిక చెప్పుకోవచ్చు. ఆయన మహాభారతంలో అనేక ఘట్టాలలో వివిధ పాత్రలతో చేసిన సంభాషణలు మనస్సులను బాగా ప్రేరేపిస్తాయి. కుంతికి భరోసా ఇవ్వడంలో, ధర్మరాజాదులకు అనేక విషయాలలో సూక్ష్మమైన అభిప్రాయాలను చెప్పడంలో, ధృతరాష్ట్రుని మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో, దుర్యోధనుడి చెడు ఆలోచనను గుర్తెరగడంలో, శకునిపై ఎత్తులు, వక్రదృష్టిని లోతుగా అధ్యయనం చేయడంలో మనోవిజ్ఞాన నిపుణుడుగా దర్శనమిస్తాడు. విదురుడు శ్రీకృష్ణ తర్వాత మనస్తత్వ మర్మాలను అధ్యయనం కలిగిన నేర్పరిగా కనిపిస్తాడు.? శకుంతలోపాఖ్యానంలో రెండు విరుద్ధ మనస్తత్వాలను నన్నయ మన ముందు ఉంచారు. ఒకటి ఆశ్రమవాస మనస్తత్వం, రెండు నగరవాస మనస్తత్వం. చివరకు నగరవాస మనస్తత్వానికి, ఆశ్రమ వాస మనస్తత్వం హెచ్చరిక జారీ చేస్తుంది. రాజుల్లో కనిపించే అహంభావ మనస్తత్వానికి దుష్యంతుడు ప్రతీకగా నిలిపి కనిపిస్తాడు. రాజులు మనస్తత్వం అంతా ఒకే విధంగా ఉండదు. నలమహారాజు తాను అడవిలో తనతోపాటు కష్టాలు పడుతున్న భార్య దమయంతినీ చూసి, ఆమె సుఖపడుతుందనే దృష్టితో భార్యను వదిలి వేరొక చోటకి వెళ్లిపోవడం మరో విలక్షణమైన మనస్తత్వం.

9. సమాజ శాస్త్రం :

మహాభారతం గొప్పది, పెద్దదైన సమాజశాస్త్రం. ఇందులోని పాత్రలద్వారా, ఉపాఖ్యానాల ద్వారా ఎన్నో సమాజశాస్త్ర విషయాలు ప్రతిపాదించారు కవిత్రయం వారు. సామాజిక వ్యవస్థలో మనిషి విలాసం కోసమో, వ్యసనం కోసమో అకారణంగా జంతువులను వేటాడరాదని పాండురాజు పాత్ర ద్వారా అర్థమౌతుంది. 'పరిగెత్తలేక పడి ఉన్నదాన్ని, రతిలో ఉన్న వాటిని, ప్రసవిస్తున్న వాటిని, రోగంతో బాధపడుతున్న వాటిని, వేట మీద జీవనం సాగించే వారు కూడా వేటాడరు సుమా!' (ఆది.- పం.ఆ.-53) అనడంలో ఎంతో సామాజికత వుంది. ఆ చివరి మాటలు పాండురాజుకు కోపం తెప్పించడం, పర్యవసానంగా కలిగిన శాపం మనకు తెలిసిందే. ఒక మహావీరుని కుమారుడు, తాను స్వయంగా మహావీరుడు, వివిధ శాస్త్రాస్త్ర సంపన్నుడైన అశ్వత్థామ నిద్రిస్తున్న ఉప పాండవులను చంపడమనేది ఒక వింతైన సామాజికత. దానిని ఆనాటి సమాజం, పెద్దలు అనేకమంది గర్హించారు. అలాంటి సంఘటనలు సమాజంలో పైశాచికత్వాన్ని ప్రేరేపిస్తాయని స్వపక్షం, ప్రతిపక్షం ఖండించాయి.

ఆర్యావర్తంలో మాతృస్వామ్యానికి, పితృస్వామ్యానికి మధ్య కాలంలో కుంతి జీవితం మనకు విలక్షణ సామాజిక అంశాలను బోధిస్తుంది. అవివాహిత బిడ్డల్ని కంటే నిందార్హ అవుతుంది అనే నియమాలు ఏర్పడుతున్న సంధి కాసేపు సమాజంలో కుంతి జీవించింది. స్త్రీలకు కొన్ని చోట్ల స్వేచ్ఛ వుంది. కొన్ని చోట్ల లేదు. కొందరు స్త్రీలకు అన్ని చోట్లా, అన్నివిధాలా స్వేచ్ఛ వుంది. కుంతి, ద్రౌపది, అంబ వంటి వారు ఒకే సమాజంలో వున్నా, స్వేచ్ఛ విషయంలో వ్యత్యాసం వుంది. ఇక ఉపాఖ్యానాల్లో సమాజశాస్త్ర ప్రతిపాదనలను గమనిస్తే ఎన్నో ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. సౌపర్ణాఖ్యానం మాతృభక్తిని ప్రతిపాదించినా, కుటుంబంలో ఈర్ష్య, అసూయల వల్ల బిడ్డలు ఇబ్బందులు పడుతారని ప్రబోధిస్తుంది. శాంతిపర్వం తృతీయాశ్వాసంలో కాపవ్యోపాఖ్యానం వుంది. కథ చిన్నదైనా, సమాజంలో పుట్టుకతో ఎవరూ నేరస్తులుగా పుట్టరు. కొందరు అలాంటి జీవితాన్ని గడుపుతున్నా, అవకాశం కల్పిస్తే మారుతారని వివరిస్తుంది. కాపవ్యుడనే బోయవాడు పారియాత్ర పర్వతంపై వుండే మునులకు అవసరమైన ఆహారాన్ని సమకూరుస్తుంటాడు. అతని వీరత్వాన్ని గమనించిన దొంగల గుంపు తమకు నాయకునిగా వుండమనడం, అతను వారికి కొన్ని నియమాలు పెట్టి, వారిలో మార్పు తీసుకురావడం ఇతివృత్తం. ఎటువంటి సమాజాన్ని తిక్కన కోరుకున్నాడని చిన్నదైన కథ చెబుతుంది.

10. ధర్మశాస్త్రం :

శాస్త్రమంటే శాసించేది. ధర్మశాస్త్రం అంటే ధర్మాన్ని శాసించేది. మహాభారతంలోని ధర్మాన్ని శాసించిన ఉదాహరణలు అనేకం కనిపిస్తాయి. ముఖ్యంగా శాంతి, అనుశాసనిక పర్వాలలో అధికంగా వున్నాయి. మహాభారతానికి నాయకుడైన ధర్మరాజు బంధు మరణ శోకంతో, వికల్పమైన మనసుతో వున్నపుడు ఆయనకు సర్వవర్ణ, సర్వాశ్రమ, స్త్రీపురుష ధర్మాలు చెప్పవలసి వచ్చింది వ్యాసుడు. సాధారణంగా శాస్త్ర విషయాలు మనసుకు అంతగా పట్టవు. పైగా డోలాయమానంలో ఉన్న ధర్మరాజునికి అసలే పట్టవు. అయినా చెప్పవలసిన సందర్భం కాబట్టి వ్యాసుడు ధర్మరాజుతో చెప్పాడు. నరరూపంలో తిరిగే గొప్ప దేవత రాజు. చిన్నపిల్లవాడైనా అతనికి కీడు తలపెట్టకూడదు. (శాంతి - 92), రాజుకు ప్రజలు శరీరం. రాజుకు ప్రజలు ఆత్మ .రాజు ప్రజల నుండి పన్నులు వసూలు చేయడంలో చాలా నేర్పరితనం కలవాడుగా ఉండాలి. (శాంతి - ద్వి.ఆ.). నాలుగు వర్ణాల ప్రజలు ఎలాంటి ధర్మాలు నిర్వర్తించాలో స్మృతులను ఆధారం చేసుకుని తెలుగు భారతంలో కూడా అనుశాసనిక పర్వంలో చెప్పబడ్డాయి. అలాగే ఆశ్రమ ధర్మాలు కూడా చెప్పాడు తిక్కన. దానం చేయడం కూడా పరమధర్మంగా మహాభారతం చెప్పింది. అందులో అన్నదానం, గోదానం, సువర్ణదానం మొదలైనవి చెప్పబడ్డాయి. తాను తింటున్నప్పుడు మరొకరు చూచినచో వారికి పెట్టడం. వేళకు ఇంటికి వచ్చిన అతిథికి పెట్టడం. దరిద్రుడైన బ్రాహ్మణుడు ఇంటికి వచ్చి ఆహారం అడిగితే, తన వద్ద లేనప్పుడు వేరే ఒకచోట యాచించి పెట్టాలని మహాభారతంలోని (ఆ.ప. 4 ఆ.) చెప్పబడింది. గోవును పూజించి శ్రద్ధగా దానం చేస్తే పుణ్యం కలుగుతుందని భారతం చెప్పింది. దీనికి కారణం మనది వ్యవసాయక దేశం కాబట్టి, గోవుల వలన పశు సంపద వృద్ధి చెందుతుందని, ఆ గోవులను దానం చేయాలని ఆలోచన కావచ్చు. అలాగే సత్యవతికి వ్యాసుడు 'క్రూరులు విలుప్తధర్మాచారులు ధృతరాష్ట్ర సుతులసద్వృత్తులు నిష్కారణ వైరులు వీరల కారణమున నెగ్గు పుట్టు కౌరవులకు 'అనడం నాటి ధర్మశాస్త్ర సూచనమే. ఎర్రన అరణ్యపర్వంలో చెప్పిన ధర్మవ్యాధుని కథ ధర్మాన్ని ఎలా అనుసరించాలో వివరిస్తుంది. ఎవరి ధర్మాన్ని వారు సక్రమంగా నిర్వర్తించడమే ధర్మశాస్త్రంలోని లోతైన విషయంగా మనం అర్థం చేసుకోవాలి. కౌశికుడు ధర్మవ్యాధుడు మాంసం అమ్ముతున్నాడు అనే లోపాన్ని

చూశాడు కానీ, తన తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలనే ధర్మాన్ని విస్మరించి, విద్య పేరుతో, తపస్సు పేరుతో ఇల్లు వదిలి వచ్చాననే విషయాన్ని మరిచిపోయాడు. చివరకు మాంసం అమ్మే వ్యక్తి దగ్గర ధర్మసూక్ష్మాన్ని తెలుసుకోవలసి వచ్చింది.

11. తత్వశాస్త్రం :

కథా ప్రారంభంలో వేదవ్యాసుడు సత్యవతికి చెప్పిన 'మతి దలపగ సంసారంబతి చంచల మెండమావులట్టుల' అనడం తత్వశాస్త్రం మూలం మొదటే చెప్పడమే. మహాభారతంలో అనేక పాత్రలు ఇక తాత్విక సందేశాలను ఇస్తాయి. ఆనుశాసనిక పర్వం (తృ. ఆ.) లో సప్తర్షులు, వృషాదర్భి సంవాదం చాలా గొప్ప తత్వాన్ని బోధిస్తుంది. అనావృష్టి వల్ల ఆహార పదార్థాలు లభించక జనాలు చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ఆ సందర్భంలో కశ్యపుడు మొదలైన సప్తర్షులు కూడా ప్రాణాలను నిలుపుకోవడానికి పొదపై ఉన్న మృత శరీరాన్ని తీసుకొని, దాన్ని మాంసాన్ని తినడానికి సిద్ధపడతారు. ఆ సందర్భంలో వృషాదర్భి రాజు వారిని చూసి ధనధాన్యాలు పంపుతాడు. అప్పుడు వారు 'రాజవర రాజుదెస ప్రతి గ్రహము విషము కల్లుగా జూతుమిట్టుల గాంచి ఉన్న యట్టి మాకు....' (ఆ.ప. - తృ -215) అనడంలో గొప్ప తాత్విక దృష్టి వుంది. ప్రాప్తించిన దాన్ని అనుభవించడం, ప్రాప్తించని దానిని గురించి ఆలోచించకపోవడం భారతంలో చాలా చోట్ల చెప్పబడింది . 'దొరకొన్న నుభవించుచు దొరకొనమికి చింతనొంది దురపిల్లక ....' (శాం. ప. - పం.ఆ. -376) అనడం మంచి తాత్విక బోధ. పింగళి అను వేశ్య మనసులో అనుకున్నట్లుగా చెప్పబడిన మాటల్లో కూడా ఎంతో గొప్ప తాత్వికత ఉంది. 'పొంతకు వచ్చిన వానిన కాంతునిగా గొనుచు నొరుని కాంక్షింపక .....' (అను.ప.) అనుకోవడం ఎంతలోతైన తాత్వికత 'మహాభారతము తత్వదర్శనము' అనే గ్రంథంలో డా॥ కేతవరపు రామకోటిశాస్త్రి తాత్విక దర్శనంలో భాగంగా సాంఖ్య, యోగ, వేదాంత అంశాలను కూడా మేళవించి వివరించాడు.

12. నీతి శాస్త్రం :

నీతి వేరు ధర్మం వేరు నీతి సామాజిక సమన్వయ సూత్రం. దుర్యోధనుడు కణికనీతి ప్రకారం తండ్రి అండదండలతో, శకుని కర్ణాదుల సలహాతో పాండవులను లక్ష్యాగృహ దహనం చేయించాడు (ఆది-ష.ఆ.). శాంతిపర్వంలో ధర్మరాజు రాజ్యవిముఖుడై ఉన్నప్పుడు అతనికి అనేకమంది చేసే ఉద్బోధలో భాగంగా దండనీతి ప్రస్తావన వస్తుంది. పాలకుడు సమర్థవంతంగా దండనీతిని పాటించకపోతే సన్యాసులు కూడా అక్రమ మార్గాలు అవలంబిస్తారని, భార్యలను కూడా వేరొకరు అపహరిస్తారని, దండనీతి వల్ల అధర్మం అణిగిపోతుందని చెప్పబడింది. అరణ్యపర్వంలో అనేక సన్నివేశాలు నీతిశాస్త్ర విషయాలను, నైతిక అంశాలను బోధ పరుస్తాయి. లబ్ధ కపోతాఖ్యానంలో శరణాగతలను రక్షించాలని, అతిథిని సంతోష పెట్టడానికి యజమాని తన శరీరాన్ని అయినా అర్పించాలనే నీతిని తెలుపుతుంది. కశ్యప గౌతమాఖ్యానం ద్వారా చేసిన మేలు మరిచిపోవడం, మిత్రుడికి ద్రోహం చేయడం మహాపాపమనే నీతిని తెలియజేస్తుంది. నలోపాఖ్యానం జూదం సర్వ అనర్థాలకు మూలకారణం అనే నీతిని బోధిస్తుంది. ఆదిపర్వం ప్రథమ శ్వాసంలో ఉదంకోపాఖ్యానం ద్వారా శిష్యుడు గురువుకు ఇష్టమైన కార్యాలు చేయాలని నీతి తెలుపుతుంది. అలాగే కచోపాఖ్యానం ద్వారా గురుపుత్రిని సోదరిగా భావించాలని నీతి వ్యక్తం అవుతుంది. శకుంతలపాఖ్యానం ద్వారా సత్యం గొప్పదనం ఎలాంటిదో తెలుస్తుంది. మాండవ్యోపాఖ్యానం ద్వారా హింస వల్ల దుఃఖం లభిస్తుందని చెప్పబడింది. తపతీసంవరణోపాఖ్యానంలో క్షత్రియునికి అధిక భోగేచ్ఛ తగదని నీతి.

13. వైద్య శాస్త్రం :

మహాభారతంలో అనేక రకాలైన వ్యాధులు, వాటికి నివారణోపాయాలు, చర్చించబడ్డాయి. పాండురాజు పుట్టుకతో శారీరక వైవర్ణ్యంతో పుట్టాడు. అలాగే ధృతరాష్ట్రుడు పుట్టుకతో చూపులేని వాడిగా జన్మించాడు. వారిరువురికి అనేక రకాలైన వైద్య సంబంధమైన చర్యలు తీసుకున్నట్లు మనకు మహాభారతంలోని ఆధారాలు నిరూపిస్తున్నాయి. అలాగే పాండురాజుకు సంతాన ప్రాప్తి కలగడానికి ఒక ప్రత్యేక పర్వతంపైన, అశ్వినీదేవతల సహాయంతో వైద్యం అందించినట్లు మనకు మహాభారతంలో చెప్పబడింది. దుర్యోధనునికి ఒక ప్రత్యేకమైన మైపూత ద్వారా గదాయుద్ధంలో దెబ్బలు తగలకుండా వైద్య పరమైన పూర్వ జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. గాంధారి గర్భవిచ్ఛితి సమయంలో రాజ వైద్యుల సలహా వ్యాసుని అభిప్రాయాలు తీసుకోవడం మనకు తెలుసు.

14. నిర్మాణ శాస్త్రం :

విశ్వకర్మ, మనువు, మయుడు, త్వష్టశిల్పి, విశ్వజ్ఞ మొదలైన వారు తొలి నిర్మాణభారతంలో ఇంజినీర్లుగా కనిపిస్తారు. భృగ్వంగిర, కశ్యప, వశిష్ట, భరద్వాజ, అగస్త్య, నారద మొదలైన వారు ఆదిమ శిల్పుల అనుగుణంగా వాస్తు శిల్ప సిద్ధాంతాలను తమ గ్రంథాలలో రాశారని అర్థమవుతుంది. మయసభ నిర్మాణానికి ఎంత సాంకేతిక విజ్ఞానం ఉపయోగించారో దాని వర్ణనలను బట్టి అర్థమవుతోంది. దుర్యోధనుడు వంటి అహంభావి కూడా దాని నిర్మాణ కౌశలాన్ని ప్రశంసించాడు. అంటే నిర్మాణ శాస్త్రంలో మన వారి ప్రజ్ఞకు మయసభ చక్కని ఉదాహరణ. ఇక రెండవది లక్కఇల్లు నిర్మాణం. అలాంటి నిర్మాణం కూడా చేయవచ్చని మొదట మహాభారతంలోనే చెప్పబడింది ఈ రోజు మనం సినిమాల్లో చూస్తున్న తాత్కాలిక నిర్మాణాలకు దీనిని నమూనాగా అర్థం చేసుకోవచ్చు.

15. విద్యా బోధన శాస్త్రం :

భారతకాలం నాటికి విద్యాభ్యాస కేంద్రాలు రెండు రకాలున్నాయి.

అ. నిబద్ధ విద్యా కేంద్రాలు:

కట్టు దిట్టమైన నియమాలను కలిగి పాఠ్యాంశాలు బోధించేవి. అంటే మహాభారతంలో కనిపించే ఆశ్రమాలు అనేకం కనిపిస్తాయి. కణ్వుడు ఆశ్రమం పేరు ఆరణ్యక విశ్వవిద్యాలయం. ఇది మాలినీ నదీతీరంలో వుంది. ఈ విద్యా క్షేత్రంలో శబ్ద సంస్కార సంపన్నులైన బ్రాహ్మణులు, క్రమశిక్షా విశారదులు, న్యాయ శాస్త్రజ్ఞులు ఆత్మ జ్ఞాన సంపన్నులు, వేద వాక్యాలు సమన్వయం చేయగలిగిన వారు ఉన్నారని తెలుస్తోంది. పైలుని ఆశ్రమంలో ఉదంకుడు విద్యనభ్యసించాడు. గురుపత్ని ఆదేశించిన కుండలాల కోసం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి చివరకు సుముహూర్తంలో వాటిని అందించడానికి ఉదంకుడు పడిన పాట్లు ఈ కథలో మనకి కనిపిస్తాయి. అంతేకాదు అంతకు మునుపు తన గురువైన వేదుని పత్ని రుతుమతి అయినపుడు గురువు యాగార్థం వెళ్లాడు ఆమెకు గర్భాదానం చేయమని కొందరు స్త్రీలు ప్రోత్సహించినా, శిష్యుడుగా తన పవిత్రతను కాపాడుకుని గురువు చేత ఉదంకుడు అనుగ్రహించబడ్డాడు. శౌనకుని ఆశ్రమం నైమిశారణ్యంలో వుంది. 10 వేల మంది విద్యార్థులకు పోషణ భారాన్ని వహించాడు. జ్ఞానాన్ని, సదాచారాలను బోధించినట్లు మహాభారతంలో చెప్పబడింది. శుక్రుడు రాక్షసుల గురువుగా, ఆశ్రమం నిర్వాహకుడిగా మహాభారతంలో చెప్పబడ్డాడు. మృత సంజీవిని విద్యకు పేరుగాంచిన గురువు. ఆ విద్యకోసం పడరాని పాట్లు పడిన కచుడు చచ్చి బ్రతికి ఆ విద్యను సాధించుకున్నాడు. తక్షశిల విషహారిణీ విద్యలకు పేరుగాంచింది. నన్నయభారతంలో ఆదిపర్వం రెండవ అశ్వాసంలో వర్ణించిన వృత్తాంతాన్ని బట్టి తక్షకుని విషం వల్ల మర్రిచెట్టు భస్మమవుతుంది. ఆ చెట్టుపై ఆకుల కోస్తున్న బ్రాహ్మణుడు కూడా మరణించాడు. వెంటనే కశ్యపుడు తన విద్యాశక్తితో మర్రిచెట్టును, బ్రాహ్మణుని బ్రతికించాడు.

ఆ. అనిబద్ధ విద్యా కేంద్రాలు :

ఇవి నియమాలు ఖచ్చితంగా లేకుండా విద్యను నేర్పే కేంద్రాలు. గృహాలు, దేవాలయాలు, నాట్యశాస్త్రాలయాలు, రాజు చేత ఆదేశించబడిన ప్రదేశాలు మొదలగునవి. తల్లిదండ్రులు తమ పిల్లలకు శిక్షణ ఇచ్చిన సంఘటనలు మహాభారతంలో వున్నాయి. విద్యలు 18 రకాలని తిక్కన శాంతి పర్వం మూడవ ఆశ్వాసం (119 పద్యం) లో చెప్పాడు. వైద్య, కోదండ, గాంధర్వాలనీ అన్నారు.

పాండవ, కౌరవులు భీష్ముని వద్ద అంత:పురంలో విద్యాభ్యాసం చేశారు. అధ్యయనం గురించి వారికి వివరంగా చెప్పాడు. ఇక ద్రోణుడు, కృపుడు వారికి ఇంటివద్ద విద్యలు నేర్పడం అనిబద్ధ విద్యా బోధనగా అర్థం చేసుకోవచ్చు. నన్నయ చెప్పిన 'విలువిద్య గరచుచుండిరి బ్రతుకులు కుమారులు కృప ద్రోణాచార్యులతో ....' (ఆది, పంచమాశ్వాసం) అనే పద్యం దానికి ఉదాహరణ. భీమ, దుర్యోధనులు బలరాముని వద్ద విద్యాభ్యాసం చేయడం కూడా అనిబద్ధ విద్యా కేంద్రంలోనే. ఏకలవ్యుడు అటవీ ప్రదేశంలో పరోక్ష సాధనలో సాగించిన విద్యా స్వతంత్రాధ్యయంగా మనం అర్థం చేసుకోవాలి. నేటి దూరవిద్యకు ప్రతిరూపంగా గమనించాలి.

భారతంలో వివిధ విద్యల గురించి నేరుగా చెప్పకపోయినా, కొన్ని గ్రంథాల సాక్ష్యం వల్ల వర్ణవిద్య, సంపన్నుల విద్య, సామాన్యుల విద్య, పురుష విద్య, స్త్రీ విద్య, బాలవిద్య, వయోజన విద్య, సాధారణ సాంకేతిక విద్య, వ్యాయామ విద్య, వికలాంగ విద్య, నీతి విద్య, మత విద్య, బ్రహ్మ విద్య అనే రకాలు ఉన్నట్లు అర్థమవుతుంది.

మహాభారతం బోధన పద్ధతులను కూడా కవిత్రయం వారు చర్చించారు.

అ. ప్రవచన పద్ధతి :

ఆచార్యుని శిష్యుని దగ్గర చేసేది ఈ ప్రవచన పద్ధతి. విద్యార్థికి జ్ఞానాన్ని కలిగించడం కోసం ప్రాచీన కాలంలో ఇలాంటి పద్ధతిని గురువులు అనుసరించారు. గురువుకు జ్ఞానం ఏ పద్ధతిలో ప్రాప్తించినా, దాన్ని శిష్యునికి బోధించే పద్ధతి కూడా అతనికి తెలిసి ఉండాల్సిన అవసరం ఉంది. సులభమైన విషయాన్ని క్లిష్టంగా బోధించడం విధానం కాదు. క్లిష్టమైన విషయాన్ని సులభంగా బోధించడం ప్రవచన పద్ధతి. సాహిత్యాన్ని బోధించే పద్ధతికి, శాస్త్రాన్ని బోధించే పద్ధతికి తేడా ఉంటుంది.

ఆ. పఠనపద్ధతి :

విద్యార్థి ఒక విషయాన్ని చదివే సమయంలో అతివేగంగా చదవరాదని, మరీ నిదానంగా చదవకూడదని, ప్రశాంతమైన మనసుతో, సునాయాసంగా అక్షరాలను, పదాలను స్పష్టంగా ఉచ్చరిస్తూ భావయుక్తంగా విద్యార్థి పఠించాలని సంస్కృత మహాభారతం (స్వర్గారోహణపర్వం) చెబుతోంది.

ఇ. వ్యాస సమాస పద్ధతులు :

అధ్యాపకులు సందర్భాన్ని బట్టి పాఠ్యాంశాలను కొన్నిచోట్ల సంగ్రహంగా, మరికొన్నిచోట్ల వివరంగా చెప్పాల్సిన అవసరం ఉంటుంది. విషయాన్ని కుదించి చెప్పడం సమాస పద్ధతి. విషయాన్ని విస్తరించి చెప్పడం వ్యాస పద్ధతి. మహాభారతంలో ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించిన అంశాలు, అలాగే గీతాశాస్త్ర విషయాలు సంక్షేప పద్ధతిలో సాగాయి. మహాభారతంలో కనిపించే ఉపాఖ్యానాలు, ఉపకథలు మొదలైనవి సామాజిక, ధర్మ, నైతిక అంశాలను వివరంగా చెప్పడానికి వ్యాస పద్ధతిని అనుసరించారు.

ఈ. అనుగమన నిగమన పద్ధతి :

ఒక సామాన్యమైన విషయాన్ని ముందు చెప్పి దాన్ని విశేషంతో సమర్థించడం అనుగమన పద్ధతి. ఈ పద్ధతి మహాభారతంలో అనేక కథలో కనిపిస్తుంది. 'ఒక స్త్రీ అనేకమందిని వివాహం చేసుకోవచ్చు' అనే సామాన్య విషయాన్ని మొదటి చెప్పి, దాన్ని ఉదాహరణలతో వివరించడం అనుగమన పద్ధతి. ఆదిపర్వం ఏడవ ఆశ్వాసంలో ఉన్న గద్య పద్యాలలో ఇంద్రసేన అనే పతివ్రత వృత్తాంతాన్ని వేదవ్యాసుడు ద్రుపదునికి వినిపించాడు. మౌద్గల్యుడి భార్య ఇంద్రసేన, ద్రౌపదిగా ఎలా పుట్టిందో అనుగమన పద్ధతి ద్వారా చెప్పారు. నిగమన పద్ధతిలో ఒక విశేషాన్ని మొదట చెప్పి, దాన్ని సామాన్యం చేత సమర్థిస్తారు. ఉదాహరణకు శాంతిపర్వం తృతీయాశ్వాసంలో కనిపించే దీర్ఘదర్శి, ప్రాప్త కాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు అనే మూడు చేపల కథను భీష్ముడు, ధర్మరాజుకు వినిపించి, ఆ తర్వాత ఆ కథలోని నీతిని వివరిస్తాడు.

ఉ. ఉపాఖ్యాన పద్ధతి :

కథను ఆధారంగా చేసుకుని ఆచార్యుడు విద్యార్థికి విషయాన్ని బోధించడం. చాలా ప్రాచీనమైన పద్ధతి. ఈ పద్ధతి వల్ల విద్యార్థికి జ్ఞానం, వినోదం కలుగుతాయి. మహాభారతంలో సుపర్ణాఖ్యానంలో సూచించిన కద్రూ, వినతల కథ రాబోయే కుంతి, గాంధారుల కథకు సాదృశ్యంగా ఉంటుందని చెప్పడం ఈ పద్ధతికి సంబంధించింది.

ఊ. ప్రశ్నోత్తర పద్ధతి :

విద్యార్థి తన సందేహాలను తీర్చుకోవడానికి ఆచార్యుని ప్రశ్నించడం, ఆచార్యుడు వాటికి సమాధానం చెప్పి విషయాన్ని వివరించడం ఈ విధానం. మహాభారతంలో అరణ్యపర్వం చతుర్దాస్వాసంలో భీముడు అజగరం చేత పట్టుబడినప్పుడు అతడిని విడిపించడానికి నహుషుని ప్రశ్నలకు ధర్మరాజు సమాధానం చెబుతాడు. ఇలాంటి ప్రశ్నలు, సమాధానాలు నాటి విద్యా విధానంలో ఒక అంతర్భాగంగా కనిపిస్తాయి. విశ్లేషణ సౌలభ్యాన్ని కలిగిస్తాయి. మహాభారతంలో కనిపించే సంవాదాలన్నీ ఇలాంటి ప్రశ్నోత్తర పద్ధతిని అనుసరించి సాగాయి. అరణ్య పర్వంలో ఎక్కువ ఈ సంవాదాలు కనిపిస్తాయి. భీమసేన - ధర్మజుల సంవాదం, అత్రి - గౌతముల సంవాదం దీనికి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

ఎ. చర్చాపద్ధతి :

ఒక విషయాన్ని గురించి పక్ష, ప్రతిపక్ష రూపంగా సాగేది చర్చ. ఏదైనా అంశాన్ని కూలంకషంగా చర్చించినప్పుడే దానిలోని లోతుపాతులు విద్యార్థికి సులభంగా అర్థమవుతాయి అని మహాభారతం ద్వారా మనకు అర్థమవుతుంది. ఆదిపర్వంలో జనమేజయుడు చేసే సర్పయాగంలో నాగులకు మరణం తప్పదని, ఉపద్రవం నుండి తప్పించుకోవడానికి నాగులు ఒకచోట సమావేశమై చర్చ చేస్తారు. ఆదిపర్వం ఆరవ ఆశ్వాసంలో బకునికి ఆహారంగా పోవడానికి ఏకచక్రపురంలోని బ్రాహ్మణ కుటుంబాల్లోని సభ్యులు చర్చించిన వృత్తాంతం మనకు కనిపిస్తుంది.

ఏ. ఉపన్యాస పద్ధతి :

శ్రోతలను ఆకట్టుకోవడానికి వేదికనెక్కి చేసేది ఉపన్యాస పద్ధతి. అనేక విషయాలను గురించి తక్కువ కాలంలో శ్రోత చెప్పడానికి ఉపన్యాస పద్ధతి ఉపయోగపడుతుంది. భారతంలో ద్రుపదుని పురోహితుడు, కృష్ణుడు మొదలైన వారు నిర్వహించిన రాయబారాలన్నీ ఈ ధోరణికి సంబంధించినది.

ఐ. ప్రయోగ పద్ధతి :

విద్యార్థికి సిద్ధాంత జ్ఞానం, ప్రయోగ జ్ఞానం రెండు ఉన్నప్పుడే చదువు మంచి ఫలితాన్ని ఇస్తుంది. విద్యార్థి ఒక శాస్త్రంలోని విషయాలను గ్రహించి, ఆ విషయాలను ప్రయోగాల ద్వారా అనుభవంలోకి తెచ్చుకోవాలి. మహాభారతంలో ఆచార్యులు, రాజకుమారులు పన్నిన వ్యూహాలు, చేసిన యుద్ధాలు వారి ప్రయోగ జ్ఞానాన్ని తెలుపుతాయి. ధనుర్విద్య గురించి కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో, ఏకలవ్యుడి కథలో కన్పిస్తాయి.

16. లక్ష్య సమన్వయ శాస్త్రం :

మహాభారతంలో తర్కం, జ్యోతిష్యం, మీమాంస వంటి శాస్త్రం సమన్వయం అనేక చోట్ల కనిపిస్తుంది. మునులు, ఋషులు సందర్భానుసారంగా వీటిని తమ బోధనలలో చేర్చారు.

17. సాంకేతిక శాస్త్రం :

మహాభారతంలో కూడా సాంకేతిక విజ్ఞానం వుందా! అని ఆశ్చర్యం కలుగుతుంది. మత్స్య యంత్ర నిర్మాణం, దాని ఛేదన సాంకేతికమే కాని దైవానుగ్రహం కాదని సన్నివేశాలు నిరూపిస్తున్నాయి. ఎందుకంటే అది యంత్రం అని కవిత్రయం వారు కూడా పేర్కొన్నారు.నిర్ణీత కోణంలో అమర్చిన చేపను, నేర్పరి అయిన విలుకాడు మాత్రమే కొట్టగలడు. అదే అర్జునుడు చేశాడు. మహాభారతంలో పన్నిన యుద్ధ వ్యూహాలు సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందినవే. మనుష్య, గరుడ, వ్యాల, మకర, క్రౌంచ, మండల, కూర్మ, సర్వతోభద్ర, శకట, పద్మ వ్యూహాలు ఆనాటి మేధావుల మస్తిష్కంలోని సాంకేతిక విజ్ఞానం వల్ల సృజింపబడ్డాయి. శాస్త్రాస్త్రాలు రెండూ ఒకటి కావు. మానవ ప్రయత్నం పూర్వకంగా నేర్చుకున్న శస్త్రాలు సాంకేతిక పరిజ్ఞానం రూపొందించుకున్నవి. శబ్ధ భేది ఇలాంటిదే. అర్జునుడు చీకటిలో చేసిన సంధానం ఈ కోవకు చెందిందే. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో కర్ణుడు చూపించిన ప్రతిభ సాంకేతికత ద్వారా సాధించిందే. ఏకలవ్యుడు మొరిగే కుక్క నోటిని సప్త శరాలతో బంధించడం సాధనలో సాంకేతికతను జోడించడమే.

18. వ్యక్తిత్వ వికాస శాస్త్రం :

ఈ ఆధునిక సమాజంలో వ్యక్తిత్వ వికాసం అనేది ఒక ప్రత్యేకమైన శాస్త్రంగా ఆవిర్భవించింది. కానీ, మహాభారతంలో అనేక ఉపాఖ్యానాల్లో, పాత్రల నిర్మాణంలో ఈ వ్యక్తిత్వ వికాసం కనబడుతుంది. విదురుడు వ్యక్తిత్వ వికాసానికి మూలపురుషుడుగా తెలుగు భారతంలో దర్శనమిస్తాడు. కుంతి, ధృతరాష్ట్ర, దుర్యోధనాదులకు ఇతను చెప్పిన మాటలు వ్యక్తిత్వ నిర్మాణ సాధనాలు. వ్యాసుడు, మార్కండేయుడు, నారదుడు వంటి వారు అనేక ఉపాఖ్యానాల్లో వ్యక్తిత్వ ప్రబోధం చేస్తారు. ఆంధ్ర మహాభారతంలో ద్రౌపది, సావిత్రి, శకుంతల, దమయంతి వంటి వారు అనేకచోట్ల వ్యక్తిత్వ వికాస నైపుణ్యాన్ని కలిగిన స్త్రీ పాత్రలుగా కనిపిస్తారు.

ముగింపు :

ఇప్పటివరకు మనం చెప్పుకున్న అనేక రకమైన శాస్త్రాలను మహాభారతంలో కవిత్రయం వారు తెలుసుకొని ఇమిడ్చారని చెప్పడం ఉద్దేశం కాదు. మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆధునిక సమాజంలో మనం ఉపయోగిస్తున్న రకరకాల శాస్త్రాలు మహాభారతంలో ఈ విధంగా క్లుప్తంగా చెప్పబడ్డాయని చెప్పడం ఈ వ్యాసోద్దేశం. రాజు కావడానికి ఏమైనా చేయవచ్చు అని చెప్పే కణికనీతి నేటి సమాజంలో కనిపిస్తుంది. అంటే ఈరోజు ప్రజాస్వామ్యంగా చెప్పుకుంటున్న ప్రభుత్వాలలో రాజులు కావడానికి ఎలాంటి మార్గాన్నయినా అనుసరిస్తున్న తీరును మనం గమనించాలి. పాలకుడు అన్ని నిర్ణయాలు తనే తీసుకోకుండా, తనకు ఒక ముఖ్య సలహాదారును

నియమించుకోవాలి. ధర్మరాజు తన పరిపాలనా కాలంలో పురోహితుని నియమించుకున్నాడు. కానీ దుర్యోధనుడు తనకు సలహాలు ఇవ్వడానికి పురోహితుని నియమించుకోలేదు. ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్య కార్యదర్శులను నియమించుకోవడం మనకి మహాభారతంలో ధర్మరాజు కాలం నుండి వస్తున్న సంప్రదాయంగా అర్థం చేసుకోవాలి. ప్రత్యక్ష విద్యా విధానాన్ని మహాభారతం సమర్థించింది. ఈరోజు మనం చెప్పుకుంటున్న ఆన్లైన్ విద్య, దూరవిద్య వంటివి పూర్తి నైపుణ్యాన్ని ఇవ్వలేవు అని మహాభారతం చెప్పింది. ప్రతిభ ఉన్న కర్ణుడు, ఏకలవ్యుడు వంటి వారు ఎక్కడైనా, ఎప్పుడైనా విద్య నేర్చుకుంటారు. కానీ వారిని ఆధారం చేసుకొని అలాంటి విద్య సమంజసం అని సమర్థించకూడదని మహాభారతం చెబుతుంది. మహాభారతం ఆర్థిక అంశాలను, రాజు ఖజానాను గురించి ఎన్నో విషయాలను చెప్పింది. రాజు పన్నులు వేసే విషయంలో ప్రజల స్థితిగతులను, వారి సమస్యలను, కరువు కాటకాలను అర్థం చేసుకొని వేయాలని ఆనాడే చెప్పింది. ఈనాటి ప్రభుత్వాలు కూడా ఆ ఆలోచనలను, ఆశయాలను గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయ భారతం - ప్రతిపర్వ వివేచనం : ఆచార్య గల్లా చలపతి అభినందన సంచిక
2. మహాభారతం - సామాజిక ప్రబోధం : వడ్లమూడి గిరిధర్ కుమార్
3. మహాభారతం తత్వదర్శనం : డా॥ కేతవరపు రామకోటిశాస్త్రి
4. శ్రీమదాంధ్ర మహాభారతం : తి.తి.దే. ప్రచురణ
5. మహాభారతం విజ్ఞాన సర్వస్వం : గుంజి వెంకటరత్నం
6. మహాభారతం - విద్యావిధానం : డా॥ ఆర్. మల్లేశుడు
7. కవిత్రయ భారతం - రాజనీతి : డా॥ నేతి అనంతరామశాస్త్రి

❖❖❖

మహాభారతంలో పాలనా ధర్మాలు - పునర్మూల్యాంకనం

ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

మహాభారతం ఒకనాటి భారతదేశ రాచరిక వ్యవస్థకు సంబంధించిన కథ. ఇందులో అనేక నీతి సూత్రాలు ధర్మపన్నాలు ఇమిడి ఉన్నాయి. ప్రాచీన భారతదేశ సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించి అనేక అంశాలు మహాభారతంలోకి వచ్చి చేరాయి. రాజనీతి, పాలనా వ్యవహారాలకు సంబంధించిన మెలకువలు, రాజ్య కాంక్షను ఎత్తిచూపే కుటిల పన్నాగాలు, అంగ బలంతో చేసే స్వార్థపూరిత కుట్రలు భారతాన్ని ఒక మహా కావ్యంగా ఒక ఇతిహాసంగా మార్చేశాయి. భారతంలో లేనిది ప్రపంచంలో లేదని, ప్రపంచంలో ఉన్నదంతా భారతంలో ఉందని వ్యాసుడు నొక్కి చెప్పగలిగాడంటే అతని రచన పట్ల అతనికి ఎంత నమ్మకం ఉందో అర్థం చేసుకోవచ్చు. విభిన్నమైన పాత్రలు, వాటి మనస్తత్వాలు, విస్తృతమైన సంఘటనలు మహాభారతాన్ని ఒక తిరుగులేని రచనగా ప్రపంచంలో నిలబెట్టింది.

మహాభారత కథకు సంబంధించి, పాత్రలకు సంబంధించి, నీతులకు ధర్మాలకు సంబంధించి ఈనాటి కాలాన్ని కనుగుణంగా పునర్ మూల్యాంకనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. భారత కథను కేవలం కాలక్షేపానికి చదవడమో, వినడమో, చూడడమో కాక అందులోని సందేశాలను ఈనాటి సామాజిక దృష్టితో చూడగలిగితే మహాభారతానికి మరింత గుర్తింపు లభిస్తుంది. మహాభారతంలో కనిపించే రాజధర్మాలు అనేక సంగతులను తెలియజేస్తాయి. కేవలం రాచరికాన్ని నిలబెట్టుకోవడానికి, రాజ్యాన్ని కాపాడుకోవడానికి లేదా విస్తరించుకోవడానికి మాత్రమే కాక ప్రజా జీవితాన్ని మెరుగుపరచడం, బలహీనులను ఆదుకోవడం, సర్వజన సంక్షేమాన్ని అభిలషించడం వంటి విషయాలు ఉన్నాయి. అందులో ప్రజలు, వ్యవసాయదారులు, వ్యాపారులు, ఉద్యోగులు, సైనికులు, వికలాంగులు మొదలైన వర్గాల ప్రజల సంక్షేమమూ కనిపిస్తుంది.

ప్రజా సంక్షేమానికి సంబంధించి మహాభారతం చెప్పిన కొన్ని విషయాలను సమీక్షించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

ఉద్యోగుల నియామకం - జీతభత్యాల చెల్లింపులు :

మహాభారతం ఉద్యోగ నియామకాలకు సంబంధించి యోగ్యతల ఆధారంగా పదవులు ఇవ్వాలని తెలియజేస్తుంది. వ్యక్తుల యోగ్యతలను బట్టి ఉత్తమ, మధ్యమ, అధమ అనే మూడు విధాలుగా ఉంటారని వారిని అదే విధమైన స్థాయిలలో ఉద్యోగులుగా నియమించుకోవాలని తెలియజేస్తుంది.

అంతేకాకుండా సేవకులందరికీ తగు జీతాలను సకాలంలో దయతో అందజేయాలని చెప్తుంది. (సభాపర్వం ప్ర.ఆ.37)

అంతేకాకుండా ఉద్యోగులకు అందవలసిన జీతాన్ని సమయానికి అందించకపోతే సేవకులు సుష్కించిపోతారని వారి దారిద్ర్య దుఃఖాలు ప్రభువుకు కీడు చేస్తాయని తెలియజేస్తుంది (సభాపర్వం ప్ర.ఆ.38). సమయానికి జీతభత్యాలు ఇవ్వలేకపోతున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఉద్యోగులను మనం చూస్తున్నాం. ఇలాంటి స్థితి వస్తుందని ఊహించే మహాభారత కాలం నాటికే ఉద్యోగుల యోగక్షేమాలు సక్రమంగా పట్టించుకోమని తెలియచెప్పారు.

వంశపారపర్యంగా వచ్చే సేవకులను చాలా ప్రేమతో చూసుకోమంటుంది. వాళ్లు మనసారా పని చేయడమే కాకుండా, ప్రభువు కోసంప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడరని పేర్కొంటుంది. (సభాపర్వం ప్ర.ఆ.39).

యుద్ధంలో మరణించిన వీర సైనికుల కుటుంబాలను కాపాడాల్సిన బాధ్యత రాజుకు ఉందని తెలియజేస్తుంది. కూడు గుడ్డకు లోటు కాకుండా చూసుకోవడం వాళ్ల సంతోషం తగ్గకుండా పోషణ చేయడం రాజు బాధ్యత అతని పేర్కొంటుంది. (సభాపర్వం ప్ర.ఆ.40). ఈ విధానాన్నే నేటి ప్రభుత్వాలు కూడా అవలంబిస్తున్నాయి.

పన్నులు వసూలు చేయడం అంటే రెవిన్యూ ఉద్యోగాలలో నియమించే వారిని అనేక ధర్మపరీక్షలతో వడపోసి తీసుకోవాలని చెప్తుంది. ధనార్జన రూపమైన రాచకార్యాలు కాబట్టి అవి ఎంతటి వారినైనా ప్రలోభాలకు గురిచేస్తాయని తెలియజేస్తుంది. పరిశుద్ధమైన వాళ్లను, పాపరహితమైన చిత్తవృత్తి గల వాళ్లను, నీతి మార్గంలో నడుచుకునే వాళ్లను, రాగ ద్వేష రహితమై సమబుద్ధితో వ్యవహరించే వాళ్లను, మంచి నైపుణ్యం కలవాళ్లను ఎంపిక చేసి ఈ వృత్తిలోకి తీసుకోమంటుంది. (సభాపర్వం ప్ర.ఆ.36) అవినీతిపరులను, పక్షపాత బుద్ధి గల వాళ్లను, దురాశపరులను రెవిన్యూ ఉద్యోగాలలో చేర్చుకుంటే ఏమవుతుందో మనం ఈ ప్రజాస్వామ్య దేశంలో చూస్తున్నాం.

"ఉపధా శుద్ధులఁ బాప
వ్యపగత బుద్ధుల వినీతి వర్తుల సములన్
సుపరీక్ష నియోగించితె
నిపుణుల నర్థార్జనాది నృపకార్యములన్" (సభాపర్వం ప్ర.ఆ.36) అంటాడు తిక్కన.

రాచ కార్యాలను నిర్వర్తించే ఉద్యోగులు కూడా మంచి వ్యక్తిత్వాన్ని కలిగి ఉండాలని భారతం చెప్తుంది. ఈ రోజుల్లో అయితే వీరిని సివిల్ సర్వెంట్స్‌తో పోల్చుకోవచ్చు. ధనం పట్ల లోపబుద్ధి కలవారిని, స్నేహానికి యోగ్యులు కానివారిని, శత్రువుల పట్ల పక్షపాతం కలవారిని, ధైర్యం చాలని వాళ్ళను, దుర్మార్గులైన వాళ్లను రాచ కార్యాలలోకి తీసుకోకూడదని చెప్తుంది (సభాపర్వం ప్ర.ఆ.41).

సామాన్యులను దోచుకుని కోట్లకు పడగలెత్తుతూ సగటు మనుషులు ఆశ్చర్యపడేంత స్థితికి వెళ్ళిపోతున్నారు. రెవెన్యూ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఇలాంటి దుర్బుద్ధులు లేవని తెలుసుకోవడానికి కొన్ని అదనపు పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుందేమో అనిపిస్తుంది.

అంతేకాదు ప్రభుత్వ ఉద్యోగుల్లో ముఖ్యమైన వాళ్ళు ధనాశాపరులైతే, వారు దొంగల దగ్గర డబ్బు తీసుకొని వాళ్లకే రక్షణ కల్పిస్తారు. అలాంటి వాళ్ళ విషయంలో జాగ్రత్తగా ఉండమని తెలియజేస్తుంది (సభాపర్వం ప్ర.ఆ.42). నేటి కాలంలో పోలీసు వ్యవస్థలో ధనాశపరులు అధికారులైతే ఇలాంటి దుస్థితి దాపురించే అవకాశాలు చాలా ఎక్కువ. కాబట్టి ధనాశపరులైన వ్యక్తులను కీలకమైన రక్షణ వ్యవస్థలోకి తీసుకోకూడదని దీని అర్థం.

ఇవే కాక, ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాల నిర్వహణ కోసం నమ్మదగిన వాళ్లను సమర్థులైన వాళ్లను భక్తి విశ్వాసాలు కలిగిన వాళ్లను నియమించుకోమంటుంది (సభాపర్వం ప్ర.ఆ.47).

రైతుల యోగక్షేమాలు :

మహాభారత కాలానికి రైతుల యోగక్షేమాలను చూసుకోవడాన్ని ఒక విలువగా పాటించాలని చెప్పడానికి మహాభారతమే ఒక ఉదాహరణ. ఏ దేశంలో రైతులు బాగుంటారో ఆ దేశంలో శాంతి సౌఖ్యాలు వెలి విరుస్తాయి.

మంచి ఆహారం ఉంటే మంచి ఆరోగ్యం ఉంటుంది. 'తిండి కలిగితేనే కండ గలదోయ్' అన్నట్టు మనుషులంతా బలంగా ఉంటారు. సమాజం సంతోషంగా ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న పాలకులు రైతుల సంక్షేమాన్ని కర్తవ్యంగా భావిస్తూ వస్తున్నారు.

ఉదార బుద్ధితో పేద రైతులకు ధాన్యపు విత్తనాలు ఇవ్వాలని, అనావృష్టి దరిచేరకుండా చెరువులు నిండి కనుల పండుగ నిలవాలని పేర్కొంటుంది. అదే సమయంలో వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇమ్మంటుంది. (సభాపర్వం ప్ర.ఆ.43,44). రైతులు కష్టపడి వ్యవసాయం చేయడమే కాకుండా వారి అవసరాలకు అప్పులు కూడా చేస్తుంటారు. వీరికి అప్పులు ఇచ్చేది వ్యాపారస్తులే. వ్యాపారస్తులు న్యాయబద్ధంగా వ్యవహరించకపోతే రైతు దోపిడీకి గురవుతాడు. వ్యాపారస్తులు బాగుండకపోతే న్యాయంగా వ్యవహరించలేరు. కాబట్టి వ్యాపారస్తులకు ఒక రూపాయి వడ్డీతో అప్పులు ఇవ్వాలని తెలియచెప్తుంది.

మరోచోట (ధన ధాన్యాలు, కోటలు, యుద్ధ వీరులు మొదలైన అంశాల పాటు) ఎప్పుడూ తరగని నీళ్లను, పశువుల గడ్డిని సమృద్ధిగా నిర్వహించమని చెప్తుంది. (సభాపర్వం ప్ర.ఆ.53).

వికలాంగుల సంక్షేమం :

"పంగుల మూకాంధుల వికలాంగులను నబాంధవుల దయం బ్రోతె? భయార్తుం గడిఁది శత్రునైనను సంగరరంగమునఁ గాతె శరణం బనినన్" (సభాపర్వం ప్ర.ఆ.45) అంటుంది భారతం.

మహాభారతం వికలాంగుల బాగోగులను చూసుకోవలసిన బాధ్యతను రాజులకు గుర్తు చేస్తుంది. కుంటి వాళ్లను, మూగవాళ్ళను, గుడ్డి వాళ్లను, అంగవిహీనులైన వాళ్లను, బంధువులు లేని వాళ్లను పోషించాల్సిన బాధ్యత ఉందని తెలియజేస్తుంది. నేటి ప్రభుత్వాలు కూడా అదే బాటలో నడుస్తున్నాయి. అంతేకాకుండా భయంతో దుఃఖిస్తూ శరణు కోరినవారు ఎంత పెద్ద శత్రువులైనా సరే వారిని కాపాడమని చెప్తుంది. ఇక్కడ 'చంపదగిన ఎట్టి శత్రువు తన చేత చిక్కెనేని కీడు చేయరాదు' అనే వేమనసూక్తి గుర్తుకొస్తుంది.

వికలాంగులతో పాటు మరికొందరిని కూడా జాగ్రత్తగా చూసుకోమంటుంది. గురువులను, వృద్ధ శిల్పులను, మంచి వ్యాపారులను, బంధువులను, ఆశ్రితులను, సజ్జనులను పేదరికం బారిన పడకుండా కాపాడమంటుంది. (సభాపర్వం ప్ర.ఆ.42).

ఆదాయ వ్యయాలు :

మహాభారతం ఆదాయ వ్యయాల గురించి కూడా ప్రస్తుతించింది.

"అరి మిగులఁగొనుట, గ్రేపుల బొరిమాలం బిదికినట్ల భూవర! కదుపున్ వెరవునఁ బెనిచిన యట్లగు నరపతి ప్రజచేత నప్పనము దగగొనినన్ (శాంతి పర్వం రెం.ఆ.389) అంటుంది మహాభారతం. అధిక పన్నులను వసూలు చేయకూడదు. అది దూడలకు పాలు వదలకుండా పితికినట్లు అవుతుంది. రాజు ప్రజల నుంచి పన్నులు తగుమాత్రంగా తీసుకోవాలి. ఆవుల మందను ఉపాయంతో పెంచినట్లుగా పన్నుల విధానం ఉండాలని చెప్తుంది. అధిక పన్ను వసూలు చేస్తే ఎలా ఉంటుందంటే పులి తన పిల్లలను తానే తినేసినట్టు ఉంటుందని, అలా కాకుండా జలగ రక్తాన్ని పీల్చుకున్నట్టు ప్రజలకు నొప్పి తెలియకుండా ధనాన్ని తీసుకోవాలని (శాంతి పర్వం రెం.ఆ.393) సూచిస్తుంది.

వస్తున్న ఆదాయంలో నాలుగవ భాగాన్ని లేదా మూడవ భాగాన్ని లేదా అవసరమనుకుంటే సగ భాగాన్ని మాత్రమే ఖర్చు పెట్టాలి. అంతకుమించి ఖర్చు పెట్టకూడదు (సభాపర్వం ప్ర.ఆ.47). రాజుల విలాసాల కోసం, వినోదాల కోసం అధిక ధనాన్ని ఖర్చు పెడితే, ఆ తర్వాత వచ్చే సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన సంపద లేకుండా పోతుంది. అందుకనే ఇలాంటి ఒక నీతిని రాజులు అనుసరించాలని భారతం బోధించింది. అయితే నేటి కాలంలో ప్రభుత్వాలు వీటికి భిన్నంగా ఆలోచిస్తున్నాయి. ఆదాయానికి – వ్యయానికి మధ్య పొంతన లేని పరిస్థితి ఏర్పడింది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్ని అప్పులైనా చేయవచ్చు అనే ధోరణి నేటి ప్రభుత్వాల్లో బలంగా పాతుకుపోయి ఉంది. ఆదాయ వ్యయాల విషయంలో సమతుల్యత సాధించకపోతే భవిష్యత్తులో సమాజానికి ఎన్నో అనర్థాలలో మునగాల్సిన పరిస్థితి కూడా దాపురించవచ్చు.

సమాచార వినిమయం :

"వార్తయంద జగము వర్తిల్లుచున్నది;
యదియు లేనినాఁడ యఖిల జనులు
నంధకారమగ్ను లగుదురు గావున
వార్త నిర్వహింపవలయుఁ బతికి" (సభాపర్వం ప్ర.ఆ.51)

వార్త అంటే సమాచారం. సమాచారమే జ్ఞానానికి మూల రూపం. ఆ సమాచారాన్ని తెలుసుకోవడం ద్వారానే ప్రజలు, ప్రభుత్వాలు తెలివిగా వ్యవహరించగలుగుతాయి. ఆ వ్యవస్థ లేకపోతే పాలనా వ్యవస్థ చీకట్లోకి వెళ్ళిపోతుంది. కాబట్టి రాజు అనే వాడికి సమాచారం వ్యవస్థను నడపాల్సిన లేదా కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలియచెప్తుంది భారతం. వార్త అనే పదానికి వృత్తాంతం. వర్తనం, అర్థానర్థ వివేచన విద్య అని అర్థాలు ఉన్నాయని వ్యాఖ్యాతలు చెబుతున్నారు. సమాచారం ఆధారంగా చేయగలిగే వివేచనగా అర్థం చేసుకుంటే సరిపోతుంది. అయితే ఈనాటి మాధ్యమాలు స్వేచ్ఛ స్వతంత్రతలను కలిగి సమాచార ప్రసారం, ప్రచారం చేస్తున్నాయి. కొన్ని పత్రికలు పొలిటికల్ ఎస్టేట్లుగా మారిపోయిన సందర్భాలు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల మాధ్యమాల స్వేచ్ఛకు భంగం కలిగే విధంగా వ్యక్తులు ప్రభుత్వాలు ప్రవర్తిస్తున్నాయి.

పాలకులు పరిత్యజించవలసిన అంశాలు :

నాస్తికత, అసత్య మాడడం, ఏమరపాటు, సోమరితనం, తెలివి తక్కువ వాళ్లతో కార్యాలోచన చేయడం, అతికోపం, అధిక కాలం దుఃఖించడం, చేయవలసిన పని గురించి అతి దీర్ఘంగా ఆలోచించడం, ఆలస్యంగా చేయడం, జ్ఞానుల్ని గుర్తించకపోవడం, ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజన భంగకరమైన ఆలోచనలు చేయడం, నిర్ణయించిన పనులు చేయకుండడం, రహస్య ఆలోచనలు బయటపడకుండా కాపాడకపోవడం, శుభకార్యాలు చేయకుండడం, ఇంద్రియ సుఖాల్లో తగులుకోవడం అనే దోషాలను విడిచి పెట్టమంటుంది భారతం (సభాపర్వం ప్ర.ఆ.56). వీటిలో నాస్తికత అనే అంశాన్ని పక్కన పెడితే మిగిలిన అంశాలు ఈనాటి పాలకులకు కూడా వర్తిస్తుంది.

ప్రజలను కాపాడడం :

ప్రజలను ప్రభువును ఎలా కాపాడుకోవాలో చెబుతూ....

"వినుగర్భిణి, ప్రజ బ్రతుకున
కనురూపములైన యట్టి యాహారంబుల్
గొనుగతిఁ, బతి ధరణీప్రజ
మనికికిఁ దగనడచునది, తమకిగా కెపుడున్" (శాంతి పర్వం రెం.ఆ.179) అంటుంది భారతం.

గర్భిణీ అయిన స్త్రీకి మంచి ఆహారం ఇచ్చి ఎలా కాపాడుకుంటారో, తమ రాజ్యంలోని ప్రజలు బతకడానికి అవసరమైన వాటిని సమకూర్చి రాజు ప్రజలను కాపాడుకోవాలి అంటుంది.

ప్రజలను సంరక్షించడమే రాజు ప్రధాన ధర్మం. ఆ రాజు చేసే తపస్సులు, యాగాలు ప్రజలను దయతో సంరక్షించే దానితో సమానం కావు. రాజు ధర్మాన్ని అనుసరించి ప్రజలను సంరక్షిస్తే, ఆ రాజుకు విజయంతో పాటు సంపద, కీర్తి, ఉత్తమ గతులు లభిస్తాయి అంటుంది (శాంతి పర్వం రెం.ఆ.301) భారతం.

అవినీతిపరుల ధనాన్ని జప్తు చేయడం :

చెడు నీతి గల వారి ధనాన్ని రాజు బలవంతంగా లాక్కోవాలి. అలా లాక్కున్న సంపదను మంచివారికి ఇవ్వాలి. (శాంతి పర్వం రెం.ఆ.186). ఇప్పుడు ఈడీ, సీబీఐ వంటి సంస్థలు చేస్తున్న పనులు చేశారన్న మాట.

రాజులు ధనాన్ని అపహరించడమే పనిగా పెట్టుకుంటే, అంటే ప్రజల నుంచి నిరంతరం దోచుకొనే పని చేస్తూ అలాంటి రాజుకు శత్రువులతో కన్నా తన ప్రజలతోనే ఎక్కువ చేటు ఉంటుందని చెప్తుంది. (శాంతి పర్వం రెం.ఆ.188).

రాజు ఎవరినీ నమ్మకుండా ఉండడం చావుతో సమానం. ఎక్కువగా నమ్మితే అకాల మరణంతో సమానం. అందువల్ల మిత్రులను నమ్మి సూక్ష్మ బుద్ధితో నిజానిజాలు తెలుసుకోవాలి (శాంతి పర్వం రెం.ఆ.351) అంటుంది. ప్రభుత్వం కోసం నిజాయితీగా పనిచేసే అధికారులు, అంతే నిజాయితీగా పనిచేసే ప్రభుత్వ సలహాదారులు ఈనాటి ప్రభుత్వాలకు మిత్రులతో సమానం. అందువల్ల ప్రజా సమస్యలను, ప్రజలకు అందవలసిన సౌకర్యాలను వీరి ద్వారా తెలుసుకొని నడుచుకుంటే అటు రాజు ఇటు ప్రజలు సంతోషంగా ఉంటారు.

రాజు గుడ్డిగా కొడుకులను కూడా నమ్మకూడదని, నమ్మితే సంపద మొత్తం పోగొట్టుకుంటాడని, ప్రజల విషయంలోనూ రాజు నమ్మిన వాడి లాగానే ఉంటూ ప్రతి విషయాన్ని పరిశీలించుకోవాలని చెప్తుంది. (శాంతి పర్వం రెం.ఆ.381)

మహాభారతంలో పాలనా ధర్మాలకు సంబంధించి డాక్టర్ డి.సి.రెడ్డి రాసిన వాక్యాలు ఇక్కడ ఉదాహరణీయాలు. "ఒక రాజకుటుంబ యితివృత్తం భారతానికి ఆధారం. రాజకుటుంబానికి సంఘం తోడ్పాటు అవసరం. ఆ విధంగా రాజసంఘానికి సంబంధించిన విషయాలు ఎక్కువగా భారతంలో చర్చించబడినాయి. ఇతిహాసం, మహాకావ్యం, పంచమవేదం అనబడే యీ భారతంలో రాజ్యవిషయాలెక్కువగా వున్నాయి. ఏ సాహిత్యంలోనూ రాజనీతి ప్రధానమైన మహాకావ్యం యింత కట్టుదిట్టంగా రాయబడలేదు. భారతంలో చర్చించని రాజనీతి విషయంలేదు. ఇందులో రాజూ, రాజ్యవ్యవస్థలే గాకుండా రాజధర్మానుశాసకుల ప్రస్తావనా పర్యవేక్షణలూ వివరించబడినాయి" అంటాడు. (ముందుమాట : శ్రీమదాంధ్ర మహాభారతం - రాజనీతి : డా.డి.సి.రెడ్డి).

మహాభారత కథ ఇప్పటికీ ఆదరణకు నోచుకుంటూనే ఉంది. మహాభారతంలోని ధర్మాలను, సూక్తులను అనేక సందర్భాలలో అనేకమంది వుటంకిస్తూనే ఉన్నారు. అంత మాత్రం చేత మహాభారతంలో చెప్పిన రాజనీతి సూత్రాలన్నీ ఆచరించదగినవి కావు. వర్ణ వ్యవస్థకు సంబంధించి, ఉన్నత వర్గాల పరిరక్షణకు సంబంధించి చెప్పిన ధర్మాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, సమానత్వానికి అడ్డంకులుగా కనిపిస్తాయి. అయినా, మానవ వ్యక్తిత్వ వికాసానికి, పాలనా ధర్మాలకు, నీతి బోధనకు, మనస్తత్వ పరిశీలనకు మహాభారతం ఎప్పుడు ఒక ఉదాహరణ కావ్యంలా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము : తిరుమల తిరుపతి దేవస్థానములు (1996) తిరుపతి.
2. మహాభారతము - మున్నూరు సూక్తులు : పుత్తా పుల్లారెడ్డి (2008) మారుతీ నగర్, కడప.
3. ఆంధ్ర మహాభారతం అమృతతత్వం : ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం (1996), జి.వి.సుబ్రహ్మణ్యం షష్టిపూర్తి ప్రచురణలు, నల్లకుంట, హైదరాబాదు.
4. శ్రీమదాంధ్ర మహాభారతం - రాజనీతి : డాక్టర్ డి.సి.రెడ్డి (1989), ప్రియదర్శిని పబ్లికేషన్స్-6, తిరుపతి.

❖❖❖

ఆంధ్ర మహాభారతం - శాంతిపర్వం - ధార్మిక అంశాలు

ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ, తెలుగు అధ్యయన శాఖ, ఎస్వీ యూనివర్శిటి, తిరుపతి.

మహాభారతం 'పంచమ వేదం', ఇది పురాణం, ధర్మశాస్త్రం, వేదాంతం, నీతిశాస్త్రము మహాకావ్యాల సమూహం. మహాభారతంలోని పద్దెనిమిది పర్వాలలో పన్నెండవది శాంతిపర్వం. శాంతనవుడు బోధించిన శాంతనగీత 'శాంతి పర్వం'. మహాభారతంలోని అన్ని పర్వాలలో కెల్లా పెద్దది. 14,525 శ్లోకాలతో ఉంది. ఇందులో కథ తక్కువ, బోధ ఎక్కువగా ఉంటుంది. బోధకు శాస్త్రం శరీరం కథకు కావ్యం శరీరం. ఈ రెండింటి యొక్క సమగ్ర స్వరూపం శాంతిపర్వం. శాస్త్రేతిహాస స్వరూపంలో తిక్కన దీనిని నిర్మించాడు. శాంతిపర్వం ఒక రథం అయితే ఇందులోని ఉపాఖ్యానాలు, సంవాదాలు రెండు రథచక్రాల వంటివి. ఆఖ్యానం అంటే ప్రధానకథ. ఉపాఖ్యానమంటే ప్రధాన కథకు తోడ్పడే ఉపకథలతో కూడినదని అర్థం. 'సంవాదం' అంటే ప్రశ్నకు సమాధానం చెప్పడం. ధర్మరాజు సందేహ ప్రశ్నలకు భీష్మపితామహుడు సమాధానాలు ఇచ్చే క్రమం స్పష్టంగా తెలుస్తుంది. ఇందులో తిక్కన మూడు ధర్మాలను ప్రధానంగా పేర్కొన్నారు. 1. రాజధర్మం 2. ఆపద్ధర్మం 3. మోక్షధర్మం. లౌకికఅంశాలన్నీ ఆపద్ధర్మంలోనివే. సాంఘిక వ్యవస్థ, వర్ణాశ్రమ ధర్మాలు, గృహస్థ ధర్మ ప్రాముఖ్యం, దానములు, పుణ్యక్షేత్రాలు, లౌకిక నీతులు మొదలగు అంశాలు ఈ ధర్మం క్రిందకు వస్తాయి. నేను ఆపద్ధర్మ అంశాలకు సంబంధించిన వాటిలో కొన్నింటిని పరిచయం చేస్తున్నాను.

శాంతిపర్వ నామ సార్థక్యం :

మహాభారత పర్వాలలో 12వ దైన శాంతిపర్వ నామానికి ఒక వైశిష్ట్యం గోచరిస్తుంది. ఆది పర్వం మొదలుకొని ఉద్యోగపర్వం వరకు పాండవ ఇతివృత్తంలో కానవచ్చే ప్రధానాంశాలను అధికరించి పేర్లు పెట్టారు. యుద్ధషట్కంలో (భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య) నాలుగు పేర్లు కౌరవుల నామాలను అధికరించి పెట్టబడినవి. సౌప్తికపర్వం యుద్ధం ప్రవర్తిల్లిన కాలావస్థను సూచించేది. స్త్రీపర్వము కౌరవ వనితల శోకాన్ని తెలియజేసేది. ఇవన్నీ పాండవులను వారి సమిష్టి జీవితాలను వివరించేవి అయితే 'శాంతిపర్వం' కేవలం ధర్మరాజు గురించే వివరిస్తుంది. యుద్ధం ముగిశాక, ధర్మాన్ని నిర్వర్తించడానికి అంగీకరించలేదు. అతని మనస్సు అశాంతితో కూడికొని ఉంది. ధర్మరాజుకు రాజ్యం దక్కిందికాని, అది రక్తపు కూడువలె కనబడింది. కర్ణవధ ధర్మరాజు మనసుకు దుర్భరమైన శోక భావోద్వేగాన్ని కల్గించింది. తమ్ముల చేతిలో రాజ్యంపెట్టి తపోవనానికి వెళ్ళాలని అర్జునుడి ఎదుట తన వేదనను వెలిబుచ్చాడు. తాను ఒక్కడే వనవాసం చేసి భిక్షక వృత్తిలో జీవించాలని భావించగా భీష్ముడు ఉపదేశించిన ఉపదేశమే 'శాంతిపర్వం'. ఖండవల్లి లక్ష్మీరంజనం గారు శాంతిపర్వం గురించి "భారతదేశపు ప్రాచీన విజ్ఞానమునకు వివృత భాండాగారము శాంతిపర్వము. దీనిలో ఇది ఉన్నది ఇది లేదను మాటయే లేదు. యదిహాస్తి తదన్యత్ర - యన్నేహాస్తి న తత్ క్వచిత్ అను ప్రశంస ప్రధానముగా శాంతిపర్వానికే తగినది.

ధర్మం నిర్వచనం :

"ధ్రుజ్ ధరణే" అనే ధాతువు నుండి "ధర్మం" అనే పదం వచ్చింది. "ధరతి విశ్వమితి ధర్మః-ధారణాత్ ధర్మః" అని వ్యుత్పత్తి. సమస్త విశ్వాన్ని ధరించేది ధర్మం. విశ్వస్థితికి ఆధారమైనది ధర్మం. "ధర్మ విశ్వస్య జగతిః ప్రతిష్టాలోకే - ధర్మిస్టం ప్రజా ఉపస్సర్పంతి - ధర్మేణ పాపమనువదతి- ధర్మే సర్వం ప్రతిష్టితం తస్మాధర్మం పరమం వదంతి" అంటుంది శ్రుతి.

"సమస్త లోక స్థితికి పరమ ఆధారం ధర్మమే. ధర్మ నిష్టకలవారిని ప్రజలు ఆశ్రయిస్తారు. ధర్మం పాపాన్ని తొలగిస్తుంది. ధర్మంలోనే అన్నీ ఉన్నాయి. కనుక ధర్మం సర్వ శ్రేష్ఠమైనది అని భావం.

ధారగాద్ ధర్మఇత్యాహుః ధర్మో ధారయతే ప్రజాః
యస్యాద్ ధారణా సంయుక్తః సధర్మ ఇతి నిశ్చయః

'ధర్మం' అనే పదం 'ధారణ' లేదా 'జీవనోపాధి' నుండి ఉద్భవించింది. ధర్మమే సమాజాన్ని నిలబెడుతుంది. ఏది నిలబెట్టుకోగలదో అది నిజానికి ధర్మమని భారతం – కర్ణపర్వంలో వివరించబడింది.

'ధర్మ' అంటే న్యాయసమ్మతమైన బాధ్యత అని, మానవత్వాన్ని రక్షించే గుణము అని వివరించారు. నవవిధ ఆత్మజ్ఞానములలో ఒకటి ధర్మం. అవి జ్ఞానం, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషం, ప్రయత్నం, ధర్మం, అధర్మం, సంస్కారం.

ధర్మం ఎన్నో రీతులలో ప్రవర్తిల్లుతుంది. అన్నిటిని ఆచరించడం కష్టం. ధర్మ సూక్ష్మత అందరికి అంత సులభంగా అర్థంకాదు. ధర్మం గురించి తెలుసుకోవడానికి వేదాల ప్రమాణం, పెద్దల నడవడిక, అనుభవం ఆధారంగా గ్రహించవచ్చని, 'ధర్మవ్యాదోపాఖ్యానం' లో స్పష్టపరిచారు.

ఈ పరంపరలో లౌకిక నీతులను మరికొన్ని ఆపద్ధర్మ విశేషాలను సందర్భానుసారంగా భీష్మపితామహుడు ధర్మరాజుకు వివరించిన ఉపాఖ్యానాలు, సంవాదాల ద్వారా కొన్నింటిని గ్రహించవచ్చు. ఇహపర సౌఖ్యములకు ఏవి ముఖ్యమని ధర్మరాజు అడగ్గా భీష్ముడు "తల్లికి, దండ్రికి, గురువులకు సేవచేసి వారి మాటకు విధేయులై ఉండుట "అధిక ధర్మము" అని తెలిపారు.

సత్యసంధత :

ధర్మరాజు సత్యం స్వరూపాన్ని దానిని అవలంభించే తీరును చెప్పమని అడగగా భీష్ముడు ఇలా చెప్పాడు.

కం. **సమతయు దమముఁ దితిక్షయు, నమత్సరము హ్రీయు ధృతియు ననసూయార్య**
త్వములు నహింసా దాన క్షమా యజన సూనృతములు సత్యము మూర్తుల్

(శాంతి.ప.3.ఆశ్వాసం, పద్యం. 417)

అన్ని ప్రాణుల పట్ల సమత, ఇంద్రియ నిగ్రహం, ఓర్పు, పగలేకపోవడం, సిగ్గు, ధైర్యం, ఈర్ష్యలేకపోవడం, ప్రాణులకు మేలు చేయడం, హింసకు ఒడిగట్టకపోవడం. యాగం చేయడం, దానం, ఓర్మి, నిజాయితి మొదలగునవి సత్యం స్వరూపాలు. ఈ స్వరూప గుణాలను ఎల్లప్పుడు ఆచరించే సంపూర్ణ ధ్యానస్థితి గల యోగికి తేలికగా అబ్బుతాయి. అవి ఎంతో సుఖాన్నిస్తాయి. వీటిని ఆచరించాలని చెప్పాడు.

చ. **కుదురు సమస్త ధర్మములకున్ వినుసత్యము యోగమోక్ష స**
త్పదములు సత్యకార్యములు పాప మసత్యము కంటె నొండులే
దు దలప నశ్వమేధములు తొమ్మిది నూఱులు వెండి నూఱునై
యొదవిన నీడు గావు భరతోత్తమ! సత్యము తోడ నారయన్

(శా.ప. తృతీయాశ్వాసం, పద్యం. 419)

ధర్మరాజా! వినుము సత్యం అన్ని ధర్మాలకు పాదువంటిది. యోగమోక్షాలనే పుణ్యస్థానాలు సత్యం వలనే ఒనగూడుతాయి. అబద్దాన్ని మించిన కీడు మరొకటి ఉండదు. ఆలోచిస్తే ఒక్క సత్యంతో 1000 అశ్వమేధ యాగాల ఫలం కూడా సాటిరాదని తెలిపారు.

శాంతిపర్వంలోని చతుర్దాశ్వాసంలో ఆపద్ధర్మాలు, లౌకిక నీతుల గురించి ప్రశ్న, సమాధానాల రూపంలో

వివరించారు. కాలం ముందు ప్రాణులన్నీ సమానమేనని, సుఖదుఃఖాల రెండింటిని ఓర్పుతో సహించినపుడే మనిషికి శాంతి కలుగుతుందని, ప్రజ్ఞమే నరునికి గొప్ప కీర్తిని కల్గిస్తుంది.

ఆచార విధులను ముఖ్యంగా మానవుడు ఎప్పుడు ఏ సమయంలో ఏమేమి విధులు నిర్వర్తించాలో వివరించారు.

అన్ని ధర్మములకన్నా మిన్న అసత్యం మహాపాతకము. పరుల ధన ప్రాణములు అపహరించువానితో సత్యం పలుకడం కూడా పాపమే. బొంకులు పలికిన వానిని శిక్షించుట ధర్మము. ఇతరులకు హితము సేయు పలుకులు ధర్మములు. జీవులకు బాధకల్గించునవి నిజములే అయినా, పాపములే

భూతహితంబుగాఁ బలుకు బొంకును, సత్యఫలంబు నిచ్చుఁ ద
ద్భూతభయాస్పదం బగు ప్రభూతపు సత్యము బొంకునట్లు; ప్రా
ణాతురుడైనచోఁ బరిణయంబునందును బల్కు బొంకు స
త్యా తిశయంబ యంద్రు మహితాత్మక! యిట్టివి ధర్మ సూక్ష్మముల్

(ఆం.మ.భా. ఆరణ్యపర్వం పంచమాశ్వాసం, పద్యం.62)

ఓ మహానుభావా! ప్రాణికోటికి మేలు జరగడానికై చెప్పబడిన అసత్యం సత్యం కంటే కూడా గొప్పది. ప్రాణికోటికి కీడు కల్గించే సత్యం అసత్యంతో సమానం. ప్రాణ రక్షణకూ, వివాహం జరిపించడానికి ఆడిన అసత్యం సత్యం కంటే ఘనమైనది. ఇవన్నీ ధర్మ సూక్ష్మాలు అని, ధర్మం యొక్క లక్షణం ఇలా ఉంటుందని కౌశికునికి ధర్మవ్యాధుడు తెలియజేశాడు.

మానవులందు ఈ మంచి చెడ్డలు వివేకముతో నిర్ణయించుకొనవలెను. ఈ లోకంలోని మనుషులు మంచివారు చెడ్డవారుగాను, చెడ్డవారు మంచివారుగ నటిస్తూ రాజుల, అధికారుల అనుగ్రహము సంపాదిస్తారు. వీరిని తెలుసుకొని నిర్ణయించుట ఎట్లని అడుగగా భీష్ముడు సుజన దుర్జన విచక్షణ పులి - పౌరికుడను నక్కల కథను శాంతిపర్వం 3వ ఆశ్వాసంలో కథను చెప్తాడు.

శీలం సంపద, సత్ప్రవర్తన :

భారతీయ సాహిత్యంలో, సమాజంలోను శీలసంపదకు అత్యధిక ప్రాముఖ్యం ఇవ్వబడింది. బుద్దుడు చెప్పిన అష్టాంగ మార్గంలోను "సమ్యక్ శీలం" అని సరియైన శీల సంపదను కలిగి ఉండాలని బోధించారు. ఈ విషయాన్ని శాంతిపర్వం కూడా సందర్భానుసారంగా తెలియజేస్తుంది. ధర్మరాజు మహావైభవంగా భూరి, దాన, ధర్మములతో చేసిన రాజసూయ యాగం శోభిల్లినది. ఆ శోభకు దుర్యోధనుడు అసూయ పడగా ధ్రుతరాష్ట్రుడు కొడుకుతో నాయనా! నీకున్న సిరిసంపద తక్కువైనది కాదు. ధర్మజుని శీలము, సత్ప్రవర్తనము పరిశుద్ధములైన కారణముగ ఆ శోభ అతనికే దక్కింది. నా బాగుడు - మాంధాతృడు మొదలగువారు వారివారి సచ్చీలము వల్లనే కదా కీర్తిపొందినదని బోధించాడు. శీల సంపద ప్రాధాన్యాన్ని "ప్రహ్లాదుడను రాక్షసరాజు ఇంద్రుని కథ"లో చక్కగా విశ్లేషించాడు. ప్రహ్లాదుడిని ఒక విప్రుని వేషంలో వచ్చిన ఇంద్రుడికి తన శీలాన్ని ఇవ్వమని అడగగా, ప్రహ్లాదుడు తన శీలాన్ని ఇచ్చిన వెంబడే ఒక తేజస్వి తన శరీరం నుండి వెడలిపోవడం, ఆ వెనుకనే ఒక సుందర కాంతామణి తన దేహం నుండి వెడలిపోవుట ప్రహ్లాదునికి కన్పించింది. ప్రహ్లాదుడు నివ్వెరపోయి మీరెవరని అడగగా ఆమె "నేను సిరిని". నీవు శీలమునిచ్చిన విప్రునికడకు పోవుచున్నాను. బలమెక్కడ ఉండునో అచటికి పోదునని పలికి, వినుము శీలం వలన ధర్మము, ధర్మంవలన సత్యం, సత్యవర్తనమ్మున బలం వాటిల్లును. బలమున్న యెడల నేనుందును. సర్వమునకు మూలం శీలసంపద" అని చెప్పి ఆమె వెళ్ళిపోయింది. ధృతరాష్ట్రుడు మరొక సందర్భంలో దుర్యోధనునితో "మనో వాక్కాయ కర్మములచే నెవ్వరియెడలను

ద్రోహము లేకుండుట శీలము. పరహితము సేయువారిని ప్రజానీకం మెచ్చుకొంటారు. కనుక నీవిప్పుడైనా నీ శీలమును పునఃపరిశీలించుకొని వర్తింపుమని చెప్పారు.

లోభమే పాపకారణము :

పాపమునకు కారణమేదని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు అన్ని పాపములకు లోభమే హేతువు. లోభమనగా పిసినిగొట్టుతనము, అత్యాశ, దీనివలన కోరికలు, కోపము, మత్సరము, ద్రోహము, పరధనాపహరణము, అసత్యము, సిగ్గుమాలి నడుచుట, క్రమముగా ఒక్కటొక్కటే అలవడును. "లుబ్ధులను దూరంగా ఉంచి ధర్మపరులయిన వారినే దగ్గరనుంచుకొని పనులు నిర్వహించవలెను. లోభం, అజ్ఞానం, ఇవి రెండూ మనుజులకు కీడు కలిగిస్తాయని చెప్పారు.

అరిషడ్వర్గాలు :

కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలకు 'అరిషడ్వర్గాల'ని పేరు. వీటిని జయించినవాడు ఉత్తముడు, ఉన్నతుడిగా కీర్తింపబడినారు. ఈ ఆరును మనుజులకు శత్రువులు. వీటి వలననే మనిషికి అన్ని రకాల చెరుపులు కలుగుతున్నాయి. ఇందులో కామం చెడు తలంపుల వలన కలుగును. దేహ పరిస్థితిని తెలుసుకొని మనము దీనిని నిరోధించవచ్చు. పరులు మన పట్ల చేసే తప్పుల వలన క్రోధం పుడుతుంది. ఇది ఓర్పు వలన సమసిస్తుంది. సర్వము అశాశ్వితము అని తెలియక, లోభం కలుగును. తెలిసినచో ఇది నశిస్తుంది. ధన, ధాన్య సంపదల యందు ఆసక్తి మోహము. ఇది అజ్ఞానం చేత కలుగుతుంది. ధర్మ గుణం వలన ఇది తగ్గును. మదమునకు కారణం కులం. ధనం, విద్య, ఇవి అస్థిరములని ఊహించగలగినా అణిగి పోతాయి. మత్సరం, ద్వేషం, ఈర్ష్య, అనేవి ఆశ వలన కలుగుతున్నాయి. ఇవి సాత్విక గుణం వలన తగ్గి పోతాయని ఈ ఆరు దుర్గుణాలు ఎన్ని అపాయాలనైనా చేయిస్తాయని, ధైర్యంతో వీటిని అణగద్రొక్కతే ధీశాలికి సద్గతులు లభిస్తాయని వివరించారు. సుఖం చేత పొగరు. దుఃఖం చేత దీనత్వం పొందకపోతే మోక్షం పొందినట్లే.

"రాజునకు కావలసిన వారు, అక్కరలేనివారు ఎట్లాంటి వారై ఉంటారో చెప్పమని ధర్మరాజు అడిగినపుడు భీష్ముడు

ఉ. **తాలిమిఁ బేర్చువారలును, ధర్మవిధిజ్ఞులు, సత్యవంతులున్**
లోలత లేనివారు, మదలోభ నిరర్థక కోపహీనులు
నీ్మల సమేతులుం బలుకనేర్చుట కార్యము కాన్పు పెంపుమైఁ
జాలుట గల్గు భృత్యులును, సంపద సేయుదు రాత్మ భర్తకున్

ఓర్పు గలవారు, ధర్మ శాస్త్రాలు ఎరిగినవారు, సత్యవంతులు, చపలబుద్ధి లేనివారు, పొగరుగాని, పేరాశగాని, కోపంగాని లేనివారు, చక్కటి నడవడి కలవారు, మాటకారితనం, పనులలో శ్రద్ధ ఎంతో అనుకూల్యం ఉండే సేవకులు, తమ యజమానికి సకల సంపదలు పొందిస్తారు.

ఉ. **క్రూరుఁడు లోభియున్ శఠుఁడు గొండియుఁడున్ జడుడుం గృతఘ్నుడున్**
నేరనివాఁడు బొంకరియు నిందకునోర్చు నతండుఁ బందమున్
ధీరత లేమి దుర్నయ మతివ్యసనత్వము గల్గువారలుం
జేరువ నున్ని భూపతికిఁ జెట్ట మొనర్చు నరేశ్వరోత్తమా!

క్రూరుడూ, పేరాశపరుడూ, మూర్ఖుడు, చాడీలు చెప్పేవాడూ, మందగొడి, చేసిన మేలు మర్చిపోయేవాడు, తెలివిమాలిన వాడూ, అబద్దాలాడేవాడు, నిందపడేవాడు, పిరికివాడు, తెగింపులేనివాడు, నీతిమాలినవాడు,

మితిమించిన చెడు అలవాట్లు కలవాడూ, రాజునకు దగ్గరగా ఉంటే ఆపద ముంచుకొస్తుంది. ఉదాహరణగా నాడీజంఘుని కథను చెప్పుకోవచ్చు. వ్యాసభగవానుడు ఏ తాత్పర్యంతో భారతాన్ని రాశారన్నదానికి అంటే అన్నదానికి ఆయన స్పష్టంగానే చెప్పారు.

ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ
యదిహాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి, న తత్ క్వచిత్

నాలుగు పురుషార్థాలకు సంబంధించిన సర్వ విజ్ఞానమూ ఇందులో ఉంది. ఇక్కడ లేనిది మరెక్కడా లేదు. అనగా శ్రీమహాభారతాన్ని ఆయన పురుషార్థ విజ్ఞాన సర్వస్వంగా రూపొందించారు.

భారతాన్ని ఆయనరాసి ఏమి సాధించినట్లు అన్నదానికి

న జాతు కామా న్న భయా న్న లోభాత్
త్యజేద్ధర్మం జీవితస్యాపి హేతో
ధర్మో నిత్యః సుఖ దుఃఖే త్వనిత్యే
జీవో నిత్యో హేతు రస్య త్వనిత్యః

కామం వలన గానీ, భయం వలన గాని, లోభం వలన గాని చివరకు జీవితం కోసం గాని, ధర్మాన్ని విడువరాదు. ఎందుకంటే ధర్మము నిత్యమైనది. సుఖదుఃఖాలు అనిత్యాలు. జీవుడు నిత్యుడు. దానికి కారణమైన అజ్ఞానం అనిత్యమైంది. ఈ మూల సూత్రాన్ని భారత ఇతిహాసం ద్వారా సర్వమానవులకు నిరూపించటం లక్ష్యంగా భారతం ఏర్పడింది. ఇందులోని ధార్మికాంశాలు వందల సంఖ్యలో మనకు దర్శనమిస్తాయి. ఈ వ్యాసంలో నేను తెలిపిన అంశాలు చాలా సంక్షిప్తమని తెలియజేస్తున్నాను.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమదాంధ్ర మహాభారతం (శాంతి పర్వం 1, 2, భాగాలు)
- తితిదే తిరుపతి 2012

2. మహాభారత ధర్మ శాస్త్రము (శాంతి, అనుశాసనిక పర్వములు - వచనం)
- కొండేపూడి సుబ్బారావు, ప్రసన్న భారతి గ్రంథమాల, విశాఖపట్టణం, 2001

3. కవిత్రయ భారత ప్రతిపర్వ వివేచనం
- ఆచార్య గల్లా చలపతి, అభినందన గ్రంథం. సంపా. కోసూరి దామోదర నాయుడు, ఎస్వీయు, తిరుపతి, 2011

4. మహాభారత తత్త్వ కథనం (ప్రథమ సంపుటం)
- బ్రహ్మశ్రీ వారణాసి సుబ్రహ్మణ్య శాస్త్రి విరించి చారిటీస్, రాజమండ్రి, 2003

❖❖❖

నన్నయ భారతంలో మానవీకరణలు, జంతుత్వారోపణలు - ఒక విశ్లేషణ

కవితశ్రీ డాక్టర్ డి.శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు, బి.టి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మదనపల్లె.

ఉపోద్ఘాతము :

ప్రాచీన భారతీయ సాహిత్యంలో మానవేతర ప్రాణులైన పక్షులు, సర్పాలు, జంతువులు; అప్రాణులైన వృక్షాలు, పర్వతాలు, నదులు, సరస్సుల లాంటివి పాత్రలుగా దర్శనమిస్తాయి. అంతమాత్రాన అవేవీ కూడా మనిషికీ, మానవప్రకృతికీ, మానవప్రవృత్తికీ దూరంగా జరిగిపోయినవి కావు. అవి అన్నీ కూడా మనిషికీ, మానవత్వానికీ ప్రాతినిధ్యం వహించేవే. ఇలా మానవేతరమైన ప్రాణుల్లో, అప్రాణుల్లో మానవత్వాన్ని ఆరోపించడాన్ని కవిత్వంలో సాంకేతికంగా పర్సానిఫికేషన్ అని అంటారు. దానిని తెలుగులో మానవత్వారోపణ అనీ మానవగుణారోపణ అనీ మానవీకరణ అనీ అనవచ్చు. పర్సానిఫికేషన్ అనేదాన్ని "వస్తువులకీ, అమూర్తభావాలకీ, జంతువులకీ, ప్రకృతి విషయాలకీ మానవస్వభావాన్నీ, రూపాన్నీ, లక్షణాలనీ ఆపాదించడం ద్వారా చెప్పే టెక్నిక్‌ని పర్సానిఫికేషన్"[1] అని నిర్వచించడం జరిగింది. మన ప్రాచీన భారతీయ సాహిత్యంలో ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే అందులో మానవీకరణలే కాకుండా మానవులలో జంతులక్షణాలను ఆరోపించడం కూడా కనబడుతుంది. దీన్ని జంతుత్వారోపణం అనీ, జాంతవ్యారోపణం అనీ అనవచ్చు. ఈ వ్యాసంలో నన్నయ కృతమైన ఆంధ్రమహాభారత భాగంలో ఉన్న మానవీకరణలు, జంతుత్వారోపణల్ని చర్చించడం జరిగింది.

విషయ ప్రవేశం :

మన పూర్వ భారతీయ సాహిత్యంలో కనబడే మానవీకరణలు, జంతుత్వారోపణలు పైకి అవి అన్నీ ఒకేలా అనిపించినా సూక్ష్మంగా పరిశీలించి చూస్తే వాటిలో కొన్ని అవాంతరభేదాలు కనబడతాయి. నన్నయ కృతమైన భారతభాగంలో కనబడే మానవీకరణలు, జంతుత్వారోపణలని కిందివిధంగా విశ్లేషించవచ్చు.

1. జంతువుల్లో మానవత్వారోపణ :

నన్నయ కృతమైన మహాభారత కథలో పాత్రధారులుగా మొట్టమొదట జంతువులే ప్రవేశిస్తాయి. సూతుడు శౌనకాదులకు మహాభారత పర్వానుక్రమణిక చెప్పిన తర్వాత 'కురుక్షేత్రంలో జనమేజయుడు సర్పయాగం చేశాడు' అని ఒక ఎత్తుగడ ఇవ్వడంతో కథ ప్రారంభమవుతుంది. అలా కథ ప్రారంభం కావడమే జంతువులతో ప్రారంభమవుతుంది. జనమేజయుడు చేస్తున్న సర్పయాగ ప్రాంతానికి దేవశుని అయిన సరమ కుమారుడు సారమేయుడు క్రీడార్థం వచ్చి తిరుగుతుంటే జనమేజయుని తమ్ముళ్ళు అది గమనించి, కోప్పడి దాన్ని కొట్టారంట. అది అరుస్తూ పరుగెత్తిపోయి తన తల్లి అయిన సరమకు ఆ విషయం చెప్పిందట. సరమ అతికోపాన్వితయై జనమేజయుని వద్దకు వచ్చి "క్షితినాథ! కడు నకరుణా / న్వితులై నీతమ్ము లతివివేకవిదూరుల్ / మతి దలపక నా పుత్రకు / నతిబాలకు ననపరాదు నడచిరి పెలుచన్" "తగునిది తగదని యెదలో / వగవక సాధులకు బేదవారల కెగ్గుల్ / మొగి జేయు దుర్వినీతుల / కగు ననిమిత్తాగమంబులయిన భయంబుల్" అని పరుషంగా మాట్లాడి అదృశ్యం అవుతుంది. ఇక్కడ సరమ, సారమేయుడు బడుగువర్గాలకు ప్రతినిధులు. ప్రాచీన భారతంలో ఉన్నతవర్ణాల ప్రస్తావనలకు, వాళ్ళు ఉన్నచోట్లకు బడుగువర్గాలవాళ్ళు పోతే అక్కడ వాళ్ళకి ఎలాంటి ట్రీట్మెంట్ ఉండేదో తెలుసుకోడానికి ఇది చక్కని ఘట్టం. ఆ కారణంగా తమ హక్కుల్ని కాలరాస్తే బడుగువర్గాల వాళ్ళు ఎలా స్పందించేవాళ్ళో తెలుసుకోడానికి కూడా ఇది చక్కని ఉదాహరణ. తర్వాత సరమ శాపానికి

భయపడి జనమేజయుడు శాంతిక, పౌష్టిక క్రియలు నిర్వహిస్తాడు. అన్యాయానికి దోపిడీకి గురైన మూలవాసులకు, ఇక్కడ వచ్చి సహజవనరుల్ని వశం చేసుకున్న పరదేశీయులకు లేదా ఆ పరదేశి - మూలవాసి ఉమ్మడి సంతానమైన ఉన్నత వర్ణాలకు మధ్య నిత్యం ఒక పొసగనితనం, ఒక అపనమ్మకం రాజ్యమేలేదని గ్రహించడానికి కూడా ఇది మంచి ఉదాహరణ. మరి సరమకు జనమేజయుని తమ్ముళ్ళని 'అతివివేకవిదూరులు' 'దుర్వినీతులు' అనేంత ధైర్యం ఎలా వచ్చింది? అంటే....బహుశా సరమ మామూలు శునకం కాదు. అది దేవశుని కాబట్టి కాబోలు. ఏది ఏమైనా ఇలా జంతువులైన సరమలో, సారమేయుడిలో మానవత్వం ఆరోపించబడింది. సరమ బిడ్డైన కుక్కపిల్లకి నన్నయ దేవశునికొడుకు, సారమేయుడు, కుర్కురకుమారుడు, సారమేయుని అని మహద్వాచక ప్రత్యయాలు, "అది అఱచుచున్ పరతెంచి...." అని అహమద్వాచక ప్రత్యయాలూ వాడినాడు. సరమకు "అదృశ్య" అని మహతీవాచకం వాడినాడు. ఇవి గమనించదగ్గ విషయాలు.

ఆదిపర్వం, సప్తమాశ్వాసంలో వసిష్ఠమహర్షి వృత్తాంతంలో అతని హోమధేనువైన నందిని మనుష్యభాషలో మాట్లాడుతుంది. తన అద్భుతశక్తులతో పలురకాల భోజన పదార్థాలను సృష్టించి, అతిథిగా వచ్చిన విశ్వామిత్రునికి అతని పరివారానికి విందు చేస్తుంది. అలాగే వసిష్ఠుని వద్దనుండి తనని బలవంతంగా తీసుకెళ్లాలని ప్రయత్నించిన విశ్వామిత్రుని తన అద్భుతశక్తులతో వివిధరకాల సేనలను సృష్టించి యుద్ధం చేయించి ఓడిస్తుంది. ఖాండవదహనంలో సర్పమైన అశ్వసేనుడు, పక్షులైన జరిత, ఆమె పుత్రులు జరితారి, సారిసృక్కు, స్తంబమిత్ర, ద్రోణుడు పాత్రలుగా కనబడతారు.

2. మానవుల్లో జంతుత్వారోపణ :

ఉదంకుడు తన గురుపత్ని కోసం పౌష్యుని దేవి వద్ద కుండలాలు తీసుకుని పోతున్నప్పుడు సర్పమైన తక్షకుని ఉదంతం వస్తుంది. ఆ తర్వాత తక్షకుడు పరీక్షిత్తుని కాటువేసి చంపడం నుండి జనమేజయుడు సర్పయాగం చేయడం, సర్పహననం చెయ్యడం, ఆస్తీకుడు దాన్ని ఆపుదల చెయ్యడం వరకూ సర్పజాతి ప్రస్తావన ఉంటుంది. అయితే ఈ సందర్భంలో ఈశాన్యభారతంలోని నాగజాతి ప్రజలను ప్రతీకాత్మకంగా సర్పాలని అన్నారని గ్రహించాలి. ఆర్యులకు ఇక్కడి స్థానిక జాతులు సులభంగానే లోబడిపోయాయి. తుదకు ద్రవిడజాతి కూడా చాలావరకూ లోబడిపోయింది. వాళ్ళ ఆలోచనాసరళిని, సంస్కృతిని అంగీకరించి తలదాల్చింది. కానీ ఈశాన్య భారతంలోని నాగజాతి జనులు మాత్రం లొంగిపోలేదు. వాళ్ళు తమ అస్తిత్వాన్ని నిలుపుకోడానికి, చాటుకోడానికి ఆర్యులతో ఏదో ఒక రూపంలో పోరాడుతూనే ఉన్నారు. అందువల్ల సదరు నాగజాతి జనులు చలంపట్టిన పాములాగా శత్రుత్వం వీడనివాళ్ళని అర్థం వచ్చేలా వాళ్ళని సర్పజాతిగా మన పౌరాణిక సాహిత్యంలో చిత్రీకరించారు. వాళ్ళ నివాసం పాతాళం అనడానికి కారణం వాళ్ళ నివాసప్రాంతాలైన నాగాలాండ్ మొదలైన ఈశాన్య రాష్ట్రాలు లోతట్టు ప్రాంతాలు కావడమే. అందువల్ల వీళ్ళ విషయంలో జంతువుల్ని మానవీకరించడం జరిగిందా? లేదా మానవుల్లో జంతుత్వం ఆరోపించడం జరిగిందా? అన్న సందేహం కలుగుతుంది. కానీ సర్పయాగంలో పేర్కొన్న సర్పాలు నాగజాతి ప్రజలు అని తెలుసుకున్నప్పుడు అది మానవులలో జంతుత్వారోపణమే అని స్పష్టం అవుతుంది. ఈ గ్రహింపుకు కొన్ని ఉపపత్తులు భారతంలోనే ఉన్నాయి. అవి : 1.తక్షకుడు ఉదంకుని వద్దనుండి కుండలాలు కాజేయడానికి వచ్చినప్పుడు అతడు నగ్నవేషధరుడై వచ్చాడట. తక్షకుడు సర్పమే అయితే అక్కడ దుస్తుల ప్రసక్తే లేదు. అతడు మనిషి కాబట్టే రచయిత అతని నుండి ఆహార్యం ఆశించాడు. 2.తక్షకుడు భూవివరంలో పాతాళానికి వెళ్ళితే అందులో గుండానే ఉదంకుడు కూడా పాతాళానికి వెళ్ళాడనడం వల్ల అది వట్టి అభూతకల్పన అని, వాళ్ళు ఇద్దరూ కూడా పోయింది భూమార్గమే అనీ తెలిసిపోతోంది.

3.ఈ కథలోనే సర్పకుల జనని కశ్యపుని భార్యల్లో ఒకరైన కద్రువ అని చెప్పడం వల్ల కూడా సర్పాలంటే మానవజాతే అని తెలుస్తోంది. 4. సర్పయాగాన్ని నిలుపుదల చేయించిన ఆస్తీకుడు సర్పజాతివాడైన వాసుకి చెల్లి జరత్కారువుకు, జరత్కారుమహర్షికి పుట్టినవాడని చెప్పడం కూడా ఈ కథలోని సర్పాలు మానవజాతి అనడానికి ప్రబలమైన సాక్షం.

3. మానవ - జాంతవ సంతానం :

మహాభారతంలో కనబడే మరొక విశేషం ఏమిటంటే ఇందులో కొన్ని మానవ పాత్రలు జంతుగర్భాల్లో జన్మిస్తాయి. అలాగే కొన్ని జంతుపాత్రలు మానవ గర్భాల్లో జన్మిస్తాయి. ఇంకొన్ని పాత్రలు మానవ-జాంతవ సంకరసంతానంగా దర్శనమిస్తాయి. వీటిని కిందిలా వర్గీకరించి విశ్లేషించవచ్చు.

3.1. మానవ సంతానంగా జంతువులు :

భారతీయ ఐతిహాసిక సంప్రదాయంలో సర్వ మానవజాతుల పుట్టుకకు మూలపురుషుడు కశ్యపమహర్షి. ఒకసారి అతని భార్యలైన వినత, కద్రువలు సంతానం కోరి ఆయనని చిరకాలం సేవించారట. అప్పుడు ఆయన "ఏమి కావాలో కోరుకోండి" అని అన్నాడు. అప్పుడు వాళ్ళలో కద్రువ అనలతేజులు, దీర్ఘదేహులు, అమితశక్తివంతులైన వేయిమంది కొడుకులు కావాలని కోరుకుందట. వినతేమో వాళ్ళకంటే బలాధికులైన పుత్రులు ఇద్దరు కొడుకులు కావాలని కోరుకుందట. మరి కశ్యపుడు పూర్వం పెద్దకాలం తపస్సు చేసి, పుత్రకామేష్టి చేశాడు కాబట్టి వాళ్లకు వాళ్ళు కోరిన విధంగా సంతానప్రాప్తి కలిగించాడు. తర్వాత కద్రువ గర్భంలో వాసుకి, ఆదిశేషుడు మొదలైన వేయి సర్పజాతులు పుట్టాయట2. వినత గర్భంలో అనూరుడు, గరుత్మంతుడు అని ఇద్దరు కొడుకులు పుట్టారంట. వీళ్ళలో సూర్యుని రథసారధిగా వెళ్లిన అనూరుడు మనిషా? పక్షా? జంతువా? అన్న వివరణ లేదు. కానీ గరుత్మంతుడు పక్షి అని వేరే చెప్పనక్కరలేదు. ఇలా మానవ సంతానంగా పశు పక్షాదులను చూపించడం వెనుక ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఉన్నాయని భాష్యాలు చెబుతుంటారు. అందులో ఎంత శాస్త్రీయత ఉందోగాని అలా చెయ్యడం వల్ల కథాశ్రవణంలో గానీ, పఠనంలో గాని ఉత్సుకత కలుగుతుందనడం మాత్రం నిజం.

3.2. జంతువుల సంతానంగా మానవులు :

మానవుడు, బ్రాహ్మణుడు అయిన జరత్కారునికి ,సర్పజాతివాడైన వాసుకి చెల్లి అయిన జరత్కారువుకు ఆస్తీకుడు పుట్టాడట. వేటకు వెళ్లి అడవిలో ఉన్న ఉపరిచరవసువు గిరికని తలచుకుని, వీర్యస్కలనం చేసుకుని, ఆ వీర్యాన్ని ఒక ఆకుడొప్పలో వేసి, ఒక గద్దచేత గిరికకు పంపగా, ఆ గద్దని మరొక గద్ద తాకడంవల్ల సదరు ఆకుడొప్పలోని వీర్యం చింది యమునానదిలో పడింది. దాన్ని ఆ నదిలో ఉన్న ఒక చేప (బ్రహ్మశాపం కారణంగా మత్స్యరూపంలో ఉన్న గంధర్వస్త్రీ అట. ఆమె పేరు అద్రిక) తాగి, గర్భం దాల్చి మానవులైన ఒక కొడుకు (మత్స్యరాజు), ఒక్క కూతురు (మత్స్యగంధి) పుట్టడానికి కారణమైంది.

3.3. మానవ-జాంతవ సంకరసంతానం :

గంగా-శంతనుల కథలో వసిష్ఠుని హోమధేనువైన నందిని దక్షప్రజాపతి కూతురైన సురభికి (సురభి కూడా గోవు), కశ్యపునికి పుట్టిందని చెప్పబడింది. అంటే జంతువులకు మానవులకు (ఒకవేళ కశ్యపుడు దేవుడని అనుకుంటే ఆ దేవతలకు జంతువులకు) సంకరమై జంతుసంతానం కలిగిందని చెప్పబడింది.

3.4. శాపకారణంగా జంతువులుగా మారిన మానవులు :

అమృతహరణార్థం పోతున్నప్పుడు గరుత్మంతుడు "నిషాధఖాదనంబున నాకలి వోవకున్నది. నా కాహారంబు

ప్రసాదింపుము" అని కశ్యపుని వేడుకున్నప్పుడు, కశ్యపుడు చెప్పిన 'గజకచ్ఛప వృత్తాంతం'లో గజకచ్ఛపాల రూపంలో శాపకారణంగా మానవులు జంతువులుగా మారిన పాత్రలు కనబడతాయి. అలాగే మత్స్యగంధి వృత్తాంతంలో బ్రహ్మశాపం వల్ల అద్రిక అనే గంధర్వస్త్రీ చేపగా యమునా నదిలో ఉండినదని చెప్పబడింది. అర్జునుడు మణిపురంలో చిత్రాంగదను పెళ్ళాడాక అక్కడ సముద్రతీరంలో ఉన్న పంచతీర్థాల్లో తీర్థస్నానాలు చేస్తూ వాటిల్లో ఒక మునిశాపం కారణంగా మొసళ్ళుగా ఉన్న ఐదుమంది అప్సరసల్ని శాపవిముక్తుల్ని చేశాడట. (శాపవిముక్తి పొందిన అప్సరసలు : సౌభద్రం అనే తీర్థంలో – వంద. పౌలోమంలో – సౌరభేయి. కారంధమలో – సమీచి. ప్రసన్నంలో – బుద్బుద. భారద్వాజంలో – లత)

3.5. ఇష్టపూర్వకంగా జంతువులుగా మారిన మానవులు :

పాండురాజు వేటకుపోయి మిథునక్రీడలో ఉన్న రెండు జింకలను బాణాలతో కొట్టి చంపినప్పుడు కొనప్రాణంతో ఉన్న మగజింక అతనితో మానవభాషలో "ఓ పాండురాజు నేను 'కిందముడు' అనే మహర్షిని. ఈ అడవిలో మృగాలు స్వేచ్ఛగా సంభోగించుకోవడం చూసి, మేము కూడా అలా క్రీడించాలని ఆశపడి నా భార్యతో ఇలా మృగరూపాలు ధరించి సంభోగించుకుంటున్నాం..." అంటూ మాట్లాడింది. వాళ్ళ మధ్య వాదోపవాదాలు జరుగుచుండగా చివరకు ఆ మృగాలు "సర్వప్రాణులకు సాధారణంబయి యిష్టంబగు సుఖావసరంబున నున్న మమ్ము ననపరాధుల వధించితి గావున నీవునుం బ్రియా సంగమం బయిన యప్పుడ పంచత్వం బొందెదు మని నీ ప్రియము నిన్ను ననుగమించు" అని శపించి చనిపోయాయట. ఇలా ఇష్టపూర్వకంగా జంతువులుగా మారిన పాత్రలు కూడా మహాభారతంలో ఉన్నాయి.

3.6. కామరూపశక్తి కారణంగా జంతువులుగా మారినవాళ్ళు :

ఇంద్రప్రస్థంలో సుఖంగా ఉన్న పాండవులకు హితోపదేశం చెయ్యడానికి వచ్చిన నారదుడు వాళ్ళకి చెప్పిన సుందోపసుందుల కథలో సుందోపసుందులు బ్రహ్మవరంచేత కామరూపశక్తి లభించగా వాళ్ళు సింహం, పెద్దపులి, ఏనుగు మొదలైన రూపాలు ధరించి అడవుల్లో తిరుగుతూ, మునిపల్లెల్లో ప్రవేశించి మునులకు ప్రాణభయం కలిగించారని చెప్పబడింది.

3.7. అవసరం కారణంగా జంతువులుగా మారినవాళ్ళు :

ఖాండవదహన సందర్భంలో జనమేజయుడు అడగ్గా వైశంపాయనుడు చెప్పిన మందపాలోపాఖ్యానంలో మందపాలుడు తనకు పుత్రసంతానం లేనందువల్ల స్వర్గానికి పోలేక ఆ విషయాన్ని దేవతలచేత తెలుసుకొని త్వరగా పుత్రప్రాప్తి పొందాలని అందుకు పక్షులు సహకరిస్తాయని తాను ఒక మగ లావుకపక్షిగా మారి జరిత అనే ఆడ లావుక పక్షిని పెళ్ళాడి పుత్రలాభం పొందాడని చెప్పబడింది.

4. అప్రాణుల్లో మానవత్వారోపణ :

మన పౌరాణిక సాహిత్యంలో గాలి (వాయుదేవుడు), నీరు (గంగాదేవి), అగ్ని (అగ్నిదేవుడు), భూమి (భూదేవి), ఆకాశం (ఆకాశవాణి) లాంటి పంచభూతాలను; వృక్షాలు, నదులు, పర్వతాలను పాత్రలుగా పెట్టడం కనబడుతుంది. పంచభూతాలు పాత్రలుగా సర్వత్రా కనబడతాయి. శకుంతలోపాఖ్యానంలో ఆమెకు సరస్వతి (ఆకాశవాణి) "నీ బిడ్డైన భరతుడు గొప్పవాడై నూరు వాజపేయయాగాలు చేస్తాడు" అని చెప్పిందట. దుష్యంతుడు శకుంతలను స్వీకరించకుండా "కాదు పొమ్మ"న్నప్పుడు దివ్యవాణి "గొనకొని వీడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు; సేకొని భరియింపు మీతని; శకుంతల సత్యము వల్కె సాధ్వి సద్వినుత మహాపతివ్రత వివేకముతో" అని అన్నదట. విష్ణుమూర్తి అమృతాన్ని రాక్షసుల వద్దనుండి అపహరించి, దేవతలకిచ్చి, వాళ్ళు

దాన్ని ఆరగిస్తున్నప్పుడు రాహుకేతువులు, సూర్యచంద్రులు పేర్కొనబడ్డారు. మరి ఆ పాత్రలు అప్రాణులు. అంతరిక్షలో ఉన్న నక్షత్రగ్రహాలు, ఉపగ్రహాలు, గరుత్మంతుడు అమృతహరణార్థం పోతున్నప్పుడు కశ్యపుడు చెప్పిన 'గజకచ్ఛప వృత్తాంతం'లో రోహిణం అనే వృక్షం పాత్రగా దర్శనమిస్తుంది. పాండురాజు శాపవృత్తాంతంలో చనిపోయిన వ్యుషితాశ్వని కౌగిలించుకొని అతని భార్య అయిన భద్ర విలపిస్తుండగా అతని శరీరంలో నుండి ఒక దివ్యవాణి సంభాషించిందట. ఆ దివ్యవాణి చెప్పినట్లు చేసి ఆమె ఏడుమంది కొడుకుల్ని కన్నదట. పాండురాజు తన భార్యలతో బాటు శతశృంగపర్వతంలో ఉండగా కుంతి గర్భంలో యముని వరంతో ధర్మరాజు పుట్టాడు. అతనికి ఆకాశవాణి యుధిష్ఠిరుడు అని పేరు పెట్టిందట. వాయుదేవుని వరంతో మరొక బిడ్డ పుట్టాడు. అతనికి దివ్యవాక్పతి 'భీముడు' అని పేరు పెట్టిందట. ఇంద్రుని వరంతో ఇంకొక్క బిడ్డ పుట్టాడు. అతనికి దివ్యవాణి అర్జునుడు అని పేరు పెట్టిందట. అశ్వనీ దేవతల వరాన మాద్రి గర్భంలో ఇద్దరు బిడ్డలు పుట్టారు. వాళ్ళకి ఆకాశవాణి నకులుడు, సహదేవుడు అని నామకరణం చేసిందట. ఆదిపర్వం, సప్తమాశ్వాసంలో వసిష్ఠమహర్షి వృత్తాంతంలో తన నూరుమంది కొడుకుల్ని కల్మాషపాడుదు చంపివేయగా వసిష్ఠుడు ఆత్మహత్య చేసుకోవాలని దవాగ్నిలో ప్రవేశించగా ఆ అగ్ని భయపడి ఉష్ణాన్ని కోల్పోయి చల్లబడిందట. మెడకు రాయి కట్టుకుని సముద్రంలో దూకగా సముద్రం కూడా భయపడి తన అలలతో అతన్ని ఎత్తిపట్టి ఒడ్డుకు చేర్చిందట. మొసళ్ళున్న ఒక నదిలో దూకగా అది అతన్ని అంటడానికి భయపడి నూరుదారుల్లో పారి మెరకైపోయిందట. అప్పటి నుండి ఆ నది శతద్రు (సట్లేజ్) అని పేరువోయిందట. తాళ్ళతో శరీరాన్ని బంధించుకుని మరొక్క నదిలో దూకగా అది ఆయన పాశాలని విడిపించి ఒడ్డుకు చేర్చిందట. అప్పటి నుండి అది విపాశ (బియాస్ లేదా సరస్వతి లేదా వసిష్ట) అని పేరుపోయిందట. అంటే ఇక్కడ అగ్ని, సముద్రం, నది పాత్రలుగా చెప్పబడ్డాయి.

4.1. అప్రాణుల సంతానంగా మానవులు, జంతువులు, వస్తువులు :

దేవతలు – రాక్షసులు కలసి అమృతం కోసం సముద్రాన్ని చిలికినప్పుడు అందులో నుండి మొదట విషం పుట్టింది. అయ్యుండవచ్చు. ఆ తర్వాత సముద్రజలంలో నుండి జ్యేష్ఠ, చంద్రుడు, లక్ష్మి, ఉచ్చైశ్రవం అనే తెల్లని గుర్రం, కౌస్తుభం, ఐరావతం అనే తెల్లని ఏనుగు, అమృతపూర్ణశ్వేతకమండల ధరుడైన ధన్వంతరి ఇంకా అనేకం ఉద్భవించడం జరిగింది. ఇక్కడ చూడండి జ్యేష్ఠ, లక్ష్మి, ధన్వంతరి వీళ్ళు దేవతలు లేదా మనిషిని పోలిన జీవులు. ఉచ్చైశ్రవం, ఐరావతం, కౌస్తుభం, అమృతపూర్ణశ్వేతకమండలం వస్తువులు. ఇక చంద్రుడు మనిషి కాదు. జంతువు కాదు. పక్షి కాదు. వస్తువూ కాదు. అంతరిక్షంలోని ఒక ఉపగ్రహం. ఏ వాచక ప్రత్యయం. వాడి ఈ సరంజామానంతటినీ పిలవాలో తెలియని ఇవన్నీ సముద్రజంలో నుండి పుట్టాయనడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో అంతుచిక్కదు. అందువల్ల ఈ ప్రాణులు లేదా వస్తువులు అనేవి సముద్రయాన సాధనాలు అంతగా అభివృద్ధి చెందని ఆ కాలంలో ఇరుపక్షాల (ఆర్య – ద్రావిడ) నుండి ఎవరో కొందరు సాహసికులు చేసిన సముద్రవ్యాపార లావాదేవీల ద్వారా సమకూరినవని అనుకుంటే సబబుగా ఉంటుంది.

ఉపరిచరవసువు చరిత్రలో కనబడే శుక్తిమతి ఒక నది, కోలాహలుడు ఒక పర్వతం. ఈ అప్రాణులు కలవగా వసుపదుడు, గిరిక అనే మానవసంతానం కలిగిందట. ఇక కురువృద్ధుడైన భీష్ముడు శంతనునికి – గంగకు పుట్టాడు. ఈ కథలో గంగ మానవ స్త్రీరూపధారిణి అయినదని చెప్పబడింది. అది ఎలానో మరి. సూర్యుని పుత్రిక అయిన తపతిని సంవరణుడు పెళ్లిచేసుకున్నాడు. ఈ సందర్భంలో సూర్యుడు మానవుని లాగా వశిష్ఠునితో సంభాషించడం కనబడుతుంది.

4.2. మానవ - అప్రాణి సంకరసంతానం :

పూరుని వంశస్తుడైన మతినారుని సరస్వతినది వివాహం చేసుకుందట. వాళ్ళిద్దరికీ త్రసుడు పుట్టాడట. అలాగే కుంతికి దుర్వాసుడు ఇచ్చిన మంత్రశక్తితో అప్రాణి, నక్షత్రం ఐన సూర్యుని వల్ల సద్యోగర్భంలో కర్ణుడు పుట్టాడట. ఈ సందర్భంలో సూర్యుడు మానవుడి లాగా వచ్చి కుంతితో సంభాషిస్తాడు. అంటే ఈ సందర్భాల్లో మానవ - అప్రాణి సంతానంగా మానవులు పుట్టినారని చెప్పబడింది. ఇంద్రుడు పంపిన 'జలపద' అనే దేవకన్యని చూపి శరద్వంతునికి వీర్యస్కలనం కాగా అది ఒక రెల్లుగడ్డిలో పడి ఒక మగబిడ్డ (కృపుడు) ఒక ఆడబిడ్డ (కృపి) పుట్టారంట. గంగానదిలో ఘ్రుతాచిని నగ్నంగా చూసి భరద్వాజుడు వీర్యస్కలనం చేసుకున్నాడు. దాన్ని తీసుకొచ్చి కలశంలో పెట్టగా దాని నుండి ద్రోణుడు పుట్టాడట. భరద్వాజుని స్నేహితుడు పృషతుడు అనే పాంచాలదేశపు రాజు భయంకరమైన తపస్సు చేస్తూ, ఒకరోజు ఆ పక్కనే పూలు కోసుకుంటున్న మేనక అనే అప్సరసను చూసి, వీర్యస్కలనం చేసుకుని, దాన్ని పాదంతో కప్పిపెట్టాడు. అందులో నుండి ద్రుపదుడు అనే మగబిడ్డ పుట్టాడట.

4.3. పుత్రకామేష్టి - సంతానప్రాప్తి :

భారతీయ సాహిత్యంలో కనిపించే మరొక్క విచిత్రమైన, అశాస్త్రీయమైన విషయం యజ్ఞం చేస్తే సంతానం కలగడం. మహాభారతంలో కూడా ద్రుపదుడు సంతానం కోరి 'యాజుడు' అనే మహర్షి చేత పుత్రకామేష్టి చేయించగా ఆ యజ్ఞకుండంలో నుండి ఇద్దరు బిడ్డలు పుట్టారంట. వాళ్లకి ఆకాశవాణి 'ధృష్టద్యుమ్నుడు, ద్రౌపది' అని పేర్లు పెట్టిందట.3

4.4. ప్రాణుల్ని వస్తువులుగా వాడడం :

దేవతలు రాక్షసులు అమృతం కోసం సముద్రాన్ని చిలికేటప్పుడు వాసుకిని కవ్వపు తాడుగా వాడుకున్నారట. ఇప్పటి వరకూ ఈ పత్రరచన కోసం ఈ శీర్షిక దృష్టితో నన్నయ భారతభాగంలో ఆదిపర్వం మాత్రం పరిశీలించడం జరిగింది. పత్రనిడివి పరిమితి దృష్ట్యా ఇక్కడితో ఆగిపోవడం జరిగింది. ఇంకా ఈ దృష్టితో మొత్తం మహాభారతాన్ని పరిశీలిస్తే మరిన్ని విశేషాలు లభించే అవకాశం ఉంది.

ముగింపు :

ఈ వ్యాస చర్చలో బయల్పడ్డట్టు భారతీయ పౌరాణిక సాహిత్యంలో మన పూర్వీకులైన సాహిత్యకారులు మానవేతర ప్రాణులైన జంతువులు, పక్షులను; అప్రాణులైన గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశాది పంచభూతాలను, వృక్షాలు, నదులు, సముద్రాలు, పర్వతాలు మొదలైన అప్రాణులను ; మానవ - జాంతవ - అప్రాణి సంకర సంతానాన్ని పాత్రలుగా కథనాలు చెయ్యడం జరిగింది. ఇలాంటి సంప్రదాయం ప్రపంచ భాషలలోని అన్ని సాహిత్యాలలోనూ కనబడుతుంది. అయితే ఇలా మానవేతర ప్రాణి, అప్రాణులను పాత్రలుగా పెట్టడానికి అనేకమైన కారణాలు ఉండవచ్చు. అందుకు కథనీ కథనాన్నీ మరింత కవిత్వీకరించడం; కథపట్ల ఆసక్తిని పెంచడం; కథలో ఉత్కంఠని పోషించడం; ప్రభావవంతమైన రసపోషణ చెయ్యడం; కులపరమైన, వర్ణపరమైన, మతపరమైన, జాతిపరమైన మనోభావాలు, అహాలు దెబ్బతినకుండా జాగ్రత్తపడ్డం; రాజ్యం నుండి, రాజ్యపాలకులైన క్షత్రియుల నుండి అభ్యంతరాలు రాకుండా మరుగుపరచి ప్రతీకాత్మకం చెయ్యడం లాంటి మార్మికమైన అంశాలు అందుకు కారణాలై ఉండవచ్చు. వ్యాసుని జన్మవృత్తాంతంలో వచ్చే గంధర్వస్త్రీ అయిన అద్రికను చేపగా, అర్జునుని తీర్థయాత్ర సందర్భంలో తారసపడే పంచాప్సరసలను మొసళ్ళుగా చూపించారు. వీటికి మాత్రం బ్రాహ్మణోత్కర్ష కారణంగా స్పష్టంగా జరుగుతుంది.

ఆధార గ్రంథాలు

1. శ్రీమదాంధ్ర మహాభారతము, కవిత్రయకృతము, ప్రచురణ : తి.తి.దేవస్థానములు, తిరుపతి, ఆగస్టు - 2000.
2. కవిత్వం - చర్చనీయాంశాలు, జి.లక్ష్మీనరసయ్య, ప్రచురణ : కవిసంగమం బుక్స్, జనవరి - 2021.

పాదసూచికలు :

1. కవిత్వం - చర్చనీయాంశాలు (పుట.54), జి.లక్ష్మీనరసయ్య
2. ఆంధ్రమహాభారతం, ద్వితీయాశ్వాసం, గరుడోపాఖ్యానం
3. అంతర్జాలం : కోరా, వికీపీడియా మొదలైన సామాజిక మాధ్యమాలు.

❖❖❖

నారద రాజనీతి - ఆధునిక పాలనా సూత్రాలు

డాక్టర్ కరణం శ్రీనివాసులు రెడ్డి, తెలుగు అధ్యాపకులు, సంజయ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పీలేరు.

వ్యాస సంగ్రహం :

మానవ ప్రస్థానంలో సమాజాలు ఏర్పడడం, అవి రాజ్యాలుగా అవతరించడం, పాలనా వ్యవస్థలు ఏర్పడడం అనే అంశాలు నాగరికతను కీలకమైన మలుపు తిప్పడంలోనూ, సమాజాన్ని సుస్థిరం చేసి కొనసాగింపునివ్వడంలోనూ కీలక పాత్ర పోషించాయి, పోషిస్తున్నాయి కూడా. ఆనాటి రాచరిక వ్యవస్థ నుండి నేటి ప్రజాస్వామిక వ్యవస్థ వరకు వ్యవస్థా రూపమేదైనా పాలన స్థిరంగా, సుభిక్షంగా, శాంతియుతంగా జరగడానికి కావలసినటువంటి పాలనా సూత్రాల నిర్మాణం అనేక రూపాల్లో నేటికీ జరుగుతూ వస్తోంది.

ఆ కాలంలో రామాయణ భారతాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, అనేక స్మృతులు స్పష్టమైన పాలనా సూత్రాలను, రాజనీతిని, రాజధర్మాన్ని వివిధ రూపాలలో పాలకులకు నిర్దేశించాయి. అవే ఆనాటి రాజులకు మార్గదర్శకాలుగా నిలిచాయి. అందునా మహాభారతంలో రాజనీతి, రాజధర్మం పేరుతో అనేక పాలన సూత్రాలను వివిధ సందర్భాల్లో వివిధ పాత్రల చేత చెప్పించడం మనం గమనించవచ్చు. ఆధునిక వ్యవస్థలు ఏర్పడే క్రమంలో ప్రధానంగా 20వ శతాబ్దం మొదటి భాగంలో వ్యవస్థ సూత్రాలు(Organization Principles), నిర్వహణ సూత్రాలు (Management Principles), పాలనా సూత్రాలు (Administrative Principles) పేరుతో కొంతమంది ప్రభుత్వ పాలనా శాస్త్రవేత్తలు, నిర్వహణ శాస్త్రవేత్తలు అనేక రకాల ప్రయోగాలు జరిపి శాస్త్రీయ పాలనా సూత్రాలను పేర్కొన్నారు. ఈ ఆధునిక వ్యవస్థ, పాలన, నిర్వహణ సూత్రాలు మహాభారతంలోని రాజధర్మాలతో సరిపోలుతున్నాయి. ఆధునిక నిర్వహణ శాస్త్రవేత్తలు (Management Scientists) మహాభారతాన్ని అందులో భాగంగా ఉన్న భగవద్గీతను గొప్ప నిర్వహణ శాస్త్రంగా నిరూపించే పరిశోధనలు, ప్రయత్నాలు విరివిగా జరుగుతున్నాయి.

వ్యాసం ముఖ్య ఉద్దేశం:

పరిచయంలో పేర్కొన్నట్టు మహాభారతంలో వివిధ సందర్భాలలో వివిధ పాత్రలు చేత నిర్దేశించబడినటువంటి రాజ ధర్మానికి మరియు పాలనా శాస్త్రంలో భాగంగా ఆధునిక పాలన నిర్వహణ శాస్త్రవేత్తలు పేర్కొన్న ఆధునిక పాలన సూత్రాలను సమన్వయం చేసి మహాభారతంలోని పాలనా సూత్రాలు ఆధునిక పాలన శాస్త్ర సూత్రాలతో ఎలా సరిపోలుతాయో తేల్చి చెప్పడం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

కీలక పదాలు (Key Words) : వ్యవస్థీకరణ వ్యవస్థ సూత్రాలు,సమన్వయం, లాంచనప్రాయం, పని విభజన, శాస్త్రీయ నిర్వహణ, రాజనీతి, రాజిత మంత్రము, శతైకవృద్ధి.

ఉపోద్ఘాతం:

వేద శాస్త్ర పురాణ ఉపనిషత్సారంగా విలసిల్లి, పంచమవేదంగా బాసిల్లి, భారతీయ విజ్ఞాన సర్వస్వంగా సకల శాస్త్ర కల్పవృక్షంగా ప్రశస్తి పొందినది మహాభారతం. విశ్వ శ్రేయస్సు కోసం వ్యాసమహర్షి నుండి జయ కావ్యంగా ప్రభవించి భారతంగా పెంపొంది మహాభారతంగా విస్తరించిన మహేతిహాసం భారతం. సూతుడన్నట్టు-

సీ. ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని, । యధ్యాత్మ విదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని, । కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహమని, । యైతిహాసికు లితిహాస మనియుఁ
బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ, । యం బని మహిఁ గొనియాడు చుండ
ఆ. వివిధ వేద తత్త్వవేది వేద వ్యా సుఁ । డాది ముని పరాశరాత్మజుండు
విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై । పరగు చుండ జేసె భారతంబు. (ఆదిపర్వం - 1-32)

ధర్మశాస్త్రం, వేదాంతం, నీతిశాస్త్రం, మహాకావ్యం, లక్షణశాస్త్ర లక్ష్యం,ఇతిహాసం,అనేక పురాణ సముదాయంగా పై పద్యంలో నన్నయ భారతాన్ని బహుముఖంగా దర్శించాడు. అంతేకాదు సకలశాస్త్ర సముదాయంగా మహాభారతం దర్శనమిస్తుంది. రాజనీతిశాస్త్రం, పాలనా శాస్త్రం, భౌతిక జీవశాస్త్రాలు, సాంకేతిక శాస్త్రాలు వంటి ఆధునిక శాస్త్రాలు పరిణిత రూపంలో మనకు కనిపిస్తాయి.

మహాభారతంలో ప్రధానంగా చెప్పబడింది ధర్మం. ఆ ధర్మం వైక్తికం నుండి మొదలై కుటుంబ, సామాజిక, రాజ్య ధర్మంగా మహాభారతంలో విస్తరించబడింది. నేటి సమాజంలోనూ వ్యక్తులు, వ్యవస్థలు మొదలుకొని రాజ్యం వరకు నిర్వర్తించాల్సిన విద్యుక్తధర్మాన్ని నారదుడు, విదురుడు, భీష్ముడు, శ్రీకృష్ణుడు మొదలైన పాత్రల చేత స్పష్టం చేశారు వ్యాసమహర్షి. ఆనాడు రాచరిక ప్రభుత్వ వ్యవస్థ అమల్లో ఉన్నది కాబట్టి రాజ్యము అంటే రాజు. రాజ్య ధర్మము అంటే రాజ ధర్మము అని అర్థం చేసుకోవాల్సి ఉంది. రాజు వ్యక్తిగత సంబంధాలు, రాజు -సామంత రాజులు, రాజు - ప్రజలు, రాజు- మంత్రి, రాజు - ఉద్యోగులు మధ్య ఉండాల్సిన సంబంధాలను మహాభారతం స్పష్టంగా నిర్దేశించింది. నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానం అవలంబించబడుతున్న ప్రస్తుత వ్యవస్థలో కూడా పాటించాల్సిన అనేక రాజ ధర్మాలు మహాభారతంలో కోకొల్లలుగా మనకు కనిపిస్తాయి.

రాజనీతి శాస్త్రం :

రాజనీతి ప్రధానంగా అధికారాన్ని గురించి అధ్యయనం చేసే శాస్త్రము అని హెరాల్డ్ లాస్వల్ (Herald Lasswell)-1902-1978) అభిప్రాయం. సమాజాన్ని నడిపించే అధికారం, ఆ అధికారం ఏర్పడే విధానం, దాన్ని అధికారాన్ని అమలు జరిపే తీరుతెన్నులు మొదలగు విషయాలను గురించి చేసే అధ్యయనమే రాజనీతి. ఎవరు, ఎప్పుడు, ఎలా అధికారాన్ని పొందుతారో దాన్ని వివరించే శాస్త్రమే రాజనీతి శాస్త్రము.

ఉడ్రో విల్సన్ (Woodrow Wilson-1856-1924) అభిప్రాయం ప్రకారం ఒక నిర్ణీత భూభాగంలో శాసనభద్ర ప్రభుత్వం గల పౌర సముదాయమే రాజ్యము. రాజ్యము దాని లక్షణాలు స్వభావము దాని అంగాలు అవి ఏర్పడే విధానాలు విధులు వీటిని గురించి తెలియజేసేది రాజనీతి శాస్త్రము. రాజ్యాంగాలలో ఒకటైన ప్రభుత్వము, దాని పనితీరు, పాలనా వ్యవహారాలూ అన్నీ ఒకప్పుడు రాజనీతి శాస్త్రంలో భాగంగానే ఉండేది.

ప్రభుత్వ పాలనకు సంబంధించి వేదాల మొదలుకొని రామాయణ మహాభారతాలు, కౌటిల్యుని అర్థశాస్త్రము, చైనాలో కన్ఫ్యూషియస్ రాజనీతి, పాలన సూత్రాలుబీ అబుల్ ఫజల్ ఐనీ అక్బర్, సిసిరో డి అఫీషియల్స్, మాఖియవెల్లి ప్రిన్స్ మొదలైన గ్రంథాల్లో వివరంగానే చర్చించారు. కానీ ప్రభుత్వ పాలన ఒక శాస్త్రంగా ఆవిర్భవించడం మాత్రం 19 శతాబ్దంలో జరిగింది. అమెరికాకు 28వ అధ్యక్షుడిగా పనిచేసిన థామస్ వుడ్రో విల్సన్ (1856- 1924) ప్రభుత్వ పాలన శాస్త్రాన్ని ఒక అధ్యయన విషయంగా నిలపడానికి విశేష కృషి చేశారు. వుడ్రో విల్సన్ 1887లో రాజనీతి శాస్త్ర త్రైమాసిక పత్రికలో ప్రచురించిన 'ద స్టడీ ఆఫ్

అడ్మినిస్ట్రేషన్' (The Study of Administration) అనే వ్యాసంలో ప్రభుత్వ పాలనా శాస్త్రాన్ని ఒక అధ్యయన విషయంగా గుర్తించాల్సిన ఆవశ్యకతను వివరించి రాజనీతి శాస్త్రం నుండి ప్రభుత్వ పాలన వేరు చేయడానికి బీజం వేశాడు. ఆ తర్వాత ఫ్రాంక్ జె గుడ్నవ్ (Frank JohnsonGoodnow-1859-1939),

ఎల్. డి. వైట్ (Leonard Dupee White- 1891-1958), మేరీ పార్కర్ ఫాలెట్ (Mary Parker Follett-1868-1933), హెన్రీ ఫేయల్ (Henry Fayol-1841-1925) వంటి వారు పాలనను ఒక శాస్త్రంగా తీర్చిదిద్దడంలో కృషి చేశారు. ప్రభుత్వ పాలనా శాస్త్రానికి శాస్త్రీయతను సంతరించి పెట్టి పాలన నియమాలను రూపొందించడంలో విశేష కృషి చేసిన వారు లూథర్ గల్లిక్ (Luther Halsey Gulicck-1892-193) మరియు లిండాల్ ఉర్విక్ (Lyndall Fownes Urwick-1891-1983). వీరు 1937లో రచించిన 'పేపర్స్ ఆన్ ది సైన్స్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్' (Papers on the Science of Administration) అనేది పాలనా శాస్త్రంలో ఒక మైలురాయిగా పేర్కొనవచ్చు. మొదటిసారిగా పాలనా నియమాలను POSDCORB అనే రూపంలో ఇమిడ్చి పాలనుకొక శాస్త్రీయతను అందించారు. వారు ఇదివరకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక వ్యవస్థలను వాటి పనితీరును విధానాలను పరిశీలించి వాటి ఆధారంగా పాలనా సూత్రాలను రూపొందించారు.

ఖాండవ దహనంలో అర్జునుడు దానవశిల్పి మయుడిని రక్షిస్తాడు. అందుకు కృతజ్ఞతగా మయుడు ఇంద్రప్రస్థంలో పాండవులకు అద్భుతమైన, అపూర్వమైన సభా మండపాన్ని నిర్మించి ఇస్తాడు. అందులో ధర్మరాజు ప్రవేశించిన శుభ సందర్భంలో నారదుడు ఆ సభా మండపానికి సూర్య తేజ సమానుడై ఆకాశం నుండి దిగివస్తాడు. అతిధి మర్యాదలు పూర్తయిన తర్వాత నారదుడు ధర్మరాజుకు రాజనీతిని ఉపదేశిస్తాడు.

అందులో ప్రభుత్వ పాలన వ్యవహారాల నిర్వహణ, నిఘా, సైనిక వ్యవహారాలు, మంత్రివర్గము, సామంత రాజులు, కోటలు - దుర్గాల నిర్వహణ, ప్రజలు, రైతులు, వర్తకులు మొదలగు వారితో రాజుకు ఉండాల్సిన సంబంధాలు, బంధువులు పుత్రులతో రాజు వ్యవహరించాల్సిన విధానము, ప్రణాళికలు, పని విభజన, ఉద్యోగుల ఎంపిక, రాజ్య మంత్రాంగం, ఆర్థిక వ్యవహారాలు, సైనిక వ్యవహారాలు, గూడచారి వ్యవస్థ ఇలా అనేక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. వేల సంవత్సరాల క్రితం నాటి నారద రాజనీతిలో నేటికీ మన పాలకులు పాటిస్తున్నటువంటి, పాటించాల్సినటువంటి ధర్మాలు, నిర్వహణ పద్ధతులు అనేకం కనిపిస్తాయి. అవి నేటి ఆధునిక పాలనా శాస్త్రవేత్తలు చెప్పిన పాలనా సూత్రాలతో చాలా మటుకు సరిపోలుతున్నాయి.

మానవ సమాజం ఏర్పడినది మొదలు మనిషి కార్యకలాపాల్లో అతి ముఖ్యమైన అంశం నిర్వహణ మానవ నిర్మిత వ్యవస్థల్లో ప్రాచీనమైనది ప్రాథమికమైనది అయినటువంటి కుటుంబం మొదలుకొని అనేక రకాల ఉత్పత్తి వ్యవస్థలు సాంస్కృతిక కార్యకలాపాలు సామూహిక వ్యవస్థ రూపాలను మానవుడు తయారు చేసుకున్నాడు. మానవ సమాజం విస్తరించే కొద్దీ అవసరాలు పెరిగేకొద్దీ అనేక వ్యవస్థ రూపాలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది అలా ప్రతి వ్యవస్థ ఒక లక్ష్యం కోసం లేదా సామూహిక ప్రయోజనం కోసం ఏర్పడి ఉంటుంది. లక్ష్యాల సాధన కోసం ప్రయోజన సిద్ధి కోసం నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకై వ్యవస్థను నడిపించడాన్నే నిర్వహణ అంటారు వ్యవస్థ యొక్క అంతిమ ప్రయోజనం వ్యవస్థ ప్రయోజనాలను లక్ష్యాలను సాధించడమే నిర్వహణ ద్వారా వ్యక్తిగత ప్రయత్నాలు సమిష్టి కృషి రెండింటి సమన్వయం జరిగి లక్ష్యసాధనను సుగమం చేయడానికి అవసరం ఏర్పడిన దృష్ట్యా నిర్వహణ ఒక శాస్త్రంగా ఎదగడానికి కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి తద్వారా శాస్త్రీయ నిర్వహణ పద్ధతులు ఉద్భవించాయి.

అందులో ప్రధానంగా శాస్త్రీయ నిర్వహణ పితగా పేర్కొనే వారు ఫెడరిక్ విన్స్లో టేలర్ 1856 1915 కొండ గుర్తులు స్థానంలో శాస్త్రీయ పని పద్ధతులను అభివృద్ధి పరచాలని టైలర్ సూచించాడు తన ప్రధాన సూత్రంగా కార్మికుల శాస్త్రీయ ఎంపిక శిక్షణ జరగాలన్నాడు కార్మికుల ఆసక్తులను అభిరుచులను తెలుసుకొని వారి శక్తి సామర్థ్యాలను లోపాలను అంచనా వేసి బాధ్యతలు అప్పగించాలన్నాడు

రాజ్య పాలనలో ఉద్యోగులది అత్యంత కీలకమైన స్థానం కాబట్టి అట్టి ఉద్యోగుల ఎంపిక వారికి పని అప్పగించడం వంటి అంశాలలో రాజు చాలా జాగరుకుడై ఉండాలి ఉద్యోగుల ఎంపిక పని విభజనలో టేలర్ శాస్త్రీయ నిర్వహణ పద్ధతులకు సరిపోలునట్లు నారదుడు ధర్మరాజుకు ఈ విషయాలపై తగు సూచనలు ఇస్తూ

క. ఉపధాశుద్ధుల బాప
వ్యపగత బుద్ధుల, వినీతివర్తుల, సములన్,
సుపరీక్ష నియోగించితె
నిపుణుల నర్థార్జనాదినృపకార్యములన్. (సభాపర్వం 1-36)

పన్నుల వసూలు వంటి రాచకార్యాలలో ధర్మ పరీక్షలు చేత పరిశుద్ధులైన వారిని పాపము లేని చిత్తవృత్తి గల వారిని నీతిమంతులను రాగద్వేషాలు లేకుండా అందరి విషయంలో సమ బుద్ధితో వ్యవహరించే వాళ్లను నేర్పు గల వారిని చక్కగా లోతుగా పరీక్షించి నియమించుకోవాలని సూచించాడు.

ఇలా నియమించుకున్న తర్వాత వారికి పని విభజన చేసి బాధ్యతలను ఎవరికి ఏ పనిని అప్పగించాలి అనే విషయంలో కూడా నారదుడు ధర్మరాజుకు చాలా స్పష్టమైన సూచనలు చేశాడు. అంతేకాక జీతభత్యాలు వంటి విషయాలలో రాజు జీతభత్యాల విషయంలో ఎలా వ్యవహరించాలో కూడా నేటి పాలకులకు కూడా వర్తించే విధంగా ఆనాడే నారదుడు ధర్మరాజుకు పలు నియమాలను నిర్దేశించాడు.

ఉ. ఉత్తమమధ్యమాధమనియోగ్యత బుద్ధి నెఱింగి వారి న
య్యుత్తమమధ్యమాధమనియోగములన్ నియమించితే నరేం
ద్రోత్తమ! భృత్యకోటికి సమానముగా దగు జీవితంబు లా
యత్తము సేసి యిత్తె దయ నయ్యయి కాలము దప్పకుండగన్. (సభాపర్వం 1-37)

ఉద్యోగ నియామకంలో అర్హత అత్యంత కీలకమైన విషయం దీనినే నారదుడు యోగ్యత అన్నాడు ఉత్తమ అర్హతలు ఉన్నత ఉద్యోగం, తక్కువ అర్హతలు చిన్న ఉద్యోగం అనే ఉద్యోగ నియామక సిద్ధాంతం ఆనాడే అమలులో ఉండేదనే దానికి ఈ పద్యం ఒక చక్కని ఉదాహరణ అలాగే ఉద్యోగులకు తగినంత జీతము ఆయా నిర్దేశిత కాలాల్లో దయతో తప్పకుండా చెల్లించాలనేది అప్పటినుండే ఒక సిద్ధాంతంగా అమలు చేస్తున్నారు ఈనాటి పాలకులు ఈ విషయం గుర్తిస్తే చాలు ఇప్పటికైనా అన్నట్లుంది నేటి పాలకుల పరిస్థితి అలాగే రాజకీయ కార్య నిర్వహణలో ఎటువంటి వారిని నియమించుకోకూడదు కూడా నారదుడు స్పష్టం చేశాడు.

క. ధనలుబ్ధుల, మ్రుచ్చుల గూ
ర్పనివారల బగఱ వలని వారల ధృతి చా
లనివారల, దుర్జనులం
బనుపవుగా రాజకార్యభారము దాల్పన్. (సభాపర్వం 1-41)

అని చెప్తూ ధనాశ కలిగిన వారిని దొంగలను ధైర్యం లేనటువంటి వారిని చెడ్డవారిని మనుషులతో కూడని వారిని రాజ్య కార్యాలలో నియమించుకోవద్దని తెలియజేశాడు.

హెన్రీ ఫెయిల్ 1841 1925 హిందీ ఫెయిల్ నిర్వహణ శాస్త్రం తో పాటు ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు సర్వీస్ నిబంధనలు సంస్కరణలు అంటే అంశాలపై విశేష పరిశోధన చేసి దిథీర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ ఇన్ ది స్టేట్ అనే ప్రామాణిక పరిశోధన పత్రాన్ని వెలువరించారు నిర్వహణ అనేది కేవలం పారిశ్రామిక లేదా వ్యాపార సంస్థల వ్యవహారాలకు మాత్రమే సంబంధించింది కాదని ప్రభుత్వ కార్యకలాపాలను నడిపే ఒక కల కూడానని పేర్కొని నిర్వహణను ప్రభుత్వ పాలనను విభజించడం హానికరమని తెలియజేశాడు ప్రతి వ్యవస్థ పాటించవలసిన విధులను ఫెయిల్ పేర్కొంటూ

1. సమర్థులైన ఉద్యోగులను ఎంపిక చేసి వారి సామర్థ్యానికి అనుగుణంగా పని కల్పించడం
2. విధులను స్పష్టంగా తెలియజేయడం.

సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించిన ఉద్యోగులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం మొదటి రెండు అంశాలకు ఇదివరకే పేర్కొన్న పద్యాలతో సమన్వయం కుదురుతోంది.

ఇక ఉద్యోగులకు ప్రోత్సాహాల విషయంలో నారదుడు ధర్మరాజుకు తెలియజేస్తూ

క. కులపుత్రులైన సద్భు
త్యులకును సత్కార మర్థితో జేయుదె వా
రలు నీప్రస్తవమున ని
మ్ముల గృతము దలంచి ప్రాణములు విడుతు రనిన్. (సభాపర్వం 1-39)

తనకు నిస్వార్థంతో వంశపారంపర్యంగా సేవ చేస్తున్న సేవకులను రాజు తప్పకుండా గుర్తుపెట్టుకుని వారి సేవలను గుర్తించి తగు రీతిలో సత్కారం చేయాలని అందువల్ల ఆ కృతజ్ఞతతో రాజు కోసం ప్రాణం ఇవ్వడానికైనా వారు సిద్ధంగా ఉంటారని సూచించాడు.

క. అనఘా! నీప్రస్తవమున
నని నీల్గిన వీరభటుల యనుపోష్యుల నె
ల్లను బ్రోతె, భోజనాచ్ఛా
దనముల వారలకు నెమ్మి దఱుగక యుండన్. (సభాపర్వం 1-40)

తనకోసం యుద్ధంలో మరణించిన వీరభటుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకొని పోషించాల్సిన బాధ్యత పాలకుడిదేనని నారదుడు ఉపదేశించాడు

రాజైనా సరే చేసిన మేలు మరువక మేలు చేసిన వారిని గుర్తించి సత్కరించాలని చెప్తూ

క. కృత మెఱిగి కర్త నుత్తమ
మతుల సభల సంస్తుతించి మఱవక తగు స
త్కృతి సేయుడె కృత మెఱిగెడు
పతియె జగజ్జనుల నెల్లబరిపాలించున్. (సభాపర్వం 1-46)

ఇదే అంశాన్ని నిర్వహణ శాస్త్రంలో మానవ సంబంధాల పితగా పేర్కొనే ఎల్టన్ మేయో 1880 1949 వెస్టర్న్ ఎలక్ట్రికల్ కంపెనీలో నిర్వహించిన వాతావరణ ప్రయోగాలు 1924 1932 నిరూపించాయి. శ్రామికులు లేదా పనివాళ్ళు కేవలం వేతన లాలూచీకి లొంగే ఆర్థిక మానవులు కాదని నిరూపించాయి. వ్యవస్థలో మానవ సంబంధాల ప్రాధాన్యం ఆర్థిక విషయాలను అధిగమిస్తుందని లాంచన ప్రాయమైన సంబంధాల కంటే లాంచన ప్రాయము కానీ మానవ సంబంధాలు వ్యవస్థా లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎల్టన్

మేయు నిర్వహించిన హాతార్న్ ప్రయోగాలు నిరూపించాయి. నిర్వహణ శాస్త్రానికి ఆధునిక సమాజ దృక్పథాన్ని అందించిన చెస్టర్ బర్నాడ్ 1886 1961 తన ఫంక్షన్స్ ఆఫ్ ఎగ్జిక్యూటివ్ గ్రంధంలో క్రింది అంశాలను స్పష్టం చేశాడు ఒకటి వ్యక్తి తాను చేసిన పనికి తగిన సంతృప్తి ఉంటుందని భావించినప్పుడే ఉత్సాహంగా పనిచేస్తాడు రెండు తన కృషికి పొందే ప్రేరణ అతనికి సంతృప్తి ఇవ్వగలగాలి మూడు కృషికి సంతృప్తికి మధ్య సమతుల్యాన్ని సాధించాలి.

చెస్టర్ బర్నాడ్ కార్యనిర్వహకుడు ప్రధానంగా నిర్వహించాల్సిన విధుల్లో మొదటిది వ్యవస్థ ప్రసారాల నిర్వహణగా పేర్కొంటాడు. ఇదే విషయాన్ని నారదుడు ధర్మరాజుకు ఉపదేశిస్తూ

"వార్తయంద జగము వర్తిల్లుచున్నది;
యదియు లేనినాఁడ యఖిల జనులు
నంధకారమగ్ను లగుదురు గావున
వార్త నిర్వహింపవలయుఁ బతికి" (సభాపర్వం 1-51)

అని చెప్పడం ద్వారా సమాచారానికి వార్తకు ఉన్న ప్రాధాన్యాన్ని వేల సంవత్సరాల క్రితమే గుర్తించి దానిని చక్కగా నిర్వహించాల్సిన బాధ్యత రాజుకు ఉందని తెలియజేశాడు.

ఇక సిస్టర్ బర్నాడ్ కార్య నిర్వాహకుని రెండవ విధిగా వ్యవస్థకు కావాల్సిన సేవలను రాబట్టడం కార్యనిర్వహణలో వారిని భాగస్వాములను చేయడం అందుకోసం వారికి తగిన ప్రోత్సాహకాలు కల్పించడం అని చెప్తాడు ఇదే విషయాన్ని నారదుడు కూడా ధర్మరాజుకు గుర్తుచేసి ఆదర్శవంతమైన రాజ్య పాలన విధానాన్ని నిర్దేశిస్తాడు.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయ ఆంధ్ర మహాభారతం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ.
2. ప్రభుత్వ పాలనా శాస్త్రం పరిచయం భావనలు సిద్ధాంతాలు తెలుగు అకాడమీ హైదరాబాదు.

❖❖❖

మహాభారతం - వివాహ వ్యవస్థ

డాక్టర్ యు.రమ్యజ్యోతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెండ్లిమర్రి, కడప జిల్లా.

ఆదిమానవుని కాలంలో స్త్రీ పురుషులు ఇద్దరూ వేటాడేవారు. కాలక్రమంలో వ్యవసాయాన్ని కనుగొని, స్థిర జీవితాన్ని ప్రారంభించాక, మగవారు ధాన్యాన్ని పండించేవారు. స్త్రీ ఇంటికి పరిమితమై పశుపోషణ, వంట మొదలైన పనులను నిర్వహించేవారు. పండించిన ధాన్యాన్ని కలిసి తినేవారు, కలిసి జీవించేవారు. ఆదిలో స్త్రీపురుష సంబంధాల్లో వావి వరుసలు ఉండేవి కావు. కానీ నాగరికత నేర్చి, బుద్ధి జీవునిగా ఆదిమానవుడు అవతరించాక వారి శారీరక అవసరాలు కాస్త, మానసికంగానూ బలపడటం ఆరంభమైంది. తద్వారా సంతానాన్ని కోరుకున్నారు. తమ బంధం జీవితాంతం నిలుపుకోవటానికి, బిడ్డల రక్షణ కోసం కలిసి ఉండటం ప్రారంభించారు. తమ అనుబంధానికి ఒక సామాజిక ఉనికిని, గుర్తింపును ఆపాదించుకోవాలని కోరుకున్నారు. పశు ప్రవృత్తి నుండి బయటపడి, ఒక క్రమబద్ధమైన, ఆమోదయోగ్యమైన సంబంధాన్ని వారు కోరుకోవడంతో రూపొందినదే వివాహ వ్యవస్థ. ఆ వ్యవస్థను పటిష్టం చేసుకోవడానికి కొన్ని నియమాలను రూపొందించారు. వివాహం కాలక్రమంలో ఒక సామాజిక అవసరంగా పరిణమించింది. రెండు జీవితాలను కలిపే ఒక వారధిగా, కుటుంబ జీవనానికి, సంఘ నిర్మాణానికి పునాదిగా వివాహ వ్యవస్థ ఏర్పడింది. మానవ జీవనం గాడి తప్పకుండా, ఇరు జీవితాలను కలిపే ఒక నియమబద్ధ సూత్రంగా రూపుదిద్దుకుంది వివాహ వ్యవస్థ.

ఆదిమ కాలంలోనే కాక పురాణ, ఇతిహాస యుగంలో కూడా స్త్రీ పురుషుల మధ్య నియమబద్ధ, ఆమోదయోగ్య సంబంధాలు లేకపోవటం గమనార్హం. అందుకే ఉద్దాలక మహర్షి కొడుకైన శ్వేతకేతు వివాహ వ్యవస్థను ఏర్పరచాడని భారతం చెబుతోంది. ఉద్దాలక మహర్షి భార్య ఋతుమతి అయిన సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి తనకు పుత్రుడు కావాలని ఆమెను కామించగా కొడుకైన శ్వేతకేతు కోప్పడి, అది ధర్మానికి విరుద్ధమైన కార్యమని, దాన్ని సహించలేక, వివాహిత స్త్రీలు ఎప్పుడు పరపురుషులను కోరుకోకూడదని, అలా పరపురుష సంగమం కోరుకుంటే సర్వపాపాలు కలుగుతాయని వివాహం అనే ఒక తంతును ఏర్పరచాడు. వివాహం ద్వారా స్త్రీ పురుషులు ఒక్కటై ధర్మమార్గంలో అర్థ, కామాలను పొందాలనే కట్టుబాటును కల్పించాడు. అదే విధంగా దీర్ఘతముడు తన తల్లి అయిన మమత గర్భంలో ఉండగా బృహస్పతి తన తల్లిని కామించడంతో గర్భంలో ఉన్న దీర్ఘతముడు దాన్ని వారించినందుకు బృహస్పతి శాపానికి గురై అంధుడయ్యాడు. జంతువుల్లోలా మనుషుల్లో స్వేచ్ఛా భోగం పనికిరాదని, దానిని వ్యతిరేకించాడు. అప్పటి నుండి ఒక స్త్రీకి ఒక పురుషుడు అనే కట్టుబాట్లు, నియమాలు ప్రారంభమయ్యాయని భారతం తెలుపుతుంది. సభాపర్వంలో బైదుడు అనే గురువుగారి దగ్గర ఉత్తంకుడు అనే శిష్యుడు విద్యను అభ్యసిస్తూ ఉండేవాడు. బైదుడు కార్యార్థి బయటికి వెళ్లినప్పుడు ఆయన భార్య ఋతుమతి అవుతుంది. అప్పుడు గురుకులంలోని స్త్రీలు ఉత్తంకున్ని గురుపత్నితో కూడమంటారు. దాన్ని ఉత్తంకుడు వ్యతిరేకిస్తాడు. భారత కాలం నాటికి శిష్యుడు గురుపత్నితో కలవడం సాధారణమైన విషయంగా ఉండేదని అర్థమవుతుంది. ఇది ఆనాటి సమాజ స్థితిని, వైవాహిక జీవితంలో హద్దులు లేని స్థితికి అద్దంపడుతుంది. సుదర్శనుడు తనకు మనుమరాలైన ఓఘవతిని వివాహమాడటం కనిపిస్తుంది. అతిథులకు ఓఘవతి తన శీలాన్ని ఆతిథ్యంగా ఇస్తుంటే సుదర్శనుడు అంగీకరించటం ఆనాటి కట్టుబాట్లు లేని సమాజాన్ని సూచిస్తున్నాయి. అప్పటి నుండే పాతివ్రత్యం, పత్నీవ్రతం

అనే సిద్ధాంతాలు వచ్చాయి. ఇవి ఆనాటి వివాహ సంస్కృతి వల్ల, స్వేచ్ఛా భోగం వల్ల వచ్చినవే కానీ, స్త్రీని కానీ, పురుషుడిని కానీ ఒక చట్రంలో బంధించటానికి కాదు. అయితే భారత కాలం నుండే వివాహ వ్యవస్థ భారతదేశంలో ప్రారంభమయ్యిందా అని ప్రశ్నించుకుంటే అంతకు పూర్వ యుగంలోనే సీతారాముల కళ్యాణాన్ని గురించి రామాయణం కూలంకషంగా వర్ణించినది. కదా.... కాబట్టి భారతదేశంలో వివాహ వ్యవస్థ ఫలానా సమయంలో, ఫలానా తేదీలో ప్రారంభమైనదని ఇదమిద్దంగా నిర్ణయించేందుకు అవకాశం లేదు.

మనిషి జీవితం బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం మరియు సన్యాసం అనే నాలుగు ఆశ్రమ ధర్మాలపై ఆధారపడి ఉంటుందని పెద్దల ఉవాచ. వీటిలో ఉత్తమోత్తమమైనది గృహస్థమని వారి అభిప్రాయం. కారణం గృహస్థుడే మిగిలిన ధర్మాలు నడవటానికి ఆధారభూతుడు అవుతున్నాడు. గృహస్థాశ్రమం వివాహంతో ప్రారంభమవుతుంది. కుటుంబ జీవనానికి, సంఘ జీవనానికి నాంది వివాహమే. భారతీయ సంస్కృతిలో వివాహ బంధానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అందుకే కాళిదాసు

వాగర్థా వివసంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగత: పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ!..

వాక్కు అర్థంలా కలిసున్న, లోకానికి అంతటికీ మాతాపితలైన ఆ పార్వతీ పరమేశ్వరులకు నమస్కరిస్తున్నాను అని స్తుతించాడు. పార్వతి పరమేశ్వరులను ఆది దంపతులుగా, జగత్తుకు మాతాపితలుగా కొలవటం విదితమే. ఇద్దరు స్త్రీ పురుషులు మాతా పితలు ఎప్పుడవుతారు? వారు ముందుగా భార్యా భర్తలు అయినప్పుడు. అందుకే నన్నయ కూడా

"శ్రీవాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షోముఖాజ్గేషుయే
లోకానాం స్థితి మావహన్త్య విహతాం స్త్రీ పుంసయోగోద్భవాం"

అంటూ భార్యా భర్తల అవిభాజ్య సంబంధాన్ని, అద్వైత సంబంధాన్ని కీర్తించాడు. పరోక్షంగా వివాహానంతరం స్త్రీ పురుషులు ప్రవర్తించాల్సిన తీరును యావత్ లోకానికి తెలియచేసాడు. అందుకే భారతం వివాహ ధర్మానికి, ఆదర్శ దాంపత్య జీవనానికి ప్రతిరూపంగా చెప్పవచ్చు.

భారతీయ సనాతన ధర్మంలో వివాహానికి ఎంతో విశిష్ట స్థానముంది. రామాయణ, భారత, భాగవతాలు దాంపత్య రామణీయకతను, వివాహ విశిష్టతను నొక్కి వక్కాణించాయి. ముఖ్యంగా వ్యాస విరచిత మహాభారతం సకల మానవాళికి ఆదర్శ గ్రంథం. గృహస్త ధర్మానికి ఆలవాలం. ఆధునిక కాలంలో వివాహపద్ధతుల్లో, దాంపత్య జీవనంలో మనం చూసే అంశాలన్నీ ఏనాడో రాయబడిన భారతంలో కూడా గోచరిస్తాయి. మనువు "అష్టౌ వివాహా భవన్తి" అని ఎనిమిది రకముల వివాహాలను పేర్కొన్నాడు. భారతంలో వాటిలో కొన్ని వివాహా రకాలు కనిపిస్తాయి.

1. బ్రాహ్మ వివాహము :

"ఆహూయా గుణవతే దానం బ్రాహ్మ:" ఎదుటివారు అడుగకుండా తానే వరునిని పిలిచి పిల్లనిచ్చి పెళ్లిచేయటం. ఈ వివాహంలో కన్యను ఇచ్చి వివాహం చేసేవాడు బ్రాహ్మ లోకాలను పొందుతాడని భావం. భారతంలో తపతీ సంవరుణుల వివాహం ఇందుకు ఉదాహరణ.

2. దైవ వివాహం :

యజ్ఞంలో ఋత్విక్కునికి కన్యను దానమిస్తే దానిని దైవ వివాహం అంటారు. అంటే యజ్ఞం చేస్తూ బ్రాహ్మణునికి దానం చేస్తే అది దైవ వివాహం. వరుడయ్యే లక్షణాలు ఉన్న వ్యక్తిని గుర్తించి, రుత్విక్కుగా

చేసుకుని యజ్ఞ దక్షిణ కాలంలో ఆ అమ్మాయిని ఇచ్చి వివాహం చేయడం దైవ వివాహం. ఈ వివాహం భారతంలో కనిపించరు.

3. ప్రజాపాత్యం :

"ఉభౌ ధర్మం చరతాం" - ఖరారు చేయించి, చేసిన కన్యా దానము. కన్యను వరుడు అడిగినప్పుడు కన్యాదాత తన అమ్మాయిని ఇచ్చి శాస్త్ర బద్ధంగా చేసే వివాహం ఇది. వరుడు ధర్మాన్ని అనుసరిస్తూ, అర్థ, కామ వాంచాలను తీర్చుకోవాలి. సన్యసించకూడదు. వేరే స్త్రీని పెళ్లాడకూడదు అనేది ఈ వివాహంలోని నియమం. మిగిలిన వివాహాల్లో ఆ నియమాలు కనబడవు. అందుకే ఈ ప్రజాపత్య వివాహ పద్ధతే నేటికీ కూడా లోకంలో ఆచరింపబడుతున్నది. కుంతీ పాండురాజులు, గాంధారి ధృతరాష్ట్రులు.

4. ఆర్షము :

రెండు గోవులను వరుని నుండి స్వీకరించి కన్యా దానము చేస్తే అది ఆర్ష వివాహము. ఇది కూడా భారతంలో కనిపించదు.

5. అసుర వివాహము :

క్రయము వరుని నుండి స్వీకరించి, కన్యను వరునితో వివాహం జరిపించుట అసుర వివాహము. ఒకరకంగా చూస్తే కన్యాశుల్క పద్ధతికి ఇది దగ్గరగా కనిపిస్తుంది. ఇటువంటి వివాహాలు భారతంలో మనకు కనిపించవు. అలా అర్జునుడికి తన కూతురైన చిత్రాంగదను ఇచ్చి వివాహం చేయడానికి శుల్కం అడుగుతాడు చిత్రవాహనుడు. తన కూతురికి పుట్టిన కుమారుడు తమ వంశం నిలిపేవాడు కావాలని ఆ శుల్కం ఇస్తేనే చిత్రాంగదను వివాహం చేసుకోమని అర్జునుడిని కోరుతాడు.

6. రాక్షస వివాహము :

స్త్రీ యొక్క బంధువులతో యుద్ధం చేసి కన్యను బలవంతంగా ఎత్తుకుపోవటం రాక్షసం. భారతంలో భీష్ముడు అంబ, అంబికా, అంబాలికలను అపహరించి, విచిత్ర వీర్యునికిచ్చి వివాహం చేశాడు. అదేవిధంగా రుక్మిణి శ్రీకృష్ణుల వివాహం కూడా రాక్షసమే.

7. గాంధర్వము :

వధూవరులు ఇద్దరూ పరస్పర అంగీకారంతో పెద్దల అనుమతి లేకుండా చేసుకునే వివాహం, శకుంతలా దుష్యంతులు ఇందుకు ఉదాహరణ.

8. పైశాచము :

నిద్రించేటప్పుడు కానీ, మత్తుపదార్థాలు సేవించి కానీ, ఏమరి ఉన్నప్పుడూ కానీ పైనబడి భోగిస్తే లేదా పెళ్లిచేసుకుంటే అది పైశాచం. శుక్తిమతి - కోలాహలులు దీనికి ఉదాహరణ.

ఈ ఎనిమిది వివాహాల్లో పైశాచ వివాహం ఆమోదయోగ్యం కాదని, ఎందుకంటే మిగిలిన వివాహాల్లో వధువు యొక్క అనుమతి, అంగీకారం ఉంది. కానీ పైశాచ వివాహంలో ఆమె అంగీకారానికి ఆస్కారం లేదని మనువు అభిప్రాయం. ఈ వివాహాల్లో దైవము, ఆర్షము, పైశాచము వివాహాలు తప్పమిగిలిన పద్ధతులు భారతంలో కనిపిస్తున్నాయి. అష్టవిధ వివాహాలతో పాటు మరికొన్ని రకాల వివాహాలు భారతంలో కనిపిస్తాయి. భారతంలో జరిగిన ప్రతీ వివాహం వెనుక ఒక ఆసక్తికర గాధ, ఆ దాంపత్య ప్రయాణం పాఠకునికి ఉత్కంఠను రేకెత్తిస్తాయి.

భారతం వివాహం **"సమశీల శ్రుతయుతులకు సమాధానవంతులకు సమసుచారి**
దమలో సౌఖ్యమును వివాహమునగుగాక గునే రెండు త్రులకునసమానులకున్"

శ్రేయస్సును కలిగిస్తుంది అని చెబుతుంది. సమానమైన స్వభావం, విద్య కలిగిన వారికి, సమానమైన సంపద కలిగినవారికి, సమానమైన మంచి ప్రవర్తన కలిగిన వారికి స్నేహాలు ఏర్పడతాయి గానీ అనుమానులకు ఏర్పడవని ద్రుపదుడు ద్రోణుడితో పేర్కొన్నాడు. కానీ మహాభారతాన్ని తరచి చూసినప్పుడు ఈ విషయం అన్నీ వేళలా వర్తించదని అనిపిస్తుంది. భారతంలో అనుకూల వివాహాలు, వ్యతిరేక వివాహాలు, విలోమ, అనులోమ వివాహాలు, ప్రేమ వివాహాలు, స్వయంవర వివాహాలు మొదలైన ఎన్నో రకాల వివాహాలు కనిపిస్తాయి. భారతంలో కనిపించే వివాహాల్లో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఒకే రకమైన వివాహాలు, దంపతులు, సంసారాలు కనిపించవు. "శూరుల జన్మంబు సురల జన్మంబును నేరుల జన్మంబు నెరుగనగునే" అన్నట్లుగా భారతంలో వివాహాల ఆంతర్యం, వైవిధ్యం ఎరుగనగునే అనే రీతిలో వివాహాలు కనిపిస్తాయి.

ఋగ్వేదకాలంలో స్త్రీలకు వివాహ స్వేచ్ఛ ఉండేదని, పెళ్లి చేసుకోని స్త్రీలు తండ్రి ఇంట్లోనే ఉండేవారని ఋగ్వేద ఆర్యులు అనే గ్రంథం చెబుతోంది. వివాహ సమయంలో స్త్రీ అభిప్రాయానికి పెద్దపీట వేసినట్లుగా కనిపిస్తుంది.

"యస్మాత్కామాయతే సర్వాన్ కామేర్దాతోశ్నుభావిని
తస్మాథ్కన్యేతి సుశ్రోణి! స్వతంత్రా వార వర్ణినీ"

తన భర్తను తాను ఎంచుకోవడంలో కన్య స్వతంత్రురాలని భారతంలోని అరణ్య పర్వంలో ఉంది. దీన్ని బట్టి, వివాహ నిర్ణయంలో, వరుని ఎంపికలో ఆనాటికే స్త్రీకి ప్రాధాన్యం ఉన్నట్లుగా తెలుస్తుంది. దీనికి అనేక నిదర్శనాలు కనిపిస్తున్నాయి. గాంధారి, కుంతీ, ద్రౌపది, సుభద్ర, ఉత్తర, దేవయాని, శకుంతల, ప్రమద్వర మొదలైన స్త్రీలంతా తమ వివాహ విషయంలో స్వతంత్రంగా వ్యవహరించిన వారే. వాటికి ఆనాడు జరిగిన స్వయంవర వివాహాలే ఇందుకు నిదర్శనం. రాజ కుమార్తెలు తమ భర్తలను తామే ఎన్నుకునే వివాహ పద్ధతి భారతంలో కనిపిస్తుంది. ద్రౌపది స్వయంవరం, దమయంతి స్వయంవరం ఇందుకు ఉదాహరణలు. కాశీరాజు తన ముగ్గురు కూతుర్లకి స్వయంవరం ఏర్పాటు చేసినప్పుడు భీష్ముడు తన తమ్ముడి కోసం ఆ స్వయంవరానికి వచ్చిన రాజులను ఓడించి ఆ కన్యలను తీసుకువస్తాడు. ఇలా రాక్షస పద్ధతిలో అపహరించి వివాహం చేయడం, చేసుకోవడం అనేది క్షత్రియుల్లో కీర్తిదాయకంగా భావింపబడింది. దమయంతి తన భర్త జాడను తెలుసుకోవటానికి తండ్రి చేత ద్వితీయ స్వయంవరాన్ని ప్రకటింపచేస్తుంది. ఈ ప్రయత్నంలో దమయంతి విజయం సాధిస్తుంది. ఈ స్వయంవరానికి ఋతుపర్ణుడు లాంటి రాజు హాజరు అయ్యాడంటే వివాహవతి, సంతానవతి అయిన స్త్రీ పునర్వివాహం చేసుకోవటం కూడా ఆనాడు ఆచరణలో ఉందనేది గుర్తించాల్సిన అంశం. అందుకు భిన్నంగా కొన్ని సందర్భాల్లో స్త్రీకి వివాహ విషయంలో నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛలేనట్లు కనిపిస్తుంది. సంవరుణుడు తపతితో గాంధర్వ పద్ధతిలో వివాహం చేసుకుందామని పలుకగా తపతి తన తండ్రి అనుమతి పొందమని, స్త్రీలకు స్వాతంత్ర్యం లేదని తెలుపుతుంది. చివరికి సూర్యుడే తపతినిచ్చి సంవరునికి బ్రాహ్మ వివాహాన్ని జరిపిస్తాడు. భారతకాలంలో వివాహ విషయంలో సమాజం ఒకేలా లేదని, ఒకవైపు స్వయంవర వివాహాల ద్వారా స్త్రీకి ఎంత స్వేచ్ఛనిచ్చారో, కొన్ని సందర్భాల్లో అంతే భిన్నత్వం ఉందని అర్థం అవుతుంది.

సంతాన సృష్టి కోసం వివాహం చేసుకోవడం భారతంలో తరచుగా కనిపిస్తుంది. "పతీ ధర్మార్థ కామానాం కారణం ప్రవర్తనం స్మృతమ్" ధర్మార్థ కార్యసిద్ధికి పత్నే ప్రధాన కారణభూతమౌతుందని అని పలుకుతుంది యాజ్ఞవల్క స్మృతి. ప్రతీ పురుషుడు దేవ, ఋషి, పితృ, మనుష్య ఋణాలను తీర్చుకోవాలని పెద్దలమాట. యజ్ఞాలు చేసి దేవతా ఋణాన్ని, వేదాధ్యయనం, బ్రహ్మచర్యంతో ఋషి ఋణాన్ని, కొడుకుల్ని కని పితృదేవతల

రుణాన్ని, దయకలిగినవాడై మానవ రుణాన్ని తీర్చుకోవాలని పురాణ వాక్యం. అందుకే భారతంలో అనేక సందర్భాల్లో వివాహానంతరం సంతానం కోసం పుత్రకామేష్టియాగం చేయడం విరివిగా కనిపిస్తుంది. వివాహ వ్యవస్థ, కుటుంబ జీవనం సంతానంతోనే పటిష్టమవుతాయని పెద్దల అభిప్రాయం. ఆ భావనకు భారతంలోని అనేక ఉపాఖ్యానాలు, ఉదంతాలు నిదర్శనంగా నిలుస్తాయి. పాండురాజు భార్యాసమేతుడై శతశృంగ పర్వతం చేరి, తపస్సు చేస్తున్నప్పుడు అది బ్రహ్మలోకానికి వెళ్ళే దారి కావడంతో మునులు బ్రహ్మలోకానికి వెళ్ళడం చూసి, తానూ వెళ్లానుకున్నవాడై వారితో వస్తాను అంటాడు. అప్పుడు ఆ మునులు "అపుత్రస్య గతిర్నాస్తి" అని పలుకగా వారి మాటలు పాండురాజును కుంగదీశాయి. సంతానంలేని వారు మునులైనప్పటికీ కూడా స్వర్గ ద్వారాలను చూడలేరనీ, తనకున్న శాప ఫలితంగా బిడ్డలను పొందలేనని, దేవరన్యాయాన్ని పాటించి కుంతీదేవిని బిడ్డల్ని కనమని అడుగుతాడు. అందుకే జరత్కారుడు కూడా పితృదేవతలైన వాలఖిల్యులను ఊర్ధ్వ లోకాలకు పంపటం కోసం, పితృదేవతల ప్రీత్యర్థం జరత్కారువును వివాహం చేసుకుంటాడు. మందపాలుడు అనే మహాముని మరణానంతరం పుణ్యలోకాలకు ప్రవేశంలేక వెనుతిరుగుతాడు. ఎంత తపశ్శక్తి ఉన్నా వివాహం చేసుకోకపోతే, పుత్రులు లేకపోతే ఉత్తరలోకాలు ప్రాప్తించవని భావించి, త్వరగా పుత్రులను పొందాలని పక్షుల్లో సంతానం ఎక్కువ కావటం వల్ల ఒక పక్షిరూపాన్ని దాల్చి, జరిత అనే పక్షితో నలుగురు కొడుకులను పొందాడు. శంతనుడు కూడా "బహుపుత్రార్థంబు యత్నంబు సేయవలయు" అంటాడు. శంతనుడు కూడా–

"ఏక పుత్రుడు, ననపత్యుడు ఒక్కరూపయని ధర్మువులన్

విని నీకు దోడు పుత్రుల ననఘా పడయంగా నిష్టమయినది నాకున్" అని దేవవ్రతునితో పలుకుతాడు. ఒకే పుత్రుడు ఉండేవాడు. సంతానం లేని వాడు ఇద్దరూ ఒకటే అని ధర్మశాస్త్రాల్లో ఉంది కాబట్టి నీకు తోడుగా మరికొందరు కొడుకులను పొందాలని ఉందని కాబట్టి మళ్ళీ వివాహం చేసుకుంటాను అనే అర్థం ధ్వనించేలా పలుకుతాడు శంతనుడు దేవవ్రతునితో, సంతాన సృష్టే వివాహానికి మూల హేతువని వాలిఖ్యుల వృత్తాంతం, శంతనుని వృత్తాంతాలు మొదలైన వృత్తాంతాలు తెలుపుతున్నాయి.

అందుకే కురువంశాభివృద్ధి కోసం భీష్ముడు తన చేతుల మీదుగా ఎన్నో వివాహాలు జరిపించడం మనం భారతంలో గమనిస్తాము. తండ్రైన శంతనుడి వివాహం, తమ్ముళ్ళైన విచిత్ర వీర్యుని వావాహం, ధృతరాష్ట్రుడు, పాండురాజుల వివాహం మొదలైన వివాహాలకు కర్త భీష్ముడే. కాశీ రాజు కూతుర్లైన అంబ, అంబికా, అంబాలికను తన తమ్ముడైన విచిత్ర వీర్యుని వివాహం జరిపించగా విచిత్ర వీర్యుడు పెళ్లెయ్యాక తన భార్యలతో విషయ వాంఛల్లో మునిగిపోయి రాజ్య నిర్వహణా భారాన్ని నిర్లక్ష్యం చేసి అకాలంగా మరణిస్తాడు. విచిత్ర వీర్యుని వృత్తాంతంలాంటిదే వ్యుశితాశ్యుని వృత్తాంతం. అతను కూడా తన భార్య మీద మితిమీరిన కామంతో వ్యవహరించి, క్షయగ్రస్తుడై మరణిస్తాడు. మితిమీరిన కామ వాంఛలతో ప్రవర్తించే పురుషులు ఆనాడు ఉన్నట్లు, వారి కోరికల వల్ల సంసారమే ఛిద్రమయిట్లు తెలుస్తుంది. వివాహం మనిషిని కర్తవ్యోన్ముఖున్ని చేయాలి తప్ప తన విధిని మరిచిపోయేలా చేయకూడదు అనేందుకు విచిత్రవీర్యుని మరియు వ్యుశితాశ్వుని వృత్తాంతం నిదర్శనం. సత్యవతి విచిత్రవీర్యుని మరణాంతరం పితృదేవతలకు పిండప్రదానం చేసేందుకు, వంశాన్ని నిలిపేందుకు, సంతానాన్ని పొందేందుకు వివాహం చేసుకోమని భీష్మున్ని కోరుతుంది. పితృదేవతలను తృప్తిపరచడం, సంతాన ఫలం, వంశరక్షణ మొదలైనవి వివాహానికి లక్ష్యాలుగా ఆనాటి సమాజం భావించిందని అర్థం అవుతుంది. ఆధునిక సమాజంలో వివాహాలు ఉద్దేశ్యాలు మారిపోయాయి. సంతానం, వంశాభివృద్ధి మాత్రమే నేటి దంపతుల లక్ష్యంగా లేదు. కొద్ది మంది దంపతులు జీవితంలో ఆర్థిక, సామాజిక భద్రత వచ్చే

వరకు పిల్లల్ని కనటం వాయిదా వేసుకోవటం, ఆ తర్వాత బిడ్డల కోసం సంతాన సాఫల్య కేంద్రాల చుట్టూ తిరగటం కూడా పరిపాటిగా మనం గమనిస్తూ ఉన్నాము. అదేగాక ఆధునిక దంపతుల ఆలోచనా విధానం కూడా వేరుగా ఉంటుంది.

గాంధార దేశాన్ని పాలించే సుబలుడి కూతురు గాంధారి నూరుగురు బిడ్డలకు తల్లి కాగలదని జ్యోతిష్యులు చెప్పగా భీష్ముడు విని ధృతరాష్ట్రునికి ఆ సంబంధాన్ని కుదిర్చాడు. ఆమెకు పదిమంది తోబుట్టువులు ఉంటే వారందరినీ కూడా ధృతరాష్ట్రునికే ఇచ్చి వివాహం చేయించాడు భీష్ముడు. అంతేకాకుండా మరో నూరుగురు కన్యలను కూడా ఇచ్చి పెళ్లి జరిపించడంలో కురువంశాభివృద్ధి అతని ధ్యేయం. వారికి కలిగే సంతానం వల్ల కురువంశం ఫరిడవిల్లుతుందని భావించాడు. ఆనాడు క్షత్రియుల్లో బహు భార్యత్వ సంస్కృతి ప్రబలంగా ఉందనటానికి విచిత్ర వీర్యుని ఉదంతాన్ని గమనిస్తే తెలుస్తుంది.

కొన్నిసార్లు వివాహం ద్వారా మాత్రమే సంతానాన్ని పొందడం అనే విషయం భారతంలో కనిపించదు. పరశురాముడు ఇరవై ఒక్క సార్లు క్షత్రియులను వధించగా ఆ రాజుల భార్యలు సంతానాన్ని కోరినప్పుడు వారి ఋతుకాలాల్లో ఉత్తమ బ్రాహ్మణులు అనుగ్రహించడంతో ఆ రాణులు సంతానాన్ని పొందారని, దాంతో ఆ రాజవంశాలు వర్ధిల్లాయని భారతంలో ఉన్నది. వివాహంతో సంబంధం లేకుండా మత్స్యగంధి సద్యోయవ్వనుడైన వ్యాసున్ని కనింది, కుంతీదేవి కర్ణుడికి జన్మనిచ్చింది. మరికొన్ని సార్లు వివాహంతో, స్త్రీ పురుష సంభోగంతో సంబంధం లేకుండా సంతాన సృష్టి జరగడం కూడా గమనించవచ్చు. భరద్వాజుని జననం, కృపాచార్యుని జననం, పాండవుల జననం ఇందుకు ఉదాహరణలు. కుటుంబాలలో రాజ్యానికి వారసులు కాదగిన రాణికి భర్త వల్ల సంతానం కలగనప్పుడు బావ లేదా బావ మరిదితో, దేవతా ఉపాసనతోనో సంతానం పొందడం దేవర న్యాయం. దేవర న్యాయంతో వంశవృద్ధి కోసం వివాహ ప్రమేయం లేకుండా సంతానాన్ని పొందారు అంబ, అంబిక. బలి అనే రాజు దేవర న్యాయాన్ని అనుసరించి ఆయన భార్య సుధేష్ణను సంతానం కోసం దీర్ఘతముడు అనే ముని వద్దకు పంపించాడు. కాబట్టి భారతకాలం నాటికి స్త్రీ పురుష సంబంధాల్లో నిర్దుష్ట నియమం లేదని, వివాహ వ్యవస్థ మొగ్గప్రాయంలోనే ఉందని స్పష్టం అవుతుంది.

భారతంలో వివాహాలకు కొన్ని సార్లు మన్మధ ప్రకోపనలు కూడా కారణంగా కనిపిస్తాయి. మహాభారతంలో శారీరక ఆకర్షణలకులోనై వివాహం చేసుకోవడం విరివిగా చూడవచ్చు. దుష్యంతుడు శకుంతల అందచందాలకు, యవ్వనపు సొంపులకు వ్యామోహితుడై ఆమెను గాంధర్వ వివాహం చేసుకున్నాడు. తపతి - సంవరుణులు పరస్పరాకర్షితులై వివాహం చేసుకోవడం గమనించవచ్చు. మత్స్యగంధి, పరాశర మహర్షి మధ్య దాంపత్య సంబంధం కనిపించదు. కేవలం శారీరక సౌఖ్యం మాత్రమే కనిపిస్తుంది. అంతేగాక నీ కన్యత్వం నాకు ప్రియం చేసినందుకు చెడదు, భయపడవద్దు అని ఆమెకు వరమిస్తాడు పరాశరుడు. అందుకే

"ఎంతశాంతులయ్యు నెంత జితేంద్రియు
లయ్యు గ్రుడ్డి వివిక్తమైన చోట
సతుల గోష్టి జిత్తచలనమొందురు రెందు
గాముశక్తి నోర్వగలరే జనులు" అని పలికాడు నన్నయ. మగవారిలో కాముకత్వం, శారీరక ఆకర్షణలకు లోనైయ్యే తత్వం ఈనాడు కాదు ఆనాటి నుండే కనిపిస్తుంది. శంతనుడు, పరాశరుడు, వసుమహారాజు మొదలైన వారి గాధల వల్ల వయస్సుతో నిమిత్తం లేకుండా పురుషులు తమకు నచ్చిన స్త్రీలను వివాహమాడటానికి, తాత్కాలికంగా కామవాంఛలు తీర్చుకునేందుకు వెనుకాడేవారు కాదని ఆనాడు వివాహ వ్యవస్థ అంత పటిష్ఠంగా

లేదని అర్థమౌతుంది. ప్రతీసారి మగవారే కాదు కొన్ని సమయాల్లో ఆడవారు కూడా మగవారి సౌందర్య విలాసాలకు, శారీరక వ్యామోహానికి లోనై వివాహం చేసుకున్నారు. "వనజాయతనేత్రు నున్నత బృహద్వక్షఃస్థలున్ సింహాసహనను బాండవ సింహమున్" వంటి భీముణ్ణి చూసి రాక్షస కాంత అయిన హిడింబి మోహించి, మానవకాంత రూపాన్ని ధరించి అతన్ని చేరి వివాహం చేసుకొమ్మని అడిగింది. తన అన్న హిడింబాసురుడు రాక ముందే తనతో పాటు భీముణ్ణి తీసుకుపోతానని, తన అన్నదమ్ములను విడిచి రావాలని పలికింది. అన్నలోని దోషాలను పాండవులకు తెలిపి తన అన్నచావుకు మార్గాలు చూపించింది. భీముని మీద హిడింబికి గల వ్యామోహం, ప్రేమే వీటికి కారణం. "కన్యావరయతే రూపం" అన్నట్లుగా భీముడి బాహు సౌందర్యానికి, విక్రమానికి ఆకర్షితురాలై, వివాహం చేసుకుంది హిడింబి. శారీరక సౌందర్యానికి ఆకర్షితులై వివాహం చేసుకోవడం ఈనాడే కాదు ఆనాడే కనిపిస్తుంది.

భారతంలో మనం గమనించదగ్గ మరొక అంశం ఒప్పంద వివాహాలు జరగడం. ఇవి ఒకరకంగా నేటి సహజీవన పద్ధతిని ప్రతిబింబిస్తున్నాయి. శంతనుడు గంగాదేవి పట్ల అనురక్తుడయినట్లుగా గ్రహించిన గంగాదేవి, తానేమి చేసినా ప్రశ్నించవద్దనే ఒప్పందంతో శంతనుడిని వివాహం చేసుకుంటుంది. గంగా కూడా "అమ్మహిపతి రూపయవ్వన సౌందర్య విలాసంబుల కోటువడి" అతన్ని ఒప్పంద వివాహం చేసుకుంటుంది. జరత్కారుడు వాసుకి చెల్లెలైన జరత్కారువును ఒప్పందవివాహమే చేసుకుంటాడు. ఈ ఒప్పంద వివాహాలు కొన్ని నియమాల మీద జరుగుతాయి. కాబట్టి ఆ నియమాలను ఉల్లంఘించినప్పుడు ఈ వివాహాలు చీలడం, దాంపత్య బంధం నశించడం గమనించవచ్చు. దాశరాజు కూడా తన కుమార్తె సత్యవతికి శంతనుడికి పుట్టిన బిడ్డనే రాజవ్వాలని భీష్ముడితో ఒప్పందం చేసుకున్న తర్వాతే తన కుమార్తెన సత్యవతినిచ్చి శంతనునితో వివాహం జరిపిస్తాడు. తర్వాతి కాలంలో ఆ ఒప్పందమే ఒకానొక సమయంలో కురువంశ క్షీణతకు కూడా దారితీసిందని చెప్పవచ్చు. ఊర్వశీ పురూరవులది కూడా ఒప్పంద వివాహమే. పురూరవుడు ఏనాడూ దిగంబరంగా కనిపించకూడదు అనేది అప్సర కన్య అయిన ఊర్వశి పురూరవుడితో ఒప్పందం చేసుకుంటుంది. కానీ పురూరవుడు దాన్ని ఉల్లంఘించటంతో ఊర్వశి అతన్ని విడిచి వెళుతుంది. నాడు తన ఇష్టానికి వ్యతిరేకంగా భర్త ప్రవర్తించినట్లైతే, అతన్ని వదిలి వెళ్లగలిగిన స్వాతంత్ర్యం ఆనాటి వివాహిత స్త్రీలకు ఉన్నట్లు అవగతమౌతుంది.

భారతంలో అనేక మంది స్త్రీలను పురుషుడు వివాహం చేసుకోవడం తరుచుగా కనిపిస్తుంది. ముఖ్యంగా బ్రాహ్మణ క్షత్రియుల్లో బహు భార్యత్వం కనిపిస్తుంది. దక్షుడు తన యాభై మంది కుమార్తెలలో పదిమందిని ధర్ముడికి, ఇరవై ఏడు మందిని చంద్రునికి, పదమూడు మందిని కశ్యపునికి ఇచ్చి వివాహం చేసినట్లుగా భారతంలో వర్ణింపబడింది. బహుభార్యలను వివాహం చేసుకోవడం ఆనాడు అత్యంత అసాధారణమైన విషయంగా, బహుభర్తలను ఒక స్త్రీ పరిణయమాడటం అరుదైన విషయంగా కనిపిస్తుంది. ద్రౌపది పాత్ర దీనికి ఉదాహరణ. ద్రౌపది అయిదుగురిని వివాహం చేసుకున్నా, తన భర్తలందరితో ధర్మ, అర్థ, కామ, మోక్షాలతో చరించినట్లుగా కనిపిస్తుంది. కశ్యపుడు, యయాతి, ధృతరాష్ట్రుడు, పాండురాజు, పాండవులు మొదలైన వారికి బహుభార్యత్వం ఉండటం గమనించవచ్చు. అంతేకాకుండా భర్త మరణాంతరం భర్త చితితోపాటు భార్య గమనం చేసే సతీసహగమన వ్యవస్థ కూడా ఆనాటి సమాజంలో కనిపిస్తుంది. మాద్రి పాండురాజు మరణానంతరం సతీసహగమనం చేసింది. మాద్రి సతీసహగమనం ఆనాటి వివాహ వ్యవస్థ తీరును మన కళ్ల ముందు ఉంచుతుంది.

విలోమ వివాహాలను వ్యతిరేకించి తమ వర్ణం వారిని, జాతి వారినే వరించిన స్త్రీ పురుషులు మహాభారత కాలంలో కనిపిస్తారు. ద్రౌపది స్వయంవరాన్ని ఏర్పాటుచేసినప్పుడు కర్ణుడు మత్స్య యంత్రాన్ని సంధించటానికి వస్తూ ఉండగా ద్రౌపది సూత పుత్రున్ని వరించనని స్పష్టం చేస్తుంది. దుర్యోధనుడి కూతురైన లక్ష్మణను కృష్ణుడి కొడుకైన సాంబుడు అపహరించి తీసుకుపోతాడు. సాంబున్ని కౌరవులు బంధిస్తారు. యాదవునికి క్షత్రీయ కన్యను ఇవ్వడం అవమానంగా కౌరవులు భావిస్తున్నారనే విషయం తెలిసిన బలరాముడు కోపోద్రిక్తుడవుతాడు. బ్రాహ్మణుడి రూపంలో ఉన్న అర్జునుడు మత్స్య యంత్రాన్ని చేధించి, ద్రౌపదిని వివాహం చేసుకోవడం దుర్యోధనుడు సహించలేడు. ఒక విప్రుడిని రాచకన్య వరించడమే అతని ద్వేషానికి కారణం. బ్రాహ్మణులు నాలుగు వర్ణాల స్త్రీలను వివాహం చేసుకోవచ్చని మనుస్మృతి చెబుతుంది. కానీ పూర్తిగా అది అమలులో లేనట్లుగా దుర్యోధనుడి ప్రవర్తన వల్ల అవగతమవుతుంది. కానీ ఆ స్వయంవరాన్ని చూస్తున్న బ్రాహ్మణులు ఆనందించారని కవి వర్ణించడంలో కొందరికి అది ఆమోదయోగ్యమే అనేది స్పష్టం. నేడు సమాజంలో మనం చూస్తున్న కుల వివక్ష, జాతి వివక్షలు భారతం కాలం నుండే ఆచరణలో ఉన్నాయి. ఒకే జాతికి చెందిన కచుడు దేవయానిని వివాహం చేసుకోడు కారణం ఆమె తన గురు పుత్రిక. గురువుకు శిష్యుడు బిడ్డలాంటి వాడని, గురు పుత్రిక అంటే తనకు చెల్లెలితో సమానమని ఆయన వివాహం చేసుకోవటానికి వ్యతిరేకిస్తాడు. అర్జునుడు కూడా ఉత్తర తన శిష్యురాలు కాబట్టి వివాహం చేసుకోవటానికి అంగీకరించలేదు. ఎంతో గొప్పదైన ధర్మాన్ని, నీతిని అర్జునుడు, కచుడు పాటించాడని మనకు అనిపిస్తుంది. ఇక్కడ అర్జునుడు, కచుడు పాటించిన ధర్మాలు ఆనాటి సమాజం వికాసానికి, నాగరికతకు నిదర్శనాలు.

అయితే విలోమ వివాహాలను వ్యతిరేకించిన వారున్నట్లే వాటిని పాటించిన వారు కూడా భారతంలో కనిపిస్తారు. యయాతి శర్మిష్టలు విలోమ వివాహానికి ఉదాహరణగా నిలుస్తారు. దేవయానికి విలోమ వివాహం అవుతుందని కచుడు శాపమిస్తాడు. శర్మిష్టకు దేవయానికి జరిగిన గొడవలో శర్మిష్ట దేవయానిని బావిలోకి తోసివేయగా యయాతి వచ్చి ఆమె కుడి చేయి పట్టుకుని బావిలో నుండి ఆమెను కాపాడతాడు. తన కుడి చేయి పట్టుకున్నందుకు అతడే తన భర్త అంటుంది దేవయాని. పాణిగ్రహణం చేస్తే వివాహం అయినట్లే అని నమ్ముతుంది హిందూ సంస్కృతి. వివాహం అంటే మంగళసూత్ర ధారణ మాత్రమే కాదు పాణిగ్రహణం కూడా వివాహానికి ఒక రూపమే అనేది స్పష్టం అవుతుంది. శర్మిష్ట ఋతుకాలోచిత ధర్మకార్యాన్ని నిర్వహింపమని యయాతిని అడుగుతుంది. శర్మిష్ట యయాతిని చేసుకుని ఉంటే గాంధర్వ వివాహమో, ప్రజాపత్యమో అయి ఉండేది కానీ దేవయాని దాసిగా ఉన్నందున పెళ్లి తంతు లేని సతీపతి ధర్మాన్ని ప్రతిపాదించింది శర్మిష్ట. ఒక రకంగా ఇది కూడ విలోమ వివాహంగా చెప్పవచ్చు. హిడింబి, భీముడు వేరు వేరు జాతులైనా, హిడింబి భీమున్నే పెళ్లిచేసుకుని బిడ్డను కూడా కనింది. అర్జునుడు తీర్థయాత్రల సమయంలో అనేక వివాహాలు చేసుకున్నాడు. నాగజాతి స్త్రీ అయిన ఉలూచి కూడా ఉంది. నేడు కులాంతర, మతాంతర వివాహాలు విరివిగా కనిపిస్తున్నాయి. కానీ మహాభారతం నాటికే జాత్యంతర వివాహాలు కూడా జరగడం గమనార్హం.

భారతంలో విఫల వివాహాలు కూడా కనిపిస్తాయి. కన్యకు ఇష్టం లేకుండా, ఆమె అభిప్రాయాలను, అంగీకారాన్ని తీసుకోకుండా బలవంతంగా చేసుకున్న వివాహాలు కూడా భారతంలో కనిపిస్తున్నాయి. అవి వంశనాశనానికి, కుటుంబ నాశనానికి దారి తీసాయి. ఆదిపర్వంలో కోలాహలుడు బలవంతంగా శుక్తిమతిని పైశాచ పద్ధతిలో అనుభవించడంతో వసుపదుడికి, గిరికకు జన్మనిస్తుంది. భీష్ముడు అంబ, అంబికా, అంబాలికలను విచిత్ర వీర్యునికిచ్చి వివాహం చేయాలనుకుని, రాక్షస పద్ధతిలో వారిని తీసుకువస్తాడు. ఈ వివాహం నచ్చని

అంబ, అంతకుముందే తన వివాహం సాల్వుడితో నిశ్చయం అవడంతో భీష్ముని అనుమతితో సాళ్వుడి దగ్గరికి వెళ్ళి, అతని తిరస్కారానికి గురై ఆత్మహత్య చేసుకుని భీష్ముని పట్ల ప్రతీకారంతో శిఖండిగా జన్మిస్తుంది. వివాహ విషయంలో స్త్రీ యొక్క అనుమతి లేకుండా కూడా ఆనాడు వివాహాలు జరిగేవని, అటువంటి సందర్భాలు కూడా కొన్ని సార్లు వికటించాయని అంబ వృత్తాంతం చెబుతుంది. కన్య ఇష్టాయిష్టాలతో పనిలేకుండా వివాహాలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అర్థం చేసుకోవాలి. ప్రద్వేషిణి అనే బ్రాహ్మణ స్త్రీ తన భర్త అయిన దీర్ఘతముడి పట్ల ద్వేషం కలిగినదై అతన్ని గంగలో వేయించి చంపించింది. ఆధునిక కాలంలో భర్త పట్ల ప్రేమలేక అక్రమ సంబంధాల ఉచ్చులోపడి, భర్తలను హత్యలు చేయిస్తున్న స్త్రీలను ఎంతో మందిని చూస్తున్నాము. వారికి ప్రతినిధే ప్రద్వేషిణి పాత్ర. భారతకాలం నాటికి సఫల వివాహాలు ఎంత విరివిగా కనిపిస్తాయో, విఫల వివాహాలు కూడా అంతే ఎక్కువ.

అన్యోన్య దాంపత్యంతో, ధార్మిక ప్రవృత్తితో చరించిన సఫల వివాహాలు కూడా భారతంలో విరివిగా కనిపిస్తాయి. భర్త వృద్ధుడైనా, అంధుడైనా, అల్పాయుష్కుడైనా వారినే వివాహం చేసుకున్న స్త్రీలు కనిపిస్తారు. శర్యాతి మహారాజు కూతురు సుకన్య. శర్యాతి కుటుంబం ఒకరోజు వనవిహారం చేస్తుంటారు. ఆ సమయంలో ఆ వనంలో ఉన్న భృగుమహర్షి కొడుకైన చ్యవనుడు తపస్సుచేసుకుంటూ ఉండగా, ఆయన సుదీర్ఘమైన తపస్సు వల్ల ఆయన మీద చీమల పుట్ట ఏర్పడుతుంది. కేవలం ఆయన కళ్ళు మాత్రమే మిణుగురు పురుగుల్లా కనిపిస్తూ ఉంటే పుల్ల తీసుకుని మిణుగురు పురుగులనుకుని సుకన్య ఆ కళ్ళను పొడవడంతో చ్యవనుడు అంధుడవుతాడు. దాంతో చ్యవనుడు తనకు పరిచర్యలు చేయడం కోసం సుకన్యనిచ్చి వివాహం చేయమని శర్యాతితో చెబుతాడు. అందుకు సుకన్య అంగీకరించి చ్యవనున్ని వివాహం చేసుకుంటుంది. చ్యవనునికి పరిచర్యలు చేస్తూ ఉంటుంది. అశ్విని దేవతల పరీక్షలకు నిలబడి తన భర్త వృద్ధాప్యాన్ని, అంధత్వాన్ని పోగొడుతుంది. ఇక్కడ తన చర్యల ఫలితంగా చ్యవనుడు అంధుడవడంతో సుకన్య ప్రాయశ్చితంగా తన జీవితాన్నే అర్పిస్తుంది. ఆనాడు వివాహాలకు ప్రాయశ్చిత్త నిర్వృతి, కృతజ్ఞతా భావం కూడా కారణాలవుతున్నాయి. ఓఘవతి తండ్రి తన కూతురికి సరైన సంబంధాలు రాకపోవడంతో తన తండ్రైన సుదర్శనుడితోనే వివాహం జరిపిస్తాడు. ఓఘవతి తన భర్త సుదర్శనుడు వృద్ధుడైనా, పతివ్రతా ధర్మాలతో చరించింది. ఆనాడు వివాహాలు వయసుతో, వరసలతో సంబంధం లేకుండా జరిగేవని ఈ వృత్తాంతం తెలియచేస్తుంది. నేడు కూడా వయసుతో సంబంధం లేకుండా వివాహాలు చేసుకోవడం, విడాకులు కూడా వయస్సుతో నిమిత్తం లేకుండా చేసుకోవడం గమనిస్తున్నాము. మానవులకు అవయవాలన్నింటిలో కళ్లే ప్రధానం. ఆ కన్నులే ధృతరాష్ట్రునికి లేవు. కానీ మంచి గుణాల వల్ల అతడు ఉత్తముడని సుబలుడు భావించి, తన కూతురైన గాంధారిని ఇచ్చి వివాహం నిశ్చయించగా, భర్త చూడలేని లోకాన్ని తాను చూడనని ప్రతినబూనింది గాంధారి. తాను, తన భర్త వేరుకాదంటూ అద్వైత స్థితిని పొందింది గాంధారి. పాండురాజు దేవరన్యాయంతో పుత్రులను పొందమని పలుకగా అందుకు కుంతీ దేవి మొదట అంగీకరించకపోయినా, భర్త మాటను గౌరవించి పుత్రులను కంటుంది. సావిత్రి భర్త అల్పాయుష్కుడని తెలిసి కూడా ప్రేమించి వివాహం చేసుకుంటుంది. తన భర్త ప్రాణాలను తీసుకువెళ్తున్న యముడితో "బతి యనుగమనం బెవిధమున విడువ దగునే?" అని ప్రశ్నించి ఎంత ఆపద సమయాల్లోనైనా భార్యాభర్తలు ఒకరిని ఒకరు విడిచి వెళ్లకుండా ఒకటిగా కలిసి సాగాలని ధర్ముడికే ధర్మాన్ని నేర్పించింది. రురుడు తాను ప్రేమించిన ప్రమద్వరకు తన అర్ధాయుష్షునిచ్చి, పునర్జీవితురాలిని చేస్తాడు. తమ వివాహ బంధాన్ని కలకాలం ఎలా నిలుపుకోవాలో ఈనాటి జంటలకు నేర్పుతాయి ఈ పాత్రలు. చిన్న విషయాలకే విసుగు చెంది, కాపురంలో కలతలు సృష్టించుకుంటున్న నేటి స్త్రీ పురుషులకు

రురుడు – ప్రమద్వరలు, సావిత్రీ – సత్యవంతులు, సుకన్యా – చ్యవనలు, ఓఘవతి – సుదర్శనులు మొదలైన వారు మార్గదర్శకులు. పెళ్లెయ్యాక భార్యైనా భర్తైనా తానంటే తాను ఒక్కరు మాత్రమే కాదు తన కుటుంబం అనే భావనేతోనే ఉంటారు. మనదేశంలో వివాహ వ్యవస్థ నిలిచి ఉండటానికి, ఇంత బలంగా ఉండటానికి భార్యాభర్తలో ఉన్న ఆ ఏక భావనే ప్రధాన కారణం.

భారతంలో జరిగే వివాహాలను సూక్ష్మంగా గమనించినట్లైతే సంభోగం, సంతానాపేక్ష మరియు వంశాభివృద్ధి ధ్యేయంగా కనిపిస్తుంది. భారతం నాటికి వివాహ వ్యవస్థ ఒకేలా లేదు. వివాహం చేసుకునే పద్ధతుల్లో మాత్రమే కాదు వివాహం జరగటానికి కారణమైన పరిస్థితుల్లో కూడా ఎన్నో వ్యత్యాసాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో, కొందరు దంపతుల విషయంలో వివాహ వ్యవస్థ పటిష్ఠంగా ఉన్నట్లుగా కనిపిస్తుంది. కొన్ని సార్లు విఫలమైనట్లుగా కనిపిస్తుంది. మహాభారత కాలం నాడు వివాహ వ్యవస్థ ఒకవైపు గౌరవింపబడుతూనే, మరొక వైపు అందుకు విరుద్ధంగా కూడా ఉండటం గమనార్హం. "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నా తత్క్వచిత్" అన్నట్లుగా ఇందులో ఉన్నదే లోకంలో ఉంది. భారతంలో లేనిది లోకంలో లేదు అన్నట్లుగా భారతంలో కనిపించే వివాహాలన్నీ నేటికీ మన సమాజంలో ఆచరణలో కనిపిస్తున్నాయి. ప్రాచీన కాలంలో స్త్రీ – పురుష సంబంధాలు, వైవాహిక జీవితం గురించి తెలుసుకోవాలంటే ఉపయోగపడే అద్భుతమైన గ్రంథం మహాభారతం.

ఆధార గ్రంథాలు :

1.శ్రీమదాంధ్ర మహాభారతము, కవిత్రయకృతము, ప్రచురణ : తి.తి.దేవస్థానములు, తిరుపతి.

❖❖❖

మహాభారతం - మనోవిశ్లేషణ

డాక్టర్ వై.సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి

1.0.

సాహిత్యం సామాజిక మనస్తత్వానికి దర్పణం. మహాభారతం భారతజాతి సంస్కృతికి అమృత భాండాగారం. భారతీయ సాహిత్యానికి శిరోభూషణం. వ్యాసమహర్షి విశిష్టసృష్టి. భారతీయ ధర్మతత్వ సమగ్రదృష్టి మహాభారతంలోనే ఉంది. విశ్వసాహిత్యంలోనే మహాభారతం మానవ స్వభావాన్ని మధించి చిత్రించిన ఒక మహాకావ్యం. మనిషి విశ్వరూప ప్రదర్శనమే ఈ మహాభారతం. ఇందులోని అంశాలను మనోవైజ్ఞానిక కోణంలో చూడడమే ఈ పత్ర ఉద్దేశ్యం.

ఆధునిక కాలంలో విజ్ఞానశాస్త్రం అనంతంగా పెరిగింది. దాని ప్రభావానికి సాహిత్యరంగం కూడా బాగా అభివృద్ధి చెందింది. మనో విజ్ఞానశాస్త్రం ప్రపంచానికే ఒక నూతన దృక్కోణాన్ని ఇచ్చింది. చూపటం నేర్పింది. ఆధునిక కాలానికి చెందిన మానవ మనస్తత్వ విశ్లేషణ ప్రాచీన సాహిత్యమైన మహాభారతంలో ఉంది. దానికి ముందు వేదాలలోనూ ఉంది. ముందునుంచే శాస్త్రంగా ఉన్న మనోవిశ్లేషణ ఫ్రాయిడ్‌తో ప్రజాదరణ పొందింది. అయితే ఫ్రాయిడ్‌తో ప్రజాదరణ పొందిన మనస్తత్వ ఆలోచన భిన్న భిన్న శాస్త్రవేత్తల కృషితో పెరిగింది. దాని ప్రతిబింబం సాహిత్య, విమర్శ రంగాలలోనూ ఉంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ ఏవిధంగా విశ్లేషించాడో అదేవిధంగా వ్యాసుడు కూడా విశ్లేషించాడు. లోతుగా పరిశీలించాడు. కనుక కురుపాండవ రాజ్యభాగ సమస్యను కేవలం వారసత్వ సమస్యగానే కాకుండా మానవ మనస్తత్వంతో పడుగుపేకగా అల్లుకొన్న ఒక విషమ సమస్యగా మనం చూసినప్పుడు నూతన దృక్కోణం బోధపడుతుంది.

ఒక ప్రధాన పాత్ర, దాని చుట్టూ మిగిలిన పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు కల్పించటం - అంటే వ్యక్తిపరంగా కుటుంబాన్నీ సంఘాన్నీ చిత్రించటం సాహిత్య రచనల్లో కన్పించే విశిష్ట లక్షణం. మహాభారతంలో అనేక పాత్రలు ఉన్నాయి. అందులో దుర్యోధనుడు, దుశ్శాసనుడు, కర్ణుడు వంటివారు ప్రతినాయకులు. ఈ కావ్యానికి కేంద్ర బిందువులు. ఈ పాత్రల చుట్టే మిగిలిన పాత్రలన్నీ తిరుగుతాయి. మహాభారత సంఘటనల్ని నిర్దేశించేవి ఈ పాత్రలే. సిగ్మండ్ ఫ్రాయిడ్, అతని అనుయాయులు ప్రతిపాదించిన మనో విశ్లేషణ సిద్ధాంతాలు ఈ పాత్రలలో పుష్కలంగా కనిపిస్తాయి. అందువల్ల ఆధునిక సిద్ధాంత నికషోపలం మీద దుర్యోధనాది పాత్రలనిగ్గును నిర్ధారించవచ్చు.

1.1. సహజేచ్ఛ (Id) **: మనోవిశ్లేషణ**

మనోవిశ్లేషణ సిద్ధాంతకర్త సిగ్మండ్ ఫ్రాయిడ్ మనో విశ్లేషణ ప్రకారం వ్యక్తి మూర్తిమత్వ నిర్మాణంలో ప్రధానాంశాలు మూడు. అవి సహజేచ్ఛ (Id), అహం (Ego), అధ్యహం (Super Ego). ఈగోలో కొంతభాగం చేతనం (Conscious), మరికొంత భాగం అచేతనం (Unconscious). చేతనభాగం పరిసరంతో సంబంధం పెట్టుకుంటుంది. అచేతన భాగానికి అటువంటి సంబంధం ఉండదు. ఈ చేతన భాగాన్నే ఫ్రాయిడ్ 'ఇడ్' అన్నాడు. ఈ 'ఇడ్'లో ప్రేరకాలు లేదా సహజాత ఉత్సుకతలు (Instinctive Drives) వినాశకర ప్రోత్సాహకాలు చోటు చేసుకుంటాయి. ఈ ప్రేరకాల శక్తినే లిబిడో (Libido) అన్నారు. ఇడ్ శక్తిని లేదా లిబిడోని దాని మానానికి దాన్ని వదిలిపెడితే అది ముఖ్యప్రేరకాలను సంతృప్తి పరుస్తుంది. అయితే అలా సంతృప్తి పరచడంలో

దాని జీవిత సత్యాలతోను, నీతి నియమాలతోను, మంచిచెడులతోనూ పని ఉండదు. ఇడ్ చాలా పాశవికమైనది. మొరటైంది కూడా. ఒక క్రమం ఉండదు. తన సుఖం తప్ప దానికి మరొకటి పట్టదు. ఈ స్థితిని మనం మహాభారతంలోని దుర్యోధన, దుశ్శాసన, కర్ణుడు, అశ్వత్థామ పాత్రలలో చూడవచ్చు.

1.1.1. దుర్యోధనుడు :

దుర్యోధనుడిలో ఇడ్ చాలా బలవత్తరమైనది. అందువల్లనే దుశ్శాసనుణ్ణి పిలిచి ధర్మరాజు జూదంలో పెట్టి ఓడిన ద్రౌపదిని సభలోకి తీసుకురమ్మన్నాడు. ధర్మరాజు చర్యల్లోని ధర్మసూక్ష్మాన్ని గుర్తించలేని అవివేకి. కనుకనే "యిప్పాండవులయు ద్రౌపదియు వస్త్రంబులపహరింపు" మని ఆజ్ఞాపించాడు. ఇది ఇడ్ ప్రభావమే. కర్ణుడు ద్రౌపదితో మాట్లాడిన అనుచితమైన మాటలతో, మాయాద్యూతంలో లభించిన అక్రమ విజయంతో మదోద్ధతుడై ఉన్న దుర్యోధనుని దుర్మార్గాన్ని ఇంకోరకంగా రగుల్కొల్పింది. దానితో-

అమ్ముదితిన్ విభీత హరిణాక్షిఁ గలాప విభాసి కేశ భా
రమ్మున నొప్పు దానిఁ దన రమ్య పృథూరు తలంబు నెక్కఁగా
రమ్మని సన్ననేసె ధృతరాష్ట్ర సుతాగ్రజుఁడప్పు; దాని దూ
రమ్మునఁ జూచి గౌరవ కురంగ మృగేంద్రుడు భీముఁడల్కతోన్ (భార. సభా. ద్వితీ. ప.247)

దుర్యోధనుడు విశాలమైన తన తొడమీద కూర్చుందువురా అని ద్రౌపదిని సైగ చేశాడు. ఇది బాల్యం నుండి చెడు తలంపుతో పెరిగిన దుర్యోధనుడి దుశ్చేష్టకి నిదర్శనం. ఫ్రాయిడ్ అభిప్రాయంలో మనిషి "అజ్ఞాత అచేతన - అనియంత్రిత శక్తుల అధీనంలో ఒక అనైతిక - పశు స్వభావం గల ప్రాణి." ఇక్కడ దుర్యోధనుడు కూడా పశుస్వభావం గల ప్రాణినే. అందుకే ద్రౌపది పట్ల అనుచితంగా ప్రవర్తించాడు.

1.1.2. కర్ణుడు :

ద్రౌపది స్వయంవరానికి పోయి భంగపడిన వ్యక్తులలో ఒకడు కర్ణుడు. స్వయంవరంలో తనని అవమానించిందన్న కోపంతో ఉన్న కర్ణుడు ద్రౌపదిని ఘోరంగా అవమానించాడు.

'తరుణి! యేవురకంటె నొక్కరుఁడ భర్త
యగ్గటలగ్గు; జూదంబున నాలి నోటు
పడని వానిఁగా దగు భర్తఁ బడయుమింక... (భార. సభా. ద్వి.ప.246)

అంటూ దారుణంగా మాట్లాడాడు. ఒకే భర్త ఉండడం మంచిదని, జూదంలో భార్యను ఓడిపోని వాడిని ఒకడిని భర్తగా పొందమని ఎగతాళి చేశాడు. స్వయంవర సభలో కౌరవసభను పోల్చి, తమను అధిక్షేపించిన ద్రౌపదిని, ఈ సభలోనే మరొక స్వయంవర సభగా మార్చుకోమన్నాడు. దాసీత్వాన్ని తొలగించుకోమంటూ వెటకారం చేశాడు. వస్త్రాపహరణాన్ని, ద్రౌపది నగ్న స్వరూపాన్ని చూడటానికి ఉసిగొల్పిన రాక్షస మనస్తత్వం కల్గినవాడు కర్ణుడు, ఏ స్త్రీకైనా ఇతని మాటలు కర్ణశూలాలే.

ఏకవస్త్రం ధరించిన స్త్రీని ఇక్కడికి తీసుకొని రావటం అన్యాయమన్న వికర్ణుడి మాటలకు కర్ణుడు "భార్యకు దైవ విహితుండైన భర్త యొక్కరుండ; యిది యనేక భర్తృక గావున బంధకియనంబడు; నిట్టిదాని విగత వస్త్రం జేసి తెచ్చినను ధర్మ విరోధంబు లేద'ని అన్నాడు. సమాజం ఆమోదించిన రీతిలో కోరికలను తీర్చుకోవడమంటే ఇదే. సంఘనియమాలు, మానమర్యాదలను బద్ధలుకొట్టి ప్రవర్తించిన తీరుకిది నిదర్శనం. ఇదంతా ఇడ్‌లో భాగమే. ఎందుకంటే మంచిచెడులను ఇడ్ ఆలోచించదు. వాంచిస్తుంది. క్రియకు పూనుకోడమంటే ఇదే.

1.1.3. దుశ్శాసనుడు :

చిన్ననాటి నుండి దుర్యోధనుడిలాగా పాండవులపై అసూయాక్రోధములు పెంచుకొన్నాడు. వారికి అపకారం చేయటంలో అన్నకు కుడిభుజమైనాడు దుశ్శాసనుడు. కండకావరంతో ద్రౌపది జుట్టు పట్టి సభలోకి ఈడ్చి తెచ్చి అవమానించాడు. ద్రౌపది మానభంగానికి పూనుకొని అందరి దృష్టిలో పడ్డాడు. దుర్యోధనుడు చెప్పగానే –

ఇది సేయఁ గాదని మది విచారింపక
సద్గర్హితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు
సభలోన విప్పె నా శంక లేక (భార. సభా. ద్వితీ. ప. 231)

ఇది చేయకూడదనే తలంపు ఏమాత్రం లేకుండా ద్రౌపది కట్టుకొన్న వస్త్రాన్ని నిస్సంకోచంగా నిండుసభలో విప్పిన జంతుప్రవృత్తి దుశ్శాసనుడిది.

ద్రౌపదికి జరిగిన ఘోరమైన పరాభవానికి కర్ణుడి మాటలూ, సూచనలే ప్రధాన కారణం. నిండుసభలో బంధకిని వివస్త్రను చేసినా తప్పులేదన్నదీ, జూదంలో ఓడని ఆరవ భర్తను ఎన్నుకోమని అవహేళన చేసిందీ కర్ణుడే. అతడి మాటలతో, దుర్యోధనుడు పాండవ ధర్మపత్నిని తన తొడపై కూర్చోమని చేసిన సైగలు, దుశ్శాసనుడు ఆమె శిరోజాలు పట్టిలాగి వస్త్రాపహరణం చేసిన దుశ్చర్యలు అన్నీ ఇడ్ ప్రతిరూపాలే. ఫ్రాయిడ్ సైకో డైనమిక్ సిద్ధాంతం ప్రకారం మన వ్యక్తిత్వమంటూ తయారవడానికి Unconscious Mind నే కారణం. ఇందులో నిగూఢంగా మన Conscious Mind కి తెలియనటువంటి ఆలోచనలు, జ్ఞాపకాలు, కోరికలు ఉంటాయి. ఇవి మన ప్రవర్తనపైన ప్రభావం చూపిస్తాయి. ఇక్కడ దుర్యోధన, దుశ్శాసన, కర్ణుడి విషయంలోనూ అదే జరిగింది. Ego, Super Ego అనేవి బలహీనమైపోవడం వల్ల ఇడ్, దుర్యోధన, దుశ్శాసన, కర్ణుల మనస్సుపై అధికారం చెలాయించింది. విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయి ద్రౌపది వస్త్రాపహరణాన్ని ఆనందించేలా చేసింది. దానితో పిచ్చిగా ప్రవర్తించారు. విధినిషేధాలు ఆలోచించకపోవడం వల్ల ఏర్పడిన ప్రవృత్తి ఈ కర్ణదుర్యోధన, దుశ్శాసనులది. లైంగికేచ్ఛను సమాజం ఆమోదించే రీతిలో తీర్చుకోవాలి. కానీ వీరు విచ్చలవిడి, వావివరుసలు లేని స్థితిలో ప్రవర్తించారు. ద్రౌపది వదిన. తల్లి లాంటిది. కనుసైగ చేసి తొడమీద కూర్చోమనడం, వివస్త్రను చేయడం వంటివన్నీ Id చర్యలే. ఉన్నతీకరణ ప్రక్రియలో ఏర్పడిన కుంఠనం వల్ల జరిగినవే. దుర్యోధనుడిలోని సహజేచ్ఛ (Id) వల్ల రాజ్యకాంక్ష, ఆధిక్యత, అసూయ, ద్వేషంపై నియంత్రణ లోపించింది. Ego సరిగా పెరగకపోవడం వల్ల వాస్తవికత సమతుల్యాన్ని సాధించలేకపోయింది. అందువల్లనే నిర్లక్ష్యమైన నిర్ణయాలు, తాము తీసుకున్న ఈ నిర్ణయాలన్నీ చాలా ఉత్తమమైనవనే భ్రమను కల్పించింది. అధ్యహం (Super Ego) కూడా సరిగా పెరగలేదు. అందువల్లనే నైతిక విలువలను పట్టించుకోలేదు. తన కోరికలు హేతుబద్ధమైనవి, నైతికమైనవి కాకపోయినా వాటి వెంటబడేలా చేసింది.

1.1.4. అశ్వత్థామ :

మహాభారతంలోని మరోపాత్ర అశ్వత్థామ. ఆవేశానికి పెట్టిన పేరు. ఆవేశం వివేకాన్ని చంపుతుంది. ఒక్కోసారి నీచతకు పాల్పడుతుంది. సహోధ్యాయులలో సమర్థుని చూసి తక్కిన విద్యార్థులు సహింపకపోవడం సహజం. ఈ అసహనం గురుపుత్రుడైన అశ్వత్థామకు అధికమైంది. గురుపుత్రుడు గనుక ఆధిక్యం తన జన్మహక్కుగా భావించాడు. అర్జునుడు తన తండ్రి దగ్గర విద్యాధనాన్ని గ్రహించి అందరికంటే ఎక్కువగా

రాణించడాన్ని (భార. సౌప్తి. ద్వితీ. ప.44) సహించలేకపోయాడు. అయోగ్యుని విద్య అహంకారాన్ని పెంచుతుందంటారు. అశ్వత్థామ పట్ల అదే జరిగింది. తనకున్న సహజేచ్ఛ (ఇడ్) వల్ల నీతి నియమాలను ఉల్లంఘించాడు. కృపాచార్యుడు ఎంత బోధించినా తన క్రూరపు పూనికను ఆపలేదు. పద్ధతి ఏదైనా, పాపమెంత వచ్చినా తన పగ తీరటం, నెరవేరటమే ప్రధానమని భావించాడు. అందులో భాగంగానే దృష్టద్యుమ్నుని తుద ముట్టించాడు.

కాలను గేలనుం జదిపి గంధకరిండెగటార్పు సింహముం
బోలుచుఁజేర్చి యాద్రుపద భూపసుతున్ సమయించె వేదనన్
జోలఁగఁ రోఁజఁగా బలుమఱుం బొరలంబడి లాల గ్రక్కన
వ్వాలు మగండు వాక్పరి భవంబుఁ దలంచుచుఁ గ్రౌర్యధుర్యుఁడై (భార. సౌప్తి. ప్రథ. ప.158)

ఎంత ఘోరంగా హత్య చేశాడో ఈ పద్యంలో స్పష్టంగా కనబడుతుంది. దృష్టద్యుమ్నుని తరువాత ఉత్తమౌజుని, యుధామన్యుని, తక్కిన పాంచాలురను తుదముట్టించాడు. అయినా అతని ఆవేశం చల్లారలేదు. కసి తీరలేదు. చివరకు గజబలాన్ని, అశ్వబలాన్ని కూడా ముక్క చెక్కలుగా చేశాడు. పాంచాల శిబిరాన్నంతటినీ శవపేటికగా మార్చి, పాండవ శిబిరంలోని ద్రౌపదేయులను, శిఖండిని హతమార్చే వరకు అతని రాక్షస ప్రవృత్తి శాంతించలేదు. పగవానిని ప్రత్యక్షంగా ఎదిరించలేక అతడింట్లో లేనప్పుడు రాత్రిపూట అతని ఇంటికో పంటకుప్పకో నిప్పంటించే నీచ ప్రవృత్తిని రాక్షసావేశాన్ని ప్రదర్శించాడు అశ్వత్థామ. ఒక వ్యక్తి తన కోపాన్ని, కుంఠనాన్ని తక్కువ స్థాయి వ్యక్తులపై వస్తువులపై చూపడం విస్థాపనం (Displacement). అశ్వత్థామ కూడా అమాయకుల ప్రాణాలు బలిగొన్నాడు. మనసులోని అతిలోతైన భాగం అచేతనం. వ్యక్తి తనను తాను నియంత్రించుకోలేని ఒక మానసికస్థితినే ఇడ్ ధ్యేయం. అశ్వత్థామ తన న్యాయాన్యాయాలను ఆలోచించకుండా పాండవ సైన్యాన్ని రాత్రిపూట చంపడానికి కారణం కూడా ఈ ఇడ్ బలవత్తరమైంది కావడమే.

1.2. అధ్యహం (Super Ego)

మనిషి అంతరంగంలో తార్కిక, తార్కికాతీత - నైతిక, నైతికాతీత శక్తుల మధ్య జరిగే సంఘర్షణను వివరిస్తూ ఫ్రాయిడ్ దానిని ఇడ్, ఇగో, సుపర్ ఇగో మధ్య జరిగే సంఘర్షణగా పేర్కొన్నాడు. సైకో అనాలిసిస్ సిద్ధాంతం ప్రకారం ప్రతి ఒక్కరి అంతరంగంలోనూ ఉండే మూడు భాగాలు ఈ ఇడ్, ఈగో, సూపర్ ఇగో అనేవి. ఇడ్ లో జంతు ప్రవృత్తి చోటు చేసుకుంటే ఇగో తార్కిక భావాలకు ప్రతీక. ఇడ్ లో నుంచి సహజంగా బయటికి వచ్చే నైతికాతీత భావాలను ఇగో అణచివేస్తూ ఉంటుంది. ఈగో, సూపర్ ఈగో అనేవి రెండూ ఈగోలోని బాగాలేనన్నాడు ఫ్రాయిడ్. సూపర్ ఈగోకి ఈగో మీద అధికారం ఉంటుంది. ఈగోలో జంతు ప్రవృత్తి చోటు చేసుకుంటే, సూపర్ ఈగోలో సామాజిక నీతి నియమాలు, కట్టుబాట్లు ప్రాతినిధ్యం వహిస్తాయి. వ్యతిరేక ప్రవృత్తి కలిగి ఇడ్‌ను అణచివేసే పని ఈగో ద్వారా సూపర్ ఈగో చేస్తుంది అంటే ఇడ్, ఈగోల మధ్య జరిగే సంఘర్షణ సూపర్ ఈగో ఆదేశాల ప్రకారం జరుగుతూ ఉంటుంది.

ఇడ్, ఈగోల మధ్య తగవు ప్రతి మనిషిలో ఉన్నదే కానీ ఫ్రాయిడ్ ప్రకారం ఈరెంటి మధ్య న్యాయనిర్ణేతగా వ్యవహరించే వేరొకభాగం మనిషి మనోక్షేత్రంలో ఉంది. అది ఈగోలో భాగం. దీన్నే "సూపర్ ఈగో" అంటారు. ఇది దాదాపు మన అంతరాత్మకు సరిపోతుంది. గురువుగా, తండ్రిగా, అధికారిగా, న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తుంది. సూపర్, ఈగో, ఇది ఈగో, ఇడ్ ల మీద ఆంక్షలు విధిస్తుంది. దీనిలో విధి నిషేధాలు - ఇది చేయి, అది చేయవద్దు అన్నవి ఉంటాయి. ఘోషయాత్రలో దుర్యోధనుడు గంధర్వులచేత చిక్కినప్పుడు కాగల కార్యము

గంధర్వులు చేయుదురని భీముడు ఆనందించాడు. కాని ధర్మరాజు మనసు దానికి అంగీకరించలేదు. వెంటనే సుయోధనుని రక్షించాల్సిన అవసరాన్ని తమ్ముడికి తెలిపాడు. మనకిది పుణ్యాన్ని కీర్తిని సంపాదించుకొనుటకు తగిన సమయమని పేర్కొన్నాడు. చివరకు సుయోధనుని కట్టువిప్పి "ఎన్నడు నిట్టి సాహసము లింగ నొనర్పకుమయ్య" (భార. ఆర. పంచ. ప.434) అని బుద్ధి చెప్పి పంపాడు. అదేవిధంగా ద్రౌపదిని బలాత్కరించిన సైంధవుని భీముడు చంపడానికి పూనుకుంటే ధర్మరాజు అడ్డు పడ్డాడు. ఆడపడుచు పసుపు కుంకుమలు ఉండాలని ఆశించాడు కనుకనే సైంధవుని ప్రాణాలతో విడిపించి పుణ్యం కట్టుకొన్నాడు. రాజసూయమునకు బదులుగా దుర్యోధనుడు వైష్ణవ యాగముచేసి అపహసించడానికి ఆహ్వానం పంపితే భీముడు మండిపడ్డాడు. కాని ధర్మరాజు ఆవేశపడలేదు. వచ్చిన దూతతో ఎంతో నెమ్మదిగా – అనఘుడైన దుర్యోధనుడు మహాధ్వర కర్మ ధురీణుడగుటకు మనంబు ప్రియంబందెనని, కులంబు పవిత్రమయ్యెనని, అనుకొన్నదానికి భిన్నముగ అరణ్యవాస సమయమున హస్తినలో అడుగు పెట్టుట అనుచితమని, భూవరునితో ఈ విషయమేర్పడ చెప్పు (భార. ఆర. షష్టా. వ.81) అని ప్రియోక్తులు పలికాడు. ఇవన్నీ ధర్మరాజులోని సూపర్ ఈగోకి నిదర్శనాలు. ఇది చేయాలి, ఇది చేయకూడదనే నిషేధాలు తెలిసిన జ్ఞానిగా నిలబెట్టింది.

1.3. రక్షణతంత్రాలు (Defence Mechanisms)

నిత్యజీవితంలో ప్రతి ఒక్కరూ చాలా సందర్భాలలో ఉపయోగించే ఈ రక్షణ తంత్రాలు. మనిషికి కోరికలు ప్రబలమైనపుడు అవి నెరవేరే మార్గంలేకపోతే కుంఠనం (Frustration), సంఘర్షణ (Conflict) లాంటి మానసిక దురవస్థలకు లోనవుతాడు. ఫలితంగా అతడిలో అశాంతి నెలకొంటుంది. ఫ్రాయిడ్ మాటల్లో చెప్పాలంటే "వ్యక్తిలో అహం (Ego), అధ్యహం (Super Ego) శక్తులు బలహీనమైనప్పుడు ఇడ్ అతని మనస్సుపై అధికారం చెలాయిస్తుంది. అటువంటి పరిస్థితిలో వ్యక్తి విచక్షణాజ్ఞానాన్ని కోల్పోతాడు. పిచ్చిగా ప్రవర్తిస్తాడు. అయితే ఇలాంటి దుస్థితిని నివారించడానికి వ్యక్తిలో కొన్ని నివారణశక్తులు పనిచేస్తాయి. వాటినే "రక్షణతంత్రాలు" అంటారు. ఆందోళన, అపరాధభావనలనుండి మనల్ని మనం రక్షించుకోవడానికి ఉపయోగించేవే రక్షణతంత్రాలు. ఈ రక్షణతంత్రాలు కొన్ని ముఖ్యమైనవి. (Major defence mechanisms) కాగా, మరికొన్ని గౌణ (Minor defence mechanisms) మైనవి. వీటిలో కొన్ని విజయవంతమైతే, మరికొన్ని నిష్ఫల రక్షణతంత్రాలు అవుతాయి. పరిహారం (Compensation), స్వైరకల్పన (Autistic Thinking), ప్రక్షేపణం (Projection), తాదాత్మీకరణం (Identification), హేతువాదవివరణం (Rationalization), ప్రతిగమనం (Regression), ఉదాత్తీకరణ (Sublimation) వంటివి ప్రధాన రక్షణ తంత్రాలుగా పేర్కొనవచ్చు.

When psychological equilibrium is threatened by severe emotional trauma, frustration or conflicts. The mind reports to a variety of protective subterfuges and detours, called mental mechanisms or dynamisms. The individual is not fully aware of their purpose and resents having his attention called to them (Abnormal Psychology) (ఫేజ్) అనే మనోవిజ్ఞానశాస్త్రవేత్త. (ఉద్వేగాలు కుంఠనం మొదలైన మానసిక సంఘర్షణల కారణం వల్ల వ్యక్తి మానసిక సమతౌల్య స్థితికి ప్రమాదం ఎదురైనప్పుడు వ్యక్తి మనస్సు రకరకాల పక్కదారులను అన్వేషిస్తుంది. వీటినే రక్షకతంత్రాలంటారు. ఈ రక్షకతంత్రాల ఉనికిని గూర్చిగానీ, వాని ఉద్దేశ్యాలుగానీ వ్యక్తికి బొత్తిగా తెలియవు.) ఇక్కడ దుర్యోధనుడి విషయంలోనూ అదే జరిగింది. కురు, పాండుకుమారులు బాల్యక్రీడలు ఆడేటప్పుడు ప్రతిదానిలోనూ రాజకుమారులంతా భీముడికన్నా తక్కువగా ఉన్నారు. భీముడు సాటిలేని బలంతో ధృతరాష్ట్రుని కొడుకులను ఒక్కొక్క భుజంమీద పదిమందిని ఎక్కించుకోవడం,

పండ్లుకోయడానికి ఎక్కిన వాళ్లనీ, పండ్లనీ నేలమీద రాలేటట్లు చేయడంలాంటి సాహసాలు చేస్తున్న భీముడి శక్తిని భరించలేక –

"ఉపాంశు వధఁ జేసి మధ్యము మదోద్ధతుం జంపి ని
స్సపత్నముగ ధర్మ నందను నశక్తు బంధించి యే
న పాండవముగా సముద్ర వలయాఖిల క్షోణి మ
త్భుపాణ పటుశక్తి నత్యధిక కీర్తినై యేలెదన్" (భార. ఆది. పంచ. ప.168)

అంటూ దుర్యోధనుడు గర్వంతో విజృంభిస్తున్న భీముడిని రహస్యంగా చంపాలనుకొన్నాడు. అశక్తుడైన ధర్మరాజును చెరసాలలో పెట్టి శత్రువు లేకుండా చేయాలనుకొన్నాడు. అపాండవంగా సమస్త భూమండలాన్నీ నా కత్తికి ఎదురులేకుండా అఖండకీర్తితో పరిపాలిస్తానన్నాడు. వీటన్నిటికీ సోదరుల మధ్య ఉండే స్పర్ధయే కారణం. పాండవులకు బలమైన, తనకు ప్రబలశత్రువు భీముడు మాత్రమేనని దుర్యోధనుడి భావన. అతణ్ణి ప్రత్యక్షంగా ఎదుర్కొని చంపడం సాధ్యపడదు కనుక రహస్యంగా చంపి తనకంటే పెద్దవాడైన ధర్మరాజును చెరసాలలో పెట్టాలనుకున్నాడు. ఇక తనను ఎదరించే శత్రువులుండరనీ ఆశించాడు. అప్పుడు రాజ్యాధికారం తనకే వస్తుందని, సమస్త భూమండలాన్నీ పరిపాలించవచ్చనే దురాలోచన చేశాడు అంటే దుర్యోధనుడు "ప్రక్షేపణ" అనే రక్షణతంత్రాన్ని ప్రయోగించాడు. "తనలోని అవగుణాలను, దోషాలను, బలహీనతలను, తప్పులను ఇతరుల మీదకు నెట్టేయడమే ప్రక్షేపణం". తను భీముణ్ణి చంపి ధర్మరాజుమీద వేయాలని ఆలోచించాడు. తన జీవితం భగ్నం కాకుండా ఉండటానికి వాడిన రక్షణతంత్రమే ఇది.

"స్పర్ధయా వర్ధతే విద్యా" అని పండితోక్తి. విలువిద్యను కురుకుమారులు ఒకరికంటే మరొకరు మించాలని స్పర్ధతో నేర్చుకున్నారు. భీమార్జునులు కౌరవులకంటే బలవంతులయ్యారు. వారిని గెలవాలంటే అసాధ్యం. అది తెలుసుకున్న దుర్యోధనుడు కర్ణుడి అస్త్రవిద్యా నైపుణ్యాన్ని చూసి –

రాజువరుఁడైన పార్థుతో రాజుగాని
యీతఁడని నేయఁగాఁ దగఁడేని వీని
నెల్లవారును జూడంగ నీక్షణంబ
రాజుఁ జేసెద నే నంగరాజ్య మిచ్చి (భార. ఆది. షష్ఠా. ప.48)

అంటూ అందరూ చూస్తుండగానే అంగరాజ్యమిచ్చి రాజును చేశాడు. సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రతిపాదించిన రక్షకతంత్రం "పరిహారం". దీన్ని ఉపయోగించాడు దుర్యోధనుడు. కోర్కెలను ప్రత్యక్షంగా తీర్చుకోలేని పరిస్థితిలో వ్యక్తి ఇతర మార్గాలద్వారా పరిష్కార మార్గాలను అవలంభించి సమాధానపడటమే "పరిహారం". ఇక్కడ దుర్యోధనుడు కూడా పాండవులను గెలవాలంటే తనకి శక్తి సరిపోదు. కనుకనే కర్ణుడిని అంగరాజ్యానికి పట్టాభిషిక్తుడిని చేసి సంతృప్తి పడ్డాడు. ఈ రక్షకతంత్రాలు వ్యక్తి ఆహాన్ని (ఈగో) దెబ్బ తినకుండా చేస్తాయి. ఒత్తిడి, వ్యాకులత, కుంఠనము, సంఘర్షణలకు వ్యక్తి గురైనప్పుడు ఓటమిని అంగీకరించకుండా ఆ పద్ధతి నుండి పారిపోకుండా కాపాడటమంటే ఇదే. ఇది ఒకరకంగా వ్యక్తి మూర్తిమత్వాన్ని చిన్నాభిన్నం కాకుండా కాపాడుతాయని మనోవిశ్లేషకుల నమ్మకం. దుర్యోధనుడిలోని భయం, అర్జునుడికి సమానుడైన విలుకాడు తన పక్షాన ఉంటే వారిని జయించవచ్చన్న ఆత్మవిశ్వాసం సుయోధనుడిలో పెరిగింది. అందుకే –

వీరులని పాండు సుతులకు వెఱతు నేను
వెఱచుటకుఁ దోడుగా నిష్టు విభుఁడ వీవు
పాండవ జ్యేష్ఠునకుఁ బ్రీతి బరమయౌవ
రాజ్యమిచ్చితి కురు వృద్ధ రాజులొద్ద (భార.ఆది.షష్ట. ప.121)

పాండవులు వీరులనే భయంతో ఉన్నారని పేర్కొన్నాడు. కాని ఇది తనలోని అహాన్ని, అగౌరవం నుండి అపరాధ భావన నుండి తాత్కాలికంగా కాపాడిందేగానీ వాస్తవాన్ని మార్చలేదు. పాండవుల బలాలతో యువరాజయ్యాడు ధర్మరాజు. పదిమంది ముందర శాస్త్రోక్తంగా తన తమ్ముడికే కట్టబెట్టాడు. దీన్ని కాదనలేడు. పాండవులను ఎదిరించలేడు. ఇదే దుర్యోధనుడి బాధ, భయం. దీని నుండి తనను తన రాజ్యాన్ని దక్కించుకోవడానికి కర్ణుడిని అంగరాజుగా చేశాడు.

మానవ హృదయంలో బాల్యదశలో స్థిరపడిన అభిప్రాయాలు తరువాత జీవితంలో ఒక పట్టాన తొలగిపోవు. భీష్మద్రోణులు పాండవ పక్షపాతులన్న అభిప్రాయం పసితనంలోనే సుయోధనుని హృదయంలో స్థిరపడింది. ధర్మదృష్టితో ఆ పెద్దలు పలికిన మాటలన్నీ పరిస్థితుల ప్రభావంతో దుర్యోధనుని దృష్టికి పక్షపాత వాక్యాలుగానే కన్పించాయి. అందువల్లనే యుద్ధరంగంలో భీష్మద్రోణులు పోరినా సుయోధనుడు వారి చిత్తశుద్ధిని శంకించాడు. "వ్యక్తికి వ్యక్తికీ మధ్య మనస్తత్వాలలో తేడాలు ఉండటానికి కారణం వాళ్ళ బాల్యజీవితంలోను, చిన్నతనంలో వాళ్ళు పుట్టి పెరిగిన వాతావరణంలోనూ తేడాలు ఉండటమే" అన్నాడు ఆడ్లర్. అదే కురు పాండవుల విషయంలోనూ జరిగింది. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన మరొక రక్షణతంత్రం. వాస్తవికతను అంగీకరించడానికి నిరాకరించడమే. దానితో బాహ్య సంఘటనలను నిరోధించడం. ఇది ఒకరకంగా ప్రమాదకరమైన రక్షణతంత్రం. ఇది తనంతటతానుగా పనిచేయగలిగేది. అందువల్ల పెద్దలు ఎన్ని హితబోధలు చేసిన విననివ్వలేదు. దానితో తమ జీవితాలకే ముప్పు తెచ్చుకున్నారు దుర్యోధనాదులు.

1.4. ఆత్మాధిక్యతాభావం (Superiority Complex)

దుర్యోధనుడిలో ఆధిక్యతకోసం పాకులాడే మనస్తత్వం (Striving for superiority) ఉంది. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళనే మనస్తత్వం అతనిది. ఈ ఆధిక్యం కోసం పాకులాడే మనస్తత్వంవల్ల ఆధిక్యతాభావం (Superiority Complex) ఏర్పడింది. పెద్దలను ఎదిరించటంలోనూ, తానే రారాజు కావాలని ప్రకటించటంలోనూ ఈ లక్షణం ద్యోతకమవుతుంది. పాండవుల బలానికి, ఆధిక్యానికి తలవంచ్చాల్సి వస్తుందేమోనని, చాటుమాటుగా వారిని తుద ముట్టించాలనే ప్రయత్నమూ చేసాడు.

ఆడ్లర్ అభిప్రాయం ప్రకారం శైశవదశ నుండీ, ప్రతి వ్యక్తి విషయంలోనూ ఆధిక్యత కోసమై పోరాటం ప్రారంభం అవుతుంది. ఆత్మనూన్యతా భావపు తొలి బీజాలకు శైశవదశలో అంకురార్పణ జరగడమే దీనికి కారణం. పుట్టిన ప్రతి శిశువూ తనచుట్టూ వున్నవారు పెద్దవాళ్ళు అనీ, బలవంతులనీ, వాళ్ళపై తాను ఆధారపడి వున్నానని, వాళ్ళు చెప్పినట్టు తాను నడుచుకోవడం తప్ప మరో మార్గం లేదనే ఒక విధమైన ఆత్మనూన్యతా భావానికి లోనవుతుంది. ఇలా శైశవదశలో మొదలైన Inferiority Complex ను గమనించిన వ్యక్తి తన ఆధిక్యతను నిలబెట్టుకోవడానికి శైశవదశ నుండే ప్రయత్నం చేస్తాడు. పెద్దలు ఎంత అదమాయించినా వినకుండా పిల్లలు చేసే అల్లరికి మూలకారణం యిదేనంటాడు ఆడ్లర్. అదే దుర్యోధనుడి విషయంలోనూ జరిగింది.

తనలోని Inferiority Complex ను Superiority Complex గా మార్చుకొనేందుకు శైశవదశనుండి వ్యక్తి చేసే ప్రయత్నాలు ఒక్కొక్కరి విషయంలో ఒక్కో రూపాన్ని తీసుకుంటూ ఉంటాయి. దీనినే ఆడ్లర్ Style of Life అన్నాడు. ఆడ్లర్ సిద్ధాంతాలలో ఈ Style of Life కు ముఖ్యమైన స్థానం ఉంది. దీనిని నిర్ణయించడంలో బాల్యంలో అతడి ఇంటిలోని పరిస్థితులు, చిన్నతనపు జ్ఞాపకాలు, చిన్నతనంలో కుటుంబంలో అతనికి గల స్థానం, అతడి ఆదర్శ వ్యక్తులు, అతడు ఎన్నుకొనే వృత్తి - ఇవన్నీ ప్రభావం కలిగి ఉంటాయి అని కూడా అన్నాడు ఆడ్లర్.

Style of Life ను ప్రధానంగా తీర్చిదిద్దేది తల్లిదండ్రుల పెంపకం. దుర్యోధనుడు అతిగారాబంగా పెరగడమే ఈ ఇన్ఫీరియారిటీకి ప్రధాన కారణం. అతిగారాబం పిల్లలను నియంతల్లా మారుస్తుంది. వాళ్ళ ఆజ్ఞను తల్లిదండ్రులు శిరసావహిస్తూ ఉంటారు. దుర్యోధనుడి విషయంలోను అదే జరిగింది. అతడు చెప్పిన వాటికి అన్నింటికీ తల్లిదండ్రులు తలలూపారు. అడ్డు చెప్పలేదు దీనితో చివరికి కౌరవ నాశనానికి కారణమయ్యారు.

దుర్యోధనుడికి ఆత్మన్యూనత ఎక్కువై తాను పాండవుల మీద గెలవగలవా? అనే అనుమానంతో కర్ణుడికి అంగరాజ్యమిచ్చి తనతో కలుపుకొన్నాడు.

వినుత ధనుర్విద్యా విదు
ఘనుఁ గర్ణు సహాయుఁ బడసి కౌరవ విభుఁడ
ర్జునుని వలని భయము సెడి తొ
మ్మునఁ జేయిడి నిద్రవోయె ముదితాత్ముండై (భార. ఆది. షష్టా. ప. 62)

అనుమానం, అసూయ, పోటీని తట్టులేకపోవడం, విమర్శల పట్ల ఉద్రిక్తత చూపడం, పరాజయాన్ని చాలా తీవ్రంగా తీసుకోవడం వంటివన్నీ Inferiority Complex లక్షణాలే. ఈ లక్షణాలు దుర్యోధనుడిలో ఎక్కువ కావటం వల్లనే కర్ణుడి స్నేహహస్తాన్ని ఆశించాడు. తాను పాండవులపై గెలవగలనన్న ఆశాభావంతో ప్రశాంతంగా నిద్రపోయాడు.

1.4.1. ద్రౌపది :

సౌందర్యవతి ద్రౌపది. భర్త ఆధిక్యం. పుట్టింటి గొప్పతనం వెరసి ఆమెను ఆధిక్యతా స్వభావంగల స్త్రీగా మార్చింది. అందుకే ధర్మరాజు జూదమాడి ఓడిపోయినప్పుడు ద్రౌపదిని తోడ్కొని రావటానికి ప్రాతికామి వచ్చినపుడు ఆమె మాట్లాడిన మాటలు తనలోని Superiority కి నిదర్శనం. ఏ యుగంలోనైనా ఎటువంటి చెడ్డ జూదగాడైనా భార్యను పణంగాపెట్టి ఓడిపోయిన వాడున్నాడా? అని –

"మున్ను దన్నోటువడి మఱి నన్ను నోటు
వడియెనో, నన్ను మున్నోటువడి విభుండు
గ్రన్నఁ దన్నోటు వడియెనీ యన్న! నాకు
నెఱుఁగఁ జెప్పుము దీని నీవెఱుఁగు దేని" (భార. సభా. ద్వి.ప. 209)

అంటుంది. పదునైన ద్రౌపది మనస్తత్వానికి ప్రబల నిదర్శనమీ ప్రశ్న. "నీకు తెలియకుంటే ఆ జూదగాడినడిగి తెలుసుకొనిరా" అన్న ఒక్క వాక్యంతో ఆ పాత్రికామిని తిప్పి పంపిన ద్రౌపది వ్యక్తిత్వంలోని నిండుదనం, దిటవుతనం కన్పిస్తాయి. సామాన్య స్త్రీ అయితే ఈ పరిస్థితిని చూసి దుఃఖంతో చతికిలబడేది. ఒక మహోన్నత, గంభీర స్త్రీమూర్తి కనుకనే ప్రాతికామిని తిప్పి పంపింది.

ఆమెకున్న ఉదాత్త గంభీర వ్యక్తిత్వం వల్ల దుర్యోధనుడు తన ఆధిక్యాన్ని ప్రదర్శించాలని చూశాడు. ఆమెను అవమానించి తన ఆధిక్యాన్ని ప్రదర్శించి పరిహసించాడు. దుశ్శాసనుడు తన తల వెంట్రుకలను పట్టి సభకు ఈడ్చి తెచ్చిన విషయం సంధికి వెళ్లే శ్రీకృష్ణుడికి గుర్తు చేసింది. "ఇవి దుస్సేను వ్రేళ్ళం దవిలి సగము ద్రెవ్విపోయి తక్కినయవి కౌరవుల కడఁ దీఱు మాటల యవసరమునఁ దలపవలయు నచ్యుత వీనిన్" అని చెప్పించాయి. "ఈ వెంట్రుకలు పట్టి ఈడ్చిన యా చేయి దొలుతగాఁ బోరిలో దుస్సేను తను వింతలింతలు తునియలై చెదరి రూపఱి యున్నఁగని యుడుకాఱుఁగాక" అని పలికించాయి. సంధి ప్రయత్నాన్ని బలహీన పరిచాయి. ఈ మాటలు ఆమె దృఢ సంకల్పానికి సూచికలు. ఆడ్లర్ చెప్పిన జీవనశైలి (Style of life) ద్రౌపదిలో ఉంది. తనకు జరిగిన అవమానాగ్నికి బదులు తీర్చుకోవాలనే ఆకుంఠిత విశ్వాసం ఉంది.

దుశ్శాసనుడు కండకావరంతో జుట్టు పట్టి సభలోకి ఈడ్చి తెచ్చినపుడు ధర్మరాజులోని ధర్మ సూక్ష్మాన్ని గుర్తించలేని అవివేకిగా దుశ్శాసనుడిని పేర్కొంది. "అతడు ఏ ధర్మాన్ని ఆశ్రయించి నన్ను సభకు తెచ్చాడు? అని పెద్దలందరినీ ప్రశ్నించింది ద్రౌపది. ఈ మాటలతో ఆమె అంతరాత్మ (Conscience) కి ఇచ్చిన విలువ స్పష్టమవుతుంది. వీటిని బట్టి యూంగ్ (Jung) చెప్పిన ఇంట్రోవర్ట్ (Introvert) లక్షణం ద్రౌపదిలో ఉంది. అంటే అంతర్గత భావాలకు ప్రాధాన్యమిచ్చే 'అంతర్వర్తిని' అన్నమాట.

1.4.2. స్వానురాగం (Narcissism)

తనను తాను ప్రేమించుకోవడమే స్వానురాగం. ఇందులో లిబిడో బాహ్య వస్తువు మీదకి కాకుండా తన మీదకే మరలుతుంది. అందరూ తమకే లోబడాలి. తామెవరికి లొంగరు. తమనెవరు పొందలేరు. తామే అందరిని పొందుతారు. వీరి అందం రాక్షసం. వినాశకరం. ద్రౌపది స్వానురాగబద్ధ స్త్రీ. ఈమెకి సౌందర్యం గర్వకారణం. భర్త ఆధిక్యం, పుట్టింటి గొప్పదనం ఆ గర్వాన్ని మరింత పెంచాయి. వీటికి తోడు ఉదాత్త గంభీర వ్యక్తిత్వం ఉండటంతో సాటి స్త్రీలే కాదు లోకంలో మగవాళ్లు కూడా ఆమె ముందు వెలవెల బోక తప్పదు. పరిచారిక వేషంలో ఉన్న ఆమె సౌందర్యం విరాట నగర ప్రజలను ఆకర్షించింది. ద్రౌపది సౌందర్యం సైంధవుని సమ్మోహితుని చేసి, అతనిని అవమానం పాలు చేసింది. సింహబలుని కాముకతను కవ్వించి అతని అసువులనే తీసింది. కర్ణుడు ద్రౌపది స్వయంవరానికి పోయి భంగపడ్డాడు.

1.5. ఆత్మన్యూనతాభావం (Inferiority Complex)

ఆడ్లర్ థియరీ ప్రకారం కోరిక తీరకపోవడంతో వ్యక్తిలోని ఆధిక్యతాభావం (Superiority Complex) దెబ్బతిని దాని స్థానంలో న్యూనతాభావం (Inferiority Complex) చోటు చేసుకొంటుంది. ఇక్కడ దుర్యోధనుడికి అదే జరిగింది. అరణ్యవాసంలో ఉన్న పాండవులను అవమానించి హతమార్చే ప్రయత్నంలో ఘోషయాత్ర పేరు పెట్టి బయలుదేరాడు. కానీ కథ అడ్డం తిరిగింది. తానే అవమానింపబడ్డాడు. చివరికి వారి సాయంతోనే చిత్రసేనుని చేతినుండి బయటపడ్డాడు. అవమానింపబోయి అవమానపడుట కంటె ఘోర అవమానమేముంది? అందుకే దుర్యోధనుడు -

"ఒవ్వని వారల యెదురున
నివ్విధమున భంగపడితి; నేనింక జనుల్
నవ్వగ నేటి బ్రదుకుగా
నివ్వ నుమతి నేలువాడ? నెట్లు చరింతున్" (భార. ఆర. షష్టా. ప. 16)

అని న్యూనత చెంది ప్రాయోపవేశమున ప్రాణ పరిత్యాగాన్ని చేస్తానని నిర్ణయించుకొన్నాడు. అవమానంతోపాటు నిరాశ నిస్పృహలు కూడా ఆవరించిన దుర్యోధనుడు న్యూనతతో కుమిలిపోయాడు.

1.6. అంతస్సంఘర్షణ

అంతర్గత భావాలకు ప్రాధాన్యమిచ్చే మరొక పాత్ర ధృతరాష్ట్రుడు. ఇతని స్వభావంలో ఎంతో వింత గొలిపే విశేషం - శ్రీకృష్ణుడిచ్చిన దృష్టితో విశ్వరూపం చూసిన తరువాత "ఒరుల చూడను ఉపసంహరింపుమని" ప్రార్థించడం. యుద్ధారంభంలో వేదవ్యాసుడు ఇస్తానన్న దివ్యదృష్టిని అన్నదమ్ముల పోరు క్రూరతను కనుగొనడం ఇష్టం లేదని నిరాకరించడం. పుట్టు గుడ్డి అయిన తండ్రికి జీవితంలో పుత్రుల చూసుకోవడం కంటె ఆనందమేముంది? ఉత్తమ క్షత్రియునికి యుద్ధాన్ని చూడడంకంటె ఉత్సాహపడదగినదేముంది? అయినప్పటికీ చూడనన్నాడు. దీన్ని బట్టి అతడెంత పుత్ర మమకార పీడితుడైనా, ఉపేక్షాభావ సమోపేతుడైనా, లోకస్వభావ

దూషితుడైనా అంతరాంతంలో అంతులేని ధర్మ సంఘర్షణ అనుభవిస్తున్నట్లు తెలుస్తుంది. యుద్ధారంభంలో చివరి మాటగా శాంతి చేయమని చెప్పిన వ్యాసునితో –

హితమును ధర్మముం దలచి యిమ్మెయిఁ జెప్పితిఁ రిట్లు మున్ననా
సుతుల నయంబు మై దఱిమి చూచితి వారలఁ బంపు సేయనేఁ
జతురుఁడగాను బ్రాభవము సాలదు నా దెస తప్పు లేమి మీ
మతిఁ దలపోసి యీ పలుకు మానుఁడు పాకము దప్పె గార్యముల్ (భార. భీష్మ. ప్రథ. ప. 13)

అనడంలోని అతని సంఘర్షణ. నిస్సహాయత వ్యక్తమవుతాయి. ధృతరాష్ట్రుని మనస్సాక్ష వైపు, మాట మరోవైపు అతని ఆంతర్యాన్ని కనిపెట్టడం చాలా కష్టం. "రెండు విరుద్ధ కోర్కెల మధ్య ఏర్పడే తన్మతవల్ల కలిగే బాధాకర ఉద్వేగ స్థితి సంఘర్షణ" అంటారు డగ్లస్, హాలండ్లు. ఇక్కడ ధృతరాష్ట్రుడిది అదే పరిస్థితి.

1.7. త్యాగనిరతి (Martyer Complex)

జంగ్ లో Personality Complexes ఒకటి Martyer complex, jung described a complex as a node in the unconscious, it may be imagined as a knot of unconscious feeling and beliefs, detectable indirectly, through behaviour that is puzzing or hard to account for. ఇతరులకోసం ఎప్పుడైనా, ఏదైనా త్యాగం చేయడానికి సిద్ధపడటం, జీవితంలో హీరోగా ఉండాలనుకోవడం. స్వీయహాని కల్గుతుందని తెలిసినా ఎదుటి వారికి ఇవ్వడానికి సంకోచించని స్థితినే త్యాగనిరతి (Martyr Complex). మహాభారతంలో కర్ణుడిలో ఈ కాంప్లెక్స్ను అధికంగా చూస్తాం. తనని ప్రేమించవలసిన వారిచేతనే తిరస్కరించబడిన వ్యక్తి. తల్లిచేత గంగపాలు చేయబడిన జీవితం అతనిది. అస్త్రవిద్యానైపుణ్యాన్ని ప్రదర్శించడానికి పూనుకున్న రాధేయుని తక్కువకులం వాడన్న కారణంతో కృపాచార్యుడు రంగనియమాల ప్రకారం కుదరదన్నాడు. అర్జునుడితో తల పడటానికి అవకాశం లేక కృంగిపోతున్న సమయంలో కర్ణుడిని సుయోధనుడు అంగరాజ్యానికి మహారాజుగా మార్చాడు. ఆ సమయంలో అచంచల స్వామిభక్తితో, మైత్రీ భావంతో తనకింత మహోపకారం చేసిన దుర్యోధనునకు నేనేమి ప్రత్యుపకారం చేయగలను? అనగా సుయోధనుడు "నాతో జెలిమి మహీనుతముగఁ జేయు మిదియె యిష్టము నాకున్" (భార. ఆది. షష్టా. ప. 50) అని అడిగాడు.

ఒకవైపు కన్న తల్లి వచ్చి జన్మ రహస్యాన్ని చెప్పి పాండవపక్షానికి రమ్మని కోరటం. పుత్రభిక్ష పెట్టమని అర్థించటం, మరోవైపు చేయూతనిచ్చి తనని పైకి తెచ్చిన కౌరవపతి. అయినా కర్ణుడు ఇటు కన్నతల్లి ప్రార్థనను, కౌరవేశ్వరుని కోరికకు సమన్వయం సాధించాడు. అర్జునుని తప్ప మిగిలిన పాండవులను చంపనని తల్లికి మాటిచ్చాడు. పార్థుని చంపుతానని కౌరవేశ్వరునికి ఇచ్చిన మాటను దక్కించుకున్నాడు. కుంతికి ఇచ్చిన మాటవల్ల, అర్జునుడికి కాళ్లుచేతులు కొంత కట్టి వేసినట్లే అయిననూ మాటమీరని ఉదాత్తగుణ శోభితుడు కర్ణుడు.

భీష్ముడు పిలిచి కర్ణుడి జన్మ రహస్యాన్ని చెప్పినా స్వామిభక్తినే స్వీకరించిన అమరుడు. పరిస్థితులను వివరించి "భూరివివేక! యే విడిచిపోవుట ధర్మమె? వీర కర్మమే? (భార. భీష్మ, తృతీ. ప. 447) అని సమాధానం చెప్పి యుద్ధానికి దిగాడు.

మరొకటి కవచకుండల దానము. కర్ణుని స్వామి భక్తికి నికషోఫలము వంటిది. కపట బ్రాహ్మణ రూపంలో కవచకుండలాలను అర్థిస్తూ దేవేంద్రుడు ఒవైపు, అవి ఇస్తే అర్జునుని జయించలేవని జన్మనిచ్చిన కర్మసాక్షి మరోవైపు నిలిచారు. పుట్టుకతో వచ్చిన సహజ సిద్ధమైన జన్మవ్రతమునకే ప్రాధాన్యతనిచ్చాడు. తనకి ప్రాణాలు పోతాయని తెలిసినా తన కవచకుండలాలను కోసి ఇచ్చేంత దాతృత్వం కలవాడుగా చరిత్రలో నిలిచిన వ్యక్తి కర్ణుడు.

"రెండు లేదా ఎక్కువ విరుద్ధమైన కోరికల ఫలితంగా వ్యక్తి ప్రవర్తనలో ఏర్పడిన ఉద్రిక్త స్థితి సంఘర్షణ" అంటారు కేట్జ్ & లేహ్నర్. కర్ణుడు ఎంత శక్తి ఉండి, సామర్థ్యమూ ఉండి తనని తక్కువగా చూసిన సంఘంలోనే ఉన్నత స్థానాన్ని గడించి పెంచుకున్న పరిస్థితులకు, ఉంచుకున్న ఆదర్శాలకు మధ్య నలిగిపోయాడు. ఆ ఉద్రిక్త స్థితివల్ల ఏర్పడిన సంఘర్షణతో విధి వంచితుడై విషాదాంత నాయకుడుగా మిగిలిపోయాడు.

ఫ్రాయిడ్ – మనిషి అంతరవ్యక్తిత్వంలో ఇడ్‌తో పాటు ఈగో, సూపర్ ఈగోలకు సమాన ప్రాధాన్యం ఇచ్చాడు. వీటి ప్రధానగుణాలలో విలక్షణత ఏర్పడితే సంఘర్షణ (Conflict) ఉత్పన్నమవుతుందనీ ఆ సంఘర్షణ వల్ల అపసామాన్యత (Abnormality) వస్తుందనీ ఫ్రాయిడ్ పేర్కొన్నాడు. కానీ కర్ణుడిలో ఇడ్ బలవత్తరమైంది. కనుక అతనిలో సంఘర్షణ అపసామాన్యతకు దారితీయలేదు.

ఇలా పరిశీలిస్తూపోతే మహాభారతం చాలావరకు మనస్తత్వ విశ్లేషణకు లొంగేదే. మనిషి సర్వజీవన ప్రయత్నాల వెనుక మనో విశ్లేషణాంశాలు ఉంటాయన్న సత్యం మహాభారత కథలోనూ నిరూపించవచ్చు. ఈ మహాభారత కథను ఆధారం చేసుకొని అతి ప్రాచీనకాలంలోని ప్రజల మనోవిశ్లేషణ లక్షణాలు గుర్తించటం సాధ్యమవుతుంది.

ఆధార గ్రంథాలు :

1. మహాభారతం – తిరుమల తిరుపతి దేవస్థానం, వ్యాఖ్యానగ్రంథాలు
2. A General Introducation to psycho analysis - Sigmund Frecd
3. An Introduction to psycho analysis - Edited by J.S.Vanteslaar
4. The psychology of C.G.Jung - Jacobi, Jolande (Translated by K.W.Bash, S.M.From German)
5. Abnormal psychology - Dr.Vatsayam
6. Dictionary of psychology - J.P.Chaplin
7. Encyclopedia of Britanica
8. What life should mean to you - Alfred Adler
9. Counselling and psycho therapy - Zerold Cory
10. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంతం – అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి
11. మనసు గతినే మార్చిన ఫ్రాయిడ్ – అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డా.కాకుమాని శ్రీనివాసరావు
12. మహాభారతము : మానవ స్వభావ చిత్రణ – డా.అప్పజోడు వేంకట సుబ్బయ్య
13. మూర్తిమత్వ సిద్ధాంతాలు – మాపనం – తెలుగు అకాడమి

❖❖❖

శ్రీమదాంధ్ర మహాభారతము - రాయబారాలు

డాక్టర్ డి.యువశ్రీ, సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ,
శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

భారత, భాగవత, రామాయణాలు భారతీయ సంస్కృతికి మూలకందాలు. విజ్ఞాన సర్వస్వాలుగా భాసిల్లేవి. జ్ఞాన భాండాగారాలుగా దీపిల్లేవి. ఈ మూడింటిలోనూ ప్రతిదానికి ప్రత్యేకత ఉంది. రామాయణం మానవ జీవన నిర్దేశకం. భాగవతం భగవద్భాగవత వృత్తాంతావిష్కరణతో పాటు భక్తిని పెంపొందిస్తుంది. భారతం సమాజ దర్పణం. భారత వంశ క్రమ వికాస సూచకం. విజ్ఞాన విలసితం. భారతంలో లేనిది మరెక్కడా ఉండదనే నానుడి ప్రత్యక్షర సత్యం. కాబట్టి భారతాన్ని జీర్ణింపజేసుకొంటే విజ్ఞాన సర్వస్వాన్ని జీర్ణింపజేసుకొన్నట్టే అవుతుంది. భారతంలో అనేక వివిధ విషయాలతో పాటు రాయబారాలకు కూడా చోటు కల్పించబడింది.

ఒకరి ఆలోచనలు, ఉద్దేశాలు మరొకరి చేరవేయడంలో మధ్యవర్తులుగా వ్యవహరించే వారిని రాయబారులంటారు. వీరు నిర్వహించే కార్యక్రమాలను రాయబారం అని వ్యవహరిస్తారు. ఒకరి తరపున వెళ్ళే రాయబారులు పంపేవారి ఆలోచనలను తెలియజేయడమేగాక తమ బుద్ధి కుశలతను కూడా ప్రదర్శిస్తారు. ప్రాతికూల్యాన్ని తగ్గించి అనుకూల్యాన్ని అధికం చేస్తారు. ఆధునిక యుగంలో ప్రతిదేశానికీ ప్రపంచదేశాలన్నిటిలోనూ రాయబారులు ఉండడం మనకు తెలిసిందే. ఈ విధంగానే ప్రాచీనకాలం నుంచి కూడా రాయబారులుండే వారని సాహిత్యం మనకు తెలియజేస్తుంది.

భారతంలో కూడా పలు రాయబారాలున్నట్లు వ్యక్తమవుతూ ఉంది. వాటిలో రాజకీయ రాయబారాలుగా పరిగణించదగినవి ఐదు. నాలుగు రాయబారాలు భారతానికి సంబంధించినవి కాగా, భారతంలో చోటుచేసుకొన్న రామాయణానికి సంబంధించిన రాయబారం మరొకటి.

అంగదు రాయబారం :

భారత అరణ్యపర్వ షష్ఠి, సప్తమాశ్వాసాల్లో రామాయణం చోటుచేసుకొంది. అరణ్యవాసంలో ఉన్న ధర్మరాజుకు మార్కండేయ మహర్షి రామాయణం చెప్పాడు. దీనిలో 'అంగదు రాయబారం' చోటు చేసుకొంది. ఈ ఘట్టాన్ని తెలుగులో మధురానుభూతికరంగా మనకందించిన వారు ఎఱ్ఱాప్రగ్గడ.

ఎఱ్ఱన కాలం క్రీ.శ.1280-1364. కవిత్రయంలో తృతీయుడు. ఈయనకు శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు అనే బిరుదులున్నాయి. ఈయన భారతారణ్యపర్వాన్నే గాక భారతఖిల పర్వంగా పరిగణింపబడే హరివంశాన్ని కూడా ఆంధ్రీకరించాడు. నృసింహపురాణాన్ని ప్రాబంధికంగా ప్రపంచించాడు. రామాయణాన్ని కూడా రచించినట్టు చెబుతారు గానీ అది అలభ్యం. అందువల్ల దాని విషయంలో స్పష్టత లేదు. రామాయణాన్ని రచించినట్టుగా చెప్పబడే ఎఱ్ఱన తాను రచించిన అరణ్యపర్వభాగంలో రామాయణ సంగ్రహాన్ని నిక్షేపించాడు. తన రామాయణ హృదయాన్ని అందులో చొప్పించాడు అంటే అతిశయోక్తి కాదు. రామాయణ ఘట్టాలన్నిటితో పాటు 'అంగదు రాయబారా'న్ని కూడా ఎఱ్ఱన ఆవిష్కరించాడు.

రామరావణ యుద్ధం ప్రారంభమయ్యే ముందు రాముడు పద్ధతి ప్రకారం రావణాసురుడి దగ్గరికి తన రాయబారిని పంపాలనుకొన్నాడు. దానికి తగినవాడు అంగదుడేనని భావించాడు. అంగదుడు మహాశూరుడైన వాలి కుమారుడు. వాలి చేత పరాభవింపబడిన రావణుడికి బుద్ధి చెప్పేందుకు తగిన వాడతడేనని దాశరథి

తలపోశాడు. రావణుడు లంకకు రాజు. అంగదుడు కిష్కింధకు యువరాజు. అది కూడా అతని రాయబారయోగ్యతను ప్రస్ఫుటం చేస్తుంది. అంగదుడు ధైర్యశాలి. బలశాలి. తేజోశాలి. కాబట్టి నరవానర శక్తికి ప్రతీకగా వానర సైన్య ప్రతినిధిగా వెళ్ళడం సముచితంగా ఉంటుందని రాముడు భావించి ఉండవచ్చు. అందువల్లనే అంగదుడిని పంపాడు. అంగదుడిని పంపేటప్పుడు తాను చెప్పి పంపే మాటలతోపాటు స్వతంత్రంగా మాట్లాడే అవకాశం కూడా ఆయనకిచ్చాడు. ఇది ఇక్కడ గమనించదగ్గ అంశం.

అంగదుడు రాముడి అనుమతితో లంకలో ప్రవేశించాడు. రావణుడి కొలువుకూటం చేరుకొన్నాడు. లంకకు రాజు, తనకంటే చాలా పెద్దవాడు, బహుముఖ జ్ఞానియైన రావణాసురుడికి అంగదుడు నమస్కరించలేదు. కారణం అతడి దుర్మార్గమే కావచ్చు. దుష్టులను శిష్టులుగా పరిగణించడం సబబు కాదని అంగదుడి వైఖరి అభివ్యక్తం చేస్తుంది.

రావణా! మా ప్రభువు రాముడు నీకు చెప్పమని ఈ మాటలు నాకు చెప్పి పంపాడు. జాగ్రత్తగా! విను. "రావణా! నిర్దోషులు, మహాత్ములైన మహర్షులను మనోవ్యధకు గురిచేసి మట్టుబెట్టావు. పతివ్రతలైన దేవతాస్త్రీలను బంధించి లోకాపకారం చేశావు. నువ్వు చేసిన తప్పులన్నిటిలోనూ తలమానికం నావిషయంలో చేసిన తప్పే సుమా! పరాక్రమం కలవాడనని ఆత్మవిశ్వాసమూ గర్వమూ నీకుంటే నాతో యుద్ధంచై. అలా కాని పక్షంలో నన్ను శరణువేడు. సీతను నాకప్పగించు. ఇలా కాకపోతే నువ్వు జీవించడానికి వీలులేదు. నా బాణాలతో నిన్ను అంతమొందిస్తాను. మనుషులంటే నీకు తక్కువ చూపు ఉంది. మనిషినైన నన్ను యుద్ధంలో ఎదుర్కొని నా శక్తిని చూడు. మరొక మాటను కూడా విను. రాక్షసులనే పేరే లేకుండా నేను చెయ్యాలనుకొంటున్నాను. ఇవి ఒట్టి మాటలు కావు.

కం॥ మనుజుండనైన నా తెఱఁ
గను మానము వాయఁజూడు మాహవభూమిన్;
విను, రాక్షసులను నామం
బును నడఁపక యేను రిత్త వోనిచ్చెదనే?"

(శ్రీమదాంధ్ర మహాభారతము, అరణ్యపర్వము - సప్తమాశ్వాసము, పద్యం : 62, పుట:1146)

అంగదుడి మాటలు రావణాసురుడికి కోపం తెప్పించాయి. కన్నెర్రజేశాడు. అతడి ఉద్దేశం కనిపెట్టిన రాక్షసభటులు అంగదుడిని బంధించబోయారు. అతడక్కడి నుంచి వేగంగా దగ్గరనే ఉన్న ఒక మేడ చివరి భాగంపైకి ఎగిరిపోయాడు. అక్కడి నుంచి ఆకాశంపైకి లంఘించి వచ్చి వానర శిబిరం చేరుకొన్నాడు. జరిగిందంతా రాముడికి నివేదించాడు.

అంగద రాయబారంలో అంగదుడి ఉద్దేశంగానీ రాముడి ఉద్దేశంగానీ రావణాసురుణ్ణి తమకనుకూలం చేసుకోవడం కాదు. ప్రాతికూల్యాన్ని వృద్ధి చేసి యుద్ధంలో పాల్గొనేట్టు చేయడమేననిపిస్తుంది. అంగదుడు మొదట రాముణ్ణి సాటిలేని విలువిద్యావేత్తగా చెప్పాడు. రావణాసురుడికి యుద్ధంలో చావు తప్పదని కూడా ధ్వనింపజేశాడు. ఇవన్నీ కూడా రెచ్చగొట్టే ధోరణిలో ఉండడం గమనార్హం. మంచివాళ్ళను తప్పుపడితే వాళ్ళు దాన్ని సంస్కరించుకొనే ప్రయత్నం చేస్తారు. చెడ్డవాళ్ళను తప్పుపడితే తప్పు పట్టిన వాళ్ళపట్ల వాళ్ళు తమ కోపాన్ని ప్రదర్శిస్తారు. ఇదే రావణుడి విషయంలో కూడా జరిగింది.

భారతంలోని తక్కిన 4 రాయబారాలు ఉద్యోగపర్వంలోనే ఉన్నాయి. ఉద్యోగపర్వాన్ని రచించిన వాడు తిక్కనామాత్యుడు. ఈయన నెల్లూరును పాలించిన మనుమసిద్ధి మహారాజు దగ్గర మంత్రిగా మసులుకొనేవాడు.

ఆస్థానకవి స్థానాన్ని కూడా ఆయన అలంకరించినట్టు తెలుస్తూ వుంది. కవిబ్రహ్మగా, ఉభయకవి మిత్రుడుగా ఈయన ప్రసిద్ధుడు.

"అమలోదాత్తమనీష నేనుభయ కావ్య ప్రౌఢిఁబాటించు శిల్పమునం బారగుఁడం గళావిదుఁడ"నని తిక్కనే తన నిర్వచనోత్తర రామాయణంలో తెలియజేశాడు. నిర్వచనోత్తర రామాయణాన్నే గాక భారతంలోని 15 పర్వాలను ఆంధ్రీకరించి అభినుతికెక్కాడు. రాజాస్థానంలో తాను గడించిన రాజకీయ పరిజ్ఞానమంతటినీ చొప్పించి తన రచనలకు మెరుగులు దిద్దాడు.

ద్రుపద పురోహిత రాయబారం :

అభిమన్యుడి వివాహం వైభవోపేతంగా ముగిసింది. పెళ్ళికి వచ్చిన రాజులందరూ సమావేశమై తదుపరి కార్యక్రమం గురించి ఆలోచించారు. ద్రుపద పురోహితుణ్ణి ధృతరాష్ట్రుడి దగ్గరకి రాయబారిగా పంపాలనుకొన్నారు. పాండవులకు వారి సగరాజ్యం వచ్చే విధంగా కృషి చేయమని ద్రుపదుడు తన పురోహితుణ్ణి పంపాడు.

ద్రుపద పురోహితుడు ధృతరాష్ట్రుణ్ణి, భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి, విదురుణ్ణి వారి ఇళ్ళకు వెళ్ళి కలుసుకొన్నాడు. వారిలో సానుకూలాభిప్రాయం ఏర్పరిచేందుకు ప్రయత్నించాడు. తరువాత ధృతరాష్ట్ర మహారాజు కొలువులో ఉన్నప్పుడు అందరి సమక్షంలోనూ ఈ రాయబార కార్యం నిర్వహించేందుకు ప్రయత్నించాడు.

"ధృతరాష్ట్రుడు, పాండురాజు అన్నదమ్ములు. కాబట్టి పాండవులకు అర్ధరాజ్యం రావలసి వుంది. పాండవులకు వ్యతిరేకంగా చాలా దుష్కార్యాలు జరిగాయి. వారి ప్రాణం తీసే ప్రయత్నం జరిగింది. మోసంతో వారి రాజ్యం అపహరించబడింది. ఇన్నిటికీ ఈ పెద్దరాజు సమ్మతించాడు. దీన్ని ఏమనవచ్చు. ద్రౌపదిని నిండుసభలో అవమానించడం, పాండవులను ఘోరారణ్యాలకు పంపడం, అజ్ఞాతవాస కాలంలో కూడా వారిపట్ల క్రూరంగా వ్యవహరించడం గర్హనీయం. అయినప్పటికీ పాండవులు సంధి కార్యానికి పూనుకొన్నారు. యుద్ధం వల్ల జనక్షయం జరుగుతుందని పాండవులు కౌరవులతో వైరానికి ఇష్టపడరు. అలాగని వాళ్ళు బలహీనులని మీరు భావించకూడదు. పదకొండు అక్షౌహిణులు గల కౌరవుల ముందు ఏడు క్షౌహిణులు గల పాండవులు దిగదుడుపని మీరు భావించవద్దు. భీముడు, సాత్యకే వెయ్యి అక్షౌహిణులతో సమానం. అర్జునుడు అజేయుడు. సర్వసమర్థుడైన కృష్ణుడు కూడా వారి పక్షంలోనే ఉన్నాడు. అలాంటిది వారికి సాధ్యం కానిది ఏమైనా ఉంటుందా! ఆలోచించండి. సమయం మించిపోకముందే మహనీయులైన పాండవులను పిలిపించి వారికి సగ భూమి ఇవ్వడం సబబు" అన్నాడు.

ద్రుపద పురోహితుడి మాటలు బ్రాహ్మణ స్వభావ సిద్ధంగా కాస్త కరువుగా ఉన్నట్టు చెబుతూనే ఆయన చెప్పింది సబబుగానే ఉందని భీష్ముడు తెలియజేశాడు. కర్ణుడు అధిక్షేపించాడు. దుర్యోధనుణ్ణి సమర్థించాడు. ధృతరాష్ట్ర మహారాజు కల్పించుకొన్నాడు. భీష్ముడి మాటలకు అంగీకార సూచకంగా మేమంతా కలిసి మాట్లాడుకొని మా బిడ్డలైన పాండవుల దగ్గరికి ఎవరినైనా పంపుతాములే! అని సముచితంగా ద్రుపద పురోహితుణ్ణి సాగనంపాడు.

రాయబారంలో ద్రుపద పురోహితుడిది కీలకపాత్రే అయినప్పటికీ ఆయనకు పేరు లేకపోవడం గమనార్హం.

ఉ॥ నిండుమనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత! విప్రులయందు; నిక్కమీ
రెండును రాజులందు విపరీతము; గావున విప్రుఁడోపు, నో
పండితశాంతుఁడయ్యు నరపాలుఁడు శాపము గ్రమ్మఱింపఁగన్"

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఆదిపర్వము - ప్రథమాశ్వాసము, పద్యం: (100, పుట.72)

అని నన్నయ భారత ఆదిపర్వం ఉదంకోపాఖ్యానంలో బ్రాహ్మణ స్వభావాన్ని తెలియజేసిన విధంగానే ద్రుపద పురోహితుడి మాటల్లో కాస్త పారుష్యం ధ్వనించింది. కానీ వాస్తవం ప్రతిబింబించింది. ఒక రకంగా చూస్తే పురోహితుడి మాటలు ఇస్తారా! చస్తారా! అన్నట్టున్నాయి. భారత యుద్ధానికి అంకుర్పారణ ప్రాయంగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

సంజయుడి రాయబారం :

ధృతరాష్ట్రుడు కురువంశ పెద్దలతోనూ, హితులతోనూ కలిసి సభ చేశాడు. జరుగవలసిన దాని గురించి చర్చించాడు. పాండవుల బలాన్ని బేరీజు వేశాడు. వాళ్ళవైపున గల న్యాయాన్ని గుర్తిస్తున్నట్లు తెలియజేశాడు. సంజయుడిని పిలిచాడు. ఉపప్లావ్యంలో ఉన్న పాండవుల దగ్గరకు వెళ్ళిరమ్మన్నాడు. పాండవులూ, కృష్ణుడూ ఉన్నప్పుడు ధర్మరాజుతో మాట్లాడమన్నాడు. యుద్ధం ఆలోచన అతనికి రాకుండా చూడమన్నాడు. ధృతరాష్ట్రుడు నలుగురూ మెచ్చుకొనే లాగా చెప్పాడేగానీ పాండవులకు అర్ధరాజ్యమివ్వడం అతనికి సుతరామూ ఇష్టం లేదు. ఈ విషయం అతని మాటల్లో ధ్వనిస్తూనే ఉంది.

సంజయుడు ధృతరాష్ట్రుడి అనుజ్ఞతో ఉపప్లావ్యం వచ్చాడు. మొదట కృష్ణార్జునులను కలుసుకొన్నాడు. తర్వాత ధర్మరాజును దర్శించాడు. ధర్మరాజు సంజయుణ్ణి ఆదరించాడు. అక్కడి వాళ్ళ క్షేమ సమాచారాలు అడిగాడు. పాండవుల పరాక్రమాన్ని గురించి జనులింకా చెప్పుకొంటున్నారా! అని అడుగుతూ తమ పరాక్రమాన్ని ధ్వనింపజేశాడు. సంజయుడు కూడా పాండవులను కొనియాడాడు. దుర్యోధనుడి దగ్గర అన్ని రకాల వాళ్ళుంటారని తెలియజేశాడు. ధృతరాష్ట్ర మహారాజు పంపిన సందేశాన్ని వినిపించేందుకు సిద్ధమయ్యాడు. "నేనిక్కడికి బయలుదేరి వచ్చేటప్పుడు ధృతరాష్ట్ర మహారాజు స్వయంగా నా రథం దగ్గరకు వచ్చాడు. మీకిలా తెలియజేమన్నాడు.

మీరు ధర్మాత్ములు! శాంతచిత్తులు! యుద్ధం లాంటి పాపపు పనిచేయడం మీకు తగదు. ఉతికిన వస్త్రానికి మసి అంటుకున్నట్టు కురువంశాన్ని దుర్యోధనుడు కళంకితం చేశాడు. దాన్ని పోగొట్టగల సమర్థుడవు నీవు మాత్రమే. యుద్ధం చేస్తే రెండు వైపులా బాలుర దగ్గర నుంచి వృద్ధులు దాకా అనేక మందిని కోల్పోవలసి వస్తుంది. పైగా జయాపజయాల సంగతి కచ్చితంగా చెప్పలేము. మీవైపు వారందరూ మహావీరులే. ఆ వైపు వారు కూడా తక్కువైన వారేమీ కాదు. కాబట్టి యుద్ధం మానుకోవడం మంచిది" అని చెబుతూనే ధర్మరాజును శాంతింపజేయమని సభలోని వారందరినీ సంజయుడు కోరాడు.

ధర్మరాజు సంజయుడి మాటలకు సముచితంగానే స్పందించాడు. "ధృతరాష్ట్ర మహారాజు మాటలు, ప్రవర్తన మొదటి నుంచి తెలిసినవే కదా! కొడుకూ, అతని సలహాదారులు ఎలా నడిపిస్తే అతడు కూడా అలాగే ప్రదర్శిస్తాడు. యుద్ధం లేకుండానే అర్ధసిద్ధి కలిగితే యుద్ధం చేయాలని మాకు మాత్రం ఎలా అనిపిస్తుంది. ఎదుటి వాళ్ళను కూడా తమలాగే చూసుకొంటే మైత్రి కుదురుతుందిగానీ కుడుమంతా మాకిచ్చి ఒక ముక్కను మాత్రం మీరు తీసుకోండి అంటే ఎలా కుదురుతుంది.

కం॥ ఎదిరిం దమయట్టులకా
మదిఁదలఁచిన బొసఁగుఁగాక, మాకుంగుడు మిం
డిదె మీరు ప్రక్కఁగొనుఁడని
చదురడిచిన మనసు పొందు చక్కంబడునే?

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - ప్రథమాశ్వాసము, పద్యం: 312, పుట.121)

నువ్వు మొదట మమ్మల్ని పొగిడావు. కౌరవులను గెలవడం కష్టతరమన్నావు. ఈ మాటకు నేనంగీకరించను. నువ్వు నిష్పక్షపాతంగా మాట్లాడుంటే బాగుండేది. వాళ్ళు మాకు చేసిన ఎగ్గులన్నీ నువ్వు మర్చిపోయావా! లేదా తెలియని అజ్ఞానమా!".

ధర్మరాజు మాటల్లో కాఠిన్యం ధ్వనించింది. సంజయుడు మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు. "ధర్మరాజా! నువ్వు ధర్మమూర్తివి. ధర్మ చరిత్రుడివి. కాబట్టే నువ్వన్న మాటలు పట్టించుకోకుండా మళ్ళీ చెప్పడానికి సాహసిస్తున్నాను. ఎందరు ఎన్ని ఎగ్గులు చేసినా వాటిని ఓర్చుకొనే స్వభావం నీది. అహింసే నీ ప్రవృత్తి. దానికి భిన్నంగా నడుచుకొని కళంకితం చేసుకొంటావా! కౌరవులు రాజ్యభాగమియ్యకుండా చెడిపోయినప్పటికీ యుద్ధం చేసి నెత్తురు కూడు తినడం కంటే మీ ప్రవర్తనకు సముచితం భిక్షాన్నమే సుమా!

కం॥ పాలీక కౌరవులు దు
శ్శీలతఁజెడఁ దలఁచిరేనిఁ, జెప్పెద, రుధిరా
భీలాన్నంబునకంటెను
మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము – ప్రథమాశ్వాసము, పద్యం: 329, పుట.127)

నువ్వు రాజసూయ యజ్ఞం చేసి దేవతలను మెప్పించావు. గొప్పశాంతితో విరాజిల్లావు. అలాంటి నీ చరిత్ర ఇప్పుడు హింసతో మైలపడడం సబబా! కౌరవులు అవినీతితో జూదమాడి నిన్ను ఇబ్బంది పెట్టారు. నువ్వు ఓర్చుకొన్నావు. అడవుల్లో కష్టాలనుభవించావు. ఇలాంటి వాడివి వెదకి వెదకి పెద్దలను, గురువులను వధించడం సముచితం అంటావా! హాలాహలంలాంటి కోపాన్ని మింగడంలో ఈశ్వరుడి తర్వాత పేర్కొనదగిన వాడివి నువ్వే సుమా!

తేట॥ అల్పులకు మ్రింగఁజేఁదైనహాలహలము
భంగిఁబొంగెడు కోపంబు మ్రింగికొనఁగ
నీలగళు నెన్ని నిన్నెన్నఁబోలు; నట్టి
నీవు సాలినఁగాకేల నెగడుఁబేరు?

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము – ప్రథమాశ్వాసము, పద్యం: 333, పుట.129)

కాబట్టి నువ్వు శాంతాన్ని పాటించి అనంతకీర్తి గడించు" అని సంజయుడన్నాడు.

ధర్మరాజు సంజయుడి మాటలకు అడ్డుతగిలాడు. చెప్పటం ప్రారంభించాడు. "సంజయా! నువ్వు చెప్పింది ధర్మంగానే ఉంది. అయితే కొన్ని పైకి ధర్మంగా కనిపించినప్పటికీ అధర్మంగానే ఉంటాయి. మరికొన్ని అధర్మంగా కనిపించినప్పటికీ ధర్మాలుగానే ఉంటాయి. శాంతంగా ఉండమనడం. హింస వద్దనడం ధర్మమే! అయితే లోక కంటకులను, కులనాశకులను శిక్షించడం ధర్మమంటావా! కాదంటావా! రాజులకు యుద్ధం చేయడం ధర్మమో! కాదో! నువ్వే చెప్పు. ఇన్నెందుకు కానీ ధర్మాధర్మ నిర్ణేత వాసుదేవుడిక్కడే ఉన్నాడు కదా! ఆయన చెప్పినట్లే యాదవులంతా ధర్మపథంలో ప్రవర్తిస్తున్నారు. ఈయన చెప్పేది మనకు శిరోధార్యం".

అక్కడే ఉన్న శ్రీకృష్ణుడు కలుగజేసుకొన్నాడు. సంజయుడితో చెప్పసాగాడు. "నేనెప్పుడూ పాండవుల మేలు కోరేవాడినైనప్పటికీ కౌరవులకు కూడా కీడు కలుగకూడదని భావిస్తా, ధృతరాష్ట్ర మహారాజు నిన్ను పంపడం, నువ్వు ఇక్కడికి వచ్చి తగిన విధంగా మాట్లాడడం నాకు సంతోషాన్నే కలిగిస్తున్నాయి. అయితే ధర్మరాజు మాటలు గమనిస్తే సంధి కలిగేట్టు తోచడం లేదు. దుర్యోధనుడు మత్తుతో మసులుకొంటాడు.

అలాంటప్పుడు వీలిద్దరికీ స్నేహం ఎలా పొసగుతుంది. పాండవులు తమ రాజ్యభాగాన్ని పొందకుండా ఒట్టిమాటలతో సరిపుచ్చుకొంటారా! తమ రాజ్య భాగం కోసం యుద్ధం చేయడం అధర్మం ఎలా అవుతుంది. రాజులు ఇచ్చేవారే కానీ పుచ్చుకొనేవారు కారు. కౌరవులెప్పుడూ దుర్మార్గంలోనే ప్రవర్తిస్తారు. జూదాలు ఎందరు ఆడడం లేదు? ఆ రోజు కౌరవసభలో ద్రౌపదిని ఆ విధంగా అవమానిస్తారా! దుశ్శాసనుడు వెంట్రుకలు పట్టి ఈడ్చుకొని వచ్చి సభలో అవమానం చేయపూనుకొన్నప్పుడు భీష్మాదులైన పెద్దలు కూడా ఏమీ మాట్లాడలేకపోయారు. ఆ రోజు ధృతరాష్ట్రుడు తన కొడుకులకు బుద్ధి చెప్పి ఆ దుష్కార్యాన్ని వారించి వుంటే బాగుండేది. అది విడిచిపెట్టి ఈ రోజు నిన్ను పంపడం, వారి క్షేమాలు తెలుసుకోమనడం ఎలా వీలైంది? ద్రౌపదిని నిందించిన అప్పటి కర్ణుడి మాటలు మరచిపోదగ్గవేనా?

కం॥ 'లే రిచట మగలు నీకును;
వీరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్;
వారిజలోచన! నీపైఁ
గూరిమి గల మగని వెదకికొనుమొరు' ననఁడే?

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - ప్రథమాశ్వాసము, పద్యం: 350, పుట.137)

కౌరవులు అధర్మ వృక్షప్రాయులు. పాండవులు ధర్మ వృక్షప్రాయులు. వీరికీ వారికీ పొత్తు ఎలా పొసగుతుంది. నేను పాండవులను ఎలాగో బ్రతిమలాడి అక్కడికి వస్తాను. కౌరవులకు హితం చెబుతాను. వారు విని రాజ్యభాగం ఇస్తే సరి. లేకపోతే పాండవులకు యుద్ధమే శరణ్యం. పాండవులు, కౌరవులు కలిసి ఉంటేనే బాగుంటుంది. ఎందుకంటే కౌరవులు అరణ్యం వంటివారు. పాండువులు సింహాల వంటివారు. కాబట్టి సింహాలు లేని అరణ్యానికి గానీ అరణ్యంలేని సింహాలకుగానీ క్షేమకరం కాదు. అందువల్ల నేను హస్తినకు వస్తాను. వారితో మాట్లాడుతాను."

కృష్ణుడి మాటలు విన్న సంజయుడు తాను వచ్చిన పని అయిపోయినట్టే భావించాడు. ధర్మరాజును తాను వెళ్ళేందుకు అనుమతి కోరాడు. ధర్మరాజు ధృతరాష్ట్రుడికి చెప్పమని కొన్ని మాటలు చెప్పాడు. తమ తండ్రి భాగాన్నిచ్చి ఆనాడు ఆదుకొన్న ధృతరాష్ట్రుడు ఈనాడు అలా ఇవ్వడానికి విముఖంగా ఉండడం సబబేనా? అని ప్రశ్నించాడు.

శంతన మహారాజు వంశాన్ని నిలిపింది భీష్ముడే కాబట్టి ఇప్పుడు కూడా తన మనుమలకందరికీ పొత్తు కుదిర్చి అధర్మానికి, మరణానికి వారిని దూరంగా ఉంచుమని ఆయనతో చెప్పమన్నారు. సభలోని వారందరూ వినే విధంగా దుర్యోధనుడితో కూడా ఈ మాటా చెప్పు. బలాఢ్యులను బలహీనులను చేసి అడవులకు పంపావు. ద్రౌపదిని నిండు కొలువులో అవమానించావు. వీటన్నిటినీ ధర్మరాజు సంహించాడు. వాళ్ళ భాగాన్ని వాళ్ళకిచ్చివేయ్. యుద్ధంలో కురుకుమారులను బలి పెట్టవద్దు. ఇతరుల సొమ్ముకు ఆశ పడవద్దు. మాతో కలిసి ఉంటే తనకే మంచిదని చెప్పు. దుర్యోధనుడి మనసులో దురాశ ప్రజ్వరిల్లుతూ ఉంది. దాన్ని ఆర్పడానికి ఎవరివల్లా కాదు. అందుకే నేనీమాటలు చెప్పవలసి వచ్చింది. దుర్యోధనుడి దగ్గర చాలా మంది వీరులున్నారు. కాబట్టి యుద్ధంలో గెలవవచ్చనుకుంటున్నాడు. మావైపున ధర్మం ఉంది. ధర్మ స్వరూపుడైన కృష్ణుడున్నాడు. అందువల్ల మమ్మల్ని గెలవడం వారికి సాధ్యం కాదు. అర్ధ రాజ్యం ఇవ్వడం ఇష్టంలేకపోతే కుశస్థలం, వృక్షస్థలం, వాసంతి, వారణావతం ఈ నాలుగు ప్రదేశాలనైనా ఇవ్వమను. మా ఐదుగురు ఉండేందుకు చోటిచ్చినా చాలు. ఈ విధంగా చేసి యుద్ధాన్ని నివారించమను అని ధర్మరాజు సంజయుడికి తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పాడు.

సంజయుడు హస్తినాపురానికి బయలుదేరాడు. అతడితో అర్జునుడు కూడా మాట్లాడాడు. సంజయుడు తమకు బాల్యసఖుడు కాబట్టి పాండవ కౌరవుల ప్రవర్తన మొదటి నుంచీ తెలిసినవాడన్నాడు. ధర్మరాజు వారించడం బట్టి భీమసేనుడు వారి మీద పడలేదు. లేకపోయుంటే వాళ్ళెప్పుడో హతులైయుండేవారని తెలియజేసి అర్జునుడు కూడా సంజయుణ్ణి సాగనంపాడు.

సంజయుడు హస్తినాపురం చేరుకొన్నాడు. ధృతరాష్ట్రుడికి తనరాక తెలియజేశాడు. వెళ్ళి వచ్చిన పని విన్నవించాడు. భాగమివ్వకపోతే పాండవ విజృంభణ తప్పదని ధ్వనింపజేశాడు. మరుసటి రోజు వచ్చి అంతా చెబుతానని వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు ధృతరాష్ట్రుడి సభ కూడింది. ధృతరాష్ట్రుడు కృష్ణుడి అభిప్రాయాన్ని, అర్జునుడి అభిప్రాయాన్ని, ధర్మరాజు అభిప్రాయాన్ని సంజయుడి ద్వారా తెలుసుకొన్నాడు. పాండవుల బలానికి భయపడ్డాడు. దుర్యోధనుడు కూడా తమ వారి బలాన్ని ప్రశంసించుకొన్నాడు. కర్ణుడు కూడా దుర్యోధనుణ్ణి సమర్థించాడు. భీష్ముడు కర్ణుణ్ణి అధిక్షేపించాడు. భీష్ముడు మరణించేదాకా తాను యుద్ధంలో పాల్గొనని కర్ణుడు ప్రతిజ్ఞ చేశాడు.

సంజయుడు పాండవుల చేత యుద్ధాన్ని మాన్పించాలని విఫల ప్రయత్నం చేశాడు. కృష్ణుడు, ధర్మరాజు, అర్జునుడు భాగమివ్వకపోతే యుద్ధం తప్పదని ధ్వనింపజేశారు. కౌరవసభలో సంజయుడు తాను వెళ్ళి వచ్చిన దానిని నివేదించాడు. దుర్యోధనాదులు కూడా భాగమిచ్చేందుకు విముఖతనే చూపారు. యుద్ధానికి సంసిద్ధతను ధ్వనింపజేశారు. పాండవుల, కౌరవుల మనస్తత్వంలో సంజయ రాయబారం ఎటువంటి మార్పునూ తీసుకురాలేకపోయింది. నామ మాత్రంగానే మిగిలిపోయింది.

శ్రీకృష్ణుడి రాయబారం :

ఉపప్లావ్య నగరంలో తమ్ములు, ద్రౌపది వెంటరాగా ధర్మరాజు శ్రీకృష్ణుడిని కలుసుకొన్నాడు. తమకు పెద్ద దిక్కుగా పాండురాజు శ్రీకృష్ణుడిని చూపి వెళ్ళాడన్నాడు. ఏవిధంగానైనా సంధి కుదిర్చి తమభాగం ఇప్పించమన్నాడు. శత్రుత్వమే ఏర్పడితే పామున్న ఇంటిలో కాపురమున్నట్టే ఉంటుందిగానీ ఒకసారైనా మనస్సు నిమ్మళంగా ఉండదు. కాబట్టి పగ మంచిది కాదని సవివరంగా తెలియజేశాడు.

ఆట॥ పగయ కలిగె నేనిఁబామున్న యింటిలో
నున్న యట్లకాక యూఅడిల్లి
యుండు నెట్లు చిత్త మొకమాటుఁగావున
వలవ దధిక దీర్ఘవైర వృత్తి

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము, పద్యం: 20, పుట.310)

భీముడు ధర్మరాజును ఎద్దేవా చేసేవిధంగా మాట్లాడాడు. కృష్ణుడు భీముడి వైఖరిని నిరశిస్తూ యుద్ధానికి ప్రోత్సహించాడు. అర్జునుడు కూడా భారం కృష్ణుడి మీదే వేశాడు. నకులుడు ధర్మరాజును సమర్థిస్తూ మాట్లాడాడు. సహదేవుడు మాత్రం యుద్ధాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడాడు. ద్రౌపది అప్పుడే వేసుకొన్న కొప్పును గ్రక్కున విప్పి, సభలో తనకు జరిగిన అవమానాన్ని గుర్తు చేసింది.

ఉ॥ ద్రోవది బంధురం బయిన క్రొమ్ముడి గ్రమ్మన విప్పి, వెండ్రుకల్
దా వలచేతఁబూని, యసితచ్ఛవిఁ బొల్చు మహాభుజంగమో
నా విలసిల్లి వ్రేలఁగ, మనంబునఁ బొంగు విషాద రోషముల్
గావఁగ లేక బాష్పములు గ్రమ్మఁగ దిగ్గన లేచి యార్తయై

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము, పద్యం: 114, పుట.370,371)

దానికి ప్రతిగా యుద్ధమే శ్రేయోదాయకమని చెప్పింది. కృష్ణుడు ద్రౌపదిని ఓదార్చాడు. యుద్ధం తప్పదని, విజయం తథ్యమని, ప్రయత్నమైతే చేస్తున్నామని ఆమెకు నచ్చజెప్పాడు. పాండవ రాయబారిగా కౌరవుల దగ్గరకు బయలుదేరాడు.

శ్రీకృష్ణుడు హస్తినాపురం చేరుకొన్నాడు. ధృతరాష్ట్రుడికి హితవు పలికాడు. కౌరవపక్షంలోని పెద్దలను వేరువేరుగా కలుసుకొన్నాడు. విదురుడి ఇంట్లో విడిది చేశాడు. సంధి విఫలమవుతుందని విదురుడు చెప్పినప్పుడు యుద్ధం జరిగితే భూభారం తగ్గుతుందని కృష్ణుడు చెప్పాడు. సంధికి ప్రయత్నించడం మాత్రమే తన పనన్నాడు. మరుసటి రోజు కృష్ణుడు ధృతరాష్ట్రుడికి కొలువుకు వెళ్ళాడు. కృష్ణ ప్రసంగాన్ని వినేందుకు వచ్చిన మునులను ఆదరించాడు. అందరూ వింటుండగా ధృతరాష్ట్రుడితో తన ఉద్దేశాన్ని తెలియజేశాడు.

పాండవులు, కౌరవులు పాలూనీళ్ళలా కలిసి ఉండడమే అందరికీ శ్రేయస్కరమన్నాడు. అలా కలిసి ఉండేట్టు చేయడం ధృతరాష్ట్ర మహారాజుకు యుక్తమని చెప్పాడు. పాండవుల్లో భీమార్జునులు, కౌరవ పక్షంలో భీష్మద్రోణులు ఎదుర్కోజాలని వీరులన్నాడు. వాళ్ళెవ్వరూ యుద్ధంలో మరణించకుండా ఉండడం అందరికీ హితకరమన్నాడు. సంధి కుదిర్చి సముద్రవలయిత భూభాగాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలమని ధృతరాష్ట్రుడికి సూచించాడు. పాండవ, కౌరవులు కలిసి ఉండటమే శ్రేయస్కరమని పునరుద్ఘాటించాడు.

ఉ॥ కౌరవ పాండవుల్ తెఱఁగు గైకొని శాంతతఁబొందియున్కి మే
లారయ నాకు నీకుఁ గులమంతకు నీ నృపకోటి కుర్వకిం
బోరితమైన నింతకును బుట్టు మహాపద గావునన్ ధరి
త్రీ రమణాగ్రగణ్య! గణుతించి యవశ్యముఁ బొందొనర్పవే!

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము, పద్యం: 262, పుట.446)

కౌరవులు అధర్మపరులని కృష్ణుడు తన ప్రసంగంలో ధ్వనింపజేశాడు. యుద్ధం వస్తే కౌరవ, పాండవులకే గాక తక్కిన రాజలోకానికంతటికీ కూడా ఘోరవిపత్తుగా పరిణమించగలదని ప్రస్ఫుటీకరించాడు. పాండవులు తండ్రిలేని పిల్లలు. వారిని మొదటి నుంచి ధృతరాష్ట్రుడే కాపాడాడు. పాండవులు ధృతరాష్ట్రుడి ఆజ్ఞ మేరకు పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేసి వచ్చారు. కష్టాలు పడ్డారు. ఇప్పుడు తమ భాగం కోసం ఎదురుచూస్తున్నారు. కాబట్టి వారి భాగం వారికివ్వడం సముచితమని కృష్ణుడు ధ్వనింపజేశాడు. పాడవుతున్న ధర్మాన్ని రక్షించే శక్తి ఉన్నప్పటికీ ఎవరు ఉపేక్ష చేస్తారో వారికే అది చేటవుతుంది. భగవంతుడు తప్పక సత్యాన్ని రక్షిస్తాడు అని చాలా చక్కగా కృష్ణుడు తెలియజేశాడు.

ఉ॥ సారపు ధర్మమున్ విమల సత్యముఁబాపము చేత బొంకుచేఁ
బారముఁబొందలేక చెడఁబాఱినదైన యవస్థ దక్షు లె
వ్వారలుపేక్ష సేసిరది వారల చేటగుఁగాని ధర్మని
స్తారక మయ్యు సత్య శుభదాయక మయ్యును దైవ ముండెడున్",

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము, పద్యం: 273, పుట.454)

సమర్థులై కూడా ధర్మరక్షణకు పూనుకోని భీష్మద్రోణాదులకు ముప్పు మూడుతుందని కృష్ణుడిక్కడ ధ్వనింపజేసినట్లయ్యింది.

దుర్యోధనుడి దురాలోచనను కృష్ణుడు దుయ్యబట్టాడు. పాండవులకు చేసిన అపకారాలను ఏకరువు పెట్టాడు. వాటికన్నిటికీ ధృతరాష్ట్రుడి అంగీకారం కూడా ఉందని నిందించాడు. అయినప్పటికీ శాంతశూరులైన

పాండవులు ధృతరాష్ట్రుణ్ణి సేవించడానికి సిద్ధంగా ఉన్నారని పునరుద్ఘాటించాడు. వారు ఆ విధంగా కలసి మెలసి వర్తించటం మీకు ఇష్టం లేకపోతే ఈ పాటికి యుద్ధం చేయడానికి వస్తూ ఉంటారు. సంధి, సంగ్రామం ఈ రెండింటిలో మీకేది మంచిదని తోస్తుందో దానిని నిర్ణయించి వెల్లడించండన్నాడు.

ఉ॥ 'వారలు శాంతశూరులు; భవచ్చరణంబులు గొల్వఁబూని యు
న్నా;రటుఁగాక మీకది మనంబున కప్రియమేని నింతకుం
బోరికి వచ్చుచుండుదురు; భూవర! రెండు దెఱంగులందు నీ
కారయఁబథ్యమేది యగు నవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!"

(శ్రీమదాంధ్ర మహాభారతము, ఉద్యోగపర్వము - తృతీయాశ్వాసము, పద్యం: 284, పుట.461)

శ్రీకృష్ణుడి ప్రసంగం దుర్యోధనాదులకు తప్ప తక్కిన అందరికీ నచ్చింది. సంధికి అంగీకరించుమని అందరూ దుర్యోధనుడిని కోరారు. అయితే దుర్యోధనుడు ససేమిరా అన్నాడు. మళ్ళీ కృష్ణుడు కలుగజేసుకొన్నాడు. మొదటి నుండి పాండవులకు కీడు చేసిన దుర్యోధనుడి తీరును ఖండించాడు. అతణ్ణి పరిత్యజించైనా కులాన్ని రక్షించవలసిందిగా ధృతరాష్ట్రుడికి సూచించాడు. దుర్యోధనాదులు శ్రీకృష్ణుణ్ణి బంధించి కారాగారంలో ఉంచాలని చూశారు. శ్రీకృష్ణుడు మందహాసం చేశాడు. అక్కడి వాళ్ళకు తన విశ్వరూపం చూపాడు. భీష్మ, ద్రోణ, విదుర, సంజయులకు, ధృతరాష్ట్రుడికి కూడా దివ్య దృష్టిని ప్రసాదించాడు. వారందరూ ఆనందించారు. తర్వాత శ్రీకృష్ణుడు సాత్యకితో కలసి సభ నుంచి నిష్క్రమించాడు.

శ్రీకృష్ణుడు భూదేవి కోరిక మేరకు భూభాగాన్ని తొలగించవచ్చిన మహావిష్ణువు. యుద్ధం జరిగితేనే భూభారం తగ్గుతుంది. కాబట్టి యుద్ధం జరగాలన్నదే ఆయన సంకల్పం. అయితే సంధి ప్రయత్నం అందరికీ మేలని కూడా ఆయనకనిపించింది. అందువల్లనే ఆ నాటకమాడాడు. సత్యాన్ని, ధర్మాన్ని కౌరవపక్షం వారికి చెప్పాడు. వారు వినరని కూడా ఆయనకు తెలుసు. అయినప్పటికీ చెప్పాడు. ఇక్కడ శ్రీకృష్ణరాయబార ఫలితం యుద్ధ ప్రతిపాదనే అని రూఢియవుతూ ఉంది.

ఉలూక రాయబారం :

భారత రాయబారాల్లోకెల్లా ఉలూక రాయబారమే చాలా చిన్నది. ఏకపక్షమైంది. రెచ్చగొట్టే ధోరణితో కూడుకొన్నది. దుశ్శాసనాదులతో సంప్రదించి దుర్యోధనుడు ధర్మరాజు దగ్గరకు దూతగా శకుని కుమారుడైన ఉలూకుణ్ణి పంపాడు. తన మాటలుగా వారితో కొన్ని చెప్పమన్నాడు. ఉలూకుడు ఉపప్లావ్యానికి వెళ్ళాడు. ధర్మరాజు నిండుకొలువులో ఉన్నప్పుడు ఆయన్ను దర్శించుకొన్నాడు. దుర్యోధనుడి అభిప్రాయాన్ని తెలియజేశాడు. రేపే యుద్ధమని, యుద్ధానికి సిద్ధమై రమ్మని ధర్మరాజుకు చెప్పాడు. దుశ్శాసనుడి రొమ్ము చీల్చి నెత్తురు తాగుతానన్న ప్రతిజ్ఞ నిలబెట్టుకొమ్మని భీముడికి చెప్పాడు. కౌరవుల చేతుల్లో చిక్కి భీముడు ఇబ్బంది పడతాడన్నాడు. అర్జునుడిని, అతడి పరాక్రమాన్ని ఎగతాళి చేశాడు. కృష్ణుడు కలుగజేసుకొన్నాడు. కౌరవులకు యుద్ధంలో మరణం తప్పదని హెచ్చరించి ఉలూకుడిని పంపివేశాడు.

ఉలూకుడి రాయబారం కౌరవ పక్షపాతంగానే గాక చాలా పరుషంగా కూడా సాగింది. దాని ద్వారా కౌరవులు ఆశించిన ప్రయోజనం నెరవేరింది.

నీతి విచక్షణులు భారతాన్ని నీతిశాస్త్రంగా కొనియాడుతారని నన్నయ భారతావతారికలో తెలియజేశాడు. ఎన్నో నీతులు, నీతి కథలు భారతంలో చోటు చేసుకొన్నాయని అభిప్రాయం. నీతి మార్గం బోధించే విధంగానూ, మంచిని ప్రవచించే విధంగానూ, హితాన్ని బోధపరిచే విధంగానూ రాయబార ఘట్టాలు భారతంలో

చోటుచేసుకొన్నాయి. పలు రాయబారాలు భారతంలో ఉన్నప్పటికీ రాజకీయ రాయబారాలనే ఇక్కడ స్వీకరించడం జరిగింది. 'అంగద రాయబారం' భారతారణ్యపర్వ రామాయణంలోనిది. ద్రుపద పురోహిత రాయబారం, సంజయ రాయబారం, కృష్ణ రాయబారం, ఉలూక రాయబారాలు భారతానికి సంబంధించినవే. ఈ రాయబారాలన్నీ కూడా పంపిన వారి అభిప్రాయాన్ని, మనస్తత్వాన్ని చక్కగా తెలియజేస్తున్నాయి. రాయబారులు వెళ్ళినప్పటి పరిస్థితులను కూడా చక్కగా చిత్రిస్తున్నాయి. రాయబారులకు మార్గదర్శకంగా కూడా ఇవి రూపొందాయంటే అతిశయోక్తి కాదు.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము - తి.తి.దే., తిరుపతి.
2. డాక్టర్ జి.నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష (ప్రథమ సంపుటము)

❖❖❖

మహాభారతం - వ్యక్తిత్వ వికాసం

డాక్టర్ సి.చెన్నకేశవులు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

"ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ!
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్"

పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలకు సంబంధించి మహాభారతంలో ఉన్నదే అంతటా ఉన్నది. ఇందులో లేనిది మరెక్కడా లేదని మహాభారతం ప్రకటించుకున్నది. "యతో ధర్మ స్తతో జయ:" ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ విజయం సిద్ధిస్తుంది అని నిరూపించడానికై రాయబడిన ఇతిహాసం మహాభారతం. భారతీయ సంస్కృతికి మహాభారతం కల్పవృక్షం వంటిది. భారతీయ విజ్ఞాన సర్వస్వాలైన వేదాలలోని పరమార్థాన్నంతా మహాభారతం ప్రతిపాదిస్తుంది. కనుకనే పంచమవేదంగా కీర్తి గాంచినది. సూర్యోదయం, ప్రియమిత్రుడు, ఇష్టభార్య, తాంబూల సేవనం, మహాభారత కథ ఈ ఐదు నిత్యనూతనాలుగా చెప్పబడ్డాయి. నన్నయ "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని....."[1] పద్యంలో మహాభారతాన్ని ధర్మశాస్త్రంగా, వేదాంతంగా, నీతిశాస్త్రంగా, మహాకావ్యంగా, సర్వలక్షణ సంగ్రహంగా, ఇతిహాసంగా, పురాణ సముచ్ఛయంగా పలువురకు బహువిధంబులుగా భాసిల్లుతుందని ప్రశంసించాడు. నవరస భరితమై, బహునాయకాశ్రయమై, ఆఖ్యానోపాఖ్యానాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఇతిహాసంగా మహాభారతం సుప్రసిద్ధిని పొందినది.

మహాభారతంలో మనిషి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే అంశాలు అనేకం ఉన్నాయి. భగవద్గీత ఆసాంతం వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినదే. కర్తవ్య విముఖుడై తీవ్ర భావోద్వేగంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అర్జునున్ని కర్తవ్యోన్ముఖున్ని చేయడానికి కృష్ణుడు చెప్పిన ఉపదేశమే గీత. భగవద్గీతను ప్రాచీన వ్యక్తిత్వ వికాస గ్రంథంగా చెప్పవచ్చును.

మనిషికి వ్యక్తిత్వం ప్రధానమైన అంశం. వ్యక్తిత్వంలేని మనిషి మృగప్రాయుడు. పశుపక్ష్యాదుల నుండి మానవుని వేరుచేసేది మంచిచెడుల విచక్షణాజ్ఞానమే. వ్యక్తిత్వం మానవుని విలక్షణజీవిగా, ఉన్నతునిగా నిలుపుతుంది. ఆధునికకాలంలో జీవనవిధానంలో, సామాజిక పరిస్థితులలో పెనుమార్పులు సంభవించాయి. ప్రతిమనిషి అంతర్గతంగాను, బహిర్గతంగాను, కుటుంబపరంగా, సామాజికంగా తీవ్రమైన ఒత్తిడిని, భావోద్వేగాలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మహాభారత పఠనం వ్యక్తిత్వ నిర్మాణానికి ఉపయుక్తం అవుతుంది. శాంతరస ప్రధానమైన భారతంలోని అనేక ఉపదేశ సందేశాలు, నీతి బోధనలు మనిషిని తీవ్రమైన భావోద్వేగాల నుండి ఉపశమింపజేస్తాయి. ప్రశాంత జీవనానికి ఉపకరిస్తాయి. "చారుశీల గుణ వర్జన మర్షము కాదు చూడగన్"[2] అని పెద్దల మాట. ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంత క్లిష్ట పరిస్థితులు ఎదురైనా ఉత్తములు తమ వ్యక్తిత్వాన్ని విడిచి పెట్టరు. మహాభారతంలోని సన్నివేశాలు, పాత్రలు విలువైన సందేశాన్ని ఇస్తాయి. వ్యక్తిత్వ నిర్మాణానికి సోపానాలుగా నిలుస్తాయి.

తల్లిదండ్రులు దైవసమానులు. ప్రతి మనిషి తనకు జన్మనిచ్చి, పెంచి పెద్ద చేసిన మాతాపితరుల పట్ల భక్తిశ్రద్ధలు కలిగి, ఆదరాభిమానాలతో ఆదరించాలని గరుత్మంతోపాఖ్యానం ప్రబోధిస్తుంది. "బ్రహ్మణ్ముడగు కశ్యప బ్రహ్మ వరమున! వినతకు బుట్టిన యనఘమూర్తి..... వీగి తనతల్లి దాస్యంబు నీగ బూని తడయ కమృతంబు గొనిపోవ గడగి వచ్చె"[3] అని తల్లి దాస్య విముక్తి కొరకు దేవేంద్రుని ఎదిరించిన గరుత్మంతుని కథ

ఆదర్శనీయం. భీష్ముడు పితృభక్తి పరాయణుడు. వయోవృద్ధుడైన తండ్రికి ద్వితీయ వివాహం చేయడానికై తాను ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండిపోయిన అనితర త్యాగశీలి. పాండవుల పితృభక్తి కూడా ఎన్నదగినది. ధర్మజుని యువరాజు పట్టాభిషేకాన్ని కూడా తిరస్కరించిన పాండవులు తమ తండ్రి పాండురాజునకు స్వర్గలోక ప్రాప్తి కొరకు తల్లి కుంతీదేవితో కలసి వారణావ్రతం సల్పినారు. తల్లిదండ్రులను ఆదరించడం మనిషి వ్యక్తిత్వంలో మొదటి మెట్టు. అలాగే తల్లిదండ్రులు కూడా తమ సంతానాన్ని సత్ప్రవర్తనతో పెంచాలి. మితిమీరిన పుత్ర వ్యామోహం వారి వినాశనానికే హేతువు అవుతుందని ధృతరాష్ట్రుని పుత్ర వ్యామోహం తెలియజేస్తుంది. పిల్లలకు బాల్యం నుండే మంచి చెడులను బోధించి వారిని సన్మార్గంలో నడిపించాలని మహాభారతం ఉద్ఘాటిస్తుంది.

తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువు. మహాభారతంలో గురుశిష్య సంబంధాలు ముఖ్య భూమికను పోషించాయి. విద్య రెండు రకాలు. మానవుడు ఎలా ఉండా తెలిపేది సకారాత్మక విద్య (Positive Education) ఎలా ఉండకూడదో తెలిపేది నకారాత్మక విద్య (Negative Education) గురువు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో భారతంలో వివరింపబడింది. గురువుకు శిష్యులందరూ సమానమే. శిష్యుల పట్ల ఎటువంటి వివక్ష, పక్షపాతం చూపించకూడదు. కులం కారణంగా కర్ణున్ని, ఏకలవ్యున్ని శిష్యులుగా స్వీకరించకుండా తిరస్కరించిన వాడు, అర్జునుని కొరకు ఏకలవ్యుని బొటనవేలును గురుదక్షిణగా కోరినవాడు ద్రోణుడు. అలాగే శిష్యులందరికీ పెద్ద పెద్ద ఘటాలు ఇచ్చి, తన పుత్రుడైన అశ్వత్థామకు మాత్రం చిన్న ఘటాలు ఇచ్చి నీళ్ళు తెప్పించేవాడు. ద్రోణుని పాత్ర ద్వారా గురువు ఎలా ఉండకూడదో తెలుసుకోవచ్చు.

విద్యయందు అనురక్తుడైన వాడు విద్యార్థి. "విద్యా తురానాం నసుఖం ననిద్ర" ఉత్తమ విద్యార్థి విద్యాభ్యాసనలో సుఖాన్ని కానీ, నిద్రను కానీ లక్ష్య పెట్టడు. ఏకలవ్యుడు, కర్ణుడు, అర్జునుడు విద్యపట్ల ప్రగాఢమైన ఆసక్తిని, అనురక్తిని కలిగినవారు. ద్రోణుడు తమను శిష్యులుగా స్వీకరించకుండా తిరస్కరించినా గొప్ప పట్టుదలతో ధనుర్విద్యలో అద్భుతమైన నైపుణ్యాన్ని సాధించినవారు ఏకలవ్యుడు, కర్ణుడు. అర్జునుడు కూడా విద్య పట్ల అమితమైన శ్రద్ధాసక్తులు కలవాడు. ఒకనాటి రాత్రి వేళ అర్జునుడు భోజనం తింటూ ఉండగా గాలికి దీపం ఆరిపోయింది. చీకట్లోనే భోంచేసిన అర్జునుడు చీకటల్లో బాణాలు వేయడం సాధన చేసి, శబ్ద భేదిని విద్యను సాధించాడు. ద్రోణుడు పెట్టిన లక్ష్యశుద్ధి పరీక్షలో సైతం అర్జునుడు మాత్రమే "పక్షి శిరంబు దిరంబుగ వీక్షించితి, నొండుగాన నెద్దియు"[4] అని లక్ష్యాన్ని భేదించి నెగ్గడం లోకవిదితం. విద్యార్థి విద్య పట్ల శ్రద్ధ, ఆసక్తి, పట్టుదల కలిగి ఉండాలి. అప్పుడే ఉత్తమ విద్యార్థిగా రాణించగలరని మహాభారతం తెలియజేస్తుంది.

కర్తవ్య నిర్వహణకు మించిన తపస్సులేదు. తనపై రెట్ట వేసిందని కంటిచూపు ద్వారా కొంగను బూడిద చేయగలిగిన తపశ్శక్తి సంపన్నుడు కౌశికుడు. అతను పతివ్రతామణియైన ఒక గృహిణి ద్వారా, తల్లిదండ్రులను సేవించే ధర్మవ్యాధుని ద్వారా సన్యాసం కంటే గృహస్థాశ్రమమే గొప్పదని, మాతా పితరుల సేవ కంటే గొప్ప తపస్సు లేదని తెలుసుకొంటాడు. యక్షప్రశ్నలు కథాసందర్భంలో యమధర్మరాజు ధర్మరాజును "తపస్సు" అంటే ఏమిటి? అని అడుగుతాడు. దానికి ధర్మరాజు "సర్వస్సంగ పరిత్యాగియై వనాలకు వెళ్ళి, కాషాయాంబరాలు ధరించి చేసే నామరూప ధ్యానం తపస్సు కాదు. ప్రతివ్యక్తి తనకు నిర్దేశించిన ప్రాథమిక విధిని సక్రమంగా నెరవేర్చడమే తపస్సు" అని జవాబిస్తాడు. గీతోపదేశంలో కృష్ణుడు అర్జునునికి ఉపదేశించినది కూడా కర్తవ్య నిర్వహణను గురించే. శిష్టరక్షణ ఎంత ముఖ్యమో దుష్టశిక్షణ కూడా అంతే ముఖ్యమైనది. ఫలితాన్ని గురించి చింతించకుండా ప్రయత్నం చేయాలి. ప్రతివ్యక్తి తన కర్తవ్యాన్ని సక్రమంగా నెరవేర్చడమే తపస్సు అని మహాభారతం నొక్కి వక్కాణించింది.

మనిషి వ్యక్తిత్వంపై స్నేహితుల ప్రభావం అధికంగా ఉంటుంది. కర్ణుడు గొప్ప వ్యక్తిత్వం కలవాడు. ప్రాణం పోతుందని తెలిసి కూడా తన కవచకుండలాలను దేవేంద్రునికి ధారపోసిన మహాదాత. పరశురాముడినే మెప్పించి దివ్యాస్త్రాలను పొందిన మహావీరుడు. కానీ పరమ దుర్మార్గుడైన దుర్యోధనునితో స్నేహం చేయడం వలన పతనమైపోయాడు. ద్రుపదద్రోణులు ఇద్దరూ భరద్వాజ మహర్షి వద్ద కలసి చదువుకున్న బాల్య స్నేహితులు. పేదవాడైన ద్రోణుని పాంచాల రాజ్యానికి రాజైన ద్రుపదుడు అధికారమదంతో అవమానిస్తాడు. తనను అవమానించిన ద్రుపదుని ద్రోణుడు తన శిష్యుల ద్వారా ఓడించి, పరాభవిస్తాడు. ద్రోణునిపై ప్రతీకారం తీర్చుకోవడానికి ద్రుపదుడు దృష్టద్యుమ్నుడిని పుత్రునిగా పొందుతాడు. మహాభారత యుద్ధానికి కారణమైన వాటిలో ద్రుపదద్రోణుల వైరం కూడా ఒకటి. శ్రీకృష్ణార్జునుల స్నేహం ఉత్తమ స్నేహానికి నిదర్శనం. అన్న బలరాముని కాదని చెల్లెలు సుభద్రను ఇచ్చి వివాహం చేయడంలోను, ఖాండవ దహనంలోను, అగ్నిదేవుని నుండి దివ్యాయుధాలను ఇప్పించడంలోను, యుద్ధారంభంలో కర్తవ్య విముఖుడిని కర్తవ్యోన్ముఖుడిని చేయడంలోను ఇలా ప్రతి విషయంలోను విజయుడిని విజయుడినిగా చేసినవాడు కృష్ణుడు. ఒక్క మాటలో చెప్పాలంటే కృష్ణుడు లేకుండా అర్జునుడు లేడు. కృష్ణార్జునుల స్నేహం ఆదర్శనీయం.

మృధుభాషణం, మితభాషణం మనిషి వ్యక్తిత్వానికి వన్నె తెస్తాయి. "వాక్కు కున్న పదును వాడి కత్తికి లేదు." హస్తినాపుర చక్రవర్తియైన శంతనమహారాజు దాశరాజు కుమార్తె సత్యవతిని ఇష్టపడతాడు. దాశరాజును ఒప్పించడానికి వెళ్ళిన భీష్ముడు దాశరాజుతో చేసిన సంభాషణ అద్భుతంగా ఉంటుంది. భీష్ముడు "దాశరాజా! నీకుమార్తెను నా తండ్రికి ఇచ్చి వివాహం జరిపించు" అని అడగడు. "మహాత్మా! నా తల్లి నా దగ్గర లేదు. కావున నీ కుమార్తెను నాకు తల్లిగా అనుగ్రహించు" అని అడుగుతాడు. శ్రీకృష్ణుడు, ధర్మరాజు, విదురుడు, సహదేవుడు, వికర్ణుడు ఇత్యాదులు వాక్చాతుర్యంతో ఆకట్టుకొనేలా సంభాషించగలరు. శిశుపాలుడు కృష్ణున్ని పరుషంగా తూలనాడి తన మరణాన్ని తానే కొని తెచ్చుకొన్నాడు. ద్రౌపదీ వస్త్రాపహరణ సమయంలో కర్ణుడు ద్రౌపది శీలాన్ని అవమానిస్తూ మాట్లాడి తన మరణానికి తానే కారణం అయ్యాడు. దుర్యోధనుడు, కీచకుడు, ఉలూకుడు ఇత్యాదుల భాషణం పరుషంగా ఉంటుంది.

వ్యసనం మానవుని వినాశనానికి హేతువు. ఎంతటి ఉన్నతవ్యక్తిత్వం కలిగినవారు కూడా వ్యవనపరులైతే అధ:పాతాళానికి పతనం చెందుతారు. ఉత్తమవ్యక్తిత్వం కలిగిన ధర్మరాజు సైతం కేవలం ఒక్క జూదం వ్యసనం కారణంగా తనతోపాటు తమ్ముళ్ళను, భార్యను కూడా అష్టకష్టాలు పాలు చేశాడు. "సహదేవ నకుల వాసవసుత భీముల గ్రమమున నలువుర గౌరవేంద్రుం డొక్కక్క యొడ్డున నొడ్డి తన్నును నొడ్డి యుక్కివంబున నప్పుడోటు పడిన..."[5] తన తమ్ముళ్ళతో పాటు తనను కూడా ఓడిపోయాడు. అయినా ఆగలేదు. ఆఖరునకు "యక్షరతుండయి ద్రౌపదిన్ మహోత్పల చారునేత్రన్ గులభామ బణముగ జేసి యొడ్డి సౌబలఖలు చేత నోటువడి పాండుసుతుం డుడిగెన్"[6] పాంచాల రాజపుత్రి, కురువంశ పట్టపురాణి, పాండవుల ధర్మపత్ని అయిన ద్రౌపదిని కూడా ఓడిపోయాడు. ద్రౌపదిని కౌరవులు పరాభవించడానికి, పాండవులు ద్రౌపదీ సమేతులై అరణ్య, అజ్ఞాత వాసాల పాలుకావడానికి ధర్మరాజుకు ఉన్న జూద వ్యసనమే కారణం. సైంధవుడు, కీచకుడు స్త్రీ వ్యసనం వలన పతనమయ్యారు, రాక్షస గురువైన శుక్రాచార్యుడు సైతం సురాపాన వ్యసనం వల్ల మరణించి, తర్వాత కచునిచే పునర్జీవితుడయ్యాడు. వ్యసనాలు ఎటువంటి పర్యవసనాలకు దారి తీస్తాయో మహాభారతం లోకానికి వెల్లడించింది.

ఆత్మన్యూనత ఉండకూడదు. ఆత్మవిశ్వాసం ఉండాలి. కానీ అది అతివిశ్వాసానికి దారి తీయకూడదు. తనపై తనకే నమ్మకం లేకపోయినా ప్రగల్భాలు పలికి నవ్వులు పాలైనవాడు ఉత్తర కుమారుడు. అదే ఉత్తర

గోగ్రహణ సందర్భంలోనే అపార కౌరవ సేనావాహనిని తాను ఒక్కడే ఎదిరించి, మూర్ఛిల్లజేసి విజయం సాధించిన అర్జునుని ఆత్మవిశ్వాసం ఎన్నదగినది. పద్మవ్యూహ భేదనలో అభిమన్యుడు చూపించిన తెగువ, సాహసం కూడా ప్రశంసనీయమైనదే. శ్రీకృష్ణుడు, భీష్ముడు, ఇత్యాదులు మెండైన ఆత్మవిశ్వాసం కలవారు. భీముడు తన భుజబల పరాక్రమంతో శత్రువులను నిర్జించిన అసమానవీరుడు. అతి విశ్వాసంతో ఎందరు చెప్పినా వినకుండా తనతోపాటు తన వారందరి వినాశనానికి కారకుడైన వాడు దుర్యోధనుడు.

మానవుని జీవితంలో కష్టసుఖాలు, ఒడిదుడుకులు సాధారణం. కష్టాలకు కుంగిపోకూడదు. సుఖాలకు పొంగిపోకూడదు. "లెక్కకు రానీయడు కార్యసాధకుడు దు:ఖమున్ సుఖమున్ మదిన్"[7] అని సుభాషితం. సమస్యలు ఎదురైనపుడు సహనం కోల్పోకుండా పట్టుదలతో అధిగమించాలి. పలాయనవాదం, ఆత్మహత్యాయత్నం కూడదు. పాండవులు హస్తినాపుర సామ్రాజ్యానికి వారసులై ఉండికూడా ఎన్నో కష్టాలను, అవమానాలను పొందినారు. అతి క్లిష్టమైన అరణ్య, అజ్ఞాతవాసాలను ఓర్పుతో పూర్తి చేశారు. ఆఖరకు యుద్ధం చేసి, పట్టుదలతో విజయం సాధించారు. అలాగే నలుడు, హరిశ్చంద్రుడు, భగీరథుడు వంటి వారి చరితలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

శ్రీకృష్ణుడు మహోన్నతవ్యక్తి. భగవంతునిగా, లీలా మానుష విగ్రహకునిగానే కాదు, సాధారణ వ్యక్తిగా చూసినా కూడా పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలవాడుగా కనిపిస్తాడు. కృష్ణుని వ్యక్తిత్వం నుండి నేర్చుకోవలసిన విషయాలెన్నో ఉన్నాయి. ఎంతటి సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనా బెంబేలు పడకుండా, నిర్భరంగా చిరునవ్వుతో సమస్యలను అధిగమించాలని కృష్ణుని వ్యక్తిత్వం తెలియజేస్తుంది. మహాభారతంలో ద్రౌపది ఒక మహోన్నత స్త్రీమూర్తి. మానవతి, అభిమానవతి, ఆత్మాభిమానం మూర్తీభవించిన ధీరవనిత. కష్టాలను, అవమానాలను ఓర్చుకున్న సహనశీలి. అయినవారందరినీ ఆదరించిన మాతృమూర్తి. మనిషికి మితిమీరిన స్వార్థం, దురాశ, అహంకారం, క్రౌర్యం ఉండకూడదని దుర్యోధనుని నుండి నేర్చుకోవచ్చు. భీముడు కౌరవులను ఆటపట్టించడం, యాదవులు దూర్వాస మహర్షిని ఆటపట్టించడం, వాటి పర్యవసానాల ద్వారా పరిహాసానికి కూడా హద్దులు ఉంటాయని గ్రహించవచ్చు. ఈర్ష్య అసూయలు ఉండరాదని గాంధారి పిండపతన వృత్తాంతం, ఘోషయాత్ర వృత్తాంతాల నుండి గ్రహించవచ్చు. మూర్ఖులతో వాదన కూడదని వినత వృత్తాంతం తెలుపుతుంది. జీవులను హింసించరాదని మాండవ్యముని కథ, కిందముని వృత్తాంతం తెలియజేస్తాయి. కోపం, తొందరపాటు ఎంతటి అనర్థానికి దారితీస్తాయో పరీక్షిత్తు శమీక మహర్షిపై మృత సర్పాన్ని వేసిన వృత్తాంతం ద్వారా తెలుసుకోవచ్చు. తొందరపాటు, చిత్త చాంచల్యం వలన కుంతి కర్ణునికి జన్మనిచ్చింది. తత్ఫలితంగా ప్రశ్చాత్తాపంతో కుంతి, అవమానాలతో కర్ణుడు ఆజన్మాంతం కుమిలిపోయారు. కావున తొందరపాటు తగదు. ఈ విధంగా వ్యక్తిత్వ వికాసానికి మహాభారతం ఆద్యంతం ఉపకరించే అంశాలు ఎన్నో ఉన్నాయి.

మహాభారతం భారతీయ విజ్ఞాన సర్వస్వం. భగవద్గీత మానసిక వికాస గ్రంథం. భీష్ముని ప్రతిజ్ఞాపాలన, ధర్మజుని వినయం, భీముని ఆశ్రితజన పరిరక్షణ, కర్ణుని దానగుణం, అభిమన్యుని వీరత్వం, విదురుని ధర్మతత్పరత, వికర్ణుని ధర్మనిరతి లోకానికి ఆదర్శనీయం. ఈ విధంగా ప్రతి పాత్ర, ప్రతి ఇతివృత్తం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, సకారాత్మకంగానో, నకారాత్మకంగానో వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుంది. తెలుసుకోవాలనే ఆసక్తి, నేర్చుకోవాలనే జిజ్ఞాస, అనుసరించాలనే తపన ఉండాలే కాని మహాభారతం అద్భుతమైన వ్యక్తిత్వ వికాస గ్రంథం.

"ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ!
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్" అను ఆర్యోక్తి అక్షర సత్యం.

పాద సూచికలు :

1. శ్రీమదాంధ్రమహాభారతం - ఆదిపర్వం - ప్రథమాశ్వాసం - 31వ పద్యం.
2. సుభాషిత రత్నావళి - ఏనుగు లక్ష్మణకవి
3. శ్రీమదాంధ్రమహాభారతం - ఆదిపర్వం - ద్వితీయాశ్వాసం - 82వ పద్యం.
4. శ్రీమదాంధ్రమహాభారతం - ఆదిపర్వం - పంచమాశ్వాసం - 252వ పద్యం.
5. సుభాషిత రత్నావళి - ఏనుగు లక్ష్మణకవి
6. శ్రీమదాంధ్రమహాభారతం - సభాపర్వం - ద్వితీయాశ్వాసం - 196వ పద్యం.
7. శ్రీమదాంధ్రమహాభారతం - సభాపర్వం - ద్వితీయాశ్వాసం - 197వ పద్యం.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమదాంధ్రమహాభారతం - 7 భాగాలు - వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి.
2. శ్రీమదాంధ్రమహాభారతం - 2 భాగాలు - శ్రీరామకృష్ణ తపోవనం, చెన్నై.
3. వ్యాసప్రోక్త మహాభారతం - 18 భాగాలు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అబిడ్స్, హైదరాబాద్.
4. భారతం - ఉషశ్రీ - 2 భాగాలు - తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

❖❖❖

మహాభారతంలో సామాజిక, నైతిక విలువల చిత్రణ

డాక్టర్ ఇ. వాసు, తెలుగు అధ్యాపకులు, శ్రీ వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలమనేరు.

విశ్వసాహితిలో మహాభారతము వలె మానవస్వభావమును మథించి, వివిధ రీతుల విస్తృతముగ చిత్రించిన మహకావ్యమింకొకటిలేదు. అట్లే ధర్మతత్వమును, వివిధ ధర్మములను సమగ్రముగా దర్శించి, మానవ జీవితమునకు అన్వయించి ప్రబోధించిన మహాగ్రంథము కూడా మరొకటిలేదు.

రామాయణ భారతములు భారతీయ సంస్కృతికి అమృతకలశములు, భారతీయ సాహితికి సువర్ణ శిరోభూషణములు. రామాయణము వాల్మీకి మహర్షి అపూర్వసృష్ఠి ఆర్ష కవితా మధురసవృష్టి, మహాభారతము వ్యాసమహర్షి విశిష్టసృష్టి, భారతీయ ధర్మతత్వ సమగ్రదృష్టి.

మహాభారత కథ అడుగడుగున సమాజమున మనకగుపించు వ్యక్తులు, సన్నివేశములు మానవజీవిత సహజ భాగములు మహాభారత ధర్మములు మానవజాతికి శాశ్వత సందేశములు అందుచేత ప్రాంతీయ పరిధులుగాని, జాతిమత వివక్షలు గాని, ఈ గ్రంథమునకు పట్టవు నేలమీద మానవుడున్నంత కాలము ఇది నిత్యనూతనము. మానవుని పరిపూర్ణతకై పరిశ్రమించినంతకాలము ఇది ఆవశ్యపఠనీయము, ఆసక్తిజనకము, ఆలోచనామృతము.

ప్రాచీన కావ్యాలు చాలావరకు ఆదర్శాలతో రూపొందిన అందమైన శిల్పాలు వానిలో సహజత చాలా తక్కువ. మనకు అగుపించే సమాజంలోని మానవుని ఆశయాలు, అభిరుచులు, బాధలు, బలహీనతలు, ఆవేశాలు, ఆలోచనలు ఆ కావ్యాలలో అగుపించవు. ఆవ్యక్తుల మనమధ్య మసలనివారివలె, మనకందని వారివలె కన్పింతురు.

మహాభారతకావ్యం అలాకాదు ఇది సహజసుందరము, వాస్తవికతా మనోహరము, మనలోని పుత్రమమకారము, శిష్యపక్షపాతం అసూయాగ్రస్త మనస్తత్వము, స్వాతిశయ పరాయణతత్వము, ప్రగల్భవక్తృత్వము, కర్మకుశలత్వము, ధర్మప్రియత్వము మొదలగు అనేక మానవీయ విలువలకు సంబంధించిన అంశాలు కోకొల్లలు ఉన్నాయి మచ్చుకు మనము కొన్ని పరిశీలిస్తే.....

తాను పొందవలసిన పదవి మరొకరు పొందినపుడు బాధపడుట మానవ స్వభావసహజము. కాని ఆ పదవిని పొందిన వ్యక్తి తన్ను గౌరవించి ఆదరించినచో ఆ బాధ కొంతతగ్గుట కూడ మానవస్వభావ సహజమే. పాండురాజు ప్రభువైనను అధికారమత్తుడై అన్నగారిని విస్మరించలేదు. అన్నగారినే ప్రభువుగా భావించి తానొక రాజప్రతినిధివలె తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడు. అంతేగాక అన్నగారి అన్నపానాది వ్యక్తిగత విషయములు పట్ల గూడ విశేష శ్రద్ధ వహించినాడు. ఇట్టి తమ్ముడిపట్ల ధృతరాష్ట్రుడేగాదు- లోకమున ఏ అన్నకైనా అసూయ ద్వేషములు ఏలావస్తాయి? అన్నదమ్ముల అనుబంధానికి చక్కని నిదర్శనమిది.

మితిమీరిన పుత్ర మమకారము :

లోకమున పుత్రమమకార పీడితులు తమ పుత్రుల అభ్యుదయమునకై ఎట్టి అకృత్యములకైన పాల్పడగలరు. పుత్రుల అభ్యుదయమే వారి ధ్యేయము యుధిష్ఠిరుని పదవి ప్రాభవములను ప్రస్తావించి, తన దుస్థితి తలచి దుర్యోధనుడు దుఃఖించు సరికి ధృతరాష్ట్రుని హృదయము కరిగిపోయింది. పాండవులను ఏదో నెపముతోటి వారణావతము పంపుమని, దానసమ్మానములచే ప్రజలవశము చేసికొందునని ఆకొడుకు కోరినపుడు.

" ఏ నెల్లప్రొద్దు నాయెదలోన ఁదలఁతు నీయభిప్రాయంబుయిది దారుణంబు
గాన వాకునకుం జుల్కన తేరనో ఁగడగి ఁపాండవుల నేకతముట్టులనుఁ
గానగు మఱి దీని గాంగేయ విదురకలశ జాశ్వత్థామ గౌతముల్ బుద్ధి
గానీడం బడుదురె.....”

(భారత ఆదిపర్వం షష్టాశ్వాసం)

దుర్యోధనుడు పాండవులను వారణావతము పంపుమని పైకి అడిగినను అతనికి పాండవులకు గల వైరము, వారిక్రూరస్వభావము, వారణావతము పంపుమనుటలో దురాలోచన, పాండవులకు సంభవింప గల ప్రమాదము అంబికేయుని ఊహాకందపోవు ఆవులించిన ప్రేవులు లెక్కపెట్టగల ప్రజ్ఞాచక్షుడు. కాని మితిమిరిన పుత్రమమకారం వల్ల రాబోవు అనర్థములకు దారితీసినది. మమకారం ఉండాలికాని, అతిగా ఉంటే ఏమవుతుందో మనకు మహాభారతములోని ఘట్టాలే నిరూపిస్తాయి.

తుదకు దుర్యోధనుడు తొడలు విరిగి పడుటతో ధృతరాష్ట్రుని ఆశాతంతువు తెగిపోయినది. అతని కడుపు మండిపోయినది. దుంఖాతిశయముతో మూర్చిల్లినాడు. కడుపులోని క్రుళ్ళు నంతటిని వెళ్ళగ్రక్కినాడు.

చావరు నొవ్వరు పాండవు
లేవురునని నీవు చెప్పు నిప్పలుకులుదు:
ఖావేశ కరములై చే
తోవృత్తి దహింప జూచ్చె దుర్భర భంగిన్ (భారత శల్యపర్వము ప్రథమాశాస్వం)

అని సంగ్రామ విశేషములు చెప్పు సంజయుని చీదరించుకున్నాడు, సుయోధనుడు తుదిఘడియలలో ఎంతబాధననుభవించెనోయునని దు:ఖించినాడు. ఆదిలోనే పుత్రులు తప్పుచేసినపుడు వారింపక తర్వాత బాధపడిన ప్రయోజనం ఉండదు. ఇది నేటి మానవ జీవనానికి ఆదర్శ ప్రాయమని గ్రహించాలి.

కామవాంఛ, సంతానకాంక్ష సర్వప్రాణి సహజమైన కోర్కెలు. ఇవి యెంత సహజమైనవో అంతబలమైనవి వీనిని జయించుట చాలా కష్టము.

పాండురాజు విషయంలో మనకు ప్రస్ఫుటమవుతుంది. తాను శాపగ్రస్తుడని తెలిసి కామ వివశుడైన పాండురాజు భార్యమాట వినకుండా శాపముననుభవించినాడు. జీవమువిడిచినాడు. మానవ స్వభావమున కామ వివశత అట్టిది! ఈనాటి లోకమున ఏఅనారోగ్య కారణము చేతనో కాంతా సంగమము కూడదని చెప్పినను, పరిసర ప్రభావముచే కామ వివశులై మృత్యువును మీదికి తెచ్చుకొను వ్యక్తులు పెక్కుమంది కన్పింతురు గదా! కాలము మారినను, దేశము మారినను, మానవ స్వభావములోని మౌలిక గుణములు మారకుండా తమపతనమును తామే కోరుకుంటున్నారనటంలో సందేహములేదు....

అసూయ :

మానవస్వభావమున అసూయ మిక్కిలిచెడ్డది. ఇది కట్టకంటుకొన్న నిప్పువంటింది. ఇతరులను కాల్చుటెట్లున్నను మొదట ఆ కట్ట కాలక తప్పదు. అసూయ యెంత చెడ్డదో అంతపిరికిది, అసమర్థుని అసూయ అంత ప్రమాదకరము కాదు. కాని మహాభారతము నందలి దుర్యోధనుడు అసూయాగ్రస్త మానవుడు. అంగబలము, అర్థబలము గల అభిమాన ధనుడు. అహంకారపూరితుడు. పాండవుల తేజోవైభవముల మీద అతని కేర్పడిన అసూయ క్రోధములే కౌరవ వంశ నాశనమునకు, సంఘ వినాశమునకు కారణభూతములైనవి.

మానవుని అసూయా క్రోధములెంతటి ఆకృత్యమునకైన పాల్పడగలవు పాండవులను, కుంతిని ఒక్కసారిగా పరమార్చి, శాశ్వతముగ తన అడ్డు తొలగించుకొన నెంచిన దుర్యోధనుడు లక్కాగృహ దహనమునకు పురోచనుని నియోగించినాడు.

ఈ కార్యసిద్ధి యగుడును
నీ కతమున నఖిలదారుణీ రాజ్యమునా
కే కాధిష్ఠి తమగు నిది
నీకును నిత్యోపభోగ నిలయముగాదే (భారత అరణ్యపర్వం - షషాశ్యాసం)

అని అతనిని ప్రలోభ పెట్టినాడు పాండవులు భస్మమైరని, దుర్యోధనుని అసూయా క్రోధములు చల్లబడుట, ఇక తన కడ్డులేదని, సర్వం తన హస్తగతమగునని అతని హృదయమానందించుట మానవ స్వభావ సహజము.

ప్రత్యర్థి కష్టముల పాలగుట చూచి సంతోషించుట, అతని యెదుట తన ప్రాభవమును. ప్రదర్శించి పరమానందం మొందుట లోకమున సహజము. కర్ణ దుర్యోధనులు కలిసి చేసిన ఘోషయాత్ర ఇట్టిదే, ఘోషయాత్రలో పాండవులననుమానించే ప్రయత్నమే గాక అవకాశమును బట్టి హతమార్చు ఉద్ధేశమున్నట్లు గూడ స్పష్టము. కాని కథ అడ్డముతిరిగినది దుర్యోధనుడనుకొన్నదొకటి, అయినదొక్కటి. పాండవులను తానవమానింప లేకపోయె సరిగదా వారి యెదుటనే అవమానపడినాడు. చివరకు వారి సాయముతోడనే చిత్రసేనుని చేతి నుండి బయటపడినాడు. ఇక్కడ విషయం ఎంతశత్రువునైనను ప్రాణాపాయసమయంలో రక్షించటం మానవతా లక్షణం కాని, ఇట్టికార్యాన్ని అవమానంగా భావించి దుర్యోధనుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఒవ్వని వారల యెదురున
నవ్విధమున భంగపడితి! నేనింకజనుల్
నవ్వగనేటి బ్రదుకుగా
నివ్వసుమతి నేలునాడ? నెట్లు చరింతున్ (భారత అరణ్య పర్వం షష్ఠాశ్వాసం)

అని భాదపడి ప్రాయోపవేశంబున ప్రాణ త్యాగంబుజేసేదనని నిర్ణయించుకోవటం నేటి మానవ జీవితంలో కూడా చిన్న, చిన్న విషయాలకు కలతచెంది. ఆత్మహత్యలుకు పాల్పడటంకు నిదర్శనంగా చెప్పవచ్చు. కాబట్టి క్షణికావేశమున తీసుకోనే నిర్ణయాలు మంచివి కాదని దీనివల్ల ప్రస్పుటమవుతుంది. కాబట్టి శోక సంతప్తమగుటకు మనిషికి అసూయా క్రోధములే మూల కారణము. పుట్టుకతో వచ్చినను, పరిస్థితులు తెచ్చిపెట్టినను మానవుని అసూయా క్రోధములతి దారుణములు వ్యక్తిలోని గొప్ప గుణములను కప్పివేయగలవు కాబట్టి వాటిని దరిచేరనీయకుడదు.

సోదరప్రేమ-స్వామిభక్తి :

ఉత్తమ గుణ శోభితుడైన కర్ణుని జీవితములో ముఖ్యమైన సన్నివేశం కన్నతల్లి వచ్చి, జన్మరహస్యమును చెప్పి, పాండవ పక్షమునకు రమ్మని కోరుట, పుత్ర బిక్షపెట్టుమని అర్పించుట, ఒకవైపు చేయిచాపి యాచించు మాతృమూర్తి మరొకవైపు చేయూతనిచ్చి తన్ను, పైకి తెచ్చిన కౌరవపతి, కర్ణుడిట కన్నతల్లి ప్రార్థనకు, కౌరవేశ్వరుని కోరిక మేరకు సమాధానము చెప్పి సమరమున దూకినాడు. ఇటువంటి సందర్భంలో కర్ణుని అంతరంగమే గాదు, ఏ వ్యక్తి అంతరంగమైన తీవ్రసంఘర్షణకులోను గాక తప్పదు. కాని కర్ణుడు తను చేరదీసిన మిత్రుడుని మరువలేదు.

ఇది మనము గమనించదగ్గ విషయము, కర్ణుడు కురుపితామహునిచే ప్రత్యక్షముగనే ఈ వియషయంగూర్చి

మాటలు పెక్కులాడి యనుమానము లేక సభంగడంగిప
ల్మాటు (బరాభవించింతి(జలంబున(పాండవకోటి కెప్పుడుం
చేటు దలంచి యే బలువు సేసితి వైరము నాకు నింకనీ
వీటికి వారి వీటికిని వెక్కసమయ్యెడు కయ్యమొప్పగున్ (భారత భీష్మపర్వం, తృతీయాశ్వాసం)

అని వివరించినాడు మంటకు మిక్కిలి దగ్గరకు వెళ్ళి రెక్కలు కాల్చుకొన్న మిడుత మంటలో బడి మాడి పోవలసినదే గాని వెనుదిరుగుటకు వీలుండదు. కర్ణుని విషయంలో ఎంతోశక్తియుండి, సామర్థ్యం ఉండి, ఎన్నోసద్గుణాలుండి దుర్మార్గుల చెంతచేరటం వల్ల అటు సంఘనాశనముకు, ఇటు ఆత్మనాశనమునకు కారణ భూతుడైనాడు. ఇది మానవ జీవితంలో ఇనుమడింప చేసుకోవలసిన విషయం.

కుటిలబుద్ధి పర్యవసనాలు :

శకుని వంటి కుటిల స్వభావులు మానవ జీవితములో జూదమాడగలరు. సంఘము మీద వీరికే మాత్రము సానుభూతి ఉండదు.

ప్రాయోపవేశమునకు పూనుకొన్న దుర్యోధనుని ఎత్తిచూపి పాండవులను ప్రశంసించి వారికి రాజ్యభాగ మిమ్మని హితబోధ ప్రారంభిచాడు. ఇక్కడ హితము చెప్పినా అతని అంతరంగమున చూచుటకు వేయబడిన పాచికయే. కురు పాండవ సఖ్యమును సాధించు ప్రయత్నముగాదు ఈహితబోధలో ఏమాత్రము చిత్తశుద్ధియున్నను, మహాభారత సంగ్రామము సంభవించెడిదిగాదు.

వారలు నీ తోబుట్టువు
లీరాజ్యము మీరు వారు నేకంబై పెం
పార(గ నేలు(డు
దీనం గౌరవ కులనాథ సౌఖ్య గౌరవమొందున్ (భారత అరణ్య పర్వం షష్టాశ్వాసం)

మానవ జీవితములో కుటిలబుద్ధి గల వారిని దరి చేర్చగూడదనుటకు ఇది నిదర్శనము. కుటిలబుద్దికి శకుని పర్యాపదము.

మూర్ఖత్వం :

మూర్ఖత్వః పరప్రత్యయనేయ బుద్ధిః .. అన్నది కాళిదాసు మూర్ఖుని కిచ్చిన నిర్వచనము. మూర్ఖునికి స్వతంత్రమైన ఆలోచన ఉండదు. ఇతరులు చెప్పినది గ్రుడ్డిగ అనుసరించుటయే మూర్ఖస్వభావము, దుశ్శాసనుడు ఈకోవకు చెందినవాడు అన్నను గ్రుడ్డిగ అనుసరించి చివరకు అన్న పొందిన దుర్గతినే తమ్ముడు పొందినాడు, అంతేగాకుండా దుష్టచతుష్టయములో గూడ దుశ్శాసనునికి ఒక స్థానం కల్గినది.

ఇది సేయ(గాదని మది విచారింపక
సద్గర్హితుండు దుశ్శాసనుండు.
నెట్టన (దౌపది గట్టిన పుట్టంబు
సభలోని విద్దెనాశంకలేక (భారత సభాపర్వం ద్వీతీయాశ్వాసం)

అన్న దుర్యోధనుడు కౌరవసభలో పిలవగానే ప్రాతికామి వృకోదరునకు వెఱచు నీవు వోయి ద్రౌపదిం దోడ్కోని రమ్మని పలికి నాడు. ఒక్క ఊపున ద్రౌపదిని పట్టుపట్టి సభకీడ్చినాడు. తాను చేసిన ద్రౌపదీమానభంగ దుష్కృత్యమునకు ప్రతిఫలంగా భీముని చేత దారుణముగ వధింపబడినాడు. కాబట్టి మూర్ఖత్వం అనేది మానవ జీవిత వినాశనానికి దారితీస్తుందనటానికి ఇది చక్కని నిదర్శనం.

ఆవేశము :

ఆవేశమునకు పెట్టిన పేరు అశ్వత్థామ. ఏమానవునికైనను మితి మీరిన ఆవేశము మంచిదికాదు. ఆవేశము వివేకమును చంపును ఒక్కొక్కప్పుడు నీచతకు పాల్పడును. అందున క్రోధస్వభావుని ఆవేశము మహాక్రూరము. తనతండ్రి కడ విద్యా ధనమును గ్రహించి అందరికంటె అర్జునుడు రాణించుటను అశ్వత్థామ సహింపలేక పోయినాడు. ఆవేశపరుల స్వభావము చిత్రమైనది, అది ఏవిషయముననైన వివేకమును గోల్పోయి విపరీతముగ ప్రవర్తించును. ధృష్టద్యుమ్నుడు దారుణముగ ద్రోణునిగొంతు కోసినాడు. అది చూచిన అశ్వత్థామ కడుపు తరుగుకొనిపోయి.

నా దివ్య స్త్రంబులు బా
హాదర్పముఁ నింక ఁగొల్పనా
యని తున్ను తాను నిందించుకొన్నాడు
పుత్రుఁగనుట యెల్ల శత్రునిచేఁదల
వట్టి తాను దునుమ ఁబడుటకయ్యె (భారత ద్రోణపర్వం పంచమాశ్వాసం)

అని తండ్రి దుర్గతిని దలచివాపోయాడు "ఆవేశముతో ఊచకోతగా అనేక గొంతులు కోసిన అశ్వత్థామ దుర్యోధనుని మరణాంతరము ధైర్యము లేనివాడై కృపకృతవర్మలను గూడ వదలి బ్రతుకు జీవుడాయని భాగీరథీ తీరమునకు పరుగెత్తి వ్యాసమహర్షి ప్రక్క తాపస రూపము ధరించి తలదాచుకొన్నాడు.

గురుశిష్యుల బంధం :

ఉత్తమ గురువు సూర్యభగవానుని వంటివాడు. స్వార్థరహితంగా స్వీయతేజః కిరణములను ప్రసరించి, చీకట్లనుపారద్రోలి ప్రపంచమునకు వెలుగునిచ్చి ప్రజల ప్రార్థన లందు కొను ప్రత్యక్షదైవము సూర్యభాగవానుడు అట్లే సమాజమున మహోన్నత గురుపీఠమునధీష్టించి, స్వార్థరహితుడై వ్యక్తుల జీవితములకు వెలుగు చూపవలసినవాడు, గురుదేవుడు. అధికారైశ్వర్యములు ఆతేజోమూర్తి ముందు తలలు వంచి నిలువవలసినదే. కాని ద్రోణుడు దారిద్ర్యం అతనిని ధనార్జనకు ప్రేరేపించడం దీనిని సాధించుటకు ద్రోణుడొక ప్రభువు పంచనాశ్రయింపక తప్పలేదు. అర్జునుడిని తన ఆశయసిద్ధి కనుగుణంగా తీర్చిదిద్ధి తన ఆశయము కోసం అర్జునుడి కిచ్చిన మాటకోసం ప్రలోభంచే ఏకలవ్యునికి ఘోరమైన అన్యాయమును చేయించినది. ద్రోణుని అపకీర్తిపాలు చేసినవి.

కాబట్టి నేటి సమాజంలో గురు శిష్యుల సంబంధాలు చాలామారిపోయి విద్యార్థు లు గురువులను చంపడం గురువులు చేసే తప్పుడు పనులు వీరి వృత్తికే కళంకంతెస్తున్నాయి. అదిమహాభారతమైనా, నేటి మానవ జీవితమైనా ఈ విలువలను గుర్తెరగాలి.

మంచి వ్యక్తిత్వానికి నిదర్శనం :

ప్రభువులకు సన్నిహితులై వారిగుణదోషములను గుర్తించి ప్రజ్ఞాపాటవములను ప్రదర్శించి, అందరిమెప్పును పొంది చివరకు హిమశిఖరము నదిరోహించిన ధన్యజీవి సంజయుడు. సంధిప్రయత్నములు విఫలములై సమరము సిద్ధమైనపుడు సంజయుడు యుద్ధమంతటిని రసవంతముగ వాస్తవికతా రమ్యముగ కన్నులకు గట్టినట్లు ప్రభువుకు వర్ణించి చెప్పినాడు. యుద్ధానంతరము ప్రభువు వెంట ఆశ్రమవాసమునకేగినాడు. చివరకు ప్రభువుతో గూడా తానును దావాగ్నిలో దగ్ధుడగుటకు సిద్ధపడినాడు. కాని నేటిసమాజంలో ధనం, పదవి ఉన్నంత వరకు మనతో ఉండే జనం, ఇవి రెండు లేకపోతే మనల్ని పట్టించుకునెవారే ఉండరు. కాబట్టి అటువంటి వారికి సంజయుని వ్యక్తిత్వం ఆదర్శప్రాయం.

వ్యసనపరత :

మహాభారతమున ధర్మజుడు సమతాగుణశోభితుడు, ధార్మికుడు, పాలనాదక్షుడు, యశస్సంపన్నుడు చరితార్థుడు. ఎన్ని సుగుణాలున్న వ్యక్తిలోనైన ఏదో ఒక లోపమెంట్లుండునో.

" ప్రాయేణ సామగ్ర్య విధౌ గుణానాం పరాఙ్ముఖీ విశ్వసృజః ప్రవృత్తిః"

(కుమార సంభవం తృతీయాశ్వాసం)

అని కాళిదాసు అనుటలో సందేహము లేదు, మొత్తం మీద జూదము మీద ధర్మరాజు కున్న వ్యసనపరత్వం. కౌరవులకు అనుకూలించినది. ఈ విషయము తెలుసుకున్న శకుని

"ద్యూతప్రియశ్చ కౌంతియోన సజానాతి దేవితుమ్

సమాహు తశ్చ రాజేంద్రో నశక్నుతి నివర్తితుమ్" (సభాపర్వం - ద్వీతీయా శ్వాసం.) అని దుర్యోధనుడికి తెలియజేసాడు.

జీవితములు ఎంతో కష్టపడి సంపాదించిన దానినైన అలవోకగా ఒక్కసారి ఒడ్డి పొగొట్టుకొనగల తెగింపు జూదరికున్నట్లుగా లోకమున మరొకరికుండరు. కాబట్టి మానవసమాజంలో వ్యసనాలకు బానిసకావటం వల్ల జరిగే అనర్థాలు మహాభారతంలోనే కాకుండా, ఎన్నో కుటుంబాలు వీటివల్ల వీధుల పాలవుతున్నాయి, దానిని అందరూ గమనించాలి.

వినయము, విధేయతలు :

ధనము, విద్య, వంశము సామాన్యముగా మానవునికి మదమును గూర్చునట్టివే కాని అర్జునునికి అంతటి అస్త్రవిద్యా కౌశలమున్నను, దివ్యాస్త్ర సంపదయున్నను, అత్యధిక కీర్తియున్నను అతని స్వభావమున మదము చోటుచేసుకొనలేదు, గురువుపట్లగాని, అన్నలపట్లగాని, పెద్దలపట్లగాని అవిధేయముగ అతడు ప్రవర్తింపలేదు. ధర్మము నెన్నడు తృణీకరింపలేదు. అది వ్యక్తి సౌశీల్యమునకొక గొప్పతార్కాణము.

కాగా విద్యాభ్యాస సమయమున గురుభక్తి యుందుట విశేషముగాదు. తరువాతి జీవితములో తాను గురువు మించిన శిష్యుడై గురువు పట్ల భక్తిచూపుట విశేషము. అందును సమర భూమిలో తనకు శత్రువుగ నిలిచిన గురువుపట్ల భక్తి చూపుట పెద్ద విశేషము.

అర్జునుడు ఎన్నో వదిలినాడు కాని గాండీవమును వదలలేదు. అది జీవితములో అతనికపార కీర్తినిచ్చింది. అఖండవిజయములను కూర్చినది. చివరకు అగ్నిదేవుడు హెచ్చరించినగానీ అర్జునుడు దానిని వదలలేదు. అర్జునుడు కర్మకౌశలము సౌశీల్యము కలిగినకర్మయోగి. మానవజీవితమునకు అపరిహార్యమైన కర్మపరత, కౌశలమును గడించి సన్మార్గమున నడిచినవారు ఎంతటి స్థిర విజయమును సాధింపగలరో, ఎంతటి స్థిరకీర్తిని పొందగలరో మహాభారతము సవ్యసాచిలో చూపినది.

మాతృత్వ కాంక్ష, పుత్రశోకము :

మాతృత్వకాంక్ష ఒక్కొక్కప్పుడు స్త్రీలలో అసూయను పెంచగలదు. తనకడుపుపండని పడతి పొరుగింటి ఇల్లాలు పుత్రవతియగుటను చూచిలోలోపల బాధపడును. ఇకతోడి కోడండ్ర సంగతి చెప్పవలెనా? గాంధారీ దేవి కుంతిమీద అసూయతో కడుపు బాధుకొన్నను క్రమముగ తనకొడుకుల దుర్వర్తనమును, కుంతికొడుకుల సద్వర్తనమును గ్రహించినది. మనస్సు మార్చుకొన్నది. మమకారములను అధిగమించినది. అధర్మమును గర్హించునపుడు, సత్యమును వచించునపుడు నిప్పువలె వ్యవహరించినది.

"ఏ నసూయా గ్రస్తఁగానువీరల ఁజెడఁ
దలఁతునే యిట్టులుమ్మలిక ఁజేసి
కలిఁగితిఁగాకయిక్కొంతేయ వర్గంబు
గొంతికెట్లట్ల నాకును భరింపవలదె (భారత స్త్రీ పర్వము -ప్రథమాశ్వాసం)

తన కొడుకుల దుర్వర్తనను గూడా ప్రస్తావించి గదాయుద్ధమున దుర్యోధనుని నాభికి దిగువు కొట్టి చంపుటను ప్రస్థావించి కొంతస్వస్థత వహించినది, కాని కౌరవులను చంపిన క్రూర విధమే ఆమాతృమూర్తి హృదయమును మరల, మరల దహించినది. అయినను పాండవుల భయవినయములతో ఆమె ఆగ్రహావేశము ఉపశమిల్లినది, లోకమున ఆగ్రహోదగ్రయైన మాతృమూర్తి నుండి మానవులను రక్షించునది, వినయనమస్కారాలేగాని శక్తి సామర్థ్యములు కావని నిరూపించబడినవి.

క్రమ బద్ధశృంగారము :

సమాగమ సమయమున యువతీయువకులు పర్యవసానములను గూర్చి ఆలోచింపరు. యవ్వన ఉద్రేకమట్టిది, వివాహమునకు పూర్వమే క్రమము తప్పిన శృంగారముల వల్ల స్త్రీ పట్ల అదిఎప్పటికైనా తీవ్ర దోషమే ఒక్కొక్కసారి అది ఆమె జీవితమునే కాల్చివేయును. కుంతి జీవితములో కూడా కర్ణజననము ఆమెనెంతో ప్రభావితము చేసినది, ఆమె హృదయమున మరణాంతరము కలిచివేచినది.

ఒక వైపు లోకాపవాద భీతి, మరొకవైపు కడుపు తీపి ఆమె హృదయమును క్షోభపెట్టినవి. కడకు లోకాపవాద భీతియే ఆమెనుజయించినది. ఆత్మహత్యకు పాల్పడలేక, శిశుహత్యకు ఒడిగట్ట లేక కుంతి మూడవమార్గము అవలంభించినది. కన్నబిడ్డను ఒక పెట్టిలో భద్రముగ పెట్టి, గంగలో వదిలి ఇంటికి వెళ్ళినది, కర్ణజన్మ రహస్యమున బడబాగ్ని వలె కడుపులో దాచుకొన్నది.

కర్ణుడు మరణించిన తర్వాత అగ్నిపర్వతము బ్రద్దలైనది. కర్ణునికి జీవితంలో తానెంతో అన్యాయము చేసినది. అతని మృతికి గూడ పరోక్ష కారణమైనది. ఇప్పుడింకను అతని జన్మరహస్యమును దాచి తిలోదకములు గూడ ఆ కొడుకునకు దక్కకుండ చేయలేక ఉప్పెనవలెపైకి పొంగినది. స్త్రీ సహజమైన లోకాపవాదభీతినిదాటినది. తెగించి ధర్మజునితో

మీకు నఁగజుండ నాకు భాస్కరుదయ
లలిత కవచకుండలముల తోడఁ
బుట్టినాడు గానఁబోయంగవలయుఁది
లోదకంబు లమ్మహోన్నతునకు (భారత -స్త్రీ పర్వము ద్వీతీయాశ్వాసం)

అని కర్ణ జన్మరహస్యమును వెళ్ళగ్రక్కి, తిలోదకముల వదలుమని కోరినది పై అంశాలను బట్టి లోకమున వివాహామునకు పూర్వము జరిపిన శృంగారచర్యలు స్త్రీలకు ఎంత విషమసమస్యలు కల్పించునది, జన్మించిన శిశువును కూడా జీవితములో ఎంతగా బాధించునది కుంతీదేవి, కర్ణుని పాత్రలలో మనము చూడవచ్చు. కాబట్టి అక్రమబద్ధ శృంగారం వల్ల అనేక అనర్థాలు నేటి సమాజంలో జరుగుచున్నవి. అటువంటివారికి ఈ ఘట్టాలే నిదర్శనం.

స్వార్థపరత్వం :

వ్యక్తిమనుగడకు స్వార్థమవసరమే కాని సమాజ శ్రేయమునకు పరార్థభావము ముఖ్యము. ఈ రెండింటికి సామరస్యమున్నంతకాలము అటు వ్యక్తి జీవితము, ఇటు సమాజ జీవితము సుఖశాంతులతో సాగిపోవును.

స్వార్థము మితిమీరినపుడు ధర్మము నశించును. ధర్మము నశించినపుడు సమాజమున సామరస్యము లోపించును, సంఘర్షణ తలయెత్తును. ఈ ధర్మచ్యుతి వలన, సామరస్యలోపం వలన కలుగు సంఘర్షణలలో బలవంతునది, దుర్మార్గునిది, పైచేయి అగును. సాధుజనులు, బలహీనులు బాధలకు గురియగుదురు. సమాజమున ఒక విధమైన అల్లకల్లోల మేర్పడును.

ఈ అల్లకల్లోలమును, ధర్మమును పరిరక్షించుటకు అవతారపురుషులే పూనుకొనవలెను, అవతారపురుషులు జన్మచేతను, సాధనచేతను అసాధరణ శక్తి, సామర్థ్యములు కలిగియుందురు. ఆ శక్తి సామర్థ్యములను వారు. మానవ స్వార్ధములో నుంచుటకు, ధర్మపునరుద్ధణ గావించుటకు సుఖశాంతులతో కూడిన సుస్థిర సమాజిక వ్యవస్థను నెలకొల్పుటకు మాత్రమే వినియోగింతురు. అటువంటి స్వభావం కలవాడు శ్రీకృష్ణభగవానుడు. శ్రీకృష్ణుడు సాంఘికముగ సాధించిన మహాకార్యమును కృష్ణద్వైపాయనుడు వాఙ్మయ ముఖమున సాధించినాడు. ఇద్దరు అవతారపురుషులుగా ఆరాధనందుకొన్నారు.

పరిత్రాణాయ సాధునాం వినాశాయ చదుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

అను గీతాశ్లోకము శ్రీకృష్ణుని జన్మ ప్రయోజనమును, ఆ మహనీయుడు చేపట్టిన ఉద్యమ పరమార్థమును ప్రదర్శించు మెరుగుటద్దము.

లోక సామాన్య దృష్టితో చూచినను రెండు వర్గముల మధ్య వైరము పెరిగినపుడు, యుద్ధప్రమాద మేర్పడినపుడు రెండుపక్షములకు శ్రేయోభిలాషులైన పెద్దలపై సంధి చేయవలసిన బాధ్యతయుండును ఈ బాధ్యత స్వార్థం లేకుండా శ్రీకృష్ణుడు నెరవేర్చాడు.

ముగింపు :

జీవకోటిలో శ్రేష్టజీవి మానవుడు లోకములోని వింతలలోని వింత మానవ స్వభావము. మానవ స్వభావగతులు బహువిధాలు, సంకీర్ణాలు, దాని మలుపులు అనేకాలు, ఆశ్చర్యకరాలు, దాని శిఖరాలు మహోన్నతాలు, గౌరవార్హాలు దాని లోతులు అగాధాలు.

మానవ జీవితమునకు ధర్మమునకు అవినాభావ సంబంధము ధర్మబాహ్యమైన మానవజీవితము మహా భయంకరము, దుఃఖమయము అందుచేత ప్రతి మానవుడు ధర్మము, న్యాయము, నిస్వార్థము మొదలగు అనేక మానవీయ విలువలను అనుసరింపవలసిన అవసరమున్నది.

విశ్వసాహితిలో మహాభారతము వలె మానవ స్వభావమును మధించి వివిధ రీతుల విస్తృతముగ చిత్రించిన మహాకావ్య మింకొకటిలేదు. అట్లే ధర్మతత్త్వమును, వివిధ ధర్మములను ఇంత సమగ్రముగ దర్శించి, విలువలను మానవ జీవితమున కన్వయించి ప్రబోధించిన మహాగ్రంథము గూడ మరొకటిలేదు.

ఒక విధమున మహాభారతము మానవుని విశ్వరూప ప్రదర్శనము విజ్ఞాన భాండాగారము, విజ్ఞానసర్వస్వం.

ఆధార గ్రంథాలు :

మహాభారతం – తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ
మహాభారత నీతి కథలు – కంభంపాటి రామగోపాల క్రిష్ణమూర్తి
సజీవ శిల్పాలు (భారత పాత్రలు) – అప్పజోడు వెంకటసుబ్బయ్య

❖❖❖

ఉదంకోపాఖ్యానం - నన్నయ, తిక్కనల తులనాత్మక పరిశీలన

డాక్టర్ కలవకుంట ఈశ్వరబాబు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, తిరుపతి జిల్లా.

ఉపాఖ్యానం నిర్వచనం :

ఉపాఖ్యానమంటే ప్రధాన కథకు తోడ్పడే ఉపకథలతో కూడినదని అర్థం. ఉపాఖ్యానంలోని కథ ప్రధాన కథకు సందర్భానుసారంగా ప్రయోజనాన్ని కలిగించేదిగా ఉంటుంది. మన ఇతిహాస పురాణాల న్నింటిలోనూ ఈ ఉపాఖ్యానాల వల్ల ఒనగూడే ప్రయోజనమిదే. ఇక మహాభారతంలో ఉపాఖ్యానాలకు కొదువలేదు. కాకపోతే ఇతిహాస పురాణాల పరిభాషల్లో వాటికి రకరకాల పేర్లు పెట్టుకోవచ్చుగానీ ఇవన్నీ సాధారణంగా నీతిని బోధించే కథలు.

"ఇతిహాసంలో ప్రధాన కథను ఆఖ్యానం అంటారు. ఆఖ్యానాలు ప్రధాన కథలోని పూర్వాపరాలకు అనుసంధించేవిగానో, కార్యకారణ సంబంధాన్ని చెప్పేవిగానో, కర్మఫల సంబంధాన్ని నిరూపించేవిగానో, పూర్వవృత్తాంత కథనాలుగానో, ప్రధాన కథాతాత్పర్య సూచకాలుగానో, వ్యంజకాలుగానో, భీజభూతాలుగానో ఉంటాయి. స్వరూపంలోనే కాక స్వభావంలో కూడా వైవిధ్యాన్ని వెలార్చేవి ఆఖ్యానకాలు. ఆఖ్యానకం కంటే భిన్నమైనది ఉపాఖ్యానం. ఉపాఖ్యానం స్వయంసమగ్రంగా ఉండి ప్రధాన కథలో సందర్భానుసారంగా ప్రయోజనాన్ని కలిగించేదిగా ఉంటుంది."

ఉదంకోపాఖ్యానం కథ మహాభారతంలో రెండు చోట్ల చెప్పబడింది. మొదట ఆదికవి నన్నయ రచించిన ఆదిపర్వం ప్రథమాశ్వాసంలో చెప్పబడింది. రెండోసారి తిక్కన రచించిన ఆశ్వమేధపర్వం తృతీయాశ్వాసంలో చెప్పబడింది.

గురువుల పనులందు ఆసక్తి కలిగిన సజ్జనులకు గొప్ప పుణ్యాలు కలుగుతాయని, సేవకు అంగీకరించని గురువును గురుపత్ని కోరికను నెరవేర్చడం ద్వారా సంతోషపెట్టాలని, గురుదక్షిణ కోసం పాటుపడే శిష్యుడిని దేవతలు కూడా అనుగ్రహిస్తారని బోధించే ఉపాఖ్యానం ఉదంకోపాఖ్యానం.

నన్నయ, తిక్కన వైశంపాయనుడు జనమేజయునకు ఉదంకుని కథను చెప్పినట్లు రచించారు. జనమేజయునితో సర్పయాగం చేయించడం కోసం నన్నయ ఉదంకోపాఖ్యానం కథను భారతంలో ఉపాఖ్యానంగా చెప్పడం జరిగింది. తిక్కన ఉదంకోపాఖ్యానంలో ఉదంకుడు శ్రీకృష్ణుడినే శపించటానికి పూనుకున్నాడు. అతడికి అంతటి మహిమ ఏవిధంగా లభించిందో చెప్పమని జనమేజయుడు వైశంపాయనున్ని అడిగినప్పుడు ఉదంకోపాఖ్యానం చెప్పబడింది. ఇరువురి ఉదంకోపాఖ్యానాల సారాంశం ఒక్కటే అయినప్పటికీ కథలోని వివిధ అంశాలలో తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ అంశాల్ని కూలంకషంగా చర్చించడమే ఈ వ్యాసం లక్ష్యం.

పేర్లుమార్పు :

నన్నయ, తిక్కన ఉదంకోపాఖ్యానాలలో పేర్ల మార్పులు కనిపిస్తున్నాయి.

ఉదంకుడు కేంద్రంగా కథ నడవడంతో రెండు ఉపాఖ్యానాలలోను ఉదంకుని పేరులో ఎలాంటి మార్పు లేదు. నన్నయ కథలో ఉదంకుని గురువు పైలుడు. తిక్కన కథలో ఉదంకుని గురువు పేరు గౌతముడుగా చెప్పబడింది. నన్నయ కథలో పైలుని భార్య పేరు ప్రస్తావన లేదు. గురుపత్నిగా మాత్రమే పిలువబడింది. తిక్కన కథలో గురువైన గౌతముని భార్య పేరు అహల్య. నన్నయ కథలో పౌష్యుడనే రాజు భార్య పౌష్యమహాదేవి

కుండలాల కోసం ఉదంకుడు వెళతాడు. నన్నయ కథలో పౌష్యుని భార్య పేరు ప్రస్తావించలేదు. పౌష్యమహాదేవిగా మాత్రమే పిలువబడుతుంది. తిక్కన కథలో సౌదాసుని భార్యపేరు దమయంతి. నన్నయ కథలో కుండలాలు దొంగలించింది తక్షకుడైతే తిక్కన కథలో ఐరావతుడి కుమారుడు కుండలాలు దొంగలించాడు.

కథలో చేసిన మార్పులు :

నన్నయ ఉదంకుడు అరణ్యంలో ఒకడే వెళుతుండగా ఒక పెద్ద ఎద్దునెక్కి వస్తున్న ఒక దేవతా పురుషుడిని చూచి, అతడు ఏర్పరిచిన ఎద్దుపేడ తిని అతని అనుగ్రహం పొంది మిక్కిలి వేగంతో కూడిన గమనంతో పౌష్యమహారాజు వద్దకు వెళ్ళి ఆశీర్వదించి అతిథి సత్కారాలు పొందినట్లు కథలో చెప్పబడింది. కానీ తిక్కన ఉదంకోపాఖ్యానంలో ఉదంకుడు కేవలం కాలినడకనే వెళ్ళి సౌదాసుని వద్దకు చేరుకున్నట్లుగా ఉంది.

తిక్కన కథలో సౌదాసునికి బ్రాహ్మణశాపం ఉంది. అతడు రాక్షసునిగా మారి మనుషులను చంపి తినేవాడు. ఉదంకుణ్ణి చూసి మంచి ఆహారం లభించిందని సంతోషిస్తాడు. ఉదంకుడు గురువుల ప్రయోజనం పట్ల ఆసక్తి కలవారు చంపదగిన వారు కాదనగా సౌదాసుడు అంగీకరించడు. అప్పుడు ఉదంకుడు నాగురువు గారి పని తీర్చి తిరిగి తప్పకుండా వస్తాననగా సౌదాసుడు అంగీకరించాడు. ఉదంకుడు నేను కోరిన కోరిక నీవే తీరుస్తావని నిశ్చయించుకొని వచ్చాననగా సౌదాసుడు ఏమి కావాలో అడగమంటాడు. నన్నయ ఉదంకోపాఖ్యానంలో ఈ అంశాలేవీ లేవు.

నన్నయ కథలో ఉదంకుడు అడిగిన వెంటనే కుండలాలు ఇవ్వడానికి పౌష్యమహారాజు సంతోషంగా అంగీకరిస్తాడు. కానీ తిక్కన కథలో సౌదాసుడు మొదట అంగీకరించక 'పరాయి వారి సొమ్ము దానం చేసేవారు ఎక్కడైనా ఉన్నారా? కుండలాలు తప్ప ఇంకేమైనా అడుగుము' అని అన్నాడు. అందుకు ఉదంకుడు నీవు ఏదో వంకపెట్టి నా కోరికను తోసిపుచ్చవద్దు. నేను ఇతర వస్తువులను ఇష్టపడనని చెప్పడంతో సౌదాసుడు కుండలాలు ఇవ్వటానికి అంగీకరించాడు.

రెండు ఉపాఖ్యానాలలో పౌష్యుడు, సౌదాసుడు తమ భార్యల చెంతకు వెళ్ళి తమమాటగా చెప్పి ఉదంకుణ్ణి కుండలాలు తీసుకోమంటారు.

నన్నయ కథలో ఉదంకుడు పౌష్యుడు చెప్పిన ప్రకారం అంత:పురానికి వెళ్ళగా పౌష్యమహాదేవి కనిపించదు. తిరిగి పౌష్యుని వద్దకు వెళ్ళి అంత:పురంలో నీదేవేరి కనిపించలేదు. నీవే ఆ కుండాలలను తెప్పించి ఇమ్మంటాడు ఉదంకుడు. నాదేవి అపవిత్రులకు కనిపించదని అంటాడు పౌష్యుడు. అప్పుడు ఉదంకునికి ఎద్దుపేడ తిని ఆచమనం చేయని విషయం గుర్తుకువచ్చి నీటితో కాళ్ళు, చేతులు కడుక్కొని ఆచమనం చేసి పౌష్యుని అనుమతితో అంత:పురానికి వెళ్ళగా దేవి కనిపించింది. తిక్కన కథలో పైన చెప్పిన అంశాలేవీ లేవు. సౌదాసుడు చెప్పిన చోటుకు ఉదంకుడు వెళ్ళగా అతని దేవేరి మదయంతి కనిపించింది.

నన్నయ కథలో ఉదంకుడు అడిగిన వెంటనే పౌష్యమహాదేవిగా కుండలాలు తీసి ఇచ్చింది. తిక్కన కథలో మదయంతి ఉదంకుడు అడిగిన వెంటనే కుండలాలు ఇవ్వదు. రాజు దగ్గర ఒక గుర్తు తీసుకురమ్మంటుంది. ఉదంకుడు సౌదాసుని వద్దకు రాగా 'ఈ విధంగా క్షేమం కలుగుతుందని నిశ్చయించలేము. దీనిని వదిలితే వేరే గతీలేదు. ఈ మాటలు ఆమెతో చెప్పమన్నాడు' ఉదంకుడు దమయంతి చెంతకు వెళ్ళి ఆ మాట చెప్పగానే ఆమె కుండలాలు ఇవ్వటానికి అంగీకరించింది.

నన్నయ కథలో పౌష్యమహాదేవి ఉదంకుని చేతికి కుండలాలు ఇచ్చిన తర్వాత జాగ్రత్తలు చెప్పింది. తిక్కన కథలో మదయంతి ఉదంకునికి జాగ్రత్తలు చెప్పిన తర్వాత కుండలాలు చేతికిచ్చింది.

నన్నయ కథలో పౌష్యమహాదేవి ఉదంకునితో ఈ కుండలాలను తక్షకుడనే సర్పరాజు పొందాలని కోరుకుంటున్నాడు. జాగ్రత్తవహించమని చెప్పింది.

క॥ "తక్షకు డీ కుండలము ల
పేక్షించుచు నుండువా ఁడభేద్యుడు మాయా
దక్షుండు వానివలన సు
రక్షితముగ జేసి చనుము రవినిభతేజా!"

తిక్కన కథలో దమయంతి ఉదంకునితో దేవతలు, గంధర్వులు, నాగులు ఎన్నో ఉపాయాలు పన్నుతూ వీటి కోసం ఎదురు చూస్తున్నారు. జాగ్రత్త అని పలికింది. అంతేకాక

కుండలాల ప్రత్యేకత గురించి ఇలా పలికింది. వీటిని భక్తితో పూజించి ధరిస్తే ఆకలి, దప్పిక, అగ్నిభయం, విషం వలన వ్యాధి, భూతబేతాళ పీడలు కలగవు. పిల్లలు పెట్టుకున్నా, పెద్దలు పెట్టుకున్నావారి వారి కొలతల ప్రకారం అతికించినట్లు సరిపోతాయి. పైగా ఇవి బంగారాన్ని కురిపిస్తాయి అని వివరించింది.

సీ॥ సురలు గంధర్వులు నురగులు నిక్కుండ
లములకు బెక్కుపాయముల వేచి

ఆ॥ "బెద్దవారికైన బెట్టిన నయ్యయి
కొలది నమరియుండు; గురియు బసిడి;
వీని నప్రమత్త వృత్తిమైగొని చను
మయ్య! గురులు నిన్ను నభనుతింప"

నన్నయ కథలో ఉదంకుడు పౌష్యమహాదేవి కుండలాలు తీసుకొని పౌష్యునివద్దకు వెళ్ళగా పౌష్యుడు ఉదంకునితో 'ఆర్యా! నీవు అతిథివి మా ఇంటిలో భోజనం చేసి వెళ్ళు' అని కోరగా ఉదంకుడు అంగీకరిస్తాడు. కానీ తిక్కన కథలో ఈ భోజనం ప్రసక్తి అసలు చెప్పబడలేదు.

నన్నయ కథలో ఉదంకుడు భోజనం చేసేటప్పుడు అన్నం వెంట్రుక చేత అపవిత్రం కాగా ఏవగించుకొని మిక్కిలి కోపంతో 'ఈ విధంగా పరీక్షింపబడని అపవిత్రమైన అన్నం పెట్టావు. గ్రుడ్డి వాడవగుము' అని పౌష్యుడికి శాపమిస్తాడు. అంతట పౌష్యుడు కోపంతో 'చిన్నతప్పుకు నాకు శాపమిచ్చావు. నీవు సంతానం లేని వాడవగుము' అని ప్రతిశాపం ఇస్తాడు. అప్పుడు ఉదంకుడు 'నేను సంతానం లేని వాడను కాలేను' ఈ శాపాన్ని ఉపసంహరించుము అని కోరగా పౌష్యుడు ఇలా అంటాడు.

ఉ॥ "నిండుమనంబు నవ్యనవనీతిసమానము, పల్కుదారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత! విప్రులందు; నిక్కమీ
రెండును రాజులందు విపరీతము; గావున విప్రుడోపు, నో
పం డతిశాంతు డయ్యు నరపాలుడు శాపము గ్రమ్మఱింపగన్" (ఆది. ప్ర.ఆ - 100)

శాపాన్ని ఉపసంహరించడం నీవంటి బ్రాహ్మణులకు సాధ్యమవుతుంది. కానీ మావంటి రాజులకు సాధ్యంకాదు. నీవిచ్చిన శాపాన్ని తొలగించమని కోరగా ఉదంకుడు అంగీకరించి కొద్ది కాలంలోనే శాపవిముక్తి కలుగుతుందని పౌష్యుని ఆశీర్వదించాడు. తిక్కన కథలో భోజన ప్రసక్తి లేదు. ఉదంకునికి శాపం కలిగినట్లుగానూ చెప్పబడలేదు. ఉదంకుడు మదయంతి దగ్గర కుండలాలు తీసుకొని సౌదాసుని వద్దకు రాగా అతడు పూర్వం తనకు బ్రాహ్మణుని శాపం వలన కలిగిన స్థితిని తొలగించమని కోరగా ఉదంకుడు అంగీకరించాడు.

"ఏమిటనైన నొప్పమి నరేంద్ర! సుచిత్తుల బొందె నేనియున్
వే మరలున్; భగవద్గుణమ వీతకళంకుని జేసి నిన్ను; సాం
ద్రామలకీర్తి గౌతమ మహాముని చల్లని చిత్తవృత్తి నీ
పై మలగించె గావలయు బార్థివసత్తమ! పొందు మున్నతిన్" (ఆశ్వ. తృతీయా - 102)

ఏదైనా కారణం చేత మంచి మనస్సు కలవారికి ఆపద కలిగినప్పటికీ అది వెంటనే తొలగిపోతుంది. నీ మంచి గుణమే నిన్ను పుణ్యాత్ముడిని చేసింది. మహాకీర్తి సంపన్నుడైన గౌతమముని ఇప్పుడు నిన్ను చల్లని మనసుతో చూశాడు. నీవు పూర్వపు స్థితిని పొందుము అని ఉదంకుడు సౌదాసునికి శాపవిమోచనం కలిగించాడు.

తిక్కన కథలో ఉదంకుడు కుండలాలను జాగ్రత్తగా లేడి తోలుతో మూట కట్టుకొని బయలుదేరినట్లుగా చెప్పబడింది. కానీ నన్నయ కథలో ఉదంకుడు కుండలాలు ఎందులో తీసుకెళ్ళాడో స్పష్టంగా చెప్పలేదు.

నన్నయ కథలో ఉదంకుడు కుండలాలను పవిత్రస్థలంలో ఉంచి సరస్సులో ఆచమనం చేస్తున్నట్లు చెప్పబడింది. తిక్కన కథలో ఉదంకుడు దారిలో పండ్లతో నిండిన బిల్వవృక్షాన్ని చూచి ఆకలి ఎక్కువ కావటంతో కుండలాలున్న లేడితోలును చెట్టుకు తగిలించి దాని పండ్లు కోసుకుంటున్నట్లు చెప్పబడింది.

నన్నయ కథలో ఉదంకుడు ఆచమనం చేస్తుండగా తక్షకుడు దిగంబరవేషంలో వచ్చి కుండాలలు తీసుకెళ్ళినట్లు స్పష్టంగా చెప్పబడింది. తిక్కన కథలో గాలికి చెట్టు ఊగి లేడి తోలు నేలమీద పడడం చూచిన ఒక పాము కుండలాలు తీసుకొని వెళ్ళినట్లు చెప్పబడింది.

నన్నయ కథలో ఉదంకుడు కుండలాలు తీసుకువెళుతున్న తక్షకున్ని వెంటపడి పట్టుకున్నాడు. అప్పుడు తక్షకుడు దిగంబర రూపం విడిచి తనసహజరూపంలో తప్పించుకొని భూమిలోని రంధ్రం ద్వారా నాగలోకానికి వెళ్ళినట్లు చెప్పబడింది. తిక్కన కథలో కుండలాలు తీసుకెళుతున్న పామును ఉదంకుడు వెంబడించగా ఆ పాము పుట్టలోకి వెళ్ళినట్లు చెప్పబడింది.

నన్నయ కథలో ఉదంకుడు తక్షకుడు వెళ్ళిన రంధ్రం ద్వారానే నాగలోకానికి వెళ్ళినట్లు చెప్పబడింది. తిక్కన కథలో ఉదంకుడు పుట్టను తవ్వి ఆ దారి గుండా నాగలోకానికి వెళ్ళినట్లు చెప్పబడింది.

ఇరువురి కథలో ఇంద్రుని ప్రసక్తి ఉంది. కానీ సందర్భాలే వేరు. నన్నయ కథలో ఉదంకుడు అరణ్యంలో వెళుతుండగా ఎద్దునెక్కి వచ్చిన దివ్యపురుషుడు ఇంద్రుడు. అతను తినమన్న గోమయం (పేడ) అమృతం అని కథ చివరలో చెప్పబడింది. ఇక్కడ ఇంద్రుడు అమృతం ఉదంకునికి ఇచ్చి సహాయపడ్డాడు. తిక్కన కథలో కుండలాలు తీసుకెళ్ళిన పాము వెంట నాగలోకానికి వెళ్ళడానికి ఉదంకుడు పుట్టను తవ్వుతున్న సమయంలో ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో వచ్చి కుండలాలు దొంగిలించిన పాము ఐరావతుడికి కుమారుడని ఉదంకునికి తెలియజేశాడు. మరియు ఉదంకుడు పుట్టను తవ్వుతున్న కర్రకు వజ్రాయుధానికుండే వాడినీ, గట్టితనాన్ని కలిగించి సహాయం చేశాడు.

నన్నయ కథలో ఉదంకుడు నాగలోకానికి వెళ్ళి నాగరాజులందరినీ స్తుతించినట్లు చెప్పబడింది. తిక్కన కథలో అసలు నాగస్తుతి ప్రస్తావనే లేదు.

నన్నయ కథలో ఉదంకుడు నాగలోకంలో తెల్లని నల్లని దారాల సముదాయంతో వస్త్రాన్ని నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పన్నెండు ఆకులు గల చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు యువకులను, మిక్కిలి ఎత్తు గల గుర్రాన్ని ఎక్కిన గొప్ప తేజస్సు గల ఒక దివ్యపురుషుడిని చూచి అధిక అర్థాలు గల మంత్రాలతో మిక్కిలి భక్తితో స్తుతించినట్లు చెప్పబడింది. తిక్కన కథలో ఉదంకునికి నాగలోకంలో ఎర్రని ముఖం, నల్లని శరీరం, తెల్లని తోక గల గుర్రం మాత్రమే కనిపించినట్లు చెప్పబడింది.

నన్నయ కథలో దివ్యపురుషుడు ఉదంకుని ప్రార్థనలకు సంతసించి ఏమికావాలో కోరుకోమనగా 'ఈ పాముల వంశమంతా నా కధీన మయ్యేటట్లు కరుణించు' అనగా ఆ దివ్యపురుషుడు అంగీకరించాడు. తిక్కన కథలో దివ్యపురుషుని ప్రసక్తే లేదు.

నన్నయ కథలో దివ్యపురుషుడు 'అట్లైతే ఈ గుర్రం యొక్క చెవికన్నంలో ఊదు" అని పలికాడు. మూలంలో గుర్రం గుదస్థానంలో ఊదమని దివ్యపురుషుడు చెప్పినట్లు ఉంది. ఋషి అలా చేయటం ఉచితం కాదని నన్నయ గుదస్థానాన్ని తొలగించి దానికి బదులు చెవి రంధ్రం అని మార్పు చేశాడు.

తిక్కన కథలో నాగలోకంలో ఉదంకుడు చూసిన గుర్రమే స్వయంగా అతనితో వెడల్పుగా ఉన్న నా గుదస్థానాన్ని ఊదుము అని చెప్పినట్లు రాయబడింది. ఇక్కడ తిక్కన మూలానికి ఎటువంటి మార్పు చేయలేదు.

ఇరువురి కథలలో ఉదంకుడు 'ఊదడం' ప్రసక్తి ఉంది. ఊదేస్థానం మాత్రం మార్పు చేయబడింది. నన్నయ కథలో చెవి రంధ్రంలో ఊదినట్లు చెప్పగా, తిక్కన కథలో గుదస్థానంలో ఊదినట్లు చెప్పబడింది.

నన్నయ కథలో ఉదంకుడు చెవిరంధ్రంలో ఊదిన వెంటనే గుర్రం యొక్క సర్వేంద్రియ ద్వారాల నుండి భయంకరమైన అగ్ని జ్వాలలు నాగలోకమంతా వ్యాపించాయి. దానితో తక్షకుడు భయపడి కుండలాలను ఉదంకునికిచ్చినట్లు చెప్పబడింది. తిక్కన కథలో ఉదంకుడు గుదస్థానంలో ఊదిన వెంటనే గుర్రం యొక్క రోమరంధ్రాల ద్వారా ఒక్కసారిగా పొగపుట్టి నాగలోకమంతా కమ్ముకుంది. ఐరావతుడి గృహం ఆక్రందన ధ్వనులతో కలత చెందింది. ఆ మహాధూమం వలన నాగరాజులు భయపడి ఉదంకుని దగ్గరకు వచ్చి భక్తితో పూజించి అతడు వచ్చిన పని తెలుసుకుని కుండలాలు తెచ్చి ఉదంకునికిచ్చినట్లు చెప్పబడింది.

నన్నయ కథలో ఉదంకుడు తనను ఇబ్బంది పెట్టిన తక్షకునిపై పగసాధించడానికి గాను జనమేజయునితో నీ తండ్రి పరీక్షిత్తు మహారాజు మరణానికి కారకుడైన తక్షకుని శిక్షించడానికి సర్పయాగం చేయమని సూచించినట్లు చెప్పబడింది. తిక్కన కథలో ఈ విషయం ప్రస్తావించబడలేదు.

వర్ణనలు :

నన్నయ గుర్రం నుండి వెలువడిన అగ్నిజ్వాలలను ఇలా వర్ణించాడు.

"పాతాళైకనికేతనాంతరమునం బర్వెందదశ్వాఖిల

పాతాళలోకంలో గుర్రం యొక్క సర్వేంద్రియాల నుండి వెలువడిన భయంకరమైన అగ్ని జ్వాలలు వ్యాపించాయి. ఆ అగ్నిజ్వాలలు ఏ విధంగా ఉన్నాయంటే ప్రళయకాలంలో పుట్టి పైకెగసిన బడబాగ్ని జ్వాలలనే సందేహం అధికమై తీవ్రభయంతో నాగరాజు హృదయం బద్దలైందట.

తిక్కన సీసపద్యంలో గుర్రం నుండి పుట్టిన పొగను ఇలా వర్ణించాడు.

సీ॥ "ఘోటకోత్తమ రోమకూపంబులం దెల్ల
నొక్కట ఘనధూమ ముద్గమించి

గుర్రం రోమరంధ్రాల గుండా ఒక్కసారిగా పుట్టిన పొగ పాతాళలోకమంతా కమ్ముకున్నది. ఆ పొగ దెబ్బకు వాసుకి మొదలైన వారి మందిరాలు పీడావస్థపాలయ్యాయి. మరీ ఐరావతుడి గృహం ఆక్రందన ధ్వనులతో కలతచెందింది. దుస్సహమైన ఆ మహాధూమం వలన నాగరాజులు భయపడి ఉదంకుని దగ్గరకు వచ్చి పూజించి కుండలాలు ఇచ్చేశారని తిక్కన వర్ణించాడు.

నీతి :

పెద్దల మాట వినకపోతే కష్టాలపాలు కావాల్సి వస్తుందని ఉదంకుని పాత్ర ద్వారా మనకు తెలుస్తోంది. ఆవేశం అనర్థాలకు దారి తీస్తుందనే మాట ఉదంకుడు, పౌష్యమహారాజులు తొందరపాటుతో ఒకరికొకరు శాపాలు ఇచ్చుకున్న సంఘటన ద్వారా తెలుస్తున్నది.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమదాంధ్ర మహాభారతము - తి.తి.దే ప్రచురణ
2. మహాభారతం - సామాజిక ప్రబోధం - వి.గిరిధర్ కుమార్
3. శ్రీమహాభారత వైజ్ఞానిక సమీక్ష - శ్రీమత్తిరుమల వేంకట శ్రీనివాసాచార్యులు

❖❖❖

మహాభారతం - గురుశిష్య సంబంధాలు

డాక్టర్ మన్యం నరసింహులు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు, తిరుపతి జిల్లా.

"అమితాఖ్యానక శాఖలంబొలిచి, వేదార్థమల చ్ఛాయమై
సుమహావర్గ చతుష్కపుష్ప వితతిన్ శోభిల్లి, కృష్ణార్జునో
త్తమ నానా గుణకీర్తనార్థఫలమై, ద్వైపాయనోద్యాన జా
త మహాభారత పారిజాతమమరున్ ధాత్రీసుర ప్రార్థ్యమై" (ఆది 1-66)

భారతీయులకు మహాభారతం పారిజాత కల్పవృక్షం వంటిది. అడిగిన కోర్కెలన్నీ అందించే దేవతావృక్షం పారిజాతం. మహాభారతం కూడా అటువంటిదే. మానవులకు అవసరమైన పురుషార్థాలు మరియు వాటికి సంబంధించిన ఇతర విశేషాలను తెలియజేస్తుంది మహాభారతం. భారతీయ విజ్ఞానానికి, సంస్కృతికి మహాభారతం కల్పవృక్షం వంటింది.

ద్వైపాయనుడుగా, కృష్ణద్వైపాయనుడుగా కీర్తించబడిన వేదవ్యాసుడు మహాభారత మూలకర్త. మహాభారతం గొప్ప ఇతిహాసం. లక్ష శ్లోకాలతో వ్యాసమహర్షి సంస్కృతంలో మహాభారతాన్ని రచించాడు. దానిని నన్నయ, తిక్కన, ఎర్రనలు తెనిగించారు. మహాభారతం ధర్మశాస్త్రంగా, వేదాంతంగా, నీతిశాస్త్రంగా, మహాకావ్యంగా, బహుపురాణ సముచ్చయంగా ప్రసిద్ధిగాంచింది.

సంస్కృత మహాభారతం నూరు పర్వాల శాస్త్రేతిహాసం ఆంధ్ర మహాభారతం 18 పర్వాల కావ్యేతిహాసం. నన్నయ ఆది, సభా పర్వాలను, అరణ్యపర్వాల్లో నాల్గో ఆశ్వాసంలో 142వ పద్యం వరకు రచించాడు. తిక్కన విరాట పర్వం నుంచి సర్గారోహణ పర్వం దాకా పదిహేను పర్వాలు రచించాడు. అరణ్యపర్వశేషాన్ని ఎర్రన పూరించాడు. వింటే భారతం వినాలి, తింటే గారెలు తినాలి అని తెలుగువారు మోజుపడి చెప్పుకుంటారు.

విశ్వసాహిత్యంలో పరిమాణంలో ప్రప్రథమ స్థానాన్ని ఆక్రమించింది మహాభారతం. భారతీయులందరికీ మహాభారత, రామాయణాలు సుపరిచితాలే. మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధిగాంచింది. అలాగే భారతం ఇతిహాసం కూడా. ఇతిహాస అంటే ఇలా జరిగింది అని అర్థం.

శ్లో॥ ధర్మేచార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ !
యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్ (సం.మ.భా. ఆది 56-33)

మహాభారతంలో ఉన్న పురుషార్థాల విశేషాలు మరొకచోట ఉండవచ్చు. కానీ భారతంలో లేని అంశం మరెక్కడా ఉండదు. మహాభారత పరమార్థం మోక్షఫలం. అలాగే జ్ఞానఫలం కూడా. భారతగ్రంథం ద్వారా మానవులు ఎన్నో విషయాలు తెలుసుకుంటారు. అలాగే గురుశిష్యుల సంబంధాలను గురించిన ఎన్నో విశేషాలను తెలుసుకోవచ్చు.

సంస్కృతంలోనూ, తెలుగులోనూ మహాభారతం లోకానికి అందడానికి గురుశిష్య సంబంధాలే కారణం. వ్యాసమహర్షి శిష్యులలో ముఖ్యుడు వైశంపాయనుడు. ఒకసారి జనమేజయ మహారాజు మహాభారత కథను వినాలని వ్యాసులవారిని అడిగితే అప్పుడు వ్యాసుడు భారతకథా ప్రవచనానికి వైశంపాయునున్ని నియమించాడు.

వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు భారతకథను చెప్పేటపుడు అతనికి కలిగిన అనుమానాలను, విశేషాలను వ్యాసతాత్పర్యానికి అనుగుణంగా వివరించాడు. ఆ విశేషాలతో కలసి వ్యాసుడి జయకావ్యం 'భారతం'గా ప్రసిద్ధిపొందింది.

రోమ మహర్షుని కుమారుడైన ఉగ్రశ్రవుడు అనే సూతుడు కూడా వైశంపాయనుడు చెప్పగా భారత కథను విన్నాడు. ఆయన ప్రసిద్ధుడైన పౌరాణికుడు. నైమికారణ్యంలో శౌనకుడనే మహర్షి లోకశ్రేయస్సుకోసం 12 సంవత్సరాలు సత్రయాగం నిర్వహించాడు; అప్పుడు సూత మహర్షి కూడా పాల్గొని శౌనకాది మహాములకు వారి కోరిక మీద భారతాన్ని వినిపించాడు. అప్పుడు కూడా శౌనకాది ములకు కలిగిన అనుమానాలను వ్యాసుని అభిప్రాయాలకు అనుగుణంగా సూతుడు వివరించాడు. దాంతో గ్రంథం పెరిగి 'మహాభారతం'గా ప్రసిద్ధిగాంచింది. ఈ విధంగా గురుశిష్యుల ద్వారానే మహాభారతం వ్యాప్తి చెందింది.

మానవుని శారీరక, మానసిక ఆధ్యాత్మిక శక్తుల సమవికాసమే విద్య అని వ్యాసుని అభిప్రాయం. విద్య అనగా 'జ్ఞానము' అని అర్థం. విద్యావిధానంలో చెప్పేవాడు ఉంటాడు, వినేవాడు ఉంటాడు. వారినే గురుశిష్యులు అంటారు. వారిద్దరినీ కలిపే సంబంధం బోధన.

ప్రాచీనకాలంలో ప్రసిద్ధంగా రెండు రకాల విద్యాకేంద్రాలు ఉండేవి. నిర్దిష్టమైన నియమ నిబంధనలు గలవాటిని 'నిబద్ధ విద్యాకేంద్రాల'ని పిలుస్తారు. మహాభారతంలో ఆశ్రమాలు నిబద్ధ విద్యాకేంద్రాలు. నియమ నిబంధనలు కట్టుదిట్టంగా పాటించకుండా విద్యను నేర్పేకేంద్రాలు 'అనిబద్ధ విద్యాకేంద్రాలు' అని పేరు. గృహాలు, దేవాలయాలు, నాటకశాలలు, రాజశాసన ప్రదేశాలు మొదలైనవి అనిబద్ధ విద్యాకేంద్రాలు.

భారతంలో వివిధ విద్యల గురించి నేరుగా చెప్పకపోగా గ్రంథాంతర సాక్ష్యాల వల్ల సంపన్నుల విద్య, సామాన్యుల విద్య, వర్ణ విద్య, పురుషుల విద్య, స్త్రీ విద్య, బాలల విద్య, వయోజన విద్య, ఆయుర్వేద విద్య, సాధారణ సాంకేతిక విద్యలు, వ్యాయామ విద్య, వికలాంగుల విద్య, నీతివిద్య, మత విద్య అన్నింటిని మించిన బ్రహ్మవిద్య అని పలురకాల విద్యలు కనిపిస్తాయి.

గురువు యొక్క విశిష్టతను మహాభారతంలో ఆయా సందర్భాల్లో చెప్పడం జరిగింది. గురువును పూజించడం శిష్యుల విధి. అయితే అర్థం తెలియకుండా విషయాన్ని ఒప్పచెప్పే గురువులను శిష్యుడు ఆశ్రయించరాదు. గర్వపరుడై కార్యాకార్యాలను మరచి దుర్మార్గుడుగా ప్రవర్తించేవాడు గురువైనా వదలిపెట్టడం శిష్యుని విధి. గురువును "నీవు" అని సంబోధించరాదు. గురువును ఆరాధించిన శిష్యునికి స్వర్గం వస్తుంది. గురువును అవమానించిన శిష్యుడు నరకంలో పడతాడు. గురుముఖంగా నేర్చిన విద్యవల్ల శిష్యుడు శక్తి సంపన్నుడౌతాడు.

శిష్యునికి అనేక పర్యాయపదాలు ఉన్నాయి. అవి శిష్యుడు, అనూచానుడు, ఛాత్రుడు, సమావృత్తుడు, అంతేవాసి, బ్రహ్మచారి. శిక్షింపదగినవాడు 'శిష్యుడు'. గురువు వద్ద షడంగయుక్తమైన వేదాన్ని అధ్యయనం చేసినవాడు 'అనూచానుడు'. గురువు యొక్క దోషాన్ని కప్పిపుచ్చువాడు 'ఛాత్రుడు'. గురువు వద్ద కొంతకాలం విద్యాభ్యాసం అభ్యసించిన తర్వాత గృహస్థాశ్రమాన్ని స్వీకరించినవాడు 'సమావృత్తుడు'. గురువు యొక్క సమీపమున ఉండేవాడు 'అంతేవాసి', వేదాధ్యయన వ్రతమును ఆచరించేవాడు బ్రహ్మచారి. కొత్తగా వేదాధ్యయనము చేయువాడు శైక్షుడు. ఒకే గురువు వద్ద విద్యాధ్యయనం చేయువారు సతీర్థులు. మహాభారతంలో పాండవులు కౌరవులు, కృష్ణబలరాములు, ద్రోణ ద్రుపదులు సతీర్థులే.

ద్రోణ వృత్తాంతము :

ఇది కవిత్రయ భారతంలోని ఆదిపర్వం, పంచమాశ్వాసంలోనిది. భరద్వాజ ముని కుమారుడు ద్రోణుడు . భరద్వాజుని స్నేహితుడైన పృషతుడనే పాంచాల దేశపు రాజు కొడుకు ద్రుపదుడు. ద్రోణుడు, ద్రుపదుడు ఇద్దరూ కలసి ద్రోణుని తండ్రి దగ్గరే భరద్వాజాశ్రమంలో విద్యాభ్యాసం చేశారు. తండ్రి తర్వాత ద్రుపదుడు పాంచాలదేశానికి రాజయ్యాడు. ద్రోణుడు కృపాచారుడని చెల్లెలయిన కృపిని వివాహం చేసుకొని అశ్వత్థామ అనే కొడుకును కన్నాడు. తర్వాత పరశురాముని వద్ద శస్త్రాస్త్రాలను అభ్యసించాడు. అటుపిమ్మట ద్రుపదుని దగ్గరకు సహాయార్థం వెళ్లి అతనిచేత అవమానింపబడిన తర్వాత హస్తినాపురానికి వస్తూ పాండవ కౌరవులతో పరిచయం ఏర్పడి భీష్మునిచేత వారికి గురువుగా నియమింపబడ్డాడు. తన శిష్యులైన కురు పాండు కుమారులతో ద్రోణుడు ఇలా పలికారు

తే॥ 'అస్త్రవిద్యలు గఱచి నాదైన యిష్ట
మొగిన తీర్పంగ నిందెవ్వఁ డోపు' ననిన
బాయ మొగమిడి కౌరవుల్ పలుక కుండి
'రేను దీర్చెద'నని పూనె నింద్ర సుతుడు

నా దగ్గర అస్త్రవిద్యలు నేర్చి నా కోరిక మీలో ఎవ్వడు తీర్చగలరని ద్రోణుడు ప్రశ్నించగా – కౌరవులు మౌనం వహించారు. అప్పుడు అర్జునుడు 'నేను తీరుస్తానని' ముందుకు వచ్చాడు.

ఈ విధంగా తన కోరికను తీర్చడానికి ముందుకు వచ్చిన అర్జునుని చూసి గురువైన ద్రోణాచార్యుడు ఎంతో సంతోషించాడు. కురుపాండవులతో పాటు నానాదేశాల నుండి అనేకమంది రాజకుమారులు వచ్చి గురువుగారి వద్ద విద్యాభ్యాసం చేస్తున్నారు. సూతుని కుమారుడైన రాధేయుడు కూడా ద్రోణుని వద్ద విద్యాభ్యాసం చేస్తూ దుర్యోధనుని పక్షంలో ఉన్నాడు. ఆనాడు రాజపుత్రులకే కాక ఇతరులకు కూడా విద్యాభ్యాసం చేసుకొనే వెసులుబాటు ఉండేదని మనకు తెలుస్తోంది.

అర్జునుడు శస్త్రాస్త్ర విద్యలో అధికుడై గురుభక్తితో ద్రోణున్ని సంతోషపరిచాడు. ఉత్తమ గురువుకోసం శిష్యుడు ఎలా అన్వేషిస్తాడో, అదేవిధంగా ఉత్తమ శిష్యునికోసం గురువు కూడా అన్వేషిస్తాడు. ఇక్కడ ఉభయత్రాసార్థక్యం ఏర్పడింది. అర్జునుని విలువిద్యా పాటవాల పట్ల క్రమంగా కర్ణునికి ద్వేషం పెరిగింది. అలాగే ఉత్తమ శిష్యుడైన అర్జునుని పట్ల ద్రోణునికి అనురాగం, వాత్సల్యం పెరిగింది. ద్రోణుని కుమారుడైన అశ్వత్థామకు కూడా అర్జునునితో విద్యాస్పర్ధ ఉండేది. ఈ స్పర్ధతో చీకటిల్లో బాణాలు వేయడం అర్జునుడు నేర్చుకోకూడదని అశ్వత్థామ భావించి వంటవారితో చీకట్లో అర్జునునికి అన్నం పెట్టవద్దని ఆజ్ఞాపించాడు. అయితే ఒకరోజున పెద్దగాలికి దీపం ఆరిపోయింది. అలవాటుగా అర్జునుడు అన్నం తిన్నాడు. తర్వాత ఈ విధంగానే చీకట్లో విద్యాసాధన చేయవచ్చని గ్రహించాడు. చీకట్లో విలువిద్యాసాధన చేస్తున్న అర్జునున్ని చూసిన ద్రోణుడు అస్త్రవిద్యలో అర్జునునికి గల గురుభక్తికి చాలా సంతోషించాడు. యుద్ధవిద్యలో అందరికంటే గొప్పవాణ్ణి చేస్తానని ద్రోణుడు అర్జునునికి మాటిచ్చాడు.

హిరణ్యధనువ్వడనే ఎరుకరాజు కుమారుడైన ఏకలవ్యుడు విలువిద్య నేర్చుకోవడానికి ద్రోణుని వద్దకు రాగా ద్రోణుడు అంగీకరించలేదు. అప్పుడు ఏకలవ్యుడు ద్రోణుని అనుమతి పొంది అడవికి వెళ్ళి ద్రోణుని మట్టిబొమ్మను చేసుకొని నిరంతర సాధనతో విలువిద్యారహస్యాలన్నీ గ్రహించాడు.

ఒకరోజు పాండవులు, కౌరవులు కలసి ద్రోణాచార్యుని అనుమతిని పొంది వేటకుక్కలతో కూడిన బటుల సమూహంతో అడవికి వేటకు వెళ్ళారు. అక్కడ ఒక వేటకుక్క దారితప్పి ఏకలవ్యుని దగ్గరకు వెళ్ళి మొరిగింది. వెంటనే ఏకలవ్యుడు ఏడు బాణాలను ఒక్కటిగా సంధించి అతి చాకచక్యంతో ఆ కుక్కనోటిలో కొట్టాడు. అది అరచుకుంటూ కురుకుమారుల వద్దకు వెళ్ళింది. దాన్ని చూసి ఆశ్చర్యంతో వెదకుతూ వెళ్ళి ఏకలవ్యున్ని చూస్తారు. ఏకలవ్యుని గురువు ద్రోణాచార్యుడని తెలుసుకొని కురుకుమారులంతా తిరిగి వచ్చి ద్రోణునికి ఆ సంగతినంతా చెప్పారు. ఆపైన ఒకనాడు అర్జునుడు ఏకాంతంగా ఉన్న ద్రోణునితో ఈ విధంగా అన్నాడు.

కం॥ విలువిద్య నొరులు నీ క
గ్గలముగ లేకుండ నిన్నుఁ గఱపుదు నని మున్
బలికితిరి! నాక కాదీ
త్రిలోకముల కధికుఁ జూచితిమి యొక యెఱుకున్ (ఆది. 5 - 239)

విలువిద్యలో నీకంటే అధికులు లేనట్లుగా నేర్పుతానని గతంలో నాతో చెప్పారు. ఇప్పుడు నాకే కాదు, ఈ ముల్లోకాలకంటే అధికుడైన ఒక ఎరుకను చూశాను.

కం॥ నాకంటెను మీ కంటెను
లోకములో నధికుఁ డతిబలుండు ధనుర్వి
ద్యాకౌశలమున నాతఁడు
మీకుం బ్రియశిష్యుఁడటె యమిథ్యావచనా! (ఆది. 5-240)

అసత్యం కాని మాటగల ఆచార్యా! ఆ ఎరుకవాడు విలువిద్యా నైపుణ్యంలో నాకంటే మీ కంటే ఈ లోకంలో అధికుడు, మహాబలవంతుడు. అతను మీకు ప్రియశిష్యుడట గదా!

ఏకలవ్యుని విలువిద్యానైపుణ్యం అర్జునున్ని ఆశ్చర్యచకితున్ని చేసింది. అది కాకుండా ఏకలవ్యుడు ద్రోణాచార్యుని శిష్యుడు అన్నమాట పిడుగుపాటయింది. అయినా అర్జునుని వంటి సంస్కార సంపన్నుడు ఏమని అనగలడు? అట్లా అని ఏమీ అనకుండా ఎలా ఉండగలడు. అందుకే అమిథ్యావచనా! అసత్యం కాని మాట కలవాడా! అన్నాడు. ఆ మాటలోని ఎత్తిపొడుపు ఈటె పోటు వంటిది. ఈ మాట విని ద్రోణుడు అదిరిపడి ఏకలవ్యుని దగ్గరకెళ్ళాడు. ద్రోణాచార్యులవారిని చూసి, నమస్కరించి తన శరీరాన్ని, మొత్తం సంపదను అతనికి సమర్పించాడు. అతన్ని చూసి ద్రోణుడు 'గురుదక్షిణ' ఇమ్మని అడిగాడు.

కం॥ ఇది దేహం బిదియర్థం
బిది నా పరిజన సమూహ మిన్నిటిలో నె
య్యది మీకిష్టము దానిన
ముద మొదవగ నిత్తు గొనుడమోఘం బనినన్! (ఆది. 5-242)

ఇది నా దేహం, ఇది నా ధనం, ఇది నా సేవక సమూహం. వీటిలో మీకేది ఇష్టమో - దానిని తప్పకుండా సంతోషంగా ఇస్తాను. తీసుకొనండి. దానికి తిరుగులేదు.

అంతటి గురువు తానై వచ్చి గురుదక్షిణ కోరటమే కొండంత భాగ్యంగా భావించి, ఉన్నదంతా ఆయన

ముందుంచిన ఏకలవ్యుని ఉన్నత గురుభక్తికి ఈ పద్యం అద్దం వంటింది. అతని మాటలలో సర్వార్పణ భావం, ముగ్ధభక్తి మూర్తికట్టింది. ఏకలవ్యుడు ద్రోణుని కోరిక మీదట తన కుడిచేతి బొటన వ్రేలిని గురుదక్షిణగా సమర్పించాడు. విలువిద్యలో అర్జునున్ని సాటిలేని మేటి విలుకానిగా చేస్తానని యిచ్చిన మాటను ద్రోణుడు నిలబెట్టుకున్నాడు.

తర్వాత తన శిష్యుల అస్త్రవిద్యను ద్రోణుడు పరీక్షిస్తున్న సందర్భంలో అర్జునుడు తప్ప మిగిలిన అందరూ చెట్టుకొమ్మ చివర ఉన్న పక్షితలతో పాటు చెట్టును, చుట్టూ ఉన్న మనుషులు అందర్నీ చూస్తారు. ఒక్క అర్జునుడు మాత్రం

కం॥ పక్షి శిరంబు దిరంబుగ
నీక్షించితి నొందుగాన నెద్దియు ననినన్
లక్షించి యేయుమని సూ
క్ష్మేక్షణు ద్రోణుండు పనిచె నింద్ర తనూజున్ (ఆది. 5-252)

పక్షితలను చక్కగా చూశాను, నాకు ఇంకేదీ కనపడటం లేదు - అని అర్జునుడు బాణాన్ని వదిలాడు. వెంటనే పక్షితల తెగి చెట్టుకొమ్మ నుండి నేలమీద పడింది.

ఈ సంఘటన విద్యాభ్యాసకాలంలో ఏకాగ్రత చాలా అవసరమని చాటి చెబుతుంది.

మరొకసారి రాకుమారులందరితో కలసి ద్రోణుడు గంగానదికి వెళ్ళి స్నానం చేస్తుండగా ఒక మొసలి వచ్చి అతని కాలును గట్టిగా పట్టింది. తాను సమర్థుడైనప్పటికీ ముసలిని విడిపించండని ధనుర్బాణాలు ధరించి ఉన్న రాకుమారులను ఆజ్ఞాపించాడు. దీన్నిబట్టి గురువు నిరంతరము శిష్యులను పరీక్షిస్తూ ఉండాలని తెలుస్తుంది. మొసలిని విడిపించడం చేతగాక అందరూ దిక్కుతోచని స్థితిలో ఉండగా అర్జునుడు ఐదు బాణాలతో మొసలిని కొట్టి ద్రోణుని విడిపించాడు.

కుమారాస్త్ర విద్యాప్రదర్శనంలో కర్ణుడు ప్రవేశించి అర్జునున్ని అధిక్షేపిస్తాడు. అప్పటికే భీమ దుర్యోధనుల ప్రదర్శన పూర్తయింది. అర్జునుడు కూడా గొప్ప అస్త్రాలను విభిన్న రీతుల్లో ప్రదర్శించి సభాసదులను ఆశ్చర్యచకితుల్ని చేసి ఉన్నాడు. కర్ణుని మాటలు ఆ క్షణాన ప్రజలకు ఆశ్చర్యాన్ని, అర్జునునికి కోపాన్ని సిగ్గును, దుర్యోధనునికి సంతోషాన్ని కలిగించాయి. అప్పుడు ద్రోణుడు కర్ణునికి అనుమతిని మంజూరు చేశాడు. అర్జునుడు చూపిన అస్త్రవిద్యా విశేషాలన్నీ కర్ణుడు అతి సులభంగా చూపాడు. తర్వాత అర్జునునితో కర్ణుడు ద్వంద్వ యుద్ధం అంటే ఇరువురు పరస్పరం ఒకరిపై ఒకరు విలువిద్యా ప్రయోగం చేశారు. అప్పుడు కృపాచార్యుడు ఇరువురి మధ్య నిలచి కర్ణున్ని కులగోత్రాలు, వంశ విశేషాలు, తల్లిదండ్రుల వివరాలను అడిగినప్పుడు కర్ణుడు నిశ్శబ్దంగా ఉండిపోతాడు. అంటే ఆ కాలంలో రాజకుటుంబీకులతో సమాన స్థాయిని ఇతరులకు ఇచ్చేవారు కాదు. కాబట్టే దుర్యోధనుడు కర్ణునికి అంగరాజ్య పట్టాభిషేకం చేస్తాడు.

కౌరవులు ద్రోణునికి గురుదక్షిణగా ద్రుపదున్ని పట్టి తేవడానికి వెళ్ళి విఫలమవుతారు. తరువాత భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు వెళ్లి ద్రుపదాన్ని పట్టి బంధించి గురువుగారికి సమర్పిస్తారు. ద్రోణుడు తన అభిమాన శిష్యుడైన అర్జునునిపై ఆపేక్షను పెంచుకుంటాడు. ప్రస్తుతకాలంలో కూడా సమర్థులైన విద్యార్థుల పట్ల మన ఉపాధ్యాయులు అభిమానాన్ని పెంచుకుంటారు కదా!

అశ్వత్థామ ద్రోణాచార్యులవారి కొడుకు. కొడుకు పట్ల ద్రోణునికి అమితమైన ప్రేమ ఉంది. ఎంత ప్రేమ ఉందంటే కురుక్షేత్ర యుద్ధంలో కొడుకు మరణించాడని విని తన ప్రాణాన్ని సైతం ద్రోణుడు త్యాగం చేశాడు. అంత ప్రేమ ఉన్న కొడుకు అశ్వత్థామ ఆవేశపరుడని గ్రహించి అతనికి బ్రహ్మశిరోనామకాస్త్ర ప్రయోగాన్ని మాత్రమే ఉపదేశించాడు, ఉపసంహారం తెలియచేయలేదు. అంతేకాకుండా ఈ అస్త్రాన్ని మానవుల మీద ప్రయోగించవద్దని శాసించాడు. కానీ అశ్వత్థామ ఉపపాండవులపై 'అపాండవమగుగాక' అని ప్రయోగించాడు. తత్ఫలితంగా కృష్ణుని నుండి శాపాన్ని పొందాడు. కన్నకొడుకే అయినా పక్షపాతాన్ని చూపకుండా ద్రోణుడు శిష్యుల అర్హతలకే ప్రాముఖ్యత నిచ్చాడు.

ఏకలవ్యుడి విషయంలో కూడా ద్రోణుడు ఈ పద్ధతినే పాటించాడు. తను ఏకలవ్యునికి విద్య నేర్పకపోయినా తనను గురువుగా భావిస్తానని అడుగగా అనుమతిని ఇచ్చాడు. గొప్ప గురుభక్తితో నిరంతర సాధనతో సాధించలేనిది ఏమీ లేదని నిరూపించిన గొప్ప శిష్యుడు ఏకలవ్యుడు. అయితే ఒక వేటకుక్క నోటిలోకి ఏడు బాణాలు ప్రయోగించిన ఏకలవ్యుని నైపుణ్యం మెచ్చదగిందే కానీ ఒక అల్పప్రాణి మీద నిష్కారణంగా అలా ఏడు బాణాలు ప్రయోగించిన ఏకలవ్యుడి విచక్షణారాహిత్యం మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఏకలవ్యుని ప్రవృత్తి లోకహితమైనది కాదని ద్రోణుడు గుర్తించాడు. తరువాతకాలంలో ఏకలవ్యుడు ధర్మానికి, దైవానికి వ్యతిరేకంగా నిలచిపోరాడాడు. జరాసంధుడు మధురపై దండెత్తి వచ్చినపుడు అతని సేనాధిపతి ఏకలవ్యుడు. పాండ్రక వాసుదేవుడు శ్రీకృష్ణునిపై దండెత్తి వచ్చినపుడు ఏకలవ్యుడు అతనికి సహకరించాడు. ఈ విషయాలన్ని మహాభారతంలోని భాగంగా కీర్తిని పొందిన హరివంశములో ఉన్నాయి. ఏకలవ్యుని ప్రవర్తన ఉదాత్తమైనది కాదు కనుకనే బొటనవ్రేలును కోసియిమ్మని ద్రోణుడు ఏకలవ్యున్ని కోరాడు. ఏకలవ్యుని విషయంలో ద్రోణుని సంకల్పం దైవికమని కొందరు పెద్దలు అంటారు.

ఏదిఏమైనా విలువిద్య నేర్పే గురువుగా ద్రోణాచార్యునికి ఒక పద్ధతి, ప్రణాళిక ఉన్నాయి. వాటినే ద్రోణాచార్యుడు త్రికరణశుద్ధిగా నమ్మి ఆచరించాడు. తన్ను చంపటానికే పుట్టిన దుష్టద్యుమ్ననికి సైతం తన గురుకులంలో చోటిచ్చి విద్య నేర్పిన ఉత్తమ గురువు ద్రోణాచార్యుడు.

కచ వృత్తాంతము :

వృషపర్వుడనే రాక్షసరాజుకు శుక్రాచార్యుడు గురువు. దేవదానవయుద్ధంలో మృతులైన రాక్షసులను తన మృత సంజీవని విద్య చేత శుక్రుడు ప్రతిరోజూ బ్రతికిస్తున్నాడు. రాక్షసులచేత చంపబడిన దేవతలు మాత్రం యమపురికి వెళుతున్నారు. అపుడు దేవతల గురువైన బృహస్పతి కుమారుడు కచునితో దేవతలు శుక్రుని నుండి మృతసంజీవని విద్యను నేర్చుకొని రమ్మని అర్థించారు.

బాలుండవు, నియమవ్రత!
శీలుండవు నిన్ను బ్రీతి చేకొని
తద్విద్యా లలనాదానము గరు
ణాలయుడై చేయు నమ్మాహాముని నీకున్ (ఆది. 2-106)

అని దేవతలు చెప్పడంలో విద్యార్జనకు బాల్యదశ అనుకూలమైందని క్రమశిక్షణా నియమాలు కలిగి ఉండటం ముఖ్యమని గుర్తించాలి. దేవతల మేలుకోసం కచుడు పృషపర్వపట్టణానికి వెళ్ళి దానవ గురువైన శుక్రాచార్యుడికి నమస్కరించి ఇలా అన్నాడు.

కం॥ ఏను గచుండను వాడ మ
హా నియమ సమన్వితుడ బృహస్పతి సుతుడన్
మానుగ వచ్చితి నీకును
భానుని భా! శిష్యవృత్తి బనిసేయంగన్ (ఆది. 3-103)

ఇక్కడ ఎటువంటి దాపరికం లేకుండా నేను దేవతల గురువైన బృహస్పతి కుమారుడను. నా పేరు కచుడు. మీ దగ్గర శిష్యుడుగా చేరి సేవచేయడానికి వచ్చాను అని కచుడు పలికాడు. కచుని మాటల్లోని వినయ విధేయతలు, గురువు నందు గల భక్తి, నియమ నిష్టలయందు ప్రసక్తి గల శిష్యుడు గురువుల ఆదరాభిమానాలను పొందుతాడు కదా. శుక్రుడు చాలా సంతోషించి 'వీడిని పూజిస్తే దేవ గురువును పూజించినట్లే' అని భావించి తన శిష్యుడుగా స్వీకరించాడు.

విద్యార్జన కోసం అవసరమైతే ఎంత దూరమైనా వెళతారని, గురువులను సేవించి విద్యను సాధిస్తారని తెలుస్తుంది. ఏ పని చెప్పినా తరువాత చేస్తానని వాయిదా వేయకుండా వెంటనే చేస్తూ శుక్రుని మనఃప్రవృత్తికి చాలా అనుకూలుడై, అంతకు మించి గురుపుత్రిక దేవయానికి మిక్కిలి విధేయుడై మెలగసాగాడు. ఈ విధంగా తన సేవానైపుణ్యంతో శుక్రునికి ప్రియశిష్యుడుగా ఉండటాన్ని రాక్షసులు సహించలేక ఒక రోజు హోమధేనువులను కాస్తూ అడవిలో ఒంటరిగా ఉన్న కచుడిని వధించి ఒక చెట్టు బోదెకు బంధించి వెళ్ళిపోయారు. సాయంత్రం హోమధేనువులు తిరిగి వచ్చాయి, కానీ వాటివెంట కచుడు రాలేదు. దేవయాని కలవరపడి తండ్రి వద్దకు వెళ్ళి యిలా అన్నది.

ఉ॥ వాడి మయూఖముల్ గలుగువాడ పరాంబుధి గ్రుంకె, ధేనువుల్
నేడిటవచ్చె నేకతమ, నిష్టమెయిన్ భవదగ్ని హోత్రముల్
పోఁడిగ వెల్వఁగాఁ బడియెఁ, బ్రొద్దును బోయె గచుండునేనియున్
రాడు వనంబులోన మృగరాక్షస పన్నగ బాధనొందెనో (ఆది. 3-112)

కచునికి ఏమైనా క్రూర మృగాలవల్ల, సర్పాల వల్ల, రాక్షసుల వలన ప్రమాదం కలిగిందేమో అని దేవయాని బాధపడుతుంది. తన బాధను తండ్రికి తెలియచేయగా శుక్రుడు తన దివ్యదృష్టితో కచుడు రాక్షసుల చేత చంపబడ్డాడని తెలుసుకొంటాడు. తన మృతసంజీవని విద్యతో కచున్ని బ్రతికించి, తను అడవికి వెళ్ళి తన వెంట తీసుకొని వస్తాడు. దేవయాని చాలా సంతోషిస్తుంది. మళ్ళీ రాక్షసులు కచున్ని చంపి, కాల్చి బూడిద చేసి మద్యంతో కలిపి శుక్రునికి తాగించారు. కచుడు సాయంత్రం ఇంటికి రాకపోవడంతో దేవయాని బాధపడి తండ్రితో చెప్పగా, శుక్రుడు పట్టించుకోలేదు. అప్పుడు దేవయాని తండ్రితో ఇలా అన్నది.

మ॥ మతిలోకోత్తరుడైన యంగీరసు మన్మండాశ్రితుండా బృహ
స్పతికింబుత్రుడు, మీకు శిష్యుడు, సురూపబ్రహ్మచార్యాశ్రమ
వ్రత సంపన్నుడకారణంబ ధనుజ వ్యాపాదితుండైన న
చ్యుత ధర్మజ్ఞ! మహాత్మ! యక్కచునకే శోకింపకెట్లుండుదున్? (ఆది. 3-118)

బ్రహ్మచర్య వ్రత సంపన్నుడని కచున్ని కొనియాడుతుంది. ఇది మంచి విద్యార్థి లక్షణం. కుమార్తె మీద అమితమైన ప్రేమ ఉన్న శుక్రాచార్యుడు తన యోగదృష్టితో జరిగిన విషయం తెలుసుకొని బాధపడ్డాడు. మద్యపానం వల్ల జరిగిన అనర్థాన్ని గుర్తించి మద్యపానం తగదని జనులకు సందేశమిస్తాడు. మృతసంజీవని విద్యచేత కచున్ని బ్రతికించి, ఆ విద్యను నేర్పిస్తాడు. గురువు కడుపు చీల్చుకొని బైటకొచ్చి, చనిపోయిన గురువును బ్రతికిస్తాడు.

తమ ఆగర్భ శత్రువులైన దేవతల గురువు బృహస్పతి కొడుకు కచుడు అని తెలిసినా శుక్రుడు ఆ కచున్ని నిరాకరించక శిష్యునిగా స్వీకరించాడు. శిష్యునిలో జాతిభేదాలను పట్టించుకోకుండా కేవలం శిష్యునిలో సద్గుణాలనే చూసినవాడు శుక్రాచార్యుడు. అలాగే గురువు చనిపోయాడు – తనకు విద్య లభించిందని అలానే వెళ్ళిపోకుండా కచుడు తిరిగి గురువును బ్రతికిస్తాడు. మరలా కొంతకాలం గురువు సన్నిధిలో మరికొన్ని విద్యలు నేర్చుకొని తర్వాత దేవలోకానికి వెళ్ళడానికి సిద్ధమవ్వగా తనను పెళ్ళి చేసుకోమని కచున్ని దేవయాని కోరుతుంది. కచుడు "గురువులకు శిష్యులు బిడ్డల్లాంటివారు", 'నీవు గురుపుత్రివి. నాకు సోదరి లాంటిదానివ'ని చెప్పి, ఆమెను నిరాకరిస్తాడు. ఇక్కడ గురుశిష్యులు తండ్రీకొడుకుల్లాంటివారని తెలపడం భారతీయ సత్సంప్రదాయానికి ప్రతీక. గురుశిష్యుల ఔన్నత్యాన్ని, సత్సంబంధాల్ని మనం గ్రహించవచ్చు. కచుడు దేవయానిని తిరస్కంచి, శాపానికి గురైనా ధర్మాన్ని కాపాడాడు.

ఉదంకోపాఖ్యానం :

బ్రహ్మసమానుడు, గొప్ప తపస్సంపన్నుడు అయిన గురుశ్రేష్టుడు పైలుడు. ఉదంకుడు పైలుని శిష్యుడు. గురువుగారి పత్ని అనుజ్ఞ చేత ఉదంకుడు పౌష్యుడనే మహారాజు యొక్క దేవేరి యొక్క కర్ణాభరణాలను దానంగా పుచ్చుకొనిరావడానికి వెళతాడు. గురుకార్య నిర్వహణకు పూనుకొన్న ఉదంకుడు ధర్మవీరుడు. అతని ఉత్సాహానికి మెచ్చి ఇంద్రుడు దివ్యపురుషుని వేషంలో ఉదంకునికి ప్రత్యక్షమై గోమయ భక్షణం చేయమంటాడు. ఉదంకుడు మొదట అంగీకరించలేదు. మీ గురువు కూడా గోమయభక్షణం చేశాడని దివ్యపురుషుడు తెలుపగా, తరువాత ఉదంకుడు గోమయాన్ని (ఆవుపేడ) తింటాడు. గురువు పట్ల ఉదంకుని భక్తిప్రపత్తులకు ఇది తార్కాణం. మూలభారతంలోని ఈ అంశాన్ని నన్నయ తెనిగించలేదు. తర్వాత అనేక కష్టనష్టాలకోర్చి గురుపత్ని చెప్పిన ప్రకారం కుండలాలను తీసుకొని చివరిరోజైన నాల్గవరోజు గురువుగారిల్లు చేరాడు. గురువుగారు గురుదక్షిణ పట్ల చాలా సంతోషించాడు.

క॥ కరమిష్టము సేసితి మా
కరి సూదన దీన నీకు నగు సత్ఫలముల్
గురుకార్య నిరతు లగు స
త్పురుషుల కగు టరుదె? యధిక పుణ్యఫలంబుల్ (ఆది-1-119) అని ఉదంకుణ్ణి ఆశీర్వదించాడు.

ఉదంకునికి శుభం జరుగుతుందని ఆశీర్వదించాడు. గురువుల పనులయందు ఆసక్తులయ్యే సజ్జనులకు గొప్ప పుణ్యాలు చేసిన ఫలాలు కలగటంలో వింత లేదు. ఈ విధంగా గురుకార్యం నెరవేర్చి ఋణవిముక్తుడ వయ్యావని ఉదంకునితో గురువు పైలుడు అనడంతో శిష్యులందరూ గురువుపట్ల కృతజ్ఞతగా ఉండాలనేది సందేశం.

వ్యాసుని శిష్యులు :

వ్యాసుని కుమారుడు శుకుడు. మునుపు వ్యాసుడు పుట్టగానే వేదాలు అతడిని పొందాయి. అలాగే శు కుడిని కూడా వచ్చి వేదాలు చేరాయి. శుకుడు దేవగురువు బృహస్పతిని తన గురువుగా వరించాడు. బృహస్పతి చదివిస్తుంటే శుకుడు క్రమంగా వేదాలు, వేదాంగాలు, సకలశాస్త్రాలూ అభ్యసించాడు. బ్రహ్మచర్య వ్రతదీక్షతో చాలాకాలం గురువుగారి దగ్గరే ఉండిపోయాడు. తరువాత గురువైన బృహస్పతి వద్ద అనుమతి పొంది తండ్రిని

చేరుకొన్నాడు. శుకుడు తన స్నేహితులతో ఆటల్లో పడి ధ్యానం సరిగా చేసేవాడు కాదు. అపుడు వ్యాసుడు శుకునికి సాంఖ్యయోగ శాస్త్రాలను బోధించాడు. దాంతో జ్ఞానోదయాన్ని పొందిన శుకుడు విరాగి అయ్యాడు.

తనకు మోక్షం గురించి తెలుపుమని శుకుడు తండ్రిని కోరగా మిథిలను పాలిస్తున్న విదేహరాజు జనకుని కలువమని, అది కూడా ఆకాశమార్గంలో కాకుండా పాదచారియై పర్వతాలను, నదులను, పుణ్యతీర్థాలను దాటి మిథిలా నగరాన్ని చేరుకుంటాడు. దారిలో దేనిని చూచినా చూడని వాడివలె వాటిని ఉపేక్షిస్తూ ప్రయాణం సాగించాడు. గమ్యం ఒకటే అతని లక్ష్యమయింది. మిథిలానగరం చేరుకొన్న శుకునికి మొదట్లో ప్రాకార ద్వారపాలకులు, తర్వాత రాజగృహ సేవకులు అనుమతించక అడ్డగిస్తారు. శుకుడు వారిపై కోపించక, ప్రశాంతంగా కొన్ని రోజులపాటు ఎదురుచూశాడు. తరువాత జనకమహారాజు దర్శనం కలిగింది. జనకుడు కూడా శుకున్ని అనేక విధాలా గౌరవించాడు. పదివేలమందికి అన్నపానాదులు ఇచ్చి విద్యను బోధించే బ్రహ్మర్షిని 'కులపతి' అంటారు. వ్యాసుడు కులపతి. కాబట్టి శుకున్ని జనకుడు సన్మానించి ముక్తిమార్గాన్ని ఉపదేశించాడు. తరువాత శుకుడు సెలవు తీసుకొని తండ్రి ఉన్న హిమాలయాలు చేరాడు. శుకుని సహనమే అతని విజయానికి మూలం అని మనం భావించాలి.

వ్యాసుడు శుకున్ని ఆకాశమార్గాన్ని అనుసరించకుండా భూమార్గం గుండానే వెళ్ళమంటాడు. ఎందుకంటే ఆశ్రమంలో నేర్చిన విద్య లోకసంచారం ద్వారా అనుభవంలోకి వస్తుంది. కాబట్టి నాటికాలంలో దేశాటన విద్యలో భాగంగా తరచుగా కనబడేది, నేటి మన ×క్రపతీఅంష్టఱజూ లాగా.

వ్యాసునికి తన ముఖ్య శిష్యులైన సుమంతుడు, వైశంపాయనుడు, జైమిని, పైలుడు అనే వారితో పాటు తన కుమారునికి కూడా అధ్యాపనం చేసేవాడు. ఒకరోజు వ్యాసుని శిష్యులు "గురుదేవా, వేదాల వలన లభించే ప్రసిద్ధిలో మేమే అందరికంటే గొప్పగా ఉండాలి. మీరు మరెవరికీ ఇంతకంటే అధికంగా వేదాలు నేర్పకూడదు. ఈ వరం అనుగ్రహించు (శాంతి - షష్ఠాశ్వాసము - 297)" అని ప్రార్థించారు. వీరికి వ్యాసుడు 'మీలాంటి శిష్యులు ఇలా స్వార్థంతో ఉండరాదని, లోకంలో అందరికీ కష్టాలు తొలగి శుభాలు కలగాలి, మీరు స్వార్థంగా ఉండరాదన్నా'డు. వెంటనే శిష్యులకు పశ్చాత్తాపం కలిగింది. తరువాత గురువు వద్ద అనుమతి తీసుకొని వ్యాసుని శిష్యులు (సుమంతుడు, వైశంపాయనుడు, జైమిని, పైలుడు) హిమాలయాలు దిగి భూమి మీదకు వెళ్ళి అవసరార్థులకు వేదాలు చదివించటం, యజ్ఞాలు చేయించటం వంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ వృత్తాంతాన్ని బట్టి ఎప్పుడైనా శిష్యులు స్వార్థంతో వక్రమార్గంలో పయనిస్తే, గురువులు వారిని సన్మార్గంలో నడిచేట్టు చేయాలని మనకు గుణపాఠం అవుతుంది.

కర్ణుని చరిత్ర :

దుర్వాస మహర్షి వరంతో సూర్యుని ప్రభావంతో కర్ణుడు జన్మించాడు. కుంతీ చేత నదిలో విడువబడిన కుంతి కొడుకును సూతుడు ఎత్తుకొని పోయి పెంచుకొన్నాడు. సూతపుత్రుడని లోకంలో పేరెన్నిక గన్నాడు. కర్ణుడు కూడా ద్రోణుని వద్దే విద్యాభ్యాసం చేశాడు. ధర్మరాజు నేర్పరితనం, భీముడి బాహుబలం, అర్జునుడి ధనుర్బాణ పాండిత్యం, అర్జునుడికీ శ్రీకృష్ణునికీ గల స్నేహాన్ని చూసి కర్ణుడికి అసూయ కలిగింది. పాండవులను లోకం మెచ్చుకోవడం కర్ణుడికి నచ్చేదికాదు. ఆ ద్వేషంతోనే దుర్యోధనునితో చేతులుకలిపాడు. ఒకసారి ద్రోణుడు ఏకాంతంగా ఉన్నప్పుడు కర్ణుడు వెళ్ళి 'బ్రహ్మాస్త్రాన్ని ప్రసాదించమని' కోరాడు. ద్రోణుడు తిరస్కరించాడు. మరునాడు కర్ణుడు బయలుదేరి మహేంద్ర పర్వతానికి వెళ్ళి పరశురాముని దర్శించి 'తాను బ్రాహ్మణుడనని, అస్త్రవిద్య

నేర్చుకోవడానికి వచ్చానని' తెలిపాడు. ఆ మాటలకు సంతోషపడి పరశురాముడు కర్ణున్ని శిష్యుడుగా స్వీకరించాడు. కర్ణుడు భక్తుడై గురువును సేవించటం వల్ల ఆయన అతనికి బ్రహ్మాస్త్రం మొదలుకొని అనేక అస్త్రాలను నేర్పాడు. ఒకసారి ధనుర్విద్యాభ్యాసం చేస్తుండగా కర్ణుని బాణం తగిలి బ్రాహ్మణుని గోవు చనిపోయింది. దానికి ఆ బ్రాహ్మణుడు కోపించి కర్ణునికి శాపం పెట్టాడు.

ఒకనాడు కర్ణుని తొడమీద తలపెట్టి పరుశురాముడు నిద్రపోయాడు. అపుడు వికారమైన 'అళకం' అనే పురుగొకటి కర్ణుడి క్రింది తొడభాగాన్ని కొరికి తొలిచివేసింది. నెత్తురు కారటం మొదలుపెట్టి క్రమంగా సాగి పరశురాముడి శరీరాన్ని తాకింది. పరశురాముడు మేల్కొని జరిగిన విషయాన్ని తెలుసుకొని మిక్కిలి కోపించి 'నా వలన నేర్చుకొన్న అస్త్ర విద్యాసంపద మొత్తం భగ్నమైపోవుగాక' అని శపించాడు. కర్ణుడు విచారపడ్డాడు. అయితే వాస్తవాన్ని చెప్పకుండా దుర్యోధనుని వద్దకు వచ్చి 'పరశురాముని ఆశ్రయించి అస్త్రవిద్యను గడించానని, ఇప్పుడీలోకంలో అస్త్రవిద్యలో తనను యుద్ధంలో ఎదుర్కొనే వీరులు లేరని' పలికి దుర్యోధనునికి సంతోషాన్ని కలిగించాడు. కర్ణుని అసత్యాలు తాత్కాలికంగా ప్రయోజనం కలిగినా దీర్ఘకాలికంగా నష్టమే జరిగింది. కాబట్టి శిష్యులు తాత్కాలిక ప్రయోజనాల కోసం అసత్యమాడితే, శాశ్వత ప్రయోజనాలు పొందలేరు.

శ్రీకృష్ణార్జునులు :

మహాభారత కురుక్షేత్ర యుద్ధప్రారంభంలో బంధువులను, గురువులను చంపుతున్నాననే సంఘర్షణ అర్జునునిలో మొదలవుతుంది. ధనుర్బాణాలను విడచి యుద్ధం వద్దంటాడు. జగద్గురువు శ్రీకృష్ణున్ని గురువుగా భావించి తనకు శ్రేయోమార్గాన్ని బోధించమంటాడు.

శ్లో॥ కార్పణ్య దోషోపహత స్వభావః
పృచ్ఛామి త్వాం ధర్మ సమ్మూఢ చేతాః ।
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే
శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నం ॥ (భగవద్గీత-2-7)

అర్జునుడు "లోభమనే దోషంచేత నేనిప్పుడు నా ధర్మవిషయంలో మోహం చెంది శాంతిని కోల్పోయాను. నాకు ఏది ఉత్తమమో చెప్పుమని అడుగుతున్నాను. నేనిప్పుడు నీకు శిష్యుడను, శరణాగతుడను. దయచేసి నాకు ఉపదేశం చేయవలసిందని" అర్జునుడు శ్రీకృష్ణుని ప్రార్థించాడు.

శ్లో॥ తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।
ఉపదెక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానినస్తత్వ దర్శినః ॥ (భగవద్గీత-4-34)

"గురువు దగ్గరికి వెళ్ళి సత్యము తెలుసుకోవడానికి ప్రయత్నించు. వినయంతో గురువు దగ్గర సేవచేయాలి. ఆత్మదర్శులైన గురువులు నీకు జ్ఞానమును ఉపదేశిస్తార"ని శ్రీకృష్ణుడు తెలిపాడు. శిష్యుల్లోని అనుమానాలు, సంఘర్షణలు తీరాలంటే ప్రత్యక్షంగా గురువు దగ్గరికెళ్ళాలని భావం.

ముగింపు :

మన ప్రాచీన సంప్రదాయ విద్యలను, జ్ఞానాన్ని గురువులు తమ శిష్యపరంపర ద్వారా తర్వాతితరాలకు అందించారు. మహాభారతంలో గురుశిష్య పరంపరను గురించి, గురుశిష్య సంబంధాల గురించిన అనేక

వృత్తాంతాలు లభిస్తాయి. 'గురుశిష్య సంబంధాలు' అనేది విస్తృతమైన అంశం. సదస్సు పరిమితుల దృష్ట్యా ఈ వ్యాసం సమగ్రం కాకపోవచ్చు. అయితే గురుశిష్య సంబంధాలలోని ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకొనే అవకాశం కల్పించిన సదస్సు నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమదాంధ్ర మహాభారతము – కవిత్రయము
2. మహాభారతం – సామాజిక ప్రబోధం – వడ్లమూడి గిరిధర్ కుమార్
3. కవిత్రయ భారతం – ప్రతిపర్వ వివేచనం – (సం) ఆచార్య కోసూరి దామోధర నాయుడు
4. మహాభారతంలో విద్యావిధానం – ఆర్. మల్లేశుడు.

❖❖❖

ఆంధ్ర మహాభారతం - స్త్రీ పాత్రలు

డాక్టర్ పి. కుమారి నీరజ, సహాయాచార్యులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి.

స్త్రీ పాత్రలు ఎందుకు? మహాభారత కాలంనాటి స్త్రీలు పరిపాలనాదక్షతతో ప్రతిభాసంపన్నులై తమ తండ్రులను, భర్తలను, కుమారులను అమితంగా ప్రభావితం చేయగలిగారు. మహారాజభవన ప్రాంగణాల్లో నడయాడిన ఈ భారత స్త్రీలు తమ విశాలదృష్టితో మనకు వివేకాన్ని, విచక్షణను పంచి కాలమాన పరిస్థితులననుసరించి మనల్ని మనం ఎలా దిద్దుకోవాలో, ఏ పరిస్థితుల్లో ఎలా ఇమిడిపోవాలో నేర్పుతాయి. వ్యక్తిత్వవికాసాన్ని ఈ పాత్రలు మనకిస్తాయి.

సత్యవతి, కుంతి, గాంధారి, ద్రౌపది, ఉత్తరవంటి స్త్రీల జీవితాలు అధ్యయనం చేసిన ప్రతి స్త్రీ తన కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడమే కాదు, ఇతర కుటుంబాల గురించి కూడా ఆలోచిస్తుంది. స్త్రీలు తన సవతులు, తోడికోడళ్లు అనే ఈర్ష్యాసూయ భావాలను పక్కనబెట్టి సాటిస్త్రీగా, మాతృమూర్తిగా అలోచిస్తారు. తోటివారిని ఏవిధంగా ఓదార్చి అక్కున చేర్చుకోగలమా? అని ఆలోచిస్తారు. ఇంతటి సౌహార్ధత ఏ పురుషపాత్రలోనూ కనిపించదు.

భారతకాలంనాడు స్త్రీలకుండిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, నిర్భీకత, నైతికత పట్లగల వివిధ భావాలు కాలక్రమేణ సంకుచితమౌతూ వచ్చాయి. "పదిమంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, నూరు మంది ఆచార్యులకంటే తండ్రి, తండ్రికంటే వేయిరెట్లు తల్లి" అని మహాభారతమూ, మనుస్మృతి చెప్పిన స్త్రీ మాతృత్వ గౌరవం భాసుని కాలానికి వట్టినోటిమాటగా మిగిలి, పాంచరాత్రంలో భీష్ముడు రూపంవల్ల స్త్రీ, పరాక్రమంవల్ల మగవాడు ముఖ్యులనిపించుకుంటారు అనేంతగా మారిపోయింది. మహిళపై ఆమె ప్రమేయంలేకుండా అత్యాచారం జరిగినట్లయితే ఆమెను అపరాధ భావంతో చూడటంకానీ, ఆమెను శిక్షించడంకానీ అకార్యములని శాంతిపర్వం అంటున్నది. ఆధునిక కాలంలో స్త్రీవాదులు హక్కుల పోరాటం జరిపిన తర్వాతకానీ ఈ భావానికి దేశంలో వ్యాప్తి కలుగలేదు.

చంద్రవంశంలోని రాచస్త్రీలందరివీ వడ్డించిన విస్తరి జీవితాలు కావు. ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. కవిత్రయం కొన్ని స్త్రీ పాత్రలను ఉన్నతంగా తీర్చి దిద్దారు. వారి పుట్టుక, ఇతరులతో వారి సంబంధ బాంధవ్యాలు, వారి వివాహ విధానం అన్నీ సత్యదూరమనిపించినా, వారిని భారత స్త్రీలకు ఆదర్శంగా చూపారు. మహాభారత కాలంలో ఈ స్త్రీలు చేపట్టిన కార్యక్రమాలు, వారి వివాహ పద్ధతులు, వారి హక్కులు, వారి మనోగత వాంఛలు పరిగణనలోకి తీసుకుని ఆయా పాత్రల గూర్చి రాయడం జరిగింది. రచయిత కాలంనాటి సామాజిక విలువలు, మానవ స్వభావం గూర్చి చెప్పటమే ఈ వ్యాసం ఉద్దేశం. ఇందులో మనకు కథలో కనిపించే నిడివిని బట్టి చిన్నా పెద్దా 380 స్త్రీ పాత్రలు దర్శనమిస్తాయి. భారత కథలో మహా పురుషులెందరున్నా స్త్రీలే కథలను నడిపిస్తారు. గంగాదేవి, సత్యవతి, అంబ, అంబాలిక, గాంధారి, కుంతి, మాద్రి, ద్రౌపది, సుభద్ర, ఉత్తర, హిడింబ, ఉలూచి, చిత్రాంగద, దుస్సల, సుధేష్ణ, పైలపత్ని(ఉదంకుని గురుపత్ని), పౌష్యపత్ని, పులోమ, సుకన్య, ఘృతాచి, ప్రమద్వర, కద్రువ, వినత, నిషాది, జరత్కారువు, వపుష్ఠమ(జనమేజయుని భార్య), శుక్తిమతి, గిరిక, అద్రిక, ధరణి, దేవయాని, ఘూర్ణిక, శర్మిష్ఠ, మేనక, శకుంతల, వసువు, నందిని, జితవతి, మమత, ప్రద్వేషిణి, సుధేష్ణ, రాధ, శ్రుతసేన, భద్ర, కృపి, భృగుపత్ని, తిలోత్తమ, దమయంతి, లోపాముద్ర, రేణుక, స్వాహాదేవి,

అరుంధతి, సత్యభామ, సావిత్రి, ప్రభావతి, మాధవి, పింగళ, సతీదేవి, పార్వతీదేవి, సులభ, గౌతమి, నర్మద, సుదర్శన, ఓఘవతి, సుప్రభ, పంచచూడ, రుచి, అహల్య, జ్యేష్ఠాదేవి మొదలైన పాత్రలు కన్పిస్తాయి.

గంగాదేవి :

ఈమె జహ్ను కన్య. పరమ పావని. దేవనది. శంతనుని భార్య. భీష్మాచార్యుని తల్లి. ప్రతీపుని కోడలు. శంతనుడు తనను భార్యగా స్వీకరించాలంటే ప్రవర్తనా నియమాల్ని విధించింది. తాను ఏం చేసినా వారించకూడదని, అప్రియమైన మాటలు పలికినా, కట్టడి చేయబోయినా అతన్ని వదిలి వెళ్ళపోతానని స్పష్టం చేసింది. అష్టవసువులకు జన్మనిచ్చి, పుట్టిన వెంటనే నీటిపాలు చేసి వారికి శాప విమోచనం కలిగించింది. తనను అప్రియంగా మాట్లాడిన భర్తను పెళ్లికి ముందే చెప్పినట్లుగా ఆత్మాభిమానంతో వదిలి వెళ్ళింది. కుమారుడైన దేవవ్రతున్ని మాత్రం తనతో తీసుకెళ్ళింది. వశిష్ఠుని వద్ద వేదాలను నేర్పించింది. బృహస్పతి, శుక్రాచార్యుల వలె సకల ధర్మశాస్త్రాలను అభ్యసింపజేసింది. అస్త్రశస్త్ర విద్యలను అభ్యసించడానికి పరశురాముని ఆశ్రయింపజేసి గురువును మించిన శిష్యునిగా తన కుమారుని రూపొందించటంలో పుత్రుని పోషణలో తల్లి బాధ్యత ఎటువంటిదో తలపింపజేసింది. ఆత్మజ్ఞానంలో పుణ్యాత్ముడైన దేవవ్రతుని తండ్రివద్దకు చేర్చింది.

అంతటితో బాధ్యత తీరిపోయిందనుకోలేదు. భీష్ముడు పరశురాముడితో తలపడటానికి కురుక్షేత్రానికి వస్తూండగా గంగ స్త్రీ రూపంలో భీష్ముని ప్రస్థానానికి కారణం తెలుసుకుని కుమారుని మందలించింది. పరశు రాముని చేరి తన కుమారునిపై ఆగ్రహం వహించటం సబబు కాదంది.

యమునా నదీ తీరంలో భీష్మునిపై ప్రతీకారం తీర్చుకోవటానికి అంబ ఘోర తపస్సునాచరిస్తుండగా గంగ అక్కడకు చేరి ఖిన్నురాలై అంబను శాసించింది.

ఇలా భీష్మునికి జన్మనిచ్చి నిరంతరం అతని కష్టసుఖాలను కనిపెట్టిన తల్లిగా గంగ పావన గంగయైంది.

మత్స్యగంది/సత్యవతి :

కురువంశానికి కుల వధువు. మహాభారత కథకు కేంద్ర బిందువు. మాతృస్వామ్య వ్యవస్థలో కుటుంబ పెద్ద. మహాభారత కథలో కుటుంబ పెద్దగా ఈమెది పెద్ద బాధ్యతే. ఈమె పుట్టుక అసహజం, అసాధ్యం. ఉపరిచర వసువు వీర్యాన్ని మింగిన చేపరూపంలోని అద్రిక అనే అప్సరసకు పుట్టిన అందమైన మత్స్యగంధే ఈ సత్యవతి. ఈమె జనాన్ని బల్లకట్టు ద్వారా యమునా నదిని దాటించే పనిచేస్తూ పరాశరుడు అనే రుషి కంటపడి తప్పించుకోలేక పోయింది. పరాశరుడితో కలయికకు రెండు అభ్యంతరాలు లేవనెత్తింది. 1. పగటిపూట నది ఒడ్డున ఉన్నవారు గమనిస్తారు. 2. అతనితో లైంగిక సంపర్కం జరిగితే ఆమె కన్యాత్వం కోల్పోతుంది, గర్భవతైతే సమాజం నిందిస్తుంది. తండ్రి కోపగిస్తాడు.

వీటన్నిటికీ పరిష్కారం చూపుతూ రుషి ఆమెను సుగంధిగా మార్చి తన కోర్కెతీర్చుకుని ఆమె కన్యాత్వం చెడకుండా పుత్రునికి జన్మనిచ్చేట్లు చేస్తాడు. ఆ పుత్రుడే గొప్ప మేథావి, రుషి, మహాభారత రచయితైన వ్యాసుడు. ఇతడు పుట్టిన వెంటనే పెద్దవాడై తల్లికి అవసరమైనప్పుడు వస్తానని అడవులకు వెళ్లిపోతాడు.

సత్యవతి జీవితంలో తర్వాత జరిగే సంఘటనలే కావ్యానికంతా మూలం. ఒకరోజు ఆమెను చూసిన శంతనమహారాజు సమ్మోహితుడై ఆమెను వివాహం చేసుకుంటానని ఆమె తండ్రి దాసరాజుని కోరడం, ఆయన తన కూతురి బిడ్డలే రాజ్యానికి వారసులు కావాలని పట్టుబట్టడం, శంతనమహారాజు మొదటి భార్య గంగాపుత్రుడైన దేవవ్రతుడు తండ్రి బాధను చూడలేక తాను రాజ్యాధికారాన్ని త్యజించడమే కాదు, ఆజన్మాంత బ్రహ్మచారిగా మిగిలిపోయి తండ్రికి వివాహం జరిపిస్తాడు. శంతన మహారాజు మరణానంతరం శంతన మహారాజు, సత్యవతుల

పుత్రుల్లో పెద్దవాడైన చిత్రాంగదుడిని రాజుగా చేస్తాడు.ఇతడు గంధర్వుని చేతిలో మరణించిన తర్వాత చిన్నవాడైన విచిత్రవీర్యుని గద్దెనెక్కించి రాణి సత్యవతి అధీనంలో రాచవ్యవహారాలు నడిపిస్తాడు.

పరాశరుని నుంచి కన్యకావ్రతానికి విరోధం లేని సంగమాన్ని పొంది వ్యాసునికి తల్లి కావటం, ఆ తర్వాత దాశరాజుపుత్రిగా కొత్తజీవితాన్ని ప్రారంభించటం ఆమె స్వతంత్ర నిర్భీకవ్యక్తిత్వానికి నిరూపణలు. చిత్రాంగద విచిత్రవీర్యుల మరణానంతరం ఉత్తరాధికారి లేని హస్తినాపుర రాజ్య సింహాసనంపై యువరాజును ఆసీనున్ని చేయాల్సిన బాధ్యతను సత్యవతి తలకెత్తుకోవాల్సివచ్చింది. భీష్ముని పిలిచి రాజ్య భారం వహించి, వివాహం చేసుకుని, వారసులను అందించాలని తల్లిగా ఆజ్ఞాపించింది. వంశక్షయం కారాదని తన మొదటి కొడుకు వ్యాసుని పిలిచి, ధర్మవిరుద్ధమని వ్యాసుడు చెప్పినా వినక దేవరన్యాయాన్ననుసరించి, నియోగపద్ధతిలో కోడళ్ళను పుత్రవతులను కావించి కురువంశం కొనసాగే ప్రయత్నం చేస్తుంది. సింహాసనంపై ఆశీనురాలు కాకపోయినా, రాజ్యరక్షణలో ఈమె బాధ్యత శ్లాఘనీయం. ఈమె పూర్తిగా స్వతంత్ర, స్వయం నిర్ణయాలు తీసుకోగల దృఢచిత్తయైనా అవసరానికి మించి తన ఉనికిని కానీ, పెద్దరికాన్ని కానీ ప్రదర్శించదలచుకోలేదు. భవిష్యత్తును చక్కదిద్దుకోవాల్సిన బాధ్యతను వారికే అప్పగించి, తపస్వియై అడవులలో ఘోరతపస్సు నాచరించి స్వర్గస్థురాలైంది.

అంబ, అంబిక, అంబాలిక:

ఈ ముగ్గురూ చెరపట్టబడిన పెండ్లి కూతుళ్ళు. కౌశల దేశపు రాజు తన ముగ్గురు కుమార్తెల స్వయంవరం ఏర్పాటు చేస్తాడు. విచిత్రవీర్యునికి ఆహ్వానం అందలేదు. భీష్ముడు స్వయంవరానికి హాజరై ఎందరో యువరాజుల్ని చంపి ముగ్గురు యువరాణుల్ని ఎత్తుకుపోయి విచిత్రవీర్యునికిచ్చి వివాహం చేయాలనుకుంటాడు. కురువంశానికి వారసున్ని తేవడమే భీష్ముని లక్ష్యం. అంబ సాల్వరాజుని ప్రేమించానని వేడుకుంటే ఆమెను గౌరవంగా అతని వద్దకు పంపుతాడు. కానీ సాల్వరాజు శాస్త్ర ప్రకారం యుద్ధంలో తాను భీష్ముడిచేతిలో ఓడిపోయాడు కాబట్టి ఆమె భీష్మునికే చెందుతుందని, తాను వివాహం చేసుకోనని నిరాకరిస్తాడు.

తిరిగొచ్చిన అంబ తన వివాహం చెడడానికి కారణమైన భీష్మున్నే వివాహం చేసుకోమంటుంది. బ్రహ్మచారి భీష్ముడు అది సాధ్యం కాదన్నాడు. అంబ భీష్ముడిని ఆడమగ కాని వ్యక్తిచేతిలో చస్తావు అని శపిస్తుంది.
అంబిక అంబాలికలను విచిత్రవీర్యుడు వివాహం చేసుకుంటాడు. అప్పటికే అతడు క్షయవ్యాధిగ్రస్తుడు. పెండ్లయి ఏడు సంవత్సరాలైనా సంతానం లేకుండానే మరణిస్తాడు.

ఇక్కడ ఆడవారి విధులు, కుటుంబాచారాలను మరో కోణంలో చూపుతాడు వ్యాసుడు. రాణి సత్యవతి శంతనుని వంశాన్ని నిలబెట్టడానికి, విధవరాళ్ళైన కోడళ్ళతో వారసున్ని ఇవ్వమంటుంది. అందుకు భీష్ముడు నిరాకరిస్తాడు. సత్యవతి తన మొదటికొడుకు వ్యాసునికి ఈ బాధ్యతను అప్పగిస్తుంది.

వ్యాసుని అవతారానికి భయపడి కళ్లుమూసుకున్న అంబిక గుడ్డివాడైనా, మేధావి, బలవంతుడైన కుమారునికి జన్మనిస్తుందని చెప్తాడు వ్యాసుడు. అతడే ధృతరాష్ట్రుడు. రాజ్యపాలన అతనివల్ల సాధ్యంకాదని అంబాలికద్వారా మరో పుత్రుని కనాలని తల్లి ఆజ్ఞాపిస్తుంది. అంబాలిక కూడా వ్యాసుని రూపానికి భీతిల్లి పాలిపోయినట్లవటంవల్ల ఆమెకు పాండురోగియైన కుమారుడు జన్మిస్తాడంటాడు. అతడే పాండురాజు. సత్యవతి అంబికతో మరో పుత్రుని కనమని వ్యాసుణ్ణి పురమాయిస్తుంది. అంబికకు ఇష్టంలేక, అత్తగారి మాట జవదాటలేక పరిచారికను వ్యాసుని దగ్గరకు పంపుతుంది. ఆమె ఇష్టపూర్తిగా వ్యాసుణ్ణి కలవటంవల్ల ఆమెకు తెలివైన కొడుకు పుడతాడని, ఆ అబ్బాయికి విదురుడు అని పేరు పెట్టి బాగా చూసుకోమని, అంబిక చేసిన మోసాన్ని చెప్తాడు.

అంబిక, అంబాలిక తమ వంశాభివృద్ధికి అత్తగారి మాట కాదనలేక కర్తవ్య నిర్వహణలో నిమగ్నులయ్యారు. పాండురాజు మరణానంతరం హస్తినాపురానికి చేరుకున్న కుంతిని, పాండవులను హృదయపూర్వకంగా ఆహ్వానించి వారితో కొంతకాలం గడిపి తర్వాత అత్తగారితో కలిసి అడవుల్లో శేషజీవితం గడిపారు.

గాంధారి :

ధృతరాష్ట్రునికి, పాండురాజుకి, విదురునికి పెండ్లిండ్లు చేసే బాధ్యత భీష్ముడు తీసుకుంటాడు. గాంధార దేశ రాకుమార్తె. సుబలుని కుమార్తె, శకునికి స్వయంగా చెల్లెలు. గాంధారి వందమంది కుమారులను పొందే వరాన్ని శివుడి ద్వారా పొందిందని తెలుసుకున్న భీష్ముడు, వ్యాసుడు కూడా ధృతరాష్ట్రుడు వందమంది కుమారులకు తండ్రవుతాడని చెప్పడంవల్ల గాంధారి ఇతనికి తగిన జోడి అని తీర్మానించుకుని ఆమెనిచ్చి వివాహం చేస్తాడు. ఈమె అసాధారణ తెలివితేటలుగలదని, నీతిమంతురాలనీ, దైవచింతనగలదనీ, అద్భుతమైన శక్తి సామర్థ్యాలుగలదనీ వ్యాసుడు ఆమెను చిత్రిస్తాడు.

కళ్ళకు గంతలు కట్టుకోవడంలో గానీ, ఉదరతాడనం కావించుకోవడంలో గానీ గాంధారి తొందరపాటు మనస్తత్వం కనిపిస్తుంది.

పాండురాజుపై మక్కువ ఎక్కువ. అతని మరణానంతరం కుంతి పాండవులను తీసుకుని హస్తినాపురం వచ్చినప్పుడు వారికి సమాన పుత్రప్రేమనే పంచింది. భర్తచేత ద్రౌపదికి వరాలు ఇప్పించి పాండవులను దాస్యవిముక్తులను కావించడానికి కారకురాలైంది.

యుద్ధానికి బయలుదేరుతూ దుర్యోధనుడు ఆశీర్వాదం కోసం వస్తే ధర్మం ఎటు ఉంటే అటే జయమని చెప్పింది. ఆమె మాటకు తిరుగులేదు.

యుద్ధానంతరం స్త్రీపర్వంలో కౌరవస్త్రీలందరూ యుద్ధభూమిలోకి వెళ్ళినప్పుడు గాంధారి కళ్ళకుగంతలు విప్పకుండా వ్యాసుడిచ్చిన దివ్యదృష్టితో చూసి తన దు:ఖాన్ని కృష్ణుడితో చెప్పుకుంటుంది. ఇదంతా నువ్వే దగ్గరుండి చేయించావని దెప్పుతుంది. నువ్వు యుద్ధాన్ని ఆపగల సమర్థుడివి కానీ ఆ పని చెయ్యలేదు. అందుకే కృష్ణుడిని, యాదవకులాన్ని శపిస్తుంది.తన కొడుకుల చావుతో తన కోడళ్ళ దుఖం మిన్నంటిందని బాధపడుతుంది.

కుంతి :

ఈమె సిద్ధినామకదేవి అంశతో జన్మించిన యాదవరాజైన శూరసేన మహారాజు కుమార్తె, వసుదేవుని సోదరి. ఈమె పేరు పృథ. ఈమెను సుర మేనత్త కొడుకు కుంతి భోజుడు పెంచుకోవడంవల్ల ఈమె పేరు కుంతిగా స్థిరపడింది. ఈమె గొప్ప సౌందర్యరాశి. రాజనీతిజ్ఞురాలు, సంయమనపరురాలు, కార్యనిర్వహణచతుర, గంభీర హృదయ, ఉత్తమ గుణ సమన్విత మాతృమూర్తి. చిన్న వయసులోనే రుషులు, మునులకు సేవలందించింది. అతికోపిష్ఠి దుర్వాసముని ఆమె సేవలకు మెచ్చి ఆమెకు తనకిష్టమైన వ్యక్తిని ఆహ్వానించే వరం ప్రసాదించాడు. ఈమె పాండురాజు భార్య కాగలదు కానీ అతనివల్ల సంతానంపొందలేదని ముందుగానే దుర్వాస మునికి తెలిసే ఈ వరం ప్రసాదించాడేమో. అందుకే ఈమెను పాండురాజు భార్యను చేశారనిపిస్తుంది. ఈమె ఈ వరాన్ని పరీక్షించడానికి సూర్యుణ్ణి ఆహ్వానిసుంది. తర్వాత గౌరవం, పరువు, సమాజం గురించి ఆలోచిస్తుంది. తన కన్యాత్వం చెడకుండా సూర్యుని ద్వారా కర్ణుని సంతానంగా పొంది సమాజానికి భయపడి నదిలో వదిలేస్తుంది.

పాండురాజుని వివాహం చేసుకున్న తర్వాత అతనికున్న శాపంవల్ల సంభోగ యోగం లేనందున సంతానం యోగం లేదు. మదనపడుతున్న మహారాజుకి తనకున్న ముని వరాన్ని తెల్పి అతని అనుమతితో యమధర్మరాజు, వాయువు, ఇంద్రులను ఆహ్వానించి ధర్మరాజు, భీముడు, అర్జునులను కుమారులుగా పొందుతుంది. భర్త

అనుమతితో మాద్రికి కూడా మంత్రోపదేశం చేసి అశ్వనీదేవతల ఆహ్వానంతో నకుల, సహదేవులనే కుమారులు పొందేట్లుగా చేసిన గొప్ప వ్యక్తిగ కన్పిస్తుంది. భర్త మరణంతో మాద్రి **సతీసహగమనం** (ఆ కాలానికే ఉంది) చేస్తే ఆమె పిల్లలనూ తన పిల్లలుగానే పెంచుతుంది. పాండవులను తమ రాజ్యం తాము పొందేట్లు వీరులుగా తీర్చి దిద్దుతుంది.

ఏక చక్రపురంలో తమకు ఆశ్రయమిచ్చిన బ్రాహ్మణునికి సహాయం చేయటానికి, బకాసురుని వధించడానికి తన కుమారుడు వజ్రకాయుడైన భీమున్ని పంపింది.

అర్జునుడు ద్రౌపదిని స్వయంవరంలో గెలిచి తాను బిక్ష తెచ్చానంటాడు. అన్నదమ్ములైదుగురూ సమానంగా పంచుకోండని తల్లి అంటే ఆ మాట జవదాటరు కుమారులు. బహు భర్తలుండటం మొదలైనట్లు తెలుస్తుంది.

కురుక్షేత్ర సంగ్రామ సమయంలో తన పిల్లల కాపాడుకోవడానికి తన పుత్రుడే ఐన కర్ణుడిని బతిమాలుకుంటుంది.

మాద్రి :

మద్ర దేశాధీశుని కుమార్తె. అపురూప సౌందర్యవతి. మహాభారత కాలంలో బహుభార్యా పద్ధతి అమల్లో ఉంది. భీష్ముడు మాద్రరాజు చెల్లెలు మాద్రిని అతనికి కన్యాశుల్కం చెల్లించి తెచ్చి పాండురాజుకిచ్చి వివాహం చేస్తాడు.

తనవల్లే భర్త చనిపోయాడని నిందంతా తలపై మోసుకుంటూ, నకుల సహదేవులను అక్కగారికి అప్పగించి, భర్త పాండురాజుతో సహగమనాన్నాచరించింది.

ద్రౌపది :

పాంచాల దేశ రాజు ద్రుపదుని కుమార్తె. కృష్ణ, పాంచాలి అని పేర్లు. ఆమె పుట్టుకే అద్భుతం. యజ్ఞపు అగ్నినుండి జన్మించింది. స్వయంవరంలో అర్జునుడు గెలుచుకోవడంవల్ల అతన్నే ఆమె వరించినా కుంతి మాట ప్రకారం పాండవులైదుగురికీ భార్య కావాల్సొచ్చింది. బహుభార్యలుండటం చూశాం బహు భర్తలు ఇక్కడే. ద్రుపదున్ని ఈ విషయంలో ఒప్పించడానికి వ్యాసమహర్షి ద్రౌపదికి ఐదుమంది భర్తలు కలగడానికి కారణంగా (శివుడు ఐదుగురు స్వర్గవాసులశాప కథను) ఒక కథను వినిపిస్తాడు.

ఆమెది విచిత్ర వివాహమైనా తన నేర్పరితనంతో, సమయస్ఫూర్తితో ఐదుగురు భర్తలను సంతోషపెట్టగలిగింది. భర్తను ఎలా సంతోషపరచాలన్న విషయంలో కృష్ణుని ఇష్టసతి సత్యభామ ద్రౌపది సలహా కోరితే అందంగా అలంకరించుకోవడం, కన్నీరు కార్చడం, వశీకరణ మందులు వాడటం పనిచేయవని, భర్తలను గౌరవంగా, ప్రేమగా చూసుకుంటే సంతోషంగా ఉంటారని సలహా ఇస్తుంది.

ఈమె సౌందర్యవతి, ఎవరిపట్ల ఎలా వ్యవహరించాలో బాగా తెలిసిన వ్యక్తిగా, సహృదయురాలిగా, కక్షసాధించే స్వభావిగా, కృష్ణభక్తురాలిగా, మేథావిగా చిత్రిస్తాడు.

జూదంలో పాండవులు ఓడిపోయి ద్రౌపదిని కౌరవసభలోకి తీసుకు రమ్మన్నప్పుడు ధర్మరాజు మొదట " తన్నోడి నన్నోడెనా? లేక నన్నోడి తన్నోడెనా?" అని తెలివిగా ప్రశ్నిస్తుంది. దుర్యోధనుకు, దుశ్శాసనుడు, కర్ణుడు కురువృద్ధుల సభలో తనను అవమానిస్తే ఆ అవమానాన్ని కంఠంలో దాచింది. అరణ్యవాసంలో సైంధవుడి వల్ల అవమానపడింది. అజ్ఞాతవాసంలో కీచకుడి బలాత్కారం వల్ల రేగిన పగ వాడి నాశనాన్ని కోరింది. కౌరవులమీద పగ కురుక్షేత్రయుద్ధంతోనే తీరుతుందని సంధికి ఒప్పుకోని ధీర.

యుద్ధంలో ఉపపాండవులను అశ్వత్థామ సంహరిస్తే, అతన్ని పాండవులు లాక్కొచ్చి ద్రౌపదిముందేస్తే

చంపకుండా వదిలేయమంటుంది. అతని తల్లి భర్తను పోగొట్టుకొని, కుమారుని చూసుకొని బ్రతుకుతోందని అతన్నీ సంహరిస్తే ఆ గురుపత్ని శాపం పాండవులకు మంచిదికాదని అంత బాధలోనూ తెలివిగా ఆలోచిస్తుంది.

హిడింబ :

ఈమె అసలు పేరు కమలపాలిక. హిడింబుడనే రాక్షసుని సోదరి. జన్మచే రాక్షస వనితయైనా ఉత్తమ మానవ లక్షణాలుగల పతివ్రత. జన్మాంతర పుణ్యంవల్ల భీముని భర్తగా పొందిన ఉత్తమ ఇల్లాలు. ఈమెలో దివ్యత్వం, స్త్రీత్వ, భూత భవిష్యత్తుల నెరుగగల శక్కి ఉండటం విశేషం. వినయం ఆభరణమై కుంతీ, ధర్మజుల ఆదరాన్ని పొందగలిగింది. పాండవులకు మహాబలశాలియైన ఘటోత్కచున్ని ప్రథమ సంతానంగా అందించింది.

చిత్రాంగద :

మణిపూర దేశాధీశుని కుమార్తె. అర్జునుని ధర్మపత్ని. బభ్రువాహనునికి తల్లి.తన తండ్రికి పుత్ర సంతానం లేనందువల్ల ఆ రాజ్యానికి తన కుమారుడే వారసుడు. వివాహమైనా ఈమె తన మాతృవంశ నామంతో పుట్టినింటనే ఉండేది.

ఉలూచి (ఉలూపి) :

ఈమె నాగకన్య. ఐరావత కులసంభవుడైన కారవ్యుని కుమార్తె. అర్జునుని వలచి, వలపించుకొని ఏకరాత్రమాత్ర సమాగమంచేత సద్యోగర్భంతో ఇలావంతుడనే కుమారుని పొందింది.

అర్జునుడు శిఖండిని అడ్డంపెట్టుకొని భీష్ముడిని అధర్మంగా నిలువరించినందుకు కోపించిన వసువులు గంగ సమ్మతితో అర్జునునికి కీడు చేయనున్నారని తెలుకున్న ఉలూచి తన తండ్రిని పంపి వారిని శాంతింపజేసి, పరిహారమార్గం తెలుసుకుంటుంది. అర్జునుని క్షేమాన్నికోరి బభ్రువాహనున్ని ప్రేరేపించి తండ్రి అర్జునునితో ఘోరయుద్ధం చేయించి, ఆ యుద్ధంలో నిర్జీవియైన అర్జునున్ని సంజీవమణిచే పునరుజ్జీవితున్ని చేసి, భర్తకు ఆయువును, ఆనందాన్న అందించిన తెలివైన భార్య.

సుభద్ర :

ఈమె వసుదేవుడు, రోహిణుల కుమార్తె. శ్రీకృష్ణుని సోదరి. సుభద్ర అర్జునునికి నాల్గవ భార్య. శ్రీకృష్ణుడు సుభద్ర మనసెరిగి బలరాముడికి తెలియకుండా ఈ వివాహం జరిపిస్తాడు. అర్జునుడు యాదవులతో యుద్ధం చేస్తుండగా సుభద్ర రథసారథియైంది.

అరణ్యంలో పాండవులు కష్టాలు పడుతున్న సమయంలో తన కుమారుడైన అభిమన్యున్ని ధనుర్విద్యానిపుణునిగా తీర్చిదిద్దింది.

తనఒక్కగానొక్క కుమారుడైన అభిమన్యుని యుద్ధంలో పాండవులు కాపాడుకోలేక పోయారని దుఖిస్తుంది. తన మాటల చాతుర్యంతో జగన్నాథుడైన అన్న శ్రీకృష్ణునిచే ఉత్తరానందనుని పునరుజ్జీవితున్ని చేయించగలిగింది.

కురు,యాదవ వంశాలు రెంటినీ పరిరక్షించాల్సిన బాధ్యతను ధర్మరాజు సుభద్రపై ఉంచాడు. ద్రౌపదీ సమేతంగా పాండవులందరూ మహాప్రస్థానం చేయబోతుండగా సుభద్ర రాజ్య బాధ్యతలు తీసుకోవాల్సి వచ్చింది. అభిమన్యుని కుమారుడైన పరీక్షిత్తును కౌరవరాజ్యమైన హస్తినాపురానికి, తన పుట్టింటి వంశంవాడైన వజ్రున్ని ఇంద్రప్రస్థానికి రాజుని చేసింది.

ఉత్తర :

ఈమె విరాటుని పుత్రిక. సుభద్ర కోడలు. అజ్ఞాతవాసంలో బృహన్నల వద్ద నాట్యం నేర్చుకుని వీరాధివీరుడైన అతని కొడుకు అభిమన్యుని భార్యయైంది. కురువంశాన్ని నిలిపే బాధ్యత తీసుకుని పరీక్షిత్తుకు తల్లియైంది.

మరణించిన కొడుకు పుట్టగా ఉత్తర, యుద్ధంలో భర్త మరణించినా గర్భంవల్ల భర్తననుసరించలేక పోయానని, ఇప్పుడు ఈ కుమారుడూ లేకపోతే నేనెలా బతకాలని శ్రీకృష్ణుని ప్రశ్నిస్తూ , తెలివిగా తాతా మనుమల బంధాన్ని కలిపింది. తన కుమారుని బతికించమని వేడుకుంది.

ఈ విధంగా వయసులో చిన్నది, సౌందర్యవతి, శీలవతి, అమాయకయైన ఉత్తర గర్భందాల్చిన కారణంతో వంశాభివృద్ధిని కాంక్షించి ప్రాణాధిక ప్రియుడైన అభిమన్యుని మరణాన్ని భరించి, సహగమనం చేయకుండా నిలిచింది. ఈమె కొడుకు భవిష్యత్తులో చక్రవర్తి కాగా, కౌరవ వంశ స్థాపకురాలిగా ప్రఖ్యాతి చెందింది. నేడు అనేకమంది వీరపత్నులకు, అభాగినులైన యువ వితంతువులకు ఈమె జీవితం మార్గదర్శకం.

శిఖండి :

పూర్వజన్మలో భీష్ముడిద్వారా ఎత్తుకురాబడి, ఆ కారణంవల్ల తాను ప్రేమించిన సాళ్వభూపతిచే తిరస్కరించబడి, భీష్ముడిచే నిరాకరించబడి అవివాహితగా మిగిలిపోయి, పరశురాముడి సహాయాన్నర్థించి అదీ విఫలమవడంతో అన్ని విధాలా భంగపడిన అంబ తన తపోబలంతో భీష్ముడి చావుకి కారణమయ్యేలా వరంపొంది, ఆత్మాహుతి చేసుకుని ద్రుపదుడికి పుత్రికా సంతానంగా జన్మించి, కొడుకుగా పెరిగి పెళ్లిచేసుకుని, వరంతో పురుషుడిగా మారి శిఖండియైంది. మహాభారత యుద్ధంలో భష్ముడికి ఎదురుగా నిలబడి, అర్జునుడితో కలిసి బాణాలు వేస్తూ భీష్ముడిని గాయపరిచి అతని స్వర్గయానానికి దారి కల్పించి తన పగ తీర్చుకుంటుంది.

ఏ కాలంలోనైనా అంబ పాత్ర స్త్రీపురుషులిరువురికీ స్ఫూర్తిదాయకమైందే.

ముగింపు :

రాజులు ఆ రోజుల్లో బహుభార్యత్వాన్ని పాటించారు. రామాయణం కాలానికి ఒకభర్తకు ఒక భార్య. తర్వాత వచ్చిన మహా భారతం కాలానికి బహుభార్యల పద్ధతి అమల్లోకొచ్చింది.

వ్యాస మహర్షిచ్చిన నేత్రదానంతో స్మశానాన్ని వీక్షించి నోళ్ళుతెరచి పడివున్న శవాలతో తన అనుబంధాన్ని నెమరువేసుకోగలిగిన గాంధారి ఆర్ధత ఏ పురుషపాత్రలో కనిపిస్తుంది?

మహాయుద్ధానికి ప్రేరేపించి తన సంతానంపై జరిగిన మానసిక, శారీరక ఆక్రమణలను, దాడులను త్రిప్పికొట్టిన కుంతి, రాజమాతగా హస్తినాపురం సిహాసనంపై ఆశీనురాలవ్వాలనే మక్కువ చూపదు. గుడ్డి బావగారికి, అంధత్వాన్ని ఆపాదించుకున్న తోడికోడలికి, ఒక బాధ్యతగల కోడలిగా సేవచోయాలని వారితో వానప్రస్థాశ్రమం చేరుకుంటుంది.అన్నీ అమరిన వేళ అంతటి విరక్తిభావం ఏ పురుషునికుంది?

కన్యగా మత్స్యగంధి ప్రదర్శించిన విజ్ఞత, సమయజ్ఞతలముందు పరాశర మహర్షి, మహోన్నతమైన గాంధారి ధర్మపరాయణతముందు ధృతరాష్ట్రుడు, మహనీయ కుంతి ముందు పాండురాజు, ద్రౌపది విశిష్టగుణాల తేజస్సు ముందు పాండవులు,

శకుంతల ధర్మజ్ఞత, సత్యసంధత ముందు దుష్యంతుడు, దమయంతీ, సావిత్రుల సతీత్వం ముందు నల, సత్యవంతులు పున్నమిచంద్రుని ముందు నక్షత్రాల వలె మినుకుమినుకుమని అత్యల్పంగా ప్రకాశిస్తారు.

కవిత్రయం చెక్కిన ఈ పాత్రలు శిల్పాలుగా కాక సజీవమూర్తులై మన ముందు నిలుస్తాయి. పాండురాజు మరణానంతరం కుంతి పాండవులను వెంటబెట్టుకుని హస్తినాపురం చేరుకోగానే వ్యాసమహర్షి సత్యవతిని పిలిచి ''గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్'' అంటాడు. వెంటనే తన పెద్దరికానికి విలువ ఉండదని తెలుసుకున్న సత్యవతి, కోడళ్ళను వెంటబెట్టుకుని అడవులకు పయనమౌతుంది. మళ్ళీ మహాభారతంలో కనిపించదు. ఈ పని భీష్ముడు, ద్రోణుడు, కృపాచారి, విదురుడు చేయగలిగారా?

సత్యవతి, కుంతి, సుభద్ర ముగ్గురూ తమవారిని రక్షించుకోవాల్సిన సమయంలో ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. మహాభారతంలో ఆత్మహత్య చేసుకున్న స్త్రీలు కనిపించరు. అంబ భీష్ముని ఎదురుగా నిల్చి నువ్వే నన్ను పెళ్లి చేసుకో అని ధైర్యంగా పలికింది. భీష్ముడు కుదరదని చెప్పగానే అతనిచేత అస్త్రసన్యాసం చేయించే ప్రయత్నం ఆరంభించిందే కానీ ఆత్మహత్య చేసుకోలేదు.

వైధవ్యం పరిహాసం చేసినా వివాహ బంధం అపహాస్యం చేసినా భారతంలో స్త్రీలు కృంగపోలేదు. తామే తల్లీదండ్రియై సంతానాన్ని మరింత బాధ్యతగా పెంచి సమాజం ముందుంచారు.

మహాభారతంలో స్త్రీ పాత్రలు జీవితానికి అర్థం చెప్పి అన్వయించుకోవటం నేర్పుతాయి. దిక్కుతెలియక వెర్రిముఖం వేసుకుని నిలుచున్న మన చేతుల్ని పట్టి గుంజి వారి వెంట పరుగులు పెట్టిస్తాయి. జీవితానికున్న పరమార్థాన్ని చూడమంటాయి. పరుగులు పెట్టలేక చతికిలపడ్డప్పుడు ఫరవాలేదు, నెమ్మదిగా నడిచి ధ్యేయాన్ని చేరుకోవచ్చని భరోసానిస్తాయి. ధ్యేయం ఉండాసని దిశానిర్దేశం చేస్తాయి. ధ్యేయం పూర్తయిందని ఆనందించే సమయానికి ఫలాన్ని తర్వాత తరానికి అప్పజెప్పి వైరాగ్యబుద్ధితో ఆధ్యాత్మికమనే అహోబిలం వైపు పయణం కట్టమంటాయి. జీవతమెప్పుడూ ఉరుకులుపెట్టే ప్రవాహంలా కాక సంగమాన్ని చేరే నదిలా ఉండాలని నొక్కి వక్కాణిస్తాయి.

21 శతాబ్దంలో ఎంతో నాగరికంగా సమాజం ఇచ్చిన ఎన్నో సౌకర్యాల మధ్య బతుకుతున్న మనం, ఐదువేల సంవత్సరాల క్రితం బతికిన మహాభారత స్త్రీల సంస్కారానికి,చైతన్యానికి, సంయమనానికి, తృప్తికి,సంతృప్తికి ప్రతీకలం కాలేకపోయాం. కేవలం పగ, కోపం, విసుగు, నిర్వేదం, నిరాశ, నిస్పృహలకు మాత్రమే ఆధారభూతులమయ్యాం.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2006.

❖❖❖

ఆంధ్రమహాభారతం - శాస్త్రవిజ్ఞానం

డాక్టర్ పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చిత్తూరు.

"సత్యం వద ధర్మం చర" అను ధర్మాన్ని ప్రబోధించే మహాభారతం వేదాంతసారాన్ని తనలో ఇముడ్చుకొని పంచమవేదంగా ప్రసిద్ధిచెందింది. ధర్మార్థ కామ మోక్షసాధనకు మార్గాలు చూపెట్టే జ్ఞానసాగర మహాభారతం 'భారత విజ్ఞాన సర్వస్వంగా' భాసిల్లింది. ధర్మశాస్త్రంగాను, నీతిశాస్త్రంగాను, మహాకావ్యంగాను, పురాణంగాను, ఇతిహాసంగాను వినుతికెక్కిన మహాభారతం సకల శాస్త్రాల నిలయంగా పేర్కొనవచ్చు.

ధర్మశాస్త్రాలు, నీతిశాస్త్రాలు మానవుని జీవన మార్గాలను సూచిస్తే, విజ్ఞాన శాస్త్రాలు మానవుని భౌతిక జీవితాన్ని సుఖదాయకం చేయడానికి దోహదపడతాయి. యంత్రాలు, వాహనాలు, కరెంటు, అత్యాధునిక సౌకర్యాలతో వైద్యం, ఆధునిక పరిజ్ఞాన యుద్ధ ఆయుధాలు, దూరదర్శన్, సినిమా, పెద్దపెద్ద భవన నిర్మాణాలు.. ఇవన్నీ విజ్ఞానశాస్త్రం మానవునికి ప్రసాదించిన వరాలు. ఈ విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం మహాభారత కాలం నాటికే ఉన్నదని చెప్పటం నా ప్రధానాంశం.

మానవ జీవితాన్ని భౌతిక జీవితం, ధార్మిక జీవితమని రెండు విధాలుగా పేర్కొనవచ్చు. మానవుడు తన భౌతిక జీవితాన్ని సుఖదాయకంగాను, విలాసవంతంగా గడపడానికి నిప్పు నుండి నేటి ఇంటర్నెట్ వరకు అనేక ఆవిష్కరణలు గావించాడు. ఈ శాస్త్ర పరిజ్ఞానం నేడు వ్యక్తిగత మానవజీవితానికి, పరిపాలన వ్యవస్థకు, రక్షణ రంగానికి .. ఇలా అనేక రంగాలకు ఎంతో దోహదపడుతున్నవి. మహాభారతం గణిత, భౌతిక, భూగోళ, ఖగోళ, వైద్యాది శాస్త్రాలకు నిలయమని చెప్పవచ్చును. ఈ శాస్త్ర పరిజ్ఞాన ఆవిష్కరణలు మహాభారతంలో ఏఏ రూపాలలో ఉన్నాయో పరిశీలిద్దాం.

మహాభారతం - భౌతిక శాస్త్రం :

మానవుడు కనిపెట్టిన చక్రం భౌతిక శాస్త్ర విభాగంలో విప్లవాత్మకమైన ఆవిష్కరణగా చెప్పవచ్చును. మనం నేడు విమానాలను అమెరికాకు చెందిన రైట్ బ్రదర్స్ కనిపెట్టారని చెబుతున్నాం. కానీ విమానమనే భావన వేదాల్లోనూ, మహాభారతంలోనూ మనం చూడవచ్చు. దేవతలు విమానాల్లో సంచరించడం మనకు విదితమే. మహాభారతంలో అనేక సందర్భాలలో విమాన ప్రస్తావన ఉంది.

.... గగన వీధి బఱచె వియచ్చర విమాన పంక్తులు దూలన్" (ఆదిపర్వం - ద్వితీయాశ్వాసం)
గగనమున సురవిమానములగణితముగా..... " (అరణ్య పర్వం - చతుర్థాశ్వాసం)
అమ్మహాదేవు ముందట ననేక యక్షగణ పరివృతుండును ఱుప్పకాధిరూఢుండును కుబేరుండను ....."
(అరణ్య పర్వం - పంచమాశ్వాసం)
.... గామగమనంబును నయన విమానంబు గొనుచు ...." (అరణ్య పర్వం - షష్ఠ్యాశ్వాసం)
.... లంకc బరిత్యజించి రభసోద్యత్పుష్పకారూఢుఁడై" (ఆదిపర్వం - షష్ఠ్యాశ్వాసం)
" వీరె వసువులు విమాంబులతో సంతిక్షంబున .... (శాంతి పర్వం - ద్వితీయాశ్వాసం)

విమానాలలో పుష్పక విమానం ప్రత్యేకం. ఎందరు కూర్చున్నా ఒక సీటు మిగిలిఉంటుంది. అంతేగాకుండా సంకల్పానుసారం అనుకున్న గమ్యాన్ని యథేచ్ఛగా చేర్చగలదు. ఈ పుష్పక విమానం కిన్నరపతియైన కుబేరునిది.

ఆధునిక మానవునికి వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచేది రేడియో, దూరదర్శన్, సినిమా లాంటి శ్రవణ, దృశ్య శ్రవణ యంత్రాలు రేడియోకి మరొక పేరే ఆకాశవాణి. ఆకాశవాణి అంటే ఆకాశంలో పలుకు, ఆకాశభూషణం అని అర్థాలు చెప్పుకోవచ్చు. వేదాల్లోనూ, పురాణాల్లోనూ ప్రస్తావించబడ్డ ఆకాశవాణి, ఆకాశభూషణం నేటి రేడియో వ్యవస్థకు నాందిగా పేర్కొనవచ్చును. మార్కోని అనే శాస్త్రవేత్త రేడియోను కనిపెట్టక పూర్వమే ఆకాశవాణి ప్రస్తావన కలదు. మహాభారతంలో ప్రస్తావించబడ్డ ఆకాశవాణి, ఆకాశభూషణాలను పరిశీలిద్దాం.

"శకుంతల సత్యము వల్కె సాధ్వి, సద్వినుత, మహా ప్రతివ్రత వివేకముతో నని దివ్యవాణి దా వినిచె ..."
(ఆది పర్వం - చతుర్థాశ్వాసం)

"... తటాకంబున గని జలంబులు ద్రావంబోయిన నొక్కె యశరీరభూతం బిట్లనియె" (అరణ్యపర్వం - సప్తమాశ్వాసం)

" వృద్ధక్షత్రుండను సింధూ దేశాధీశుండు ... జయద్రథుండు బడసె. నితండు కుమారుడై వర్తిల్లు సమయంబున నొక్కనాడశరీరవాణి ..... (ద్రోణ పర్వం - చతుర్థాశ్వాసం)

ఆదిపర్వంలో దుష్యంతుని సభలో సభికులు వినేటట్లు శకుంతల మాటలను సత్యమని ఆకాశవాణి పలికింది. అరణ్యపర్వంలో నీరు త్రాగడానికి వచ్చిన పాండవులతో యమధర్మరాజు యక్షునిగా ఆకాశపలుకులు పలుకుతాడు. అలాగే ద్రోణపర్వంలో అర్జునుడు జయద్రథుని సంహరించే సందర్భంలో అశరీరవాణి పలికిన పలుకులను కృష్ణుడు అర్జునునికి గుర్తుచేస్తాడు. ఇలా అనేక సందర్భాలలో ఆకాశవాణి ప్రస్తావనను పరిశీలించవచ్చు.

ఆధునిక శాస్త్ర విజ్ఞానంలో దూరదర్శన్, సినిమాలు అత్యంతద్భుత ఆవిష్కరణలు. జె.యల్. బయర్డ్ దూరదర్శన్ కనుగొంటే, ల్యూమినిస్ అనే శాస్త్రవేత్త సినిమాను కనుగొనడం జరిగింది. ఈ ఆవిష్కరణలు మానవుని దార్శనిక దృష్టికి తార్కాణాలు. ఋషులు, యోగుల దివ్యదృష్టి, యోగదృష్టి, దివ్యజ్ఞానం అనేవి దూరదర్శన్, సినిమా వంటి ఆధునిక పరిజ్ఞానానికి నమూనాలు. ఋషులు జరిగిన విషయాలను తమ దివ్యజ్ఞానంతో చూడటం అంటే ప్రత్యక్షంగా దృశ్యరూపంలో చూడటమే. ఈ దివ్యజ్ఞానమే లేదా ఆ దివ్యదృష్టే లేదా ఈ యోగ దృష్టే నేటి దూరదర్శన్, సినిమా అనే పరిజ్ఞానానికి మూలాధారం. మహాభారతంలో వీటిని పరిశీలిద్దాం.

"... శుక్రుండు దన యోగదృష్టిం జూచి లోకాలోక పర్యంత భువనాంతరంబున గచుఁగానక..."
(ఆది పర్వం - తృతీయాశ్వాసం)

"నతిభీత చిత్తయునైయున్న కూతుంజూచి తన దివ్యజ్ఞానంబున నంత వృత్తాంతంబు నెఱింగి .."
(ఆది పర్వం - చతుర్థాశ్వాసం)

" ... మది నీవాలోకింపగ వలసిన నే లోనికి దివ్యదృష్టి నిచ్చెదఁబుత్రా" (భీష్మ పర్వం - ప్రథమాశ్వాసం)

బృహస్పతి కుమారుడైన కచుని శుక్రుని శిష్యులు చంపివేస్తారు. పొద్దుపోయినా ఇంటికి రాడు. దేవయాని తండ్రికి తన బాధను చెబుతుంది. అప్పుడు శుక్రుడు తన యోగదృష్టితో అన్ని లోకాలను తెరచిచూస్తాడు. కానీ కచుడు కానరాడు. చివరకు భస్మరూపంలో తన ఉదరంలోనే ఉన్న కచున్ని కనుగొంటాడు. ఇది నేటి దూరదర్శన్ వ్యవస్థకు చక్కటి నాంది. అలాగే కణ్వ మహర్షి శకుంతలకు, దుష్యంతునకు జరిగిన గాంధర్వ వివాహాన్ని దివ్యదృష్టితో తెలుసుకుంటాడు. భీష్మ పర్వంలో వ్యాసుడు సంజయునికి యుద్ధంలో జరిగే అన్ని సంఘటనలను దర్శించేదృష్టిని కల్పిస్తాడు. ఇది నేటి టెలికాస్టింగ్ విధానానికి మూలంగా చెప్పుకోవచ్చు.

బ్రహ్మాస్త్రం, నాగాస్త్రం, పాశుపతాస్త్రం, ఆగ్నేయాస్త్రం, వారుణాస్త్రం, నారాయణాస్త్రం మొదలైన అస్త్రాలు నేటి మిస్సైల్ వ్యవస్థకు బీజాలుగా పేర్కొనవచ్చు. ఈ అస్త్రాలు శత్రువులపై కత్తులను, ఈటెలను, గదలను, అగ్నిని కురిపిస్తాయి. నాటి ఈ అస్త్రాలే నేటి యుద్ధానికి దోహదపడే ఆయుధాలుగా పరిణమించాయని చెప్పవచ్చు. మహాభారతంలో వీటిని అవలోకిద్దాం.

"ఆగ్నేయశరమున నతిభీకరాగ్నియు వారుణాస్త్రమున దుర్వార జలమును ననిలబాణంబున నధికానిలంబును! మేఘాస్త్రమున మహామేఘచయము.." (ఆది పర్వం – షష్ట్యాశ్వాసం)

" అని పలికి నియతుండయి నారాయణాస్త్రంబు ప్రయోగించిన" (ద్రోణ పర్వం – పంచమాశ్వాసం)

" నియతిం దావక బాణమేయుడు మహాగ్ని జ్వాలికా మాలిక ..." (ద్రోణ పర్వం – పంచమాశ్వాసం)

" ఆ బ్రహ్మాస్త్రంబు చేత నద్భుతంబగు నశ్వత్థామ యాగ్నేమాస్త్రంబు ...." (ద్రోణ పర్వం – ప్రథమాశ్వాసం)

కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో అర్జునుడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించి భయంకరాగ్నిని, వారుణాస్త్రంతో నీటిని, వాయువ్యాస్త్రంతో విపరీతమైన గాలిని, మేఘాస్త్రం ద్వారా మహామేఘ సమూహాన్ని పుట్టిస్తాడు. భౌమ్యాస్త్రం, శైలాస్త్రం, అదృశ్యాస్త్రం వంటి అస్త్రాలను కూడా ప్రయోగించాడు. యుద్ధసమయంలో అశ్వత్థామ పాండవ సైన్యం పై నారాయణాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అశ్వత్థామ విడిచిన ఆగ్నేయాస్త్రానికి విరుగుడుగా అర్జునుడు బ్రహ్మాస్త్రం విడిచి అశ్వత్థామ అగ్నేయాస్త్రాన్ని అంతరింపజేస్తాడు. కాబట్టి నాటి అస్త్రాలు నేటి మిస్సైల్ వ్యవస్థా పరిజ్ఞానానికి నాందిగా భావించవచ్చు.

విశ్వకర్మ దేవతల శిల్పి. ఇతడు దేవతలకు రకరకాల విమానాలను నిర్మించి ఇచ్చిన ఏరోనాటిక్ ఇంజనీరు. వజ్రవైఢూర్య రత్న ఖచితమైన, శోభాయమానమైన, అత్యద్భుతమైన మయసభను ధర్మరాజుకు నిర్మించి ఇచ్చిన మయుడు మరొక గొప్ప ఇంజనీరు. నేతితో నిర్మింపబడ్డ లక్ష్యాగృహ నిర్మాణ చతురుడైన పురోచనుడు ఒక గొప్ప ఇంజనీరు. ఇలా నేటి ఇంజనీరు వ్యవస్థకు ధీటైన ఇంజనీరింగ్ విధానం మహాభారత కాలానికే ఉందనడంలో అతిశయోక్తి కాదు.

'3డి' ని దర్శించే పరిజ్ఞానం రామాయణం కాలం నాటికే ఉన్నది. యుద్ధకాండలో వీటి ప్రస్తావన మనకు కానవస్తుంది. ఇంద్రజిత్తు మాయావి. అతనిని మాయా విద్య ప్రదర్శనా సమయంలో చూడలేం. కుబేరుడు పంపిన దివ్యజలాలను కన్నులకు రాసుకుంటే అదృశ్యంగా ఉండే సమస్త పదార్థాలు కంటికి కనిపిస్తాయని విభీషణుడు రాముని స్వీకరించమని చెబుతాడు.

"నరనాథ! కిన్నరనాథుని పనుపున శ్వేతండు నా బ్రసిద్ధుఁడైన గుహ్యకుఁడే గొని వచ్చె దివ్యతోయంబులు ... దదృశ్యభూతములెల్ల దెల్లముగను..." (అరణ్య పర్వం – సప్తమాశ్వాసం)

అంగారపర్ణుడనే గంధర్వునికి చాక్షుషి విద్యా పరిజ్ఞానం కలదు. దీని ద్వారా ముల్లోకాలను చూడవచ్చు. ఇది నేటి ఇంటర్నెట్‌కు నాందీభూతంగా చెప్పవచ్చును.

కాంతి పట్టకం ద్వారా వెళ్ళినపుడు ఏడు వర్ణాలు ఏర్పడుతాయి. దీనినే ఆధునిక శాస్త్రవేత్తలు VIBGYORగా కనుగొన్నారు. సప్తహయుడైన సూర్యుడు మూర్తి సప్తకంగా మహాభారతంలో ప్రస్తావించబడ్డాడు. సూర్యుడు ఏడు రంగులు కలిగివున్నట్లు భారతంలో కలదు. సహజంగా మనం ఆ ఏడు రంగులను సూర్యకాంతి పరావర్తనం వల్ల ఏర్పడే ఇంద్రధనస్సులో కానవచ్చును.

"సప్తహయుడు మూర్తి సప్తకంబు ధరించి కరము వేడి ..." (అరణ్య పర్వం - చతుర్థాశ్వాసం)

శబ్దభేది విద్యలో అర్జునుడు ప్రవీణుడు. ఈ శబ్దబేధి నేటి సూచీ= విధానానికి మూలం. ఒకప్పుడు పర్వతాలకు రెక్కలుండేవని, వాటి వల్ల అవి ఎక్కడపడితే అక్కడ దిగేవని పురాణాలు, ఇతిహాసాలలో ప్రస్తావన కలదు. ఇది నేటి ప్యారాచూట్ విధానానికి ఆధారభూతం. అర్జునుడు భీష్ముని దాహార్తిని తీర్చుటకు భూమిలో విలువిద్యానైపుణ్యాన్ని ప్రదర్శించి గంగను రప్పిస్తాడు. అది నేటి బోరింగ్ విధానానికి హేతువు. ఇలా భౌతికశాస్త్ర పరిజ్ఞానాన్ని మహాభారతంలో చూడవచ్చు.

మహాభారతం - ఖగోళశాస్త్రం :

అంతరిక్షం అనంతమైనది. ఎంత తెలుసుకున్నా ఇంకా సశేషమే. అంతరిక్షంలో పరిశోధనా కేంద్రాలను ఏర్పాటుచేసి శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధించి అంతుపట్టని నూతనావిష్కరణలు గావిస్తున్నారు. మహాభారత కాలం నాటికే ఖగోళ శాస్త్ర పరిజ్ఞానవంతులు కలరని చెప్పవచ్చు. పాండవులలో చివరివాడైన సహదేవుడు గొప్ప ఖగోళశాస్త్ర పరిజ్ఞానం కలవాడు. కృష్ణ, భీష్మ, నారదాది మహానుభావులు గొప్ప ఖగోళశాస్త్ర పరిజ్ఞానవంతులుగా పేర్కొనవచ్చు.

ఆకాశంలో నిలిచివుండే ఇంద్రసభ, శిశుపాలుడి తమ్ముడైన సాల్వుని కామగమన పట్టణం సౌంభకం, త్రిపురాసురుల త్రిపురాలు నేటి అంతరిక్ష కేంద్రాలకు నమూనాలే.

ఖగోళశాస్త్ర పరిజ్ఞానంపై ఆధారపడిన శాస్త్రం జ్యోతిషం. గ్రహాల గమనం మానవజీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఉత్తర గోగ్రహణ సమయంలో అర్జునుడు కనబడినపుడు దుర్యోధనుడు పాండవుల అజ్ఞాతవాసం ముగియలేదని ఎంతో సంబరపడ్డాడు. కానీ భీష్మద్రోణులు, అర్జునునికి అజ్ఞాతవాసం కాలం ముగిసిందని తెలుసు. ఇది ఆనాటి జ్యోతిషశాస్త్ర పరిజ్ఞానానికి చక్కని తార్కాణం.

నేడు ప్రపంచంలో గ్రెగోరియన్ కేలండరు, గ్రీనిచ్ సమయం కాలానికి ప్రాతిపదికగా భావిస్తున్నాం. మహాభారత కాలానికే కాలప్రాతిపదికను మన భారతీయులు నిర్ధారించారు. శాంతిపర్వంలో బలిచక్రవర్తి ఇంద్రునికి చెప్పిన కాలతత్వాన్ని భీష్ముడు ధర్మరాజుకు ప్రబోధించాడు.

"కళలుం గాష్టలు లోనుగ గల చిదురలఁ గూర్చుకొనుచు ... " (శాంతి పర్వం - చతుర్థాశ్వాసం)

18 రెప్పపాటుల సమయం ఒక కాష్ఠ, 30 కాష్ఠలు ఒక కల, 30 కలలు = ఒక క్షణం, 6 క్షణాలు = ఒక గడియ, 2 గడియలు ఒక మహూర్తం, 30 ముహూర్తాలు - ఒక రోజు. ఇలా కాలాన్ని పురాణ, ఇతిహాస కాలానికే లెక్కించడం నాటి ఖగోళశాస్త్ర పరిజ్ఞానానికి గీటురాయిగా చెప్పవచ్చు. ఇలా ఖగోళశాస్త్ర పరిజ్ఞానం మహాభారతంలో దర్శనమిస్తుంది.

మహాభారతం - జీవశాస్త్రం :

విజ్ఞాన సర్వస్వమనదగిన మహాభారతంలో మొక్కలు, జంతువుల గురించిన ప్రస్తావన చాలావుంది. పాశ్చాత్యశాస్త్రజ్ఞులు గాలిలో, నీళ్ళలో, ఆకాశంలోను వేలకువేలు సూక్ష్మజీవులు కలవని కనుగొన్నారు. అలా సూక్ష్మజీవుల ప్రస్తావన అరణ్యపర్వ పంచమాశ్వాసంలో ధర్మవ్యాధుడు కౌశికునికి ఇచ్చిన ధర్మ ప్రబోధంలో చూడవచ్చు.

"సలిలములుర్వి యాకసము సర్వము జంతుమయంబు ..... " (అరణ్యపర్వం -పంచమాశ్వాసం)

మొక్కలకు ప్రాణం ఉందని ప్రముఖ భారతీయ శాస్త్రజ్ఞుడు జగదీష్ చంద్రబోస్ కనుగొన్నాడు. మహాభారతం కాలం నాటికీ మొక్కలకు ప్రాణం ఉందన్న పరిజ్ఞానం ధర్మవ్యాధుని, కౌశికుని సంవాదంలో చూడవచ్చు.

"... తరు, మూల, పల, శాక, నిపీడన మదియు హింస గాదొకో తలపన్ " (అరణ్యపర్వం – పంచమాశ్వాసం)

అరిస్టాటిల్, లిన్నేయస్ లాంటి పాశ్చాత్య శాస్త్రవేత్తలు జీవులను వర్గీకరించడం జరిగింది. కానీ ఈ జీవ వర్గీకరణను మహాభారతం అనుశాసనిక పర్వం పంచమాశ్వాసం పార్వతీ పరమేశ్వరుల సంభాషణలో చూడవచ్చు.

"... నఖిలేంద్రియో పేతమగు జరాయుజంబు నండజంబు
నువిద! చోకు నెఱుగు సుద్భిజ్జములు స్వేద జముల ...." (అనుశాసనిక పర్వం – పంచమాశ్వాసం)

పరమేశ్వరుడు పార్వతితో జీవరాసులు జరాయుజములు, అండజములు, ఉద్భిజ్జములు, స్వేదజములని నాలుగు విధాలుగా ఉంటాయని చెప్పాడు. జీవరాసులను గురించిన పరిజ్ఞానమే కాకుండా జీవం ఎలా ఏర్పడుతుందో కాశ్యపుడనే బ్రాహ్మణుడు సిద్ధునికి జరిగిన సంభాషణలో మనం చూడవచ్చు.

"ఎనయగ శుక్ల శోణితమును బెరసి వెలంది గర్భమున నెలకొనున
ప్పని బ్రహ్మశక్తి బీజత్వ నిరూఢిం బొనరునవి వొదలుఁ బిండంబై " (అశ్వమేధపర్వం – ప్రథమాశ్వాసం)

శుక్లశోణితాలు తగినట్లుగా కలిసి స్త్రీగర్భంలో బీజంగా ఒక చోట నిలుస్తాయి. అది పిండంగా వృద్ధి పొందుతుంది. ఈ బీజంలో ప్రాణం ఎట్లా ప్రవేశిస్తున్నదనే విషయం ఆధునిక విజ్ఞానశాస్త్రానికి ఇంతవరకు అంతుచిక్కలేదు. దీనినే పురాణాలు బ్రహ్మ' అని చెబుతున్నాయి. ఇలా మహాభారతంలో జీవ శాస్త్రసంబంధ పలు అంశాలు మనకు కానవస్తాయి.

మహాభారతం – వైద్యశాస్త్రం :

ప్రపంచంలో నేడు వైద్యరంగంలో ఉపయోగించే అత్యంత అధునాతన పరిజ్ఞానం మహాభారతంలో కోకొల్లలు. వివిధ వ్యాధులకు వాడే ఔషధాలు, ఎముకల వైద్యం, నాడీ వైద్యం, సంతానం కోసం అనుసరించే సరొగసి, ఎగ్‌డొనేషన్, IVF (In Vitro Fertilization) ఇంకుబేషన్ వైద్య విధానం, లింగమార్పిడి మొదలైన వైద్య పద్ధతులు మహాభారతంలో చూడవచ్చు.

కౌరవుల జననం నేటి టెస్ట్‌ట్యూబ్ బేబిల విధానంగా చెప్పుకోవచ్చు. అలానే ద్రోణుడు, కృపి, కృపాచార్యుల జననం, కుమారస్వామి జననం ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ పద్ధతిగా చెప్పవచ్చు. ఉపరిచరవసు వీర్యంతో అద్రిక అనే చేపకు గిరిక, వసుపదుల జననం నేటి ఆధునిక వైద్య విధానంలో భాగంగా చెప్పుకోవచ్చు. అండాల నుంచి జన్మించిన అనూరుడు, గరుత్మంతుల జననం ఇంకుబేషర్ వైద్య విధానంగా చెప్పవచ్చును. ద్రుపదుని కుమారుడు కుమార్తెగా మారడం నేటి లింగమార్పిడి పద్ధతిగా భావించవచ్చు. ఇలా వైద్యరంగంలో గల నేటి నూతన పరిజ్ఞానం చాలావరకు మహాభారతంలో ప్రస్తావించబడ్డాయని చెప్పవచ్చు.

మహాభారతం – ఇతర శాస్త్రాలు :

ఇక్ష్వాకు రాజైన ఋతుపర్ణుడు అక్షయ హృదయమనే విద్యలో ప్రవీణుడు. వస్తు సముదాయాన్ని చూడగానే చెప్పడాన్నే అక్షయహృదయ విద్య అంటారు. ఇది నేడు కంప్యూటర్ విద్యలో గణనానికి సంబంధించిన విద్య.

నలుడు అశ్వహృదయమనే విద్యయందు ప్రవీణుడు. అశ్వాల లక్షణాలను తెలిసిన నలుడు ఒక గొప్ప జంతు మనోవిజ్ఞాన శాస్త్రవేత్త. అలానే నకులుడు గొప్ప అశ్వపాలకుడు. సహదేవుడు గోపాలుడు పశువుల మనస్తత్వం

తెలిసిన నలుడు, నకులుడు, సహదేవుడు గొప్ప మనస్తత్వ శాస్త్రజ్ఞులు. ఆధునిక మనస్తత్వ శాస్త్రజ్ఞులు చెప్పిన స్వప్నావస్థను మూడు వేల సంవత్సరాల కాలం నాడే భీష్ముడు ధర్మరాజుకు ప్రబోధించాడు.

"విలయం బింద్రియములకుం
గలుగఁగ విషయాను భవము గలిగిన భంగిన్
మెలగుఁను స్వప్నంబున మెయి
గల యట్టుల దేహి భాగవతి యోయ్యదియో! " (శాంతిపర్వం - ప్రథమాశ్వాసం)

నిద్రాస్థితిలో ఇంద్రియాలు విశ్రాంతి చెంది. ప్రవర్తించడం మానేసిన తరువాత ఆత్మ స్వప్నంలో విషయానుభూతిని పొందుతున్నాడు. మేల్కొని ఉన్నప్పటి వలె అతడి అనుభవం ఇంద్రియాల ద్వారానే అవుతున్నది.

నీరు హైడ్రోజన్, ఆక్సిజన్‌ల కలయికయని ఆధునిక రసాయన శాస్త్రవేత్తలు నిరూపించారు. మహాభారతంలో బృహస్పతి, అగ్నిదేవుని సంభాషణలో ఈ విషయాన్ని గ్రహించవచ్చును.

"... పాపక! నీ యంద జలంబులు గలిగె ..." (ఉద్యోగ పర్వం - ప్రథమాశ్వాసం)

నీళ్ళు నుండి నిప్పు పుట్టిందని అగ్నిదేవుడనగా బృహస్పతి కాదని పలికి చరాచరాలు నీ యందు వికసిస్తాయని, నాలుగు వేదాలు నీవేయని, నీళ్ళు సైతం నీయందే పుట్టాయని బృహస్పతి అగ్నితో చెబుతాడు. హైడ్రోజన్, ఆక్సిజన్ రెండూ మండే స్వభావం కలవని మనం గ్రహించాలి.

ఇలా మహాభారతంలో శాస్త్ర సాంకేతికాది రంగాలకు సంబంధించిన అనేక విషయ పరిజ్ఞానం ఉంది. అంతేకాకుండా నేడు అత్యంతాధునిక పరిశోధనకు అందని, అంతుచిక్కని అనేక అంశాలు కూడా మహాభారతంలో ఉంది. సద్యోగర్భం, సద్యోయవ్వనం, గర్భేతర ప్రాంతంలో శిశుజననం, ఒకరి యవ్వనాన్ని మరొకరు స్వీకరించడం మొదలైన నేటి పరిశోధనకు అందని అంశాలు కూడా మహాభారతంలో చూడవచ్చు. అరిస్టాటిల్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, న్యూటన్, మెండల్, శ్రీనివాసరామానుజం, జె.యల్. బయర్డ్ లాంటి మేధావులే మహాభారతంలోని వ్యాసుడు, భీష్ముడు, యముడు, విశ్వకర్మ ద్రోణుడు, ఋతుపర్ణుడు, నలుడు, నకులుడు, సహదేవాది పురాణ పురుషులు. ఈ పురాణ పురుషులందరికి గురువు శ్రీకృష్ణపరమాత్ముడు. సకలశాస్త్ర పారంగతుడు. సకలశాస్త్రాల నిలయుడు.

శాస్త్రవిజ్ఞానం సమాజశ్రేయస్సుకు ఎంతగా దోహదపడుతున్నదో ప్రపంచ వినాశనానికి అంతే ఉపయోగపడుతున్నది. శాస్త్రవిజ్ఞానాన్ని మానవుడు హితంగా, మితంగా, విచక్షణతో వాడుఉన్న నాడే ప్రపంచం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది.

॥ సర్వేజనా సుఖినోభవంతు ॥

పరిశీలనా గ్రంథాలు :

1. కవిత్రయ ఆంధ్రమహాభారత వ్యాఖ్యానం : టి.టి.డి
2. వెంటాడే ప్రశ్నలు - సైన్సు సమాధానాలు : శ్రీ వాసవ్య
3. మహాభారతం : పిలకా గణపతిశాస్త్రి
4. మహాభారతం : ఉషశ్రీ
5. భౌతిక రసాయన శాస్త్రాలు : ప్రభుత్వ ప్రచురణ
6. జీవశాస్త్రం : ప్రభుత్వ ప్రచురణ

❖❖❖

శారీరక పటుత్వము మరియు సంక్షేమము (శ్రేయస్సు) : భగవద్గీత అంతర్దృష్టి

డాక్టర్ ఏ.సి.భరణినాథ్ రెడ్డి, వ్యాయమ విద్య సంచాలకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెదురుకుప్పం.

జీవితమనే మహా సముద్రాన్ని మధించి బాదరాయణుడు మానవాళికి అందించిన అమృత కలశం మహాభారతము. మహాభారతము మన జాతీయ కావ్యము. వేదాల, శాస్త్రాల, ఉపనిషత్తుల మరియు పురాణాల సారము మహాభారతంలో సముచితంగా చోటు చేసుకున్నందు వలన ఈ గ్రంథం పంచమవేదముగా, విజ్ఞాన సర్వస్వముగా ప్రశస్తిపొందినది. వ్యాసమహర్షి 'జయ' అనే పేరుతో వ్రాసారు. "ధర్మ - అర్థ - కామ - మోక్షాలు" అనే పురుషార్థాలను సాధించటానికి అవసరమైన విజ్ఞానాన్ని ఈ కావ్యములో ఇమిడ్చారు. ప్రపంచంలోని అన్ని గ్రంథాల కన్నా గొప్పది మహాభారతము.

"యదిహాస్తి తదన్యత, యన్నే హాస్తి న తత్క్వచిత్"

అనగా "ఇందులో ఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు" అని అర్థము.

భగవద్గీత భారతానికి ఆత్మ వంటిది. ఇది మహాభారతములో భీష్మ పర్వములో ఉన్నది. ఇది పద్దెనిమిది అధ్యాయాలతో 700 శ్లోకాలు కల్గియుండుటచే దీనిని మోక్షసప్తశతి అని అంటారు.

హిందూ ధర్మం సనాతమైనది మరియు సదా నూతనమైనది. మహోదాత్తమైన ధర్మానికి మన తత్వశాస్త్రం మూలస్తంభం వంటిది. భారతీయ తత్వశాస్త్ర సారమే భగవద్గీత. ప్రస్తానత్రయంలో భగవద్గీతకు అద్వితీయమైన స్థానం ఉన్నది.

'సృష్టిలో మానవ జన్మ అత్యుత్తమైనది. అన్ని జీవులకంటే మానవులకు విశిష్టత కల్గించేది అతని బుద్ధి. ఈ బుద్ధిని సక్రమముగా వినియోగించుకొని జ్ఞానమును సంపాదించుటయే మానవుని ముఖ్య కర్తవ్యము అని ఇతిహాసాలు, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు బలంగా చెబుతున్నాయి. దీనిని సాధించుటకు ఆరోగ్యవంతమైన శరీరము ఒక ఉత్తమ సాధనము.

"శరరీ మాద్యం కలు ధర్మ సాధనం"

"ఆరోగ్యం పరమం, భాగ్యం, స్వాస్థస్య సర్వసాధనం" అనే ఆర్యోక్తులు

ఆరోగ్యవంతమైన శరీర ఆవశ్యకతను తెలియచేస్తున్నాయి.

భగవద్గీత ఆధ్యాత్మిక మరియు తాత్విక గ్రంథము కాదు. జీవితం, కర్తవ్యం మరియు స్వీయ స్వభావంపై మాత్రమే కాకుండా శారీరక దృఢత్వము మరియు శ్రేయస్సు యొక్క ప్రాముఖ్యతపై కూడా లోతైన అంతర్దృష్టులను అందిస్తుంది. భగవద్గీత ఆధ్యాత్మిక జ్ఞానంపై ప్రధానంగా దృష్టి పెట్టినప్పటికీ శరీరంతో సహా జీవితంలోని అన్ని అంశాలలో సమతుల్యతను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది.

గీత వక్త శ్రీకృష్ణుడు, ఆత్మ ప్రయాణానికి శరీరం వాహనం అని, ఆ శరీరాన్ని క్రమశిక్షణ మరియు స్వీయ నియంత్రణతో రక్షించుకోవాలని బోధించాడు. యుక్త (మితతత్వము), కర్మ (సరైన చర్య) మరియు ధ్యానం (మానసిక క్రమశిక్షణ) ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యాన్ని సాధించు విధానము - శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును కల్గియుండాలని భగవద్గీత చెబుతుంది. భగవద్గీత శారీరక దృఢత్వానికి సంబంధించిన ఆధునిక అన్వాహనకు - మనస్సు మరియు శరీరం యొక్క పరస్పర సంబంధాన్ని గురించి

బలంగా చెబుతుంది. భగవద్గీత సమత్యులమైన జీవనశైలి ఆహారం, వ్యాయామం మరియు విశ్రాంతి పరంగా బోధిస్తుంది.

దేహమే దేవాలయమని భగవద్గీత బోధిస్తుంది. మన ధర్మాన్ని (కర్మలను) నిర్వర్తించే సాధనము శరీరము అని భగవానుడు / శ్రీకృష్ణుడు తన శిష్యునకు / అర్జునుడికి గుర్తు చేసాడు. ఈ భౌతిక ప్రకృతి త్రిగుణాలతో - సత్వరాజోతమో గుణాలతో నిండి ఉంటుంది. మానవ శరీరం కూడా ఈ త్రిగుణాలతో నిండి ఉన్నది. వ్యక్తి ఆరోగ్యము, శరీరస్థితి, తీసుకొనే ఆహారము, చేసే తపస్సులు (కర్మలు) చే ప్రభావితము చేయబడి జీవనవిధానము సాగుతుంది. ఆత్మ తన ఆలోచనలను నెరవేర్చుకోవడానికి, శరీరాన్ని ఆరోగ్యకరమైన స్థితిలో ఉంచుకోవాలి.

ఈ విశ్లేషణ పత్రము మానవ జీవితాలను గొప్పగా ప్రభావితము చేయగల మరియు మానవ శ్రేయస్సుకు అవసరమైన ప్రాథమిక సూత్రాలను భగవద్గీత ఆవిర్భవించింది. మానవ శ్రేయస్సు శాస్త్రానికి ముఖ్యాధారముగా భగవద్గీతను భావించవచ్చును. భగవద్గీతలోని ప్రతి శ్లోకము మానవ కోటి ఉనికి మరియు ప్రవర్తనను గురించి పూర్తి అవగాహన కల్గిస్తాయి. వేల సంవత్సరాల ముందే గొప్పదైన భగవద్గీత మానవ శ్రేయస్సుకు సంబంధించి చెప్పబడిన భారతీయ సిద్ధాంతాన్ని చెప్పడానికి ప్రయత్నించింది.

శ్లోకము: "న చాస్తి సదృశం తేన కించిత స్థౌల్యాపకర్శణ!
ప్రసన్నాత్మేమింద్రియ మనాఃహై స్వస్థ ఇథ్యాభిధీయతే"॥

అర్థము :

అధిక బరువు తగ్గించుటకు శారీరక కసరత్తుకు మించిన ఔషధము లేదు. నిత్యం వ్యాయామము చేసే వాడిని చూసి అనారోగ్య కారణాలు భయపడుతాయి మరియు అతనికి దుఃఖాన్ని కలిగించవు.

వివరణ :

అనారోగ్యం మరియు అధమ జీవన విధానమనే శత్రువులను జయించడానికి అతీతశక్తులు కల్గిన సంరక్షకులు ధరించిన వస్త్రము వంటిది. ఎప్పుడు ఒకరు నిత్య శారీరక వ్యాయమములో పాల్గొంటాడో, బరువు పెరగడం మరియు అనారోగ్య ఛాయలను ఎదుర్కొనే శక్తిని సంపాదించుకొన్నట్లే. అధిక బరువుంటే జీవిత ప్రయాణంలో వ్యాయామము చేయాలని సంకల్పించుకుంటే అధికబరువు అడ్డుకాదు, అడ్డురాదు.

వ్యాయామనే రహస్య ఆయుధమును ఈ దశలో తెరిచినట్లయితే అది - శారీరక కష్టాలు అయిన స్థూలకాయము, బద్ధకము, నిస్తేజమైన జీవన విధానము మరియు ఇతర అనారోగ్య కారకాలను భయపెడుతుంది. వ్యాయామమనేది సామర్థ్యక్షోభను ఎదుర్కొనే ఒక కవచము వంటిది. శరీరములో సామర్థ్యము మరియు సంక్షేమ శత్రువులు స్థిరపడకుండా చేసే ఒక అద్భుత శక్తి వలయం - శారీరక కసరత్తు.

వ్యాయామాన్ని శరీర సౌష్టవాన్ని పెంచే దినచర్య అని కాకుండా, మన సంక్షేమాన్ని మరియు ఆనందాన్ని నాశనము చేసే కారకాలనుంచి రక్షించే శక్తిగా భావించ వలెను. వ్యాయామము కేవలం శిక్షణలో భాగం కాదు, ఆరోగ్యము మరియు అద్భుత జీవితాన్ని నాశనం చేసే శత్రువులలో పోరాడే ఒక వీరుడు అని తలంచాలి.

శ్లోకము: శ్రమ క్లమపిఫాషోష్ణ శీతాదినాం సహిష్ణుత ।
ఆరోగ్యం చాపి పరమం వ్యాయామం దుపజాయతే ॥

అర్థము :

కష్టాన్ని, అలసటను, అపరాధమును, దాహాన్ని, చల్లదనాన్ని మరియు వేడిని తట్టుకొని నిలబడే శక్తి కేవలం వ్యాయామము ద్వారా వస్తుంది. అంతేకాకుండా అత్తుత్యమైన ఆరోగ్యాన్ని కూడా ఇస్తుంది.

వివరణ :

తరచూ భయంకరమైన సవాళ్లు విసరే కష్టము మరియు అల్పతలను అదుపులో ఉంచగల శక్తి మరియు సహనాన్ని వ్యాయామము పెంపొందిస్తుంది. శారీరక కసరత్తు ఒక ఆధారభూతమైన శిక్షణగా మారి, అనేకమైన సవాళ్ళను ఎదుర్కొనేందుకు శరీరాన్ని గొప్ప దృడంగా మారుస్తుంది.

వ్యాయామము చేసే సమయంలో గ్రంథులు విడుదల చేసే ఎండార్ఫిన్స్ అనే రసాయనాలు మన మానసిక స్థితిని మార్పు చేయుటకు, వత్తిడిని అధిగమించేందుకు దోహదపడుతాయి. వ్యాయామము కేవలం శరీరానికే కాకుండా మానసిక స్థితిని క్రమపరచే వైద్య ప్రక్రియగా మారుతుంది.

శారీరకవ్యాయామము చేయుట వలన శరీరము దాహం చల్లదనం మరియు వేడి లాంటి వివిధ పరిస్థితులకు తట్టుకొనే విధంగా తయారవుతుంది. శరీర ఉష్ణోగ్రతను నియంత్రించుట, తగినంత ద్రవాలను కల్గియుండకు మరియు వివిధ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉండేటట్లు శరీరతత్వం మారుతుంది.

మనము గొప్ప ఆరోగ్యాన్ని సాధించుటకు వ్యాయామము ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. నిత్యం వ్యాయామము చేయుటవలన శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక మరియు ఉద్వేగాల సంక్షేమము కూడా పొందవచ్చును. జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను నేరుగా ఎదుర్కొనే సహనం, సామర్థ్యం వ్యాయామము అభివృద్ధి చేస్తుంది.

శ్లోకము : పునర్విత్తమ్ పునర్మిత్రమ్ పునర్భార్య పునర్మహి ।
ఏతత్సర్వమ్ పునర్లభ్యం న శరీరమ్ పునః పునః ॥

అర్థము :

జీవితంలో పోగొట్టుకున్న ధనం, స్నేహితులు, భార్య మరియు భూమినీ తిరిగి సంపాదించుకోవచ్చు. తిరిగి సంపాదించుకోలేనిది మనం శరీరం ఒకటే. ఒకసారి శరీరం / ఆరోగ్యం పోగొట్టుకుంటే తిరిగి దానిని పూర్తిస్థాయిలో పొందలేము. అందుచే నిత్యము శరీరమును కాపాడుకోవడం చాలా అవసరం. ఒకసారి రుగ్మతలకు లోనయితే శరీరాన్ని తిరిగి సహజమైన ఆరోగ్యస్థితికి తీసుకురాలేము.

వివిధ అంశాలలో క్రియాశీలకమైన ప్రయత్నాల ద్వారా మంచి ఆరోగ్యాన్ని నియంత్రించగలము. ముఖ్యంగా మధుమేహంలాంటి రోగ విషయములకు వర్తిస్తుంది. దీర్ఘకాలంలో మధుమేహం వలన గుండె జబ్బులు, నాడీరుగ్మతలు, మెదడు ఆనారోగ్యములు, అంధత్వము మరియు మృత్యువుకు కూడా దారితీస్తుంది. కావున, నిత్యము శరీర పర్యవేక్షణ అవసరము.

ముఖ్యాంశం ఏంటి అంటే ఆరోగ్యము యొక్క విలువ మరియు ప్రాముఖ్యత, నిర్లక్ష్యము చేస్తే తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. కావున అందము అత్యంత విలువైన ఆరోగ్యాన్ని కాపాడుకొనుటలో జాగ్రత్త వహించాలి.

శ్లోకము : యోగస్థః కురు కర్మాణి సంఘం త్యక్తార ధనంజయ ।
సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వసమత్వం యోగ ఉచ్చతే ॥

అర్థము :

ప్రతి ఒక్కరు వారి నిత్య కర్మలు చేయుటయందు నిష్టత కల్గియుండాలి. గెలుపు ఓటముల పట్ల వ్యామోహం విడిచి పెట్టాలి. ఇలాంటి సమతుల్యత యోగా ద్వారా సాధించవచ్చును.

దైనందిన కార్యక్రమాల పట్ల నిష్టత మరియు వాటి ఫలితాల పట్ల ఆశ / కోరిక లేకుండుట అనేది ప్రాథమిక సూత్రాలైన సమతుల్యత మరియు బుద్ధిపూర్వకతను ప్రతిధ్వని అస్తాయి అని చెప్పబడినది. తరుచుగా

ఈ సమతాస్థితి యోగా సాధన ద్వారా సాధించవచ్చును. తద్వారా గెలుపు మరియు ఓటములను సమానంగా తీసుకొనే స్థిరత్వ భావన ఏర్పడుతుంది.

యోగాంగము అయిన ధ్యానము బుద్ధిపూర్వకత మరియు సృహ పట్ల అవగాహన కల్గిస్తుంది. ధ్యానము మానసిక స్థితి మరియు ఉద్వేగాల సమతాస్థితిని కల్గిస్తుంది. తద్వారా శారీరక మానసిక వత్తిడి అదృశ్యం అవుతుంది.

నిత్య వ్యాయామమునకు మించినది యోగాభ్యాసము. శారీరక ఆరోగ్యమునే కాకుండా మానసిక మరియు భావోద్వేగాల సామరస్యమును సాధించుటకు యోగా ఒక ఆధ్యాత్మిక రహదారి. వ్యక్తి నిష్టత ఫలితాపేక్షత లేకుండుట మరియు సమతుల్యమైన జీవితము సాధించుటకు యోగసూత్రములు తోడ్పడుతాయి. తద్వారా సంపూర్ణ ఆరోగ్యము మరియు సంక్షేమము సాధించవచ్చును.

శ్లోకము: వ్యాయామ్ కుర్వతో నిత్య విరుద్ధమపి భోజనం ।
విదాధమ్ విదగ్ధం వ నిర్దోష పరి ఎభ్యతే ॥

అర్థం :

నిత్యము వ్యాయామము చేయుట వలన, విరుద్దాన్నము మరియు అపరిశుభ్రమైన ఆహారము కూడా జీర్ణము కాబడుతుంది. అంతే కాకుండా అతిగా లేదా అల్పంగా ఉడికించబడినప్పటికి ఆహారం మలినరహితం అవుతుంది.

శరీరంలో, జీర్ణవ్యవస్థ నిర్వహించే నిత్య వ్యాయామము సంపూర్ణ, మధురమైన గానకచేరికి సమానము. అంతే కాకుండా ఆహారము సంసిద్ధం చేయడములోని చిక్కులను కూడా అధిగమిస్తాయి. స్థిఱంగా, నిత్యం వ్యాయామం చేయుట అనునది విరుద్ధమైన లేదా కలుషిత పదార్థాలను కూడా ప్రభావవంతంగా జీర్ణం చేయగలదు. శరీరంలో జీర్ణ ప్రక్రియలోని చిక్కులను శారీరక కసరత్తు మార్చగలదు.

వ్యాయామము, జీవక్రియ పెంచుటకు, శోషణ తోడ్పాటుకు, శక్తి వినియోగమునకు మరియు వ్యర్థాలను విసర్జించుటకు ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఆహారం పక్వంగా వండబడినదా లేదా అనే విషయాన్ని వదిలి, వ్యాయాము వలన చక్కగా ఆరోగ్యంగా నిర్మితమైన శరీరంకు అవసరమైన పోషకాలను జీర్ణం చేసుకొని మరియు ఉపయోగించుకుంటుంది. జీవక్రియల వలన ఏర్పడిన విషపదార్థాలను విసర్జించుటకు మరియు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని చిన్న ప్రేవులలో, పెద్దప్రేవులలో ఏర్పరుస్తుంది.

నిత్య వ్యాయామము మరియు జీర్ణప్రక్రియ ఒక దానితో ఒకటి అద్భుతమైన సహజ అనుబంధాన్ని ఏర్పరుచుకుంటాయి. మన జీవనవిధానంలో వ్యాయామాన్ని ఒక భాగం చేయుట వలన శారీరక పటుత్వాన్నే కాకుండా శరీర అంతర్గత ప్రక్రియలు సక్రమముగా జరుగుట మరియు దీర్ఘకాల ఆరోగ్యాన్ని పెంపొందుట వంటి సంపూర్ణ లాభాలు పొందవచ్చును.

శ్లోకము : న చైన సహసాక్రమ్య జరాసమదిరోహతి ।
స్తిరీభవతి మాస చ వ్యాయమ భారతస్యచ ॥

అర్థము :

ఎవరైతే వ్యాయామము చేయుటలో క్రమశిక్షణ కల్గి ఉంటారో మరియు మిత ఆహారము, నిద్ర మరియు వినోదాన్ని అలవర్చుకుంటారో వారెన్నడు అనారోగ్యములచే బాధించబడరు. అంతే కాకుండా వృద్ధాప్యము వారిని త్వరగా చేరదు లేదా బాధించదు. అటువంటి వారు శారీరక శక్తి నియంత్రణలో మరియు ఆధ్యాత్మిక సాధనలో పట్టుసాధిస్తారు.

వీరుల / విజేతల సంక్షేమానికి, సంపూర్ణ జీవన విధానము, మితతత్వాన్ని పాటించడము, క్రమశిక్షణ మరియు సంపూర్ణ సాధన అనునవి మూలస్తంభాలు.

సంపూర్ణ సంతులిత ఆహారమును, అధికంగా కాని, అల్పంగా కాని తీసుకోవడాన్ని నిరోధించడాన్ని మిత ఆహారపు అలవాటును సూచిస్తుంది. ధృడమైన మరియు ఆరోగ్యవంతమైన శారీరక వ్యవస్థకు, శరీర అవసరాలకు తగినంత పోషకాలు అందించడమనే పద్ధతి మూలస్తంభం వంటిది. ఎంత పరిమాణం ఆహారం తిన్నామన్నది కాదు, శారీరక పోషణకు అవసరమైన సంపూర్ణమైన మరియు సంతులితమైన ఆహారం అందించడం మంచి పద్ధతి.

అదేవిధంగా తగినంత నిద్ర మరియు వినోదం, సంతులితమైన జీవన విధానములో ముఖ్యపాత్ర పోషిస్తాయని గుర్తించబడినది. శ్రమ తర్వాత శారీరకంగా మరియు మానసికంగా పునరుత్తేజవంతం అవడానికి అతి ముఖ్యమైనది తగినంత నిద్ర. విరామ సమయ వినోదక్రీడలు ఖచ్చితంగా ధనాత్మకమైన సంక్షేమము, విరామము ఇస్తూ వత్తిడిని తగ్గిస్తాయి.

శక్తివంతమైన శరీరానికి క్రమశిక్షణతో కూడిన నిత్య వ్యాయామము మూలము. వ్యాయామము అనునది ఒక దినచర్య కాదు, గుండె ఆరోగ్యాన్ని, కండర మరియు ఎముకల బలాన్ని మరియు సంపూర్ణ పటుత్వం పొందేదుకు అంకిత భావంతో చేసే నిత్య కృత్యము. క్రమశిక్షణతో చేసే వ్యాయామము అనారోగ్యములను నివారించే శక్తిగాను మరియు రోగనిరోధక శక్తిని పెంచే ఒక మార్గము.

పైన తెల్పిన తత్వము వ్యక్తి సంక్షేమము మరియు ఆరోగ్యం కొరకు డాక్టరుచే సిఫారసు చేయబడిన ఔషధము వంటిది. ఇది కేవలం అనారోగ్యములను మరియు త్వరగా వచ్చే వృద్ధ్యాప్యాన్ని దూరం చేయడమే కాదు, శారీరక మరియు ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు తులనాత్మకమైన జీవన విధానాన్ని కూడా అభివృద్ధి చేస్తుంది.

శ్లోకము :

అర్జున ఉవాచ :

అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసఃి ।

అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణగచ్ఛతి ॥

అర్థం :

అర్జునుడు ఈ విధంగా అడిగాడు.

ఓ కృష్ణా! ఎవరికైతే యోగా మార్గముపై నమ్మకముండి, స్వీయ క్రమశిక్షణ లోపించుటచే, చివరకు యోగాకు దూరమైనట్లయితే, ఆ సాధకుడు ఏ స్థితిని పొందుతాడు. అనగా ఏ గమ్యాన్ని చేరుతాడు, నేరుగా దివ్యత్వాన్ని అర్థం చేసుకోవడంలో అసఫలీకృతుడు అవుతాడ?

వ్యాయామ విద్యాసామ్రాజ్యంలో క్రమశిక్షణలేని యోగి ఉత్తమమైన సారుప్యతలు పొందలేము. అర్జుని ఆలోచన శారీరక సంక్షేమము అనే ప్రయాణము పరిపూర్ణమైన మరియు క్రమశిక్షణతో కూడిన యోగా మార్గాన్ని ప్రతిబింబిస్తుంది. శారీరక పటుత్వం ఆశిస్తే, కృతనిశ్చయము మరియు స్థిరమైన ప్రయత్నములేనిదే, మనము అనుకున్న నైపుణ్యాలను మరియు ఆరోగ్య లక్ష్యాలను పొందడములో విఫలము అవుతాము.

వ్యాయమ విద్యలో ఎవరైతే క్రమశిక్షణారాహిత్యంగా వుంటారో వారు ఉన్నతమైన ఆరోగ్య సాధనా మార్గము నుంచి దూరంగా నేట్టివేయబడుతారు. క్రమశిక్షణతో కూడిన ప్రయత్నం మన ఆలోచనలకు మరియు

లక్ష్యసాధనకు మధ్య దృడమైన వారధి. నిత్య వ్యాయామము పట్ల దృడనిశ్చయత, పోషకాల సమతుల్యత మరియు పట్టుదల అనునవి శారీరక పటుత్వ లక్ష్యాలవైపు మనల్ని నడిపిస్తాయి.

అర్జునుని క్రమశిక్షణ గురించి ఈ ప్రశ్న - ఈ ప్రపంచములో స్వీయసాక్షాత్కారప్రయాణంలో క్రమశిక్షణ విడదీయరాని సహచరుడు.

శ్లోకం : యం సన్యాసమితి ప్రాహుః యోగం తమ్విద్ధిపాండవ ।
న హ్యసన్నసన్త సంకల్పో యోగీ భవతీ కశ్చన ॥

అర్థము :

వ్యక్తి సంక్షేమానికి హానికరమైన కోరికలను మరియు అలవాట్లను వదిలి వేయాలనే ఆలోచన / బుద్ధి మూర్తీభవించి యుండడమే యోగములేదా సన్యాసము. కామవాసనలను పరిత్యజించడమే కేంద్రంగా కల్గిన యోగమార్గములాగానే, శారీరక పటుత్వ సాధనకు అంకితమైన సాధకుడు, బద్ధకస్తమైన జీవనవిధానమును, అతిభోగలాలసత్వానికి మరియు ఆరోగ్యానికి దారి తీసే అవకాశాలను త్యజించాలని తెలుసుకోవాలి.

వ్యాయామ విద్య లక్ష్యసాధనలో ఆనందానికి ఎక్కువ సమయం కేటాయించాలి అనే ఆలోచన త్యాగము చేస్తే అభివృద్ధికి అడ్డుగా నిలిచే అలవాట్లకు దూరం కావచ్చును. దీని వలన బద్ధకమైన విధానానికి నిత్య వ్యాయామము ద్వారా, అనారోగ్యము కల్గించే ఆహారపు అలవాట్ల పట్ల మోహము మరియు వ్యాయామ కృత్యాలు చేయనివ్వని జడత్వాన్ని వదులుకోవచ్చును.

ఈ అభివృద్ధి ఆటంకాలను అధిగమించడం ద్వారా లేదా వాటి పట్ల మోహాన్ని వదులుట ద్వారా, మనము క్రమశిక్షణ మరియు సమతుల్యమైన పటుత్వ సాధనా మార్గానికి పునాది వేసినట్లే. శారీరక పటుత్వ సాధన ప్రయాణంలో, క్రమశిక్షణ ముఖ్య సూత్రంగా మారి, క్రీడాకారుని పరధ్యానాలనుంచి దూరం చేసి, ఏకాగ్రతతో పటుత్వ లక్ష్యసాధన వైపు నడిపిస్తుంది. సామర్థ్యాలను పరిమితం చేసే అలవాట్లను త్యజించడమే వ్యాయమ విద్య సాధనలో ముఖ్యమని అర్థం చేసుకోవాలి.

ఆధ్యాత్మికతలో త్యజించడము అంటే, దివ్యత్వముతో పవిత్రమైన అనుబంధం ఏర్పరుచుకోవడమే. అలానే అంకితభావం కల్గిన విద్యార్థి వ్యాయామ విద్యలో శరీరము మరియు మనస్సులను ఏకం చేయగలడు. ఇటువంటి శక్తి ఉత్తమ ప్రదర్శనకు, సహనశక్తి అభివృద్ధికి మరియు సంపూర్ణ సంక్షేమానికి అత్యవసరము.

శ్లోకము: శ్రీభగవానువాచః
అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మకరోతి ।
స సన్యాసీ చ యోగీ చ న నిరగ్నీర్నచా క్రియః ॥

అర్థము :

ఎవడైతే కర్మల ఫలితాలను ఆశించకుండా, నిర్దేశించిన కర్మలను నిర్వహిస్తాడో వాడే నిజమైన సన్యాసి / యోగి. అలా కాకుండా చేయవలసిన నిత్య హోమాలను లేదా చేయవలసిన కర్మలను వదిలివేస్తాడో వాడు నిజమైన యోగి కాజాలడు.

ఆ పరమాత్మ బోధించిన ఈ సూత్రము వ్యాయామ విద్య పరిధిలో చూసినట్లయితే శారీరక పటుత్వము సాధించుటకు సంపూర్ణ మార్గమని తెలుస్తుంది. ఏ క్రీడాకారుడు స్థిరమైన ఆలోచనతో పటుత్వము సాధించుటకు ప్రత్యేకమైన కసరత్తులు చేయాలనుకుంటాడో అతను తప్పక సాధిస్తాడు. వ్యాయామ విద్యలో క్రీడాకారుడు దృడమైన ఏకాగ్రతతో ప్రయాణం చేసేటప్పుడు, స్థిరమైన ఆరోగ్యము మరియు పటుత్వము అనునవి అవసరమైన వ్యాయామముల ఉపలబ్దాలు అని అర్థం చేసుకుంటాడు.

శారీరక సవాళ్ళను ఎదుర్కోవాలనే స్థిరబుద్ధి కల్గి, సత్వర ఫలితాల గురించి ఆలోచన విడిచి పెడతారు. వారు నిర్దేశిత మార్పు చెందే శక్తిని పొందగలరు. క్రీడాకారులు నిత్య సాధనలో అంతర్గత విలువలు తెలుసుకొని, స్థిర బుద్ధితో నిర్దేశిత వ్యాయామాలు చేస్తారో వారు క్రీడాకారులు. సక్రమముగా సాధన చేయని వారు నిజమైన క్రీడాకారులు కాజాలరు. "సాధకస్య విషం గోష్టి" అన్నారు. సాధన చేయాల్సినవారు అనవసర కాలక్షేపం చేయుట వలన లక్ష్యసాధనలో వెనుక బడి ఉంటారు. వ్యాయామముల వలన కేవలం పటుత్వమే కాదు, మానసిక మరియు ఉద్వేగాల కోణంలో కూడా పూర్తి సంక్షేమము కల్గిస్తుందని గుర్తిస్తారు. ఈ తరహా సాధన కేవలం శారీరక ఆరోగ్యమే కాదు, శరీరం, మనస్సు మరియు ఆధ్యాత్మిక ఏకత్వాన్ని కూడా అభివృద్ధి చేస్తుంది.

శ్లోకము : అర్జున ఉవాచ,

యో యం యోగస్తయా ప్రోక్త స్సామ్యేన మధుసూధన ।
ఏ తస్యాహం న పశ్యామి చ లత్వాత స్థితిం స్థిరా ॥

అర్థం :

ఓ మధుసూధన, మీరు వివరించిన స్థిరమైన యోగస్థితి ఆత్మసామ్యస్థితి సాధనమని తోచడం లేదు. ఏలయన మనస్సు చంచల స్వభావము కలది కావున, స్థిరత్వం ఎట్లు కలుగును?

స్థిరమైన యోగస్థితిని మరియు వ్యాయామ విద్య సవాళ్ళను నియంత్రించడంను చంచలస్వభావమైన మనస్సు సమానంగా ప్రభావితం చేస్తుంది. అస్థిరమైన మనస్సు వలన స్థిరమైన యోగసాధనలో (మానసిక మరియు శారీరక) అనేక అడ్డంకులు ఎదుర్కోవలసి వస్తుంది. అంతే కాకుండా వాటి మధ్య గొప్పదైన సమతుల్యత సాధన కూడా అడ్డు కల్గిస్తుంది.

అర్జునుని ఈ పరిశీలన, వ్యాయామానికి, చంచలమైన మనస్సు వలన మనము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది అని తెలుస్తుంది. పరధ్యానం, ప్రేరణాలోపం లేదా బాహ్య వత్తిడుల వలన అత్తుత్యమమైన శారీరక సంక్షేమాన్ని సాధించాలనే ఏకాగ్రతను చెదరగొడుతుంది. బుద్ధి పూర్వకత, లక్ష్య నిర్దేశము మరియు సాధనకు ఉపయుక్తమైన వాతావరణాన్ని ఏర్పరచుట ద్వారా చంచలమైన మనస్సును అధిగమించవచ్చును.

శ్లోకము : మస్త్విన్ద్రియాని మనసా నియంయారభతే ర్జున ।
కర్మయోగం కర్మేన్ద్రియైః ఆసక్తస్స విశిష్యతే ॥

అర్థము :

ఓ అర్జునా! ఎవరైతే భౌతిక బంధాలనుంచి దూరంగా ఉంటాడో, ఇంద్రియాలను నియంత్రించుకుంటాడో మరియు అన్ని ఇంద్రియాల ద్వారా నిత్యం కర్మయోగ సాధనలో నిమగ్నమవుతాడో, అతడు ఉత్తముడుగా పరగణించబడుతాడు.

వ్యాయామ విద్య విషయములో చూసినట్లయితే ఈ మార్గదర్శనము మనఃపూర్వక మరియు క్రమశిక్షణతో వ్యాయామము చేయుట మరియు పరిపూర్ణమైన సంక్షేమమును పొందుటను రూడీకరిస్తుంది.

మనస్ఫూర్తిగా వచ్చే ఫలితాలగురించి ఆలోచించకుండా వ్యాయామము చేయుటను, వ్యాయామ విద్య ప్రోత్సహిస్తుంది. దాన్ని ప్రత్యేకమైన ఫలితాలను నిర్దేశించుకోకుండా, పరిపూర్ణమైన ఆరోగ్యము మరియు పటుత్వము కొరకు వ్యాయామ కృత్యాలలో పాల్గొనుటపై దృష్టినిలపవలెను.

వ్యాయమ విద్యలో ఇంద్రియ నియంత్రణ అనగా బుద్ధిపూర్వకతతో మరియు ఎరుకతో కసరత్తుచేయడము, దీనిలో శరీరం చెప్పే విషయాన్ని వినడం, శరీర హద్దులను అర్థం చేసుకోవడం మరియు అలసట లేదా

గాయాల లక్షణాల గురించి పట్టించుకోకపోవడం అనే అంశాలు మిళితమై ఉంటాయి. ఎరుకతో వ్యాయామము చేయుట వలన అది అన్ని ఇంద్రియాల జ్ఞానాన్ని అభివృద్ధి చేస్తుంది. నడక, ప్రకృతిలో వ్యాయామము చేయుట మరియు వివిధ జ్ఞానాల అనుభవాలను సమ్మిళితం చేసే క్రీడలు దీనిలో ఉంటాయి.

వ్యాయామ విద్యలో 'కర్మయోగ' అనగా చేసే శరీర కదలికలను, నైపుణ్యాన్ని ఆనందిస్తూ, శారీరక సంక్షేమము యొక్క అంతర్గత విలువలను గుర్తించడం.

ముగింపు :

ఈ విధంగా భారతదేశపు ప్రాచీన వేదాలు, పురాణాలు మరియు ఇతిహాసాలు క్రీడా సంస్కృతి గురించి వివరించాయి. పైన వివరించిన వివిధ శ్లోకాలు, వ్యాయామ విద్య, క్రీడలు మన ప్రాచీన భారతీయ జ్ఞాన వ్యవస్థలు వేర్లునుకొని మరియు విష్పోటనం చెందడానికి సిద్ధంగా వుందని చెప్పడానికి చక్కని తార్కాణము. శారీరక పటుత్వము మరియు సంక్షేమము యొక్క ప్రాధాన్యత హరప్ప / సింధులోయ నాగరికత కాలం నుంచి నేటి ఆధునిక కాలము క్రీడల వరకు కూడా ప్రాచీన కాలంలోనే చెప్పబడినది. ప్రాచీన భారతదేశపు జ్ఞానము శారీరక పటుత్వము, ఆరోగ్యము మరియు సంక్షేమముల గురించి గొప్పగా చెప్పినదనుట సత్యము.

❖❖❖

మహాభారతంలో కుటుంబ వ్యవస్థ

డాక్టర్ వై. దివ్య, తెలుగు అధ్యాపకులు, డి.కే ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం), నెల్లూరు.

భారతీయ సనాతన సంస్కృతి సంప్రదాయాలను కుటుంబ వ్యవస్థ రూపురేఖలను తర్వాతి తరాలకు అందించుటలో ధర్మ ప్రచారంలోనూ ధర్మ పరిరక్షణలోనూ అమూల్యమైన అనర్గరత్నంగా మహాభారతాన్ని పేర్కొనవచ్చు. అందులోనూ ఆంధ్ర మహాభారతం తెలుగు వారికి లభించిన అమృత ఫలం. " ఆంధ్రత్వం మాంధ్ర భాషాచ నాల్పస్య తపసః ఫలం" అని అప్పయ్య దీక్షితులు చెప్పినట్లుగా ఆంధ్రుడు గా పుట్టడం, ఆంధ్ర భాష మాట్లాడటం ఎంతో గొప్ప తపస్సు చేస్తే కానీ లభించని ఫలం. అలాగే ఆంధ్ర భాషలో కవిత్రయం వారు ఆంధ్ర మహాభారతం లో ధర్మం అర్థం కామం మోక్షం అనే నాలుగు పురుషార్థాలను సాధించడానికి అవసరమయ్యే విజ్ఞానాన్ని పాండవుల ఉత్తమ చరిత్ర కౌరవుల దుర్వృత్తం ఆధారంగా మానవ జీవితం అనే మహా సముద్రాన్ని మదించి తెలుగుజాతికి ఆదర్శంగా, తెలుగు సంస్కృతి కి ప్రతిబింబంగా తీర్చిదిద్దారు.

"ధర్మే చార్థే చ కామేచమోక్షేచ భరతర్షభ
యదిహాస్తి తదన్ యాత్ర ఎన్నో హస్తి నతకచ్చిత్"

అని మహాభారతం ప్రకటించుకున్నది. ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉన్న అంశం మరొకచోట ఉండవచ్చు. కానీ భారతంలో లేని అంశం మరెక్కడా ఉండదని ఘంటాపథంగా చెప్పింది. అందుకే భారతీయ విజ్ఞానానికి సంస్కృతికి కల్పవృక్షం అని మహాభారతాన్ని చెప్పవచ్చు.

భారతమంటే భరత వంశీయుల కథ వారు చంద్రవంశానికి చెందినవారు సూర్యచంద్రాది వంశాలలో పుట్టి వేద ధర్మాన్ని తాము ఆచరిస్తూ ప్రజల చేత ఆచరింప చేయడమే ప్రాతిపదికగా కలిగిన వారు. చంద్రుడు మొదలుకొని క్రమంగా సూర్యుడు, భరతుడు, కురుమహారాజు, పాండురాజు వంశకర్తలగా ప్రసిద్ధి చెందిన తన వంశంలో నిర్మల గుణ శోభితులైన పాండవుల ఉత్తమ చరిత్ర వినాలని అభిలాష కలిగి నన్నయ చేత ఆంధ్ర మహాభారతాన్ని రచింప చేయడానికి ప్రేరేపించారు రాజరాజ నరేంద్రుడు. 'తింటే గారెలు తినాలి వింటే భారతం వినాలి' అని తెలుగు సామెత. మానవునిలో ఎన్ని రకాల ప్రవృత్తులు ఉంటాయో అన్నింటికి జీవితంలో ఎదురయ్యే సమస్యలకు ధర్మ సంఘర్షణలకు భారతం నిలువుటద్దం పడుతుంది. అందువలన అది అపూర్వ వ్యక్తుల అపూర్వ సన్నివేశాల అపూర్వ సంఘము. మహాభారత శ్రీకృష్ణుని వంటి దివ్యులు, వ్యాసుని వంటి మహా జ్ఞానులు, భీష్ముని వంటి ధర్మవ్రతులు కర్ణుని వంటి త్యాగధనులు, అభిమన్యుని వంటి సాహస వీరులు పాండవుల వంటి పరిణత ప్రవృద్ధులు, సంసారయజ్ఞ సంరక్షకుల వంటి మహిళా మూర్తులు కలిసి ఆదర్శానికి ఆచరణకు మధ్య అన్వయాలని అందించే అపూర్వకథా ప్రపంచం భారతం. పాండవుల సమగ్ర జీవితం చిత్రించబడిన భారతం పురుషార్థ సాధన విజ్ఞాన సర్వసం అందువలన భారతం జీవన ధర్మవేదం.

మహాభారత యుద్ధానంతరం కౌరవ వంశానికి అంకురంగా నిలిచిన ఉత్తరాభిమన్యుల పుత్రుడు పరీక్షిత్తు శృంగి శాపంతో తక్షకుడు అనే సర్పం చేత మరణిస్తాడు. తదనంతరం అతని కుమారుడైన జనమేజేయుడు రాజ్య భారాన్ని స్వీకరించి తండ్రి మరణానికి కారణమైన పాముల జాతిని అంతం చేయాలని సర్పయాగం ప్రారంభించి ఆస్తికుడనే విప్రుడి స్తుతులతో సముచితమైన మాటలతో సర్పయాగాన్ని మాని వైశంపాయనాది శిష్యులతో విచ్చేసిన వ్యాసమహర్షిని "మీరు, భీష్మాది కురువృద్ధులు కలిసి రాజ్యసంపదని విభాగం చేసి

ఇచ్చినప్పటికీ కూడా సుఖశాంతులతో వాటిని అనుభవించకుండా పాండవులు కౌరవులు ఏ కారణం వల్ల ఇంత ప్రజాక్షయమైనా భారత యుద్ధం చేశారు" అని భారత కథ వినిపించమని కోరగా తన శిష్యుడైన వైశంపాయనుడిని వినియోగించారు వ్యాసులవారు. ఈ మహాభారత కథకుడు వైశంపాయనుడు శ్రోత జనమేజేయుడు.

మహాభారతాన్ని రచించిన వేదవ్యాసుల వారు పాండవుల చరిత్రలో ఒక ముఖ్య పాత్ర. పరాశర ముని దాసరాజు కుమార్తె అయిన మత్స్యగందిని మోహించి ఆమె శరీరంలోని చేపల కంపు పోయి యోజన దూరం వరకు పరిమళించే సుగందాన్ని సహజ శరీర వాసనగా కలిగిన యోజనగంధిగా మార్చి సద్యోగర్భంలో సూర్యతేజడైన వ్యాసుడి జననానికి కారణమయ్యాడు. మహాభారతంలో తాను ఒక పాత్రగా జీవించి చివరకు ఆ కావ్యాన్ని తానే రచించాడు వ్యాస మహర్షి.

వ్యాసుని తర్వాత పాండవ కథలో మరో ప్రధాన వ్యక్తి అయిన భీష్ముని తండ్రి శంతన మహారాజు దాసరాజు కుమార్తె అయిన యోజన గంధిని మోహించగా తండ్రి అయిన దాసరాజు శంతనుడికి సత్యవతికి కలిగిన పుత్రునికే పట్టాభిషేకం చేయాలని నియమం పెట్టగా భీష్ముని మీద ప్రేమతో ఎటు తెలుసుకోలేని స్థితిలో ఉండగా తండ్రి మనసును తెలుసుకున్న భీష్ముడు దాసరాజు దగ్గరికి వెళ్లి తీక్షణమైన రెండు ప్రతిజ్ఞలు చేశాడు. ఒకటి తాను రాజ్యం స్వీకరించకుండా శంతనుడికి సత్యవతికి కలిగిన సంతానానికి రాజ్యం లభించేటట్లు చేస్తానని, రెండు భవిష్యత్తులో తనకు పుట్టే బిడ్డల సింహాసనానికి పోటీ పడకుండా ఉండడానికి వీలుగా ఆమరణ బ్రహ్మచర్య వ్రతాన్ని స్వీకరిస్తానని భీషణమైన ప్రతిజ్ఞ చేసి తండ్రి వద్ద స్వచ్ఛంద మరణం అనే వరాన్ని పొందాడు. భీష్ముని వలన సత్యవతికి శంతనుకి వివాహమై చిత్రాంగదా, విచిత్ర వీరులనే పుత్రులు జన్మించారు. అచిరకాలంలోనే శంతనుడు కన్నుమూయగా రాజకుమారుల రక్షణ భారంతో పాటు రాజ్య రక్షణ భారాన్ని కూడా భీష్ముడు స్వీకరించి చిత్రాంగదునకు పట్టాభిషేకం చేశారు.

చిత్రాంగదుడు గంధర్వపతితో యుద్ధం చేసి అసువులు కోల్పోగా భీష్ముడు విచిత్ర వీరుడిని హస్తినాపురం పట్టాభిషేకం చేసి కాశీరాజు కూతుర్లైన అంబ, అంబికా, అంబాలికలను స్వయంవరంలో గెలిచి తెచ్చి వివాహం చేయబోగా వారిలో పెద్దదైన అంబ సాల్వుని వరించానని తెలపగా , భీష్ముడు ఆమెను సాల్వదేశానికి పంపి మిగిలిన ఇద్దరైన అంబికా అంబాలికలను విచిత్ర వీరుడికి ఇచ్చి వివాహం చేసెను కానీ అతను ఆశ్చర్య కాలంలోనే మరణించెను. దీంతో హస్తినాపూరికి నాథుడు లేకపోయెను. విచిత్రమైన పరిస్థితిలో సత్యవతి భీష్ముని నీవు వివాహమాడి సంతానవంతుడై వంశాన్ని నిలపమని వేడుకొన్నది. కానీ భీష్ముడు తన భీష్మ ప్రతిజ్ఞ జ్ఞాపకం చేసి, పంచభూతాలు వాటి ధర్మాలు తప్పిన నేను మాట తప్పని స్పష్టం చేసి ఒక ఆపద్ధర్మాన్ని ప్రతిపాదించాడు. ఈ క్రింది పద్యంలో భీష్ముడు 'పూర్వం పరశురాముడు తన తండ్రి వధింపబడడం వలన కోపించిన వాడై రాజులను సంహరించడంతోపాటు రాజపత్నుల గర్భాలలో ఉన్న బాలురును కూడా మిగలకుండా చంపాడని అటువంటి సందర్భంలో పూర్వం బ్రాహ్మణ శ్రేష్ఠులు ధర్మశాస్త్ర విధి ప్రకారం రాజుల రాజపత్నులందు సంతానాన్ని కలిగించి వారి వంశాలను నిలిపారని తెలియజేశారు.

పితృవధజాతకోపపరిపీడితుఁ డై జమదగ్నిసూనుఁ డు
ద్ధతబలు హైహయున్ సమరదర్పితుఁ జంపి యశేషధారుణీ
పతుల వధించె గర్భగతబాలురు నాదిగబీ నట్టిచోటఁ ద
తృతులకుఁ దొల్లి ధర్మవిధి సంతతి నిల్పరె భూసురోత్తముల్. (1-4-226)

రాజవంశాలలో సంతానం లేకుండా రాజులు మృతులైనప్పుడు దేవర న్యాయంతో రాజులు సంతానాన్ని పొందే ఆచారాన్ని అప్పటి సమాజంలో అది పొందిన ప్రామాణికత్వాన్ని వివరించారు. ఆ విధానాన్ని అనుసరించే ప్రస్తుత పరిస్థితిని దాటగలమని భీష్ముడు వివరించగా అంగీకరించిన సత్యవతి పూర్వం తాను కన్నెగా ఉన్నప్పుడు పరాశర మహర్షి తనను కోరుకొని తన కన్యత్వానికి దోషం లేకుండా తనకు ప్రసాదించిన తన పెద్ద కుమారుడైన వేదవ్యాసుని గురించి భీష్ముడికి తెలిపి, కురువంశాన్ని నిలపగల సామర్థ్యం కలవాడు వేద వ్యాసుడని వివరించెను. దీనికి అందరూ అంగీకరించగా సత్యవతి తన కుమారుడైన వేదవ్యాసుడ్ని మనసులో తలచికొని తన ఎదుట ప్రత్యక్షమైన వ్యాసునికి ఈ వంశం ఇంతటితో ఆగిపోవడం కూడదని భర్త అనపత్యుడై చనిపోతే స్త్రీ ఆ భర్త సోదరుడి వలన సంతతిని పొందడం దేవరన్యాయం . దేవర అంటే భర్త యొక్క సోదరుడు. అపుత్రాం గుర్వనుజ్ఞాతో దేవరః పుత్ర కామ్యయా'- ఆ యాజ్ఞవల్క్య స్మృతి (1.68). పుత్రవతి కాకుండానే భర్తను కోల్పోయిన స్త్రీ (విధవ) యందు, ఆమె దేవరుడు (భర్త సోదరుడు పెద్దల అనుమతితో సంతానాన్ని పొందటం, దేవరన్యాయం.)

క. ధృతి నీయనుజుం డై వి
శ్రుతుఁ డైన విచిత్రవీర్యు సుక్షేత్రములన్
సుతులం బడయుము కుల మవి,
రతసంతతి నెగడ దేవరన్యాయమునన్ (1-4-245)

ఈ దేవర న్యాయాన్ని వివరిస్తూ తనకోడళ్ళైన అంబికా అంబాలికల యందు పురుష సంతానాన్ని కలిగేటట్లు అనుగ్రహించమని వ్యాసున్ని కోరింది . కురువంశం నశించకుండా సత్యవతి దేవి మాట ప్రకారం వ్యాసుడు కులాన్ని నిలపడానికి దయతో సంతానాన్ని కలిగించాడు.

క. ఈ వంశము విచ్చేదము
గావచ్చినఁ గులము నిలుపఁగా సత్యవతీ
దేవి వచనమున సంతతి
గావించెను వ్యాసుఁ డను జగత్కర్త దయన్ (1-7-8)

ఆ దేవర న్యాయం వలన అంబిక యందు వేయ్యి ఏనుగుల బలం గల ధృతరాష్ట్రుడు పుట్టాడు కానీ అతడు పుట్టుగుడ్డి. అంబాలిక యందు వ్యాసుడు మరొక పుత్రుని అనుగ్రహించగా అతడు మహా పరాక్రమశాలి కానీ పాండువర్ణం కలవాడు కాబట్టి పాండురాజు అయ్యాడు సత్సంతానం కలగలేదన్న అసంతృప్తితో సత్యవతి అంబిక మరొక పుత్రుని కనమని కోరగా, వ్యాసుని విచిత్ర రూపం చూసి తన స్థానంలో ఒక దాసిని ఉంచింది. అంబిక నియోగించిన ఆ దాసి వ్యాసుని హృదయాన్ని మెప్పించి ఒక సుతుని పొందింది. అతడే ధర్మ విధుడైన విదురుడు. వారిని పెంచి పెద్ద వారిని చేసే విద్యావంతులను చేసి వివాహితులను చేసే బాధ్యతను స్వీకరించాడు భీష్ముడు. తన తరంలోనే సంతతి లేని కారణంగా రాజవంశంలో వారసుడు లేని దీనస్థితి ఏర్పడడం గ్రహించాడు భీష్ముడు. దేవర న్యాయంతో ధృతరాష్ట్ర పాండురాజులు పుట్టారు కానీ వారి తరంలో మళ్లీ వారసు లేని దుస్థితి రాకూడదని భావించి నూరుగురు కొడుకులను ఒక కూతురును కనగలిగిన వధువును అన్వేషించారు.

ధృతరాష్ట్రుడికి వివాహ వయస్సు రాగానే గాంధార దేశాన్ని పరిపాలించే సుబలుని కుమార్తె అయిన గాంధారి నూరు బిడ్డలకు తల్లి కాగలరని జ్యోతిష్యుల వలన వినిన భీష్ముడు ఆమెను ఇచ్చివివాహం చేయుట మంచిదని భావించాడు.

క. ఈ కులము వివర్ధింపఁగ
నా కభిమత: మేను వింటి నలినేక్షణ దా
నేకశత సుతులఁ బడయఁగ
నా కన్యక వరము వడసి నటె హరుచేతన్. (1-7 -9)

అలానే వంశవృద్ధి కోసం ఆమె తోబుట్టువులైన మరో పదిమందిని, కులశీల వతులైన నూరుగ నిచ్చి ధృతరాష్ట్రుడికి వివాహాలు జరిపించారు. పరాక్రముడై అన్నను అనుసరించి ప్రవర్తిల్లుతున్న పాండురాజుకు కూడా వివాహ ప్రయత్నాలు ప్రారంభించగా పాండురాజు స్వయంవరంలో కుంతిని , భీష్మ అనుమతితో మాద్రిని వివాహం చేసుకున్నాడు. పాండురాజు భార్య అయిన కుంతీ జీవితంలో ఒక రహస్య వృత్తాంతం ఉంది. కుంతిబోజుడు ఇంట ఉన్న కుంతి అతిథిగా విచ్చేసిన దుర్వాస మహర్షిని అతిధి మర్యాదలతో సేవించగా సంతోషించిన ముని దివ్య మంత్రాన్ని ఉపదేశించాడు. ఆపధర్మంగా వాడుకోదగిన మంత్రాన్ని పరీక్షించాలనుకున్న కుంతి సూర్యుని స్మరించి సహచకుండాల శోభితుడైన కర్ణునికి జన్మనిచ్చింది.

చ. సలలిత మైన పుట్టుఁగవచంబు నిసర్గజ మైన కుండలం
బుల యుగళంబు నొప్పఁగ సుపుత్రుఁడు కర్ణుఁడు పుట్టె సూర్యమం
డలమొకొ భూతలంబున బెడంగయి దీప్తిసహస్రకంబుతో
వెలుఁగెడు నా నిజద్యుతి సవిస్తరలీల వెలుంగుచుండఁగన్.(1-7ు26)

కన్య అయిన కుంతి కర్ణుడిని ఒక పెట్టెలో ఉంచి నదిలో వదలగా సూతుడు ఒకడు ఆ పెట్టెను గ్రహించి కర్ణుడిని తన కుమారుడిగా పెంచుకున్నాడు. కుంతి ద్వారా జన్మించిన కర్ణుని జన్మ రహస్యం దేవరహస్యంగా ఉండిపోయింది.

పాండవ కౌరవ జననాన్ని గమనించినట్లయితే వేట కోసం అడవికి వెళ్ళిన పాండురాజు ఒక్క మృగము దొరకక విసిగిపోయి క్రీడిస్తున్న మృగాల జంటను బాణాలతో కొట్టి చంపాడు కిందముడనే ముని తన భార్యతో కలిసి మృగ రూపంలో క్రీడిస్తున్న సందర్భంలో నేను నా భార్యతో కూడి ఉన్నప్పుడు ఎలా చనిపోతున్నానో అలానే నీవు నీ భార్యతో కూడినప్పుడు చనిపోతావని శపించాడు .పాండురాజు శతశృంగ పర్వతం చేరి ఘోర తపస్సు ప్రారంభించాడు. 'అపుత్రశ్య గతిర్నాస్తి' అని ఆర్యోక్తిని అనుసరించి సంతానం లేని వారికి మోక్షారహత లేదు అన్న ముసుల మాటలు పాండురాజును కృంగదీశాయి. అదే సందర్భంలో కుంతీ దుర్వాస మహర్షి తనకిచ్చిన మహా మంత్రాన్ని గురించి పాండురాజుకు వివరించగా అంగీకరించిన పాండురాజు పుత్ర సంతానం కొరకు మంత్ర మహిమను ఆశ్రయించమని కుంతిని ప్రేరేపించాడు. భర్త అనుమతితో సర్వలోకాలకు ఆశ్రయమైన ధర్మానికి మూలమైన ధర్ముడను స్మరించి ఉత్తమ ధర్మవంతుడైన పుత్రుని కోరుకోగా ధర్ముని అంశాన ఒక పుత్రుడు జన్మించగా ఆకాశవాణి ఇతడు కురుకుల దీపకుడు అవుతాడు అని పలికింది. ధర్మస్థిరమతి కావడం చేత ఈ బాలుడు యుధిష్టరుడుగా పిలవబడ్డాడు.

కుంతీ సంతాన వతి అయినదన్న వార్త తెలిసిన గాంధారి గర్భవతి అయి సంవత్సరమైనప్పటికీ ముందుగా సంతానాన్ని కనలేకపోయాను అన్న అసూయతో కడుపుపై భాదుకొని గర్భపాతమై దుక్కిస్తున్న సందర్భంలో వేద వ్యాసుడు వచ్చి ఆ పిండఖండాలను నూట ఒక్కటి లెక్కించి వేరువేరు తైలబండాల్లో భద్రపరచి నూరుగురు కొడుకులు ఒక కూతురు పుడతారని తెలిపారు. అనంతరం పాండురాజు కోరిక మేర వాయుదేవుని ఆరాధించి ఉత్తమ జవసత్వుడైన కుమారుడ్ని కోరగా వజ్రదేహుడైన విక్రమున్నతుడైన బాలుడు పుట్టాడు అతనికి

భీమసేనుడని ఆకాశవాణి పేరు పెట్టింది. ఆ రోజే హస్తినాపురంలో దుర్యోధనుడు పుట్టాడు కులాన్ని లోకాన్ని నాశనం చేసే దుశ్శకునాలు ఎన్నో పొడచూపగా అందరూ భయపడ్డారు. అనంతరం క్రమంగా దుశ్శాసనలు మొదలైన 99 మంది తమ్ములు దుస్సలా అనే చెల్లెలు పుట్టారు. కులనాశకుడైన దుర్యోధనుని ఒక్కడిని విడిచిపెట్టడం మంచిదని పెద్దలు సూచించినా, పుత్ర వ్యామోహంతో ధృతరాష్ట్రుడు అందుకు అంగీకరించలేదు.

ఈ సంగతి విన్న పాండురాజు త్రిలోక విజయుడైన పుత్రుని కొరకు ఒంటి కాలు పై నిలబడి ఒక్క సంవత్సర కాలం పాటు ఇంద్రుని గురించి తపస్సు చేసి శత్రుక్షయాన్ని చేయగల మహావీరుడు కొడుకుగా పుట్టే వరాన్ని పొంది, ఇంద్రాంశతో లోకోత్తరుడు వంశకరుడు అయిన కుమారుడు ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో పుట్టాడు. పాండురాజు కుంతి ద్వారా పొందిన ముగ్గురు కుమారులను చూసి ముల్లోకాలు జయించినట్లు పొంగిపోతున్న, మాద్రి పుత్ర సంతానం పొందే ఉపాయం లేక విచారిస్తుండగా గమనించిన కుంతి దుర్వాసుని మంత్ర ప్రభావాన్ని ఉపయోగించి మాద్రి చేత అశ్విని దేవతలను ఆరాధింపచేసి కవల పిల్లలైన నకుల సహదేవులకు జన్మనిచ్చింది. అనంతర కాలంలో ఒకనాటి వసంత కాలపు ప్రకృతి శోభకు పులకించిన పాండురాజు మాద్రి తో సమాగమాన్ని పొంది ముని శాపంతో మరణించాడు.

భీష్ముడు పాండవ కౌరులందరికీ కృపాచార్య ద్రోణాచార్యుల వద్ద విద్యాభ్యాసానికి నియోగించగా విద్యాభ్యాసానంతరం ద్రోణుడు తనకి గురుదక్షిణగా తనను అవమానించిన ద్రుపదునిపై ప్రతీకారం తీర్చుకున్న వారి ని జగదేకవీరునిగా తీర్చిదిద్దుతానని ద్రోణుడు వరమియ్యగా గురుదక్షిణను నెరవేర్చుటకు సిద్ధమైన అర్జునుడు ద్రుపదుని రథం పైకి దూకి మెరుపు దాడి చేసి అతడిని రథానికి కట్టి ద్రోణుని ఎదుట ఉంచాడు. అర్జునుడి చేతిలో ఓడిన ద్రుపదుడు ద్రోణుడిని చంపే ఒక కొడుకును, అర్జునుని వివాహమాడే ఒక కూతురును పొందాలని అనేక ఘోర వ్రతాలు చేసి ఒక క్రతువు నిర్వహించాడు. ఆ యజ్ఞ కుండం నుండి ఉజ్వల కరావలంతో రథారూఢుడైన దుష్టద్యుమ్నుడు దివ్య తేజస్వినీ అయిన ద్రౌపది పుట్టింది. ద్రౌపదీ స్వయంవరానికి మత్స్య యంత్ర భేదనాన్ని ద్రుపదుడు నిర్ణయించాడు. ఇతరులకు సాధ్యం కానీ మత్స్య యంత్ర భేదనాన్ని బ్రాహ్మణుని రూపంలో ఉన్నఅర్జునుడు అతి సులువుగా భావించి ద్రౌపదిని ధర్మ మార్గంలో భార్యగా పొందాడు

చ. పరులకు దుష్కరంబయిన భాసుర కార్యము సేసి, తత్స్వయం
వరమునఁ బత్నిఁగాఁ బడసి వారిరుహాయత నేత్రఁ గృష్ణ నీ
ధరణిసురాశ్వయోత్తముఁడు ధర్మవిధిం జెపుఁడయ్య యింక నె
వ్వరికిని జన్నె వీని ననవద్యపరాక్రము నాక్రమింపఁగన్.

కుంతీదేవి ఆ ద్రౌపదిని బిక్షగా భావించి ఐదుగురు సమానంగా పంచుకోమని ఆజ్ఞాపించగా తల్లి ఆజ్ఞానుసారం ఈ కన్యను మేము ఐదుగురు వివాహం చేసుకుంటామని ద్రుపదమహారాజుకు ధర్మరాజు చెప్పెను. ఆ మాట విని ద్రుపతమహారాజు ఆశ్చర్యపడి

క. ఒక్క పురుషునకు భార్యలు,
పెక్కం ద్రగు టెందుఁ గలదుబీ పెక్కండ్రకు నా
లొక్కత యగు టే యుగముల,
నెక్కథలను వినియు నెఱుఁగ మెవ్వరివలనన్.(1-7-244)

ఒక్క మగవానికి పెక్కుమంది భార్యలు ఉండడం ఎక్కడైనా ఉన్నది కానీ పెక్కుమంది మగవాళ్ళకి ఒక్కతే భార్య కావడం ఏ యుగాలలోను ఏ కథల్లోనూ ఎవరి వలన విని ఎరుగమని సంశయమును తెలపగా,

వ్యాస మహర్షి ద్రుపదుని సందేహాన్ని నివృత్తి చేస్తూ పూర్వజన్మ వృత్తాంతమైన ఇంద్రసేన మౌద్గల్య మహర్షి వృత్తాంతాన్ని వివరించి శివుని వరం మేరకు ఐదుగురు భర్తలతో ధర్మం తప్పకుండా ఉంటుందని తెలుపుతూ

క. నా వచనంబున నీ క
య్యేవురు వతులందు ధర్మ వెడపకయుండుం
గావున నిట్టి వరం బిం
దీవరదళనేత్ర! యిచ్చితిని దయతోనే.(1-7 -264)

ఇంద్రుడు యముడు వాయుదేవుడు అశ్వినీ దేవతలు ఆధారకర్తలగా ధర్మజ, భీమార్జున,నకుల సహదేవులు ఐదుగురికి ఒకే భార్యగా యజ్ఞ వేదికలో ద్రౌపది జన్మించిందని వివరించాడు. అంతట దృపదుడు ద్రౌపదిని మొదట ధర్మరాజుకి ఇచ్చే వివాహం చేసి పిదప భీమార్జున నకుల సహదేవులకు ఇచ్చి వివాహం చేశాడు. యజ్ఞవేదికలో పుట్టి ఉత్తమ వంశం కల ద్రౌపది నీ వివాహమాడడం వలన పాండవులు మిక్కిలి మిత్ర బలాన్ని పొందారు.దీని ద్వారా గృహస్థ ధర్మంలో ఉత్తమ వంశంలో పుట్టి గుణవతి అయిన వధువుకుండే ప్రాధాన్యం వ్యక్తం అవుతుంది. పాండవుల వలన ద్రౌపదికి ఉపపాండవులు జన్మించారు.

ధర్మరాజు ద్రౌపదీ కుమారుడిగా ప్రతివింధ్యుడు, భీముడు ద్రౌపది కుమారునిగా శ్రుతసోముడు, అర్జునుడు ద్రౌపది కుమారుడుగా శృతకర్మడు, నకులను ద్రౌపది కుమారునిగా శతానీకుడు, సహదేవుడు ద్రౌపదీ కుమారునిగా శ్రుతసేనుడు జన్మించారు.మహాభారత యుద్ధ కాలంలో ద్రోణుడు కుమారుడైన అశ్వత్థామ అపాండవం చేస్తానని దుర్యోధనకి మాట ఇచ్చి ఈశ్వర దత్తమైన ఖడ్గంతో పాండవసేన పై దాడి చేసి అర్ధరాత్రి పూట అధర్మ మార్గంలో చంపివేసెను. విజయానికి దగ్గరగా ఉన్నామని సంతోషంగా ఉన్న పాండవులు ఈ విషయం తెలిసి బోరు బోరున విలపించెను.

పాండవులకు ద్రౌపది మాత్రమే భార్య కాక ధర్మరాజుకు దేవిక అనే భార్య కలిగి యౌదేయుడు అనే కుమారుడు భీమునికి జలంధర, హిడంబా అనే భార్యలు కలిగి వరసగా సర్వగుడు ఘటోత్కచుడు కుమారులు, అర్జునుడికి సుభద్ర, ఉలూచి,చిత్రాంగి అనే భార్యలు కలిగి వరుసగా అభిమన్యుడు ఇలావంతుడు, బబ్రువాహనుడు అనే కుమారులు నకులునికి రేణుమతి అనే భార్య కలిగి నిరమిత్రుడు అనే కుమారుడు, సహదేవునికి విజయ అనే భార్య కలిగి సుహోత్రుడు అనే కుమారుడు ఉండెను. ఉప పాండవులను అశ్వద్ధామ చంపిన తరువాత అభిమన్యుడు పాండవుల వంశవృద్ధికి కారణమయ్యెను. బలరామకృష్ణుల సహోదరి అయిన సుభద్ర కు అర్జునునికి జన్మించిన అభిమన్యుడు పద్మవ్యూహం గురించి తల్లి గర్భంలో ఉండగానే అవగాహన చేసుకున్నాడని భారతంలో వర్ణించారు.

అర్జునుడు ఒకసారి సుభద్రకు యుద్ధవిద్యలో పద్మవ్యూహం కష్టతరమైనది అంటూ పద్మవ్యూహంలో ఎలా ప్రవేశించాలో, చాకచక్యంగా ఎలా పోరాడాలో వివరించి చెప్పాడు. అప్పుడు సుభద్ర కడుపులో ఉన్న అభిమన్యుడు ఆ విద్యను అర్ధం చేసుకున్నాడు. అయితే, పద్మవ్యూహం నుండి ఎలా బయటపడాలో అర్జునుడు సుభద్రకి చెప్పలేదు. అలా చెప్పబోయేంతలో సుభద్ర నిద్రలోకి జారుకోవటం చూసి అర్జునుడు చెప్పటం ఆపివేశాడు. అభిమన్యుడు యుద్ధంలో చాకచక్యంగా పద్మవ్యూహం ఛేదించుకుంటూ లోనికి వెళ్ళి వీరోచితంగా పోరాడాడు కానీ ఆ వ్యూహం నుండి బయటపడలేక ప్రాణాలు కోల్పోయాడు.

అభిమన్యుని మరణ సమయంలో ఉత్తర గర్భవతిగా ఉండడం వలన ఆమె సహగమనం నివారించబడింది. అనంతరం ఈ అభిమన్యుడు ఉత్తర కుమారుడైన పరీక్షిత్తు ద్వారా పాండవ వంశం కొనసాగింపబడినది అశ్వద్ధామ

అర్జునుడు ఇద్దరు బ్రహ్మాస్త్రాలను ప్రయోగించి పెద్దల జోక్యంతో విరమించుకోవడానికి ప్రయత్నించగా ఉపసంహరణ విద్య తెలియని అశ్వద్ధామ అపాండవ మగుగాక అని బ్రహ్మాస్త్రాన్ని పాండవుల వైపు మరల్చగా శ్రీకృష్ణుడు పాండవుల వారతులలో ఒక్కరిని మాత్రమే రక్షించగలనని తల్లి కడుపులో ఉన్న పరీక్షిత్తుని తన యోగ మాయా శక్తితో పిండ రూపుడై ఉన్న బాలుని చుట్టూ తిరిగి కాపాడుతాడు గర్భంలో ఉన్న సమయంలోనే భగవంతుని పరీక్షించడం చేత ఇతనికి పరీక్షిత్తు అనే పేరు ఏర్పడింది.

పరీక్షిత్తు కుమారులు మహాభారతంలో చెప్పినట్లుగా ఏడు మంది వారు జనమేజేయుడు, కక్షసేనుడు ,ఉగ్రసేనుడు, చిత్రసేనుడు, ఇంద్రసేనుడు, సుశేనుడు, నత్యసేనుడు . తండ్రి పరీక్షిత్తు మరణించగానే జనమేజయుడు హస్తినాపుర సింహాసనాన్ని అధిష్టించాడు. జనమేజయుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు, అతని భార్య కాశ్య ద్వారా చంద్రపీడ మరియు సూర్యాపిడ . చంద్రపీడకు విలువిద్యలో నిష్ణాతులైన వందమంది కుమారులు జన్మించారు. వారిలో పెద్దవాడైన శాతకర్ణుడు జనమేజయుని తర్వాత దేశాన్ని పరిపాలించాడు. జనమేజయుడు తన తండ్రి మరణానికి కారణమైన తక్షకుడు కారణంగా మొత్తం సర్పజాతిని నాశనం చేయడానికి పూనుకున్న జనమేజేయుడికి వ్యాస మహర్షి పాండవులకు వారసుడిగా ఉన్న నీవు ఇలా చేయడం తగదని వారించగా అంతటితో ఆ సర్పయాగాన్ని విరమించి, మహాభారత కథను, తన పూర్వ జీవిత విశేషాలను తెలుసుకోవడం జరుగుతుంది.

ఇలా భారతంలో కుటుంబ వ్యవస్థ సంపూర్ణస్వరూపంలో కనిపిస్తాయి. ఆ కదా ఘట్టాల్లోనికి లోతుగా చొచ్చుకొని పోయి ఆ పాత్రలను పరిశీలించినట్లయితే ఆయా సందర్భానుగుణంగా ఉత్తమమైన అన్నదమ్ములకు పాండవులు, పతివ్రతగా ద్రౌపది, తల్లి కొడుకులకు కుంతి పాండవులు, అన్న చెల్లెళ్లకు ద్రౌపదీ కృష్ణులు, భార్య భర్తలకు ద్రౌపదీ పాండవులు, తండ్రికొడుకులకు భీష్ముడు శంతనుడుబీ బావ బావమరదులకు కృష్ణపాండవులు, తాతామనవళ్ళకు భీష్మ పాండవకౌరవులు. ఇలా కుటుంబంలోని సర్వసంబంధాలకు మనకు 'ఆదర్శమూర్తులు' భారతంలో దర్శనం ఇస్తారు.ఆ ఆదర్శ మూర్తుల్ని అనుసరించడమే మన కర్తవ్యం.

ఉపయుక్త గ్రంథాలు:

1. శ్రీమదాంధ్ర మహాభారతం,ప్రచురణ: తిరుమల తిరుపతి దేవస్థానం, 2013.
2. ఆంధ్ర మహాభారతం- ధర్మతత్త్వం,డాక్టర్ విద్దేశ్వరి,ప్రచురణ: విశాలాంధ్ర బుక్ హౌస్-1998.
3. ఆంధ్ర మహాభారతం అమృతత్వ సాధనం-ఆచార్య జీవి సుబ్రహ్మణ్యం, ప్రచురణ: ఆచార్య జీవియస్ షష్టిపూర్తి ప్రచరణలు :హైదరాబాద్-1996.

❖❖❖

మహాభారతంలో గిరిజన పాత్రలు - వ్యక్తిత్వం

డాక్టర్ సి. చిన్నపాపమ్మ, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నగరి.

అడవితల్లి బిడ్డలుగా ప్రసిద్ధిగాంచిన గిరిజనుల ప్రస్తావన గురించి రామాయణ, భారత, భాగవత గ్రంథాలలో ప్రస్తావించబడింది. కల్మషం ఎరుగని అమాయకులు, నాగరిక ప్రపంచానికి దూరంగా ఉంటున్న వీరు ప్రకృతి ఆరాధకులు.శతాబ్దాల తరబడి కొండలలో, అడవులలో, ఎడారులలో, మంచు ప్రదేశాలలో, ద్వీపాలలో నివసిస్తూ ఉండే సామాజికవర్గాలు. నగర, గ్రామీణ సంస్కృతుల ప్రభావానికి లోనుకాకుండా తమ సంస్కృతులను కాపాడుకొంటూ, ప్రత్యేకమైన భాష, సంస్కృతి, సంప్రదాయాలు కలిగి ఉండడం వీరి ప్రత్యేకత.

నగర, గ్రామీణ సంస్కృతుల కంటే మిక్కిలి భిన్నంగా ఉన్న వీరిని చూస్తే అనాగరికులు అనుకొంటారు. కొండప్రాంతాల్లో, అడవుల్లో నివసించే సామాజిక వర్గాలు కావున వీరిని "గిరిజనులు" అంటారు. ప్రపంచమంతటా అనేక గిరిజన తెగలున్నాయి. వీరిలో అనేక ఉపతెగలు ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణలలో అంధ్, బగత, బిల్లులు, చెంచులు, కొండసవర, సుగాలి, కొండరెడ్డి, కోయ, కొలాములు, ఖారియా, గోండులు, యానాది, ఎరుకుల ... ఇలా అనేక తెగలున్నాయి. ఆయా తెగల వైవిధ్యాన్ని బట్టి వీరి జీవన విధానంలో, ఆచార వ్యవహారాలలో అనేక తేడాలున్నాయి. వాటితో పాటు గిరిజనుల జీవితం ఆచార వ్యవహారాలు, వారి రాజరికం, అభ్యసించే విద్యలు, సమాజంలో వారికి ఎదురయ్యే సమస్యలు మొదలగు అంశాలన్నీ మన సాహిత్యచరిత్రలో స్పష్టంగా తెలియపరచబడింది.

ప్రాచీన తెలుగు సాహిత్యం ప్రారంభమైనప్పటి నుండి గిరిజనులకు సంబంధించిన ప్రస్తావన ఆయా గ్రంథాల్లో ఉండడం ద్వారా గిరిజనుల ఉనికి ఎంత ప్రాచీనమైనదో అర్థం చేసుకోవచ్చు. వీరిలో ధైర్యసాహసాలు, దైవభక్తి, నమ్మకాలు, విశ్వాసాలు, నీతినిజాయితీలు మెండుగా ఉంటాయి.

ఆంధ్ర మహాభారతంలో గిరిజనుల ప్రస్తావన గురించి ఆది, సభా, అరణ్య పర్వాల్లో పేర్కొనబడింది. పర్వత ప్రాంతాల్లో నివసించే గిరిజన జాతుల్ని మహాభారతంలో నన్నయ 'ఎరుక', లుబ్ధ, బోయ, కిరాత, నిషాద, శబర, పుశింద, పార్వతేయ, వనచర, అరణ్యవాస, పర్వతవాస .. తదితర పర్యాయపదాలతో సూచించాడు. "మహాభారతంలో గిరిజన పాత్ర"లను పరిచయం చేసే ఉద్దేశ్యంతో ఆదిపర్వంలోని పంచమాశ్వాసంలో ఏకలవ్యుడు షష్ఠాశ్వాసంలో హిడింబ, భీష్మ, ద్రోణ పర్వాల్లో ఘటోత్కచ పాత్రలను పరిచయం చేయడమైనది.

ఏకలవ్యుడు :

ఏకలవ్యుడు హిరణ్యధన్వుడనే ఎరుకరాజు కుమారుడు. విలువిద్య నేర్చుకోవాలని ద్రోణాచార్యుని అర్థించాడు. ద్రోణాచార్యుని మనసులో కారణం వేరే ఉన్నా, పైకి మాత్రం ఏకలవ్యుడు ఎరుకుల కులానికి చెందినవాడని అతన్ని శిష్యునిగా అంగీకరించడు. ఏకలవ్యుడు మట్టితో ద్రోణాచార్యుని విగ్రహాన్ని చేసి

"వినయమున ద్రోణురూపు మన్నున నమర్చి
దానికతిభక్తితోడc బ్రదక్షిణంబు
జేసి మ్రొక్కుచు సంతతాభ్యాసశక్తి
నస్త్రవిద్యా రహస్యంబు లర్థిబడసి"

అత్యంత భక్తిశ్రద్ధలతో గురువుగారి విగ్రహానికి ప్రదక్షిణలు చేస్తూ ఎడతెగని సాధనాబలంతో విలువిద్యలోని రహస్యాలన్నీ నేర్చుకుంటాడు. ఏకలవ్యునికి గురువు పట్ల ఉన్న స్థిరమైన భక్తికి నిదర్శనం అతడు గురువు విగ్రహాన్ని మట్టితో చేసిపూజించడం. గురుముఖతః నేర్చుకొన్న విద్యకంటే గురువు దూరంగా ఉన్నా కూడా గురువు పట్ల ఉన్న అచంచల భక్తి ప్రపత్తులచే అధికమైన విద్యను సాధించవచ్చని ఏకలవ్యుని పాత్ర తెలియచేస్తున్నది. విద్యార్జనకు గురుసాన్నిధ్యం కంటే గురుభక్తియే ముఖ్యమని గురుభక్తికి మించినది లేదని లోకానికి చాటిచెప్పాడు.

"సాధనమున పనులు సమకూరు ధరలోన..." వేమన చెప్పినట్లు సాధన ద్వారా సాధించలేనిది ఏదీ లేదు. సాధనకు శ్రద్ధ అవసరం. శ్రద్ధ కలగాలంటే పట్టుదల ముఖ్యం. ఏకలవ్యునిలో విలువిద్య నేర్చుకోవాలన్న పట్టుదల శ్రద్ధరూపంలో వ్యక్తమై సాధనగా మారింది. ఈ మూడు ఏకకాలంలో అంత సులభంగా ఒంటబట్టవు. కానీ ఏకలవ్యునిలో ఇది సాధ్యమై విలువిద్యపట్ల ఉన్న తపన అతన్ని గొప్ప సాధకునిగా తయారుచేసింది.

ఒకనాడు కౌరవులు, పాండవులు వేటయందు ఆసక్తితో భటులు, వేటకుక్కలతో ఆ అడవికి వచ్చారు. అందులో ఒక భటుని కుక్క ఒంటరిగా విలువిద్యను అభ్యసిస్తున్న ఏకలవ్యుని వద్దకు వెళ్ళి అతని విచిత్రవేషధారణను చూసి మొరగగా అది తనను చూసి మొరిగిందని కోపంతో ఏకలవ్యుడు ఏడు బాణాలను సంధించి ఆ కుక్క నోరు తెరచిమూసేలోపే దాని నోటికి ఎంతో చాకచక్యంగా బాణంతో కొట్టాడు. ఆ కుక్క కురుకుమారుల వద్దకు వెళ్ళగా అది చూసి రాకుమారులు మిక్కిలి ఆశ్చర్యాన్ని పొందారు. ఇంత అద్భుతమైన విలువిద్యను ప్రదర్శించిన ఆ విలుకాడు ఎవ్వడా అని వెదుకుతూ అక్కడికి రాగా

"తేజిత బాణహస్తు, దృఢదీర్ఘ మతీ మస కృష్ణదేహుఁ గృ
ష్ణాజిన వస్త్రు, నస్త్ర విషయాస్త విషాదు నిషాదుఁ జూచి ..... " నల్లని దేహంతో జింకచర్మాన్ని ధరించి పదును పెట్టిన బాణాన్ని చేతబట్టుకొని అస్త్రవిద్యలో లోటులేని వాడైన ఏకలవ్యుడిని చూసి మాత్సర్యం పొందారు. ఏకలవ్యుని బాణ ప్రయోగ నేర్పరితనాన్ని చూసి మెచ్చుకొని నీవు ఎవరవు. ఎవరివద్ద ఈ విలువిద్యను నేర్చుకొన్నావు అని అడుగగా వారితో ఏకలవ్యుడు

"వినండే హిరణ్యధన్వుండను వనచరనాథు కొడుక నాచార్యుఁ ద్రో
ణునకున్ శిష్యుడ నెందును ననవద్యుడ నేకలవ్యుడను వాడ మహిన్"

నేను హిరణ్యధన్వుడనే ఎరుకలరాజు కుమారుడిని, ద్రోణాచార్యుని శిష్యుడను, ఏ దోషం లేనివాడను. నా పేరు ఏకలవ్యుడు అని వివరించగా కురుకుమారులు ద్రోణాచార్యునికి ఆ సంగతంతా వివరించారు. అయితే అర్జునుడు గురువుని నిందించలేదు. మనసులో బాధవున్నా ద్రోణునితో లోకంలో విలువిద్యలో నీకంటే అధికులు లేనట్లుగా నేర్పుతానని నాతో చెప్పారు. ఇప్పుడు

"నాకంటెను మీకంటెను నధికుడతిబలుండు ధనుర్వి
ద్యా కౌశలమున నాతడు మీకుం బ్రియశిష్యుడటె యమిథ్యావచనా"

అమిథ్యావచనా! అబద్దం ఆడనివాడా! విలువిద్యలో నాకంటెను, మీకంటె కూడా అధికుడు, మహాబలవంతుడైన ఒక ఎరుకవానిని చూశాను. అతడు మీకు ప్రియశిష్యుడట కదా! అని ద్రోణాచార్యుని అడిగాడు. కారణం ఏకలవ్యుని విలువిద్యా నైపుణ్యం ఆశ్చర్యాన్ని కల్గించడమే కాదు, అర్జునునిలో మాత్సర్యానికి కారణమైంది. పైగా ఏకలవ్యుడు తాను ద్రోణాచార్యునికి శిష్యుడు అని చెప్పడం గురువుగారు తనకు చెప్పిన

మాటకు, చేసిన పనికి తేడా ఉండడం అర్జునుని బాధ మరింత ఎక్కువ అయింది. అయినా సంస్కారవంతుడైన అర్జునుడు గురువుగారిని ఏమనగలడు? అలా అని ఏమీ అనకుండా ఎలా ఉండగలడు. అందుకే అమిథ్యావచనా! అంటూ సంబోధించాడు.

ద్రోణుడు అర్జునుని మాటలు విని అతనివెంట అడవికి వెళ్ళి నిరంతరం విలువిద్యను సాధన చేయడంలో నిమగ్నుడైన ఏకలవ్యుని చూశాడు. వాళ్ళ రాకను తెలుసుకున్న ఏకలవ్యుడు ఎదురొచ్చి ద్రోణునికి వినమ్రంగా నమస్కరించి తన శరీరాన్ని, సంపదను గురువుకు సమర్పించి "నేను మీ శిష్యుడిని - మిమ్మల్ని సేవించి ఈ విలువిద్యను నేర్చుకొన్నాను" అని పలుకగా ద్రోణుడు అతనిని చూసి తనకు గురుదక్షిణ ఇమ్మని అడిగాడు. ఏకలవ్యుడు అమితానందంతో వినయంగా

"ఇది దేహం: బిది యర్థం : బిది నా పరిజన సమూహ మిన్నిటిలో నె
య్యది మీకిష్టము దానిన ముదమొదవగ నిత్తు గొను డమోఘు బనినన్"

"ఇది నా దేహం, ఇది నా ధనం, ఇది నా సేవక సమూహం. వీటిలో మీకేది ఇష్టమో దానిని తప్పకుండా ఇస్తాను. తీసుకొనండి దానికి తిరుగులేదు" అంటాడు. గొప్పవాడైన గురువు స్వయంగా వచ్చి గురుదక్షిణ కోరడం మహాభాగ్యంగా భావించాడు ఏకలవ్యుడు. అందుకే తనది అనుకున్నదంతా గురువు పాదాలచెంత ఉంచాడు. ఎవరికైనా దేహప్రీతికి మించింది మరొకటి లేదు. కానీ ఏకలవ్యుడు మొదటే ఇది నా "దేహం" అంటూ శరీరంతో సహా ఏది అడిగినా ఇస్తానని చెప్పడంలో సర్వసమర్పణ భావం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఏకలవ్యునిలోని అచంచలమైన గురుభక్తికి పరాకాష్ట ఈ సన్నివేశం. గురువుపట్ల వున్న ముగ్ధభక్తికి నిదర్శనం.

గురువంటే విలువలేని నేటి సమాజంలో గురుశ్రేష్టతను, ప్రాముఖ్యతను, విలువను, ఆచారణాత్మకంగా తెలియజెప్పిన పాత్ర ఏకలవ్యుడిది.

ద్రోణాచార్యుడు **"నెమ్మని నీ దక్షిణ హస్తమ్మున పెనువ్రేలు దునిమి దక్షిణ యిమ్మి ష్టమ్మిది ...."** నీ కుడి చేతి బొటన వ్రేలిని కోసి ప్రీతితో నాకు గురుదక్షిణగా ఇమ్ము అని అనగానే ఏకలవ్యుడు వినయంతో క్షణం కూడా ఆలస్యం చేయకుండా మరో ఆలోచనకు తావివ్వక తన కుడిచేతి బొటనవ్రేలిని కోసి ఆచార్యునికి సమర్పించాడు.

"దక్షిణాంగుష్ట మిచ్చిన దానం జేసి బాణ సంధానలాఘవ భంగమయిన" ఏకలవ్యుడు బొటన వ్రేలిని ఇవ్వడం చేత బాణాన్ని సంధించి వదిలే నైపుణ్యం లేక విలువిద్యా సంపదను కోల్పోయాడు. కారణం చేతిలో బొటనవ్రేలుకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. బొటనవేలు సహాయం లేకుండా మిగతావేళ్ళు పూర్తిస్థాయిలో పనిచేయలేవు. ఏ పని చేయాలన్నా నాలుగు వేళ్ళకు బొటనవేలు ఆధారము. అలాంటి ముఖ్యమైన బొటనవేలును గురుదక్షిణగా అడిగారు ద్రోణాచార్యులు. దీనికి కారణం లేకపోలేదు. అరిషడ్వర్గాలలో మిక్కిలి ప్రబలమైనది క్రోధం. ఈ క్రోధాన్ని నిగ్రహించే శక్తి లేకపోతే ఏకలవ్యుడి వద్ద వున్న అమోఘమైన విలువిద్యను లోకవిరుద్ధ కార్యాలకు ముందు వెనుక ఆలోచించక వినియోగిస్తే చాలా అనర్థాలు జరిగే ప్రమాదం ఉంది. ఏకలవ్యుడు తన ఆకారాన్ని చూసి మొరిగిందనే కోపంతో కుక్క నోటిలోకి ఏడు బాణాలు సంధించి వదిలాడు. ఆ విషయాన్ని దూరదృష్టితో ఆలోచించే ద్రోణాచార్యులు ఏకలవ్యుని శిష్యునిగా అంగీకరించలేదు. పైగా బొటనవేలిని గురుదక్షిణ అడగడానికి బలమైన కారణం ఇదే.

అయితే అచంచలమైన గురుభక్తికి నిదర్శనమైన పాత్ర ఏకలవ్యుడిది. అకుంఠిత దీక్షకు అద్దం పట్టేపాత్ర. భౌతికమైన దర్శనం కన్నా అంతర్ముఖ దర్శనం ద్వారా గురువును సేవించి అపారమైన శక్తి సామర్థ్యాలను సొంతం చేసుకున్న ఏకలవ్యుని లాంటి శిష్యులు గురుస్థానంలో ఉన్న అందరికి ఉండాలని ఆశిద్దాం. విద్య పట్ల ఏకలవ్యుని శ్రద్ధ, నిరతిశయమైన సాధన, కృషి, పట్టుదల విద్యార్థి లోకానికి దిశానిర్దేశనం చేసే ఒక దిక్సూచి లాంటిది.

హిడింబ :

హిడింబను గురించి ప్రస్తావించడానికి ముందు హిడింబ రాక్షసకాంత. మరి గిరిజిన పాత్రగా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, గిరిజనులలో కొలాములు అనే ఒక తెగ ఉంది. వీరు మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ఆదిమజాతి తెగవారు. వీరు మాట్లాడే భాష కొలామీ. తెలుగు ప్రాంతంలో వీరిని కొలామ్స్ అని, మరాఠీ ప్రాంతంలో కొలాములని వ్యవహరిస్తారు. కొలాములు తాము మహాభారతంలో పాత్రలైన భీముడు, హిడింబల సంతతి వారమని భావిస్తారు. కొలాములు హిడింబను తమ కులదేవతగా, గ్రామదేవతగా కొలుస్తారు. కొలామ్ భాషలో హిడింబను పోకలమ్మ అని, భీముడిని భీమయ్యాక్‌లుగా పిలుస్తారు. అంతేకాక అడవిప్రాంతంలో నివసించేవారు కనుక ఈ పాత్రలను గిరిజన పాత్రలుగా భావించడమైనది.

ఆంధ్రమహాభారతంలో ఆదిపర్వం – షష్టాశ్వాసంలో హిడింబను గురించిన ప్రస్తావన ఉంది. పాండవులు వారణావతం నుండి దక్షిణదిశగా ప్రయాణిస్తూ మార్గమధ్యంలో ప్రయాణ బడలిక తీర్చుకొనుటకు ఒక మఱిచెట్టు నీడలో నిద్రిస్తుండగా భీముడు వారికి కాపలాగా ఉంటాడు. అదే అడవిలో హిడింబుడనే రాక్షసుడు నివసిస్తూ ఉంటాడు. అతడు పాండవులను చూసి రుచిలేని అడవి జంతువుల మాంసం పట్ల రోతపుట్టి మానవమాంసం తినే అవకాశం లభించిందని సంతోషిస్తూ తన చెల్లెలు హిడింబను పిలిచి మానవులు ఈ అడవిలో రావడానికి సాహసిస్తారా? "కుందేలు వంటింటిలోకి వచ్చింది". వెళ్ళి వాళ్ళను చంపి రుచిగల మాంసాన్ని వండి తీసుకురా అని చెబుతాడు.

"వనజాతాయత నేత్రు నున్నత బృహద్వక్షుఃస్థలున్ సింహ సం
హననుం బాండవ సింహమున్ …. " పద్మాల వలె విశాలమైన నేత్రాలు, ఎత్తైన వక్షస్థలం, సింహం నడుము వంటి సన్నని నడుముతో అందమైన శరీర సౌష్టవంతో ఉన్న భీమసేనుని చూసి మోహ పరవశురాలై కామరూపం ధరించి మానవకాంతరూపంలో తన అన్న ఆజ్ఞను మరచి భీముడివద్దకెళ్ళి ఇలా అంటుంది. నేను హిడింబుడనే రాక్షసుడి చెల్లెలిని. నిన్ను చూసి మన్మథ బాధకు లోనయ్యాను.

"నాకుఁ బతివయిన నిన్ను జేరొని మాయన్న యెగ్గుసేయక కాచున్
నాకు మఱి నీవ పతివి గుణాకర! యి జన్మమున మహోస్నేహమున్" నీవు నాకు భర్తవైతే మా అన్న నిన్ను తనవాడిగా స్వీకరిస్తాడు. కీడు చేయకుండా నిన్ను కాపాడుతాడు అంటూ హిడింబ నిజాయితీగా తన గురించి ఉన్నది ఉన్నట్లుగా, ఎక్కడా దాపరికం, మోసపూరిత ఉద్దేశం లేకుండా అన్ని విషయాలు భీమునికి వివరిస్తుంది. దీన్నిబట్టి ఈమె రాక్షసకాంత అయినా మాయలుచేయని ఉన్నతమైన వ్యక్తిత్వం కలదని తెలియుచున్నది. అంతేకాక ఈ జన్మకు నీవే నా భర్తవు అంటూ స్థిరంగా తన నిర్ణయాన్ని చెప్పడంతో ఈమె స్థిరచిత్తం కలదని తెలియుచున్నది.

హిడింబ జన్మచేత రాక్షసకాంత అయినా ఉత్తమ మానవ లక్షణాలతో ఉన్న పతివ్రత. హాస్యానికైనా ఆమె అబద్దం చెప్పలేదు. భీముడిపట్ల మన్మథభావం కలగడంవల్ల జన్మంతా అతడినే భర్తగా స్వీకరించాలని దృఢంగా నిశ్చయించుకొని, భీముని కొరకు తన అన్నకు దూరంకావడానికి కూడా సిద్ధపడింది. పాండవులకు ప్రథమ సంతతిని ప్రసాదించిన ఉత్తమ ఇల్లాలు. హిడింబకు భీముడిపట్ల కలిగిన భావాన్ని లోతుగా పరిశీలిస్తే భవిష్యత్తులో పాండవుల రక్షణకు, వారికి అండగా ఉండడానికి కారకుడైన ఘటోత్కచ జననానికి ఇక్కడే బీజం పడిందేమో అనిపిస్తుంది.

భీముడిని ఎలాగైనా రక్షించాలన్న ఉద్దేశంతో హిడింబ 'ఇది హిడింబాసురుడి అడవి. ఇందులో ప్రవేశిస్తే యముడి కుత్తుకలో ప్రవేశించినట్లే; తక్కిన వాళ్ళ సంగతి మనకెందుకు. నీవు నాకు భర్తవై ప్రాణాలు రక్షించుకొని నా వలన కోరిన సుఖాలు అనుభవించు అంటుంది. నేను కోరిన చోటుకు వెళ్ళగలను. నీకిష్టమైన చోటుకు తీసుకొని పోతాను అనగా అందుకు భీముడు

" విను బేల! యెట్టి కష్టుడు దనపురుష గుణంబు సెడగ దల్లిని దోబు
ట్టిన వారి విడిచి రాగంబున జపలస్త్రీ సుఖంబు బొందునే చెపుమా"

బేల! ఎంతటి నీచుడైనా తన పురుష లక్షణాన్ని పోగొట్టుకుని తల్లిని, తోబుట్టువులను వదలి మోహంలో పడి చపలయైన స్త్రీ సుఖాన్ని కోరుకుంటాడా! ఇక్కడ భీముడి గొప్పదనం, ఉన్నతి, కుటుంబం పట్ల బాధ్యతాయుతమైన నడవడిక, ప్రేమానురాగాలు వ్యక్తమౌతున్నాయి. మార్గాయాసం వల్ల భీముడు కూడా బాగా అలసి ఉన్నాడు. అయినా అందరి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి నిద్రకు ఎలాంటి భంగం కలుగనీయలేదు. భీముడు హిడింబను బేల! అంటూ సంబోధించాడు. కారణం మదనభావానికి గురిఅయిన స్త్రీలు సొంతవారిని కూడా వదులుకోవడానికి సిద్ధపడతారు. అందుకే భీముడికి ఆమె అమాయకురాలిగా అనిపించింది. అంతేకాక మనసులో మదనభావానికి బానిస అయి ఆప్తులను వదులుకోవడం చపలస్త్రీలకు ఉన్న లక్షణం. అలాంటి స్త్రీకి భర్త పట్ల కూడా చపలమైన ప్రేమే కలిగిఉంటుందని భీముడి అభిప్రాయం. అయితే హిడింబ తాను బేలకాదని, చపల అంతకన్నా కాదని నిరూపించు కుంటుంది. కనుకనే ఆ రాక్షసుడు వచ్చేలోపే పాండవులను మేల్కొలుపు అని భీముడితో చెపుతుంది. కాని భీముడు వీరుడైన ఒక రాక్షసుడు వస్తున్నాడని సుఖంగా నిద్రించే వీళ్ళను మేల్కొలపలేను. ఒక రాక్షసుడే కాదు దేవదానవులంతా ఏకమై వచ్చినా చీల్చిచంపుతాను కాని, అలసట చెంది సుఖంగా నిద్రించే వీళ్ళకు నిద్రాభంగం చేయను అంటాడు. అన్నదమ్ముల మధ్య ఉండాల్సిన బాంధవ్యాలకు అద్దం పట్టేలా భీముడి పాత్ర దర్శనమిస్తుంది.

హిడింబ ఆలస్యం చేసినందుకు మిక్కిలి కోపించిన హిడింబుడు చెల్లెలిని చూసి 'నీవు నీచులైన మానవులతో కలిసి నా ఆజ్ఞను ధిక్కరించడం తగునా!' అని గద్దించాడు. హిడింబకు భీముడిపట్ల అపారమైన ప్రేమానురాగాలు ఉన్నాయి. అతడు ఎలాగైనా తనను రక్షించి ఆదరిస్తాడనే విశ్వాసం ఉంది. అందుకే హిడింబ భీముడి చాటుకు వెళ్ళి నిలబడింది. అప్పుడు భీముడు హిడింబతో

"పన్నగవైరి విక్రముండు పాండవ సింహము దాని జూచి మీ
యన్నను నన్ను జూడుము భయంపడకుండును ..."

గరుత్మంతుని వంటి పరాక్రమం కలవాడు భీముడు మీ అన్నను, నన్ను చూడుము భయపడుకుము అని చెప్పి హిడింబాసురుడితో యుద్ధానికి తలపడ్డాడు. దీన్నిబట్టి భీముడికి హిడింబ పట్ల క్రమంగా సదభిప్రాయం కల్గిందని తెలియుచున్నది.

హిడింబాసురుడు భీముడిని గట్టిగా చేతులతో బంధించి భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లు సింహనాదం చేశాడు. ఆ శబ్దం విని కుంతీదేవి, కొడుకులు మేల్కొని మానవాతీతమైన రూపసౌందర్యంతో ఉన్న హిడింబను చూసి ఆశ్చర్యపడి కుంతీదేవి మెల్లగా హిడింబతో "నీవు ఎక్కడి దానివి? ఇక్కడికి ఏల వచ్చావు? అని అడిగింది. కుంతీమాత సమయోచిత ప్రజ్ఞకు, ధృతికి నిదర్శనము ఆమె హిడింబను ప్రశ్నించిన తీరు. అప్పుడు హిడింబ

" .... యేను తనయునందు

బతిబుద్ధి దాల్చి యుద్ధత మన్మథార్తనై మసలితి...." నేను హిడింబుడనే రాక్షసుడి చెల్లెలిని. అతడు మీకు కీడు చేయమని నన్ను పంపితే నేను మీ కుమారుడిని భర్తగా భావించి మన్మథభావం పొందాను. అతడు కోపించి మీతోపాటు నన్నూ మ్రింగబోగా గర్వాధికుడైన మీ కుమారుడు అతనితో యుద్ధం చేస్తున్నాడు అని కుంతీదేవి మనసును ఆకట్టుకునే విధంగా, కాపట్యం ప్రదర్శించక సత్యాన్నే పలికింది. దీన్ని బట్టి హిడింబ బేలకాదని విజ్ఞతతో నిర్ణయం తీసుకోగల నేర్పు గలదని తెలియుచున్నది. కుంతిమాత ఒక్క ప్రశ్న వేస్తే హిడింబ తన గురించి, తన అన్న గురించి అంతా ఉన్నది ఉన్నట్లుగా చెప్పింది. అత్త వద్ద నిజాయితీగా మసలుకున్నది. అమ్మా! మీ సుత యందు "పతిబుద్ధి" పొందాను అని చెప్పడంతో భీముడి పట్ల తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తెలియజేసింది. ఒకసారి భీమని భర్తగా భావన చేసిన నా మనసు మరొకరిని భర్తగా అంగీకరించదు అని చెప్పడంతో హిడింబ స్థిరమైన మనస్సు కలదని, ఆమె చంచల కాదని తెలియుచున్నది. అంతేకాక ... **"మీ సుతుడు దర్పోన్నతుండు"** అని చెప్పడంలో భీముడి బలం పట్ల తనకున్న నమ్మకం ఒక కోడలుగా అత్త మనసులో స్థానాన్ని పొందడానికి హిడింబ నడచుకున్న తీరు ఆమె ఉత్తమ ఇల్లాలు అని తెలియుచున్నది. నన్ను, మిమ్మల్ని రక్షించి ఆ రాక్షసున్ని సులభంగా చంపగలడు అనడంలో పాండవులను తన ఆత్మీయులుగా భావించి పుట్టింటి సంబంధాన్ని తెంచుకొని అత్తింటివారితో కలిసిపోవడం చూస్తే ఆమెలో మెట్టింటి వారిపట్ల గల ఆప్యాయత, ఆత్మీయతలు తేటతెల్లమగుచున్నది. హిడింబుడిని చిత్రవధ చేసి చంపిన భీముడి పరాక్రమాన్ని పొగడడం, భీముడిపట్ల ఉన్న అనురాగం, అతడే తన భర్త కావాలన్న బలమైన కోరిక హిడింబలో ఎంత బలీయంగా ఉందో తెలియచున్నది.

హిడింబ రాకను ఇష్టపడని భీముడితో ధర్మరాజు **"వధకు నర్హుడై వచ్చిన వాని జంపి, తదియు ధర్మువ యిది చాలా నబల ..."** చంపదగిన వాడిని చంపావు, అది ధర్మమే. కాని ఈ హిడింబ అబల. ఈమె మీద కోపపడకు. మా అందరికి ఈమె పట్ల బంధుభావమే ఉన్నదని చెప్పడంతో హిడింబ భీముడికి తగిన ఇల్లాలు అని తెలియుచున్నది. హిడింబ కుంతిని ఆశ్రయించి అమ్మా! నేను భీమని మీద మనసు పడి, బంధువులను, స్నేహితులను వదులుకొన్నాను. నా కోరికను తీర్చకుంటే ఇక్కడే ప్రాణాలు విడుస్తానని చెప్పడంతో హిడింబ పట్టుదల, త్యాగం, పాతివ్రత్యధర్మం కలిగిన వ్యక్తిగా దర్శనమిస్తుంది. అంతేకాక మీకిష్టమైనవి చేస్తాను. మీకు మార్గం అనుకూలించనపుడు మీరు కోరిన చోట్లకు చేర్చగలను. త్రికాలాలను ఎరిగి చెప్పగలను అని చెప్పడంతో మెట్టినింట్లో అందరికీ మంచి జరిగేలా, అనుకూలంగా నడచుకోగల ఉత్తమ ఇల్లాలి లక్షణాలు, మానవాతీత మహిమ కలిగిన కాంతగా, తనవారనుకున్న వారి క్షేమం కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడే ధీరగా హిడింబ దర్శనమిస్తుంది. పాండవులు ధర్మపరులు. వారిని ఆశ్రయించిన హిడింబ కూడా ధర్మమార్గాన్నే ఎన్నుకొన్నది.

హిడింబ మాటలు విని కుంతీదేవి, పాండవులు ఆశ్చర్యపడి ఆమెను దేవకాంతగా భావించి దయతో ఆదరించారు. హిడింబలోని అణకువ, భవిష్యత్తును తెలుసుకోగల వివేకానికి సంతోషించి కుంతీదేవి భీమునితో

" ఇది పరమ సాధ్వి, దీనిని మదినొండుగ దలపవలదు మానుగ బుత్రా

భ్యుదయ మగు బాండు హితముగ నిది కార్యంబని పరిగ్రహింపుము నెమ్మిన్" ఈ హిడింబ ఉత్తమ పతివ్రత. పాండవులకు మేలు చేసే పుత్రుడు ఈమెకు జన్మిస్తాడు. మనసులో ఈమె గురించి వేరొక విధంగా అనుకోకుండా ఈమెను పరిగ్రహింపుము అని చెబుతుంది. దీన్ని బట్టి హిడింబది ఎంతటి ఉన్నతమైన వ్యక్తిత్వమో తెలియచున్నది. వ్యాస భగవానుడు కూడా హిడింబను చూసి ఈమె భీముడికి వశమై మహా బలవంతుడైన కొడుకుకు జన్మనిస్తుంది. అతడు ఆపద సమయంలో మిమ్మల్ని రక్షిస్తాడని చెప్పగా భీముడు హిడింబను పరిగ్రహిస్తాడు.

హిడింబ భీమునితో గడిపినది కొద్దికాలమే అయినా ఆజన్మాంతం భీముడి తోడు లేకపోయినా ఒంటరిగా కొడుకుతోనే ఉండిపోయిన ఉత్తమ ఇల్లాలు. పాండవుల క్షేమం కోసం తాను చేయగలిగినంత చేసింది. చిన్నచిన్న కారణాలకే అర్థం చేసుకునే మనస్తత్వం లేక విడిపోయే ఎంతోమందికి హిడింబ ఒక ఆదర్శవంతురాలు. చెక్కుచెదరని స్థిరసంకల్పం, ధైర్యం, సాహసం, కుటుంబం పట్ల బాధ్యతాయుత నడవడిక అన్నీ సలక్షణాలు కలగలిపిన ఉత్తమ ధీర హిడింబ.

ఘటోత్కచుడు :

భీముడు, హిడింబలకు జన్మించిన పాండవ మొదటి సంతానం ఘటోత్కచుడు. అతడు పుట్టగానే నవయవ్వనం పొంది వివిధ శాస్త్రాలలో నైపుణ్యంకలిగి పిశాచ గణాలతో కూడి తల్లిదండ్రులకు, కుంతీదేవికి నమస్కరించి నేను రాక్షస, పిశాచ గణాలతో సంచరిస్తూ ఉంటాను. అవసరమైనపుడు నన్ను తలిస్తే ఆ క్షణమే మీ ముందు ఉంటాను అని చెప్పి అందరి అనుమతి తీసుకొని తల్లితో పాటు వెళ్ళిపోయాడు. దీన్నిబట్టి ఘటోత్కచునికి పుట్టుకతోనే అన్ని విద్యలు వచ్చని తెలియుచున్నది. తర్వాత ఘటోత్కచుడు భీష్మ, ద్రోణ పర్వాలలో కురుక్షేత్ర సంగ్రామంలో ప్రత్యక్షమౌతాడు.

కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవసేవలు విజయగర్వంతో సింహనాదం చేయగా ఘటోత్కచుడు చిచ్చరపిడుగు వలె భీముని సమీపించి మాయలతో కౌరవసేనలను మట్టుపెట్టడానికి తగిన సమయం ఇదే అంటాడు. నరకాసురుని కొడుకైన భగదత్తుడు సుప్రతీకం అనే ఏనుగునెక్కి పాండవులతో యుద్ధంచేయడానికి రాగా ఘటోత్కచుడు బాణాలతో భగదత్తుని ఏనుగును నొప్పించి పారద్రోలి దుర్యోధనునితో యుద్ధానికి తలపడతాడు. భీష్ముడు పాండవసేనలను చీల్చిచెండాడగా, ఘటోత్కచుడు సింహనాదం చేసి విజృంభించాడు. ఘటోత్కచుడు రాక్షసుడైనా పరాక్రమంలో అభిరాముడు వంటివాడు. ఘటోత్కచుని విజృంభన చూసి భీష్ముడు యుద్ధాన్ని చాలించాలని కౌరవసేనలకు సూచించాడు. సూర్యాస్తమయం తర్వాత రాక్షసుల బలం రెట్టింపు అవుతుంది. ఆ సమయంలో వారిని నిలువరించడం కష్టం. దుర్యోధనుడు భీష్ముడు వంటి అతిరథ మహారథులతో తలపడడం చూస్తే ఘటోత్కచుడు ఎంతటి పరాక్రమవంతుడో తెలియుచున్నది.

ఒకవైపు భగదత్తుడితో తలపడుతూనే ఇంకోవైపు దుర్యోధనునితో యుద్ధం చేస్తూ

"పాడియు సత్యముం గలుగు పాండు తనూజుల కీవుదొల్లి యె

ప్పాడి మెయిన్ సభం గరము మొనర్చితి ...." ధర్మాన్ని నమ్ముకున్న పాండవులకు ఆనాడు సభలో ఏ న్యాయంతో అంతగా అవమానం కలిగించావు. దాని ఫలితాన్ని నీకు చూపిస్తాను అంటూ ఘటోత్కచుడు దుర్యోధనుని శరీరాన్నంతా బాణాలతో నింపివేశాడు. ఘటోత్కచుని విజృంభన చూసి భీష్ముడు "ఘటోత్కచుడు

దేవతలకు కూడా జయింపరాని వాడు" మీరందరూ వెళ్ళి దుర్యోధనునికి సాయపడండని కౌరవసేనను ఉద్దేశించి చెప్పాడంటే ఘటోత్కచుడు ఎంత శౌర్య పరాక్రమవంతుడో తెలియుచున్నది. కౌరవసేనలను చీల్చిచెండాడుతున్న ఘటోత్కచుని ధాటికి ద్రోణుడాదిగా గల అతిరథ మహారథులంతా ఒకింత చికాకుపడి ఆయుధాలతో ఘటోత్కచుని చుట్టుముట్టారు. అప్పుడు ఘటోత్కచుడు ఆకాశంలోకి ఎగిరి పెడబొబ్బలు పెడుతూ తన మాయాబలంతో కృపాచార్యుడు, అశ్వత్థామ, చిత్రసేన, బృహల్లదుడు, బాహ్లికుడు మొదలగు వీరులను చావబాది వారంతా నెత్తురుకార్చుకుంటూ చచ్చి నేలపై పడుతున్నట్లు మాయలు చేశాడు. అయితే భీష్ముడు అది రాక్షసమాయగా గ్రహించి కౌరవసేనలను హెచ్చరించాడు.

ద్రోణపర్వంలో ఘటోత్కచ వధ గురించి వర్ణించబడింది. పాండవసేనలపై విరుచుకుపడుతున్న కర్ణుడి దాటిని నిలువరించడానికి శ్రీకృష్ణుడు ఘటోత్కచుని పిలిచి **" పాండవ సైన్యముల్ .... తండ్రులకున్ జయంబు పు త్రుండొసగగ గాన్పు మహిరూఢికి నెక్కెదె ...."** కర్ణుడి బాణాల ఘాతాలకు పాండవ సైన్యం పారిపోతున్నది. నీవు నీ భుజదర్పాన్ని, పరాక్రమాన్ని చూపి కర్ణున్ని నిలువరించి, నీ తండ్రులకు విజయం చేకూర్చి కీర్తిగడించు అంటాడు.

కృష్ణుడి ఆజ్ఞతో కర్ణుడితో తలపడడానికి వెళుతున్న ఘటోత్కచునికి మధ్యలో అలంబసుడు అడ్డుపడ్డాడు. అర్జునునికి, ఉలూచికి జన్మించిన ఇరావంతుని అలంబసుడు చంపాడన్న కోపంతో ఘటోత్కచుడు తన రాక్షసమాయలతో అలంబసుడితో భయంకరమైన యుద్ధంచేసి అతడి తలనరికి దుర్యోధనుని రథంపైకి విసిరాడు.

"కొనుమిదె నీ మిత్రుని తల, వినుమిట్టుల మారులేని విక్రమమున గ
ర్ణుని ద్రుంచెద, వరుసంబోరి గొనియెద నిను భీమసేను కొడుక నెఱుగవే" అంటూ ఘటోత్కచుడు తాను భీమసేనుని తనయుడనని, **"నీ తొడలు విరగగొడతానని మా తండ్రి ప్రతిజ్ఞ చేశాడు".** అతడి ప్రతిజ్ఞకు బద్ధుడనై నిన్ను వదలిపెట్టాను. లేకుంటే ఇప్పుడే సంహరించేవాడను అని దుర్యోధనునికి హెచ్చరిక జారీచేసి వెంటనే కర్ణునితో తలపడ్డాడు. ఇద్దరూ రెండు కొండల వలె హెచ్చుతగ్గులు లేకుండా సమాన స్థాయిలో పోరాడారు. ఘటోత్కచుడు మాయాసైన్యాన్ని సృష్టించి ఆకాశం నుండి రాళ్ళవర్షం కురిపించగా, కర్ణుడు ఆ మాయల్ని తిప్పికొట్టి తన దివ్యాస్త్ర బలంతో ఘటోత్కచుని పెక్కురూపాలను నశింపచేశాడు. ఘటోత్కచుడు కర్ణుని కంటే అధికుడై పరాక్రమించగా కౌరవులు ఆశ్చర్యపోతుండగా దుర్యోధనుడు అలాయుధుడిని పిలిచి నీ శత్రువు కొడుకైన ఘటోత్కచుని సంహరింపుమని పంపాడు. అలాయుధుడు, ఘటోత్కచుడు ఇద్దరూ మాయలతో ఘోరమైన యుద్ధంచేసి, చివరకు ఘటోత్కచుడు అలాయుధుని కంఠాన్ని నరికి సింహనాదం చేశాడు. తర్వాత ఘటోత్కచుడు పాండవులు సైన్యాన్ని తన అస్త్రాలతో విచ్ఛిన్నం చేస్తున్న కర్ణునితో యుద్ధానికి తలపడ్డాడు. ఘటోత్కచుడి తిరుగులేని మాయాశక్తి కర్ణుడి దివ్యాస్త్ర శక్తిని అణచివేయగా, కౌరవ సైన్యంలోని వారందరూ భయపడి కర్ణున్ని ఇలా ప్రస్తుతించారు. "ఓ కర్ణా! ఈ ఘటోత్కచుడు మహామాయావి. మనవారిని సంహరించకుండా రక్షించుకోవాలంటే నీవు జీవించియుండాలి. కావున ఇంద్రుడు ప్రసాదించిన 'శక్తి' అనే ఆయుధాన్ని ఘటోత్కచుడి మీద ప్రయోగించు" అని చెప్పారు. ఘటోత్కచుడు కర్ణున్ని చంపడానికి ముందుకు రాగా, కర్ణుడు తనను తాను రక్షించుకునే ప్రయత్నంలో ఆలోచించుకొనే అవకాశం లేక వెంటనే ఇంద్రుడు ప్రసాదించిన శక్తి అనే ఆయుధాన్ని ఘటోత్కచుడిపై ప్రయోగించాడు. ఆ శక్తి అనే ఆయుధం ఘటోత్కచుడి మాయలను భగ్నం చేసి అతని వక్షస్థలాన్ని ఛేదించి వెన్ను నుండి వెలువడి ఆకాశానికి దూసుకుపోయింది.

ఘటోత్కచుడు మరణించగానే కౌరవసైన్యం సంతోషంగా శంఖభేరీలు మ్రోగించారు. పాండవులు మిక్కిలి దైన్యంతో కన్నీరు మున్నీరు అయ్యారు. కాని కృష్ణుడు మాత్రం "సంతోషంతో సింహనాదం చేసి, పాంచజన్యం పూరించాడు. తన చేతిలోని పగ్గాలను రథం నొగలకు కట్టి నృత్యం చేయసాగాడు. అంతటితో ఆగక రథం మీద ఉన్న అర్జునుని చేరి అలింగనం చేసుకొని వెన్ను చరిచాడు" అప్పుడు అర్జునుడు

"చచ్చె ఘటోత్కచుండు మన సైన్యములెల్ల గలంగిన నల్గడన్ .....
... వచ్చి బ్రమోద! మెట్ల గరువంపు .... మహాపురుషా యిది యేమి సెప్పవే"

కృష్ణా! మన ఘటోత్కచుడు మరణించాడు. దానికి కలత చెందిన మన సైన్యం నలుదిక్కులకు పారిపోయింది. దిక్కుతోచక మేమంతా దుఃఖంలో మునిగివుంటే నీవు మాత్రం సంతోషంతో గంతులు వేస్తున్నావు. నీకింత సంతోషం కలగడానికి కారణమేమి? అనగా కృష్ణుడు "కర్ణుడికి "వైకర్తనుడ"నే పేరు ఉంది. అతడు పుట్టినప్పుడే సహజ కవచ కుండలాలతో పుట్టాడు. ఇంద్రుడు బ్రాహ్మణవేషంలో వెళ్ళి అతని కవచకుండలాలను యాచించగా మహోన్నత దానగుణం గల కర్ణుడు కత్తితో తన చర్మం నుండి కవచకుండలాలను కోసి ఇచ్చాడు. కావున అతనిని వైకర్తనుడని పిలుస్తారు. ఇంద్రుడు అతని దాన గుణానికి ఆశ్చర్యపోయి అతని కవచకుండలాలకు ప్రత్యామ్నాయంగా 'శక్తి' అనే ఆయుధాన్ని కర్ణునికి ప్రసాదించాడు. ఆ అస్త్రాన్ని కర్ణుడు కేవలం నీకోసమే దాచాడు. అది నీపై ఎప్పుడు ప్రయోగిస్తాడో అని నాకు నిద్రపట్టేది కాదు. కర్ణుడి నుండి సహజ కవచకుండలాలను నీ తండ్రి వేరుచేయకపోయి ఉన్నింటే ఈ భూమండలంలో నేనుగాని, నీవు గాని కర్ణునికి ఎదురు నిలిచేవారెవ్వరూ లేరు. ఇప్పుడు కర్ణుడి వద్ద శక్తి అనే ఆయుధం కూడా లేకుండా పోయింది. ఇక అతనిని జయించడం చాలా సులభం. అందుకే ఇది నాకు సంతోష సమయం. అర్జునా! నీ కొరకు ఏకలవ్యుడు, శిశుపాలుడు, జరాసంధుడు ... ఇలా ఒక్కొక్కరినే హతమార్చుకుంటూ వచ్చాను. వీరంతా ఎంత ప్రమాదకరమైన వ్యక్తులో ఘటోత్కచుడు కూడా అంతే ప్రమాదకరమైన వ్యక్తి. ధర్మద్వేషి, యజ్ఞయాగాది క్రతువులు అతనికి పడవు. ఒకవేళ అతడు బ్రతికి ఉన్నా అతన్ని సంహరించడానికి నేను ఎంతో శ్రమపడి ఉండాలి. ఇంకోవిధంగా చెప్పాలంటే అతడు మరొక రావణాసురుడు. ఒకే ఘటనతో రెండు ప్రయోజనాలు చేకూరాయి. ఒకటి ఇంద్రుడి శక్తి అనే ఆయుధం పోయింది. రెండు ఘటోత్కచుడు మరణించాడు, ధర్మం నిలబడింది. అందుకే సంతోషంతో నృత్యం చేస్తున్నానని చెప్పాడు.

కురుక్షేత్ర సంగ్రామంలో ఘటోత్కచుడు ఒక మెరుపు. హిడింబ ద్వారా ఘటోత్కచ జననం జరగకపోయి ఉన్నింటే 'శక్తి' అనే అస్త్రం నుండి అర్జునుని తప్పించేవారెవ్వరు? వ్యాసభగవానుడు చెప్పినట్లు ఘటోత్కచుని ద్వారా పాండవులకు శుభం చేకూరింది. ఘటోత్కచుడు ధర్మవైరి అయినా, రాక్షసమాయలు ప్రదర్శించినా పాండవుల తరపున యుద్ధం చేయడం వల్ల అతడు ధర్మంవైపు నిలబడ్డాడు. అందుకే మహాభారతంలో ఘటోత్కచపాత్ర ఒక విశిష్టతను సంతరించుకున్నది.

ముగింపు :

ఆంధ్రమహాభారతంలో గిరిజన పాత్రలుగా ఏకలవ్యుడు, హిడింబ, ఘటోత్కచలు ఒక్కొక్కరు ఒక్కొక్క విలక్షణమైన వ్యక్తిత్వంతో దర్శనమిస్తారు. గురుభక్తిని, గురుతత్వాన్ని, గురుమహిమను, గురువిశిష్టతను, గురుశిష్య సంబంధాన్ని, వాటి గొప్పతనాన్ని, ఉన్నతిని తన వ్యక్తిత్వం ద్వారా సమాజానికి తెలియజెప్పిన పాత్ర ఏకలవ్యుడిది. **"గురవే సర్వలోకానం, భిషజే భవరోగిణాం, నిధయే సర్వ విద్యానాం..."** సర్వ లోకాలకు గురువయిన వాడునూ,

సంసారమనే రోగానికి చికిత్స వంటివాడునూ, సర్వవిద్యలకు నిధి అయిన వాడును అయిన గురువుకు నమస్కారాలు అంటూ దక్షిణామూర్తి శ్లోకాల్లో గురువు విశిష్టతను చెప్పిన విధంగా గురువు అనుగ్రహం ఉంటే ఎంతటి అసాధ్యమైన కార్యం కూడా సుసాధ్యం కాగలదని నిరూపించింది ఏకలవ్యుడి విలువిద్యాపాఠవం. శ్రద్ధాభక్తులు ఉండాలేగానీ గురువు నిరాకారంలో ప్రత్యక్షమై విద్య నేర్పగలడని లోకానికి నిరూపించి చూపిన ఏకలవ్యుడి పాత్ర విద్యార్థి లోకానికి సర్వదా, సర్వత్రా ఆదర్శనీయము.

ఉత్తమ ఇల్లాలికి ఉండాల్సిన అన్ని సలక్షణాలను నిండుగా పుణికిపుచ్చుకున్న పాత్ర హిడింబది. ధైర్యం, సాహసం, సమయస్ఫూర్తి, నీతి, నిజాయితి, స్వచ్ఛమైన మనస్సు, కుటుంబంపట్ల ప్రేమాభిమానాలు, బాధ్యతాయుతమైన నిబద్ధతతో కూడిన నడవడిక వెరసి పాతివ్రత్య మహిమతో మహిళా లోకానికి మార్గం చూపగల హిడింబ పాత్ర అందరికీ స్ఫూర్తిదాయకం. బలపరాక్రమాలకు, ధీరత్వానికి, శూరత్వానికి, మాయలకు మారురూపం ఘటోత్కచ పాత్ర.

మహాభారతంలో ఏ పాత్ర అయినా సమాజానికొక సందేశం, స్ఫూర్తిదాయకం. ద్వాపరం నాటి కథ అయినా అది ఇప్పటికి, ఎప్పటికీ కూడా నిత్యనూతనం. ఎందుకంటే అందులో లేనిది లోకంలో లేదు. లోకంలో ఉన్నదే అందులో ఉంది.

" సర్వేజనా సుఖినో భవంతు "

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రమహాభారతం - (ఆదిపర్వం, భీష్మ, ద్రోణపర్వాలు)
2. యానాది - శ్రీ తిరువీధుల సాంబయ్యగారు
3. బంజార సంస్కృతి - డా॥ కె. ఓబి రెడ్డి

❖❖❖

భారతంలో ప్రేమకథలు

డాక్టర్ మానమ మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై.

ప్రవేశిక :

'భారతంలో లేనిది లోకంలో లేకుండా లేదు. లోకంలో లేనిది భారతంలో లేకుండా లేదు' అని భారతం ప్రశస్తి పొందింది. పంచమవేదమైన మహాభారతం గురించి పండితులు ఇలాగే చెబుతారు. మహాభారతం ఎన్నో రహస్యాలు కలిగిన 'పౌరాణిక' గ్రంథం. హిందువులకు ఎంతో పవిత్ర గ్రంథాలైన "భగవద్గీత", "విష్ణుసహస్రనామస్తోత్రం" కూడా మహాభారతంలోని భాగాలే. దీనిని బట్టి ఈ కావ్య విశిష్టతను అంచనా వేయవచ్చును. ఈ కావ్యవైభవాన్ని గురించి నన్నయ-

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని, । యధ్యాత్మవిదులు వేదాంత మనియు,
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని, । కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని,। యైతిహాసికు లితిహాస మనియుఁ,
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ, । యం బని, మహిఁ గొనియాడుచుండ.

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ । డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీన మై ।పరఁగుచుండఁ జేసి భారతంబు.

(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం - ప్రథమాశ్వాసం, పుట.24)

మహాభారతం భారతీయులకు ఎందుకు ఆదర్శ గ్రంథంగా, గొప్ప గ్రంథంగా వెలుగొందుతోంది అని అనడానికి నన్నయ చెప్పిన ఈ పద్యం చక్కటి సమాధానం. మహాభారతం అంటే కేవలం యుద్ధాలు, పోరాట కథలే కాకుండా మధురమైన ప్రేమ కథలు కోకొల్లలు. మహర్షులు దేవకన్యల ప్రేమలో పడడం, మహారాజులు మునికన్యకలను మోహించడం వంటి గాథలు, చాలా గోచరిస్తాయి. భారతంలో ఒకవైపు ప్రేమ, గౌరవం, ధైర్యం, తెలివి, భక్తి, మొదలైన నీతి కథలు ఉన్నాయి. మరోవైపు ద్రోహం, అవినీతి, రంకుతనం, అన్యాయం మొదలైన కథలు కూడా ఉన్నాయి.

మహాభారతంలో అనేక ప్రేమకథలు ఉన్నాయి. 'ఇవి ప్రేమ కథలు మాత్రమే కాదు. ప్రేమించదగిన కథలు కూడా' వాటిలో కొన్ని ప్రసిద్ధి కెక్కినవి, చాల మందికి తెలిసినవి, ఎవ్వరికీ తెలియని ప్రేమ కథలు కూడా ఉన్నాయి. ఈ వ్యాసంలో 'భారతంలోని ప్రేమ కథలను' పరిశీలించి విశ్లేషించడమే ముఖ్య ఉద్దేశం.

1. ప్రమద్వర - రురువు :

భృగుమహర్షి మనవడు రురువు. గొప్పగా తపస్సు చేసి భృగువంశానికి వన్నె తెచ్చాడు. ఒకసారి 'స్థూలకేశుడి' ఆశ్రమంలో ప్రమద్వర అనే యువతిని చూసి రురువు ఇష్టపడి ఆమెను పెండ్లి చేసుకోవాలనుకుంటాడు. ప్రమద్వర 'మేనక - విశ్వావసు' అనే గంధర్వుడి కూతురు. ప్రమద్వర పుట్టగానే 'స్థూలకేశుడి' ఆశ్రమంలో విడిచిపెడతారు. స్థూలకేశుడు ఆ చిన్నారిని అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశాడు. ఆ ముని ఆశ్రమానికి వచ్చిన రురువు ప్రమద్వర అందానికి ముగ్ధుడై ఆమెను ప్రేమించాడు. ప్రమద్వరను పెండ్లి చేసుకోవడం కోసం స్థూలకేశుడి అనుమతి కోరగా ఆయన కూడా సంతోషంగా అంగీకరించి, వివాహానికి శుభ ముహూర్తం నిర్ణయించాడు. ఇంతలో ఒక రోజు ప్రమద్వర పాము కాటుకు గురై మరణించింది. విషయం తెలిసిన రురువు పిచ్చివాడిలా అడవులు పట్టుకొని తిరుగుతూ 'నేను పుణ్యకార్యాలు చేసిన వాడినే అయితే, సజ్జనుడినే అయితే,

తల్లిదండ్రులను, గురువులను పూజించేవాడినే అయితే, ప్రమద్వరను మనసారా ప్రేమించింది నిజమే అయితే, పునరుజ్జీవితురాలు అవుతుంది.'

చ. అపరిమితాజ్ఞ జేసియు మహాపురుషుల్ విషతత్త్వసంహితా
నిపుణులు మంత్రతంత్రములు నేర్చి విధించియు దీనికిన్ విష
వ్యపగత మైన జీవ మిది వచ్చునుపాయము సేయరొక్కొ నా
తపముఫలంబు నధ్యయనదానఫలంబులు నిత్తు వారికిన్.

(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం - ప్రథమాశ్వాసం, పుట.92)

ఈ పద్యంలో రురుడికి ప్రమద్వర మీద గల నిర్మలమైన ప్రేమ, అనురాగం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఆమెను బ్రతికించడానికి ఎటువంటి త్యాగమైనా చేయడానికి రురువు సిద్ధమయ్యాడు. అప్పుడు ఆ తపశ్శాలితో యమధర్మరాజు 'రురుమహర్షీ! ప్రియురాలి కోసం దు:ఖించింది చాలు'. 'ప్రమద్వర తిరిగి బతకాలంటే నీ ఆయుష్షులో సగం ఆమెకు ధారపోయాలి. అందుకు సమ్మతమేనా?' అని అడిగాడు. రురువు వెంటనే అంగీకరించాడు. రురువు ఆయు: త్యాగంతో ప్రమద్వర బతికింది. వారిద్దరి పెళ్లి కన్నులపండుగగా జరిగింది. ప్రేమించిన వారికోసం ఆయుష్షును ధారపోసిన రురువు నిజమైన ప్రేమకు నిదర్శనం.

2. దమయంతి - నలుడు :

ఒకరోజు నలుడు ఉద్యానవనంలో ఉండగా హంసల గుంపు అక్కడ వాలింది. ఆ హంసలను చూసి ముచ్చట పడి నలుడు వాటిలో ఒకదానిని పట్టుకోగా మిగిలిన హంసలు తోటిహంసను విడిచి వెళ్ళలేక ఆకాశంలో తిరుగుతూ ఉంటాయి. నలుని చేతిలోని హంస మానవభాషలో 'ఓ మహారాజా! నీవు దమయంతిని ప్రేమిస్తున్నావు. నేను దమయంతి వద్దకు వెళ్ళి నీ గురించి, నీ అందచందాల గురించి గుణగణాల గురించి చెప్పి నీమీద అనురాగం కలిగేలా చేస్తాను' అని పలుకగా ఆ హంస పలుకులు విని నలుడు ఆనందపడి, దానిని విడిచిపెట్టాడు. ఇచ్చిన మాట ప్రకారం ఆ హంస విదర్భదేశానికి ఎగిరిపోయింది. అంత:పురం ముందు విహరిస్తున్న హంసను చూసి దమయంతి ముచ్చటపడి చెలికత్తెల సాయంతో ఆ హంసను పట్టుకుంది. ఆ హంస దమయంతితో 'దమయంతీ! నేను నీ హృదయేశ్వరుడైన నలుని వద్ద నుండి వచ్చాను. నలుడు సౌందర్యవంతుడు, సద్గుణసంపన్నుడు. నీవు సౌందర్యంలో, గుణంలో అతనికి తగినదానివని' పలుకగా 'ఓ హంసా! నలుని గురించి నాకు ఎలా చెప్పావో అలాగే నలునికి నా గురించి చెప్పు' అన్నది. ఆ హంస అలాగే చేసింది. ఇలా ఇరువురికి ఒకరిపై ఒకరికి అనురాగం అధికమైంది.

నల దమయంతుల ప్రణయ విషయం దమయంతి చెలికత్తెల ద్వారా తెలుసుకున్న భీమమహారాజు కుమార్తెకు స్వయంవరం ప్రకటించాడు. ఆ ఆహ్వానాన్నందుకున్న రాజులంతా స్వయంవరానికి విచ్చేశారు. నలుడు కూడా స్వయంవరానికి బయలుదేరి వెళ్ళాడు. ఇంద్రుడు స్వయంవర విశేషం తెలిసి దిక్పాలకులతో బయలుదేరాడు. మార్గమధ్యంలో నలుని చూసిన ఇంద్రుడు నలునితో 'నిషధ రాజా! నీవు నాకు దూతగా పనిచేయాలి అన్నాడు'. 'నలుడు అలాగే చేస్తాను. ఇంతకీ మీరెవరు?' నేను మీకేమి చేయాలి?' అని అడిగాడు. ఇంద్రుడు నలునితో 'నేను ఇంద్రుడను. వీరు దిక్పాలకులు. నీవు వెళ్ళి దమయంతికి మా గురించి చెప్పి ఆమె మమ్ములను వరించేలా చేయాలి' అన్నాడు. నలుడు ఇంద్రునితో 'అయ్యా! నీకిది ధర్మమా? నేను అదే పనిమీద వెళ్తున్నాను అన్నాడు. ఇంద్రుడు నలునితో 'నీవు మాకు మాటిచ్చావు కనుక, ఈ కార్యం చేయవలసిందే. ఇది దేవతాకార్యం, నీవు చేయగలవు. మాట తప్పడం ధర్మం కాదు. మా మహిమచేత అంత:పురానికి వెళ్ళడానికి

నీకు ఎవరూ అడ్డు చెప్పరు' అన్నాడు. గత్యంతరం లేక, నలుడు దమయంతి అంత:పురంలో ప్రవేశించాడు. నలుడు దమయంతిని మొదటి సారిగా చూసి, హంస చెప్పినదాని కంటే దమయంతి సౌందర్యవతి అనుకున్నాడు. దమయంతి, ఆమె చెలికత్తెలు నలుని చూసి ఆశ్చర్యపోయారు. దమయంతి నలుని చూసి 'మహాత్మా మీరెవరు? ఎక్కడి నుండి వచ్చారు? ఈ అంత:పురంలో ఎవరికీ కనపడకుండా ఎలా ప్రవేశించారు? అని అడుగగా నలుడు దమయంతితో 'నా పేరు నలుడు నేను దేవదూతగా వచ్చాను. దిక్పాలకులు, వారిలో ఒకరిని వరించమని నీకుచెప్పమని నన్నుపంపారు అన్నాడు. నలుని మాటలకు ఆమె మనసు కష్టపడింది. "అయ్యా! నేను మానవకాంతను. నమస్కరించవలసిన దేవతలను వరించడం ధర్మమా? నాడు హంస చెప్పినది మొదలు, నిన్నే నా భర్తగా తలచుకుంటున్నాను. నా తండ్రి భీమరాజు మిమ్ము ఇక్కడికి రప్పించడానికే స్వయంవరం ప్రకటించాడు. ఓ నలమహారాజా! దయచేసి నాకు భర్తగా ఉండటానికి అంగీకరించండని వేడుకుంటుంది. నీవు నా భర్తగా ఉండటానికి సమ్మతించకపోతే "నీవు దీని కొడంబడనినాఁడు రజ్జు విషాగ్ని జలంబులం బ్రాణ పరిత్యాగంబు సేసికొందు" (ఆంధ్రమహాభారతం, అరణ్యపర్వం – ద్వితీయాశ్వాసం – పుట. 185) కాని ఇతరులను వరించను అని దమయంతి ప్రార్థించింది. నలుడు దమయంతితో 'దమయంతీ! దేవతలు ఐశ్వర్యవంతులు, జరా మరణాలు లేనివారు, వారిని కాదని జరామరణాలకు ఆలవాలమైన నన్ను కోరడం న్యాయమా? అని అన్నాడు.' ఆ మాటలు విని దమయంతి దు:ఖించింది. ఆమె నలునితో 'నేను ఒక ఉపాయం చెప్తాను. అందరిముందు నేను దేవతలను ప్రార్థించి నిన్ను వివాహమాడతాను. అప్పుడు మీకు దేవతల మాట వినలేదన్న దోషం ఉండదు అని చెప్పింది.' దమయంతి మాటలు నలుడు ఇంద్రునికి చెప్పాడు. ఆ మాటలు విని దిక్పాలకులు –

ఆ. 'నలున కాని నలినదళనేత్ర వరియింప
దట్టె చూత' మనుచు నమరవరులు
నలువురును గడంగి నలరూపమున వచ్చి
రా స్వయంవరమున కతిరయమున

(ఆంధ్రమహాభారతం ,అరణ్యపర్వం – ద్వితీయాశ్వసం – పుట. 187)

స్వయంవరమండపంలో ఒకేసారి ఐదుగురు నలులు కనిపించారు. దమయంతి వరమాల పట్టుకుని వచ్చింది. మనస్సులో ధ్యానించి 'దేవతలారా! నలుని గుర్తు పట్టడంలో నాకు సహకరించండి. మీ నిజరూపాలతో ప్రత్యక్షం అవ్వండి' అని ప్రార్థించగా వారు దమయంతిని కరుణించి తమ నిజరూపాలతో ప్రత్యక్షం అయ్యారు. నలదమయంతులకు వైభవంగా వివాహం జరిగింది. ఇంద్రాది దేవతలు అనేక వరాలిచ్చి అనుగ్రహించారు. మహాభారత కథలో ఉపకథగా ప్రత్యక్షమవుతూ ఉండే కథలలో నల, దమయంతుల కథ ఒకటి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు, విలువలకు, ధర్మాలకు అద్దం పట్టే కథ కూడా!.

3. శకుంతల – దుష్యంతుడు :

ఒకసారి దుష్యంతుడు వేటకు వెళ్లినప్పుడు కణ్వమహర్షి ఆశ్రమాన్ని సందర్శించాడు. అక్కడ ఉన్న శకుంతలను చూసి ఆమె సౌందర్యానికి ఆకర్షితుడై ప్రేమలో పడి 'నీ అందమైన రూపం, శరీరకాంతి, నిర్మలమైన గుణాలు అనేవి ఈ నారచీరలు కట్టటానికీ, అడవి పండ్లు తింటూ ఉండటానికీ ఈ గుడిసెలలో నివసించటానికీ తగిన దానివి కావు'.

ఉ. ఈ మునిపల్లె నుండు టిది యేల కరం బనురాగ మొప్పఁగా
భామిని! నాకు భార్య వయి భాసురలీల నశేషరాజ్య ల
క్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందితేందుపా
దామలతుంగహర్మ్యముల హారిహిరణ్మయ కుట్టిమంబులన్.

(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం - చతుర్థాశ్వాసం - పుట.330)

పెండ్లి అయిన తరువాత క్రమంగా పొందే ఉన్నత స్థితిని స్ఫురింపచేస్తున్నట్లు పలికి ఆమెను గాంధర్వ వివాహపద్ధతిలో పెండ్లాడటం సమంజసం సుమా! అని దుష్యంతుడు చెప్పాడు. శకుంతల సిగ్గుతో తలవంచుకొని రాజా! నా తండ్రి కణ్వమహర్షి ఇంతలోనే వస్తారు. వారు వచ్చి నీకు భార్యగా కన్యాదానం చేస్తే నన్ను పెండ్లి చేసుకో అంది. దుష్యంతుడు గాంధర్వ వివాహం ప్రవర్తిల్లే పద్ధతిని చెప్పి శకుంతలను ఒప్పించాడు. అప్పుడామె దుష్యంతుడితో ఈ విధంగా అన్నది.

చ. నరనుత! నీ ప్రసాదమున నా కుదయించిన నందనున్ మహీ
గురుతర యౌవరాజ్యమునకున్ దయతో నభిషిక్తుఁ జేయఁగా
వరము ప్రసన్నబుద్ధి ననవద్యముగా దయసేయు నెమ్మితో
నిరుపమకీర్తి! యట్లయిన నీకును నాకును సంగమం బగున్.

(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం - చతుర్థాశ్వాసం - పుట.333)

శకుంతల తల్లిదండ్రుల వలన తనకు కలిగిన అన్యాయం తన సంతతికి జరగకూడదని ముందే జాగ్రత్తపడి తన లోకజ్ఞతను ప్రదర్శించి అంగీకరించింది. అప్పటికి ఆశ్రమంలో కణ్వమహర్షి లేకపోవడంతో మళ్ళీ వచ్చి ఆయన ఆశీస్సులు తీసుకుని, శకుంతలను తీసుకెళతానని చెప్పి రాజ్యానికి వెళ్ళిపోయాడు. అప్పటికే ఆమె గర్భవతి. ఇది జరిగిన తర్వాత దుర్వాసముని శాపంతో దుష్యంతుడు శకుంతలను వివాహం చేసుకున్న విషయం మరచిపోయాడు. ఈ క్రమంలో ఓ బిడ్డకు జన్మనిచ్చిన శకుంతల అతడికి భరతుడు అని పేరు పెట్టింది. కొంతకాలం కణ్వమహర్షి ఆశ్రమంలోనే గడిపి, భరతుడిని తీసుకుని దుష్యంతుని వద్దకు వెళ్లింది.

అయితే శాప ప్రభావంతో వారిని తన భార్యాబిడ్డలుగా దుష్యంతుడు అంగీకరించలేదు. అదే సమయంలో శకుంతలకు కానుకగా ఇచ్చిన ఉంగరం దొరకడంతో గతం గుర్తొచ్చి ఆమెను తన భార్యగా స్వీకరించాడు.

4. గాంధారి - ధృతరాష్ట్రుడు :

వీరి ప్రేమ కథ వివాహం తర్వాత ప్రారంభమయింది. గాంధారి, అతనిని కలుసుకున్న తరువాతే అతను గుడ్డివాడు అన్న విషయం తెలిసింది. ఆ తరువాతే ఆమె తన భర్త దృష్టిలేక ఆనందించటం లేదు. కాబట్టి "ఆ మహాపతివ్రత పరపురుషులను చూడటానికి ఇష్టపడక భర్తకు కళ్ళు లేవు కనుక తాను కూడా కళ్ళకు అడ్డంగా గుడ్డకట్టుకొన్నది." (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం. ఆశ్వాసం-5, పుట.424) ఆనందాన్ని త్యజించింది. ఆమె వైవాహిక జీవితం మొత్తం స్వచ్ఛందంగా ఆమె కళ్లకు గుడ్డ కట్టుకుని గడిపింది.

5. ఉలూచి - అర్జున :

ఉలూచి ఒక నాగ యువరాణి. ఐరావత వంశంలో పుట్టిన కౌరవ్యువుని కూతురు. ఆమె అర్జునుని అందానికి ముగ్ధురాలై అపహరించి నాగపురానికి తీసుకెళ్లి తన మెడలో ప్రేమతో ఉంచగా 'బ్రహ్మచర్య వ్రత నియమంలో ఉండగా నేను ఇప్పుడు నీ కోరికను ఏ విధంగా నెరవేర్చగలనని' అర్జునుడు పలుకగా! "ఉలూచి తలవంచి అర్జునుడిని చూచి 'ద్రౌపది విషయంలో మీరు చేసిన ప్రతిజ్ఞ మీ తీర్థయాత్రకారణం, మీ

వ్రతం తెలియని దాన్ని కాను. అన్ని తీర్థాలు సేవించటం, అన్ని వ్రతాలు సలపటం, అన్ని దానాలు, ధర్మకర్మలు చేయటం. ప్రాణదానంతో సమానం కావు. నా కోర్కె నెరవేరకుంటే మన్మథాగ్నిలో ప్రాణం వదలటం జరుగుతుంది. కాబట్టి నన్ను రక్షించు. దీనివలన నీకు వ్రతభంగం కాదు' అనగా అర్జునుడు ఉలూచి కోరిక తీర్చి ఆ రాత్రి నాగలోకంలో గడిపి ఆమెయందు సద్యోగర్భంలో ఇరావంతుడు అనే కొడుకును పొంది, సూర్యోదయంకాగానే గంగాద్వారానికి వచ్చి, జరిగిన వృత్తాంతమంతా తనకు తోడుగాఉన్న బ్రాహ్మణులకు చెప్పి, వాళ్ళకు హృదయానందం కలిగిస్తూ (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం-8, పుట.821) తీర్థయాత్రలకు వెళ్తాడు. ఆమె అర్జునునికి 'నీటిలో ఉండగా ఎటువంటి హాని జరగదు' అని ఒక వరం కూడా ఇచ్చింది.

6. చిత్రాంగద - అర్జునుడు :

చిత్రాంగద, మణిపూర్ యువరాణి. కావేరి నది ఒడ్డున ఉన్న మణిపూర్కు రాజు చిత్రవాహన ఉండగా, అర్జునుడు దీనిని సందర్శించాడు. అతని కుమార్తె చిత్రాంగద. చాలా అందమైనది. చూపు తిప్పుకోలేనంతటి సౌందర్యవతి అయిన చిత్రాంగద ప్రేమలో పడ్డాడు. ఆమెను వివాహం చేసుకుంటానని ఆమె తండ్రిని అడుగగా, ఆమె తండ్రి 'వారి పిల్లలు మణిపూర్లో పెరగాలని మరియు సింహాసనం అధిష్టించాలని షరతు పెట్టగా అర్జునుడు అంగీకరించాడు. బబ్రువాహనుడు జన్మించిన తరువాత, అర్జునుడు భార్యను, కొడుకును వదిలి తీర్థయాత్రలు కొనసాగించి సోదరులతో కలుసుకున్నాడు. "తన గర్భాన అర్జునుని పోలిన మహావీరుడు పుట్టాడని తృప్తితో ఆనందంతో అర్జునునికి వీడ్కోలు చెప్పింది చిత్రాంగద" (భారతంలో ప్రేమ కథలు, పుట.132) చిత్రవాహనుడి మరణం తరువాత, బబ్రువాహనుడు మణిపూర్ రాజ్యానికి రాజయ్యాడు. మహాభారత యుద్ధం తరువాత తన కుమారుడు బబ్రువాహనుడి చేతిలో అర్జునుడు పరాజయం పొందాడు.

7. మత్స్యగంధి - పరాశరుడు :

పరాశరుడు తపోశక్తి ద్వారా అనేక యోగ శక్తులను పొందిన గొప్ప ఋషి. మత్స్యగంధి మత్స్యకారుడైన దాశరాజు కుమార్తె. ఆమె పడవలో ప్రజలను యమునా నదిని దాటిస్తుండేది. ఒక రోజు ఆమె పడవలో పరాశరమహర్షిని దాటిస్తున్న సమయంలో మహర్షి ఆమె రూపానికి ఆకర్షితుడై కోరికను వ్యక్తంచేశాడు. మత్స్యగంధి మహర్షికి మూడు షరతులు పెట్టింది. '1.మన సంగమం ఎవరికీ కనిపించకూడదు. పరాశరుడు వారిద్దరి చుట్టూ ఒక కృత్రిమ పొగమంచు రూపొందించాడు. 2. తన కన్యత్వం చెక్కుచెదరకుండా ఉండాలి. పరాశరుడు ఆమెకు, జన్మనిచ్చిన తర్వాత కూడా ఆమె కన్యగానే ఉంటుందని హామీ ఇచ్చాడు. 3. ఆమె శరీరం నుండి వచ్చే చేపల వాసన బదులు సుగంధ భరిత వాసన రావాలని కోరుకున్నది. పరాశరుడు ఆమె శరీరం నుండి యోజన (ఎనిమిది మైళ్ళు) దూరం వరకు ఒక దివ్య వాసన వస్తుందని' వాగ్దానం చేశాడు. ఆ యోజన గంధి సంగమం వలన ఒక గొప్ప వ్యక్తి జన్మకు కారణమౌతుందని మహర్షి తెలిపాడు. వేదవ్యాస మహర్షికి జన్మనిచ్చింది.

8. యోజనగంధి - శంతనుడు :

యోజన పరిమళం శంతనుడిని ఆకర్షించింది. యోజనగంధి పడవలో కూర్చొని ఉండటం చూశాడు. అతను పడవలోకి ఎక్కి 'నదిని దాటించమని యోజన గంధిని కోరి ఆవలి ఒడ్డుకు చేరుకున్న తరువాత తిరిగి పడవలోకి ఎక్కి అవతలి ఒడ్డుకు చేర్చమని కోరాడు'. ఆ విధంగా ఆ రోజు సంధ్యాసమయం వరకు కొనసాగింది. ఇలా కొంతకాలం కొనసాగింది. చివరగా, 'శంతనుడు వివాహం చేసుకోమని' కోరాడు. తన అంగీకారం తెలిపింది. కానీ ఆమె తండ్రి నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పింది. ఆమె తండ్రి పెట్టిన షరతులు విని శంతనుడు నిరాశ చెందాడు. "దాశరాజు చేత తిరస్కృతుడైన శంతనుడు నిరాశతో రాజ్యానికి తిరిగి వచ్చాడు.

సత్యవతికి కన్నీళ్ళాగలేదు. తనను ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకోవద్దని తండ్రి కోరిక ఆమెను బాధించింది" (భారతంలో ప్రేమ కథలు, పుట.100) ఆ షరతులు తీర్చలేని శంతనుడు నిరాశతో తన దు:ఖ గృహంలో చేరాడు. గంగాశంతనుని కుమారుడు శాంతనుడు (దేవవ్రతుడు) తండ్రి కోరికను నెరవేర్చడానికీ భీష్మ ప్రతిజ్ఞ చేశాడు. శంతన మహారాజు భార్యయై సత్యవతిగా ఖ్యాతికెక్కి కురు వంశాభివృద్ధికి పాటుపడింది.

9. సుభద్ర - అర్జునుడు :

అజ్ఞాతవాసం తరువాత, అర్జునుడు ద్వారకకు చేరి సుభద్ర మందిరానికి ఆహ్వానించబడ్డాడు. ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. అయితే ఇందుకు ఆమె పెద్దన్నయ్య బలరాముడు ఒప్పుకోడు. తన శిష్యుడైన దుర్యోధనునికిచ్చి పెండ్లి చేయాలని చూశాడు. అయితే శ్రీకృష్ణుడు సోదరి ఇష్టప్రకారం అర్జునునికి ఇచ్చి పెళ్లిచేస్తాడు. వివాహం చేసుకునేందుకు సుభద్రను అపహరించి తీసుకెళ్లాని అర్జునునికి సూచించి తదనంతరం వెనకనుండి నడిపిస్తాడు. సుభద్ర ద్రౌపదిని కలిసినప్పుడు ఆమె అర్జునుడితో ఆమె వివాహం గురించి వెంటనే చెప్పలేదు. వారు స్నేహపూర్వకంగా కలిసినా కొంత సమాయాన్ని వెచ్చించి ద్రౌపదికి వివాహ విషయం గురించి చెప్పింది. ఆమె కూడా అంగీకరించింది. వీరిద్దరికి పుట్టిన వీరుడే అభిమన్యుడు.

10. హిడింబ - భీముడు :

భీముడు కుంతి కుమారుడు. హిడింబ నరభక్షకురాలు. ఆమె భీముడితో ప్రేమలో పడి సుగుణవతిగా మారిపోతుంది. అదే ఆమెలో ప్రతిదీ మార్పును తెచ్చింది. "హిడింబ ధర్మజునికి, కుంతీదేవికి మ్రొక్కి ఏకాంతంలో కుంతితో "అమ్మా! సర్వ ప్రాణులకు కామవాంచ సమానమే. అయినా స్త్రీల విషయంలో ఇది ఓర్చుకొనరానిదై ఉంటుంది. నేను భీముని మీద మనసుపడి బంధువులను, స్నేహితులను వదలుకొన్నాను. నా కోరికను మీరు తీర్చకుంటే ప్రాణాలు విడుస్తాను. నన్ను రక్షిస్తే మీకిష్టమైన వాటిని చేస్తాను. మీకు మార్గం అనుకూలంగా లేనప్పుడు మీరు కోరిన చోట్లకు మిమ్మల్ని ఎత్తుకొని పోయి చేర్చగలను. భూతభవిష్యద్వర్తమానాలను ఎరిగి చెప్పగలను."(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం - 6, పుట.614,615) అని చెప్పి ధర్మరాజు కుంతీ అనుమతితో భీముని వివాహమాడింది. వారు పరిమితమైన కాలం మాత్రమే కలిసి జీవించారు. కొన్నాళ్ళ తరువాత భీముడు ఆమెను వదిలి వెళ్లాడు. హిడింబ ఘటోత్కచుడుకి జన్మనిచ్చి, విచారించకుండా ఒంటరిగా అతనిని సంరక్షించింది.

11. అంబ - సాళ్వుడు :

కాశీరాజుకు ముగ్గురు కుమార్తెలు. అంబ అందరిలోకి పెద్దది. సాళ్వుని ప్రేమించింది. ఈ విషయం తండ్రి కూడా వీళ్ళ ప్రేమ ఆంగీకారం. అంబిక, అంబాలిక ఈమెకు చెల్లెళ్ళు. పెళ్ళివయసు రావడంతో స్వయంవరం ప్రకటించాడు కాశీరాజు. స్వయంవరానికి దేశదేశాధిపతులతో పాటు భీష్ముడు కూడా వచ్చాడు. స్వయంవరంలో వయసు మీదపడిన భీష్ముని ముగ్గురు అక్క చెల్లెళ్ళూ వరించలేదు. భీష్ముడు బలవంతంగా అక్క చెల్లెళ్ళను ఎత్తుకుపోతుంటే ఎదురు తిరిగిన వాళ్ళు ఎదురు నిలవలేకపోయారు. మార్గమధ్యంలో సోబల దేశపు రాజైన సాళ్వుడు అడ్డుపడి యుద్ధం చేసి ఓడిపోయి తన రాజ్యం చేరుకున్నాడు. పినతల్లి కొడుకైన విచిత్రవీరునికి అంబ, అంబిక, అంబాలికలను ఇచ్చి పెళ్ళాడమన్నాడు. అంబ-

ఆ. పరఁగ నన్ను సాల్వపతి వరియించినఁ
దండ్రిచేతఁ బూర్వదత్త నైతి
నమ్మహీశునకు నయంబున నెయ్యది
ధర్మ మెఱిఁగి దానిఁ దలఁపు మిపుడు (ఆంధ్రమభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం-4, పుట.393)

తను సాళ్వరాజుకు మనసిచ్చానని నీతితో నిర్ణయించమని చప్పడంతో అతని దగ్గరకే వెళ్ళిపొమ్మని పంపించేసాడు. అంబ సాళ్వరాజు దగ్గరకు ఎంతో ఆశగా వెళ్ళి పెళ్ళాడుకుందామంది. సాళ్వుడు ఒప్పుకోలేదు. "అందరూ చూస్తుండగా భీష్ముడు నిన్ను ఎత్తుకుపోయాడు. ఇంక నిన్ను భార్యగా ఎలా స్వీకరించను?" ఎదురు ప్రశ్నించాడు. బతిమాలినా వినకుండా తిప్పిపంపించాడు. "సాల్వుడు తనను తిరస్కరించినా తన ప్రియుడే" (భారతంలో ప్రేమకథలు, ముక్తేవిభారతి, పుట.105) అంబ తిరిగి వచ్చి భీష్మునికి జరిగింది చెప్పింది. విచిత్రవీర్యుని పెళ్ళాడమన్నాడు భీష్ముడు. విచిత్ర వీర్యుడూ 'వేరొకరిని ప్రేమించిన మనిషిని యెలా పెళ్ళాడగలనని ఖచ్చితంగా చెప్పాడు.' అంబ దిక్కుతోచని స్థితిలో భీష్మున్నే పెళ్ళాడమని కోరింది. అర్థించింది. 'బ్రహ్మచారిగా ఉంటానని తను చేసిన ప్రతిజ్ఞను గుర్తుచేసాడు. మాట తప్పలేనన్నాడు. మనువాడలేనన్నాడు. సాళ్వరాజునే ఒప్పించమని సలహాయిచ్చాడు.' అంబకు ఏదారీ కనపడలేదు. భీష్ముని దారికి తెచ్చుకొనే దారీ కనపడలేదు. సాళ్వరాజు దగ్గరకు వెళ్ళి అర్థించింది. ప్రాథేయపడింది. కాని అతను తిరస్కరించాడు. యవ్వనంలో ఉన్న అంబ దిగులుతో, దు:ఖంతో ఆశలారిపోయి అవమానాన్ని తట్టుకోలేకపోయింది. వేదనతో జీవితాన్ని వ్యర్థంగా భావించింది. తన దీన స్థితికి భీష్ముడే కారణమని భావించింది. అవమానం స్థానంలో ఆగ్రహం, వేదన స్థానంలో పంతం వచ్చి చేరింది. దేశ దేశాల రాజుల దగ్గరకు వెళ్ళి మొర పెట్టుకున్న ఫలితం లేకపోయింది. చివరకు అడవులకు పోయి ఘోరమైన తపస్సు చేసింది.

కుమారస్వామిని ప్రసన్నం చేసుకొని తామరపూల మాలను వరంగా పొందింది. ఆ మాల ధరించిన వారిచేతిలో భీష్మ అపజయాన్ని పొందుతాడని అనుగ్రహం తీసుకుంది. ఆ మాల తీసుకొని రాజులందరి దగ్గరకు వెళ్ళింది. భీష్మునితో యుద్ధానికి సాహసించలేక ఆ మాలనెవరూ స్వీకరించలేదు. పాంచాల రాజైన ద్రుపదుడు కూడా తన వల్ల కాదన్నాడు. దాంతో అంబ ఆ మాలను ద్రుపదుని కోట సింహద్వారానికి తగిలించి అడవులకు చేరింది. మునుల సలహామేరకు పరశురాముణ్ని కలిసింది. ఆమె మొర విని అభయమిస్తూ పరశు రాముడు అంబకేసి చూస్తూ "సాళ్వునిపై పగ సాధించాలా, భీష్ముడిపై పగ సాధించాలా!" అని రెట్టించాడు. "భీష్ముని పైననే. భీష్ముని పైననే పగ సాధించాలి. ఎన్ని జన్మలెత్తినా భీష్ముని పైననే నా పగ!" (భారతంలో ప్రేమ కథలు, ముక్తేవి భారతి, పుట.105) అయితే భీష్ముడు అతని శిష్యుడే. గురుశిష్యుల యుద్ధంతో దేవతలు భయపడిపోయి శాంతించమని కోరారు. విజయం ఎవరినీ వరించలేదు. అంబ కోరిక నెరవేరలేదు. అంబలోని అలజడీ తగ్గలేదు. మొండి పట్టుదలతో శివుడి గురించి ఘోర తపస్సు చేసింది. శివుడు 'ఈ జన్మలో భీష్ముణ్ని జయించలేకపోయినా మరో జన్మలో నీవల్లే భీష్ముడు మరణిస్తాడని వరమిచ్చాడు'. అక్కడితో అంబ ఆగలేదు. చితిలోకి దూకి ప్రాణాలు విడిచింది. ద్రుపదుని ఇంట కూతురుగా పుట్టి, కొడుకుగా పెరిగి, శిఖండిగా మారి అనుకున్నది సాధించింది.

12. తపతి - సంవరణుడు :

తపతి సూర్యుని కూతురు. మహా సౌందర్యవతి. గుణవతి. 'అజామీఢుని' కొడుకు పేరు సంవరణుడు. ఒకరోజు సంవరణుడు అడవికి వేటకు వెళ్లి తిరుగుతూ అలసిపోయి తపతిని చూసి ఆమె సౌందర్యానికి

ముగ్ధుడై ఆమెను మోహించాడు. ఆమెను 'బాలా.... ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు' అని అడిగాడు. కానీ ఆమె బదులు చెప్పకుండా వెళ్ళిపోయింది. సంవరణుడు మోహంతో పిచ్చోడిలాగా ఆమె కోసం వెతికాడు. తపతి కూడా సంవరణుని మోహించింది.తపతి సంవరుణుడికి కనిపించింది. సంవరణుడు తపతిని గాంధర్వ వివాహం చేసుకుంటానని చెప్పాడు. అందుకు ఆమె "నేను సూర్యుని కుమార్తెను, సావిత్రికి చెల్లిని, నాకు స్వాతంత్ర్యం లేదు. నీకు నాపై ప్రేమ ఉంటే నా తండ్రిని అడుగు. మన పెళ్లి జరుగుతుందని చెప్పి వెళ్లిపోయింది. అప్పటినుండి సంవరణుడు అక్కడే ఉండి పట్టుదలతో సూర్యుని ఆరాధిస్తున్నాడు." (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం-7, పుట.679) ఒకరోజు వశిష్టుడు తనశిష్యుడు సంవరణుని దగ్గరకు వచ్చి అతని బాధను తెలుసుకొని వెంటనే సూర్యుని వద్దకు వెళ్ళి' 'పురువంశజుడు, ధర్మపరుడు, సద్గుణ సంపన్నుడు అయిన సంవరణుడు నీకుమార్తె తపతిని చూసి మోహించాడు. నువ్వు నీకుమార్తెను అతనికిచ్చి వివాహం చేయాలని చెప్పాడు.' సూర్యుడు కూడా తన కోరిక తీరబోతున్నందుకు సంతోషించాడు. సూర్యుడు 'సంవరణుడే తన కూతురికి తగిన భర్త' అనుకొని తపతిని వశిష్టునితో పంపగా వశిష్టుడు తపతికి, సంవరణునికి వివాహం జరిపించాడు.

13. దేవయాని - కచుడు :

మృతసంజీవని విద్య నేర్చుకోవడానికి "దుహతృస్నేహంబు జేసి, నీ నేర్పువిధంబున దాని చిత్తంబు వడిసి శుక్రు నారాధించిన నీ కిష్టసిద్ధి యగు"నని (ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం-3, పుట.267) దేవతలు ప్రార్థనను కచుడు తూ.చ తప్పక పాటించాడు. తండ్రి దగ్గర శిష్యరికం కోసం వచ్చాడని దేవయాని నమ్మింది. తొలిచూపుతోనే ఇష్టపడింది. శిష్యునిగా కచుణ్ణి స్వీకరించమని తండ్రిని కోరింది. కచుని ప్రేమించింది. అతను లేనిదే జీవితం లేదనుకుంటుంది. అందుకే కచుడు కనిపించక పోయేసరికి-

ఉ. వాఁడిమయూఖముల్ గలుగువాఁ డపరాంబుధిఁ గ్రుంకె, ధేనువుల్
నేఁ డిట వచ్చె నేకతమ, నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁ బడియెఁ, బ్రొద్దును బోయెఁ, గచుండు నేనియున్
రాఁడు, వనంబులోన మృగరాక్షసపన్నగబాధ నొందెనో!

(ఆంధ్రమభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం-3, పుట.249)

ఇలా అడవిలో ఏమైపోయాడో ఏమో అని ఆందోళన పడింది. దేవయానికి సకల భోగాలు ఉన్నప్పటికీ వాటన్నిటికంటే కచుడే ఆత్మీయుడుగా, మనసు కోరేవాడుగా అనిపించాడు. పువ్వులు తేవడానికి అడవికి వెళ్లిన కచుడిని చంపి అతడి రూపులేకుండా కాల్చి బూడిద చేసి, ఆ బూడిదను మద్యంతో కలిపి శుక్రుడు త్రాగేటట్లు రాక్షసులు చేశారు'. ఆ విషయాన్ని శుక్రుడు దేవయానితో చెప్పగా ఆమె దు:ఖంతో కుమిలిపోయింది. 'సంజీవని విద్య గొప్పతనాన్ని ఆలోచించక రాక్షసులు ఆ కచుడితో వైరంపూని చంపారు'. దీనికి దు:ఖించడం ఎందుకు అని చెప్పిన శుక్రునితో దేవయాని-

మ. మతిలోకోత్తరుఁడైన యంగిరసుమన్మం, డాశ్రితుం, డాబృహ
స్పతికింబుత్రుఁడు, మీకు శిష్యుడు, సురూప బ్రహ్మచార్యశ్రమ
వ్రత సంపన్నుఁ, డకారణంబ దనుజవ్యాపాదితుం డైన న
చ్యుతధర్మజ్ఞ! మహాత్మ! యక్కచున కే శోకింప కెట్లుండుదున్?

(ఆంధ్రమహాభారతం, ఆదిపర్వం, ఆశ్వాసం-3, పుట.252)

అని తండ్రి మీద ఒత్తిడి తెచ్చింది.

పెళ్లి చేసుకోవడానికి కచునికి కావలసిన అర్హతలు చెప్పి తండ్రిని ఆలోచింప చేసి మృత సంజీవని విద్య ద్వారా కచుడు పునర్జీవించేలా చేసింది. ఒకసారి కాదు, మూడుసార్లు! చివరికి తండ్రి చనిపోతాడని తెలిసి - కచునికి ఆ విద్య నేర్పి తిరిగి తన ద్వారా తండ్రిని బతికించేలా చేయవచ్చని నమ్మింది. కచుడు కూడా శుక్రుని బ్రతికించాడు. దేవయాని తన ప్రేమను వ్యక్తం చేసింది. కచుడు గురుపుత్రివి, సోదరివి అని దేవయాని ప్రేమను తిరస్కరించడంతో 'నువ్వు నేర్చుకున్న విద్య నీకు పనికి రాకుండా పోవుగాక! అని శపించింది.' 'నా ద్వారా ఆ విద్య ఫలిస్తుంది అని కచుడు' చెప్పాడు. 'బ్రాహ్మణ కన్యవైనా బ్రాహ్మణుని పెళ్ళాడకుండుగాక! అని కచుని ద్వారా ప్రతిశాపం పొందింది.'

14. పులోమ - భృగువు :

పులోమ అతిలోక సౌందర్యవతి. ఆమె సౌందర్యానికి ఆకర్షితుడైన "పులోముడు" అనే దైత్యుడు, పులోమను వివాహం చేసుకోవాలని సంకల్పించి, తన మనోరథాన్ని పులోమ తండ్రికి తెలిపాడు. పులోముడు కశ్యప ప్రజాపతి కుమారుడైనప్పటికీ రాక్షసప్రవృత్తి కలవాడగుటచేత, పులోమను అతనికిచ్చి వివాహం చెయ్యడానికి ఆమె తండ్రి నిరాకరించాడు. అప్పటి నుండి పులోమునికి పులోమ మీద వ్యామోహం అలాగే ఉండిపోయింది. ఈ విషయాలేమీ పులోమకు తెలియవు. ఆ తర్వాత పులోమ వివాహం భృగుమహర్షితో జరిగిపోయింది. పులోమ భృగుమహర్షి సేవలో ఆదర్శమయ, అన్యోన్యానురాగ వైవాహిక జీవితాన్ని అనుభవిస్తోంది. వారిరువురి దాంపత్య సంసార మథనంలో పులోమ గర్భవతి అయింది.

"ఒకనాటి తన ఓటమి ఈనాటి ఆమె సౌందర్యం రాక్షసుడిని మరీ రాక్షసుణ్ణి చేశాయి. అగ్ని గృహంలో ఓ మూలగా ఒదిగి ఉన్న పులోమిని సమీపించాడు. వరాహంగా మారి ఆమెను నెత్తిన పెట్టుకొని వేగంగా పరుగు తీశాడు రాక్షసుడు. ఈ హఠాత్సంఘటనతో పులోమికి గర్భచ్యుతి కలిగింది. "కానీ విచిత్రం! ఆ గర్భచ్యుత శిశువు మహా తేజోరాశి! ఆ కాంతిని నిశాచరుని కళ్ళు చూడలేకపోయారు. ఆ కాంతి జ్వాలల్లో ఆ క్షణంలో భస్మీభూతుడయ్యాడు రాక్షసుడు." (భారతంలో ప్రేమ కథలు, పుట.12) బిడ్డను తీసుకొని ఆశ్రమంలోకి పులోమి ప్రవేశించింది.

స్నానం చేసి ఆశ్రమంలోకి వచ్చిన భృగుమహర్షి పులోమి ఒడిలోని పసిబిడ్డను చూసి చాలా ఆనందపడ్డాడు. తనకు ధర్మపత్ని పులోమి కావటం తన అదృష్టం అనుకుంటూ బిడ్డని చేతిలోకి తీసుకుని ఆనందించాడు. జరిగిన విషయాన్ని తెలుసుకుని అగ్నిదేవున్ని క్షమించలేక 'సర్వభక్షకుడివి కమ్మని' శపించాడు. ధర్మపత్నిపట్ల అతనికి ఉన్న ప్రేమ అలాంటిది. "నీ మీది ప్రేమతోనే ఆ శాపం ఇచ్చాను. కానీ ఆ శాపం లోకకళ్యాణానికి దారితీస్తుందన్నాడు. అయినా నా భార్యకు ఆపద కలిగిస్తే ఎవరినైనా క్షమించను. ఎవరైనా శాపగ్రస్తులు కావలసిందే! నా ప్రియ పత్నికోసం నేను ఏమైనా చేయగలను" (భారతంలో ప్రేమ కథలు, పుట.12,13).

15. ద్రౌపది - పాండవులు :

ద్రౌపది అనుకోని పరిస్థితుల్లో అయిదుగురు పాండవ సోదరులందరిని పెళ్లాడినా వారిలో ప్రతి ఒక్కరికీ తన ప్రేమను అందించింది. ఆమె వారందరి పట్ల తన బాధ్యత, ప్రేమ ఒకేరకంగా చూపగలగడం గొప్ప విషయం. ఆమె ప్రతి భర్తపట్ల ప్రధాన నిబద్ధతను నిర్వహిస్తూ వచ్చింది. అది మాత్రమే కాదు, సోదరులందరూ ద్రౌపదిపట్ల న్యాయం చేయాలని విశ్వాసం కలిగి ఉన్నారు.

16. భానుమతి - దుర్యోధనుడు :

మహాభారతంలో భానుమతి - దుర్యోధనుడి వాహం ప్రత్యేకమైంది. భానుమతి కాంబోజ రాజు చంద్రవర్మ కూమార్తె. ఎంతో సౌందర్యవతి, ప్రతిభావంతురాలు. ఆమె స్వయంవరానికి జరాసంధుడు. శిశుపాలుడు, రుక్మీలతో సహా దుర్యోధనుడు కూడా వెళ్తాడు. జయమాల ఎవరిమెడలో వేస్తే అతడు ఆమె భర్తగా మారతాడు. అయితే భానుమతి జయమాలను తీసుకొని ముందుకు నడుస్తుండగా.... దుర్యోధనుడు ఆమెను అడ్డుకొని బలవంతంగా తన మెడలో వేసేలా ప్రేరేపిస్తాడు. ఈ విధంగా భానుమతి దుర్యోధనునికి భార్య అవుతుంది.

17. జరత్కారిని - జరత్కారువు :

ఇద్దరి పేర్లు ఒకటే అని తెలుసుకున్నాక జరత్కారుడు వివాహానికి ఒక షరతుతో అంగీకరించాడు. ఆ షరతు ఏమిటి అంటే 'తనకు అయిష్టమైన పని గనుక తన భార్య చేస్తే మరుక్షణమే భార్యను వదలి వేస్తాను' అని చెప్పి వాసుకి సోదరి జరత్కారినిని భార్యగా స్వీకరిస్తాడు. భర్త షరత్తు బాధాకరమైనా తన బ్రతుకు భర్త ఆధీనం కనుక భగవంతుని ప్రార్థిస్తూ, జరత్కారి భర్తకు పరిచర్యలు చేస్తూ కాలం గడుపుతూ ఉంటుంది. ఒకనాడు జరత్కారుడు మధ్యాహ్న భోజనానంతరం భార్య ఒడిలో తలపెట్టుకొని నిద్రిస్తూ ఉండగా సాయం సంధ్య విధులను నిర్వర్తించే సమయం ఆసన్నమయింది. నిద్రిస్తున్న భర్తను లేపాలా వద్దా? అన్న మీమాంసలో చాలాసేపు ఆలోచించి వేళ మించిపోతుంది కాబట్టి భర్తను లేపి 'స్వామి సాయంసంధ్యవేళ అవుతుంది అని లేపింది.' నిద్ర లేచిన జరత్కారుడు ఉగ్రుడై 'చనువు ఇచ్చాను కదా అని నెత్తికెక్కుతున్నావు ఆడదాని చేత ధర్మ పన్నాలు చెప్పించుకొనే స్థితిలో ఈ జరత్కారుడు లేడు. నా మాట తప్పినందులకు గాను అన్నమాట ప్రకారం ఈ క్షణమే నిన్ను వదలి వేస్తున్నాను. ఇంక నీవు నీ సోదరుని దగ్గరకు పో' అని లేచాడు.

జరత్కారి భర్తను కాళ్లావేళ్లా బ్రతిమాలింది. అయినా ఫలితం లేకపోయింది. జరత్కారుడు భార్యతో 'ఇదంతా దైవేచ్ఛ. ధర్మం కోసం బ్రహ్మచర్యాన్ని విడిచిపెట్టానే తప్ప శారీరక సుఖం కోసం కాదు.' 'నేను ఒక మాట అంటే ఆచరించటమే నా లక్ష్యం.' 'నీ గర్భంలో సాక్షాత్తు సూర్యుని వలే ప్రకాశించే కుమారుడు ఉభయ వంశాలను ఉద్ధరించేవాడు' పెరుగుతున్నాడు. కనుక నీవు పుట్టింటికి వెళ్ళు అని చెప్పాడు. ఆ పుత్రుడికి 'ఆస్తికుడు' అని నామకరణం చేశాడు. ఈ ఆస్తికుడే జనమేజయుడు చేసే సర్పయాగాన్ని ఆపి నాగజాతిని కాపాడిన ఘనుడు. జరత్కారి 'మానస' పేరుతో సర్పాలకు ఆరాధ్య దేవతగా ప్రసిద్ధి చెందింది.

18. సావిత్రి - సత్యవంతుడు :

రాకుమారి అయిన సావిత్రి సత్యవంతుడు అనే యువరాజుతో ప్రేమలో పండింది. అతను చనిపోతాడని తెలిసినప్పటికీ ఆమె అతనిని పాతాళానికి వెంబడించింది. సత్యవంతుని తిరిగి సజీవ ప్రపంచానికి తెచ్చుకోవడానికి యమను ఒప్పించింది.

19. విదుల - సహస్రార్జునుడు :

విదుల అనే రాణి శాపం కారణంగా ఆమె భర్త సహస్రార్జునునిచే విడిచిపెట్టబడింది. ఆమె భర్త కోసం ఓపికగా వేచి ఉండి తిరిగి కలుసుకున్నది. వారి ప్రేమ విధిపై విజయం సాధించింది.

20. గంగ - శంతనుడు :

గంగ, శంతనుమహారాజు ప్రేమలో పడింది. వారి కలయిక ఫలితంగా భీష్ముడు జన్మించాడు.

21. ఊర్వశి - కర్ణుడు :

కర్ణుడు ఒకప్పుడు ఖగోళ అప్సరస ఊర్వశి ద్వారా 'వరం' పొందాడు. ఆమె అతనితో ప్రేమలో పడింది. కానీ కర్ణుడు అతని బ్రహ్మచర్య ప్రమాణాలకు కట్టుబడి ఆమె పురోగతిని తిరస్కరించాడు. గుండె పగిలిన ఊర్వశి 'తన దివ్య ఆయుధాల రహస్యాలను తనకు అవసరమైనప్పుడు మరచిపోతావని శపించింది'.

22. లోపాముద్ర - అగస్త్యుడు :

బ్రహ్మచర్య దీక్షాపరుడు, తపోనిష్ఠాగరిష్ఠుడుడైన అగస్త్యుడు పితృదేవతలకు సద్గతులు కల్గించి 'ఊర్ధ్వగతులు' దక్కాలని వివాహం చేసుకొని సంతానవంతుడవ్వాలని కన్యాన్వేషణకి బయలుదేరి తగిన కన్య లభించటం సాధ్యం కాదని పరితాపం చెంది తపశ్శక్తిని ఉపయోగించి ధర్మపరుడైన విదర్భరాజుకి సంతాన ప్రాప్తి కల్గించాడు. ఆమె పేరు లోపాముద్ర, అగస్త్యుడు లోపాముద్ర ఒకరికొకరు ఇష్టపడగా తల్లిదండ్రులు నిరాశ చెందారు. లోపాముద్ర 'మహర్షిని వివాహమాడటం తనకు త్రికర్ణశుద్ధిగా ఇష్టమేనని' అష్టైశ్వర్యాలను వదలుకొని తల్లిదండ్రుల ఆశీస్సులతో, నారచీరలు ధరించి అగస్త్యునికి ధర్మపత్నియైంది.

23. సుకన్య - చ్యవనుడు :

బాల్యంలో అజ్ఞానంతో చేసిన అపచారం వల్ల ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయపడిన తండ్రి శర్యాతిమహారాజు సుకన్యను చ్యవనమహర్షికి ఇచ్చి వివాహం చేశాడు. నిరంతరం తపోదీక్షతో చ్యవనుని శరీరం కృశిస్తోంది. అతీతమైన తేజస్సుతో వెలిగిపోతున్న భర్తను చూస్తూ "ఈ మహర్షికి తేజస్సుకుతోడు యౌవనం కూడా ఉన్నట్లయితే మరింత ఆనందమయ మయ్యేది తన జీవితం, యౌవనుడైన భర్తతో, తన జీవితం ఎంత మధురాతి మధురంగా ఉంటుందో అని ఊహించుకుంటుంటే" (భారతంలో ప్రేమ కథలు, పుట. 171) ఆకాశ మార్గంలో ఇద్దరు యౌవనులు ఆమెను గమనించటం చూసి ఊహాలోకం నుంచి బయటపడింది. వారు అశ్వినిదేవతలు ఆమె వివరాలు తెలుసుకొన్నారు. 'నీలాంటి అందగత్తె ముసలివానికి భార్య అని హేళనగా నవ్వడమే కాకుండా మా లాంటి యౌవనులను పెండ్లి చేసుకుంటే నీ జీవితం ధన్యం అన్నారు'. కోపగించిన సుకన్య మహర్షి పుట్టుక, గొప్పతనం చెప్పగా వారు భయపడి మేము ఒక మాట చెప్తాము శ్రద్ధగా విను అన్నారు. ఆమె అంగీకారం తెలిపింది. 'మేము అమరవైద్యులం మాకు ఎన్నో వైద్య రహస్యాలు తెలుసు. నీకు అంగీకారమైతేనే' అన్నారు. జరిగిన సంగతి భర్తకు చెప్పింది. చ్యవనుడు ఈ సుకన్య పతిభక్తికి సంతోషించి అశ్వినిదేవతలు చెప్పిన ప్రకారం చేయమన్నారు.

"సుకన్య తన భర్త ఆజ్ఞాపించిన విధాన అశ్వినులతో నాకు క్రొత్త పడుచుదనం గల పెళ్ళికొడుకు సమకూర్చండి అని అడిగింది. వారు ఆ కొలనులో ప్రవేశించారు, చ్యవనమహర్షి కూడా ఆ అశ్వినీదేవతలవెంట ఆ కొలనులో ప్రవేశించారు. అట్లా ఆ ముగ్గురూ ఆ సరస్సు నుండి నవయౌవనులై తిరిగి బయటకు వచ్చి, సుకన్యను చేరి మా ముగ్గురిలో నీకు నచ్చినవాడిని ఎన్నుకొనుము' అని అన్నారు. అంతటితో సుకన్య తన భర్త అయిన చ్యవనుడినే వరించింది." (ఆంధ్రమహాభారతం, అరణ్యపర్వం, ఆశ్వాసం-3, పుట. 397).

24. ప్రభావతి - దేవేంద్రుడు :

ప్రభావతి భరద్వాజ మహర్షి కుమార్తె దేవేంద్ర వైభవాన్ని, స్వర్గలోకపు సౌందర్యం గురించి అందరూ చెప్పుకుంటుంటే చాలా ఉత్సాహంగా దేవేంద్రుని గురించి ఆలోచనలు ఆమె మదిలో మోగాయి. ఇంతలో భరద్వాజ మహర్షి పెండ్లి చేయాలని నిర్ణయించాడు. కూతురి అభిప్రాయం తెలుసుకున్నాడు. ఆమె దేవేంద్రుని

భర్తగా కోరింది. తండ్రి "విజయోస్తు"! (భారతంలో ప్రేమ కథలు, పుట.181) తండ్రి అశీర్వచనం, ఆమె తపోదీక్ష ఇంద్రుని మనసును రంజింపజేసింది. వశిష్ఠని వేషంలో ఆమె తపోవాటికకు వచ్చాడు. మారు వేషంలో వచ్చిన ఇంద్రుడు ఆమెను కుశల ప్రశ్నలతో రకరకాలుగా సరదాగా ఏడిపించాడు. ఆమె 'త్రికరణశుద్ధిగా ఇంద్రునికి మనసిచ్చానని చెప్పింది, ఇంద్రుడు ప్రత్యక్షమై "సుందరీ! నీ నిష్ఠాతిశయానికి సంతోషించాను. నీ కోర్కెను తీరుస్తున్నాను. ఈ శరీరాన్ని వదలి దేవలోకానికి రమ్ము, పాపాలనంతా తొలగించే ఈ తీర్థం ముల్లోకాలలో కీర్తింపబడుతుంది అని అన్నాడు. ఆమె కూడా ఆ దేవరాజునకు భార్యగా ఒప్పారింది. (ఆంధ్రమహాభారతం, శల్యపర్వం, అశ్వాసం - 2, పుట.258)

ఇంకా సుదర్శన-అగ్నిదేవుడు, ఉత్తర-అభిమన్యుడు, సుజాత-ఏకపాదుడు, సుప్రభ-అష్టావక్రుడు, శర్మిష్ఠ -యయాతి, సత్యవతి-దేవలుడు, భద్రాదేవి-వ్యుషితాశ్వుడు, ద్రౌపది-జయద్రథుడు అనే సైందవుడు, సత్యవతీ-ఋచీకుడు, సుశోభన-పరీక్షిత్తు, మేనక-విశ్వామిత్రుడు మొదలైన ప్రేమకథలు కూడా భారతంలోనివే!

ముగింపు :

మహాభారతంలోని ప్రేమ కథలు మన అభ్యుదయానికి, అవసరమైన సర్వధర్మాలకూ సోపానం. ఇందులో మధురప్రేమ, శృంగారప్రేమ, నిర్మల ప్రేమ, నిశ్చలప్రేమ భగ్నప్రేమ, త్యాగప్రేమ, షరతులులేని ప్రేమ, షరతులతో కూడిన ప్రేమ, దైవప్రేమ, దైత్యులప్రేమ, విధేయతతో కూడిన ప్రేమ, వినయంతోకూడిన ప్రేమ, వివశ్యతలేని ప్రేమ, వర్ణాంతర ప్రేమలు ఉన్నాయి. అవి ప్రేమ కోసం ప్రాణాలిచ్చాయి. వరాలిచ్చాయి. జీవితాన్నిచ్చాయి, వంశాన్ని అభివృద్ధి పరిచాయి. ఆకర్షించాయి, ఆవేదన చెందాయి. ప్రేమ కోసం తపస్సు చేశారు. ప్రేమకోసం ప్రతిజ్ఞ చేశారు. ప్రేమ కోసం సుగుణవతిగా మార్పు చెందారు. ప్రేమ కోసం ఆకర్షితులయ్యారు. ప్రేమ తల్లిదండ్రులను గౌరవించింది. ప్రేమ ఆత్మీయతలను పెంచి అవకాశాలను తుంచింది. ప్రేమ ప్రేమకోసం ప్రేరణనిచ్చింది. ప్రేమ కోసం మృత్యువుతో పోరాడారు. ప్రేమకు తల్లిదండ్రులు విలువనిచ్చారు. ప్రేమ అంటే ఏమిటో ఎవరికి వారు స్వచ్ఛందంగా, నిర్మలంగా, ఆదర్శంగా జీవించారు. ప్రేమ విఫలమైందని బెంగపెట్టుకొని మూలకూర్చోలేదు. సఫలం చేసుకోవడానికి ప్రయత్నం చేశారు. ప్రేమకోసం ప్రాణాలిస్తానని ముందుకొచ్చారు. ప్రేమకోసం వ్రతాలు చేపట్టారు. నిజమైన ప్రేమను దేవతలు కూడా అడ్డుకోలేకపోయారు. నిర్మలమైన ప్రేమకోసం గురువులే శిష్యులకు సహాయం చేసి వెన్నుదన్నుగా ఉన్నారు. ప్రేమపట్ల విశ్వాసం కలిగి ఉన్నారు. ధర్మం కోసం బ్రహ్మచర్యాన్ని విడిచిపెట్టి ప్రేమించి సఫలీకృతులైయారు. ప్రేమ సంసార జీవితానికి పునాదులుగా నిల్చింది. ప్రేమ పితృదేవతలకు సద్గతులు కల్పించి పెండ్లికి దారితీశాయి. ప్రేమ భర్తను యౌవనునిగా మార్చడానికి మార్గం చూపింది. ప్రేమకు అసాధ్యం అనే మాటేలేదు. అంతా సుసాధ్యమే! అన్న అంశాలు భారత ప్రేమ కథలో ఉన్నాయి. ప్రపంచీకరణ నేపథ్యం, ఆంగ్లవిద్యా ప్రాధాన్యం వలన ప్రేమలో మార్పు సంభవించింది. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమై ప్రేమ పేరుతో ప్రేమించానని సన్నిహితంగా మెలిగి పెండ్లి చేసుకుంటానని నమ్మించి, సహజీవనం చేసి గర్భవతి కావడంతో పెండ్లి చేసుకోవడానికి నిరాకరించి, హింసించి, బలవంతంగా లోబర్చుకుని వేధించే విశృంఖల రాక్షసప్రవృత్తికి మహాభారతంలోని ప్రేమకథలు ఆదర్శంగా నిలిచి మార్గనిర్దేశం చేస్తాయని ఆశిస్తున్నాను.

ఉపయుక్త గ్రంథసూచి :

1. నన్నయ - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, ఆదిపర్వము మొదటి భాగము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2006.
2. నన్నయ - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, ఆదిపర్వము రెండవ భాగము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2009.
3. నన్నయ - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, అరణ్యపర్వము మొదటి భాగము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2008.
4. నన్నయ - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, అరణ్యపర్వము రెండవ భాగము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2008.
5. తిక్కన - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2008.
6. తిక్కన - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, శల్యపర్వము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2008.
7. తిక్కన - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, అనుశాసనికపర్వము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2008.
8. ముక్తేవి లక్ష్మణరావు, డాక్టర్ ముక్తేవి భారతి - భారతంలో ప్రేమ కథలు, యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, తిలక్‌రోడ్, హైదరాబాద్-500 001, మే-1991.
9. వెంకటేష్ పువ్వాడ, అంతర్జాలం, భక్తి ఒకటి.
10. అంతర్జాలం, హిందూ టెంపుల్స్ గైడ్.
11. అంబడిపూడి శ్యామసుందరరావు - అంతర్జాలం : సంచిక - తెలుగు సాహిత్యవేదిక.
12. ఆర్వీయార్ - పూర్వగాథాకల్పతరువు, పురాణ గ్రంథాలలోని విశేషాలను వివరించే నిఘంటువు, ప్రతిభ పబ్లికేషన్స్, ప్లాట్‌నెం. 2; శ్రీశంకరకాలని, ఎల్.బి.నగర్, హైదరాబాద్-500 074, మే-2006.
13. బహుజనపల్లి సీతారామాచార్యులు - 'శబ్దరత్నాకరము' -విక్టరీ పబ్లికేషన్స్, కొత్తపేట, విజయవాడ - 520 001, జూన్-2005.

❖❖❖

మహాభారతం - పాలన

ఎ.ఆదిశేఖర్ రెడ్డి, రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల.

"పంచమవేదం"గా పేరు గాంచిన మహాభారతం సకల ధర్మాలకు నిలయమైనది. ధర్మాలలో ఉత్కృష్టం. రాజధర్మాన్ని మహాభారతంలో అనేక సందర్భాలలో గమనించవచ్చు. వాస్తవానికి రాజ్యపాలనాధికారం ధర్మానికి, పాలనా దక్షతకు నిలయమైన పాండురాజు పుత్రుడు ధర్మరాజు చేపట్టాలా లేక కురువంశ చక్రవర్తి అయిన ధృతరాష్ట్రుని కుమారుడు, రాజ్యకాంక్ష కలవాడు. ధర్మానికి కట్టుబడనివాడు "దుష్ట చతుష్టయము"లో ఒకడైన దుర్యోధనుడు రాజు కావాలా అన్న పాలనా ఆధిపత్యం కోసం పోరాటమే రాజకీయాల దృష్టిలో మహాభారతం కురువంశ రక్షణకు భీష్మ ప్రతిజ్ఞ చేసిన భీష్మ పితామహుడు జీవించి ఉండగానే రాజ్యాధికారం కోసం మహాభారత యుద్ధం జరిగినది. రాజధర్మాన్ని పాలకుల కర్తవ్యాలను పాలనా ఆవశ్యకతను భగవద్గీతను బోధించిన, పరమాత్మ స్వరూపుడైన శ్రీకృష్ణుని మాటలలో, త్రిలోక సంచారి అయిన నారదమహర్షి హిత వచనాలలో, పరుశరాముడినే జయించిన భీష్మపితామహుని బోధనలో ప్రభుత్వ పాలన, రాజవిధులను గూర్చి తెలుసుకోవచ్చు. ఆనాటి పాలన ధర్మం అనే రెండు అక్షరాలతో కూడిన విశేషమైన ప్రజారక్షణ వారి సంక్షేమము ధ్యేయంగా కలిగిన రాజకర్తవ్యం. దీనికి రాజధర్మమే మూలం. రాజు తన రాజధర్మాన్ని మొదట ఆచరిస్తూ ప్రజలందరి చేత ధర్మాన్ని ఆచరింప చేయించడమే రాజకర్తవ్యం. మజ్జిగను చిలికినప్పుడు వెన్న దాని అంతట అదే ఆవిర్భవించినట్లు రాజు ప్రజలందరి చేత ధర్మాన్ని ఆచరింపచేయిస్తే ప్రజలలో న్యాయము, సమానత్వం, సంక్షేమం, వెన్నలా వృద్ధి చెందుతాయి. మహాభారతం వేదజ్ఞానానికి నిజమైన జీవనరూపం. ధర్మాన్ని ఆచరించినవాళ్ళు భీష్ముడిలా, మోక్షాన్ని పాండవులులా స్వర్గాన్ని పొందుతారు. అధర్మాన్ని ఆచరించిన వాళ్ళు కౌరవులు అర్ధాంత జీవితంలోనే మరణం కోరి తెచ్చుకోవడమే కాక నరకాన్ని పొందవలసి ఉంటుంది. అందుకే "కర్తవ్యం దైవయమృతం" అన్న వేద నానుడి నేటికి ఈ భారత అవనిలో నిలచినది. వర్ణాశ్రమ ధర్మం ఈ దేశ సంస్కృతికి మూలం. వాస్తవానికి ప్రతి మనిషి బ్రహ్మచర్యము, గృహస్థ ఆశ్రమము, వానప్రస్త ఆశ్రమము, సన్యాస ఆశ్రమము ఆచరించి మోక్ష సిద్ధిపొందేటట్లు రాజు పరిపాలన చేయాలి.

వర్ణ ధర్మానికి గుణమే ప్రధానము కాని పుట్టుక కాదు. గుణం ఆధారంగా సమాజపనులు వ్యక్తుల మధ్య నాలుగు రకాలుగా వర్గీకరించారు. ఏ వ్యక్తిత్వం ఉన్నవాడు అదే వ్యక్తిత్వం ఉన్న విధులను పాలనా పదవులను నిర్వహిస్తే సమర్థవంతంగా చేస్తాడు అనేది దీనికి మూలం. అలాగే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర ధర్మాలను ప్రజల చేత ఆచరింప చేయించడం రాజు యొక్క కర్తవ్యం. నారదుడు చెప్పినట్లు యుగాలలో కలియుగం, జన్మలలో స్త్రీ జన్మ, వర్ణాలలో శూద్రుడు గౌరవించదగినవాడు. వీరందరి చేత వారి వారి విధులు ధర్మానుసారం ఆచరింప చేయిస్తే ఏర్పడే రాజ్యమే శ్రీరాముడు పరిపాలించిన ఈ ధర్మరాజ్యం.

పరిచయం :

14వ మన్వంతరంలో కృత, త్రేతాయుగం, అనంతరం ద్వాపర యుగంలో ఈ భారతావనిలో జరిగిన చరిత్రే "మహాభారతం". హస్తినాపుర చక్రవర్తులైన కురువంశ రాజు శంతనుడి కుమారుడైన భీష్మపితామహుని పరిరక్షణలో ఉన్న ధృతరాష్ట్రుడు, గాంధారిల కుమారుడు దుర్యోధనాది వందమంది సోదరులకును, ధృతరాష్ట్రుని సోదరుడు యువరాజు అయిన పాండురాజు కుమారులు పాండవులకు మధ్య జరిగిన ఇతిహాస గాథలో భగవంతుడైన శ్రీకృష్ణుడు ప్రధాన ధర్మరక్షకుడిగా ఉండగా ఈ ఇతిహాస గాథ జరిగింది. ధర్మబద్ధుడు, సమర్థుడు,

అర్హుడు అయిన ధర్మరాజుకు యువరాజు పదవి దక్కకుండా, దుర్బుద్ధి కలిగిన దుర్యోధనుడు కుటిల నీతి గల అతని హితుల సూచనమేరకు యువరాజు పదవికై అధర్మమార్గంలో చేసే ప్రయత్నాలకు ధృతరాష్ట్రుడు సహకరించడం వల్ల "కౌరవ పాండవ యుద్ధం" జరిగినది. యుద్ధానంతరం విజయం సాధించిన ధర్మరాజు ధర్మబద్ధమైన పాలన చేసి ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లేటట్లు తన రాజ్యపాలన చేశాడు. మహాభారతంలోని 18 పర్వాలలో ముఖ్యంగా సభాపర్వం, ఉద్యోగపర్వం, శాంతిపర్వాలలో రాజ్యపాలన అంశాలు విధురుడు, సంజయుడు, నారదుడు, భీష్మపితామహుడు, శ్రీకృష్ణపరమాత్మ హితవచనాలలో రాజధర్మంతోపాటు రాజ్యపాలన విషయాలను మీరు గుర్తించవచ్చు.

మానవధర్మాచరణ వర్ణాశ్రమధర్మాన్ని అనుసరించి ఉంటుంది. వర్ణధర్మాలు

1. బ్రాహ్మణులు

బ్రహ్మతత్వ జ్ఞానం తెలిసి నియమబంధ నిరాడంబర జీవితాన్ని కొనసాగిస్తూ పుర ప్రజల హితం కోరి పౌరోహిత్యం చేస్తూ వేదాలు, ధర్మాన్ని బోధించేవారు.

2. క్షత్రియులు

ధర్మరక్షణ, రాజ్య పాలనకై ప్రాణాలు లెక్కపెట్టకుండా ప్రజలను రక్షిస్తూ వారి సంక్షేమాన్ని పెంపొందించే వారు "క్షత్రియులు".

3. వైశ్యులు

పశుపోషణ, వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగం చేస్తూ తమ ఇహలోక సుఖాలు పొందగోరువారు "వైశ్యులు".

4. శూద్రులు

పై విధులు నిర్వర్తించలేనివారు, సేవక వృత్తి చేయగలవారు "శూద్రులు". మానవుల జ్ఞాన, గుణ భేదాన్ని బట్టి పై వృత్తి విభజన ఉంది కానీ, పుట్టుకనుబట్టి ఎవరూ శూద్రులు కారు. శూద్రులకు జన్మించిన వ్యాసుడు, నారదుడు, ధర్మవ్యాధుడు, విదురుడు ఎంత గొప్పస్థానాలు పొందారో "మహాభారతం" తెలియజేస్తుంది.

వర్ణధర్మాలు వ్యక్తిగుణగణాలను బట్టి విభజిస్తే ఆశ్రమధర్మాలు వ్యక్తి స్థితిని బట్టి, వయస్సును బట్టి విభజించబడ్డాయి. ఆశ్రమ ధర్మాలను స్త్రీలు, పురుషులు వర్ణభేదం లేకుండా అందరూ ఆచరించాలి.

1. బ్రహ్మచర్య ఆశ్రమం :

ప్రతి మానవుని జీవితం బాల్యం తరువాత బ్రహ్మచర్యంతో ప్రారంభమవుతుంది. కామ కోరికలు లేకుండా దృఢ ఏకాంత మనస్సుతో విద్యాభ్యాసం చేయడం, వేదాధ్యయనం చేయడం, వృత్తిని నేర్చుకోవడం బ్రహ్మచర్యం యొక్క విధి.

2. గృహస్థ ఆశ్రమం :

గృహస్థ ఆశ్రమం గొప్పతనాన్ని మహాభారతం తెలియజేస్తుంది. ధర్మపత్నితో కలిసి కుటుంబాన్ని ఏర్పరిచి ధర్మంగా అర్థాన్ని సంపాదించి, ధర్మమైన కోరికలను తీర్చుకుంటూ మోక్షసాధన మార్గంలో పయనించడం. తమ గృహానికి వచ్చిన అభాగ్యులను బ్రాహ్మణులను గౌరవించాలి. భోజన వసతి కల్పించడం. రాజ్యానికి విధేయుడై పన్నులు చెల్లించడం.

3. వానప్రస్థ ఆశ్రమం :

గృహస్థ ధర్మాలు పూర్తి అయిన తరువాత ఏకాతంగా అయినా ధర్మపత్నితో కలిసి వనాలలో జీవిస్తూ సమాజ, ప్రజాసేవ కార్యకలాపాలు నిర్వహించడం.

4. సన్యాస ఆశ్రమం :

సర్వకర్మఫలాలను త్యజించినవారికి మోక్షం లభిస్తుంది. కాబట్టి మానవ జీవితంలో సన్యాస ఆశ్రమం మోక్ష సోపానం. ప్రతి మనిషి వానప్రస్థ ఆశ్రమం తరువాత సర్వకుటుంబ బాధ్యతలను పుత్రులకు అప్పగించి ఇహలోక సుఖాలను త్యజించి భగవంతునికై నిష్కామంగా ప్రయత్నించడం. మానవ జీవిత లక్ష్యం.

పై విధంగా ప్రజలందరి చేత ఉత్తమ జీవనాన్ని జీవించేటట్లు రాజు పరిపాలన చెయ్యాలి. అదే రాజధర్మం. ఇలాంటి ధర్మబద్ధమైన పాలన ఏలా చేయాలో మహాభారతంలోని పలు సంఘటనలు తెలియజేస్తాయి.

వ్యాసం లక్ష్యం :

మహాభారతం - పాలన అన్న ఈ పరిశోధన మహాభారత కాలంలో జరిగిన పాలన విధానాన్ని రాజవిధులను పాలకుల లక్షణాలను తెలియజేయడం రాజు తన రాజధర్మాన్ని అమలు చేస్తే ప్రజలందరూ ధర్మబద్ధంగా సుఖసంతోషాలు ఏలా పొందుతారో తోటి మానవులు, జీవరాశులతో కలిసి ఎలా ఆనంద జీవితాన్ని గడపగలరో తెలియజేయడం. ఆధునిక కాలంలో రాజ్యాంగబద్ధ పాలన ఎంత ఉత్తమమైనదో అంతకన్నా ధర్మమే రాజ్యాంగముగా గల రాజు యొక్క ధర్మపాలన మరింత ఆదర్శవంతమైనది. ఆనాటి ధర్మపాలన నేటి కాలానికి అన్వర్తింపచేసే అవకాశాలను పరిశీలించడం ఈ పరిశోధన లక్ష్యం.

పరిశోధన పద్ధతులు :

మహాభారతం ఇతిహాస గాథ. కాబట్టి "ద్వితీయ శ్రేణి సమాచారం. ఈ పరిశోధనకు ప్రధాన ఆధారం వ్యాస మహాభారతం. ఈ పరిశోధనకు మూల గ్రంథం. మహాభారతాన్ని కవిత్రయం రచించారు. వారి రచనలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురించినది. ఆ ప్రచురణలు ఈ పరిశోధన మూలాధారం.

రాజ్య పాలన - మహాభారతం :

రాజు యొక్క ధర్మం రాజ్యపాలన చేయడమే. అన్ని ధర్మాల్లోకెల్లా రాజ ధర్మమమే గొప్పది. ఏనుగును అంకుశం ద్వారా లొంగదీసుకున్నట్లే రాజధర్మం ద్వారానే ప్రజలను పరిపాలించాలని ధర్మరాజు భీష్మపితామహుడితో ఏకీభవించాడు.

చ. అరయఁగ రాజధర్మము సమాశ్రయ మై నడపుం ద్రివర్గమున్
గురుతర మోక్షధర్మమునకుం దలఁపం దనప్రాప యూఁత భూ
వర! విను ఘోటకంబునకు వాగెయు, దంతికి నంకుశంబు నే
కరణి నివారకంబులు జగంబుల కట్టుల తాను నెమ్మొయిన్. (శాంతిపర్వం, 2-158)

వాస్యమహాభారతంలో రాజధర్మం ద్వారా ప్రజలలో ఉన్న నేర స్వభావాన్ని అవిధేయతకు సూర్యుని వెలుగుతో చీకట్లు తొలగినట్లు రాజ్యం నుంచి దుష్టప్రవర్తనను తొలగించవచ్చని ఈ క్రింది శ్లోకం తొలియజేస్తున్నది.

శ్లో. "ఉదయన్ హి యథా సూర్యో నాశయ త్యశుభం తమః
రాజ ధర్మ స్తథా లోక్యా మాక్షిప న్త్యశుభాం గతిమ్"

ఉత్తమ పాలకుడుగా రాజు ఉండాలంటే అతనికి తన ఇంద్రియాలపై నిగ్రహం, మనోనిగ్రహం ఉండాలి. కామక్రోధాలను జయించినవాడై ఉండాలి. అటువంటి రాజే శ్రీమంతుడు. కీర్తిమంతుడు అని భీష్ముడు తెలియజేశాడు.

క. దాంతియు విజితాత్మత్వము । శాంతియు శీలంబుఁగలుగు జగతీశుఁడ శ్రీ
మంతుండు యశస్వియు నై । యెంతయు సౌఖ్యంబు నొందు నిభపురనాథా! (శాంతిపర్వం, 2-168)

పై పద్యంలో చెప్పిన అర్హతలతోపాటు రాజ్యం ఏడు అంగాలను కలిగి ఉండాలని ఈ క్రింది పద్యం ద్వారా భీష్ముడు తెలియజేశాడు. రాజు ధర్మానికి ఆధారం రాజు యొక్క ఋజు ప్రవర్తన మరియు సత్యం అని వివరించాడు. ఆ ఏడు అంగాలు 1. స్వామి 2. అమాత్యుడు 3. సుహృత్తు 4. కోశం 5. రాష్ట్రం 6. దుర్గం 7. బలం.

తే. ప్రకృతు లేడింటి నెఱి నడపంగ వలయు; । దాని కార్జన సత్యముల్ దావలములు ;
దండనీతి విధాన మంతటికి రక్షః । యర్హ మగు మెల్పుతోఁ జేయ నది వెలుంగు.

(శాంతిపర్వం, 2-169)

ధర్మరాజును అంపశయ్యపై ఉన్న భీష్మపితామహుడి ద్వారా సకల ధర్మాలను వినమని ప్రోత్సహించాడు శ్రీకృష్ణుడు. ధర్మరాజు కోరికపై రాజధర్మం గురించి వివరించే ముందు సకల ధర్మాలకు మూలమైన శ్రీకృష్ణుడిని, వేదాలను వేదపండితులైన బ్రాహ్మణులకు నమస్కరించి భీష్ముడు ఈ ధర్మాలన్నింటిని ధర్మరాజుకు బోధిస్తున్నాడు అని వ్యాసభారతంలోని ఈ క్రింది శ్లోకం ద్వారా తెలుస్తున్నది.

శ్లో. "నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్ వక్ష్యామి శాశ్వతాన్" ॥

రాజ్యపాలనకు దండనీతే మూలం. తప్పు చేసిన వారిని శిక్షించడం రాజు కర్తవ్యం. మంచి వారిని పేదలను, వేదజ్ఞానానికి రక్షణ కల్పించే బాధ్యత రాజుదే. తప్పు చేసిన వారిని శిక్షించకపోతే రాజుకు అది పాపం అవుతుంది అని ఈ క్రింది పద్యం ద్వారా తెలుస్తుంది.

క. దండార్హులైన వారల । దండింపకయున్నఁ జువ్వె ధాత్రీవిభు నా
ఖండల సన్నిభు నైనఁ బ్ర । చండపుఁ గిల్బిషము వొందు జగతీనాథా! (శాంతిపర్వం, 1-96)

మరణశిక్ష ఎప్పుడు వేయాలో మహాభారతం తెలియజేస్తున్నది. విషం పెట్టడం ద్వారా, గృహాలను తగలపెట్టడం ద్వారా, కామంతో స్త్రీ హత్యలు చేసేవారిని శత్రురాజులకు రాజ్య రహస్యాలను తెలియజేసేవారికి మరణశిక్ష వేయాలని భీష్ముడు వివరించాడు అని ఈ క్రింది పద్యం తెలియజేస్తున్నది.

క. గరదుని, గృహదాహకు, మం । త్రరహస్య విభేది, వధవిధాయిఁ, బరసతీ
హరు, బంధుఘాతిఁ, బరధన । హరణ పరునిఁ, జంపి పుణ్యుఁ డగు నృపుఁ డనఘా!

(శాంతిపర్వం, 1-95)

రాజుకు దండనాధికారం బ్రహ్మదేవుని ద్వారా వచ్చినవని తప్పు చేసినవారు ఎవరినైనా శిక్షించవచ్చని భీష్ముడు తెలియజేశాడు. బ్రాహ్మణుడు తప్పు చేసిన అతని ముఖం పైన చెరగని ముద్రవేసి రాజ్య బహిష్కరణ చేయవచ్చు.

స్త్రీ అయిన ద్రౌపది దేవి రాజధర్మం గురించి వివరిస్తూ రాజుకు ధైర్యం, సామర్థ్యం ఉండాలి అని బేళతనం, బాలచేష్టలు రాజుకు ఉండకూడదని ద్రౌపది మాత వివరించినది. కాబట్టి దుష్టుల పట్ల సహనం మంచిది కాదని అర్థం అవుతున్నది. రాజ్యానికి రాజు అత్యంత అవసరం. ఒకవేళ యువరాజు లేకపోతే కుమార్తెనైనా సింహాసనం పై కూర్చుండబెట్టి రాజ్యపాలన చేయాలని ఈ క్రింది పద్యం తెలియజేస్తున్నది. దీనిని బట్టి స్త్రీ రాజ్యపాలన చేయవచ్చని తెలుస్తున్నది.

ఆ. కొడుకు లేనిచోటఁ గూఁతుఁ బ్రతిష్ఠింపు; । దానఁ జేసి వారి తల్లు లధిక
హర్ష మొందుదురు; ప్రియంబును నీ కగుఁ; । బుణ్యమును యశంబుఁ బొందు నిన్ను

(శాంతిపర్వం, 1-286)

వర్ణాశ్రమ ధర్మాలు పౌరుల వృత్తులను వారి జీవన విధానాన్ని తెలియజేస్తుంది. ధర్మ, అర్థ, కామ,మోక్షాలు మానవ జీవన గమ్యాలు. రాజు తన దండనీతి ద్వారా వర్ణాశ్రమ ధర్మాలను అమలు చేయించాలని ఈ క్రింది పద్యం తెలియజేస్తున్నది.

తే. వర్ణముల నాశ్రమంబుల వలను మెఱసి । యరసి చక్కని తెరువున నరుగఁ జేసి
ధరణి పాలింపు సముచిత దండధరణ । మాచరింపుము; నీ కిది యర్హవృత్తి. (శాంతిపర్వం, 1-192)

ప్రజలను నొప్పించకుండా వారు కట్టగలిగే మేరకు పన్నులు రాజు వసూలు చేయాలి. అంతేగాని ధన సంపాదనే లక్ష్యంగా పన్నులు విధించరాదని, ప్రజాధనం దోచుకోరాదని శ్రీకృష్ణుడు ఈ క్రింది పద్యం ద్వారా ధర్మరాజుకు తెలియజేశాడు.

సీ. 'ఏడు దీవులయందుఁ గ్రీడాగతులఁ దన । రథము చరింప, నరాతు లనఁగ
వినియు నెఱుంగక విభవ మార్జించుచోఁ । బ్రజల నొప్పింపని పరమపుణ్య
కర్మంబునకు మెచ్చి గారవంబునఁ దన । కక్షయ సాధనము ఫాలాక్షుఁ డొసఁగ
నశ్వమేధములు జాహ్నవిపొంత శిష్ట జ । నాకీర్ణములుగఁ బె క్కాచరించెఁ;
ఆ. దారకములు వృష్టిధారలు లెక్కింప । వచ్చుఁ గాని యతని యిచ్చుగోవు
లెన్నఁ గొలఁది గాదు; సన్నుతిపాత్ర మా । శిబికి నుర్వి నునికి సెల్లె నెట్లు?'(శాంతిపర్వం, 1-232)

రాజు మానవ ప్రయత్నం ధర్మబద్ధంగా చేసినప్పుడే భగవంతుని అనుగ్రహం, అదృష్టంతోడై గొప్ప విజయాలు సాధించవచ్చు. మానవ ప్రయత్నమే కార్యవిజయానికి సోపానం ధర్మ మానవ ప్రయత్నానికి దైవ అనుగ్రహం, అదృష్టం కలసి వస్తుందని భీష్ముడు ధర్మరాజుకు తెలియజేశాడు.

రాజు దండనాధికారంతో బ్రాహ్మణుడునైనా శిక్షించవచ్చు. పరస్త్రీ వ్యామోహం, శిశుహత్య, రాజ్యవ్యతిరేక కార్యకలాపాలు చేసే వారిని దేశ బహిష్కరణ చేయాలి. అదే యుద్ధంలో పోరాడే బ్రాహ్మణుడిని వధించవచ్చు అని ఈ క్రింది పద్యం ద్వారా భీష్ముడు ధర్మరాజుకు వివరించాడు.

క. శాంతుఁడు గా కని నాయుధ । వంతుండై కవియు విప్రు వసుధేశుఁడు వే
దాంతి నయిన హింసించుట । యెంతయు ధర్మంబు; శ్రుతులు నిట్లని చెప్పున్.(శాంతిపర్వం, 2-175)

రాజ్య రక్షణ విధానంలో ఎటువంటి భేదం చూపక గురువైనా, స్నేహితుడైనా, కడకు కుమారుడైనా శిక్షవిధించాలని మహాభారతం వివరిస్తున్నది. ధర్మ, అర్థ, కామ మోక్షాలు మానవ జీవిత గమ్యం. ధర్మంగా అర్థాన్ని సంపాదించి, కామ అనగా ధర్మమైన కోరికలు తీర్చుకొన్న వారికి మోక్షం లభిస్తుంది. ఇలా పౌరులు జీవించునట్లు చేయడం రాజధర్మం అని భీష్ముడు వివరించాడు.

క. 'తనకీడు వైదికపు న । ర్తనములఁ గొని యడఁప వలయు; దానిం గడవన్
జనపతికి మేలు గలదే? । వినుము చతుర్వర్గ పరత విహిత మతనికిన్. (శాంతిపర్వం, 2-184)

రాజు శాంత పరుడిగానూ ఉండరాదు. నిత్య క్రోధంగల వాడుగాను ఉండరాదు. శాంతి పరుడైన రాజును ప్రజలు గౌరవించరు, అనుసరించరు. క్రోధ స్వభావం గల రాజుకు ప్రజలు భయకంపితులు అవుతారు. రాజుకి అలసత్వం పనికిరాదు అని భీష్ముడు వివరించాడు. దుష్టులను శిక్షించి వారి ధనాన్ని గ్రహించి ఉత్తములకు ఇవ్వాలని భీష్ముడు ఈ క్రింది పద్యంలో వివరించారు.

క. పొనరిచి యాడెడు మాటలఁ । గొనఁ దలఁపక దుర్వినీత కోటి ధనంబుల్
దన కెక్కినట్టి తప్పులఁ । గొని సుజనుల కీగి నృపతి గుణమంద్రు బుధుల్. (శాంతిపర్వం, 2-186)

ధర్మరాజుకు విదేశాంగ విధానం వివరిస్తూ భీష్ముడు సంధి ఎలా చేసుకోవాలి, యుద్ధాలు ఎలా చేయాలి (విగ్రహం), బలహీన శత్రువును ఎలా జయించాలి (యానం), దుర్గాలను ఎలా రక్షించాలి (అసనం), ఒకేసారి ఇద్దరు శత్రువులు దాడి చేస్తే ఒకరితో ఎలా స్నేహం చేసి మరొకరితో యుద్ధ విజయం ఎలా సాధించాలి (ద్వైధం) బలవంతుడైన రాజు ఆశ్రయం ఎలా పొందాలో తెలియజేశాడు.

రాజ్యరక్షణలో శత్రుసంహారం అతి ముఖ్యం అల్పుడైన, శత్రువునైనా సమూలంగా నాశనం చేయాలి అని ఈ క్రింది పద్యంలో తెలిపాడు భీష్ముడు.

తే. సంతతోత్సాహవంతుఁడై శత్రుకోటి । నార్జవంబున నైన ననార్జవమున
నైనఁ జెఱుపన వలయు; నత్యల్పుఁడైన । బగతుఁ డగ్ని విషంబుల పగిది నొంచు.
(శాంతిపర్వం, 2-194)

రాజు శ్రీమహావిష్ణు స్వరూపంగా భీష్ముడు ధర్మరాజుకు తెలియజేశాడు. నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలు ప్రజలు ఆచరించు విధంగా రాజు పాలన చేయాలి. రాజు వ్యక్తిత్వాన్ని భీష్ముడు ఇలా వివరించాడు.

క. 'కోపంబు లేమి, సత్యా । లాపము నిజ దార పర విలాసము శుచితా
గోపన మద్రోహం బవ । నీపాలక! సర్వవర్ణ నియత గుణంబుల్ (శాంతిపర్వం, 2-221)

పై పద్యంలో రాజు కోపరహితుడై శాంతంగా ఉంటూ సత్యం పలుకుతూ, పరస్త్రీ వ్యామోహం లేక, ద్రోహచింతన లేకుండా ఉంటూ నాలుగు వర్ణాల వారిని పాలించాలి.

ఇంద్రియ నిగ్రహం కలవారు, వేదాధ్యయనం చేసేవారు, హిత కర్మలను ఆచరించేవారు బ్రాహ్మణులు అని భీష్ముడు తెలియజేశాడు. ఈ క్రింది పద్యంలో

ఆ. బ్రాహ్మణునకు దమము పరమ ధర్మం బవ । శ్యంబుఁ గృత్య మధ్యయనము; దాన
సర్వ కర్మములును, శాసితంబులు; వాని । నడపవలయు నిష్ఠ యెడప కతఁడు.(శాంతిపర్వం, 2-222)

క్షత్రియుల విధులను భీష్ముడు వివరిస్తూ యజ్ఞాలు చేయడం, దానం, వేదాధ్యయనం, దోషులను శిక్షించట, ప్రజలను ప్రేమతో పాలించడం, ప్రాణభయంలేకుండా యుద్ధం చేయడం, క్షత్రియ ధర్మం అందు ధర్మయుద్ధం ప్రథమ కర్తవ్యంగా ఇలా వివరించాడు.

చ. యజనము దాన కర్మమును నధ్యయనంబును దస్యుహింసయుం
బ్రజ కనురాగ మొందఁ బరిపాలన చేఁతయు సంగరంబున
న్విజిత విభీతిమై నురవణించుటయున్ నృపధర్మముల్; కురు
వ్రజ తిలకాయమాన! సమరంబు సుధర్మువు వీనిలోపలన్. (శాంతిపర్వం, 2-224)

అలాగే వైశ్య ధర్మాన్ని వివరిస్తూ యజ్ఞ, దాన, వేదాధ్యయనాలు వైశ్యధర్మమే వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం, ఉద్యోగం అన్ని కూడ ధర్మమార్గంలో ధనార్జన చేయడం వైశ్యధర్యం. పై విధులు నిర్వర్తించలేని వారు శూద్రులు. వీరుపైవారు నిర్వర్తించు పనులలో సహాయం చేయాలి. శూద్రునిలో పరివర్తన వచ్చిన అతడు ధన సంపాదన రాజు అనుమతితో చేయవచ్చు. పై వర్ణన గుణవిభాగమే గాని పుట్టుక విభజన కాదు. ఇది పౌరుల విధులను వర్గీకరణగా తెలుస్తుంది.

ప్రతి మానవుడు ఆచరించవలసిన ఆశ్రమ ధర్మాలు నాలుగు అవి 1. బ్రహ్మచర్య 2. గృహస్థ 3.వానప్రస్థ

4. సన్యాస ఆశ్రమాలు. యవ్వనం వచ్చు వరకూ గురుసేవ, వేదాధ్యయనం, వృత్తిని నేర్చుకోవడం లాంటి ఆరు ఉత్తమ కర్మలను ఆచరించేవారు బ్రహ్మచర్య ఆశ్రమవాసులు. పరస్త్రీ సాంగత్యం లేకపోవడం దయ, సత్యనిష్ట, ఓర్పు, సజ్జన సాంగత్యం, దేవతలు, పితృదేవతలు, అతిథులకు సమర్పన గృహస్థ ధర్మాలు. తమ సంతానం గృహస్థ విధులు నిర్వహించేటప్పుడు వానప్రస్థ ఆశ్రమం స్వీకరించి ఒంటరిగా గాని, అరణ్యంలోగాని జీవిస్తూ ఇంద్రియ నిగ్రహంతో తపస్సు చేస్తూ సమాజానికి సలహాలు జ్ఞానం అందించాలి. ప్రతి మానవుడు సన్యాస ధర్మం ఆచరించాలి. సర్వ కర్మ ఫలితాలను త్యజించి దేనిని కాంక్షింపక జీవిస్తూ భగవంతుడిని చేరుకోవడం మానవ జీవిత లక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరే విధంగా రాజు పాలన చేయాలి అని

భారతం (తి.తి.దే.) శాంతి పర్వం మొదటి భాగం, ద్వితీయ భాగం 261-262 పుటలలో 230-234 పద్యాలలో వివరించారు.

పై విధంగా ప్రతి మానవుడు ఆశ్రమ ధర్మాన్ని ఆచరించడం వల్ల అవినీతి, అక్రమాలు, దోపిడీలు లేని రాజ్యం నిర్మించగలం. అందుకే భీష్ముడు రాజ్యం అంటే "ధర్మదేవత" గా పేర్కొన్నాడు. దేవతల రాజైన ఇంద్రుడు మాందాత అనే రాజుతో ఇలా అన్నాడు. "ధర్మాలు అన్నింటిలో రాజధర్మం శ్రేష్ఠమైనది. కామక్రోదాలను జయించి దండనీతిని సమానంగా అమలు చేస్తూ ప్రజలను ప్రేమతో పాలించేరాజు ఉత్తమమైన వారుగా పేర్కొన్నాడు. తన ప్రాణం కన్నా ప్రజల రక్షణ ముఖ్యంగా భావించే రాజు శ్రేష్ఠుడిగా ఇంద్రుడు తెలియజేశాడు.

రాజు లేకపోతే ప్రజలు దుర్మార్గులు, దొంగలు మోసగాళ్ళు అవుతారు. వ్యవసాయ, వ్యాపారాలు జరగవు. మానవ జీవితం సాగదు అన్నాడు భీష్ముడు. అందుకే ప్రజల కోరిక మేరకు మనువును మొదటి రాజుగా బ్రహ్మ ప్రసాదించాడు. రాజు చిరునవ్వుతో ఉంటూ, సత్యభాషణ, సమభావం, కృతజ్ఞత, ఇంద్రియ నిగ్రహం కలవాడై ప్రజలను తండ్రివలే పాలించాలి. లోకాలు, ధర్మాలు అన్నీ ప్రజా రక్షణపై ఆధారపడి ఉంటాయి. పంటలో 1/10 వంతు, ఆదాయంలో 1/6 పన్నుగా విధించాలి.

కృతయుగంలో ధర్మం సంపూర్ణంగా ఆచరిస్తారు. దానికి కారణం రాజనీతే. రాజ ధర్మమే. కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలపై ఉంటుంది. అందుకే ప్రకృతి సహకరించడం వల్ల రైతు భూమి దున్నకుండానే పంటలు పండుతాయి.

త్రేతాయుగంలో ధర్మాచరణ మూడు పాదాలపై ఉండడం వల్ల ప్రజలకు "సంతోషం" కలుగుతుంది. ద్వాపర యుగంలో ధర్మం రెండు పాదాలు మాత్రం అమలు కావడం వల్ల ప్రజలకు "మేలు" మాత్రం జరుగుతుంది. కలియుగంలో రాజు ధర్మంపట్ల శ్రద్ధ వహించరు. అధర్మం వ్యాపిస్తుంది. వర్ణ ఆశ్రమ ధర్మాలు గతులు తప్పుతాయి. రాజధర్మం పైనే ధర్మాచరణ ఆధారపడి ఉంటుంది అని భీష్ముడు వివరించాడు.

నేటి కాలానికి అన్వయింపు :

ఇహ పర శుభాలు కలిగే విధంగా జీవించడం మానవ కర్తవ్యంగా మహాభారతం వివరిస్తుంది. సుఖ జీవితం అలవాటు పడ్డ కలియుగంలో ధర్మ జీవితం అరుదు. ధనార్జన, అధికారం, తామే అధికులం అన్న భావన గల నేటిమానవ జీవితాలకు ధర్మపాలన అవసరం. వర్ణ ధర్మం అంటే గుణాలను బట్టి వృత్తి కలిగి జీవించడం ధీరత్వం కలవారు సైనికులుగా, పోలీస్ అధికారులుగా ఉన్నారు. ధర్మ సూచనలు చేసే బ్రాహ్మణుల పాత్ర నేడు న్యాయశాఖది. ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ సేవారంగాల వారు నాడు నేడు వైశ్యులే. ఇక తోటి మానవుడిని ఆ కార్యాలయ సేవకుడిగా, మురికి కాలువలు శుభ్రపరుచువారిగా నియమించి వారి సేవలు లేనిదే ఒక మాసం అయినా జీవించలేని మనం వారికి ఏ గౌరవం ఇస్తున్నామో, వారు నారదుడు చెప్పినట్లు

త్రిసంధ్యా స్మరణీయులు ఆశ్రమ జీవితం కనుమరుగైనదా అనిపిస్తున్నారన్న ఈ కాలంలో.... సమాజంలో పుట్టి సమాజంలో పెరిగి సమాజం తిరిగి ఇచ్చివేసి ఏ కోరికా లేకుండా స్వార్థం లేకుండా జీవించాలనే సన్యాస ఆశ్రమం ఎంత గొప్పదో! అతిథికి భోజనం పెడితేగాని యజమాని భోజనం చేయని గృహస్థ ఆశ్రమ ధర్మాన్ని ఆచరించిన భారతావనిలో నేడు అతిథికి కాదు ఇంటి యజమానికే భోజనం వండలేక జుమాటో ఉందిగా అన్న ఈ కాలానికి ఆశ్రమధర్మం అవసరమే. బ్రహ్మచర్యం పాటిస్తూ, వేదాధ్యయనం చేస్తూ, బ్రతకడానికి ఒక వృత్తి నేర్చుకోవలసిన బ్రహ్మచర్య ఆశ్రమంలో ఉన్న యువత విజ్ఞానంతో పాటు సమస్త సృష్టి రహస్యాలను చూపే "విశ్వదర్శి"ని చేతపట్టి మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్న ఈ కాలానికి బ్రహ్మచర్య ఆశ్రమం అవసరమే.

ముగింపు :

ధర్మం రెండు అక్షరాలు కాని ధర్మం అంటే ఏమిటి? "ప్రతి మానవుడు ఏ సమయంలో చేయవలసిన తన న్యాయమైన పనిని ఆ సమయంలో పారోపకార్యర్థం సమర్థవంతంగా సకాలంలో చేసి పని ఫలితాన్ని భగవంతుడికి అర్పించడం." ధర్మం దీనిలో న్యాయం, సమానత్వం, సోదరభావంతోపాటు అకుంటితమైన కర్తవ్యదీక్ష ఉన్నది. ఒక నాగలి దున్నే రైతు తన ఎద్దుల చేత వాటి పని చేయించినట్లు రాజు తన దండనాధికారంతో ప్రజలందరి చేత వారి వారి ధర్మాన్ని వారిచేత ఆచరింప చేయించాలి. ప్రజలను వారి ఆస్తులను రక్షించాలి. దుష్టులను శిక్షించాలి. సజ్జనులను రక్షించాలి. కర్షకులకు సహాయం చేయాలి. దీనులకు దానం చేయాలి. శత్రువును సంహరించాలి అన్నదే నేటి సంక్షేమ రాజ్య లక్ష్యం. దేశపాలన స్వదేశీ మరియు విదేశాంగ విధానాలను సమగ్రంగా మహాభారతం వివరించినది. ఇది దాయాధుల ఘర్షణ చరిత్రగా కనపడినా - ఇహపర శాంతి దారి చూపే సజ్జనుల శాంతి గ్రంథం దుర్జనుల వినాశక గ్రంథమే మహాభారతం. దీని నాయకుడు భగవంతుడైన శ్రీకృష్ణుడు, అనుచరులు పాండవులు. ఆచరించవలసినది ఈ ప్రపంచం.

ఆధార గ్రంథాలు :

కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, శాంతిపర్వము - మొదటి భాగము, రెండవ భాగము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2006.

❖❖❖

ఆంధ్ర మహాభారతం - పాత్రల విశ్లేషణ

డాక్టర్ కోరాడ దుర్గారావు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.ఏ. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా.

వశిష్ఠుని కొడుకు శక్తి. శక్తి కొడుకు పరాశరుడు. సత్యవతీ పరాశరుల తనయుడైన వ్యాస మహర్షి 100 పర్వాలలో 1,00,701 శ్లోకాలలో సంస్కృత మహాభారతాన్ని రచించారు. ఆంధ్ర సారస్వతానికి అపర వాల్మీకి అయిన ఆదికవి నన్నయ, కవి బ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱనలు కలసి కవిత్రయంగా ఆంధ్ర మహాభారతాన్ని 18 పర్వాలు, 63 ఆశ్వాసాలు, 21,507 గద్య పద్యాలుగా రచించారు.

ధర్మ క్షేత్రం. ఇది కురుక్షేత్రం. కురుపాండవ రోషాగ్నుల రణ క్షేత్రం. మనవ జీవితమే ఒక మహాభారతం. అది మంచి చెడుల రెంటి నడుమ నిత్య ఘర్షణం.

మహాభారతం మన జాతీయ కావ్యం. మన ఇతిహాసం. పురుషార్థ సాధనకుపకరించే వేద విజ్ఞానమంతా దీనిలో నిక్షిప్తమై యున్నందు వలన దీనిని పంచమ వేదమని, భారతీయ విజ్ఞాన సర్వస్వమని ప్రఖ్యాతి చెందింది. "ధర్మేచ అర్థేచ కామేచ మోక్షేచ భరతర్షభ. యది హాస్తి తదన్యత్ర యన్నె హాస్తి న తత్క్వచిత్" - ధర్మార్థ కామ మోక్షాలకు సంబంధించి భారతంలో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు. (What is in Mahabharatha is every where What is not in Mahabharatha is no where).

మహాభారతం భారతీయులకు పారిజాత కల్పవృక్షం వంటిది. ఏ ఫలం కావాలంటే ఆ ఫలాన్నే ఇస్తుంది. భారతానికి ఆర్ష వేదమని, వాసుదేవ తత్త్వకోశమని ప్రసిద్ధి ఉన్నది. నరనారాయణులు జీవాత్మ పరమాత్మలుగా పరస్పరం కలసి ఏవిధంగా జీవిస్తారో, జీవించ గలరో చెప్పే రసవత్తర కావ్యం మహాభారతం. నరుడు నారాయణుడుగా, నారాయణుడు నరుని ఉద్ధరించే వాడుగా సాగే ఈ రెండు తత్త్వాల అంతరార్థాన్ని అమృత యోగంగా అందించే ఫలమే మహాభారత పరమార్థం.

ఏ యుగమైనా, ఏ కాలమైనా మానవులైనా, దానవులైనా, దేవతలైనా, భూపతులైనా అన్ని అనర్థాలకు, అకృత్యాలకు రెండే రెండు మూలకారణాలు ఒకటి స్వార్థం, రెండు అహంకారం. ఇవి ఆయా వ్యక్తుల మనస్తత్వ, వ్యక్తిత్వాలను బట్టి ఉంటుంది.

ఆంధ్ర మహాభారతంలో లెక్కకు మించిన పాత్రలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ప్రధాన పాత్రలను గురించిన మనస్తత్వ విశ్లేషణ చేద్దాం.

1.యయాతి :

ఇతను చంద్రవంశపు రాజు. దైవ వశమున రాక్షస గురువైన శుక్రాచార్యుని కుమార్తె దేవయానిని వివాహమాడి, ఆమె ద్వారా యదువు, తుర్వసులకు జన్మనిచ్చాడు. రాక్షస రాజైన వృషపర్వుని కూతురు శర్మిష్ఠ తనను అవమానించిందనే నెపంతో దేవయాని శర్మిష్ఠని దాసిగా చేసుకుంటుంది. శర్మిష్ఠ సంధించిన ధర్మసూక్ష్మాలకు తలొగ్గి యయాతి ఆమెను స్వీకరించాడు. ఆమె ద్వారా ద్రుహ్యువు, అనువు, పూరుడు లను కన్నాడు. ఈ విషయం తెలుసుకున్న దేవయాని అలిగి పుట్టింటికి వెళ్ళింది. యయాతి ఏ ధర్మానికి బద్ధుడై శర్మిష్ఠని స్వీకరించవలసి వచ్చిందో వివరించినా వినిపించుకోకుండా శుక్రాచార్యుడు యయాతికి వార్ధక్యం ప్రాప్తించునని శపించాడు. తన భార్య దేవయాని అహంకారానికి బలైన శర్మిష్ఠ విషయంలో ధర్మ సంకటంలో పడి ఆమెను స్వీకరించినందువలన తీవ్ర శాపానికి గురైన ధార్మికుడు యయాతి. తన కుమారులలో తన వార్ధక్యాన్ని స్వీకరించిన పూరునికి రాజ్యాన్ని కట్టబెట్టి రాజనీతిని బోధించిన రాజనీతిజ్ఞుడు, తాత్త్వికుడు.

2.దేవయాని :

ఈమె శుక్రాచార్యుని గారాల బిడ్డ. అతి గారాబం చేత ఆమె ఆడింది ఆట, పాడింది పాటగా సాగింది. దేవతలకు కూడా తెలియని మృతసంజీవని విద్య తెలిసిన మహామేధావి, జ్ఞాని అయిన శుక్రాచార్యుడుకి తనపై ఉన్న ప్రేమని తన అహంకార దర్పానికి వాడుకుంది. తన తండ్రిని ఎంతో గౌరవించి, ఆదరాభిమానాలను చూపిస్తున్న వృషపర్వుని బెదిరించి అతని కూతురు శర్మిష్ఠని దాసిగా చేసుకొని ఆమె జీవితాన్ని అంధకార బంధురం చేసి, తన గొయ్యి తనే తవ్వుకుంది. యయాతి శర్మిష్ఠకు న్యాయం చేయబోతే దానిని తీవ్రమైన నేరంగా పరిగణించి తండ్రికి చెప్పి భర్తనే శపింప చేసి కోరి ముప్పు తెచ్చుకున్న ఆభిజాత్య పరాయణి. ఈవిధంగా దుందుడుకు స్వభావంతో దేవయాని చంద్ర వంశం, యాదవ కౌరవాది వివిధ వంశాలు శాఖోపశాఖలుగా విస్తరించడానికి తనకు తెలియకుండానే కారణభూతురాలు అయింది.

3.సత్యవతి :

ఈమె ఒక అమాయక మత్స్య కన్య. మునీంద్రుడైన పరాశరుడు చెప్పినట్లెల్లా చేసింది. వ్యాసుడిని కన్నా ఆతని ఆలనా, పాలనా చూసి అచ్చట ముచ్చట తీర్చే భాగ్యానికి దూరమైంది. శంతనుని వలన చిత్రాంగదుడు, విచిత్ర వీర్యులకు తల్లి అయినా వారి అకాల మరణంతో గర్భ శోకానికి గురయింది. కురు వంశాన్ని నిలబెట్టడం కోసం తన తండ్రి దాశరాజు వలన ఆజన్మాంత బ్రహ్మచారిగా మారిన భీష్ముణ్ణి వివాహం చేసుకోమని కోరుతుంది. భీష్ముడు నిరాకరించడంతో తన ప్రథమ పుత్రుడైన వ్యాసుడిని రావించి భరత వంశాన్ని నిలబెట్టిన రాజమాత.

4.వ్యాసుడు :

ఇతని అసలు పేరు కృష్ణద్వైపాయనుడు. పరాశరుని కుమారుడు కనుక పారాశర్యుడు, సత్యవతికి జన్మించాడు కనుక సాత్యవతేయుడు. సద్యోగర్భమున జన్మించి బదరికా వనములో తపస్సు చేశాడు కావున బాదరాయణుడు. వేదాలను విభజించి వేదవ్యాసుడు అయ్యాడు. తన తల్లి సత్యవతి మాటను మన్నించి ఆమె కోడళ్లైన అంబిక, అంబాలిక, దాసిల ద్వారా ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురు లకు జన్మనిచ్చి కురు వంశాన్ని నిలబెట్టాడు. రాగ ద్వేషాలకు అతీతుడై కురు పాండవులకు దిశానిర్దేశం చేశాడు. ధర్మాధర్మ బోధనలు చేశాడు. కానీ కౌరవులు పెడచెవిని పెట్టి పతనమయ్యారు. పాండవులు ఆచరించి ధర్మాన్ని గెలిపించారు. నిష్పక్షపాతంగా తామరాకు మీద నీటి బొట్టులా వ్యవహరించి తన వంశ చరిత్రను తానే రచించాడు.

5.ధృతరాష్ట్రుడు :

ఇతడు తన తల్లి అంబిక కారణంగా శారీరకంగా అంధుడైనాడు. దుర్యోధనుని పట్ల అమితమైన పుత్రవ్యామోహం కారణంగా మానసికంగా కూడా అంధుడైనాడు. ధర్మ నిర్మాణ చతురుడైన విదురుని మంచి మాటలు ఒక్కోసారి తనకు కోపం తెప్పించేవి. కుటిల కుతంత్రాల కుప్ప అయిన కణికుని మాటలు ఇతనికి అమృతంలా అనిపించేవి. అందువల్లనే తన బిడ్డల దుర్నీతిని తుంచలేకపోవడమే కాకుండా పెంచుకుంటూ పోయాడు. కురుక్షేత్ర యుద్ధంలో పెద్ద భార్య గాంధారి కొడుకులు అందరూ సమసిపోగా రెండవ భార్య కరణ కొడుకైన యుయుత్సుడు పాండవ పక్షంలో చేరడం వలన బ్రతికిపోయాడు. అతనే చివరకు కౌరవులు అందరికీ ఉత్తర క్రియలు జరపవలసి వచ్చింది.

6.గాంధారి :

ఈమె పరమ పతివ్రత. భర్త గుడ్డి వాడైనప్పుడు భార్య పిల్లలను క్రమశిక్షణతో పెంచి యోగ్యులుగా తయారు చేయవలసిన బాధ్యతను విస్మరించి భర్తతో పాటు తాను కూడా అంధురాలై పోయింది. ఈమె సహజంగానే

అసూయతో కూడిన స్వార్థ పరురాలు. తన కంటే చిన్నదైన కుంతీదేవికి ముందుగా ధర్మరాజు జన్మించాడు. వయో జ్యేష్ఠుడైన ధర్మరాజుకే రాజ్యాధికారం దక్కునేమో నన్న అక్కసుతో రగిలిపోతూ తాను గర్భ విచ్ఛిత్తి చేసుకుంటుంది. ఆమెకు కలిగిన సంతతిలో వికర్ణుడు, దుశ్శల తప్ప మిగిలిన వారంతా ఈర్ష్యాసూయపరులే. ఈమెకు జాతకంలో ఉన్న వైధవ్య దోషం తొలగించుకొనుటకు ముందుగా మేకపోతుతో జరిగిన వివాహాన్ని మరుగున పరచి తదుపరి ధృతరాష్ట్రుడుని వివాహమాడి కురు సామ్రాజ్యానికే పట్టమహిషి అయింది. అంతేకాదు కురుక్షేత్ర యుద్ధమునకు ముందు జరిగిన శ్రీకృష్ణ రాయబారం విఫలమైనదని, అంతటి వినాశనానికి తన బిడ్డల అధర్మ వర్తనమే కారణమని తెలిసి కూడా దారుణ గర్భశోకం భరించలేక శ్రీకృష్ణున్ని శపించింది.

7.విదురుడు :

ఇతను మాండవ్య మునిచే శపించబడిన యమధర్మరాజు అవతారం. దాసికి జన్మించినా ధర్మ నిర్మాణ చతురునిగా కొనియాడబడ్డాడు. సత్వగుణ సంపన్నుడు. సహనశీలి. ధృతరాష్ట్రునికి మంత్రిగా, భీష్మునికి కుడిభుజంగా కౌరవ సామ్రాజ్యాన్ని పటిష్టపరిచాడు. దుష్టచతుష్టయం చేసిన ఎన్నో దురాగతాల నుంచి పాండవులను కాపాడి, ధర్మాన్ని రక్షించాడు. విదురుని వ్యక్తిగత జీవితం మచ్చలేనిది. వ్యక్తిత్వం మహోన్నతమైనది. సత్యాన్ని, ధర్మాన్ని నమ్ముకొని, ఆచరించాడు. తన అన్నగారైన ధృతరాష్ట్రునికి ధర్మసందేహాలను నివృత్తి చేసే ప్రతీ సందర్భంలోనూ నిర్మొహమాటంగా వివరించాడు. నిజాయితీ, ఆశావాదం, సంకల్పశుద్ధి, దూరదృష్టి, సాహసోపేత నిర్ణయాలు సత్వరం తీసుకొనే సామర్థ్యం, సత్వర సమస్య పరిష్కార విజ్ఞత, భావ వ్యక్తీకరణలో సరళత, వక్తృత్వంలో, ఆలోచనలో స్పష్టత, భావోద్వేగాల నియంత్రణ, క్రిందివారికి కార్యసాధనలో ప్రేరణాత్మక సూచనలతో సహాయపడుత, అవసరమైన చోట గోప్యత వంటి నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న పుణ్యాత్ముడు విదురుడు.

8.భీష్ముడు :

ఈతడు గంగా శంతనుల కుమారుడు. శాపగ్రస్తులైన అష్ట వసువులలో ఒకడు. బాల్యమంతా తల్లితో గడిపి, పరశురాముని వద్ద విద్యాబుద్ధులు నేర్చి, యుక్త వయస్సులో తండ్రిని చేరాడు. తండ్రి సుఖం కోసం తాను ఆజన్మాంత బ్రహ్మచర్యాన్ని అవలంభించాడు. తత్ఫలితంగా తండ్రిచే స్వచ్ఛంద మరణం వరంగా పొందాడు. వంశగౌరవం కోసం స్వసుఖాన్ని వదులుకున్నాడు. నిజ జీవితంలో నిత్య సన్యాసి. యుద్ధరంగంలో మహా యోధుడు. నిండు సభలో ద్రౌపది మానాన్ని హరిస్తున్న నీచులను నిలువరించలేని నిర్భాగ్యుడు. అందువల్లనే స్వచ్ఛంద మరణ వరమున్నా 58 రోజులు అంపశయ్యపై ఆపాప ఫలాన్ని అనుభవించిన అభాగ్యుడు. తన భుజ బల పరాక్రమంతో విశాల సామ్రాజ్యాన్ని విస్తరించిన మహావీరుడు. భీష్ముడు మహాజ్ఞాని. కానీ అజ్ఞానాంధకారి అయిన దుర్యోధనుని ఆజ్ఞలను శిరసావహించవలసి వచ్చిన దురదృష్టవంతుడు.

9.ద్రోణుడు :

ఇతడు భారద్వాజ మహర్షికి, ఘ్రుతాచి అనే అప్సరస కారణంగా కలిగిన బిడ్డ. అగ్ని దేవుని పుత్రుడైన అగ్నివేశ మహర్షి వద్ద ద్రుపదునితో పాటు ధనుర్విద్య అభ్యసించాడు. కృపాచార్యుని సోదరి కృపిని వివాహం చేసుకున్నాడు. ద్రోణుని దృష్టి అంతా విద్యార్జన పైనే ఉండేది. ద్రోణుడు నిత్య విద్యార్థి. పరశురాముని ఆశ్రయించి ధనానికి బదులు ఆయన వద్ద సకల అస్త్ర శస్త్ర విద్యలను నేర్చుకొని దేవతలను సైతం ధిక్కరించగలిగే విలుకాడయ్యాడు. విద్యా సముపార్జన ధ్యాసలో పడిపోవడం వల్ల కుటుంబం కడు దీనస్థితికి చేరుకుంది. పసివాడైన అశ్వత్థామకు పాలు నిమిత్తం ఆవు కోసం తన సహాధ్యాయి, చిన్ననాటి స్నేహితుడైన ద్రుపద మహారాజు వద్దకు వెళ్ళాడు. రాజ్య మదాంధకారంతో ద్రుపదుడు ద్రోణుని అవమానించాడు. విద్యాబలం

ఎంత గొప్పదో నిరూపిస్తానని శపథం చేశాడు. కురు పాండవులకు గురువుగా నియమింపబడ్డాడు. అర్జునుణ్ణి సాటిలేని మేటి విలుకాడుగా తీర్చిదిద్దుతానని మాటిచ్చి నిలబెట్టుకున్నాడు. అందుకోసం పరోక్ష శిష్యుడైన ఏకలవ్యున్ని అన్యాయంగా బొటనవేలుని గురుదక్షిణగా కోరి ఆయన యశశ్చంద్రికలో మాయని మచ్చ తెచ్చుకున్నాడు. తనని వధించడానికే జన్మించిన ధృష్టద్యుమ్ననికి కూడా విద్యను నేర్పాడు. చివరికి అతని చేతిలోనే హతుడయ్యాడు. కురుక్షేత్ర మహా సంగ్రామంలో దుర్యోధనుడు కట్టబెట్టిన సర్వ సైన్యాధ్యక్ష పదవికి పొంగిపోయి, తదుపరి అతని సూటి పోటి మాటలకు కృంగిపోయి పద్మవ్యూహంలో అభిమన్యుణ్ణి చంపడానికి అధర్మానికి పాల్పడ్డాడు.

10.పాండురాజు :

ఇతడు అంబాలికకు వ్యాసుని వలన కలిగిన పుత్రుడు. కుంతీ, మాద్రి ఈతని భార్యలు. తన అన్నగారైన ధృతరాష్ట్రుని పేరిట రాజ్య పాలన చేశాడు. తన పరాక్రమంతో సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి, అపార ధనరాశులను సాధించి అన్నగారిచే అనేక అశ్వమేధ యాగాలు చేయించాడు. భార్యలతో సహా వేటకు వెళ్ళి కామపరవశమైన లేడి జంటను బాణంతో కొట్టాడు. మగ లేడి రూపంలో ఉన్న కిందముడు అనే ఋషి మరణిస్తూ నీవు కూడా స్త్రీ సంగమంతో మరణిస్తావని శపించాడు. శాప భయంతో సంసార సుఖానికి దూరమైన పాండురాజు 'అపుత్రస్య గతిర్నాస్తి' అని విచారించి కుంతితో చర్చించి, ఆమెను ఒప్పించి దూర్వాసుడు అనుగ్రహించిన మంత్ర ప్రభావంతో కుంతి ద్వారా ధర్మరాజు, భీమార్జునులను, మాద్రి ద్వారా నకుల సహదేవులను పుత్రులుగా పొందాడు. బుద్ధి కర్మానుసారిణి అన్నట్లుగా ఒకానొక వసంత కాలాన ప్రకృతి శోభాయమాన సమయాన మన్మధ తాపం అధికమై ముని శాపాన్ని మరచి మాద్రిని సమీపించి దుర్మరణం పొందాడు.

11.కుంతీదేవి :

ఈమె యదువంశ రాజు శూరసేనుని కుమార్తె. పేరు పృథ. శూరసేనుని ఆత్మబంధువు కుంతిభోజుని దత్తపుత్రికగా పెరగడం వలన కుంతిగా పిలవబడింది. కుంతి సపర్యలకు మెచ్చి ముక్కోపి దూర్వాస మహర్షి ఇచ్చిన ఒక వరమంత్రమే ఆమె పట్ల శాపమైందని చెప్పుకోవచ్చు. బాల్యచాపల్యం వల్ల ఆ మంత్రాన్ని పఠించి ఘోర తప్పిదానికి ఆమె పూనుకోవలసి వచ్చింది. సూర్య భగవానుని అనుగ్రహంతో కర్ణుడుకి జన్మనిచ్చి, లోకాపవాదుకి వెరచి నదిలో వదిలింది. కుంతి చేసిన ఆ ఒక్క తప్పు వల్లనే కర్ణుడు సూతునికి దొరికి రాధేయుడుగా పెరిగి, దుర్యోధనుని పంచన చేరి పాండవులకు ఆగర్భ శత్రువుగా మారాడు. దూర్వాసుని ద్వారా తను పొందిన మంత్ర ప్రభావం తెలిసి తనకు ఇష్టం లేకపోయినా భర్త పాండురాజు బలవంతంతో వంశాన్ని నిలబెట్టడం కోసం దేవతలను ఆహ్వానించి ధర్మరాజు, భీమార్జునులను కన్నది. సవతి యైన మాద్రికి కూడా మంత్రోపదేశం చేసి నకుల సహదేవులకు తల్లిని చేసింది. భర్త మరణానికి కారణమైనానని మాద్రి సతీసహగమనం చేసినందున ఆమె సంతానాన్ని కూడా తన పిల్లలతో సమానంగా పెంచి పెద్దచేసింది. భర్త మరణం తరువాత కొన్నాళ్ళు ఐదుగురు పిల్లలతో అడవిలోనే ఉంటూ అష్టకష్టాలు పడింది. హస్తినాపురం చేరిన పిదప బాల్యక్రీడలలో భీముణ్ణి గెలవలేక మత్సరంతో దుర్యోధనుడు భీముణ్ణి చంపడానికి విషాన్నం పెట్టి, తాళ్ళతో కట్టి నదిలో పడవేశాడు. వారం రోజుల వరకు భీముడు కనబడకపోతే మిగిలిన నలుగురు పిల్లల్ని పెట్టుకొని కనిపించని కొడుకు కోసం తల్లడిల్లి పోయింది. ఆ తరుణంలో బంధువులు ఎవరూ కుంతిని పరామర్శించిన పాపాన పోలేదు. కుమారాస్త్ర విద్యాప్రదర్శనలో కర్ణుని చూసి కర్ణార్జునుల మధ్య రగులుతున్న ద్వేషాగ్నుల జ్వాల చూసి మౌనంగా కుమిలిపోయింది. తండ్రి లేని బిడ్డలను క్రమశిక్షణతో సంస్కారవంతంగా, మహాయోధులుగా,

ధర్మవర్తనులుగా తీర్చి దిద్దిన ధీర వనిత, గొప్ప మానవతామూర్తి, ఆదర్శ మాతృమూర్తి కుంతి. పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలు ముగిసేవరకు సాధుమూర్తి విదురుని ఇంట తలదాచుకుంది. కురుక్షేత్ర యుద్ధానంతరం రాజమాతగా రాజభోగాలు అనుభవించకుండా గాంధారి, ధృతరాష్ట్రులకు సేవలు చేస్తూ అరణ్యంలోనే నివసించింది. అక్కడే వారితోపాటు దావానలంలో ఆహుతైపోయింది.

12.శకుని :

ఇతడు గాంధార రాజు సుబలుని కుమారుడు. దుష్టచతుష్టయంలో ఒకడు. దుర్యోధనునికి అయినవాడు. అమ్మ తమ్ముడు. మాయా పాచిక విశారదుడు. మహా జూదగాడు. అసలే అసూయాపరుడైన దుర్యోధనునికి మయసభ వైభవాన్ని చూసి ఏర్పడిన గోరంత ఈర్ష్యని కొండంత చేసిన ఘనాపాటి మేనమామ శకుని. పాండవుల పట్ల ఉన్న కసిని, కోపాన్ని దుర్యోధనునిలో మరింత పెంచి వారిని సమూలంగా హతమార్చడానికి ప్రణాళిక రచించిన పయోముఖ విష కుంభం. ఈతని దుర్నీతి వల్ల, దుష్ట పన్నాగాల వల్ల, దుర్బోధల వల్ల ప్రఖ్యాతమైన కౌరవ వంశం లోని తన సహోదరి సంతానం సమూలంగా నాశనమైపోయింది.

13.దుర్యోధనుడు :

ఇతడు కలిపురుషుని అవతారం. పుట్టడమే అసూయతో పుట్టాడు. బాల్యము నుండి పాండవుల బుద్ధికుశలతకు, బలపరాక్రమాలకు అసూయ పడుతూనే పెరిగాడు. ఈతనిలో అసూయతో పాటు అహంకారం, దురాశ, అతి స్వార్థము, అజ్ఞానం వయసుతో పాటు పెరుగుతూ వచ్చాయి. వీటికి తోడు, మేనమామ శకుని కుత్సితము, దుర్బోధలు, కర్ణార్జునుల వైరము అగ్నికి ఆజ్యం పోసినవి. రాజ్యాధికార కాంక్ష దుర్యోధనుని దుర్మార్గుడిగా, ధర్మ విరోధిగా, కరడుగట్టిన తీవ్రవాదిగా మార్చివేసినది. తత్ఫలితంగా సంధి ప్రయత్నాలన్నీ విఫలించి కురుక్షేత్ర మహా సంగ్రామానికి దారితీసింది. యుద్ధ రంగంలో భీష్మ ద్రోణాదులను అనుక్షణం పాండవ పక్షపాతులని దెప్పిపొడుస్తూ మానసికంగా అవమానపరుస్తూ ఉన్మాదిలా ప్రవర్తించాడు. ఐదూళ్ళడిగిన పాండవులకు సూదిమొన మోపినంత జాగా కూడా ఇవ్వనని తెగేసి చెప్పిన పరమ స్వార్థపరుడు, అపరిమిత అహంకారి. అందువల్లనే తనతో పాటు తన తమ్ముళ్ళను మొత్తంగా తన వంశాన్నే బలిచేశాడు.

14.దుశ్శాసనుడు :

ఇతడు అన్నకు తగ్గ తమ్ముడు. అన్న ఆజ్ఞలను శిరసావహించడమే తప్ప మంచి చెడ్డల విచక్షణ తెలియని మదోన్మత్తుడు. ధర్మాధర్మ వివేచన లేని అధర్మపరుడు. అన్న ఆజ్ఞతో నిండు సభలోకి ఏకవస్త్ర అయిన ద్రౌపదిని జుట్టుపట్టుకొని ఈడ్చుకొని వచ్చి వస్త్రాపహరణం గావించిన గాంధారీ సుతుడు. ఆ పాప ఫలమే కురుక్షేత్ర యుద్ధంలో భీముని చేత అత్యంత భయంకరంగా వధించబడ్డాడు.

15.ధర్మరాజు :

ఇతడు కుంతీపుత్రులలో జ్యేష్ఠుడు. అసలు పేరు యుధిష్ఠిరుడు. యమధర్మరాజు వర ప్రసాది. త్రేతాయుగంలో శ్రీరాముడు " రామో విగ్రహవాన్ ధర్మః" అనిపించుకుంటే ద్వాపరయుగములో ధర్మరాజు "పోతపోసిన ధర్మము". ధర్మాన్ని తన చుట్టూ కవచంగా ఏర్పరచుకున్న ధర్మ నిష్ఠా గరిష్ఠుడు. తన కంటే ఎన్నో రెట్లు బలవంతులైన తన తమ్ములను ఎన్నో సంక్లిష్ట సందర్భాల్లో తన కనుసన్నలతోనే నిలువరించిన శాంతమూర్తి. ధర్మరాజుకు ఉన్న ఏకైక వ్యసనం జూదం. అదే అతని బలహీనత. ధర్మమే అతని బలం. ద్యూత క్రీడలో సమస్తమూ కోల్పోయి కౌరవ సభలో పాంచాలీ పరాభవ సందర్భంలోనూ ధర్మానికి కట్టుబడిన సహనశీలి. కొండచిలువ రూపంలో ఉన్న నహుషుని బారినుండి భీముణ్ణి, యక్షుని బారినుండి తన తమ్ములను రక్షించుకున్న

ధర్మజ్ఞాని. కురుక్షేత్ర యుద్ధారంభంలో భీష్మ ద్రోణుల వద్దకు వెళ్ళి వారికి నమస్కరించి వారి ఆశీర్వాదబలంతో సగం విజయం సొంతం చేసుకున్న మెత్తనిపులి ధర్మరాజు. శత్రు పక్షంలో ఉన్నవారిని తమ తరఫున పోరాడడానికి ఆహ్వానించిన రాజకీయచతురుడు. ఆవిధంగా వచ్చిన యుయుత్సుడే యుద్ధానంతరం కౌరవులకు ఉత్తర క్రియలు జరిపించాడు. "వినయం విజయానికి నాంది" అనే దానికి నిదర్శనం ధర్మరాజు అయితే "అహంకారం పతనానికి పునాది" అనే దానికి తార్కాణం దుర్యోధనుడు. మహా ప్రస్థాన సమయంలో తన భార్యా తమ్ములు మార్గమధ్యములో మరణించినా తనను విడువకుండా వెన్నంటి వచ్చిన కుక్కకి స్వర్గ ప్రవేశం లేదన్న కారణంతో ఆ స్వర్గాన్నే తృణీకరించిన ధర్మమూర్తి.

16. భీముడు :

కుంతీదేవికి వాయుదేవుని అనుగ్రహంతో జన్మించినవాడు. పుట్టుకతోనే మహాబలశాలి. బాల్యక్రీడలలో భీముడు కౌరవులను ముప్పు తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేవాడు. దాంతో కౌరవులకు భీముడంటే భయము, అసూయ, ద్వేషం ఏర్పడ్డాయి. భీముడు ఎంత దుందుడుకు స్వభావం కలిగిన బాహుబలి అయినా ఎన్నడూ అమ్మమాట గానీ, అన్న మాట గానీ జవదాటి ఎరుగని వినయశీలుడు. వివేకవంతుడు. లోక కంటకులైన బకాసురుడు, హిడింబాసురుడు, జరాసంధుడు లాంటి రాక్షస వీరులను యమపురికి పంపిన లోక కల్యాణకారకుడు. ద్రౌపదికి అవమానం జరిగిన ప్రతిసారీ వెంటనే స్పందించిన ధీరోదాత్తుడు. నిండు పేరోలగంలో కనుసైగ చేసి ద్రౌపదిని ఎడమ తొడపై కూర్చోమన్న దుర్యోధనునికి యుద్ధంలో అదే తోడను పగుల కొడతానని శపథం చేసి నెరవేర్చుకున్న కర్మవీరుడు. అజ్ఞాతవాస సమయంలో విరాటుని కొలువులో సైరంధ్రిగా ఉన్న ద్రౌపదిని అత్యాచారం చేయబోయిన కీచకుని తుదముట్టించి ఆమెకు సాంత్వన చేకూర్చిన మహాయోధుడు. దుశ్శాసనుడి చేతి వేళ్ళతో లాగబడి సగం తెగిన కేశపాశములను ఆ దుశ్శాసనుని గుండె పగిల్చి ఆ రక్తంతోనే ముడి వేసి తన ప్రతిజ్ఞను చెల్లించి, ద్రౌపది ప్రతీకార జ్వాలను ఆర్పివేసిన అరివీర భయంకరుడు. ఇతని తిండిబోతు తనంతో అతి భయంకరుడై, తన బాహుబలంతో ఎవరినీ లెక్కచేయక, వ్యర్థపు మాటలు ఆడుతూ ఉండడం వలన మహాప్రస్థాన సమయంలో నేలపై పడి మరణించాడు.

17.అర్జునుడు :

కుంతీ కుమారుడు. పాండవ మధ్యముడు. విద్యార్థి లోకానికే ఆదర్శప్రాయుడు. నిరంతర విద్యార్థి. అలుపెరుగని అసామాన్య సాధకుడు. "విద్యా తురాణాం న సుఖం న నిద్ర" అనే సూక్తి అర్జునుని విషయంలో నిజమైంది. అర్ధరాత్రి కటికచీకటిలో ధనుర్విద్య సాధన చేస్తున్న అర్జునుని దీక్షాదక్షతలకు గురువైన ద్రోణాచార్యుడు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. అర్జునుణ్ణి సాటి లేని మేటి విలుకారునిగా తీర్చిదిద్దుతానని మాటిచ్చి నిలబెట్టుకున్నాడు. గురుదక్షిణగా ద్రుపదుని బంధించి తెచ్చి గురువుగారి ఆశయాన్ని నెరవేర్చిన అనుంగు శిష్యుడు. మొసలి బారినుండి గురువును రక్షించిన ప్రియ శిష్యుడు. 'బాసము' అనే చెక్క పక్షి కనుగుడ్డుకి గురి పెట్టిన అర్జునుని ఏకాగ్రత అనన్య సామాన్యము. కురుక్షేత్ర రణ రంగంలో ఎదిరి పక్షంలో ఉన్న బంధు మిత్రులను చూసి వీరందరినీ యుద్ధంలో వధించవలసి వస్తున్నందుకు హృదయం ద్రవించి విలపించిన సున్నిత మనస్కుడు.

శ్రీకృష్ణుని గీతోపదేశంతో కార్యోన్ముఖుడైన కర్తవ్యపరాయణుడు. అభిమన్యుని మరణవార్త విని ఆగ్రహోదగ్రుడై కౌరవులందరినీ ఒకే రోజులో తుదముట్టిస్తానని శపథం చేసిన ఆవేశపరుడు. త్రికరణశుద్ధిగా శ్రీకృష్ణుని నమ్మిన వీర విధేయుడు, వినయ సంపన్నుడు.

18.శ్రీ కృష్ణుడు :

చంద్రవంశపు క్షత్రియుడు. యయాతి కుమారులలో పెద్దవాడైన యదువు వంశంలో పుట్టిన యాదవరాజు. మహాభారత యుద్ధంలో స్వయంగా ఆయుధం పట్టలేదు. యుద్ధం చేయలేదు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, ధర్మ సంరక్షణకై దివి నుండి భువికి దిగిన సంపూర్ణావతారం. లీలా మానుష విగ్రహం. జగన్నాటక సూత్రధారి. శ్రీకృష్ణుడు శైశవం నుండి కూడా లీలలు ప్రదర్శిస్తూనే ఉన్నాడు. బాల్యంలోనే పూతన, శకటాసురుడు, తృణావర్తుడు మొదలైన రాక్షసులను మట్టుబెట్టాడు. మేనమామ కంసుణ్ణి, మల్లయోధుడు చాణూరుణ్ణి కౌమారంలోనే కైలాసానికి పంపాడు. నరకాసురుడు, శిశుపాలుడు, దంతవక్త్రుడు లాంటి దానవ వీరులను యుక్త వయసులోనే యమపురికి పంపాడు. కర్తవ్య నిర్వహణమే ధర్మము అని, స్వధర్మమే దైవమని బోధించాడు. విధ్యుక్త కర్తవ్య నిర్వహణ నుండి ఎవరూ పరాఙ్ముఖులు కాకూడదని, స్వధర్మ నిర్వహణలో కార్యోన్ముఖులు కావాలని అర్జునునికి చేసిన గీతోపదేశం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పి సర్వ మానవాళికి వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, జగద్గురువుగా భాసిల్లాడు. కౌరవులు, పాండవులు ఇరు వర్గాల వారూ శ్రీకృష్ణునికి దగ్గరి బంధువులే. కానీ అధర్మపరులైన కౌరవులవైపు కాకుండా ధర్మవర్తనులైన పాండవులకు అండగా నిలచిన ధర్మ పక్షపాతి శ్రీకృష్ణుడు.

పాండవులు శ్రీకృష్ణుని అండదండలతో అనేక అపాయాలను దాటగలిగారు. ప్రమాదాలను తప్పించుకోగలిగారు. ఘన కార్యాలను సాధించగలిగారు. ధర్మరాజు చేసిన రాజసూయ యాగానికి అరుదెంచిన బ్రాహ్మణోత్తములకు స్వయంగా పాద ప్రక్షాళన గావించిన పురుషోత్తముడు, అహంకార రహితుడు. అన్న బలరామునికి ఎదురు మాట చెప్పని వినయవంతుడు. అన్నకిష్టం లేకున్నా సుభద్రని అర్జునునికి, శశిరేఖని అభిమన్యునికి ఇచ్చి వివాహం జరిపించిన బంధుప్రీతి, సయోధ్య అతని కుటుంబ స్నేహ సంబంధాల పట్ల మక్కువను తెలుపుతున్నాయి. ఎన్ని కష్టాలైనా, నష్టాలైనా, పొగడ్తలైనా, తెగడ్తలైనా, సుఖమైనా, దు:ఖమైనా, ఆనందమైనా, విషాదమైనా పొంగిపోక, కృంగిపోక సమతౌల్యం పాటించిన స్థితప్రజ్ఞుడు. గాంధారీదేవి తన నూరుగురు కుమారులు మరణించారన్న దు:ఖములో తన యాదవ వంశం నాశనం కమ్మని శపించినప్పుడు ఆమెకు ప్రతిశాపమివ్వకుండా శాపాన్ని స్వీకరించి ఆమె కడుపుమంట చల్లార్చిన సహనశీలి, శాంతమూర్తి. ద్రౌపదికి మన సంరక్షణ చేసిన మహోన్నత మానవతామూర్తి. అక్షయపాత్ర ద్వారా దూర్వాస మహర్షి కోపాగ్ని నుండి పాండవులను రక్షించిన యుక్తిపరుడు. మేనత్త సాత్వతి కిచ్చిన మాట ప్రకారం శిశుపాలుని నూరు తప్పులు సహించిన సౌజన్యమూర్తి. మరో మేనత్త కుంతీదేవి కిచ్చిన మాట ప్రకారం పాండవులను అడుగడుగునా ఆదుకున్న ఆర్తత్రాణపరాయణుడు. అష్ట భార్యల మధ్య అరమరికలు లేకుండా, సవతిపోరు పొడచూపనీయకుండా సమాన ఆదరాభిమానాలను కనబరచి సమన సంతృప్తులు గావించిన దక్షిణ నాయకుడు. ఏలాంటి విపత్కర పరిస్థితులలోనైనా చెదరని, చెరగని చిక్కని చిరువవ్వుతో మృదు మధుర సంభాషణలతో ఏ కార్యము ఎంత చాకచాక్యముగా నడపాలో తెలిసిన సరస సంభాషణా చతురుడు. ఎవరెవరిని ఎక్కడెక్కడ ఏవిధంగా పావులుగా వాడాలో, ఎప్పుడెప్పుడు అధర్మాన్ని అంతం చేయాలో, ధర్మ సంస్థాపన చేయాలో బాగుగా తెలిసిన మహానుభావుడు. మహాభారతాన్ని అంతా తానై నడిపించిన అసమాన పురుషోత్తముడు శ్రీకృష్ణుడు.

19.కర్ణుడు :

దూర్వాస మహర్షి మంత్ర ప్రభావం చేత సూర్యుని వలన కుంతికి జన్మించిన వాడు కర్ణుడు. పుట్టిన నాటినుండి అతనికి అన్నీ కష్టాలే. తల్లి అమాయకత్వం వలన పెళ్ళి కాకుండా తల్లయి లోకాపవాద భీతితో కన్నబిడ్డని నది పాలు చేసింది. సూత పుత్రుడుగా పెరిగాడు. చిన్నతనం నుండే పాండవులపై ద్వేషం, ముఖ్యంగా

అర్జునునిపై ఈర్ష్య ప్రదర్శిస్తూనే ఉన్నాడు. అందువల్లనే నిలువెల్లా అసూయాద్వేషాలతో రగులుతున్న దుర్యోధనునికి ఇష్టమయ్యాడు. కుమారాస్త్ర విద్యా ప్రదర్శనలో అర్జునుని విద్యలన్నీ కర్ణుడు ప్రదర్శించేసరికి అర్జునునికి ధీటైన విలుకాడు తన వైపు లేడని పరితపిస్తున్న దుర్యోధనునికి కర్ణుడు ఆశాకిరణంగా కనిపించాడు. కర్ణుని నిస్సహాయ పరిస్థితిని తన కనుకూలంగా మార్చుకొని స్నేహ బంధంతో కట్టిపడేశాడు. అంగరాజ్యానికి రాజుని చేసి శాశ్వత సామంతుడిని చేసేశాడు. ఈ కపటమెరుగని కర్ణుడు తనకు జరిగిన అవమానానికి ప్రతీకారంగా పాండవులపై విషం కక్కే దుర్యోధనునికి అగ్నికి ఆజ్యం తోడైనట్లు జతకలసి దుర్యోధనుని దుర్మార్గాలను మరింత పెంచి పోషించాడు. స్వయంవరంలో ద్రౌపది సూత పుత్రుని వరించనని నిష్కర్షగా ముందే చెప్పడం వలన కర్ణుని మనసు గాయపడింది. అది మనసులో నుంచుకొని పాండవులు జూదంలో ఓడిపోయినప్పుడు ద్రౌపదిని సభకు ఈడ్పించుకు రావడం, బంధకి వలువలు ఊడ్చమని చెప్పడం, జూదంలో ఓడిపోని మరొకరిని వివాహమాడుమని పలకడం, దుర్యోధనుడు తొడ చూపించి వచ్చి కూర్చోమని సైగ చేయించడం ద్వారా ద్రౌపదిని మహాఘోరంగా అవమానించాడు. ఇంద్రుడు కవచకుండలాల కోసం వస్తున్నాడని స్వయంగా తన కన్నతండ్రి సూర్యుడే చెప్పినా వినకుండా దానం చేసిన కీర్తికాంక్షాపరుడు. విద్యార్థి దశలో అబద్ధమాడి గురువు పరశురాముని శాపానికి, ఆవేశానికి లోనై బ్రాహ్మణుని శాపానికి గురయ్యాడు. మానసిక ఉద్వేగంతో భీష్మద్రోణులు యుద్ధ రంగంలో ఉన్నంతవరకు తాను యుద్ధం చేయనని మొండికేసిన ప్రథమ కోపి. దాన వీర శూర కర్ణుడు చివరకు చెడు స్నేహం వలన ఎంతలా దిగజారిపోయాడనడానికి ప్రబల తార్కాణంగా నిలిచిపోయాడు. పద్మవ్యూహంలో వీరకిశోరంలా విజృంభించిన బాలుడైన అభిమన్యుని ఒక్కక్కరుగా ఎదిరించలేక యుద్ధ ధర్మాన్ని విడనాడి పదిమంది కలసి మూకుమ్మడిగా చేరి వధించి, అధర్మ యుద్ధానికి బీజం వేసిన వారిలో ముఖ్యుడు కర్ణుడు. అయినా దాన వ్రతానికి కట్టుబడిన దానవీరుడు. కన్నతల్లి కుంతి కిచ్చిన మాట ప్రకారం తన చేతికి చిక్కిన ధర్మరాజు, భీముడు, నకుల సహదేవులను విడిచిపెట్టిన సత్యసంధుడు. సూర్యుడు, కృష్ణుడు, కుంతి తన జన్మరహస్యాన్ని చెప్పి పాండవులలో కలసి పొమ్మని ప్రాధేయపడినా, ప్రలోభపెట్టినా కర్ణుడు మాత్రం స్నేహ ధర్మానికే కట్టుబడిన వీరాధివీరుడు, అదృష్ట హీనుడు.

20.నకులుడు :

ఇతడు మాద్రీ తనయులలో అగ్రజుడు, పాండవులలో నాల్గవ వాడు. మహా సౌందర్యవంతుడు. కరవాల విద్యలో కౌశలం కలవాడు. అశ్వపోషణలో ఆరితేరినవాడు. అన్నదమ్ముల పట్ల గౌరవాభినాలు కలవాడు. నకులుడు తనతో సమానమైన వాడు, సమస్త లోకాలలోనూ ఎవరూ లేరనీ చక్కని సౌందర్య రూపము తనకే ఉందని ఎప్పుడూ మనస్సులో భావించేవాడు. నకులునికి గల ఆ సౌందర్య అహంకారం వల్లనే అతని పుణ్యాలు నశించి మరణించాడు.

21.సహదేవుడు :

ఇతడు మాద్రీ పుత్రులలో చిన్నవాడు. పంచ పాండవులలో చివరివాడు. అన్నదమ్ములందరికీ అతిభక్తిశ్రద్ధలతో శుశ్రూష చేయువాడు. సద్వర్తనుడు. కుంతీదేవికి అత్యంత ప్రియమైన పుత్రుడు. శ్రీకృష్ణుని రాయబార సమయంలో "రాజ్యము వీర భోజ్యము -విజయమో వీర స్వర్గమో" అని యుద్ధానికి సిద్ధమని ఎలుగెత్తి చాటిన రాచబిడ్డ సహదేవుడు. గోరక్షణలో అందెవేసిన చెయ్యి. చివరకు సహదేవుడు లోకంలో తనకంటే గొప్ప పండితుడు ఎవరూ లేరని నిరంతరం తన మనస్సులో తలచుకుంటూ గర్వపడేవాడు. అందువలన సహదేవుడు తన విద్యా సంబంధమైన అహంకారం వలన పతనం చెందాడు.

22.ద్రౌపది :

ఈమె పాంచాల రాజు ద్రుపదుని కుమార్తె. అయోనిజ. అసలు పేరు 'కృష్ణ'. యజ్ఞ కుండంలో జన్మించిన యాజ్ఞసేని. అతిలోక సౌందర్యవతి. అసమాన లావణ్యవతి. గత జన్మలో చేసిన తపః ప్రభావం చేత ద్రౌపది ఐదుగురిని వివాహమాడినా వారి మధ్య ఎన్నడూ విభేదాలు రానీయలేదు. అజేయ పరాక్రములైన ఐదుగురు భార్తలున్నా అందరిముందూ అవమానాల పాలై వారితోపాటు అరణ్యాలకు వెళ్ళింది, అజ్ఞాత వాసమూ చేసింది. విరాటుని పంచన కీచకుని బారినుండి యుక్తిగా తనను తాను రక్షించుకోవడమే కాకుండా దుర్మార్గుడైన కీచకునితో పాటు అతని నూరుగురు తమ్ములను కూడా యమ సదనానికి పంపించిన సుధీర. ఒక స్త్రీ భార్యాగా, కూతురిగా, కోడలిగా, తల్లిగా, చెల్లిగా ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో ఆచరణ ద్వారా సత్యభామకు తెలియజేసిన మహా సాధ్వి. ఎంత సహనశీలో, అంతటి సమర స్ఫూర్తి , సమయ స్ఫూర్తి కలిగిన గొప్ప యోధ. ఎన్ని అవమానాలైనా, ఎన్ని కష్టాలైనా సహనంతో భరించింది. సంధికి ఆరాటపడుతున్న భర్తలలో ప్రతీకార జ్వాలను రగిలించి రాచబిడ్డ పౌరుషాన్ని రగిలించింది. తన కన్నకొడుకులను నిర్దాక్షిణ్యంగా పొట్టన పెట్టుకున్న కసాయి అశ్వత్థామని క్షమించిన కారుణ్యమూర్తి. ఆడపడుచు భర్త అనే ఒకే ఒక కారణంతో తనపై అత్యాచారం తలపెట్టిన సైంధవుడిని సైతం విడిచిపెట్టిన క్షమాగుణ సంపన్నురాలు.

23.అభిమన్యుడు :

సుభద్రార్జునుల ఏకైక పుత్రుడు. శ్రీకృష్ణ పరమాత్మ మేనల్లుడు. మహా కోపంతో కూడిన భయ రహితుడు. అమిత పరాక్రమవంతుడు. కురుక్షేత్ర మహాసంగ్రామంలో ధర్మయుద్ధం చేసినవారు ఇద్దరే ఇద్దరు. ఒకరు భీష్ముడు అయితే మరొకరు అభిమన్యుడు. పద్మవ్యూహంలో ప్రవేశం తప్ప నిష్క్రమణ తెలియని బాలుడు. చిన్నవాడైనా చిచ్చరపిడుగులా చెలరేగి కౌరవ సైన్యాన్ని చీల్చిచెండాడుతుంటే కౌరవ పెద్దలకు ముచ్చెమటలు పట్టాయి. గుండెల్లో గుబులు పుట్టింది. ఇతనికున్న భయంలేని తనం, మహాకోపం కారణంగా సైంధవుడిచే అడ్డగించబడిన పెదనాన్నలు, చిన్నాన్నలు తనవెంట రాలేకపోయారన్న విషయాన్ని గమనించకుండా దుందుడుకుగా ముందుకు దూసుకుపోయాడు. ఈ పిల్లవాడి ధాటికి తట్టుకోలేక పదిమందీ కలసి అభిమన్యుణ్ణి నిరాయుధుడిని చేసి అతి కిరాతకంగా అధర్మంగా హతమార్చారు.

24.పరీక్షిత్తు :

ఇతను అర్జునుని మనుమడు. ఉత్తరాభిమన్యుల కుమారుడు. శ్రీకృష్ణునిచే రక్షింపబడినవాడు. ధర్మవర్తనుడు. ప్రజారంజక పాలకుడు. ఒకనాడు వేటకు వెళ్ళి అలసి సొలసి శమీకుని ఆశ్రమానికి చేరుకున్నాడు. ధ్యానంలో ఉన్న ముని ఇతని పిలుపుకి సమాధానం ఇవ్వలేదని కోపించి క్షణికావేశంలో చచ్చిన పామును ముని మెడలో వేసి వెనుతిరిగాడు. అది గమనించిన ముని కుమారుడు శృంగి ఈ దుష్కృత్యానికి పాల్పడిన వ్యక్తి ఏడు రోజుల్లో పాము కాటుతో మరణిస్తాడని శపించాడు. తత్ఫలితంగా తక్షకుని కాటుకి గురై బలయ్యాడు.

25.వికర్ణుడు :

దుష్ట దుర్యోధనుని శత సోదరులలో సత్పురుషుడు, సజ్జనుడు, ధార్మికుడు, ఒకే ఒక మంచివాడు వికర్ణుడు. దుశ్శాసనుడు ఎకవస్త్రగా ఉన్న ద్రౌపదిని సభలోకి ఈడ్చుకొని వచ్చి అవమాన పరుస్తున్నప్పుడు కురు వృద్ధులు, గురు వృద్ధ బాంధవులు ఎవరూ ఈ అన్యాయాన్ని అడ్డుకోలేదు, అధర్మమని నిలువరించ లేదు. అంతటి పేరోలగంలో ఒక్క వికర్ణుడు మాత్రమే ఆమె పక్షాన నిలబడి ఈ పందెం చెల్లదని, ఇది అన్యాయమని, ఆమెనిలా పరాభవించడం అధర్మమని సభాసదులందరికీ ఎలుగెత్తి చాటిన ఉత్తమోత్తముడు, బుద్ధిమంతుడు.

26.అశ్వత్థామ :

ఇతడు కృపి, ద్రోణుల ఏకైక కుమారుడు. కృపాచార్యుని మేనల్లుడు. ద్రోణునికి కుమారునిపై వల్లమాలిన ప్రేమ. దుర్యోధనునితో ఇతనికున్న చిన్ననాటి స్నేహితంతో అతడి బుద్ధులు కూడా అశ్వత్థామకు అంటుకున్నాయి. కొడుకు కుత్సిత బుద్ధి కనిపెట్టిన ద్రోణుడు కొన్ని గొప్ప గొప్ప అస్త్రాలను అశ్వత్థామకు చెప్పకుండా అర్జునుడికి మాత్రమే నేర్పాడు. శ్రీకృష్ణ రాయబార సమయంలో సంధికి విఘాతం కలిగిస్తున్న కర్ణుడిపై ఒంటికాలిపై లేచాడు. దుర్యోధనునిపై మండిపడ్డాడు. అలాంటి అశ్వత్థామ యుద్ధ భూమిలో తొడలు విరిగి పడియున్న తన చిన్ననాటి స్నేహితుడైన దుర్యోధనుని కళ్ళల్లో ఆనందం చూడడం కోసం అపాండవం చేస్తానని మాటిచ్చాడు. అందుకోసం పాండవులని భ్రమించి ఉప పాండవులను అర్ధరాత్రి వేళ అతి కిరాతకంగా, అత్యంత పాశవికంగా హతమార్చాడు. అశ్వత్థామ పుట్టకతో బ్రాహ్మణుడు. గుణంలో అధమాధముడు. చపలచిత్తుడు. మహాక్రోధోద్రేకి. అంతమందిని అతి దారుణంగా చంపడమే కాకుండా పాండవులపై ఉపసంహారం తెలియని బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించాడు. వెంటనే శ్రీకృష్ణుని సూచనమేరకు అర్జునుడు బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని ప్రయోగించి బదులిచ్చాడు. ఉపసంహారం తెలియని అశ్వత్థామ ఆ అస్త్రాన్ని పాండవుల గర్భస్థ శిశువులపైకి దారి మళ్ళించాడు. నిదురించిన యోధులను సంహరించడం ఒక పాపమైతే, భ్రూణహత్య పాల్పడడం మరో పాపం. ఉపసంహారం తెలియని అస్త్రాన్ని సంధించడం మహా పాతకం. అందుకు ప్రతిఫలంగా ఏడుగురు చిరంజీవులలో ఒకడైన అశ్వత్థామని శ్రీకృష్ణుడు "బ్రాహ్మణోత్తముడవైన నీవు నరాధముడిగా ప్రవర్తించావు. కావున నీవు భయంకరమైన కుష్టువ్యాధిగ్రస్తుడవై మూడువేల సంవత్సరాలు కుళ్ళి కుళ్ళి కృంగి కృశించి నీచ నికృష్ట బ్రతుకు బ్రతుకు" అని శపించాడు.

ఉపయుక్త గ్రంథాలు :

కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2006.

❖❖❖

మహాభారతం - స్త్రీల హక్కులు

డాక్టర్ డి. ధాత్రికుమారి, సహాయాచార్యులు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర), గుంటూరు.

వ్యాస సంగ్రహం

మానవ హక్కులు అనేవి మానవుల జన్మసిద్ధమైన హక్కులు. ఇవి మానవుని గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన మార్గాలను, అవకాశాలను కల్పిస్తాయి. ఈ వ్యాసంలో ఐక్యరాజ్యసమితి (United Nations Organisation) 1948 డిసెంబరు 10 వ తేదీన విశ్వమానవ హక్కుల ప్రకటనను జారీ చేయడానికి పూర్వం మానవ హక్కులు అనే భావన'ధర్మం', 'పాడి', 'అధికారం' 'న్యాచురల్ లా', 'న్యాచురల్ జస్టిస్' మొదలయిన రూపాలలోఎలా అమలులో ఉందో వివరించడమైనది. హక్కుల ఆవశ్యకత, నిర్వచనం, అర్థవివరణను తెలియజేస్తూ,ముఖ్యంగా ఈనాటి హక్కులకు ప్రాతిపదికగా ఉన్న మహాభారత కాలంనాటి స్త్రీల హక్కులు,హెూదాలు, బాధ్యతలు, హక్కుల పరిరక్షణ మరియు ఉల్లంఘనలు/అవమానాలపై జరిగిన పోరాటాలను గురించి తరచిచూస్తూ,అవి కవిత్రయ భారతంలో ఎలా ప్రతిఫలించాయోవిశ్వమానవ హక్కుల ప్రకటనలోని మూడు తరాల (Three Generations) మానవ హక్కులతో సమన్వయం చేస్తూ పునర్మూల్యాంకన పద్ధతిలో విశ్లేషించడమైనది.

ముఖ్య పదాలు :

ధర్మం, న్యాయం, పాడి, అధికారం, Natural Law, Natural Justice, హక్కు, విశ్వమానవ హక్కులు, మహాభారతం - స్త్రీల హక్కులు.

ఉపోద్ఘాతం :

జైలు మాత్రమే బంధిఖానా కాదు మనిషి మానవ హక్కుల ఉల్లంఘన కూడా బంధిఖానానే - జవహర్ లాల్ ప్రస్తుత కాలంలో మానవ హక్కులు అనే పేరు వినని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో! ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10వ తేదీన విశ్వ మానవ హక్కుల ప్రకటనను జారీచేసిమానవ హక్కుల దినోత్సవంగా జరుపుతున్న రోజు నుండి ప్రతి ఒక్కరికి దీని ప్రాధాన్యత మరియు ఆవశ్యకత గురించి విపులంగా తెలిసిందని చెప్పవచ్చు. మరి ఇటువంటి ప్రకటన జారీ కాక పూర్వం ప్రాచీన కాలంలో మానవ హక్కుల ప్రస్తావన ఏమీ లేని రోజుల్లో అవి ఏ రూపంలో ఉండేవి? అనే సందేహం అందరికీ తప్పకుండా కలుగుతుంది.మానవుడు పాతరాతి యుగం నుండి నేటివరకు రకరకాలుగా పరిణామం చెందుతూ ప్రస్తుతం ఇప్పుడు స్థితికివచ్చినట్లుగానే, ఆ మానవులకు సంబంధించినహక్కులకు కూడా ఇటువంటి భూమిక తప్పనిసరిగా ఉండి ఉంటుంది కదా!ప్రతి యుగంలోనూ ఆయా యుగధర్మాల్ని అనుసరించి పరిస్థితులలో మార్పులు చోటుచేసుకున్నట్లే వాటికనుగుణంగా హక్కుల రూపంలో సహితం మార్పులు అనివార్యం. వాటిని గురించి తెలుసుకోడానికి మనకు లభించే ప్రధాన ఆధారం సాహిత్యమే. తెలుగులో వచ్చిన ప్రాచీన సాహిత్యం మానవ హక్కులను తెలియ జేయడం కోసం రచింపబడలేదు. అయినా ఆ సాహిత్యంలో చోటుచేసుకున్న వివిధ వృత్తాంతాలు మానవులకు సంబంధించినవే కాబట్టి సమకాలీన మానవ హక్కులను గురించి తెలుసుకోవడానికి ప్రాచీన సాహిత్యం కూడ తోడ్పడుతుంది.ప్రాచీన తెలుగు కావ్యేతి తిహాసమైన ఆంధ్ర మహా భారతంలో వివిధ రూపాలలో ఉన్న హక్కులను ఐక్యరాజ్యసమితి

ప్రకటించినమూడు తరాల(ThreeGeneration Rights)మానవ హక్కులలోస్త్రీల హక్కులు ఎక్కడెక్కడ ఏవిధంగా ప్రతిఫలించాయో విహంగవీక్షణంగా పునర్మూల్యాంకనం చేయడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

మానవ హక్కుల ఆవశ్యకత?

"మానవ హక్కుల పరిరక్షణ ఏ మనిషికైనా గౌరవప్రదమైన జీవితాన్ని ప్రసాదించే మొదటి అడుగు."

(M.K. Gandhi, My Experiments with Truth)

సామాజిక సమానత్వం కోసం, అణచివేత, వేధింపుల వంటి సమస్యల నుండి విముక్తి కల్పించేందుకు, వ్యక్తిగత మరియు సామాజిక, ఆర్థిక పురోగతికి కోసం, సమాజంలో శాంతి, స్థిరత్వం కోసం మానవ హక్కులు ఆవశ్యకం.

హక్కులు - నిర్వచనం :

ఒక వస్తువును లేదా విషయాన్ని పొందేందుకు ఒక వ్యక్తికి ఉన్న అనివార్యమైన అవకాశాన్నే 'హక్కు' అని వ్యవహరించవచ్చు.హక్కు అనేది ప్రతి వ్యక్తికి జీవించేందుకు, స్వేచ్ఛగా జీవనోపాధిని కొనసాగించేందుకు, గౌరవప్రదమైన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు సమాజం నుంచి పొందే హామీగా చెప్పవచ్చు. "హక్కు" అనే పదం న్యాయంతోనూ, ధర్మంతోనూ ముడిపడి ఉంటుంది. మహాభారతంలో చెప్పబడిన "ధర్మం" అనే భావన మన దేశంలో మానవ హక్కులకు పునాదిగా చెప్పవచ్చు.

హక్కు - అర్థ వివరణ :

హక్కు ఆనేది హిందుస్థానీ పదం. ప్రస్తుతం 'Right' అనే ఆంగ్లపదాన్ని తెలుగులో హక్కు అని వ్యవహరిస్తున్నాం. 'Right' అంటే ఆంగ్లంలో 'Justice' అని తెలుగులో న్యాయము, ధర్మము అని అర్థాలు చెప్పుకోవచ్చు. నేడు 'Right' అంటే హక్కు అనే అర్థం స్థిరపడిపోయింది. 'Human Right' అంటే మానవ హక్కని, దీని బహువచన రూపమే మానవ హక్కులు అని స్థూలంగా చెప్పుకోవచ్చు.

ప్రాచీన తెలుగు కవిత్వం - మానవ హక్కుల సమన్వయం :

పాశ్చాత్య మానవ హక్కుల సిద్ధాంతకర్తలు 'మానవ హక్కుల సిద్ధాంతాలు' వాళ్ల ప్రాచీన గ్రీకు, రోమన్ తాత్విక సిద్ధాంతాల్లోని "Justice, Natural Order, Natural Law" లాంటి భావనలలో ఇమిడి ఉన్నవని భావించినట్లే, భారతీయ తత్వవేత్తలు వారి వైదిక ధర్మ సిద్ధాంతాలలోని'హక్కు', 'హక్కుభుక్తము', 'ధర్మం', 'న్యాయం', 'పాడి', 'అధికారం' మొదలైన భావనలలో ఇమిడిఉన్నవని భావిస్తూ వాటిని అనుసరిస్తూ వచ్చారు.

"ధర్మో రక్షతి రక్షితః"

పై శ్లోకంలో ధర్మాన్ని పాటించడం ద్వారా మానవ హక్కులను పరిరక్షించగలమని స్పష్టమవుతుంది.

మహాభారతం - స్త్రీల హక్కుల ప్రతిఫలనం :

భారతీయ ప్రాచీన గ్రంథాల్లో రామాయణ భారతాలు మిక్కిలిప్రాచీనమైనవిగా పరిగణింపబడుతూఉ న్నాయి. మహాభారతాన్ని వేదవ్యాస మహర్షి "జయం' అనే పేరుతో సంస్కృతంలో రాశాడు. దాదాపు ఇది అన్ని భారతీయ భాషలలో అనువదించబడింది. తెలుగులో కవిత్రయంగా ప్రసిద్ధి చెందిన నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగ్గడ భారతాన్ని ఆంధ్రీకరించారు. ఆంధ్ర మహాభారతంలో ప్రాచీన భారత సమాజమే గాక సమకాలీన ఆంధ్ర సమాజం కూడ ప్రతిబింబించే విధంగా వీరి రచన సాగింది. ప్రాచీన తెలుగు కవిత్వంలో వైదిక ధర్మ భావనలతో నిండిన కవిత్రయ భారతంలో స్త్రీల మానవ హక్కుల స్థితిని పరిశీలించడమే ప్రస్తుత వ్యాస ప్రధానాంశం.

మానవ హక్కులలో మహిళల హక్కులు కూడా అంతర్భాగమే. మహాభారతంలోని కొన్ని ముఖ్య కథాంశాల ద్వారా స్త్రీల హక్కులప్రతిఫలనాలను విమర్శనాత్మక విశ్లేషణ చేయవచ్చు. భారతీయులు స్త్రీకి సముచితమైన గౌరవాన్నవ్వాలని, తగిన రక్షణ కల్పించాలని ప్రయత్నించి అందులో భాగంగా అనేక నీతులతో కూడిన విద్యను ప్రబోధించారు. సాహిత్యం ద్వారా కూడా ఆ ప్రయత్నం చేశారు. ఆ విషాయాన్నే ప్రస్తావిస్తూ మనుధర్మ శాస్త్రంలో

మాతృవత్ పరదారేషు పర ద్రవ్యేషు లోష్టవత్
ఆత్మవత్ సర్వభూతేషుయః పశ్యతి సపండితః

నిజమైన జ్ఞానాన్ని సముపార్జించిన వ్యక్తి తన భార్యను తప్ప ఇతర స్త్రీలను తన తల్లిలాగ భావించాలి అని చెప్పబడింది. స్త్రీల పట్ల అఘాయిత్యాలు చేయకుండా సంఘంలో ప్రతి మనిషికి స్త్రీల పట్లఉన్నతమైన ఆలోచనను, భావాలను రేకెత్తించారు.

మనుధర్మ శాస్త్రంలోనే స్త్రీలను గురించి గొప్పగా చెప్పబడిన మరో శ్లోకంలో

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"

అని ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు చరిస్తారుఅని చెప్పబడినట్లు సాహిత్యంలో, శాస్త్ర గ్రంథాలలో స్త్రీకి సమున్నత స్థానాన్ని కల్పించినప్పటికీ వాస్తవంలో వీటి అమలులో దాదాపుగా పరిరక్షణ కంటే ఉల్లంఘనలనే మనం అధికంగా గమనించవచ్చు. అందుకే వీటిని ప్రత్యేకంగా చర్చించవలసి వస్తుంది.

విశ్వమానవ హక్కులు

విశ్వమానవ హక్కుల ప్రకటనలో పేర్కొనబడిన 3 నుండి 21 వరకు గల నిబంధన లలో చెప్పబడిన వ్యక్తిగత, పౌర, రాజకీయ హక్కులను మొదటితరం హక్కులు (First Generation Rights) గా చెప్పవచ్చు. వీటిలో జీవించే హక్కులు, ప్రాణరక్షణ హక్కులు, స్వేచ్ఛా పరిరక్షణ హక్కులు, వ్యక్తిగత భద్రత హక్కులు, పరువుగా జీవించే హక్కులు, వివాహపు హక్కులు, ఆస్తి, భ్రూణ హక్కులు మొదలైన వాటిని వివరించడమైంది.ఆధునిక కాలంలో జరుగుతున్న ప్రజాస్వామ్య, స్వేచ్ఛా ఉద్యమాలన్నింటిలో ఈ హక్కులు ప్రముఖపాత్ర పోషిస్తున్నాయి.వ్యక్తిగత హక్కులకు భంగం కలిగితే, న్యాయ వ్యవస్థ ద్వారా 'రిట్' లు వేసి హక్కులను పరిరక్షించుకోవడానికి వీలవుతుంది.

విశ్వమానవ ప్రకటనలో 22 నుండి 27 వరకు ఉండే నిబంధనలలోని సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులకు సంబంధించినఅంశాలను రెండవతరం హక్కులు (Second Generation Rights) గా పేర్కొనవచ్చు. ప్రధానంగా ఇవి రక్షణకు సంబంధించినవి.

ప్రకటనలో 1, 2, 29 నిబంధనలలో చెప్పబడిన సాధారణ సూత్రాలనుమూడవతరం హక్కులు (Third Generation Rights) గా, సంఘీభావ హక్కులుగా చెప్పవచ్చు.

28,30నిబంధనలలో పై అంశాల అమలుకు సంబంధించిన నియమాలు చెప్పబడ్డాయి. ఇందులో విద్యకు, ఆరోగ్యానికి, పర్యావరణానికి, సంస్కృతికి, అభివృద్ధికిసంబంధించిన హక్కులు ఉంటాయి. ఈ వ్యాసంలో వీటిలో విద్యకు సంబంధించిన హక్కులు కలవు.

1. జీవించేహక్కు :

ఇది మొదటి తరం హక్కులలో మనిషి మనుగడకు సంబంధించిన ప్రధానమైన హక్కు.రేణుకను వధించుట, సతీ సహగమన ఉదంతాలు, కార్తవీర్యుని కుమారుల మరణం, ధృతరాష్ట్రుని మహిళల జీవించే హక్కును మంట కలపడం కనిపిస్తుంది.

"జీవించే హక్కు ప్రతి వ్యక్తి యొక్క మౌలిక హక్కు, ఇది లేకపోతే ఇతర హక్కులకు అర్థం ఉండదు."

(విశ్వ మానవ హక్కులు - నిబంధన 3)

ప్రతి ప్రాణి జీవించే హక్కుకలిగివుంటుంది. ఈ హక్కుకు ఎవరూ భంగం కలిగించరాదు. ఎవరైనా అలా కలిగిస్తే భద్రత కల్పించాల్సిన బాధ్యత చట్టానిదే.

పరశురాముడుతల్లినివధించి రేణుక జీవించే హక్కును హరించివేశాడు. ఈ ఘట్టం భారతభాగవతాలు రెండింటిలోనూ కనిపిస్తుంది.జమదగ్నిభార్య రేణుక.జమదగ్ని తన కుమారుడు పరశురాముడిచేత రేణుకను చెడు తలంపుతో ఉందని చంపమన్నాడు.పరశురాముడు తన తండ్రి ఆనతి మేరకుతల్లిని వధించాడు. జమదగ్ని కుమారుని మెచ్చుకొని వరం కోరుకోమన్నాడు. ఆ వర ప్రభావంతో తల్లిని బతికించి ఆమె ప్రాణాలను కాపాడాడు. మరలా తిరిగి తల్లిని బ్రతికించ గలిగినా తండ్రి మాటలు విని తల్లి జీవించే హక్కును కాలరాయడం తప్పు. తరువాత అయినా తండ్రి అనుగ్రహంతో రేణుక జీవించే హక్కును పునరుద్ధరించడం ప్రశంసనీయం.ఈ ఉదంతం ద్వారా జీవించే హక్కుఅత్యంత ప్రాథమిక హక్కుగా గుర్తించబడింది. ఇక్కడ రేణుక జీవించే హక్కుకు ఉల్లంఘన మరియు పరిరక్షణ రెండూ జరిగాయి.

వ. మతీయు నిశిత పరశుహస్తు రాముం జూచి 'దీని వధియింపు' మని జమదగ్నిపంచిన, వాఁడు గురువచనంబునం దల్లిం దత్క్షణంబ వధియించిన" (అరణ్య-3-142)

జీవించే హక్కును కాలరాయడంలోసతీఆచారాన్నికూడా చెప్పవచ్చు. వసుదేవుడు పోయినపుడు అతని భార్యలు నలుగురూ, కృష్ణ నిర్యాణం తర్వాత అతని భార్యలలో రుక్మిణి, జాంబవతులు సహగమనం చేశారు. అనాగరికమైన ఈ ఆచారం నేడు అంతరించి పోయింది.సజీవ నారీదహనం అమానుషం.

2. స్వేచ్ఛా పరిరక్షణ హక్కు :

సారమేయుడి ఉదంతం, వినత దాస్య విముక్తి ఘట్టాలలో ఈ హక్కు కనిపిస్తుంది.

మహాభారతం ప్రారంభంలోనే సారమేయుడి ఉదంతంలో తన కొడుకైన సారమేయుడు అనే కుక్కపిల్లను జనమేజయుడి తమ్ములైన భీమసేనుడు, ఉగ్రసేనుడు రాళ్లతో కొట్టి బాధించడంతో, సారమేయుని తల్లియైన సరమ అనే దేవతల కుక్క వాళ్లను శపిస్తుంది.

క. తగు నిది, తగ దని యెదలో వగవక,- దుర్వినీతుల కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్" (ఆది-1-85) అను పద్యంలో సాధులకు, పేదలకు అనే పదాలను ప్రయోగించడంలో సాధువుల్ని, దుష్టుల నుంచి, బలహీనుల్ని బలవంతుల నుండి, పేదల్ని ధనవంతుల నుండి రక్షించడమే కర్తవ్యంగా మనకు తెలుస్తుంది.

పశుపక్ష్యాదులకైనా, మనుష్యులకైనా మాతృత్వం, ప్రేమ, బాధలు ఒక్కలాగే ఉంటాయి. వాటి స్వేచ్ఛగా జీవించే హక్కుకు భంగం కలిగించరాదని నన్నయ మానవీయ కోణంలో స్పందించారు.

వినత కద్రువ తోబొట్టువు. తార్క్ష్య కశ్యపుని భార్య. అక్క చేతిలో వంచనకు గురి అయింది. తన స్వేచ్ఛా జీవనాన్ని కోల్పోయింది. ఆమెకు దాసి అయింది. గరుత్మంతుడు తన తల్లి అయిన వినతని దాస్యం నుంచి విడిపించాడు. దేవేంద్రునితో గరుత్మంతుడు చెప్పిన మాటలే దీనికి ఆధారం.

క. అనిమిషనాథ సుగుప్త మ/యిన యమృతము దెచ్చి మీకు నిచ్చితిబీ నస్మ/జ్జననీదాస్యము వాసెను/ దినకరపవనాగ్నితుహినదీప్తుల కరిగాన్. (ఆది-2-118)

స్త్రీ అయినా పురుషుడు అయినా హక్కులకు విఘాతం ఎవరు కలిగించినా విఘాతమే.

3. వ్యక్తిగత భద్రత హక్కులు :

దుష్యంతోపాఖ్యానం,శచీదేవిని నహుషుడు కోరే సందర్భం, గాలవోపాఖ్యానం,సత్యవతి వంశాభివృద్ధికై వ్యాసుని పిలిపించే సందర్భంలో స్త్రీల హక్కులు ఘోరమైన ఉల్లంఘనకు గురి అయ్యాయి. శ్వేతకేతు శాసనంలోకూడా స్త్రీల హక్కుల ప్రస్తావన కలదు.

దుష్యంత మహారాజు వేటకై వెళ్లి కణ్వ మహాముని ఆశ్రమానికి వచ్చాడు. అక్కడ కణ్వుని పెంపుడు కుమార్తె శకుంతలని చూశాడు.ఆమెని గాంధర్వ పద్ధతిన వివాహం చేసుకున్నాడు. అమెకు జన్మించిన పుత్రుడిని యౌవరాజ్యానికి పట్టాభిషక్తుడిని చేయాలనే ఒప్పదం ప్రకారం వారిరువురికి వివాహం జరిగింది. తర్వాత అతడు తిరిగి తన రాజ్యానికి వెళ్లిపోయాడు. అనంతరం శకుంతల భరతుడనే పుత్రునికి జన్మనిచ్చింది. తండ్రి మాట ప్రకారం శకుంతల పుత్రుణ్ణి తీసుకొని కొంతమంది ఆశ్రమవాసులతో కలసి దుష్యంతుని రాజ్యానికి వెళ్లింది. అతడు ఆమెని గుర్తించనట్లు నటించాడు. ఆమెని, పుత్రుణ్ణి స్వీకరించకుండా, ఆమె వ్యక్తిగత హక్కుల్ని కాపాడాలనే బాధ్యతని విస్మరించి బాధపడేటట్లు చేశాడు. ఆకాశవాణి నిండు సభలో సత్యం ప్రకటించగా అప్పుడు దుష్యంతుడు నిజం ఒప్పుకొని ఆమెని స్వీకరించాడు. శకుంతలతోపాటు పుత్రుని వ్యక్తిగత భద్రత హక్కుల్ని కూడా కాపాడి తన తప్పును సరిదిద్దుకున్నాడు.

తే. అన్యు లెఱుఁగమిఁ జేసి లోకాపవాద
భీతి నెఱిఁగియు నిత్తన్విఁ బ్రీతి దప్పి
యెఱుఁగ నంటిని నిందఱ కిప్పు డెఱుఁగఁ
జెప్పె నాకాశవాణి యచ్చెరువు గాఁగ (ఆది-4-108)

అందుకే వివాహం చట్టబద్ధం కావాలి. లేదంటే దూషణలకు, తిరస్కారాలకు, దుఃఖాలకు గురికావలసి వస్తుంది. సాక్ష్యంలేకుండా వివాహం చేసుకోవడం వలన మోసపోవడం జరుగుతుందని లోకానికి చాటిచెప్పే కథ ఇది. ఒంటరిగా ఉన్నప్పుడు అడవిలోగాంధర్వ వివాహం చేసుకునిమరచిపోయిన దుష్యంతుని నిండుసభలోనే శకుంతల నిలదీయడం స్త్రీల హక్కుల పోరాట చరిత్రలో నిజంగా ఒక మైలురాయి. ఇటువంటి ఉదంతాలు జరుగకుండానే ఆధునిక కాలంలో పెళ్లిని చట్టబద్ధంగా రిజిస్టరు చేయిస్తున్నారు. పాశ్చాత్య దేశాలకు వెళ్లాలనుకునే వివాహితులు మనదేశంలో తప్పక పెళ్లికి సంబంధించిన కార్యాలయంలో రిజిస్టరు చేసి ధ్రువీకరణపత్రాన్ని సమర్పిస్తేనే వారికి వీసా లభిస్తుంది.

దేవతలందరి సహకారంతో ఇంద్ర పదవిని అధిష్టించిన నహుషుడు మొదట్లో ధర్మరతుడై పాలన సాగించాడు. మన్మథ పరవశుడై ఒకనాడు శచీదేవిని చూసి తనను కూడడానికి రమ్మని ఆజ్ఞాపించాడు. ఆమె బృహస్పతిని శరణు వేడింది. నహుషుడు ఆమె వద్దకు పల్లకీలో వచ్చేలా పథకం వేశారు. మార్గమధ్యంలో అగస్త్యమహర్షి కోపానికి గురై సర్పమగుదువు గాక అని శపించబడ్డాడు. ఈవిధంగా బృహస్పతి, మునులు కలసి పరోక్షంగా శచీదేవి హక్కును పరిరక్షించారు.

గాలవుడనే ముని కుమారుడు విశ్వామిత్రుని వద్ద విద్య నేర్చుకొని గురుదక్షిణగా ఏమి కావాలని గురువును అడిగాడు. విశ్వామిత్రుడు ఏమీ వద్దని చెప్పినా వినకుండా ఏదో ఒకటి చెప్పి తీరాలని గాలవుడు పట్టుపట్టి గురువుకు బాధ కలిగించాడు. దీనితో విశ్వామిత్రుడు కోపించి శరీరమంతా తెల్లగా ఉండి, ఒక చెవి మాత్రం నల్లగా ఉండే మేలు జాతి గుర్రాలు ఎనిమిది వందలు తెచ్చి ఇవ్వవలసిందిగా ఆజ్ఞాపించాడు. గాలవుడికి అవి

ఎక్కడా దొరకకపోయేసరికి తన చిన్ననాటి మిత్రుడు గరుత్మంతుడి సహాయంతో ఎన్నో ప్రదేశాలు తిరిగినాఫలితం లేదు.(ఉద్యోగ.3-ప.306-313) గరుడిడి మిత్రుడైన ప్రతిష్ఠాన పురాధీశ్వరుడు యయాతి దగ్గరకు తీసుకొని వెళ్లి అతని దగ్గర అటువంటి గుర్రాలు లేనందున, ఏ రాజైనా ఈ కన్యక కొరకు గుఱ్ఱాలను ఇవ్వకపోతాడా అని భావించి తన పుత్రిక మాధవిని అతనికి సమర్పించాడు. ఈ సందర్భంలో స్త్రీల స్వేచ్ఛా హక్కు హరింపబడింది.

క. తన కట్టి గుఱ్ఱములు లే
కునికిని మాధవి యనంగ నొప్పెడుపుత్రిన్
ముని కొసఁగె దీనికై యే
మనుజేశుఁడు నీఁడె హయసమాజము ననుచున్ (ఉద్యోగ 3-312)

అలాగే తర్వాత ఆమెని ఇక్ష్వాకురాజు (అయోధ్యానగర మహారాజు) వద్దకు తీసుకువెళ్లి కుమారుడు జన్మించే వరకు మాధవి భార్యగా ఉంటుందని ఒప్పందం చేసుకుని 200 గుఱ్ఱాలను గాలవుడికిచ్చాడు. 800 గుఱ్ఱాలు సమకూరే వరకు అలాగే చేయమని వెళ్లిపోయాడు గరుడుడు. 'అబ్భుంగిం గలచోట్ల నెల్ల నరసి తురంగంబులం గావించి కొమ్మని యతనికిం జెప్పి సుపర్ణుండు సనియె.' (ఉద్యోగ. 3-313) ఈ పద్ధతినే అనుసరించి గాలవుడు కాశీశ్వరుడు దివోదాసుని నుంచి, భోజపురాధీశ్వరుడు ఔశీనరుని వద్ద నుంచి 200 గుఱ్ఱాలను పొందాడు. మరలా గరుడుడి సలహా మేరకు తగ్గిన రెండు వందల గుఱ్ఱాలకై, ఈసారి ఆమెని విశ్వామిత్రునికే అప్పజెప్పాడు. అతను సరేననిఅంగీకరించి ఋణ విముక్తుడిని చేశాడు. అనంతరం ఆమె తపస్సు చేసుకోడానికి వెళ్లిపోయింది. ఇక్కడ స్త్రీ కేవలం ఒక పిల్లలు కనే యంత్రంలా మాత్రమే చూడబడింది. ఇటువంటివి ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మానవ హక్కుల అపహరణే కాకుండా చట్టరీత్యా కూడ నేరం.

సత్యవతి కుమారుడైన వ్యాసుని తమ వంశం నిలపడం కోసం పిలిపించిన సందర్భంలో కూడా ఈ హక్కు ఉల్లంఘనకు గురైందని భావించవచ్చు. లైంగిక విషయాలలో ఎవరి హక్కులు వారికుంటాయి. ఇష్టంలేని పెళ్లికి, సంతానానికి తాము కారకులు కావడం ఇందులో ఒక భాగం. కపిలగడ్డం, కపిలజడలతో వచ్చిన ఋషిని చూసి సత్యవతి కోడలు అంబిక కళ్లు మూసుకొన్న కారణంగా గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు. ఆకారానికి భయపడిపోయి అంబాలిక బిత్తరపోగా పాండురోగగ్రస్తుడైన పాండురాజు పుట్టారు. మరోసారి ఆ ఋషే వస్తే దాసిని అడ్డం పెట్టుకొని సత్యవతి కోడలు తప్పించుకుంటుంది. శ్రీశైల మహాత్మ్యంలో కూడా తండ్రి కూతుర్ని కామిస్తే పరిగెత్తుకొని పోయి తన్ను తాను రక్షించుకొంటుంది.

శ్వేతకేతు శాసనంలో కూడా స్త్రీల హక్కులు కనిపిస్తున్నాయి.శ్వేతకేతు శాసనం నన్నయ భారతం ఆదిపర్వం పంచమాశ్వాసంలో ఉంది. మహాతపస్వి అయిన శ్వేతకేతుని తల్లి, మహాముని అయిన ఉద్దాలకుని భార్య. మహాపతివ్రత. ఆమె ఋతుస్నానం చేసి కూర్చొని వున్న సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడు అతిథిగా వచ్చి తనకు పుత్రులు కావాలని ఆమెని కామించాడు. శ్వేతకేతుడు కోపించి ఇది ధర్మ విరుద్ధం అని తల్లిని తిట్టి ఆ పనిని సహించలేక పోయాడు.

సీ. 'ఇది యాదిగా సతు లెనుండుఁ బర పురు/షార్థినుల్ - దద్దయుహితముగా ధర్మమూర్తిబీ
ఆ.వె. యబ్జ భవ సమానుఁ డగు శ్వేతకేతుండునిలిపె- లోకపూజ్యమై ప్రవర్తిల్లుచునుండె శిష్ట సంప్రయుక్తిఁ జేసి. (ఆది-2-5-85)

ఇది మొదలు స్త్రీలు ఎప్పుడూ పరపురుషులను కోరకూడదని, వివాహిత స్త్రీలకు పరపురుష సంగమం

వలన సర్వపాపాలు కలుగుతాయని కట్టడి చేశాడు. ఈ కట్టుబాటు లోక ప్రసిద్ధంగా మానవులందరికీ విధించానంటాడు శ్వేతకేతు.

బ్రహ్మ సమానుడైన శ్వేతకేతు చేసిన ఆనాటి శాసనం నేటికీ నాగరికులందరికీ అనుసరణీయమైనదే. కానీఈ నిబంధన కేవలం స్త్రీలకు మాత్రమే విధించడం గమనార్హం. శ్వేతకేతు భర్త చెబితే మాత్రం ఏదైనా చేయవచ్చునంటాడు. పురుషులకి మాత్రం ఈ నిబంధనని వర్తింపజేయలేదు. అంటే శ్వేతకేతు పురుషుల దుష్ప్రవర్తన నుండి మాత్రం స్త్రీల హక్కులను పరిరక్షించలేకపోయాడు.

4. పరువుగా/గౌరవప్రదంగా జీవించే హక్కు :

ద్రౌపదికి దుశ్శాసనుడి చేతుల్లోను, కీచకుడి చేతుల్లోనూ జరిగిన అవమానాలు పొందినప్పుడు,కర్ణుడు ద్రౌపదిని దుర్భాషలాడే సందర్భంలోనూ ఆమె హక్కులకుభంగం వాటిల్లిందని ద్రౌపది భావించడాన్ని గ్రహించవచ్చు. ఉద్యోగపర్వంలో ద్రౌపది తనకు జరిగిన అవమానాన్ని రాయబారానికి బయలుదేరిన శ్రీకృష్ణుడి ముందు గుర్తుచేసుకుంటూ

"కులాంగన నిట్లోనర్తురే" (ఉద్యోగ-3-110) అంటుంది.

ఈ వాక్యాన్నే సద్వంశ సంజాతురాలయిన స్త్రీని ఇలా అవమానించవచ్చునా అనే అర్థంలో గానీ, ఒక మర్యాదస్తుల కుటుంబం నుంచి వచ్చిన కుటుంబ స్త్రీని లేదా ఇల్లాలిని ఇలా అవమానించవచ్చునా అనే అర్థంలో గాని గ్రహించి ఇతర స్త్రీలను అవమానించ వచ్చును అనే అర్థం ఇందులో ఇమిడి ఉందని వాదించవచ్చు. మర్యాదస్తుల కుటుంబం నుండి వచ్చిన స్త్రీ పరిస్థితే ఇలా ఉంటే ఇక ఇతర స్త్రీల పరిస్థితి ఏమిటి అనే అర్థంలో అన్నదనీ వాదించవచ్చు.

ద్రౌపదిని ధర్మరాజు జూదంలో పణంగా పెట్టి ఆమె హక్కులకు విఘాతం కలిగించాడు.ఇక దుశ్శాసనుడు సిగ్గుమాలిన రీతిలోద్రౌపదినిసభలోకి ఈడ్చుకురావడం అనేదిఆమె హక్కుల ఉల్లంఘనకు తీవ్రరూపం.ద్రౌపదికి నిండు కౌరవ సభలో జరిగిన ఈ సంఘటన నాటి సమాజ పతనానికి సంకేతంగా నిలిచింది.అప్పుడు సభలో ద్రౌపది అన్న మాటలు సభలోని అందరినీ ధర్మంపై దృష్టిని నిలిపేలా చేసింది.ద్రౌపదితనకు జరిగిన అవమానంపై పోరాటం చేయడాన్నిఆధునిక కాలంలో మహిళా హక్కుల కోసం పోరాడే ఉద్యమాలకుఒక పునాదిగా, ప్రేరణగా చెప్పవచ్చు.

ధర్మరాజు ద్రౌపదిని ఏమాత్రం సంప్రదించకుండానే ఆమెని తన ఆస్తిగా భావించి జూదంలో పణంగా పెట్టి ఓడిపోయాడు. ఇది ద్రౌపది వ్యక్తిగత హక్కులను హరించడమే అవుతుంది. జూదంలో ఓడిపోయినందుకు దుర్యోధనుని ఆజ్ఞ ప్రకారం ద్రౌపదిని తీసుకొని వెళ్లడానికి వచ్చినప్రాతికామితో ద్రౌపది ఏ యుగంలోనయినా, ఎటువంటి చెడ్డ జూదగాడయినా, భార్యను పణంగా ఒడ్డి ఓడిపోయిన భర్త ఉన్నాడా? వినటానికిది ఆశ్చర్యంగా ఉంది. నా భర్త

తే. 'మున్ను దన్నోటుపడి మఱి నన్ను నోటు
వడియెనో, నన్ను మున్నోటువడి విభుండు
గ్రన్నఁ దన్నోటుపడియెనో యన్న! నాకు
వెఱుఁగఁ జెప్పుము దీని నీ వెఱుఁగుదేని' (సభా-2-209) అని ద్రౌపది ప్రశ్నించి సభకు వెళ్లడానికి తిరస్కరించింది.

అయినా దుర్యోధనుడు మాత్రం పట్టుదలతో ద్రౌపదిని తీసుకురమ్మని దుశ్శాసనుణ్ణి ఆజ్ఞాపించాడు.ద్రౌపది గాంధారి దగ్గరకు పరుగెత్తినా ప్రయోజనం లేకుండా పోయింది. దుశ్శాసనుడు ద్రౌపదితో 'నీవు కురుశ్రేష్ఠుడైన దుర్యోధనుడి సొత్తువైనావు' అని దగ్గరకు రాగా ద్రౌపది"రజస్వలనన్ను ముట్టకుబీ మేకవస్త్రనయి యున్నదానబీ గురుబంధు జనాధిష్ఠితంబైన సభకు నెట్లురా నేర్తు?'నని పలికినది. అయినా వినిపించుకోకుండా దుశ్శాసనుడు 'నీవేకవస్త్ర వైతేమి విగతవస్త్ర వైతేమి? నిన్నెట్లుం దోడ్కొని పోదునని" పల్కాడు.

కురువంశ నీచుడు, పాపాత్ముడయిన దుశ్శాసనుడు ద్రౌపది తలవెంట్రుకల్ని పట్టి అందరూ భయపడి చూస్తుండగా సభకు ఈడ్చి తెచ్చిఅత్యంత నీచంగా పరాభవించాడు.అంతట ద్రౌపది కోపంతో, సిగ్గుతో కుంచించుకుపోయింది. 'భృశకోపనుఁడితఁడు నన్ను నేల దుర్జనుఁడిట యీడ్చి తెచ్చె నవిచారపరండయి దుర్మదంబునన్' (సభా-2-218) అని పల్కింది. ఈ విధంగా జుట్టుపట్టి తేవడం ఉచితం కాదని భావించక కురువంశ ప్రముఖులంతా చూస్తుండగా, క్రొవ్వినఈ దుశ్శాసనుడు నన్నవమానిస్తున్నాడు. ఈనాడు భరతవంశం నిందలపాలైంది అని ఆక్రోశిస్తూ కాపాడమని శ్రీకృష్ణునిప్రార్థించింది.

దుశ్శాసనుడు అక్కడితో ఆగక నిండు సభలో ద్రౌపది కట్టుకున్న వస్త్రాన్ని విప్పివేశాడు. ఇది ద్రౌపదికి జరిగిన హక్కుల భంగానికి పరాకాష్ఠ. ఏనాటిసమాజంలోనైనా ఒక స్త్రీకి ఇంతకంటే దారుణ పరాభవమింకేమీ ఉండదు. ఈ సంఘటనను కేవలం ద్రౌపదికి సంబంధించిన పరాభవంగా కాకుండా మొత్తం స్త్రీ జాతికి జరిగిన హక్కుల ఉల్లంఘనగా, స్త్రీ జాతి ఆత్మ గౌరవ సమస్యగాచెప్పవచ్చు. పై అవమానాలన్నింటినీ పొంది ద్రౌపదీ సభలోని వారితో, నేనడిగిన ప్రశ్నకు ఎవరు గూడ ఎందుకు బదులు చెప్పరు? నేను దాసినా? కానా? పూర్తిగా తెలియజెప్పి నన్ను ఆజ్ఞాపించండి' అని దుఃఖిస్తూ ప్రశ్నించింది.

ఒక స్త్రీని అవమానపరిస్తే ఫలితం ఎంత దారుణంగా ఉంటుందో దానికి ఉదాహరణే కురుక్షేత్ర సంగ్రామం. ఆమె అవమాగ్నికి కౌరవవంశం మొత్తం బలికావలసి వచ్చింది. స్త్రీనైనా, పురుషుడినైనా అనవసరంగా ఎవరినీ పరాభవించరాదు. వారి హక్కులకు విఘాతం కలిగించరాదు. కలిగిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. కర్ణుడు ద్రౌపదిని ఉద్దేశించి నిండు (కౌరవ) సభలో ద్రౌపదీ! 'యేవురకంటె నొక్కరుఁడ భర్త యగుట లగ్గ జూదంబున నాలి నోటు వడని వానిఁగాఁ దగు భర్తఁ బడయు మింక' (సభా-2-246). కావున జూదంలో భార్యని ఓడిపోని తగు భర్తను ఇక పొందు' అని ఎగతాళి చేశాడు. ఇది ద్రౌపది గౌరవానికి, జీవితానికి సంబంధించిన హక్కుల భంగంగా చెప్పవచ్చు.

దుర్యోధనుడు ద్రౌపది భయపడుతూ చూస్తూ ఉంటే తన తొడమీద కూర్చుండ రమ్మని సైగ చేశాడు. ఒక స్త్రీకి ఇంతకంటే ఆత్మహత్యా సదృశం ఇంకేమీ ఉండదు. అందుకే కక్షతో దుర్యోధనుడి మరణవార్త వినేవరకు విశ్రమించలేదు ద్రౌపది.

ద్రౌపదిని సుదేష్ణ కీచకుని వద్దకు పంపి ఆమెని అవమానపరచే దృశ్యం మనకు విరాట పర్వంలో కనిపిస్తుంది. పాండవుల అరణ్యవాసం పూర్తయి అజ్ఞాతవాసానికై మారు వేషాలతో విరటుని కొలువులో చేరారు. ద్రౌపది విరటుని పట్టమహిషి సుదేష్ణాదేవి వద్ద మాలిని అనే పేరుతో సైరంధ్రి వంశానికి చెందిన దానిగా చెప్పుకొని పరిచారికగా చేరింది. తాను గౌరవప్రదమైన పనులను మాత్రమే చేస్తానని ముందుగానే తెలియజేసింది. సుదేష్ణ తమ్ముడు కీచకుడు తన అక్క దగ్గర పరిచర్యలు చేస్తున్న ద్రౌపదిని చూశాడు. మనసు వికలమైంది. చెడు తలంపుతో ఆమెని ఎలాగైనా పొందాలనుకున్నాడు. అక్క ఎంత వారించినా వినిపించుకోలేదు.

ఆ.వె. దీనిఁ బొందగాంచు తెఱఁగు నా కెయ్యది
యొక్కొ! యిట్టిపనికి నూఱడిల్లి
తోడుకొనఁగ నిచట నీడగు చుట్టంబు
దడవి యెట్టులొక్కొ పడయువాఁడ! (విరాట-2-30)

చివరకు తమ్ముడు ఎలాగూ వినిపించుకోడని సుదేష్ణ సైరంధ్రిని పిలిపించి మద్యం తాగాలని దప్పికను నటిస్తూ, కీచకుడి ఇంటికి త్వరగా వెళ్లి తీసుకొని రావాలంటుంది. ఆ మాటలను బట్టి ద్రౌపది తాను వెళ్లక తప్పదని నిర్ధారించుకొని బంగారు పానపాత్రను తీసుకొని శోకించింది.

వ. "... నీచహృదయుండగు కీచకుండు తనయెదుర నప్పుడాడినకర్ణశూలంబులగుమాటల మీఁదం బిడుగుపడిన వానిఁ గొఱవింజూఁడిన తెఱంగున -నిర్వేదంబునం బొంది" (విరా.2-103)

కీచకుని కఠిన వాక్యాల అనంతరం, కూడని పనికి సుదేష్ణ పంపడం 'పిడుగులు పడిన వాడిని కొఱవితో కాల్చినట్లు' అయింది.కలత చెందుతూ కీచకుని మందిరానికి వెళ్లిమద్యం తీసుకొని వెళ్తుండగా కీచకుడు ఆమె వెంటబడి పరుగెత్తి జుట్టుపట్టి లాగి పడవేశాడు.

సుదేష్ణ బాధ పడినప్పటికీ సాటి ఆడుదానిగా చేయకూడని పని చేయబూనింది. సైరంధ్రిని తన తమ్ముని వద్దకు పంపింది. ద్రౌపది గౌరవంగా, పరువుగా జీవించే హక్కును కీచకునితో కలసి కాలరాసింది. ఇక్కడ ద్రౌపది వ్యక్తిగత భద్రత హక్కుకు కూడ భంగం వాటిల్లింది. అప్పటికైనా తనను సుదేష్ణ రక్షిస్తుందేమోనన్న ఆశతో ద్రౌపది హితవు మాటలు పలికినా ఫలితం లేకపోయింది.

ఉ. సాధులు సేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే
బాధలఁ బొందకుండఁ దమపాల వసించినఁ బెద్దవారు ది
క్కై ధరియించి వారికొక యాపద వుట్టకయుండఁగాచు టొ
ప్పై ధరఁ కీర్తి కెక్కదె? యపాయము సేసిన నిందపుట్టదే?" (విరాట-2-95)

తప్పించుకొని విరటుని కొలువులోకి వచ్చి రక్షించమని వేడితే తన భర్తలతో సహా విరటుడు కూడ ఆమెని కాపాడలేకపోయాడు. ఇలా ద్రౌపదికి అడుగడుగునా హక్కుల భంగమే, ఆత్మరక్షణ భంగమే జరుగుతూ వచ్చింది.

పని ప్రదేశంలో మహిళలపైవేధింపుల దృష్ట్యానే"లైంగిక వేధింపులు నివారణ, నిషేధం మరియు పరిహారంచట్టం, 2013" (POSH-Prevention of Sexual HarassmentAct) ని భారత ప్రభుత్వం అమలులోనికి తెచ్చింది.

5. వివాహపు హక్కులు

వివాహానికి సంబంధించిన పద్ధతులు మహాభారత కాలంలో చాలా రకాలుగా ఉండేవి.

పెద్దల ద్వారా వివాహం,స్వయంవర వివాహం, ఇష్టమైన వ్యక్తిని వివాహం చేసుకొనుట మొదలైన పద్ధతులలో స్త్రీల హక్కులు వివిధ రకాలుగా మనకు తారసపడుతున్నాయి.

పెద్దల ద్వారా వివాహం.

వివాహం చేసుకునే యువతీ యువకులు ఒకరి నొకరు ఇష్టపడి పెద్దల అంగీకారంతో అందరి సమక్షంలో వివాహం చేసుకోవడం భారతీయ వివాహ సంప్రదాయం.

అంబిక, అంబాలికల వివాహ ఘట్టం, భీమహిడింబల వివాహ ఘట్టాల్లో ఈ తరహా వివాహాలు చోటు చేసుకున్నాయి.

భీష్ముడు తన శౌర్యపరాక్రమాలతో యుద్ధం చేసి సమస్త రాజ సమూహాన్నంతా తేలికగా ఓడించి సాల్వరాజును ప్రాణాలతో వదలిపెట్టాడు. విజయంలో భాగంగా లభించిన కాశీరాజు పుత్రికలు అంబ, అంబిక, అంబాలికలను తీసుకొనివచ్చి విచిత్రవీర్యునికిచ్చి వివాహం చేయబోయాడు. ముగ్గురిలో పెద్దదైన అంబ భీష్మునితో నేను సాల్వరాజును వరించానని, పూర్వమే తన తండ్రి అతనికిచ్చి పెండ్లి చేస్తానని మాటయిచ్చాడని, ధర్మమార్గాన్నినిర్ణయించమని పలికింది. ధర్మజ్ఞులైన బ్రాహ్మణుల అనుమతితో అంబను సాల్వరాజుకు దగ్గరకు పంపాడు. ఇంతవరకు బాగానే ఉన్నది. కానీ, సాల్వరాజు అంబని భీష్ముడు తీసుకువెళ్ళిన కారణంగా ఆమెని నిరాకరించాడు. దీనితో భీష్ముని వలన ఆమె ఇష్టమైన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కును కోల్పోయింది. కక్షతో తపస్సు చేసి భీష్ముని చంపేందుకై శిఖండిగా పుట్టే వరం పొందింది. భీష్ముడు అస్త్ర సన్యాసం చేసేలా చేసి మరణించేలా చేసింది.

హిడింబాసురుని చెల్లెలు హిడింబి. ఒకసారి అడవిలో పాండవులు నిద్రిస్తున్న సమయంలో హిడింబుడు వారందరినీ చంపి తనకు భోజనం పెట్టమని సోదరిని అజ్ఞాపించాడు. ఆమె ఆ పని చేయకపోగా వారిని తన అన్న బారినుండి రక్షించాలనుకుంది. కుంతీ అభిమతం ప్రకారం భీముణ్ణి వరించింది. భీముడు ఆమె రాక్షసకన్నె అయినా పరిగ్రహించి హిడింబ యొక్క ఇష్టమైన వ్యక్తిని వివాహం చేసుకునే హక్కును పరిరక్షించాడు.

క. ఇది పరమ సాధ్వి, దీనిని
మది నొండుగఁ దలఁప వలదు! మా బుత్త్రా
భ్యుదయ మగుఁలఁ బాండు హితముగ
విది కార్యంబని పరిగ్రహింపుము నెమ్మిన్" (ఆది-6-226)

ఆ రోజుల్లో వర్ణ వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, ఇటువంటి వివాహాలు కూడ జరిగేవి.

స్వయంవర వివాహం

ద్రౌపది స్వయవరం, శుభాంగి స్వయంవరాలలో ఈ హక్కులు కనిపిస్తుంది.

ప్రాచీన కాలంలోని వివాహ వ్యవస్థలో స్వయంవరం కూడ ఒకటి. దీనిని వివాహ మరియు స్వేచ్ఛా హక్కులో భాగంగా కూడా చెప్పవచ్చు.మహాభారత కాలంలో స్త్రీలకు తమ భాగస్వామిని స్వేచ్ఛగా ఎంపిక చేసే హక్కు ఉన్నట్లు "స్వయంవరం" అనే ఆచారం ద్వారా తెలుస్తుంది.ఆ కాలలో ఈ వివాహ హక్కును చట్టబద్ధంగా పరిగణించినట్లు తెలుస్తోంది.

ద్రుపదుడు ద్రౌపదికై స్వయంవరం ప్రకటించగా ఆకాశంలో కట్టిన మత్స్యయంత్రాన్నిఛేదించి పందెంలో గెలిచి, ద్రౌపదిని కూడా గెలిచి ఆమె ఇష్టమైన వ్యక్తిని పెండ్లాడేలా చేసి ఆమె వివాహపు హక్కుల్ని అర్జునుడు కాపాడాడు.

కళింగ రాజ్యాన్ని పాలించే చిత్రాంగదుడు తన కుమార్తె శుభాంగికి స్వయంవరాన్ని ఏర్పాటు చేశాడు. దానికి మిగతా రాజులతోపాటు కర్ణ, దుర్యోధనులు కూడా వెళ్లారు. ఆ కన్య కళ్యాణమాలను ధరించి అందరినీ చూస్తూ వెళుతూ దుర్యోధనుని దాటిపోయింది. (శాంతి.1-30) కోపం వచ్చి రారాజు సభలోనుండి వెళుతుండగా సభలోని రాజులందరూ అతడిని ఎదుర్కొన్నారు.కర్ణ, దుర్యోధనులిరువురూ నేర్పుతో యుద్ధం

చేశారు. తనబలపరాక్రమాలతో కర్ణుడు అందరినీ మట్టుపెట్టాడు. ఆమెని దుర్యోధనుడు హస్తినకు తీసుకొని వచ్చాడు. ఇక్కడ శుభాంగి స్వయంవర వివాహ హక్కుకు భంగం వాటిల్లింది.

అయితే ఈ స్వయంవరంలో స్త్రీలకు గౌరవ స్థానం ఇచ్చినట్లు కనిపించినప్పటికీ అంతర్లీనంగా ముందుగానే రాజు ఏదో ఒక సాహస కృత్యం/ కార్యాన్ని కాబోయే వరునికి పందెంగా నిర్ణయించి దానిలో గెలుపొందే వారిని మాత్రమే ఆమె వరునిగా వరించాలి అనే నిబంధన ఉంటుంది. దీనిలో రాజుకు తన కుమార్తెకు గొప్ప వరుని తాను తీసుకురాగలుగుతున్నానన్నట్లు కనిపించినప్పటికీ పందెంలో గెలుపొందిన వీరుడు అవలక్షణాలు కలిగి ఉన్నట్లయితే యువతి వివాహపు హక్కులు కాలరాయబడతాయి.

సాధారణంగా స్వయంవరంలో నెగ్గి యువతిని పెండ్లాడే వ్యక్తి ముందుగానే వారికి నచ్చిన వ్యక్తి అయివుంటాడు. అందుకే వివాహపు హక్కుల్లో స్వయంవర పద్ధతి పరిమిత స్వేచ్ఛగల హక్కుగా చెప్పవచ్చు.

ద్రౌపది వివాహంలో ఈ హక్కు పరిరక్షింపబడితే, శుభాంగి స్వయంవరంలో ఉల్లంఘనకు గురైంది.

ఇష్టమైన వ్యక్తిని వివాహం చేసుకోవడం

ఈ వివాహపు హక్కు అంబ విషయంలో సమాజ కట్టుబాట్ల నేపథ్యంలో ఉల్లంఘనకు గురియైనదని చెప్పవచ్చు.ప్రభావతి ఇంద్రుని భర్తగా పొందే సందర్భంలో పరిరక్షింపబడ్డాయి.

అంబ కథలో ఆమె తనకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడి పరశురాముని ఆశ్రయించింది. భీష్ముడు అంబ, అంబిక, అంబాలికలను కాశీ రాజ్యం నుండి గెలుపులో భాగంగా తీసుకువచ్చాడు. ఈకారణంతోనే అంబ ప్రేమించిన సాల్వరాజు ఆమెను తిరస్కరించాడు. ఈ అన్యాయానికి ప్రతీకారంగా భీష్మునిపై ప్రతీకారం తీర్చుకోవాలని అంబ శివుని ఆరాధించి తన మరణానంతరం భీష్ముని నాశనం చేసే శత్రువుగా పునర్జన్మ కోరుకునితాను అనుకున్నది నెరవేర్చుకుంది. ఇది స్త్రీల పట్టుదలకు ప్రతీక.

ప్రభావతి ఇంద్రుని భర్తగా పొందే సందర్భంలో ఈ హక్కు కనిపిస్తుంది. బదరిపాదనం అనే పవిత్ర తీర్థంలో భరద్వాజుడి కుమార్తె ప్రభావతి ఇంద్రుడిని భర్తగా కోరి తపస్సు చేస్తుంది. ఇంద్రుడు ఆమెని పరీక్షించనెంచి వసిష్ఠని వేషంలో ఆమె వద్దకు వెళ్లి అర్ఘ్యపాద్యాదులు స్వీకరించాడు. ఆమె భక్తితో అతని దగ్గరకు వెళ్లి

సీ. - మత్పాణి శక్రున కిచ్చు దానబీనప్పునిక మానc (శల్య-2-196)

నా చేతిని ఇంద్రునకే ఇస్తాను, ఆ ప్రయత్నం మాననని చెప్పింది. ఇంద్రుడు కొన్ని రేగు పండ్లనిచ్చి ఉడికించమని పరీక్ష పెట్టగా, తన కాలినే వంట చెఱకుగా ఉపయోగించి వాటిని ఉడికించి పరీక్షలో నెగ్గిఇంద్రుని మెప్పించింది. ఇంద్రుడు ఆమెని భార్యగా అంగీకరిస్తున్నానని చెప్పి,ప్రభావతి నచ్చిన వ్యక్తిని పెండ్లాడే హక్కును పరిరక్షించాడు.

వ. 'గా(కా)ష్ఠంబులు గలయెడకుం బోయి తెచ్చునంత కగ్నియాజెనేని దుష్పాకం బగుననియా మగువ తనకాలింధనంబుగానిడిపాకంబు సేయయినమ్మహాభాగయు నా సుమనోవిభునకు మనోరమ యైవెలసెబీ

(శల్య-2-197)

వివాహ మరియు పోషణ హక్కులు

స్త్రీల హక్కులలో వివాహం ఒకటి. స్త్రీ పోషణ కూడా వివాహంలో భాగమే. మాయా ప్రవరుడి మోసం వల్ల వరూథిని అసలు ప్రవరుని విషయంలో వరించే హక్కును కోల్పోయింది. మాయా ప్రవరుని విషయంలోభర్త నుంచి పోషణ పొందే హక్కును కూడ కోల్పోయింది. ఇక్కడ స్త్రీలకు సహజమైన రెండు హక్కులను ఈమె కోల్పోయినట్లయింది.

6. ఆస్తి హక్కులు

స్త్రీలకు ఆస్తి హక్కులు ఉన్నప్పటికీ, ఆ కాలంలో వాటి అమలు పరిమితమైనది. మాద్రి మరియు కుంతి ఉదాహరణల ద్వారా స్త్రీల ఆస్తి సంబంధిత హక్కులను అనుసంధానంగా చూడవచ్చు.

7. విద్యా హక్కులు

విద్య ద్వారా మాత్రమే మానవ హక్కులు పరిరక్షించబడతాయి."– నెహ్రూ, డిస్కవరీ ఆఫ్ ఇండియా ప్రాచీనకాలంలో కొందరు స్త్రీలు విద్యా హక్కులు సాధించారు. వాటి ప్రయోజనం విద్యను పొందడమే. అలాంటి వారిలో పేర్కొనదగినవారు మైత్రేయి, దేవహూతి.

మైత్రేయి యాజ్ఞవల్క్య మహర్షి భార్య. యాజ్ఞవల్క్యుడు తపోవనానికి వెళుతూ తన భార్య జీవనానికి ఏదైనా ఏర్పాటు చేయాలనుకున్నాడు. అయితే శాశ్వతానంద ప్రదమైన అధ్యాత్మ విద్యే తనకు కావాలని మైత్రేయి కోరింది. దాని విషయంగా భర్తతో సంవాదం సాగించింది. తద్వారా బ్రహ్మజ్ఞానాన్ని పొందింది. భర్త నుంచి సుఖాన్ని పొందే తన హక్కును విద్యకోసం వినియోగించిన విదుషీమణిగా మైత్రేయి మనకు కనిపిస్తుంది.

దేవహూతి కర్దమ ప్రజాపతి భార్య. భర్త సేవలో బాగా పరిణతి పొందింది. భర్త నుంచే కొంత అధ్యాత్మ జ్ఞానాన్ని ఆర్జించింది. భర్త సూచన మేరకు కుమారుడైన కపిలుని తత్వోపదేశం చేయమని కోరింది. కపిలుడు ఆమెకు బ్రహ్మతత్వాన్ని, లోక స్వభావాన్ని, భక్తిని గురించి విపులంగా బోధించాడు. ఆమె దాన్ని సవినియంగా గ్రహించి, సంతుష్టి అయింది. ఇక్కడ దేవహూతిభర్త నుంచి, కుమారుని నుంచి పొందిన అవకాశాన్ని విద్యార్జన కోసమే వినియోగించింది.

పుట్టిన ప్రతి ఒక్కరూ లింగభేదం లేకుండా మౌలికంగా విద్యను పొందే హక్కును కలిగిఉంటారు. ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రకారం ఆరు నుంచి పద్నాలుగు సంవత్సరాల వయస్సు గలిగిన బాలబాలికలందరికీ ఉచిత నిర్భంధ ప్రాథమిక విద్య అమలులో ఉండటం స్పష్టం (విశ్వమానవ హక్కులు 26) (భారత రాజ్యాంగ నిబంధన - 21 ఎ).

8. భ్రూణ హక్కులు :

వీటిని స్త్రీలకు మాత్రమే సంబంధించిన ప్రత్యేక హక్కులుగా చెప్పవచ్చు. వీటిని జీవించే హక్కులో భాగంగా కూడా చెప్పవచ్చు. పులోమ వృత్తాంతంలో, గాంధారి గర్భాన్ని విచ్ఛిన్నం చేసుకొనే సందర్భంలోనూ, వినత వృత్తాంతంలోనూ,ఔర్యుని జననం, అశ్వత్థామ పాండవేయులగర్భాలన్నింటినీవిచ్ఛిన్నం చేయబూనే సందర్భాలలో భ్రూణ హక్కులకు ఉల్లంఘనలు జరిగాయి. వీటిని స్త్రీల హక్కులో భాగంగా చెప్పవచ్చు,

భృగు వను బ్రాహ్మణుని ధర్మపత్ని పులోమ. ఈమె గర్భవతిగా ఉన్నపుడు ఒకనాడు అగ్ని కార్యానికి త్రేతాగ్నులను ప్రజ్వలింప చేస్తున్న సమయంలో పులోముడనే వింత రాక్షసుడు ఆమె పట్ల మోహితుడయ్యాడు. అగ్ని వలన ఆమె ఎవరో 'తెలుసుకున్నాడు. ఈమె పూర్వం నాకొరకై ఎన్నబడిన భార్య అని తలంచి, వరాహ రూపంలో ఆమెను గ్రహించి చాలా దూరం పరుగెత్తాడు. అప్పుడు గర్భంలో వున్న శిశువు గర్భంలో నుండి జారిపడిపోయి వేయిమంది మార్యుల తేజస్సుతో వెలుగొందగా, ఆ తీక్షణతకు పులోముడు దగ్ధుడైపోయాడు. వ... నిది నాకుఁ దొల్లి వరియింపంబడిన భార్య, పదంపడి భృగుండు పెండ్లియయ్యెనని (ఆది.1-130), పులోముడు భృగు పత్ని యొక్క భ్రూణ హక్కుల్ని కాలరాశాడు. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు చెడు తలంపుతో ఆమెని పొందాలని తలచి చివరికి తన తప్పు వలననే తాను బూడిదగా మారాడు.

గాంధారి గర్భాన్ని విచ్ఛిన్నం చేసికొనుటఆమె ఈర్ష్యని తెలియజేస్తుంది. వ్యాసుని వరం చేతకుంతి కంటే ముందే గర్భవతి అయినగాంధారి కొడుకును కనాలని చాలా ఆసక్తితో ఉంది. కానీ గాంధారికి సంవత్సరమైనా ప్రసవం కాలేదు. కుంతి తనకంటే ముందే ప్రసవించి యుధిష్ఠిరుని కన్నదనే అసూయతో కూడినకోపంతో గాంధారి తానే విచ్ఛిన్నం చేసుకొన్నది. 'మనో హీనవయి గర్భపాతము గా నిట్టు సేయు టిదియుఁ గర్తవ్యం బే' (ఆది-5-99) అని కృష్ణద్వైపాయనుని ఆక్షేపణకు గురైంది.

గాంధారి ఏ విధంగా ఆ పనిని చేసినా తన కడుపులో ఉండే శిశువును విచ్ఛిన్నం చేసికునే హక్కు ఆమెకు లేదు. కాపాడవలసిన తల్లే పాము తన గ్రుడ్లను తానే మింగినట్లు ఆమె గర్భాన్ని విచ్ఛిన్నం చేసుకోవడం శిశువు ప్రాణ హక్కుకు విఘాతం కలిగించడమే. ఆ పిండాన్ని వ్యాసుని సలహా ప్రకారం నేతి కుండలో భద్రపరచి ఆ ఖండాలన్నింటితో వంద మంది పుత్రులను, ఒక పుత్రికను కని తన తప్పును సరిదిద్దుకొని సంతోషపడింది. ప్రజాపతి పుత్రకామేష్టి యాగం చేసి భార్యలైన కద్రువకు వెయ్యిమంది పుత్రులను, వినతకుఇద్దరు కుమారులను వారు కోరినట్లు పొందే విధంగా ఇచ్చాడు. అండాలను నేతికుండలలో వుంచి రక్షిస్తుండగా ఐదువందల సంవత్సరాలకు కద్రువ గర్భంలోని అండాలనుండి శేషుడు, వాసుకి, ఐరావంతుడు,రక్షకుడు వంటి వెయ్యిమంది నరశ్రేష్ఠులు జన్మించారు. వినత గర్భం నుండి పుట్టిన రెండు గ్రుడ్ల నుండి పుత్రులు బయల్పడక పోవుటచే కలతచెంది, సిగ్గుపడి, ధైర్యం కోల్పోయి ఒక గ్రుడ్డును బద్దలయ్యేలా చేసింది. అలా చేయడంతో ఆ గ్రుడ్లు నుండి కింది సగభాగం దేహంలేకుండా. మీది సగం దేహంతో కూడిన కుమారుడు అరుణుడు/అనూరుడు జన్మించాడు.

తన అండాలను తానే పగులకొట్టిభ్రూణాన్ని ఛిద్రంచేసి శిశువు హక్కుల్ని అన్యాయంగా లాగేసి, శిశువు అంగవికలుడుగా జన్మించుటకు కారకురాలైంది వినత. ఫలితంగా, పుట్టిన శిశువు కోపించి ఆమెని నీతిలేకుండా ఈ పని చేసినందుకుగాను నీ సవతి కద్రువకు దాసిగా ఐదువందల సంవత్సరాలు ఉండమని శపించి సూర్యునికి రథసారథిగా వెళ్లిపోయాడు.

కం. దాన నపరార్ధ కాయవి
హీనుఁడు, పూర్వార్ధతను సహితుఁ డరుణుఁ డనం
గా నుదయించె సుతుండు, మ
హానీతియుతుండు తల్లికప్రియ మెసఁగన్ (ఆది-2-6)

కార్తవీర్యుల ప్రస్తావన భారతం ఆదిపర్వంలో కనిపిస్తుంది. కృతవీర్యుని కుమారులు కార్తవీర్యులు. భృగు సంతతి వారు భార్గవులు. కృతవీర్యుని సంపాదననంతటినీ యజ్ఞాల, దక్షిణల రూపంలో తీసుకొని భార్గవులు దాచి పెట్టుకుంటారు. కార్తవీర్యులు భృగు సంతతిలో కొందరిని బాధపెడతారు. మరికొందరిని చంపుతారు. అలాంటి సందర్భంలో కొంతమంది భార్గవుల భార్యలు హిమాలయ ప్రాంతానికి వెళ్లి దాక్కుంటారు. వారిలో ఒక భృగుపత్ని భయపడి గర్భాన్ని తన ఊరువులో ధరిస్తుంది. కార్తవీర్యుడా విషయం తెలుసుకొని ఆమెను వెదకుతాడు. అంతకు పూర్వం నూరు సంవత్సరాల కాలం ఊరువు నందుండిన శిశువు పుట్టి 'ఓర్యుడు' అనే పేరుతో ప్రకాశిస్తాడు. ఔర్యుని శరీరకాంతిని చూసిన కార్తవీర్యులకు దృష్టి లోపం సంభవిస్తుంది (ఆది-7-136).

వారు ఔర్యుని తల్లి దగ్గరకు వెళ్లి దృష్టి దానాన్ని ప్రసాదించమని కోరతారు. వారికి ఔర్యుడినే ప్రార్థింపమని ఆమె సలహాయివ్వడంతో 'అతి భక్తులై యౌర్యుం బ్రార్థించి తత్ప్రసాదంబున' (ఆ.ప.7-139) వారు కంటి చూపును పొందారు.

అశ్వత్థామ పాండవేయుల గర్భాలన్నింటినీ విచ్ఛిన్నం చేయబూనినపుడు ఈ హక్కు ఉల్లంఘించబడింది. అశ్వత్థామ తన తండ్రి ద్రోణుని ద్వారా తనకు లభించిన బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగించి పాండవులందరినీ సంహరించే ప్రయత్నం చేశాడు. కృష్ణుడు ఉత్తర గర్భంలో పెరుగుతున్న భ్రూణాన్నిరక్షిస్తాడని, దానిని నాశనం చేస్తానని కృష్ణునితో చెప్పి బాణాన్ని ప్రయోగించాడు. ఆ బాణ హతికి గురై గర్భస్థ శిశువు మరణించకుండా చేశాడుకృష్ణుడు. కమిలిపోయి ప్రాణాలు కృశించినా, గర్భస్థ శిశువును ప్రాణాలతో జన్మించేలా కాపాడాడు కృష్ణుడు.(సౌప్తిక. 2-77)

వ. అని పలికి పరమాదరణీయులగు సాత్యవతేయదేవకీనందనుల వాక్యంబు లాదరింపకునీ పుణ్యంబునఁ బ్రాణంబులు పరీక్షిణంబు లైన పుత్రుండు జనియింపంగలవాఁడు' (సౌప్తిక 2-86)

ఎంతటి కక్ష సాధింపునకు తలపడినా భ్రూణ హత్యలు చేయడం ఏనాటి సమాజానికైనా శ్రేయోదాయకం కాదు. ఇది అత్యంత ఘాతుక చర్య.

ముగింపు :

మహాభారతంలో స్త్రీల హక్కులను సమర్థంగా ప్రతిపాదించినకథలు, సంఘటనలు మనకు ధర్మబద్ధమైన జీవన విధానాన్ని నేర్పుతాయి. కాని, సమాజం స్త్రీలకు సమానమైన గౌరవం, మర్యాద ఇవ్వడం ఆచరణలోజరిగినప్పుడే నిజమైన సమతాభావన వస్తుంది. అప్పుడు మాత్రమే స్త్రీలకు నిజమైన హక్కుల పరిరక్షణ జరిగినట్లు భావించాలి. నేడు మనం ఈ అంశాలను పునర్వ్యాఖ్యానం చేసి, సమకాలీన మహిళల హక్కుల కోసం చైతన్యాన్ని కలిగించవచ్చు. ప్రాచీన గ్రంథాల విశ్లేషణ ద్వారా ఆధునిక సమాజానికి హక్కుల పరిరక్షణకు అవసరమైన మార్గదర్శకాలు అందించవచ్చు.

మానవ హక్కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల వారు హక్కుల పరిరక్షణకు ప్రయత్నిస్తున్నారు. అదిమాత్రమే చాలదు. సమాజ శ్రేయస్సు దృష్ట్యా ఒకరి హక్కునుకాపాడడం ఇంకొకరి బాధ్యత అనే నినాదంతో మానవ హక్కులకు సంబంధించిన అంశాలను అన్నీ స్థాయిలలో విద్యా విధానంలో కూడా ప్రవేశపెట్టి విస్తరింపజేయాలి. అదే విధంగా అన్నిదశల్లోను, మానవ హక్కుల విలువల్ని, సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిదీ.

ఉపయుక్త గ్రంథాలు :

1. శ్రీమదాంధ్రమహాభారతము - 1-15 సంపుటాలు, ఆదిపర్వము-స్వర్గారోహణ పర్వము, ప్రధాన సంపాదకులు, డా. సుబ్రహ్మణ్యం జి. వి, తితిదే ప్రచురణలు,తిరుపతి, 2011.
2. తెలుగు సాహిత్యంలో మానవ హక్కులు - డా. గోవిందరాజుచిట్రాజు, డా.ధాత్రి కుమారిడి, ఎ.ఆర్. సి. పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఒంగోలు, 2016.
3. The International Bill of Human Rights- Universal Declaration of Human Rights, Adopted and Proclaimaed by General Assembly Resolution 2/7 A (III) of 10 December.

❖❖❖

మహాభారతం - విద్యావిధానం

డాక్టర్ వి.గోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, పబ్లికేషన్స్, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం

వెయ్యేళ్ళ తెలుగు సాహితీ ప్రస్థానపు తొలి అడుగు ఆంధ్ర మహాభారతంతోనే మొదలైంది. భారతీయుల నిత్య జీవితంలో రామాయణ, భారతాలు ఎంతగానో ముడిపడి వున్నాయి. వీటి ప్రస్థావన లేకుండా భారత ఖండంలో మానవ జీవితంగానీ, సాహిత్యంగానీ ముందుకు సాగదు. ఎన్నియుగాలు గడచినా సార్వజీవిత, సార్వకాలికతలో కొంచెం ఎక్కువ పాలు మహాభారతానికి దక్కుతుంది. రామాయణం కేవలం ధర్మనిర్దేశం చేస్తుండగా, భారతం ధర్మచరణతో పాటు ధర్మ సంఘర్షణల్నీ, ధర్మసూక్ష్మాలను, పాపపుణ్యాలు, సుఖదు:ఖాలు వెయేళ్ళ మానవ జీవిత, సామాజికాంతస్తమైన సమస్త విషయాలను తడిమి వ్యాఖ్యానించింది. అందుకే "యది హాస్తతదన్యత్ర యన్నే హస్తిన తత్ క్విచిత్"... లోకంలో ఉన్నదంతా మహాభారతంలో కలదు. దీనిలో లేనిదేది లోకంలో లేదని వ్యాఖ్యానించబడి, మానవ జీవనశైలికి ధర్మోపదేశం చేస్తూ మార్గదర్శకమైంది.

గురువు-లక్షణాలు:

గురువు అనేవాడు తల్లిదండ్రుల తర్వాత గౌరవించదగిన, పూజించదగిన మహానీయుడు. అందుకనే భారతీయ సంప్రదాయంలో మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ అనే ఆచరణ కనిపిస్తుంది. ఇంతటి గొప్ప స్థానం గల గురువు మనువు కిందివిధంగా తెలిపాడు.

"నిషేకాదీని కర్మాణి య:కరోతి యధావిది
సంభావయతి చాన్నేన స విప్రో గురురుచ్యతే"[1]

ఏ ద్విజుడు అయితే గర్భాదానము మొదలైన కర్మలను చేయించునో, ఎవడు అన్నము పెట్టి పోషించునో, వాడు గురువు అనబడును.

మహాభారతంలోని ఆదిపర్వంలో ఎవరెవరు గురువులో క్రింది విధంగా చెప్పబడింది.

"తనర జనకుండు నన్నప్రదాతయును భయత్రాత
యును ననగ నింతులకు మువ్వురొగిన గురువులు; వీర
లసఘు! యుపనేత మఱియు నిరంతరాధ్యపకుండు
ననగ బరుఘున కియ్యేపురనయంబును గురువులు"[2]

స్త్రీలకు కన్నవారు, అన్నంపెట్టిన వారు, భయం నుండి రక్షించిన వారు గురువులు. పురుషులకు ఈ ముగ్గురేకాక ఉపనయనం చేసిన వాడినీ, వేదాలు చెప్పిన వాడినీ గురువులుగా పరిగణిస్తారు. పైన చెప్పిన కన్న తండ్రి, అన్నదాత, భయాన్ని పొగొట్టేవాడు, విద్యను నేర్పే గురువు, ఉపనయనం చేసిన వాడు - ఈ ఐదుగురు తండ్రులేనని చెప్పబడింది. వీరిని సేవించడమంటే నూరు యజ్ఞాలు చేసి పొందే ఫలాన్ని మించిన పుణ్యమని మనుధర్మశాస్త్రం చెపుతుంది. వ్యాసభారతంలో గురువు లేదా ఆచార్యుడి గొప్పదనం క్రింది విధంగా వర్ణించబడింది.

"శరీరమేవ సృజిత: పితౌ మాతా ఛ భారతి
ఆచార్య శిష్టా యజాతి: దివ్యాసా జరా మరా"[3]

కేవలం భౌతికమైన జన్మను ప్రసాదించే తల్లిదండ్రులు కంటే అజరమూ, అమరమూ అయిన జ్ఞాన జన్మను ప్రసాదించే గురువు గొప్ప వాడని చెప్పబడింది. ఇదే విషయాన్ని మనువు కూడా తెలిపాడు.

"ఆచార్యస్త్వస్య యాం జాతిం విధివద్వేద పారగ:
ఉత్పాదయతి సావిత్ర్యా సత్యా సాజరామరా"[4]

వేదాలను చదువుకున్న ఆచార్యుడు ఉపనయనాది శాస్త్రవిదుల ద్వారా ఏ జన్మను ప్రస్తావిస్తున్నాడో, అదే బ్రహ్మప్రాప్తికి కారణము. కాబట్టి శాశ్వతమైన, ముదిమి చావులు లేని జన్మను ప్రసాదించే గురువే గొప్పవాడు అని అర్థం.

ఇక్కడ మనువు జ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని గురువు తల్లిదండ్రుల కంటే గొప్పవాడని చెప్పాడు. కానీ గౌరవంలో మాత్రం తల్లిదండ్రులే మొదటివారని మనువు కింది విధంగా చెప్పాడు.

"ఉపాధ్వియన్ దశాచార్య ఆచార్యాణాం శతం, పితా
సహస్రం తు పిత్రూన్మాతా గౌరవేణాతిరిచ్యతే"[5]

నూరుగురు ఉపాధ్యాయుల కంటే ఒక ఆచార్యుడు, నూరుగురు ఆచార్యుల కంటే ఒక తండ్రి, నూరుగురు తండ్రుల కంటే ఒక తల్లి గౌరవంలో గొప్పవారు అని అర్థం.

ఈ విధంగా గౌరవం విషయంలో తల్లిదండ్రులు, జ్ఞానం విషయంలో గురువుగొప్పవాడు. వీరిని సేవించడమంటే పరమాత్మను సేవించినట్లే. గురుముఖంగా నేర్చిన విద్యవల్ల శిష్యుడు శక్తి సంపన్నుడవుతాడు. మహాభారతంలో రైభ్యుడనే ముని గురుముఖంగా విద్యనభ్యసించిందు వల్ల అతనికి దివ్యమైన శక్తి సంక్రమించిన వృత్తాంతాన్ని నన్నయ ఇట్లా వర్ణించాడు.

"గురుశుశ్రూష యెనర్చుచు బరమక్లేశముజేసి పడసిన విద్యల్
స్ఫురించుగాక గురుముఖ వరహితముగ బడసినవియు వెలయునె యెందున్"[6]

గురుముఖంగా అధ్యయనం సాగించిన శిష్యుడు కొంతకాలానికి గురువుగా మారడం, అతడు తన శిష్యులకు జ్ఞానాన్ని ప్రసాదించడం జరుగుతూ ఉంటుందట. కాబట్టి గురువు సన్నిధిలో విద్యను నేర్చుకున్న విద్యార్థి శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా సంపూర్ణమైన వికాసాన్ని పొందగలడు. అతడు భవిష్యత్తులో మంచి గురువు కాగలడు.

ఈ విధంగా గురువు ప్రాచీన భారతీయ విద్యా సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని కలిగివున్నాడు. విద్యార్థికి పునర్జన్మను ప్రసాదించిన వాడు అనిపించుకొంటున్నాడు. జ్ఞాన మార్గాన్ని చూపించి ఆచార్యుడు ఆదర్శప్రాయుడవుతున్నాడు.

ఉపనయనము:

భారతీయ సంప్రదాయం ప్రకారం విద్యా సంస్కారాలు జరిపిన తర్వాత బాలురు విద్యార్థులుగా లేదా వటులుగా మారేవారు. ఈ విద్యా సంస్కారాల్లో ఉపనయనం ఒకటి. 'ఉప' అంటే 'దగ్గరగా' అని అర్థం. చదువుకోవాలనుకున్న బాలుడిని తల్లిదండ్రుల నుంచి దూరం చేసి, గురువుకు దగ్గర చేసేదే ఉపనయనం. తల్లిదండ్రులు భౌతిక శరీరాన్ని ప్రసాదించగా, గురువు జ్ఞాన శరీరాన్ని ప్రసాదిస్తున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డకు గురువు గారికి అప్పగించే సందర్భంలో చేసే శాస్త్రకర్మనే ఉపనయనం అంటాడు. దీని గురించి మనుధర్మ శాస్త్రంలో క్రింది విధంగా చెప్పబడింది.

"గర్భాష్టమే బ్దే కుర్వీత బ్రాహ్మణసోప నామనమ్
గర్భాదేకాదశే రాజ్ఞో గర్భాత్తు ద్వాదశే విశ:"[7]

బ్రామ్మణులకు ఎనిమిదవ ఏట, క్షత్రియులకు పదవయేట, వైశ్యునికి పదకొండవ యేట ఉపనయనం

చేయాలి. ఇది ప్రాచీన భారతీయులుపాటించిన సంప్రదాయం. బ్రహ్మ వర్చస్సును కోరే విప్రుడికి అయిదవ యేట, చతరంగబలము కోరే క్షత్రియుడికి ఆరవయేట, బహుకృష్వాదులను కోరే వైశ్యునికి ఎనిమిదవయేట ఉపనయనము చేయవలసి ఉంటుంది.

బ్రాహ్మణులకు పదహారవ సంవత్సరము వరకు, క్షత్రియునికి ఇరవై రెండవ సంవత్సరం వరకు, వైశ్యునికి ఇరవై నాల్గవ సంవత్సరం వరకు గాయత్రి నశించదు. ఈ కాలాన్ని అతిక్రమించి ఉపనయనం చేయకపోతే, అటువంటి వారిని 'వ్రాత్య' అనే పేరుతో తమ కులం నుండి బహిష్కరించేవారని మనధర్మశాస్త్రంలో చెప్పబడింది. ఉపనయనం ముగిసిన తర్వాత గురువు, విద్యార్థికి అతను చేయవలసిన విధులను గురించి తెలిపేవాడు. వీటిని స్వీకరించమని, స్వధర్మాన్ని ఆచరించమని, పగటి పూట నిద్రపోకూడదని, మౌనం పాటించాలని, వినయవిధేయతలు కలిగి ఉండాలని, వేదాధ్యాయాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, మంచి పనులను చేయమని, చెడు పనులకు దూరంగా ఉండాలని, ఉదయం, సాయంత్రం భిక్షకు వెళ్ళాలని, బ్రహ్మచర్యాన్ని పాటించమని తెలిపేవాడు.

ఆశ్రమజీవనం:

గురుశిష్యులిద్దరినీ ఒక దగ్గరకు చేర్చే ప్రదేశం ఆశ్రమం. శిష్యుడు ఎంతటి ధనవంతుడైనా, నిరాడంబరిగా గురువుగారి ఆశ్రమానికి వచ్చి విద్యనేర్చుకోవల్సిందే. 'శ్రమ' అనే ధాతువుకు తపస్సు, భేదం అనే అర్థాలున్నాయి. "ఆశ్రామ్తి అస్మిన్ ఇతి ఆశ్రమ: అని అమరకోశం తెలుపుతుంది.[7] దీన్నిబట్టి ఆశ్రమ జీవనవిధానం కష్టతరమైంది అనిపిస్తుంది. కానీ ఇది విద్యార్థికి మంచి నడవడిని నేర్పిస్తుంది. భవిష్యత్తులో ఎదరవబోయే సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవాలో నేర్పిస్తుంది. సాధారణంగా ఆశ్రమాలు అరణ్యాల్లో ఉంటాయి. 'అరణ్యం' అనే పదానికి 'రణం' లేనిది, ప్రశాంతమైన ప్రదేశం అని అర్థాలున్నాయి. అలాగే 'అడవి' అనే మాటకు కూడా 'ప్రశాంతతనిచ్చే చోటు' అని అర్థం ఉంది.

విద్యాబోధన అరణ్యాల్లో, ఆశ్రమాల్లో చేయడానికి ప్రత్యేకమైన కారణం ఉంది. అక్కడి ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థి మానసికంగా ప్రశాంతతను పొందుతాడు. అతనిలో రాగద్వేషాలు, అసూయగర్వాలు తగ్గిపోతాయి. ఆ బాలుడిలో ప్రశాంతమైన సత్త్వగునం రూపుదిద్దుకుంటుంది. ఉదాహరణకు ప్రహ్లాదుడు పుట్టుకతో అసురుడు,. దానవ చక్రవర్తి హిరణ్యకశివుడి కుమారుడు. కానీ తల్లి గర్భంలో ఉన్నప్పటి నుండి ఐదారేండ్ల వరకు నారదముని ఆశ్రమంలోనే జీవించాడు. దీనివల్ల అతనిలోని తామసగునాలు తగ్గిపోయి, సత్త్వగునాలు అధికమయ్యాయి. దీనికికారణం నారదముని ఆశ్రమ వాతావరణం. అక్కడ నివసించే జంతువులు, పక్షులు, కల్లాకపటం లేని మనుషులు, నారదుని హరిభక్తి, ఇవన్నీ ప్రహ్లాదుడిలో మూర్తీభవించాయి. ఆ ప్రశాంతమైన ప్రకృతిలో ప్రశాంతమూర్తిగా రూపొందాడు ప్రహ్లాదుడు. అందుకే ప్రాచీన విద్యా బోధనలో ఆశ్రమ జీవనం ప్రాధాన్యాన్ని పొందింది. ఇది గురుశిష్యులిద్దరికీ ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, జ్ఞానాన్ని అందిస్తుంది.

సుబల, మార్కండేయాది ఆశ్రమాలు మహాభారతంలో ప్రస్తావించబడ్డాయి. కానీ కణ్వాశ్రమం, శౌనకాశ్రమం మొదలైనవి ఆనాటి ప్రముఖ విద్యా సంస్థలుగా కనిపిస్తున్నాయి. ఆశ్రమాలకు మునుల పేర్లు పెట్టడం, రాజకుమారులు కూడా నిరాడంబరంగా ఆశ్రమాలకు రావడం ఆనాటి ఆశ్రమ జీవనంలోని ప్రత్యేకతలు, ఆశ్రమాలకు కావలసిన పాత్రలూ, భోజన సామాగ్రి మొదలైన వాటిని రాజులే పంపేవారని కింది శ్లోకం వల్ల తెలుస్తుంది.

"ఆశ్రమేషు మధాకాలం వైలభాజన భోజనమ్
సదైవోపహారేద్ రాజా నత్కృత్యాభ్యర్హ్య మాన్యచ"[8]

గురుకులాలు పట్టణాలకు దూరంగా ఉన్నా, రాజుల ఆరాన్ని పొందివుండేవి. నాటి ఆశ్రమాలు నిబద్ధ విద్యాకేంద్రాలుగా ఉండేది. ఇవి విశ్వవిద్యాలయాలుగా కూడా పనిచేసేవి. ఒకే ఆశ్రమంలో అగ్ని, బ్రహ్మ, విష్ణు, మహేంద్ర, వివస్వత, సోమ గరుడ, కార్తికేయ స్థానాలుండేవి. ఒక్కొక్క చోట ఒక్కొక్క విద్య నేర్పేవారు. నైమిశారణ్యంలో దాదాపు 10,000 మంది శిష్యులు ఉండేవారు. కణ్వాశ్రమం కూడా ఇటువంటిదే. వేదవేదాంగాలు, దర్శనాల బోధన ఇక్కడ జరిగేది.[9] ఈ శిష్యుల బోధన భారాన్ని విశ్వవిద్యాలయ కులపతి భరించేవాడు. అర్హులైన వారికే నాటి విశ్వవిద్యాలయాల్లో చదువుకొనే అవకాశం కల్పించేవారు.

సబల, మార్కండేయాది మునులు ఆయా ఆశ్రమాల నుండిధర్మరాజు సభకు వచ్చిన వృత్తాంతాన్ని నన్నయ ఇట్లా వర్ణించాడు.

"సుబల మార్కండేయ శౌనక మౌంజాయన మాండవ్య శాండిల్య మందపాల
ఒక దాల్భ్యారైభ్యక భాలుకి జతుకర్ణ గౌతమ కౌశిక కన్వకుత్స
సావర్ణి పర్ణాద సత్యగోపతి గోపవేష మైత్రేయ పవిత్రపాణి
ఘటజౌనుకాత్రేయ కఠకలాప సుమిత్ర హరీతి తిత్తిరి యజ్ఞవల్క్య
వాయుభక్ష భార్గవ వ్యాసజైమిని శుకసుమంత పైలనుప్రతాదు
లయిన మునులు..... రమ్యమైన ధర్మరాజు సభకు"[10]

పైన చెప్పిన మునులంతా భరతఖండం నలుమూలలా వ్యాపించి ఉన్న వివిధ ఆశ్రమాలకు కులపతులు, ఆచార్యులు, వేలమంది విద్యార్థులకు ఆశ్రమం కల్పిస్తున్నవారు. రాజసూయయాగం సందర్భంలో వీరు ధర్మరాజును కలిసి, ఆయనను దీవించి బహుమతులు స్వీకరించారు. ఆ పండిత పరిషత్తుతో ధర్మరాజు కీర్తి మరింత పెరిగింది.

భారతాన్ని సూతుడు శౌనకాది మునులకు వినిపించాడు. ఈ శౌనకాశ్రమం నైమిశరణ్యంలో ఉంది. ఈ ఆశ్రమానికి కులపతి శౌనకుడు. జ్ఞానాన్ని, సదాచారాన్ని గురించి చర్చించడానికి శౌనకుడు సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. అక్కడ సకల పురాణ విజ్ఞాన నిరతుడూ, శీల సంపన్నుడూ అయిన సూతుడు ఆశ్రమంలోని మునులకు భారత కథను వినిపించాడు. దీన్నిబట్టి ఆశ్రమాలు అనాడు సాహిత్య పరిషత్తులుగా కూడా పనిచేసేవని తెలుస్తుంది.

మహాభారతంలో ప్రస్తావించిన విశ్వవిద్యాలయాల్లో కాణ్వాశ్రమం కూడా ఒకటి. ఇది మాలినీ నదీ తీరంలో ఉంది. దీనికి కులపతి కణ్వుడు. విద్యార్జనకు అనుకూలమైన వాతావరణం ఉంది. దాన్ని నన్నయ ఇలా వర్ణించాడు. "చెవుల పండువుగా చిలుకలు సామవేదాన్ని సుస్వరంగా పాడుతున్నాయి. ఏనుగుల తొండాల చల్లని నీడలలో వాటి నీటి తుంపరల చల్లని గాలికి ఆశపడి సింహాలు ఏనుగుల చెంత చేరివున్నాయి. బ్రాహ్మన శ్రేష్టులు భూతబలులు తెచ్చి వివిధ ప్రదేశాల్లో నీవార ధాన్యపు అన్న పిండాలను ఉంచగా ఎలుకలు, పిల్లలు వాటిని తినాలని వేగిరపడుతూ ఒకచోట కలిసిమెలిసి తిరుగుతున్నాయి., అవి తమ మధ్య సహజంగా ఉన్న వైరం లేకుండా కలిసి జీవిస్తున్నాయి. దీన్ని చూసి దుష్యంతుడు ఆశ్చర్యపడ్డాడు."[11]. అంతేకాదు ఆ అరణ్యంలో, హవిస్సులైన నేతుల వాసనలు గల పొగలతో చూసిన తీగలతో అల్లుకొని ఉన్న చెట్ల కొమ్మల మీద పూవులు లేకునప్పటికీ విడిచివెళ్ళకుండా ఉన్న తుమ్మెదల గుంపులను చూసి దుస్యంతుడు ఆశ్చర్యానికి లోనయ్యాడు.[12]

ఈ విధంగా నాటి ఆశ్రమాలు విద్యార్జనకు అనుకూలంగా ఉండేవి. మానసిక ప్రశాంతత, శ్రద్ధ, ఆసక్తి కలగడానికి విద్యార్థులకు ఈ వాతావరణం అనుకూలించింది.

ఈ కణ్వాశ్రమంలో అన్ని రకాల విద్యలు బోధింపబడేవి. ఒక్కొక్క విద్యను బోధించడానికి ప్రత్యేకమైన గురవులు ఉండేవారు. అక్కడ కొందరు హోతలు బుక్కులను పదక్రమాది పద్ధతుల్లో పఠిస్తున్నారు. యజుర్వేద పారంగతులు, సామవేద పారంగతులు, అధర్వవేద నిష్ణాతులు ఈ ఆశ్రమంలో ఉన్నారు. బ్రాహ్మణ పటువులు స్థానకరణ ప్రయత్నాలను పాటిస్తూ వేదమంత్రాలను పలుకుతూ వుంటే ఆ ఆశ్రమం రెండవ బ్రహ్మలోకంగా ఉంది. ఈ ఆశ్రమంలో క్రమశిక్షణ బోధించేవారు, న్యాయశాస్త్రజ్ఞులు, ఆత్మజ్ఞాన సంపన్నులు, వేదకావ్యాలను సమన్వయం చేయగలిగిన వారు, ఉపనిషత్తులు బోధించేవారు. ఉపాసనాది విశేషకర్మల్ని తెలిపేవారు, మోక్షజ్ఞానాన్ని బోధించేవారు. వ్యాకరణాది షడంగాలు తెలిసినవారు, పదార్థజ్ఞానం కలిగిన వారు, జ్యోతిష్యం తెలిసినవారు, మృగపక్షి భాషలు తెలిసినవారు, కార్యకరణ జ్ఞానం కలిగినవారు ఆ కణ్వముని ఆశ్రమంలో ఉన్నారు. వీరు నిరంతరం అధ్యయన అధ్యాపనాలతో జీవిస్తుంటారు. ఇటువంటి గొప్ప వాతావరణంలో పెరగబట్టే శకుంతల, భరతుడు జ్ఞానవంతులు కాగలిగారు.

గురుకులవాసం-ఉదంకుడు:

మహాభారతంలోని ఆదిపర్వంలో ఉదంకుడి కథ ఉంది. అలాగే అశ్వమేధపర్వంలో మళ్ళీ ఉదంకుడి కథ ఉంది. ఈ రెండింటికీ కొన్ని పోలికలు, కొన్ని తేడాలు ఉన్నాయి. ఆదిపర్వంలో నన్నయ చిత్రించిన ఉదంకుడు సచ్ఛీలుడు, గురుశుశ్రూషాభిలాషి, వేదాధ్యయన సంపన్నుడు, అణిమాది అష్ట సిద్ధుల్నిపొందినవాడు. తపస్సంపన్నుడు, ఉదంకుడి గురుకుల జీవితాన్ని నన్నయ కిందిపద్యంలో తెలియజేశాడు.

"గురుకులమునందు గురులకు,
బరిచర్య లానర్చిస్థాతా సపరతినిష్ఠా
పరుడై జ్ఞానము వడసెను
గురుదయ నణిమాది కాష్ట గునములతోడన్"[12]

దీన్నిబట్టి గురుకులంలో శిష్యుడికి లక్షణాలు అపరిమిత నిష్ట, గురుశుశ్రూష, వినయం అని తెలుస్తుంది. దీని వల్ల ఆ విద్యార్థి గురువు నుండి విద్యను సంపూర్ణంగా పొందగలడు.

ఉదంకుడు విద్యభ్యాసం ముగిసిన తర్వాత గురువుకు దక్షిణ చెల్లించడానికి వెళతాడు. పైలుడి భార్య శిష్యుని పౌష్యమహాదేవి కమండలాలను తీసుకురమ్మని ఆదేశిస్తుంది. ఉదంకుడు దీక్షాపరుడై బయలుదేరుతాడు. మార్గమధ్యంలో ఒక దివ్యపురుషుడు ఒక ఎద్దుమీద కూర్చొని వస్తాడు. ఉదంకుడిని గోమయం తినమంటాడు. గురుకార్యం నెరవేర్చడంకోసం ఉదంకుడు ఆ ఎద్దుపేడను తినడానికి కూడా వెనుకాడలేదు. ఇది ఆ విద్యార్థిలోని గురుభక్తికి, కర్తవ్యదీక్షకు, గర్వంలేని వ్యక్తిత్వానికి చిహ్నం. అనుకున్నది సాధించడానికి ఎటువంటి పనినైనా చేయడానికి వెనుకాడని సాహసవంతుడు ఉదంకుడు. అతడు పౌషనగరం చేరి, మహారాణి కుండలాన్ని తీసుకొని బయలుదేరుతాడు. మార్గమధ్యంలో తక్షకుడు ఆ కుండలాల్ని అపహరించి పాతాళానికి పారిపోతాడు.

అప్పుడు ఉదంకుడు సూక్ష్మరూపం ధరించి పాతాళానికి చేరి, నాగదేవతల్ని స్తుతిస్తాడు. గుర్రం మీద కూర్చొని ఉన్న దివ్య పురుషుడి ఆదేశం మేరకు ఆ గుర్రం యొక్క చెవిలో ఊదుతాడు. దానితో పాతాళ లోకమంతటా మంటలు వ్యాపించాయి. తక్షకుడు భయపడి కుండలాల్ని తెచ్చిచ్చాడు. ఉదంకుడు ఆ కుండలాల్ని గురుపత్నికి సమర్పించి, గురువుగారి ప్రేమకు పాత్రుడయ్యాడు. ఈ విధంగా ఉదంకుడు కష్టాలను ఎదుర్కొని నిలువగలిగిన మనోబలాన్ని ఆశ్రమజీవనంలో సంపాదించాడు. జనమేజయుడి చేత సర్పయాగం చేయించి,

తక్షకుడి మీద పగ సాధించాలనుకున్నాడు. పట్టుదల గల వ్యక్తి ఉదంకుడు. గురువుపట్ల అచంచలమైన భక్తిని కనబరచిన ఆదర్శ విద్యార్థి ఇతడు.

ద్రోణుడు - అస్త్రవిద్య శిష్యుల్ని పరీక్షించటం:

నానా దేశాల నుండి వచ్చిన రాజకుమారులు విలువిద్యను అభ్యసించడానికి పూనుకొన్నారు. వారందరు ద్రోణుని దగ్గర అస్త్ర ప్రయోగోప సంహారాది పద్ధతులను అధ్యయనం చేశారు. అధ్యయన కాలంలో కర్ణునికి అర్జునుడిపై,అశ్వత్థామకు అర్జునుని మీద మాత్సర్యం కలిగింది. తన దగ్గరనున్న శిష్యులలో అర్జునుడు తనంతటివాడు కాగలడని ద్రోణుడు భావించాడు.అశ్వత్థామ అర్జునునిపై విద్యామాత్సర్యం వహించినందువల్ల అర్జునుడు చీకటిలో అస్త్రాన్ని ప్రయోగించే కౌశలాన్ని పొందకూడదనే ఉద్దేశంతో, చీకటిలో అతడికి అన్నం పెట్టవద్దని అన్నసాధకున్ని శాసించాడు. వంటవాడు ఆ విషయాన్ని పాటించాడు. అర్జునుడుఅన్నం తింటుంటే ఒక రాత్రి దీపం గాలికి ఆరిపోయింది. అయినా అభ్యాసం వల్ల ముద్ద నోటిలోనికి పోవటం తెలుసుకొని, అభ్యాసంతో ఏ విద్యనైనా సాధించవచ్చని గ్రహించి, చీకట్లో కూడా బాణం వేయడం ప్రారంభించాడు. అర్జునునికి గల విద్యాశక్తిని ద్రోణుడు మెచ్చుకొన్నాడు. అతనికి సకల విద్యారహస్యాలను బోధించడానికి పూనుకొన్నాడు. అతన్ని అద్వితీయుడైన వీలుకానిగా చేస్తానని మాట ఇచ్చాడు. ద్రోణుడు ప్రియశిష్యుడైన అర్జునునికి నేర్పిన విద్యల గురించి నన్నయ వర్ణించిన పద్యమిది.

"బహువిధ వ్యూహ భేధనోపాయములను సంప్రయోగరహస్యాతి శయముగాగ
గఱపె నర్జును దాటి బార్గవుడు వింటనిదేయని పొగడ నెల్లజనులు"[13]

బండికి ఉన్న రెండు చక్రాల లాగా, గుండెకు ఉండే రెండు కవాటాల లాగా సమప్రాధాన్యం కలిగినవారు గురుశిష్యులు, ఈ ఇద్దరి మధ్య బంధాన్ని ఏర్పరిచేది విద్యాబోధన, సత్ప్రవర్తన ఇద్దరికీ ఉండవలసిన ముఖ్య లక్షణం. ఆచార్యుడు, అంతేవాసి, ప్రవచనం, ప్రవర్తన ఈ నాలుగూ విద్యాసౌదానికి ఉన్న నాలుగు స్తంభాలు. ప్రస్తుతం ఈ వ్యాసం గురుశిష్యుల సంబంధాలు ప్రాచీన తెలుగు కావ్యాల్లో ఎలా ప్రతిఫలించబడ్డాయో వివరించబడింది.

పాదసూచికలు:

1. మనుస్మృతి, పు.72, 142శ్లో
2. ఆధి, 4ఆ, 49 ప.
3. శాంతి, పు.4703, 19 శ్లో
4. మనుస్మృతి, పు.74, 148 శ్లో
5. పైదే, పు.73, 154 శ్లో
6. అరణ్య, 3ఆ, 282 ఏ.
7. మనుధర్మశాస్త్రం, పు.45
8. అమరకోశం, పు.438
9. వ్యాసభారతం, వనపర్వం,పు.468
10. భారతీయవిద్య, పు.70
11. సభా, 1ఆ, 21ప.
12. ఆది, 4ఆ, 23ప.
13. ఆది, 1ఆ, 92ప.

ఉపయుక్త గ్రంథాలు :

1. శ్రీమదాంధ్రమహాభారతము - 1-15 సంపుటాలు, తితిదే ప్రచురణలు, తిరుపతి.
2. ప్రాచీన తెలుగు కావ్యాలు - విద్యావిధానం (సిద్ధాంత గ్రంథం) - ఎన్.విజయకుమార్.

❖❖❖

వ్యక్తిత్వదర్శిని - మహాభారతం

జి. మాధవీలత, తెలుగు ఉపన్యాసకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అనంతపురం.

మనిషి మహోన్నతుడు కావాలంటే పుస్తక పరిజ్ఞానాన్ని అందుకోవాలి. అదే మనిషి మానవీయుడు అవ్వాలంటే ఇతిహాసాలు చదవాలి. మానవుడిగా పుట్టినందుకు కలిగివుండాల్సింది తీరైన వ్యక్తిత్వం. తోటివారి కష్టాలను తన కష్టాలుగా ఎంచేది, ఎదుటివారి ఆనందమే తన ఆనందంగా భావించేదే ఈ సుగుణం. మానవత్వం లేని వ్యక్తిత్వం శ్మశానంలో ప్రేతం లాంటింది. మహాభారతంలో మానవ సంబంధాకు, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన కథలెన్నో ఉన్నాయి. అవి అద్భుతమైన సందేశాలు అందిస్తాయి. ఇది ఒక పరిమితమైన విషయాన్ని తెలియజేసే గ్రంథం కాదు. ఒక పెద్ద విజ్ఞాన భాండాగారం. ధర్మార్థ కామ మోక్ష సాధనకు మార్గం చూపెట్టే జ్ఞానసాగర మహాభారతం భారతీయ విజ్ఞాన సర్వస్వం. అందుకే ఉగ్రశ్రవనుడు (సూతుడు) శౌనకాది మహామునులకు భారతకథనంతా చెప్పి చివర ఇలా అంటాడు. "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్" ఇందులో ఉండేది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు.

మహాభారత ప్రాశస్త్యం చెప్పడానికి ఈ ఒక్క వాక్యం చాలు. వేరే చెప్పనవసరం లేదు. మానవుని ఆధ్యాత్మిక, ధార్మిక, జీవన, విజ్ఞాన రహస్యాలను ఇంత గొప్పగా విప్పి చెప్పగల గ్రంథం ఈ ప్రపంచంలోనే ఎక్కడ లేదనే చెప్పాలి. మహాభారతం జాతికి జీవనాధారం, ప్రాణాధారం. అలాంటి మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన అక్షర శిల్పులు కవిత్రయం వారు. మానవతా విలువలకు, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడానికి నిలువుటద్దం - మహాభారతం.

ఒరులేయవి యొనరించిన
నరవర! అప్రియము తన మనంబున కగు ఁతా
నొరులకు అవిసేయకునికి
పరాయణము పరమధర్మ పథముల కెల్లన్ - తిక్కన

ఇతరులు ఏం చేస్తే మన మనసుకు బాధ కల్గుతుందో తాను ఇతరులకు ఆ పనులు చేయకుండా ఉండడం అన్ని గొప్ప ధర్మమార్గాల కన్నా ఉత్తమోత్తమమైన ధర్మం.

ఈ ఒక్క పద్యం స్ఫురణకు తెచ్చుకుంటే మానవతా విలువల్ని కాపాడుకున్నట్లే. మానవజాతికి మహోన్నత మార్గదర్శక కరదీపకలు - ఇతిహాసాలు.

ఇప్పుడు కావలసిందల్లా మంచి మనసుతో పట్టుదలతో, ఆసక్తితో ఆయా విశేషాలను తెలుసుకోవడానికి గట్టి ప్రయత్నం చేయటమే, లౌకిక యాంత్రిక జీవన గమనంలో పడిపోయి నిజమైన సుఖశాంతులు పొందేందుకు అవసరమైన రహస్యాలను తెలుసుకోవడంలో మనం ఉపేక్ష వహిస్తున్నాం.

భూమి మీద వున్న మనుష్యుల్లో ఏ ఇద్దరూ ఒకేలా ఆలోచించరు. ఇది శాస్త్రం నిరూపించిన సత్యం. మనుష్యుల్లో అనేక మనస్తత్వాలు కలిగినవారుంటారు. వారిని మనం మార్చలేం. దానికి బదులు వారి స్వభావాలకనుగుణంగా మనమే మారిపోవాలి. సర్దుబాటుతత్వం అలవర్చుకోవాలి.

కండబలం లేకపోయినా పర్వాలేదు. తెలివితేటలు ప్రదర్శించకపోయినా ఇబ్బందిలేదు. మార్పును స్వాగతించే ధైర్యం, మార్పును జీర్ణించుకునే నైజం, మార్పుకు పెద్దపీట వేసే గుణం, ఇవి చాలు ఏ జీవిమనుగడకైనా! అని చక్కగా తెలియజేస్తుంది మూడు చేపల కథ.

మడుగులో దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడనే పేర్లుగల మూడు చేపలుండేవి. హాయిగా కాలం గడిచిపోతుంది. అంతలోనే వాతావరణంలో ఏదో తేడా కనిపించింది. "వచ్చేది ఎండకాలం; కాసిన్ని నీళ్ళు ఉన్నప్పుడే సురక్షితమైన చోటుకు మారిపోదాం. తీరా మడుగు ఎండిపోయాక బాధపడుతూ కూర్చుంటే ప్రయోజనం ఉండదు" అని హెచ్చరించింది దీర్ఘదర్శి. ఆ మాటలు మిగిలిన రెండు చేపలకు చెవికెక్కలేదు. వాటికి మార్పంటే భయం. చేసేదిలేక తన దారిన తాను వెళ్ళిపోయింది దీర్ఘదర్శి. కొద్దిరోజులకే మడుగు ఎండిపోయింది. ఏం చేయాలో తోచక దీర్ఘసూత్రుడు ఎగిరెగిరి పడుతుంటే, జాలరి వలేసి పట్టుకున్నాడు, తీసుకెళ్ళి ఒక తాడుకు గుచ్చేశాడు. ఇదంతా చూసిన ప్రాప్తకాలజ్ఞుడికి గుండెదడ మొదలైంది. బయటపడే ఉపాయం ఆలోచించింది. వలలోంచి ఒడ్డున పడగానే చేపలతాడు కరుచుకొని చచ్చిపోయినట్లు నటించింది. జాలరి ఆ తాడును భుజానికి వేసుకొని వెళుతున్నప్పుడు, దారిలో చిన్నకాలువ కనిపించగానే గబుక్కున దూకేసింది. అట్నుంచి మరో పెద్ద జలాశయంలోకి మారిపోయింది.

సమాజంలో మనుగడ సాగించాలంటే మార్పును ఊహించే తెలివితేటలైన ఉండాలి, మార్పును భరించే ధైర్యమైనా ఉండాలి. రెండూ లేకపోతే ప్రమాదంలో చిక్కుకున్నట్లేనని ఈ కథ తెలుపుతుంది. మార్పులేనిదే సృష్టి పరిణామం లేదు. మార్పు లేనిదే మానవ నాగరికత లేదు. మానవ సంస్కృతిలేదు. మానవ వికాసం లేదు. చివరకు మానవ మనుగడ ప్రశ్నార్థకమే? మార్పు మానవ వికాసానికి పునాది గతం, భవిష్యత్తుల మధ్యవారధి. ప్రగతి రథసారధి. మారేది, మార్పించేది, సృష్టి వికాసాన్ని శాసించేది మార్పు. మార్పు... సత్యం, నిత్యం, శాశ్వతం. ఈ జీవితసత్యాన్ని తెలుసుకున్న మనిషి జీవితంలో సగం బాధలు దాటినట్లే. సంఘ జీవనంలో న్యాయమైన నైతిక ప్రవర్తనాపరమైన కొన్ని కట్టుబాట్లను కలిగి మార్పును స్వాగతిస్తే మనిషి ఆనందం పొందగలడు. ఆ ఆనందాన్ని ఇవ్వగల ఆధ్యాత్మిక సిరి, వ్యక్తిత్వ మార్గదర్శిని - మహాభారతం.

సముద్రసరిత్ సంవాదం వృత్తాంతంలో సముద్రుడు నదులతో సమావేశమై ఒక ప్రశ్న అడిగాడు. నదులారా! మీరు వరదలతో వేగంగా ప్రవహించేటప్పుడు, కొండలపైనుంచి దూకేటప్పుడు పెద్దపెద్ద చెట్లను పడగొట్టేస్తారు. ఊళ్ళకు ఊళ్ళను ముంచెత్తుతారు. కానీ అల్పమైన తుంగ మొక్కలు మాత్రం చెక్కుచెదరకుండా ఉంటున్నాయి. వాటిని మీరెందుకు కదిలించలేకపోతున్నారు? అని అడిగితే అప్పుడు నదులు మేము వేగంగా ప్రవహించేటప్పుడు కొండలు, చెట్లు అహంకారంతో మాకు అడ్డుగా నిలుస్తాయి. అందువల్ల మా బలాన్ని చూపించి వాటిని పడగొట్టేస్తాము. ప్రబ్బలి, తుంగ వంటి మొక్కలు మా రాకకు స్వాగతం చెబుతున్నట్లు వినయంతో తలవంచుతాయి.

దీన్నిబట్టి వినమ్రత మానవ జీవితానికి ఆభరణం వంటిది. దానివల్ల మనిషి గుణాలు మరింత పరిమళిస్తాయి. పోల్చిచూసుకోవడం, పోటీపడటం - ఈ రెండు ఈర్ష్యా, అసూయలకు సంబంధించినవి.

వీటివల్ల మనిషి ఎదగలేడు. సభ్యసమాజం మనిషి గుణశీలాలకు, వినయ విధేయతలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది. అందుకే వినమ్రతను ఓ సంపదగా భావించి ఏ మనిషైనా ముందుకు సాగితే అతడే విజేత.

శాల్మలీ వృక్షోపాఖ్యానంలో శాఖావిస్తృతితో ఒప్పారే శాల్మలీ వృక్షం నారదుడితో గర్వోక్తులాడటం, ఆ మహర్షి దాని గర్వం అణచటానికి వాయుదేవుడిని ప్రేరేపించటం, వాయు విజృంభణకు పూర్వమే శాల్మలీ, తన కొమ్మలను తానే విరచుకొనటమే జరిగింది. ఈ కథ ద్వారా ఉత్తముడైన మనిషి ఎవరిని ఎగతాళి చేయకూడదని, అసభ్యకరంగా ప్రవర్తించకూడదని అర్థమవుతుంది. ఏ మనిషైనా ఎంత ఒదిగివుంటే అంత ఎదుగుతాడు.

మూషిక మార్జాల వృత్తాంతం ద్వారా బలవంతుడైన శత్రువుతో అవసరం కొద్ది స్నేహం చేసినా, అవసరం తీరాక ఆ స్నేహాన్ని వదులుకోవాలి. అలాకాక నమ్మి స్నేహాన్ని కొనసాగిస్తే ఆపద తప్పదు. నమ్మతగనివారిని నమ్మనేరాదు. నమ్మదగ్గవాళ్ళని సైతం తగినంతగానే నమ్మాలి. ఇతరులు తనను నమ్మేటట్లు నడుచుకోవాలి. ఇది శుక్రనీతి. శత్రువు సహాయంతో తనను తాను కాపాడుకొని, శత్రువుకు కూడా సహాయం చేసి, దానివలలో పడకుండా తన మేధస్సుతో తప్పించుకొన్నాడు ఫలితుడు (ఎలుక).

ఈ కథ మనిషి సమాజంలో మనుగడ సాగిస్తున్నప్పుడు తన తోటివారితో ఎలా మెలగాలనే చక్కటి విషయాన్ని వివరిస్తుంది. తిక్కన ఈ వృత్తాంతాలన్నింటిని సూక్తిసుధగా, నీతి ముక్తాహరంగా, రాజధర్మ ప్రతిపాద్యంగా, జంతువుల కథను మానవులకు వివేకోదయంగా రచించి, "శిల్పంపు తోట" అని తన బిరుదునిం సార్థకం చేసుకొన్నాడు.

నేడు ఉమ్మడి కుటుంబాలు లేకపోవడం, తల్లిదండ్రులు ఇరువురు ఉద్యోగాలు చేయడంతో తీరిక లేకపోవటం, పాఠశాలలు, కళాశాలల్లో ఇతిహాసాలు, పురాణాలలోని మానవతా విలువలకు సంబంధించిన కథలను విరివిగా చెప్పకపోవడం, తల్లిదండ్రులు డబ్బులిస్తున్నారు, కానీ విలువల్ని సరియైన రీతిలో చెప్పలేకపోవడం వల్ల పిల్లలు విద్యనార్జించుటలో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో ముందంజలో వున్నా, విలువల్ని పెంపొందించుకోవటంలో వెనుకంజలో ఉన్నారు. డిగ్రీస్థాయిలో మానవతావిలువల్ని ప్రత్యేక పాఠ్యాంశంగా పెట్టారంటే మన సంస్కృతి, నాగరికత, నైతిక మానవత విలువల్లో మార్పులొస్తున్నాయని మనకు ప్రస్పుటంగా అర్థమవుతుంది. మనిషికి డబ్బు, చదువు ఒక్కటే కాదు విలువలతో కూడిన వ్యక్తిత్వం కూడా ప్రధానమైనది.

ఈ ప్రపంచంలో న్యాయానికే కాదు, అన్యాయానికి కూడా స్థానముంది. కృతజ్ఞతకే కాదు, కృతఘ్నతకి తావుంది. వీటితో సంబంధం లేకుండానే ప్రతి ప్రాణీ తన సహజ గుణానుసారం నడుచుకుంటుంది. మరి మనిషి సహజగుణం - ఎవరికీ అన్యాయం చేయకపోవటం, చేసిన మేలు మరువకపోవటం, అడక్కుండానే ఎదుటి వ్యక్తికి సహాయం చేయటం. ఈ గుణాలే మనిషిని దైవత్వానికి చేరువచేస్తాయి. మానవతా విలువలకు ప్రతిబింబం మహాభారతం.

ఆధార గ్రంథాలు :

1. భారతంలో నీతి కథలు - ఉషశ్రీ
2. మహాభారత చరిత్రము - పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి
3. మహాభారతం - రెంటాల గోపాలకృష్ణ
4. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం - ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానము, తిరుపతి.

❖❖❖

ఆంధ్రమహాభారతం- రాజనీతి

డాక్టర్ కోదండ లక్ష్మణ

ప్రస్తావన :

మహాభారతం శాంతి పర్వంలో రాజనీతి గురించిన వివరణ ఉంది. మహాభారతం జాతీయేతిహాసం. వ్యాసుడు భారతాన్ని ఇతిహాసంగా తీర్చిదిద్దగా తెలుగు కవులైన కవిత్రయంవారు కాంతాసమ్మితమైన కావ్యంగా రూపొందించారు. ఇందు వైదిక మార్గ వర్తనానికి అనుగుణమైన విషయాలేకాక, సాంఘిక, నైతిక, రాజకీయాది అంశాలు మహాభారతంలో విపులంగా ప్రస్తావించబడ్డాయి. రాజ్యవ్యవస్థను అధ్యయనం చేసేది రాజనీతి శాస్త్రం. రాజ్య ఆవిర్భావం, రాజ్యం, స్వభావం, రాజు-రాజధర్మాలు, స్వరూప స్వభావాలు రాజ్యపాలనా యంత్రాంగం - పరిపాలనావ్యవస్థ ఆచరణ, యుద్ధ తంత్రం - యుద్ధ సాధనాలు, వ్యూహరచనా విధానం, సమరకళ. అంతర్ రాజ్య సంబంధాలు మొదలైన విషయాలు ఉంటాయి. రాజ్యం సప్తాంగాలతో వర్ధిల్లాలని ఆంధ్రమహాభారతం వెల్లడించింది. 1. రాజు 2. అమాత్యులు 3. రాష్ట్రం 4.కోశం 5.సైన్యం 6. మిత్రుడు 7.దుర్గం. ఇవి వాటి విధులను ఏకకాలంలో నిర్వహిస్తూ, రాజ్యరక్షణకు, నిర్వహణకు ఈ అంశాలన్నీ తోడ్పడతాయని తిక్కన విపులంగా ఆంధ్ర మహాభారతం శాంతిపర్వంలో తెలియపరిచారు.

ప్రస్తుత భారతంలో కన్పించే రాజ్యపాలనా యంత్రాంగాన్ని గురించి, పరిపాలనా వ్యవస్థను గురించి స్థూలంగా విశ్లేషించడమే ఈ వ్యాసం ఉద్దేశం..

1. రాజు :

రాజనీతి నిర్ణయాలను క్రమబద్ధంగా అమలుపరచటంలో రాజుకు చురుగ్గా తోడ్పడేటువంటి అంశాలనే రాజ్యపాలనా యంత్రాంగం అనవచ్చు. మహాభారతంలోని రాజసభకు న్యాయశాస్త్రపరమైన ప్రాముఖ్యం ఉంది. ఈ సభకు రాజే స్వయంగా అధ్యక్షత వహించేవాడు. మంత్రులు ముఖ్యమైన ఆంతరంగికులు, పురోహితులు, సామంతరాజులు ఇందులో పాల్గొనేవారు. సభ నిర్వహించే వ్యవహారాలన్నీ ప్రజల సమక్షంలో చర్చింపబడేవి. విరాటుడు రాజసభలో పాల్గొని రాజవిధులను నిర్వహించేవాడు. రాజసభకోసం రాజధాని నగరంలోనే ప్రత్యేకంగా ఒక సమావేశ మందిరం ఉండేది. అందులో భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, కృపుడు, కర్ణుడు, శకుని, దుర్యోధనుని సోదరులు, సామంతరాజులు మొదలైనవారు ప్రధాన సభ్యులు. విరాటుని సభలో పాండవులు కృష్ణాదులతో కలిసి భావకార్య విధానాన్ని ఆలోచిస్తారు. కౌరవ సభలో సంజయుడు ధృతరాష్ట్రునితో పాండవుల అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. అదేవిధంగా పాండవరాయబారియైన కృష్ణుడు కౌరవ సభలో పాండవుల సందేశాన్ని ధృతరాష్ట్రునితో విన్నవిస్తాడు. ఆ సందర్భంలో కృష్ణుడు కౌరవ సభాప్రవేశం చేసినప్పుడు ధృతరాష్ట్రుడు కృష్ణుని గౌరవార్థం ప్రత్యేకంగా అర్ఘ్యపాద్య మధుపర్కాద్యుపచారాలు చేశాడు.

రాజ్యంలో శాంతికి యుద్ధానికి సంబంధించిన సమస్యలను చర్చించడానికి రాజసభను సమావేశ పరిచినట్లు పైసందర్భాలను బట్టి తెలుస్తున్నది. ఈ సభాకార్యకలాపాల్లో క్షత్రియులకే ప్రాధాన్యం ఉండేది. రాజసభలోని సభ్యులంతా సమిష్టిగా సమస్యను ప్రవేశపెడతారు. దీనిని బట్టి సభ్యులందరికీ సంపూర్ణమైన వాక్ స్వాతంత్ర్యం ఉన్నట్లు తెలుస్తుంది. రాజసభల నిర్ణయాలకు రాజు విధిగా కట్టుబడి ఉండవలసిన అవసరంలేదని మహాభారతంలో కొన్ని ఘట్టాలను పరిశీలించినపుడు తెలుస్తుంది. రాజసభకు పరిపాలనాధికారాలు లేవు.

యుధిష్ఠురుడు ధృతరాష్ట్రుని దర్శనానికి వెళ్లేటప్పుడు పురరక్షణకు యుయుత్సుణ్ణి, కృపాచార్యుణ్ణి, ధౌమ్యుణి నియోగిస్తాడు. మహాభారత యుద్ధప్రారంభంలో తన అభిప్రాయాలకు వ్యతిరేకంగా జరిగిన చర్చలకు దుర్యోధనుడు ప్రభావితుడు కాలేదు. ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో రాజసభలను సమావేశ పరచకపోవడంవల్ల రాజు నిర్ణయమే అంతిమ శాసనమని తెలుతుంది. కాబట్టి రాజకీయమైన అధికారంగానీ, రాజును ప్రభావితుణ్ణి చేసేశక్తి గానీ రాజసభకు లేదు. అది ఒక సలహాసంఘం మాత్రమే. విధాన నిర్ణయాన్ని చేయాల్సిన సమయంలో వివేకవంతులైన వృద్ధులను సంప్రదించాలని భారతం తెలియజేస్తుంది.

2. అమాత్యులు :

ఆంధ్రమహాభారతంలో మంత్రులుగాక మంత్రిపరిషత్తు అనే పేరుతో మరొక ప్రత్యేక సభ ఉండేది. అది ఆధునిక అర్థంలో మనం వ్యవహరిస్తున్న మంత్రిమండలి వంటిది కాదు. అది మౌలికంగా రాజుకు సలహామండలి మాత్రమే. విధానాలను అమలుపరిచే సమయంలోనూ, వ్యూహాలను వాని పర్యవసానాలను సూచించే సమయంలోనూ ఈ మంత్రిపరిషత్తు రాజుకు సలహానిస్తుంది, యుద్ధసమయంలో ఏ రోజుకు ఆరోజు కౌరవపాండవులు మరునాటి కార్యక్రమాల్ని నిర్ణయించుకొనే సందర్భాల్లో ప్రత్యేకంగా మంత్రుల సలహా సంప్రదింపులు జరిగేవి. రాజబంధువులే ముఖ్యమైన మంత్రులుగా భారతంలో కనిపిస్తారు. ధర్మరాజు పట్టాభిషేకానంతరం భీముణ్ణి యువరాజుగా ప్రకటించాడు. సంధి, విగ్రహాది, ఆదాయ, వ్యయాలను తెల్పడానికి సంజయుణ్ణి, సేనలకు సంబంధించిన విషయాన్ని కనుక్కోటానికి, భృత్యులకు జీతాలు ఇవ్వడానికి నకులుణ్ణి, దర్పితులను మర్దించడానికీ, పరచక్రాన్ని ఆక్రమించడానికి అర్జునుణ్ణి, బ్రాహ్మణ కార్యాలకు, శ్రోతస్మార్తకృత్య సమనుష్ఠానానికి ధౌమ్యుణి, ధర్మరాజును అనుసరిస్తూ అతని సమీపంలో అంగరక్షకుడుగా ఉండటానికి సహదేవుణ్ణి నియమించి వారికి తగిన అధికారాలను ఇచ్చాడు. పురజనుల కార్యాలను, యోగక్షేమాలను విచారించి, ధర్మరాజుకు చెప్పడానికి యుయుత్సుణ్ణి, విదుర సంజయులను నియమించాడు. కర్ణుడు కౌరవులకు అమాత్యుడుగా ఉండటాన్ని బట్టి సామంతరాజులు కూడా మంత్రులుగా వ్యవహరించే ఆచారం ఉందని నిర్ధారించవచ్చు. రాజ్యాంగ రథానికి రథి మహారాజుకాగా సారథి మంత్రి అని చెప్పబడింది. మంత్రానికి అత్యంత ప్రధానమైన లక్షణం గోప్యత. మంత్రగోపనం వల్ల అఖిలకర్మలు ఫలావ్యాప్తిని పొందుతాయి. ఆశ్రమవాస పర్వంలో ధృతరాష్ట్రుడు మంత్రి యొక్క గోపనశక్తి గురించి ఉద్ఘాటిస్తాడు. మంత్రాంగాన్ని వెల్లడి చేయడం రాజ్యానికి కీడు చేస్తుంది. కనుక గోపనశక్తి గలవారే మంత్రులుగా పనికి వస్తారని చెప్పబడింది.

మంత్రికి ఇతర లక్షణాలు కూడా అనేకం ఉండాలని భారతం పేర్కొంటున్నది. అసమర్థులు, అయోగ్యులు అయిన మంత్రులవల్ల రాజ్యానికి దుష్ఫలితాలు కలుగుతాయి. వారు రాజ్యంలో రాజు అధికారాన్ని బలహీనపరుస్తారు. కామ, క్రోధాలవల్ల గానీ, భయాలవల్లగానీ, ప్రయత్నం వదలిపెట్టకుండా నేర్పుతో నడుచుకొనే వాణ్ణి నియమిస్తే రాజుకు అధిక వైభవం కలుగుతుందని అప్పటి రాజనీతివేత్తలు భావించేవారు. మంత్రుల మధ్య ఐకమత్యం ఉండాలని కూడా వారు నొక్కి చెప్పారు.

రాజు తన మంత్రుల పట్ల వ్యవహరించవలసిన విధానాన్ని గురించి సైతం మహాభారతం నిర్దేశించింది. అతడు మంత్రులను అసలే నమ్మకపోవడం మృత్యువులాంటిది. కాకుంటే పూర్తిగా నమ్మడం అపమృత్యువు లాంటిది. అందుచేత నమ్మీ నమ్మకుండా వ్యవహరించాలి. రాజుమంత్రులను ప్రత్యక్షంగా తన అదుపులోనే

ఉంచుకొని స్వయంగా పర్యవేక్షించాలి. ఒక్కొక్క శాఖపై అధికారిగా ఒక్క మంత్రినే నియోగించాలి. ధర్మరాజు ఈ సూత్రాన్ని ఖచ్చితంగా పాటించాడు. మంత్రులకు నిర్ణయాధికారాలు లేకపోయినప్పటికీ రాజులు వారిని సంప్రదించే ఆచారం ఉంది! యుధిష్ఠురుడు, ధృతరాష్ట్రుడు, నహుషుడు, విదురుడు, మంత్రులతో సమాలోచన చేసేవారు. కౌరవులు రణ నిశ్చయాలను, మంత్రిమండలి సలహాలను పెడచెవిని పెట్టారు.

మహాభారతకాలంలో మంత్రులకు సంపూర్ణమయిన వాక్ స్వాతంత్ర్యం ఉండేది. అందువల్లే ధృతరాష్ట్రుని చెడ్డబుద్ధిని విదురుడు విమర్శించేవాడు. రాజు యొక్క పరోక్షంలో మంత్రులు రాజ్య నిర్వహణపై సర్వాధికారాలు కలిగి ఉండేవారు. యవనాశ్వుడనే మహారాజుకు చాలా కాలం సంతానం లేకపోవడం చేత విచారగ్రస్తుడై మంత్రుల చేతుల్లో రాజ్యభారాన్ని ఉంచి వెళ్ళాడని తెలుస్తుంది. మహారాజు ఇచ్చిన ఆజ్ఞలతో సమానంగా మహారాణి పట్టమహిషి ఆజ్ఞను సైతం మంత్రులు శిరసావహించారు. ఈ ప్రకారంగా అనాడు మంత్రులు రాజుకు సలహాదారులే అయినప్పటికీ రాజ్యానికి మూలస్తంభాలుగా గుర్తింపబడ్డారని తెలుస్తుంది.

3. గూఢచారుల పాత్ర :

రాజ్యాధికారానికి అవసరమైన వాటిని వరుసగా పేర్కొంటూ రాజ్యం యొక్క బలానికి చారులు మూలాధారమని, వారిశక్తి సైనికశక్తికి, సాంఘికశక్తికి సమానమైనదని అంటుంది భారతం. రాజ్యానికి సంబంధించిన అంతరంగ, బహిరంగ పరిస్థితులు రాజుకు గూఢచారులవల్ల తెలుస్తాయి. అందువల్లనే రాజులను చారచక్షులని సర్వాన్ని చూస్తారని భారతం చెబుతుంది. వారి నివేదికలన అనుసరించి రాజు ప్రజలనాడి తెలుసుకొనేవాడు. రాజ్యరక్షణ చారులపై ఆధారపడి ఉంది. వారి చర్య రాజ్యంలో సక్రమ రాజ్యాధికార నిర్వహణకు తోడ్పడుతుంది.

1. కీచకవధను గురించి చారులు రాజుకు నివేదించగా పాండవులు విరాట రాజ్యంలో ఉంటారని ఊహించి ఉత్తర, దక్షిణ గోగ్రహణం జరిపిస్తాడు.

2. ఉపప్లావ్యనగరంలో పాండవులు తమ మిత్రరాజులతో చేసిన నిర్ణయాలను కార్యకలాపాలను దుర్యోధనునికి చారులు తెలియజేశారు.

3. పాండవ దూతగా కృష్ణుడు హస్తినాపురానికి ప్రయాణమైనట్లు చారుల ద్వారా ధృతరాష్ట్రుడు తెలుసుకున్నాడు.

4. భీష్ముడు అంబవృత్తాంతాన్ని తెలుసుకోవడానికి చారులను నియమించినట్లు తెలుస్తున్నది.

5. కురుక్షేత్రయుద్ధ స్కంధావారాలలో కౌరవ పాండవచారులు ఉన్నారు. కౌరవ పక్షంలోని వారు యుద్ధానికి సంబంధించి చేసికొన్న నిర్ణయాలను చారులద్వారా ధర్మరాజు తెలుసుకుంటాడు.

6. ద్రోణుడు దుర్యోధనునికి ధర్మరాజును పట్టి ఇస్తానని వరమిచ్చినట్లు కౌంతేయాగ్రజుడు తన చారులద్వారా వింటాడు.

7. అర్జునుడు సైంధవుని చంపుతానన్న ప్రతిజ్ఞను సైంధవుడు చారుల ద్వారా తెలుసుకుంటాడు.

8. యుద్ధరంగంలో దుర్యోధనుణ్ణి వెతకటంకోసం పాండవులు చారులను నలుమూలలకు పంపారు.

ఈ ప్రకారంగా భారతంలో గూఢచారులు సమస్త ప్రదేశాల్లో సంచారం చేసి తమ కర్తవ్యాన్ని నెరవేర్చినట్లు స్పష్టమవుతున్నది.

4. చతుర్విధ ఉపాయాలు :

రాజుకు ఉపాయాలు ప్రధానమైన సహాయకారులు. కుశాగ్రబుద్ధియైన రాజు తన రక్షణకు రాజ్య విస్తృతిని పెంచడానికి ఉపాయాన్ని ఉపయోగిస్తాడు. సామ దాన భేద దండోపాయాలనే గాక మాయ ఉపేక్ష నైపుణ్యం ద్వారా కార్యాన్ని సాధించవచ్చని భారతం ద్వారా తెలుస్తున్నది. విధిగా రాజులు తమ లక్ష్యాన్ని సాధించడానికి సామ దాన భేదోపాయాలను ఉపయోగించాలని భారతం వెల్లడించింది.

5. పరిపాలనా వ్యవస్థ - ఆదరణ :

సమర్థమైన పరిపాలనా వ్యవస్థ భారత రాజ్యంలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. సమర్థులైన అధికారులు నియామకం వల్లనే రాజుకు సార్వభౌమాధికారం లభిస్తుందని మహాభారతం చెప్తోంది. భారతంలో అనేక విధాలైన అధికారుల గురించి పేర్కొనబడింది. వీరిలో ప్రధానంగా నగర రక్షకులు, దుర్గపాలురు, నేరస్తులను శిక్షించే అధికారులు మొదలైన వారు ఉన్నారు. వీరుకాక ప్రధాన పురోహిత్ఋణ్ణి, వైద్యుల్ని, జ్యోతిష్కుల్ని సైతం రాజోద్యోగులుగా పరిగణించేవారు. ద్వారపాలకులు, భటులు, చాటింపులు చేసే జంఘాలురు మొదలైనవారు రాజాస్థానం కింద పనిచేసే చిన్న ఉద్యోగులు, కౌరవులతోను, త్రిగర్తులతోను, తన సైన్యాలు పోరాడి సాధించిన విజయం గురించి విరాటమహారాజు జంఘాలురు ద్వారా రాజధానిలో చాటింపు వేయించినట్లు తెలుస్తున్నది.

6. అధికారుల గుణాలు :

తగిన అర్హతలు ఉన్న అధికారులనే రాజు నియమించాలని చెప్పబడింది. లంచానికి లొంగనివారు, ప్రయోగపూర్వకమైన శిక్షణ గలవారు, ధైర్యవంతులు, స్వామి భక్తిపరాయణులు, లోక జ్ఞానం సంపాదించిన వారు, కర్తవ్య దీక్షాపరులు అయినవారే అధికారులుగా ఉండటానికి యోగ్యులని భారతం వివిధ సందర్భాలలో తెలియజేసింది.

7. ధర్మాలు-సేవలు :

రాజాస్థానంలో ఉద్యోగం సంపాదించి వారి కర్తవ్యాల గురించి విరాటపర్వంలో ధౌమ్యుడు పాండవులకు విపులంగా వివరిస్తాడు. అనుమతి పొందకుండా రాజదర్శనానికి వెళ్లకూడదు. రాజ ఉద్యోగి సముచిత వేషాన్ని ధరించాలి. రాజభవనం కంటే అందంగా ఇల్లుకట్టుకోకూడదు. రాజెదుట ధాటిగా మాట్లాడకూడదు. రాజుకోరుకున్నవాటిని సేవకుడు కోరకూడదు. రాజు మాట్లాడుతుండగా అడ్డం రాకూడదు. రాజు ఇతరులకు అప్పగించిన పనిలో తాము తల దూర్చకూడదు. అలాగని మరింత వెనుక నిలబడకూడదు. పార్శ్వభాగంలో సముచిత స్థానంలో నిలబడాలి. రాజు సమక్షంలో ఆవులింతలు మొదలైన శరీరధర్మాలు ప్రదర్శించకూడదు. రాజదృష్టి తన మీదపడే విధంగా అనుకూలంగా ప్రవర్తించాలి. కోటలోని రహస్యాన్ని బయట వెల్లడించకూడదు. అంతఃపురంలోని స్త్రీజనానికి ఎల్లవేళలా దూరంగా ఉండాలి. రాజాదరానికి ఉప్పొంగడం గాని, రాజాగ్రహానికి విచారించడంగాని పనికిరాదు.రాజధనాన్ని సర్వాన్ని చూసినట్లు చూడాలి. లేకపోతే ప్రాణాలకే ముప్పువాటిల్లుతుంది.

8. ఉద్యోగులపట్ల రాజధర్మం :

రాజు తన భృత్యులకు తగిన జీతాలు ఏర్పాటు చేయాలి. అప్పుడే వారిలో భయభక్తులు ఉంటాయి. ఒక ముద్దలోటైనా సేవకులు రాజును చెడ్డగా చూస్తారు. సకాలంలో జీతాలు అందని పక్షంలో రాజ్యంలో లంచగొండితనం పెరిగిపోతుంది. రాజ కార్యనిర్వహణలో అద్భుతమైన ప్రతిభని, త్యాగాన్ని ప్రదర్శించిన ఉద్యోగుల్ని

సముచితంగా సన్మానించడం రాజు మరువకూడదు. తప్పు చేయందే ఎవరినీ తొలగించరాదు. తన ఉద్యోగులతో రాజు సన్నిహితంగా మెలగరాదు. అలా మెలగితే కొన్ని దుష్పరిణామాలను ఎదుర్కొనవలసి వస్తుందని శాంతి పర్వంలో క్షేమదర్శి వృత్తాంతం ద్వారా చెప్పబడింది.

రాజ్యంలో రాజపురోహితునికి చెప్పుకోదగ్గ పలుకుబడి ఉండేది. రాజుకు మంత్రాంగంలో సహాయపడే వాళ్లలో మంత్రి తరువాత పురోహితుడు ముఖ్యుడు. వేద, ఇతిహాస ధర్మశాస్త్రాల్లో కుశలుడైన తపస్వి పురోహితుడుగా ఉండదగినవాడు, దేవదానవులకు బృహస్పతి, శుక్రుడు, వంశపారంపర్యంగా వస్తున్న పురోహితులు ముఖ్యులు. పుట్టుకతో గర్వంలేకుండా అతనికి సేవచేయాలి. పురోహితుని అండదండలు లేని రాజు దుష్టశక్తుల పీడనకులోనై నశిస్తాడని ఆ కాలపు రాజనీతివేత్తలు భావించేవారు.

ఇంతటి ప్రాముఖ్యం కలిగిన రాజపురోహితుని లక్షణాలు ఎటువంటి వాటిపై ఉండాలనేది కూడా భారతం చర్చించింది. రాజపురోహితుడు వేదవేదాంగాల్లో నిష్ణాతుడై ఉండటం తప్పనిసరి. రాజనీతి శాస్త్రం కూడా అభ్యసించి ఉండాలి. కేవలం పాండిత్యం కాకుండా రాజభక్తి, ఆత్మనిగ్రహం, సత్యవాక్కు, శాంతం, వినయం, వాక్చాతుర్యం మొదలైన లక్షణాలు కలిగి ఉండాలి.

9. కోశాగారం :

సప్తాంగాలలో కోశాగారం ఒకటి. అదే రాజ్యశక్తికి మూలస్తంభం కాబట్టి, రాజు కోశాగారాన్ని అభివృద్ధి చేయాలని భారతం పేర్కొంటుంది. కోశాగారాన్ని రాజే స్వయంగా పర్యవేక్షించాలని చెప్పబడింది. కోశాగారంలో ఎంత మిగులు ఆదాయం ఉందో, ఎంత లోటు ఉందో రాజు తెలుసుకోవాలి. దాని నిర్వహణకై ఒక సమర్థుడైన మంత్రిని కూడా నియమించాలి. అతనికి బుద్ధిశాలుడు, నిజాయితీ పరులైన అధికారుల సహాయం ఉండాలి. ఆదాయంలో ఆరవవంతు పన్నుగా తీసుకోవాలని శాంతిపర్వంలో నిర్దేశించబడింది. కరవుకాటకాలప్పుడు పన్నుల్ని పూర్తిగా రద్దు చేసి ప్రజలను ఆదుకోవాలని కూడా రాజనీతివేత్తలు భావించేవారు. అరణ్యాలలో నివసించే బ్రాహ్మణుల నుండి మాత్రం పన్నులు వసూలు చేయరాదని భారతం వెల్లడించింది.

పన్నులకోసం అధర్మాన్ని కొడిగట్టరాదని హెచ్చరించడం జరిగింది. పన్ను పెంచే ఉద్దేశాన్ని ముందుగా ప్రజలకు తెలియజేసి వారి అనుమతిని పొందాలి. ఎందుకు పెంచవలసి వచ్చిందో ప్రజలకు తెలియజేసి వారి అనుమతిని పొందాలి. ప్రజలకు నచ్చచెప్పడం అత్యవసరం. పన్నులభారం ప్రజలకు తోచని విధంగా క్రమక్రమంగా కొంచెంగా పన్నులు పెంచాలి. రాబడి వచ్చే రంగాలను విస్మరించకుండా వాటి అభివృద్ధికోసం రాజు కృషి చేయాలి. రాజు మృదువుగా సంభాషిస్తూ పూలనుండి భ్రమరం తేనెను గ్రోలినట్లు, ప్రజలనుండి పన్నులు వసూలు చేయాలి. ప్రజల సంపద పెరిగిన కొద్దీ రాజు కోశాగారం కూడా అభివృద్ధి చెందాలి. దండించదగిన వారి సంపదలను రాజు స్వాధీనం చేసుకోవాలి.

కోశాగారాన్ని అభివృద్ధి చేయటానికి ఇతర రాజులనుండి కప్పాలు రాబడతానని అర్జునుడు అంటాడు. అలాగే విరాటరాజు యొక్క గోవుల్ని, ఆభరణాల్ని కొల్లగొట్టడానికి అతని రాజ్యంపై కౌరవులు దండయాత్ర చేశారు. ఓడిపోయిన రాజులనుండి భీముడు అపారమైన ధనరాశులను సేకరించాడు. ఇవేగాక రాజులు పూర్వం సేకరించిన ధనంలో కొంత భాగాన్ని రహస్య స్థలాలలో కొన్ని తరాలపాటు దాచి పెట్టే ఆచారం ఉంది. అటువంటి రహస్య నిధులు ఆపద సమయాలలో ఉపయోగపడతాయన్నది రాజు ఆకాంక్ష.

మరుత్తుడు గొప్ప యజ్ఞం చేసి దానమిచ్చిన అనంతమైన బంగారాన్ని బ్రాహ్మణుల తమ ఇళ్లలో ఉంచుకొని తక్కినదంతా ఒక నిధిగా నిక్షేపించారు. ఆ సంపదనంతా ధర్మరాజు స్వాధీన పరచుకొని అశ్వమేథయాగానికై వెచ్చించారు. అలాగే దుర్యోధనుని మరణానంతరం అతడు దాచిన సంపదని కూడా పాండవుల వశం చేసుకున్నారు. అంతేగాక మరికొన్ని సూత్రాల్ని కూడా ద్రవ్యవినియోగ విషయాలలో ఆనాటి రాజులు పాటించేవారు. రాజ్యం యొక్క సంవత్సర ఆదాయాన్ని మించిన వ్యయం చేయరాదని భావించేవారు. దీనికి సంబంధించి ఒక ఉపాఖ్యానం కనబడుతుంది. అగస్త్యమహర్షి తన భార్యయైన లోపాముద్ర కోరిక మీద ధనం సేకరించాలని బయలుదేరుతాడు. ధనం కావాలని ముగ్గురు రాజుల్ని వరుసగా ఆశ్రయిస్తాడు. మా రాజ్యాల్లో ఆదాయ వ్యయాలు సమానంగా ఉన్నాయని చెప్పేవారు అగస్త్యుని కోరిక తీర్చలేక పోతారు. అందువల్ల రాజు తన ఆదాయంలో కొంత భాగాన్ని నిల్వచేయాలని కూడా రాజనీతివేత్తలు చెప్పేవారు. అంతిమంగా ప్రజల లౌకిక జీవనాన్ని మెరుగుపరచడమే భారత రాజ్యం యొక్క ద్రవ్యపాలనా విధానాలకు లక్ష్యంగా ఉండేది.

ఈ విధంగా రాబట్టిన పన్నులతో రాజభోగాలను అనుభవించడానికి పూనుకోకుండా సైన్యపోషణ, విద్యావికాసం, వ్యవసాయాభివృద్ధితో కూడిన రాజ్య కార్యనిర్వహణ చేయాలని భీష్ముడు ధర్మరాజుకు ఉపదేశిస్తాడు.

ఉపయుక్త గ్రంథాలు :

1. నన్నయ - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, సభాపర్వము, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2006.
2. తిక్కన - కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము, విరాటపర్వము, ఉద్యోగపర్వము, శాంతిపర్వము - మొదటి భాగము, రెండవ భాగము, అశ్వమేధ, ఆశ్రమవాస,మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములు, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి - 2006.

❖❖❖

Life Lessons from Mahabharatam

Dr.S.V.Ramesh Kumar,Lecturer in English, Govt.Degree College, Pakala, Tirupati District.

Abstract

Mahabharatam is one of the greatest Hindu epics and it is an important work in Hindu mythology. At surface it appears to be a story of rivalry between Pandvas and Kouravas. It also appears to be a story of the great war of Kurukshetra. But this Epic brings out the greatest treasures of Life lessons.

Mahabharatam has relevance to the human life even during this high tech age. It offers solutions to many of our life problems and the better ways of leading a happy life. The epic narrative of Mahabharatam continues to show profuse impact in every form of art and culture. It is still respected not only because of its interesting plot, poetic grandeur but due to deeply philosophical thoughts that were maintained throughout the epic. They teach us about the art of living.

The objective of this paper is to discuss a few life lessons from Mahabharatam which holds true even in today's life and should be incorporated in our modern lives.

Key words: *Mahabharatham- Epic- Phiosophy- Life lessons- Yudhistira- Kurukshetra-Divine- War fare- Narrartive- Identity crisis.*

***

Mahabharatam is one of the greatest Hindu epics and it is an important work in Hindu mythology. At surface it appears to be a story of rivalry between Pandvas and Kouravas. It also appears to be a story of the great war of Kurukshetra. But this Epic brings out the greatest treasures of Life lessons.

Mahabharatam has relevance to the human life even during this high tech age. It offers solutions to many of our life problems and the better ways of leading a happy life. The epic narrative of Mahabharatam continues to show profuse impact in every form of art and culture. It is still respected not only because of its interesting plot, poetic grandeur but due to deeply philosophical thoughts that were maintained throughout the epic. They teach us about the art of living.

Here are some of the life lessons from Mahabharatam which holds true even in today's life and should be incorporated in our modern lives.

1. No revengeful instinct and a revengeful instinct leads to one's doom:

Mahabharata may revolve around the war of rule and duty, but the major reason for the destruction was revenge. The main reason for the war between Pandavas and Kauravas was revenge . The Kauravas lost everything because of their blinded desire to ruin the Pandavas. This revenge did not spare even the children, Draupadi's five sons and Abhimanyu.. We should never let a revengeful attitude grow in our life because it leads to destruction.

2. Always stand for the right and fight for the right:

During Kurukshetra war, at the beginning Arjuna was hesitant to fight against his brothers, uncles, and gurus. But Krishna taught him of his duties and dharma. Krishna told him his duties of dharma, even if he has to fight with his family and friends. We should always stand for the Dharma.

3. The Eternal bond of Friendship:

Two iconic friendships from mahabharatham are Arjuna-Krishna and Karna-Duryodhana. These friendships teach us how friendship helps us in difficult times. The friendship between Krishna and Arjuna is something all of us admire. It is perhaps because of Krishna's unconditional support and motivation to Pandavas, in particular to Arjuna. The friendship between Karna and Duryodhan, on the other hand, is also inspiring. Even after knowing the fact that Pandavas are his brothers, Karna still stood up against Pandavas for his valuable friendship with Duryodhana..

4. Half knowledge can be dangerous :

Abhimanyu knew how to enter the Chkaravyuh, but he did not know the way out. During Kurukshetra war, Abhimanya entered Padmavyuha successfully, but could not come out of it. This teaches us how half-knowledge can have an adverse impact on our life. We should have full knowledge of what we are doing otherwise we may end up with failures just like Abhimanyu.

5.Never give up:

Karna is the best example in Mahabharata for never give up attitude. He dealt with discrimination and disgrace entire his life. He was equivalent to Arjuna in archery skills but never got equal respect and platform to show his skills, because he was called a suta-putra. But nothing distracted him from reaching his goals and he became a great archer.

6. Being a woman does not make you a lesser individual:

Draupadi was a strong and powerful woman. Draupadi was manoeuvred into taking five husbands, she was humiliated by the Kauravas for the fault of her own husband. She was insulted by Kauravas in a large gathering of people. Draupadi's anger and revenge led to the war and downfall of the Kauravas. We should be strong like Draupadi in facing the difficult situations in life.

7. Learning throughout life is the best gift you can give yourself:

Arjun is a symbol for an obedient and a sincere student. He was hardworking enough to learn the best of military science from Drona. He not only learned the best of military science from Drona, but he had also learnt about divine weapons from Indra. He had learnt about Pashupatastra from Mahadev as well. He treated Yudhishter and Krishna as his mentors and continued learning whatever they had to offer. He was also a lifelong disciple of Yudhisthira and Krishna, learning from them the basic tenets of how to live your life. Keeping an open mind is an absolute essential thing required for a student.

8. Accept the Change:

Krishna says change is the law of nature and you should accept the change. He says the only permanent thing in this universe is change. At first, Pandavas were lords of palaces then they lost everything and then wandered in forests hiding their identity. They accepted this inevitable change and prepared themselves for the war.

9. Never disregard your blessings:

Shishupala was Krishna's cousin and his mother took the promise from Krishna that he will forgive the first hundred mistakes of Shishupal. But Shishupal disregarded his blessing and kept on abusing Krishna. Finally he crossed his limit of hundred sins and died. If he had valued his blessing he would have been saved. We should always value our blessings.

10. Don't be swayed by greed:

Yudhistira is suffering with greed and hence he took part in the dice game. He lost everything he possessed—from his kingdom to his wealth. He gambled even his wife Draupadi. From this we should learn not to be swayed by greed.

11. We cannot give up on life despite all hurdles:

Karna is a lifelong fighter. Throughout his life he fought for respect and friendship. Right from his birth, he battled discrimination and disgrace at every stage of his life. He almost became a puppet in the hands of his fate. But nothing could ever stop him from pursuing his goal. His devotion towards his mother knew no boundsand hence he gave up his kavacha kundal.

12. Bad company can ruin your life beyond imagination:

We all hate Shakuni, because of his wicked nature. He literally destroyed everything that the Kauravas owned, and he influenced them to be negative. Hence we should never make friendship with bad people..

13. Try to be the best in your job:

Yudhisthira learned different aspects of law and administration from Vidura. This helped him to rule the kingdom later in the best way. We should always try to be the best in our job.

14. Plan well and execute well:

The Kurukshetra is the earliest example from History for a political coalition. Krishna played a major role in forming a Political coalition in favour of Pandavas. He was enough to recognize the enemies of Hastinapura and was successful in bringing all of them on their side during the war. He brought people from different corners of the country to one fold and could achieve unity among them.

We should learn how to bring the available resources to one line and use them effectively to achieve our targets.

15. Smaller sacrifices have to be made for achieving Bigger Targets:

When Ghatotkacha attacked the Kaurava army at night, Karna was forced to use his Ekaghni shakti, which he had originally saved for Arjuna. Ghatotkacha's sacrifice had to made in order to save Arjuna's life in the longer run. In our life to achieve big targets, we need to sacrifice smaller things.

References:

1. www.britannica.com/topic/Mahabharata

2.www.psychowellnesscenter.com/Blog/

3. https://www.wisdomlib.org/hinduism/book/the-mahabharata-mohan

❖❖❖

Plants Described In Sanskrit Mahabharata And Their Ayurvedic Medicinal Importance

Mohano Behara [1], Saivenkatesh Korlam [2]

[1] Department of Botany, Government Degree College, Pakala, Tirupati Dt., A.P.[2] Department of Botany, S V A Government College, Srikalahasti, Tirupati Dt., A.P.

Introduction

The ancient Indian epic, Mahabharata, attributed to the sage Vyasa, weaves a complex narrative of morality, duty, and warfare. Alongside the stories of valor, devotion, and betrayal are embedded references to medicinal plants and herbal practices that are now recognized as foundational to Ayurveda. These plants were frequently used to heal warriors, preserve health, and enhance longevity, showcasing a deep-rooted understanding of herbal medicine. The medicinal plants mentioned, either directly or symbolically, highlight a sophisticated knowledge of nature's curative potential.Here are some Sanskrit verses from the Mahabharata referencing the medicinal and spiritual properties of various plants and herbs. Each verse reflects the deep knowledge of plant-based healing embedded within this epic. These verses are explained with insights into how they relate to Ayurvedic principles.

The Power of Herbs for Healing Warriors can be understood by the following verse

"Yudhyantankurushardulampashyayudhyatam.

Astravyasanasampraptampashyayoddhrumruttam"

(Mahabharata, Bhishma Parva)

In the Kurukshetra battlefield, many fallen warriors were revived and treated with sacred herbs. This reflects the use of rejuvenating plants to heal wounds and restore strength to soldiers, a concept aligned with Rasayana (rejuvenation therapy) in Ayurveda.

"Ashvinikumarauchikitsayankurvate" (Mahabharata, Adi Parva, 3.126)

The divine Ashwini twins, regarded as deities of Ayurveda, possess healing powers and are said to use medicinal plants to revive wounded heroes. Their knowledge embodies the foundational Ayurvedic principle of using plant-based remedies for health and wellness.

Ayurvedic Plants in the Mahabharata:

The Mahabharata, one of India's greatest epics, not only tells a captivating story of war, duty, and morality but also serves as a repository of ancient wisdom, including insights into Ayurvedic medicine. Throughout the text, various plants with medicinal properties are highlighted, reflecting the deep connection between Ayurveda and the cultural heritage of the time. Key Ayurvedic plants such as *Ashwagandha* (*Withaniasomnifera*), known for its rejuvenating and strength-boosting qualities, and *Tulsi* (*Ocimum sanctum*), revered for its healing and protective properties, are frequently mentioned. *Neem* (*Azadirachta indica*), often referred to as a powerful purifier, and *Amla* (*Emblica officinalis*), praised for its immunity-boosting and anti-aging effects, also appear as crucial components in Ayurvedic practices. This exploration of the Mahabharata reveals how these plants were not only valued for their medicinal benefits but were also intertwined with the spiritual and daily lives of the characters, reflecting Ayurveda's holistic approach to health and wellbeing.

1. Sanjivani

The concept of the *Sanjivani* herb is legendary within Indian epics, including the *Mahabharata* and the *Ramayana*, where it symbolizes the miraculous capacity to restore life and vitality. Although the Mahabharata doesn't specifically name Sanjivani, it describes other powerful medicinal plants and healing methods. The concept is closely linked to Ayurveda's *Rasayana* therapy, which emphasizes rejuvenation, longevity, and vitality enhancement. This resonates with the qualities attributed to the Sanjivani herb and its supposed identification with *Selaginella bryopteris*, known for its drought resistance and rejuvenating properties, akin to reviving life even in harsh conditions.

While no exact verse in the *Mahabharata* references "Sanjivani," we do find examples of potent medicinal knowledge and life-rejuvenating practices:

a. *Bhishma Parva* contains verses where Ashwatthama and others seek medicinal herbs to revive their strength during the battle.

b. In the *Drona Parva* Ayurvedic healing practices are referenced when warriors use herbs to heal wounds and recover after battles.

2. Somarasa (Soma Plant or The Divine Elixir)

Soma, associated with rejuvenation and divine connection, appears in rituals granting vitality and spiritual insight. Linked with plants like *Ephedra* or *Sarcostemmaacidum*, known for stimulating effects, its rejuvenating qualities align with the Ayurvedic pursuit of spiritual and physical well-being.

"Somamindrasyavardhayantahsvadhayayagnyebabhuvuh." (Mahabharata, Adi Parva, 65.20)

This verse describes Soma as a divine elixir used in sacred rituals, enhancing both the physical and spiritual capabilities of the gods and warriors. It parallels the Vedic use of Soma as a powerful and invigorating herb, often associated with rejuvenation and immunity.

3. Arjuna (*Terminalia arjuna*)

Named after the hero Arjuna, the tree's bark is renowned for cardiovascular benefits and resilience, symbolizing life and strength. Used extensively as a cardiac tonic, Arjuna bark strengthens the heart, enhancing physical endurance, much like its namesake in the epic who symbolized strength and bravery.

"Arjunasyavrukshasyachhayanglabhante.**"** (Mahabharata, Udyoga Parva, 37.16)

The Arjuna tree, named after the mighty warrior Arjuna, symbolizes protection and healing. In Ayurveda, *Terminalia arjuna* is valued for its heart-strengthening properties, metaphorically reflecting Arjuna's strength and resilience on the battlefield.

4. Ashwattha (Sacred Fig, *Ficus religiosa*)

The sacred fig is revered as a tree of life, known in Ayurveda for its multipurpose medicinal applications. Treats ailments ranging from respiratory issues to infections, reflecting its revered status in both the text and Ayurvedic practice.

"Vatovardhayateshariranksshinantutamnashayet." (Mahabharata, Anushasana Parva, 80.45)

This verse highlights that the Vata tree nourishes the body and prevents decay. In Ayurveda, the leaves and latex of the *Ficus religiosa* are used to treat various ailments, including respiratory issues and digestive disorders. The tree is often considered sacred and represents longevity.

5. Tulsi (*Ocimum sanctum*)

Tulsi is frequently mentioned for its immunity-boosting and adaptogenic properties. It is used to enhance respiratory health, treat infections, and serve as a protective herb, aligning with its sacred status in the epic.

"Tulasyahpatraniharantipapam." (Mahabharata, Anushasana Parva)

Tulsi, or holy basil, is revered in the Mahabharata for its sanctity and medicinal power to purify. Its therapeutic uses align with Ayurvedic applications of *Ocimum sanctum* for immunity and respiratory health.

6. Haritaki (*Terminalia chebula*)

It is known as a powerful detoxifying agent, it symbolizes longevity and resilience. A key ingredient in Triphala, it is used to support digestion, detoxify the body, and is valued for its anti-inflammatory properties.

"Haritakisyatsarvarognashini." (Mahabharata, Udyoga Parva, 82.45)

Haritaki is described as a universal healer. In Ayurvedic practices, it's used as a detoxifier, promoting digestive health and rejuvenation. Its versatility makes it a staple in many herbal formulations.

7. Amalaki (*Phyllanthus emblica*)

Revered for its high vitamin C content, Amalaki is associated with rejuvenation and vitality.

Utilized in formulations like Chyawanprash, Amalaki enhances immunity, digestive health, and overall vitality.

8. Neem (*Azadirachta indica*)

Neem's antibacterial and blood-purifying properties are highlighted in its use to cleanse wounds and treat infections. It treats skin conditions, infections, and acts as a natural pesticide, showcasing its utility in both health and environmental care.

"Nimbasyapattranishantidayakani." (Mahabharata, Anushasana Parva, 15.20)

Neem leaves are considered peaceful and purifying. Neem is widely recognized in Ayurveda for its antibacterial, antifungal, and anti-inflammatory properties. It's commonly used to treat skin conditions and boost immune health.

9. Vacha (*Acorus calamus*)

Acorus calamus is known for its mental clarity benefits, Vacha is associated with cognitive enhancement and nerve strengthening.

It is commonly used to treat memory disorders, improve speech, and alleviate mental stress, reflecting Ayurvedic emphasis on mental health.

10. Brahmi *(Bacopa monnieri)*

Bacopa monnieri is revered for cognitive and memory-boosting properties, Brahmi supports mental clarity and longevity.

It is Prominent in Ayurvedic formulations to reduce stress and enhance memory, symbolizing wisdom and mental resilience.

11. Guduchi (*Tinospora cordifolia*)

*Tinospora cordifolia*is known as "Amrita" (nectar of immortality), Guduchi is associated with immunity and longevity.

It is a potent adaptogen, aiding in fever, diabetes, inflammation, and immune function, embodying vitality and resilience.

12. Khadira (*Acacia catechu*) - Black Catechu

"Khadhiranamksatiyatranasayathi" (Mahabharata, Anushasana Parva, 89.26)

